వేదాంతభేరి

జనవరి 2016 రూ. 10/-

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 49 జనవరి 2016 సంచిక : 01

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ఓం వేదాంతభేరి ఓం

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 49 జనవరి 2016 సంచిక : 01

విషయ సూచిక

01. ప్రార్థన - సూర్యోపనిషత్ - 05
02. భగవచ్ఛరణాగతి - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. జ్ఞానము - శ్రీ మలయాళస్వాములవారు - 10
04. దుర్గుణాలే దయ్యాలు - భగవాన్ శ్రీ సత్యసాయిబాబా - 13
05. గీతాజయంతి - డా ॥ సముద్రాల లక్ష్మణయ్య - 16
06. కోరిక ఉన్నట్లైతే భగవంతుణ్ణి పొందలేము-శ్రీరామకృష్ణపరమహంస -21
07. కథాత్మక గీతాసూక్తులు - ఆచార్య కె.సర్వోత్తమరావు - 22
08. అక్కమహాదేవి అనుభవామృతం-డా॥కరిబసవరాజేన్ద్ర మహాస్వామి- 26
09. శ్రీమద్భగవద్గీతా వైశిష్ట్యం - డా ॥ జక్కంపూడి మునిరత్నం - 28
10. శ్రీ భక్త తుకారాం అభంగవాణి - శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు - 31
11. చిరస్మరణీయులు శ్రీ చిన్మయానంద స్వాములవారు- ఎ.తారాలక్ష్మి - 33
12. వేదముల ప్రాధాన్యత - జి. ఎన్.కల్యాణ సుందరం - 36
13. జీవుడా మేలుకో - శ్రీ విద్యాప్రకాశానందస్వాములవారు - 39
14. ఉద్ధవుడు - శ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు - 40
15. వార్తలు - 42

ముఖచిత్రం : సంక్రాన్తి సంబరాలు

14, 15-01- 2016 మకర సంక్రాన్తి మరియు ఉత్తరాయణ ప్రారంభము

రచయితల భావాలకు రచయితలే బాధ్యులు

ప్రార్థన సూర్యోపనిషత్

నమస్తే ఆదిత్య । త్వమేవ ప్రత్యక్షం కర్మకర్తా సి ।

త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మా సి । త్వమేవ ప్రత్యక్షం విష్ణురసి ।

త్వమేవ ప్రత్యక్షం రుద్రో2సి । త్వమేవ ప్రత్యక్షం ఋగసి ।

త్వమేవ ప్రత్యక్షం యజురసి । త్వమేవ ప్రత్యక్షం సామాసి ।

త్వమేవ ప్రత్యక్ష మథర్వాసి । త్వమేవ సర్వం ఛన్దో2సి । ఆదిత్యాద్వాయుర్జాయతే।

ఆదిత్యాద్భూమిర్జాయతే। ఆదిత్యాదాపో జాయన్తే।

ఆదిత్యాజ్జ్యోతిర్జాయతే। ఆదిత్యాద్వ్యోమదిశో దిశో జాయన్తే।

ఆదిత్యాద్ దేవా జాయన్తే। ఆదిత్యాద్ వేదాజాయన్తే। ఆదిత్యోవా ఏష ఏతన్మణ్డలం తపతి । అసావాదిత్యో బ్రహ్మా । ఆదిత్యో2న్తఃకరణ మనోబుద్ధి – చిత్తాహంకారాః। ఆదిత్యో వై వ్యానస్సమానోదానో2పానః ప్రాణః । ఆదిత్యో వై శ్రోత్రత్వక్ చక్షూ రసనఘ్రాణాః ॥

ఆదిత్యో వై వాక్పాణిపాదపాయూపస్థాః । ఆదిత్యో వై శబ్ద స్పర్శరూపరసగన్ధాః । ఆదిత్యో వై వచనాదానాగమన విసర్గానన్దాః । ఆనన్దమయో విజ్ఞానమయో విజ్ఞానఘన ఆదిత్యః । నమో మిత్రాయ భానవే మృత్యోర్మా పాహి । భ్రాజిష్ణవే విశ్వహేతవే నమః । సూర్యాద్భవన్తి భూతాని సూర్యేణ పాలితాని తు । సూర్యే లయం ప్రాప్నువన్తీ యః సూర్యః సో 2 హమేవ చ । చక్షుర్నో దేవః సవితా చక్షుర్న ఉత పర్వతః। చక్షు – ర్ధాతా దధాతు నః।

ఆదిత్యాయ విద్మహే, సహస్ర కిరణాయ ధీమహీ । తన్నః సూర్యః ప్రచోదయాత్ ।

తాత్పర్యము :సవితా పురస్తాత్సవితా పశ్చాత్తాత్సవితోత్తరా త్తాత్సవి తాధరాత్తా త్సవితా నః సువతు సర్వతాతిగ్ం సవితా నో రాసతాం దీర్ఘమాయుః ।



భగవచ్ఛరణాగతి

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

త్రిగుణాత్మకమగు మాయచే జనులు ఆవరింపబడి యుండుటచే, త్రిగుణములకు అతీతముగా నున్న అట్టి భగవంతుని స్వరూపమును ఎఱుగ జాలకున్నారు.

త్రిభిర్గుణమయైర్భావైరేభి స్సర్వమిదం జగత్

మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్ (7-13)

సత్త్వరజస్తమోగుణములను మూడు త్రాళ్ళచే పెనవేసికొని యుండుటచే మాయ చాలదుర్భేద్యముగ నున్నది. దీని ప్రభావము వలననే జనులు జనన మరణాది ఈ సంసారసముద్రమున దరిగానక ఈదులాడు చున్నారు. ఈ మాయావశముననే మలమాంసములతో గూడిన ఈ శరీరమును జీవుడు తానుగా భావించుచున్నాడు. మఱియు నశ్వరములగు భోగవిలాసములందు పరమప్రీతితో రమించుచున్నాడు. క్షణికములగు దృశ్యపదార్థములందు శాశ్వతత్వ బుద్ధి కలిగి వానివెంట పరుగిడుచున్నాడు. ఉన్న దేవుని లేడనుచున్నాడు. లేని జగత్తును ఉన్నదనుచున్నాడు. తత్ఫలితముగ – కఱ్ఱపుల్ల నదీప్రవాహమున బడి కొట్టుకొనిపోవుచు కొంతసేపు ఒక ఒడ్డుకు తాకి, మఱల కొట్టుకొనిపోయి మఱియొక యొడ్డును తాకునట్లు – ఒక జన్మ నాశ్రయించి, అట నుండి మఱియొక జన్మను పొందుచు, ఇట్లు అనాదికాలమునుండి భవదుఃఖప్రవాహమున కొట్టుకొని పోవుచున్నాడు. ఈ ప్రకారముగ బలీయమగు మాయయొక్క ప్రభావముచే మనుజుడు భగవంతుని

తెలిసికొనజాలక జనన మరణములకు లోనగుచున్నాడు. అయితే ఇక జీవునియొక్క గతి యింతియేనా ? ఈ మాయనుండి తప్పించుకొనుటకు ఉపాయము లేదా ? తరతరములు జీవుడిట్లు బాధపడవలసినదేనా ? కాదు. తప్పించుకొనుటకు ఉపాయము కలదు. మాయ భయంకరమైనదే. దాటుటకు కష్టసాధ్యమైనదే. కాని అసాధ్యము మాత్రము కాదు. మాయను దాటుటకు చక్కని యుపాయమును భగవానుడు సెలవిచ్చెను.

దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా

మామేవ యే ప్రపద్యన్తే మాయా మేతాం తరన్తి తే. (7 – 14)

' నన్ను ఎవరు శరణుజొచ్చుదురో అట్టివారు ఈ మాయను దాటివేయగలరు ' అని శ్రీకృష్ణపరమాత్మ జనులందఱికిని అభయ మొసంగెను. ఈ శ్లోకము సాధకులకు అతిముఖ్యమైనదిగా నున్నది. ఏలయనిన, ప్రతిజీవియు త్రిగుణాత్మకమై, దుఃఖప్రదమైనట్టి ఈ మాయచే నానాబాధలు పడుచు, దాని పీడను వదలించుకొనుటకై తబ్బిబ్బులు పడుచున్నాడు. కాని ఏవేవో ప్రయత్నములు చేసినను, ఆత్యంతిక దుఃఖరాహిత్యము వానికి కలుగుటయే లేదు. సర్వ దుఃఖనివారణకు, సమూల మాయావినాశమునకు సరియైన యుపాయ మాతనికి గోచరింపక అవస్థపడుచున్నాడు. అట్టి సందర్భమున శ్రీకృష్ణభగవానుడు జీవరాసులపై కరుణ గలిగి జననమరణప్రవాహమునుండి వానిని తప్పించుటకై, భవసాగరమును దాటించుటకై ఈ ప్రకారముగ అమూల్యమగు సాధనను వెల్లడించెను. భగవంతుని శరణుబొందుటయే ఆ సాధన, సత్యవస్తువును ఆరాధించుటయే ఆ యుపాయము. శ్రీ శంకరభగవత్పాదాచార్యులను ఒకానొక శిష్యుడిట్లు ప్రశ్నించెను.

అపార సంసార సముద్రమధ్యే సమ్మజ్జతో మే శరణం కిమస్తి ।

గురో కృపాలో కృపయావదైతత్ –

కరుణామయుడగు ఓ దేవా ! అపారమగు సంసార సముద్రమున మునిగిపోవుచున్న నాకు శరణ్య మేది ? దయచేసి వచింపుడు. గురువర్యుడగు శ్రీ శంకరు లిట్లు సమాధాన మొసంగిరి

' విశ్వేశ పాదామ్బుజదీర్ఘ నౌకా ।

'లోకేశుడగు భగవానుని పాదపద్మములను విశాల నావయే అట్టివారికి శరణ్యము ' కదలుచున్న వానికి కదలని వస్తువే శరణ్యము. అనిత్యమైన వానికి నిత్యవస్తువే శరణ్యము. దేశకాల క్రియలకు లోబడిన వానికి దేశకాల క్రియాతీతుడే శరణ్యము. అట్టివాడు భగవంతుడొక్కడే. కావున జీవరాసులకు అతనిని ఆశ్రయించుట తప్ప వేఱు మార్గము లేదు. కొన్ని కొన్ని ఉత్సవములు జరుగునపుడు అనేక వినోద వస్తువులు, ఆటవస్తువులు ప్రదర్శింప బడుచుండును. అందులో ' రంగులరాట్నం ' అను యంత్రము విశేషముగ జనులను ఆకర్షించుచుండును. కొయ్యతో చేసిన ఏనుగు, ఒంటె, గుఱ్ఱము మొదైలనవి ఇనుప కమ్ములకు బిగింపబడియుండును. పిల్లలు కొంత డబ్బు చెల్లించి వానిపై నెక్కి కూర్చుందురు. యంత్రము త్రిప్పబడును. వాహనములు, వానిపై కూర్చున్న పిల్లలు అందఱు గిరగిర తిరుగుచుందురు. ఇంతలో ఒక పిల్ల వానికి కండ్లు తిరిగినవి యనుకొనుడు, అతడేమి చేయును ? ఇనుపకమ్మిని వదలి వేసినచో క్రిందపడి మరణించును. అట్లే కూర్చున్నచో కండ్లు తిరుగుచున్నవి ? అత్తఱి యాతడు యంత్రమును త్రిప్పువానిని కేక వేయును. ' ఓయీ, యంత్రమును నిలుపుము' అని యఱచును. అది విని త్రిప్పువాడు దానిని నిలుపును. ఇది తప్ప వేఱొక ఉపాయములేదు. అట్లే ఈ సంసార చక్రమున తగుల్కొని, కర్మప్రభావముచే ఊర్ధ్వాధోలోకములకు జనుచు, దుఃఖాకులురైయున్న జీవకోటికి శాంతి సుఖములు లభించవలెననిన, ఆ చక్రమును త్రిప్పుచున్న చైతన్యశక్తిని ఆశ్రయించవలెను. అతడే పరమాత్మ.

అతనిని శరణుబొందినవాని కిక భవభీతి యుండనే యుండదు. ఎట్లనిన

కొన్ని గొప్ప గొప్ప భవనములందు, బంగళాలలో ద్వారముకడ కావలికాచు కుక్క యుండును. అది వీధిలో తిరుగు సామాన్య శునకమువలె మత్తుగా నుండదు. మహా పౌరుషముతో గూడియుండును. ఇంటివారు తప్ప క్రొత్తవారెవరు వచ్చినను అఱచును. సందర్భపడినచో కఱచును గూడ. ఒక పర్యాయ మొక పెద్దమనిషి ఒకానొక బంగళాయొద్దకు రాగా ద్వారముకడ నున్న కుక్క అడ్డుపడెను. అది చాల భయంకరముగ నుండెను. అతని కేమియు తోచలేదు. దాని నెదుర్కొనుట కాతనికి తగినశక్తి సాహసములు లేవు. వెంటనే ఆ ఇంటి యజమాని నతడు కేకవేసెను. యజమాని లోపల నుండి రాగానే కుక్క తన భీషణాకృతిని వదలి శాంతరూపమును ధరించి ఆ క్రొత్తవానిని లోపలికి పోనిచ్చుటయే కాక అతనికి మిత్రుడుగను వ్యవహరించెను. ఈ యానుకూల్య మెటు లేర్పడెను ? యజమానిని ఆశ్రయించుట వలన, అట్లే మోక్షసౌధములోనికి పోనీయక మాయయను భయంకర శునకము జీవుని యడ్డగించుచున్నది. క్లేశములపాలు చేయుచున్నది. అట్టి సమయమున మోక్షాధీశుడగు పరమేశ్వరుని శరణు బొందుటయే జీవులకు ఏకైక మార్గము. ఈ మార్గము నవలంబించియే యెందఱో మహనీయులు పూర్వము తరించియుండిరి. ఇపుడును తరించుచున్నారు. కాబట్టి మాయావిజయమునకు భగవదాశ్రయమే ఏకైక శరణ్యమని నమ్మి సర్వులును హృత్పూర్వకముగ ఆ భగవానునే సేవింప వలయును.

సంక్రాన్తి శుభాకాంక్షలు : వేదాన్తభేరి పాఠకులకు, రచయితలకు, చందాదారులకు అందరికీ సంక్రాన్తి శుభాకాంక్షలు . అందరూ ఆనందంగా జీవింతురు గాక ! - వేదాన్తభేరి

జ్ఞానము

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

పరోక్షమనియు, అపరోక్షమనియు జ్ఞానము రెండు విధములు. గురుశాస్త్రోక్తములచే ఈశ్వరుడు కలడని తెలిసికొను జ్ఞానము పరోక్ష మనబడును. ఈ ఈశ్వరుడే జీవరూపముగా వెలుగుచున్నాడను జ్ఞానము సాక్షాత్కారమగునపుడయ్యది అపరోక్షమని చెప్పదగును. అక్షికి (నేత్రమునకు) పరమగుటచే పరోక్షమగును. అనగా దృష్టికి గోచరము కానందుచే పరోక్ష మందురు. అక్షికి పరము కానందుచే అపరోక్షమగును. అనగా, నేత్రమునకు ప్రత్యక్షముగ కానుపించినపుడది అపరోక్షము. మఱల వాచాజ్ఞానమనియు, అనుభవజ్ఞాన మనియు రెండు గలవు. వాచాజ్ఞాన మనగా శాస్త్రములు మాత్రము చదువుకొని ఆచరణ లేనిది. శాస్త్రములలో చెప్పినట్లాచరణ గలిగి, అనుభవమునకు వచ్చునపుడు గల జ్ఞానమును అనుభవజ్ఞానమందురు.

అస్తి చేద్బ్రహ్మ విజ్ఞానం స్త్రియో వా పురుషస్య వా ।
వర్ణాశ్రమసమాచారస్తస్య నాస్త్యేవ సర్వదా ॥

అట్టి బ్రహ్మ సాక్షాత్కారజ్ఞానము స్త్రీకైనను, పురుషునకైనను గలిగెనేని, అట్టి వారికి వర్ణాశ్రమ సమాచారములతో నొకప్పుడైనను సంబంధము లేదు. అనగా నట్టి జ్ఞానము గలుగుటకు వర్ణముగాని, ఆశ్రమముగాని ప్రధానమైనది కాదు. అది స్త్రీలకైనను, పురుషులకైనను గలుగవచ్చును. బ్రాహ్మణులకైనను, క్షత్రియులకైనను ఉదయించవచ్చును. గృహస్థుల కైనను, యతులకైనను లభించవచ్చును. ఇది వారి వారి జన్మాంతర సంస్కారమనియే తలంచవలెను.

పరోక్షమపరోక్షం చ ద్వివిధం జ్ఞానమిష్యతే ।
పరోక్షమస్థిరం ప్రాహురపరోక్షం చ సుస్థిరమ్ ॥ 1

హేతూ పదేశగమ్యం యత్తత్పరోక్షం ప్రచక్షత్ ।

అపరోక్షం పునశ్శ్రేష్ఠాదనుష్ఠానాద్భవిష్యతి ॥ 2

నా పరోక్షాదృతే మోక్ష ఇతి కృత్వా వినిశ్చయమ్ ।

శ్రేష్ఠానుష్ఠానసిద్ధ్యర్థం ప్రయతధ్వమతన్ద్రితాః ॥ 3

1. పరోక్షమనియు, అపరోక్షమనియు జ్ఞానము రెండు విధములుగా నున్నది. పరోక్షజ్ఞాన మస్థిరమనియు, అపరోక్షము స్థిరమనియు నిశ్చయము. గురుశాస్త్రాది హేతువులచే పొందబడిన జ్ఞాన మేది గలదో దానిని పరోక్షమందురు.

2. గురుశాస్త్రోపదేశములను వినిన తరువాత శ్రేష్ఠమైన అనుష్ఠానము చేత సాక్షాత్కరింపబడునది అపరోక్ష మనంబడును.

3. కావున అపరోక్షజ్ఞానము వలన మోక్షము లభించునని నిశ్చయించుకొని, శ్రేష్ఠమైన అనుష్ఠాన మవలంబించి, ఇంద్రియ నిగ్రహము గలవారై, పవిత్రమగు బ్రహ్మ సాక్షాత్కారజ్ఞానము సంపాదించుకొనవలెను అని ఈశ్వరు డుపదేశించెను.

నవచ్ఛిద్రాన్వితా దేహాః స్రవన్తి గళికా ఇవ ।

నైవ బ్రహ్మ న శుద్ధస్స్యాత్ పుమాన్బ్రహ్మన విన్దతి ॥

తొమ్మిది రంధ్రములు గల ఘటమునుండి జలము స్రవించునట్లు, ఎవనియొక్క ఇంద్రియముల ద్వారా విషయములలోనికి మనః ప్రవాహము గలుగుచుండునో, అట్టివాని జ్ఞానము శుద్ధముగా నుండదు. అతడు బ్రహ్మమును పొందజాలడు. ఒక్క రంధ్రము ద్వారా జలము కారుచుండిన, ఎంత నిండుకుండ అయినను, దానిలో జలము త్వరలోనే కారిపోవును. అట్లుండ, తొమ్మిది రంధ్రము లుండిన, దానియందెంత నిండుగ నీళ్ళుండినను, లేక ఎంత నిండుగ పోసినను, నిలువక ఏలాగున కారిపోవునో, ఆలాగున ఒక్క ఇంద్రియము యొక్క నిగ్రహము లేనిచో,

మనుజునకు తానార్జించిన భక్తి, తపస్సు, పుణ్యము నశించుచుండగా, నవద్వారములు బంధింపక తెఱచి ఉంచిన వాని జ్ఞాన మెంత గొప్పదైనను, లేక అతడెంట జ్ఞానమును సంపాదించినను త్వరలోనే నశించిపోవును.

ఉత్పన్నాత్మ ప్రబోధస్య హ్యద్వేష్టృత్వాదయో గుణాః ।

ఆయత్నతో భవన్త్యేతే న తు సాధన రూపిణః ॥

ఆత్మప్రబోధ ముత్పన్నమైన వానికి ప్రయత్నము లేకనే అద్వేష్టృత్వాది గుణము లన్నియు గలుగుచుండును. అట్టివానికి వానిని సాధించుటకు ప్రయత్నమవసరము లేదు. అనగా అభ్యాసికి ప్రయత్న రూపముగాను, ఆరూఢునకు స్వభావసిద్ధముగాను నుండును. అద్వేష్టృత్వాది గుణములు గీతలో ద్వాదశాధ్యాయమున గనందగును. అట్టి లక్షణము లన్నియు పరమభక్తునకుండవలెనని శ్రీ భగవంతు డుపదేశించియున్నాడు.

సంసారజసుఖాసక్తం బ్రహ్మజ్ఞోఽస్మీతివాదినమ్ ।

కర్మబ్రహ్మోభయభ్రష్టం తం త్యజేదన్త్యజం యథా ॥

సంసార సుఖమం దాసక్తి గల్గి 'నేను బ్రహ్మజ్ఞుడ 'నని చెప్పువాడు కర్మ బ్రహ్మల రెండినుండియు పతితుడగును. పరిశుద్ధమగు యజ్ఞమున, (పాపకర్మము చేసి) కులభ్రష్టుడైనవాని నెట్లు త్యజింపదగునో, అట్లే అట్టి వాడును సాధు సంఘము నుండి ఉపేక్షింపదగినవాడు.

శ్రుతేశ్శతగుణం విద్యాన్మననం మననాదపి ।

నిదిధ్యాసం లక్షగుణ మనన్తం నిర్వికల్పకమ్ ॥

వేదాంత శ్రవణమునకన్న మననము నూఱింతలు మేలు. అట్టి మననము చేసిన దానిని ధ్యానము చేయుట (నిది ధ్యాసనము) లక్షింతలు మేలు, నిర్వికల్పస్థితి అనగా సాక్షాత్ స్వరూపస్థితి యందు నిలుచుట నిదిధ్యాసనము కన్న ఎన్నియో కోట్ల రెట్లు గొప్పది. దాని యొక్క ఫలమనంతము.



దుర్గుణాలే దయ్యాలు

- భగవాన్ శ్రీ సత్యసాయి బాబా

ప్రేమయే మానవుని ప్రాణం. ప్రేమయే జీవునియొక్క చైతన్యము. ప్రేమయే జీవునియొక్క గమ్యము. ఈనాడు మానవునిలో పవిత్రమైన ప్రేమతత్త్వం కనుపించడం లేదు. రాక్షసగుణాలు, దయ్యపుగుణాలు, పిశాచపు గుణాలతో కూడిన వానిని మానవుడని ఏవిధంగా చెప్పడానికి వీలవుతుంది? సత్యమార్గం, ధర్మమార్గం, ప్రేమమార్గం, శాన్తి మార్గమనేవి తెలియకుండా మానవుడు దయ్యంవలె జీవిస్తున్నాడు.

దయ్యం గాని, భూతం గాని ఈ జగత్తులో సృష్టించబడలేదు. వీటిని మానవుడు తనకు తానే సృష్టించుకొంటున్నాడు. దీనికి ఒక చిన్న ఉదాహరణ పాండవులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో కృష్ణుడొకనాడు వారియొక్క స్థితిగతులను గురించి, యోగక్షేమాలను గురించి తెలుసుకోవాలని అరణ్యానికి వెళ్ళి వారితో ఒక రాత్రి గడిపాడు. పాండవులు తమ మధ్య పాంచాలి కూడా ఉండడంచేత ఆమెను సంరక్షించే నిమిత్తమై ప్రతి రాత్రి ఒక్కొక్కరు ఒక్కొక్క గంటసేపు తాము ఉన్నటువంటి పర్ణశాల చుట్టూ పహారా చేస్తూ వచ్చారు. మాటల సందర్భంలో కృష్ణుడు ధర్మజుని ద్వారా ఈ విషయం తెలుసుకొని ‘ బావా ! ఈ రాత్రి నాకు కూడా ఒక గంటసేపు ఈ డ్యూటీ చేసే అవకాశం ఇస్తావా ? ” అని అడిగాడు. ధర్మజుడు నవ్వుతూ “ కృష్ణా ! సర్వ లోకములను రక్షించే మీకు ఈవిధమైన వాంఛ ఎందుకు కల్గిందో నాకు అర్థం కావటం లేదు. పైగా, ఈ అడవిలో ఒక భయంకరమైన దయ్యం ఉన్నది. దానిని ప్రతి

రాత్రి నేను చూస్తున్నాను. నా సోదరులు కూడా చూస్తున్నారు. అది మాతో యుద్ధం చేయడానికి ప్రయత్నిస్తున్నది. మీరు గనుక వెళ్ళినట్లయితే అది మిమ్మల్ని కూడా బాధించవచ్చు. మీరు మా యోగక్షేమాలను చూసే నిమిత్తమై ఇక్కడకు వచ్చారు. కాబట్టి మీరు క్షేమంగా, ఆనందంగా నిద్రించండి ” అని కోరాడు. అప్పుడు కృష్ణుడు “ ధర్మజా ! ఇంతకాలమైనప్పటికి నన్ను ఇంత మాత్రమేనా తెలుసుకున్నావు ! ఒకవైపున నన్ను లోక సంరక్షకుడనంటున్నావు. మరొక వైపున నన్ను నేను రక్షించుకోలేనటువంటి అబలునిగా భావిస్తున్నావు. ఆ దయ్యం నన్ను ఏవిధమైన బాధలకు గురి చేస్తుందో అని భయపడుతున్నావు. ఏ దయ్యంగాని, ఏ భూతంగాని నన్నేమీ చేయలేవు. కనుక మీరందరూ చేస్తున్నట్లుగా ఈ పర్ణశాలను సంరక్షించడానికి నేను కూడా ఒక గంట డ్యూటీ తీసుకుంటాను ” అన్నాడు.

సరే, కృష్ణునికి కూడా డ్యూటీ ఇచ్చారు. కృష్ణుడు ఆ ఒక్క గంట పర్ణశాల చుట్టూ తిరిగాడు. తరువాత అర్జునుని వంతు వచ్చింది. ‘ కృష్ణుణ్ణి ఆ దయ్యం ఎన్ని బాధలు పెట్టిందో ఏమిటో ’ అని భయపడుతూ అర్జునుడు కృష్ణుని వద్దకు పరుగెత్తుకొని వెళ్ళాడు. కానీ కృష్ణునికి ఏ బాధలూ లేవు. ఒక రాతిపైన కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ కనిపించాడు. అర్జునుడు పరుగెత్తుకొని పోయి కృష్ణుని పాదాలపై పడి “ స్వామీ ! ఆ దయ్యం మిమ్మల్ని ఎంత బాధ పెట్టిందో ఏమిటో ! అయితే దానిని మీరు హత మార్చినారు కాబోలు. కనుకనే ఇంత సంతోషంగా కనిపిస్తున్నారు ” అన్నాడు. అప్పుడు కృష్ణుడు “ అర్జునా ! నా సృష్టిలో దయ్యాలు, భూతాలనేవి లేవు. వాటిని నేను సృష్టించలేదు. సృష్టిలోనే లేని దయ్యం ఈ అడవిలో ఏవిధంగా ప్రవేశించగలదు ? ప్రతి రాత్రి మీకు కనిపించేది దయ్యం కాదు. మీ యందున్న క్రోధమే మీకొక దయ్యంగా కనిపిస్తున్నది. దానిని

చూసి మీ క్రోధం మరింత పెరిగిపోతున్నది. మీ క్రోధం బలపడే కొలది ఆ దయ్యం కూడా తన స్వరూపాన్ని పెంచుకొంటున్నది ” అన్నాడు.

మానవుని యందున్నటువంటి దుర్గుణములు, దురాచారములు, దుర్భావములే దయ్యము, పిశాచము వంటి రూపాలను ధరించి మానవుణ్ణి బాధ పెడుతున్నాయి, భక్షిస్తున్నాయి. ఇవన్నీ ఇమేజినేషన్లే. “ నా సృష్టియందే ఈ దయ్యాలు, భూతాలు లేవు. ఇవన్నీ మీ భావములు సృష్టించుకొన్న స్వరూపములే ” అన్నాడు కృష్ణుడు. ఆ మాటలచేత అర్జునుడు చక్కగా ధైర్యం తెచ్చుకున్నాడు. ఆ తరువాత అతనికి ఎక్కడా ఏ దయ్యమూ కనిపించలేదు. “ కృష్ణా ! ఈ దయ్యాలు, భూతాలు మా భావాల యొక్క ప్రతిబింబాలేనన్న సత్యాన్ని మాకు ప్రబోధించే నిమిత్తమే మీ రీనాడు మా వద్దకు వచ్చారు. ధన్యులం, ధన్యులం ” అని కృష్ణుని పాదాలకు నమస్కరించాడు.

శబరిమలైపోవు భక్తులకు విజ్ఞప్తి

అనన్యగురు భక్తులారా !

మన గురుదేవుల (శ్రీ సద్గురు మలయాళస్వాములవారి) జన్మ స్థలము ఎన్గండ్యూరు. ఈ గ్రామము ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గురువాయూరు నుండి శబరిమలై వెళ్ళే మైన్‌రోడ్‌లో 13 కిలో మీటర్ల దూరమున నేషనల్ హైవే నెం.17న కలదు. మైన్ రోడ్డులో దిగి 1 కిలో మీటరు లోపలికి వెళ్ళవలసి యుండును. అక్కడ మార్గమును చూపించు బోర్డు కూడా ఉన్నది.

భక్తులెల్లరు ఈ సదవకాశమును జారవిడుచుకోక తప్పక శ్రీ గురుదేవుల జన్మ స్థలమును వారి జన్మించిన గృహమును, వారి అధిష్ఠాన మందిరమును చూచి ఆనందించండి. తరించండి. ఓం తత్ సత్ ఓమ్.

వివరములకు : ఎం. జయరామ్ గారు : 0487 2290478

గీతాజయంతి

డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

డిశంబర్ 21వ తేదీ నాడు వైకుంఠ ఏకాదశితో కలసి గీతాజయంతి ఉత్సవం కూడా వచ్చినది. శ్రీకృష్ణుడు మున్నగు అవతార పురుషుల జన్మదినోత్సవాలను ‘ జయంతి ’ అన్న పేరుతో జరపడం సంప్రదాయం. “ నేడే కృష్ణ జయంతి నెలతలాల రారో ! ” అని అన్నమయ్య కృష్ణజయంతిని పేర్కొన్నాడు. కృష్ణుడు అవతరించిన తిథికి ‘ జయంతి ’ అన్న వ్యవహారం ఉన్నది. అందుచేత ‘ కృష్ణజయంతి ’ అన్న ఉత్సవం వాడుకలోకి వచ్చింది. “ గాంధీ జయంతి ” ఇత్యాది వ్యవహారాలు లాక్షణికంగా ఏర్పడ్డాయి.

‘ జయంతీ నామ సా ప్రోక్తా జయత్సశుభమిత్యసౌ ’ అన్న వ్యుత్పత్తిని బట్టి అశుభంపై విజయం సాధించి శుభాలను ప్రసాదించే దినం ‘ జయంతి’ జరుపుకోవడానికి అనువైనది. ధర్మ సంస్థాపన కవతరించిన కృష్ణునివల్ల లోకానికి అశుభం తొలగి శుభం చేకూరింది. లోకోద్ధారకులైన మహా పురుషులందరూ అలా శుభం కల్గించే వారే.

గీత అవతరించిన మార్గశిర శుద్ధ ఏకాదశినాడు గీతా జయంత్యుత్సవాలు జరుపుకొంటూన్నాం. గీతోపన్యాసాలు ఏర్పాటు చేయడం, గీతను కంఠస్థం చేసిన వారికి బహుమతులివ్వడం, గీతా గ్రంథాలను పంచి పెట్టడం వంటి ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఈ శుభ సందర్భంలో విరివిగా నిర్వహింపబడుతున్నాయి.

ఒక అవతార పురుషుని అవతరణకెంత ప్రాముఖ్యం ఉన్నదో,

అంత ప్రాముఖ్యం గీతావతరణకు గూడా ఉన్నదని దీనివల్ల స్పష్టమవుతున్నది.

నిజానికి గీత ఒక స్వతంత్ర గ్రంథం కాదు అది మహాభారతంలో ఒక భాగం. భీష్మ పర్వంలో 25వ అధ్యాయం నుండి 42వ అధ్యాయం వరకు ఉన్న 18 అధ్యాయాలు ' భగవద్గీత 'గా ప్రశస్తమయ్యాయి.

ప్రస్థానత్రయంలో భగవద్గీత ఒకటి. ఉపనిషత్తులు శ్రుతి ప్రస్థానమనీ, బ్రహ్మ సూత్రాలు న్యాయప్రస్థానమనీ, గీత స్మృతిప్రస్థానమనీ ప్రసిద్ధి పొందాయి. ఉపనిషత్తులు వైదికభాషలో ఉంటాయి. ఆ భాషలో కృషి చేసిన వారికే అవి గోచరిస్తాయి. బ్రహ్మసూత్రాలు విస్తృతవ్యాఖ్య ఉంటే గానీ అవగతం కావు. ఒక భగవద్గీత లౌకిక సంస్కృతంలో పౌరాణిక భాషలో ఉన్న గ్రంథం కాన సంస్కృతంలో కొంత పరిజ్ఞానం కలవారికందరికీ బోధపడుతుంది. 'వ్యాఖ్యానతో విశేష ప్రతిపత్తిః ' అన్నట్లు వ్యాఖ్యానాలు పఠించడం ద్వారా అందలి నిగూఢాంశాలను గ్రహించవచ్చు. నాటి శ్రీ శంకరభగవత్పాదులు మొదలుకొని నేటి శ్రీ విద్యాప్రకాశానంద స్వామీజీ వరకూ అనేక వ్యాఖ్యాతలు గీతార్థాలను వివరిస్తూ గీతకు విపుల వ్యాఖ్యలు రచించి యున్నారు.

శ్రీ శంకరులు గీతకు భాష్యం వ్రాస్తూ " తదిదం గీతాశాస్త్రం సమస్త వేదార్థసార సంగ్రహభూతమ్ " అని చెప్పారు. అంటే గీతాశాస్త్రం సకల వేదార్థాల సారసంగ్రహమైనదని భావం. కర్మ – భక్తి – ధ్యాన – జ్ఞాన యోగాల వివరణ, వాటి సమన్వయం గీతలో చక్కగా ప్రతిపాదింపబడి వున్నది. " గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్ర విస్తరైః" అన్నట్లు గీతను చక్కగా పఠిస్తే చాలు, ఇతర శాస్త్రాలతో పని లేదు అని గీతామాహాత్మ్యం ప్రబోధించింది.

ఇహలోకభోగ ప్రధానమైనది ప్రేయస్సు. శాశ్వత శాంతి సుఖాలు ప్రసాదించేది శ్రేయస్సు. ప్రేయస్సును వరించేవాడు నికృష్టుడు, శ్రేయస్సును

వరించే వాడు ప్రకృష్టుడని శాస్త్రాలు బోధిస్తున్నాయి.

భగవద్గీత శ్రేయోదాయకమైనది. రణరంగంలో కర్తవ్యాన్ని నిర్ణయించుకోలేని స్థితిలో అర్జునుడు కృష్ణుణ్ణి " యచ్ఛ్రేయస్స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే " " ఏది శ్రేయస్సో దాన్ని నాకు బోధించు " అని అడిగినాడు. ఆత్మతత్త్వవిజ్ఞానాన్ని ఉపనిషత్తులవలె వాటి సారభూతమైన గీత గూడా బోధిస్తున్నది. ఆ విజ్ఞానమే మనుజునికి శ్రేయస్కరమైనది.

పార్థునికి 'నరు'డనే పేరున్నది. మనమందరమూ నరులమే. నారాయణుడు నరులనందరినీ ఉద్దేశించి శ్రేయోదాయకమైన గీతను బోధించాడని గుర్తించాలి. గీతను అందరూ చదువరాదు, అది కొందరికే పరిమితం అనే మూఢ విశ్వాసాలను విడనాడాలి. ఇట్టి మూఢ విశ్వాసాలనూ, అజ్ఞానాన్నీ రూపుమాపడానికే మహర్షి – సద్గురు శ్రీ మలయాళ స్వాములవారు ఆంధ్రావనిలో అనల్పమైన కృషి చేశారు.

శ్రీ మలయాళస్వామీజీని ఉద్దేశించి దివ్యజీవన సంఘ వ్యవస్థాపకులు శ్రీ శివానంద స్వాములవారు ' ఆయన వ్యక్తిగత జీవితం భగవద్గీతకు బాష్యం' అని పేర్కొన్నారు. అక్షరశః సత్యమిది.

ఇతరులకు ఉపదేశించడంలో అనేకులు వ్యాసులుగానో, పరాశరులు గానో కనిపిస్తారు. కాని స్వానుష్ఠానం వచ్చేసరికి శుష్క వేదాంతులుగా మాత్రమే మిగిలిపోతారు. శ్రీ సద్గురు మలయాళస్వాములవారు అనుష్ఠానానికెంతో ప్రాముఖ్యం ఇచ్చారు.

నానుష్ఠానాత్పరం కార్యాం త్రిషులోకేషు విద్యతే ।

సత్యం సత్యం పునస్సత్యమితి మామకభాషితమ్ ।

(శ్రీ మలయాళ యతీంద్ర గీత – 20వ సంపుటి) అని వారి

ప్రబోధం. “ ఆచరణను మించిన ఉత్తమకార్యం మరొకటి ముల్లోకాలలోనూ లేదు. ఇది ముమ్మాటికీ నిజం ” అని ఆ ప్రబోధ తాత్పర్యం. అనుష్ఠానం లేనివారి మాటలు కళాయిలేని పాత్రలో వండిన పులుసు కూర వంటివని శ్రీవారు తరచు చెప్పేవారు. ఆచరణహీనులే వాచా వేదాంతులు, వారినే శుష్కవేదాంతులంటారు. ఇట్టి వారిని ఖండించడానికే శ్రీ గురుదేవులు 1919లో తిరుమల గోగర్భంలో ఉన్నప్పుడే “ శుష్క వేదాంతతమో భాస్కరం” అన్న ఉద్గ్రంథం రచించారు. ఆ గ్రంథరాజం ఆంధ్రావనిలో ఆధ్యాత్మిక విప్లవాన్ని రగుల్కొల్పింది.

శ్రీవారి రచనలు 20 సంపుటాలలో ఆరవ సంపుటం భగవద్గీతకు వ్యాఖ్యానం. 670 పుటలు గల గ్రంథమిది. “ శ్రీ మద్భగవద్గీత యందు గల విశ్వాసము, భక్తి, సత్యనిర్ణయము, ధర్మపరత్వము ఈ గ్రంథము వ్రాయుటకు నన్ను ప్రేరేపించినవి ” అని ఆ పుస్తకం ఉపోద్ఘాతంలో శ్రీ గురుదేవులు పేర్కొన్నారు.

సర్వ సమభావన లేకుండా గీతపై కొందరు రచించిన కువ్యాఖ్యలను గూడ శ్రీ స్వాములవారు తమ వ్యాఖ్యలో నిశితంగా ఖండించారు.

శ్రీ మన్నారాయణుని చేత సుదర్శనచక్రం ఉంటుంది. శివుని చేత త్రిశూలం ఉంటుంది. ధర్మరక్షణకు అవే వారికి ముఖ్యసాధనమైన ఆయుధాలు. శ్రీ మలయాళస్వాములవారు తలపెట్టిన కార్యసాధనకు గూడా ఒకటి గీత, రెండు అందులో చెప్పినట్లు ఆచరణ – అనేవే ముఖ్యాతి ముఖ్యమైన సాధనాలుగా ఉపకరించాయి.

“ ఘోరమగు సంసార సాగరమును దాటుటకు భగవద్గీతా పఠనము, దానియందు చెప్పినట్లు ఆచరించుటయు చాలును ” అని శ్రీ గురుదేవులు ఎలుగెత్తి చాటారు. తాము రచించిన ‘ గీతార్థ ప్రకాశిక ’ అనే గీతా వ్యాఖ్యలోనే కాక శ్రీకృష్ణాశయము, గీతాగమనము, భగవద్గీతాశయము ’ ఇత్యాది రచనలలో గూడ గీతకు సంబంధించిన ఎన్నో ఉదాత్తమైన ఆశయాలను శ్రీవారు ప్రకటించి యున్నారు.

‘ పండితాః సమదర్శినః ’ అని గీత. ‘ సమబుద్ధేయిందరికీ సర్వ వేదసారము ’ అని అన్నమయ్య పాట. ఈ సమదృష్టి లేకుండా గీతను చదవడం వల్లా, గీతాజయంత్యుత్సవాలు నిర్వహించడం వల్లా ఏ మాత్రం ప్రయోజనం లేదు. శ్రీవారు తపోనిష్ఠకు ఉపక్రమించినప్పుడు సర్వభూత సమబుద్ధిని ప్రసాదించమని భగవానుని ప్రార్థించారు.

మన సమాజంలో సిద్ధాంతపరంగా సమత్వం అతిముఖ్యంగా బోధించబడింది. ఇందులో సందేహం లేదు. కాని ఆచరణ దృష్టితో చూస్తే ఈ సమదృష్టి ఎంతగానో లోపించి వుండడం విచారకరం. బుద్ధుడు, బసవేశ్వరుడు మున్నగు మహనీయులు ప్రాచీన కాలంలో సమదృష్టికి ప్రాముఖ్యమిచ్చారు. కాని కాలక్రమంలో దానికి బదులు విషమదృష్టి వ్యాపించింది.

ఆధునిక యుగంలో శ్రీ నారాయణ గురువు, శ్రీ వివేకానందులు, శ్రీ మలయాళ సద్గురుదేవులు మొదలగువారు సమదృష్టిని ప్రముఖంగా బోధించారు. వారు చూపిన బాటలో నడవడమే శ్రేయస్కరం. గీతబోధించిన శోకాతీత స్థితిని అందుకోవడానికి భగవదర్పణ భావంతో కర్మలు నిర్వహించాలి. భగవంతునికి శరణాగతులు కావాలి. సర్వత్రా భగవంతుని ఉనికిని గుర్తించాలి. అందరినీ భగవంతుని దివ్య సంతానంగా భావించాలి. అంతటా సమదృష్టి కల్గియుండాలి. ‘ గీతా జయంతి ’ని నిర్వహించడంలోని ఆంతర్యం ఇదే

కోరిక ఉన్నట్లైతే భగవంతుణ్ణి పొందలేము

– శ్రీ రామకృష్ణ పరమహంస

ఏ కాస్తయినా కోరిక అనేది ఉన్నట్లయితే భగవంతుణ్ణి పొందలేము. సూదిలోనికి దారు ఎక్కించేటప్పుడు దారంలోని ఒక నూలు పోగు విడివడి ఉన్నా సరే దానిని (దారాన్ని) సూది (బెజ్జం) లోనికి ఎక్కించలేము. కొందరు 30 ఏళ్లపాటు జపం చేసుంటారు. అయినప్పటికీ ఏం ప్రయోజనం ? కుళ్లిపోతున్న పుండు మామూలు మందులతో మానదు. దానికి పిడకలు కాల్చి వాతలు పెట్టాల్సి ఉంటుంది.

కోరికలున్నట్లైతే సాధనలెన్ని చేసినా యోగం సిద్ధించదు. కాని ఒక్క విషయం మాత్రం నిజం. భగవత్కృప గలిగినట్లైతే, ఆయన అనుగ్రహించినట్లైతే ఒక్క క్షణంలోనే యోగం సిద్ధిస్తుంది. వెయ్యేళ్లుగా చీకటితో నిండిన గదిలోనికి ఎవరైనా దీపాన్ని తెస్తే ఆ గది ఒక్క క్షణంలో ప్రకాశవంతమవుతుంది గదా ! అలాంటిదే ఇదీను.

నిరుపేద బాలుడొకడు ఒక పెద్ద ధనవంతుని దృష్టిలో పడ్డాడు. ఆయన (ధనవంతుడు) వానికి తన కుమార్తెనిచ్చి పెండ్లి చేశాడు. వెంటనే ఆ నిరుపేద బాలునికి ఇల్లూ వాకిలీ, పొలం పుట్టా, బండ్లు వాహనాలు అన్నీ చేకూరాయి. భగవత్కృప అట్టిదే. భక్తుడు – మహాశయా! భగవత్కృప ఎలా లభిస్తుంది ?

శ్రీ రామకృష్ణులు : భగవంతుడిది బాలక స్వభావం. పిల్లవాడొకడు జేబులో రత్నాలు పెట్టికొని ఇంటి గడప మీద కూర్చొని ఉన్నాడనుకుందాం. దారిలో ఎంతోమంది వస్తూపోతూంటారు. వారిలో చాలామంది ఆ బాలుణ్ణి రత్నాలివ్వమని అడుగుతారు. కాని ఆ పిల్లవాడు ముఖం ప్రక్కకు తిప్పుకొని ' ఊహూ,నేనివ్వనంటే ఇవ్వను ' అంటాడు. అయితే కాసేపటి తరువాత ఒక వ్యక్తి ఆ దారిన వెళ్లుతున్నాడు. అతడు పిల్లవానిని రత్నాలు కావాలి అని కూడా అడుగడు. అయినా సరే ఆ బాలుడు పరుగు పరుగున అతని వద్ద కెళ్లి రత్నాలన్నిటిని ఆ వ్యక్తి చేతిలో పెడుతాడు. త్యాగం లేకుండా భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోలేం. **(శ్రీరామకృష్ణ కథామృతం నుండి)**

కథాత్మక గీతా సూక్తులు

–ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

(గత సంచిక తరువాయి)

కర్మణ్యేవాధికారస్తే : (2 – 4)

ఈ గీతావాక్యం సాంఖ్యయోగమనే రెండవ అధ్యాయంలోని నలభై యేడవ శ్లోకం పూర్వభాగం.

' కర్మణి ఏవ అధికారః తే ' అని పదవిభాగం. కర్మాచరణమందే నీకు అధికారమని సారాంశం. భగవద్గీత వ్యక్తులకు, సమాజానికి, సర్వజగాలకు ప్రధానంగా బోధించే సూక్తులలో ఈ సూక్తికే ప్రాధాన్యం. స్థిరసంకల్పంతో కర్మ చేసేవేళ కొందరికి దుఃఖం సహజం. స్థిర సంకల్పంతో కర్మ చేయక పోయినా కొందరికి మానసికంగా దుఃఖం. ఈ వాక్యంలో తొలి భావన కర్మను కర్మగా చూచి తామరాకుపై నీటి బొట్టులా చేయడం.కర్త కర్మఫలాన్ని ఆశించకుండా చేయడం, కర్త కర్మ నుండి విడదీయబడడం అనే అనేకార్థాలున్నాయి. ఏది ఏమయినా సమభావన, సమదృష్టి కర్మాచరణలో ప్రధానాలు. చేసే పనిలో శ్రద్ధ ప్రధానం.

ఈ కర్మాధికారానికి సంబంధించిన అనుబంధ సన్నివేశాలను సమన్వయించుకోవడం సబబు.

యాజ్ఞవల్క్యుడు అరణ్యం వెళ్ళదలచుకొన్నాడు. సంసారిగా అతనికి కొన్ని బాధ్యతలున్నాయి. ఆ దృష్టితో ఆస్తిని పంచాలనుకొన్నాడు. భార్యలను అడిగాడు. కాత్యాయని చర ఆస్తి పంచుకొంది. మైత్రేయి తనకు బ్రహ్మజిజ్ఞాస ఉందని భర్తతోనే ఉంటానన్నది. ఆలాగే చేశాడు యాజ్ఞవల్క్యుడు.

ఐతిహాసికకాలంలో ' కర్మనిష్ఠ ' బలపడింది. శ్రీ మద్రామాయణంలో కర్మనిష్ఠులెందరో కనిపిస్తారు. వారిలో 'లక్ష్మణ ' పాత్ర ఒకటి. శ్రీరాముడు కైక ఆనతితో అరణ్యగమనానికి సిద్ధమయిన వేళ సుమిత్ర లక్ష్మణునికి

కర్మనిష్ఠను ఉపదేశించింది.

రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజామ్ ।

అయోధ్యా మటవీం విద్ధి గచ్ఛ తాత ! యథా సుఖమ్ ॥

లక్ష్మణా ! అయోధ్యలో తండ్రి దశరథుడు. తల్లి నేను. కాని అరణ్యంలో నీకు రాముడే తండ్రి. జానకి తల్లి. శ్రీ మద్రామాయణంలో కర్తవ్యనిష్ఠగల పాత్ర ఆంజనేయునిదే. విద్యార్జన మొదలు కర్తవ్యానికి ప్రాధాన్య మిచ్చినవాడు హనుమ. దాస్య భక్తికి అతడొక లక్షణం. " దాసోహం కోసలేంద్రస్య " అనడం ఆ పాత్ర వైశిష్ట్యం. తాళ్లపాక అన్నమాచార్యులు హనుమంతుని బంటుతనాన్ని కీర్తించిన తీరు.

అతిమతి హనుమంతు ఁడట్టి బంటు

వెఱపు లేని రఘువీరునికి బంటు

యేలికను దైవముగా నెంచి కొల్చేవాఁడే బంటు

తాలిమి గలిగిన యాతఁడే బంటు

పాలుమాలక యే ప్రొద్దు పనిసేయువాఁడే బంటు

వేళ గాచుక వుండేటి వెరవరే బంటు

తన మనోవంచన లెంతటా లేనివాఁడే బంటు

ధనము పట్టున శుద్ధాత్మకుండే బంటు

అనిశము నెదురు మాటాడని వాఁడే బంటు

అని మొన ఁ దిరుగని యాతఁడే బంటు

చెప్పినట్టనే నడచిన యాతఁడే బంటు

తప్పులేక హితుడైన నాతఁడే బంటు

మెప్పించుక విశ్వాసాన మెలఁగువాఁడే బంటు

యెప్పుడును ద్రోహిగాని హితుఁడే బంటు.

ఆళ్వారులలో కులశేఖరాళ్వార్ భక్తులసేవకు ప్రాధాన్యమిచ్చిన మహానుభావుడు. శ్రీ వైష్ణవంలో భగవదపచారం కంటే భాగవదపచారం మహాపాపం.

కులశేఖరాళ్వార్. " త్వద్భ ృత్య భృత్య పరిచారక భృత్య భృత్య భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ " అన్నారు. అన్నమయ్య ఈ భావాన్నే 'కందువ శ్రీ వేంకటేశ కడు నీ బంటు బంటుకు సందడి బంటునవుటే చాలదా నాకు' అన్నారు. ఆతని దృష్టిలో 'కైవల్యమున కంటె కైంకర్యమెక్కుడు '. భగవద్రా మానుజులు తమ శిష్యులకు ఏ పనులు పురమాయిస్తే ఆ పనుల్ని వారు నిష్ఠతో చేసేవారు. ధనుర్దాసు శ్రీ రంగనాథరక్షక బాధ్యత వహించడం ఈలాంటిదే. భగవద్రామానుజులు కాంక్షాపరిపూర్తి దృష్టితో అనంతాళ్వార్ భార్యతో తిరుమలకు విచ్చేసి పుష్పకైంకర్యానికి శ్రీకారం చుట్టడం ఈలాంటిదే.

శ్రీ వేంకటాచలమాహాత్మ్య కథలలో కర్మనిష్ఠకు 'కురువరతినంబి' కథ ఒక చక్కటి ఉదాహరణ. 'కురవ ' గ్రామానికి చెందినవాడు 'నంబి'. తమిళంలో 'కుయవర్' అంటే కుండలు చేసేవాడు. అతని వృత్తి స్వామి వంటశాలలకు కుండలు చేయడం. ఈ పనిలోనే తలమునకలై ఏనాడూ స్వామి దర్శనానికి వెళ్ళేవాడు కాడు. కుండలు చేశాక తన చేతికి అంటుకొన్న మట్టిని పువ్వుల్లాగా చేసి దారు (కొయ్య) వేంకటేశ్వరస్వామికి అర్పించేవాడు. స్వామి తొండమాన్ చక్రవర్తి సమర్పించే బంగారు పూలకన్న కురవరతినంబి ప్రియంగా భావించి బంగారుపూలను పక్కకు నెట్టేసేవాడట. చక్రవర్తి బాధతో కారణమడిగితే కురవరతినంబి పూలు తనకిష్టమయ్యాయని చెప్పాడు. చక్రవర్తి పరుగిడికురువరతనంబి పూలను కడకేగి సాగిలబడి స్వామి ఏలుకోవడానికి కారణం ప్రశ్నించాడు. తనకేదీ తెలియదని ' కుండలు చేయడమే ' తన కర్మ (పని) అన్నాడట.

మహాభారతంలో భీష్ముని కర్మనిష్ఠ లోకాతీతం. తండ్రి కోసం 'వివాహం' త్యజించాడు. దాశరాజు కోసం 'బ్రహ్మచర్యం ' చేబట్టాడు. విచిత్రవీరుడు, చిత్రాంగదులకోసం త్యాగం చేశాడు. తల్లి మరల కోరినా వివాహమాడలేదు. అంపశయ్యపై వాలేదాకా కర్మవీరుడుగా రాణించాడు. చివరకు శ్రీకృష్ణ ప్రార్థనలో ' ఆలుబిడ్డలు లేనివాఁడ' అని పరితపించినాడు.

దుర్యోధనాదుల వల్ల పలు అవమానాలు పడినా సహించినవాడు. తన మాటను వినని వారి పంచన పడివుండడం ఎంతనరకమో తెలిసిన జ్ఞానవృద్ధుడు భీష్ముడు.

చారిత్రకయుగంలో పరిశీలిస్తే కర్మనిష్ఠుడైన మంత్రులలో 'అప్పాజి' సర్వశ్రేష్ఠుడు. రాయలమీద ప్రీతికన్న రాజ్యక్షేమమే ప్రధానంగా భావించినవాడు. ఆబాల్యం రాయలను రక్షించి, అతని 'ఎదుగదలకు' సహకరించి రాజ్య సంక్షేమాన్ని హైందవమత సంరక్షణాన్ని గావించినవాడు. ఆలాగే విజయనగర సంస్థాపకులయిన విద్యారణ్యులవారు.

భారత స్వాతంత్ర్య సంగ్రామ కాలంలో భారతీయులకు కర్మనిష్ఠను బోధించిన మహనీయుడు బాలగంగాధరతిలక్. ఆ కోవలో మితవాద దృష్టితో కర్మనిష్ఠాజీవితం గడిపినవాడు గాంధీ. 'మై కహ్నే సే కర్నా అచ్ఛీ తరహ్ జాన్తా హూం ' అనడం అతని లక్ష్యం. నవఖాలీ ప్రాంతం మలినంగా వుంటే శుభ్రం చేయడం, కుష్ఠరోగులకు సేవచేయడం, దరిద్ర నారాయణులున్న భారతీయ సమాజంలో నిరాడంబరజీవితం గడపడం, స్వాతంత్ర్యం వచ్చాక పదవులు వద్దనడం లాంటివి సామాజిక కర్మనిష్ఠను తెలియజేసే సన్నివేశాలు. ఆ పంథాలో నడచినవారే 'మలయాళ యతీంద్రులు'. సామాజిక జాగృతి అనే కర్మ మార్గాన పయనించినవారు.

కౌటుంబిక జీవితంలో కూడా మాతాపితలు గాని, సోదరులు గాని వాత్సల్యంతో కర్మలు చేయవచ్చు గాని ఫలాదులు కోరరాదు. ఫలచింతతో చేసే కర్మ ఎదుటివారి 'ఛీత్కారాలకు' తట్టుకోదు. ఫలితం అంతులేని శోకం. ప్రాచీన సమాజంలో కులమత జాతికర్మల కనుగుణంగా కర్మలు చేసేవారు. ఆలాగే ప్రస్తుతం విద్యార్థులు చదవడం వ్రాయడం విజ్ఞానాన్ని పెంపొందించుకోవడమే ప్రధానంగా భావించాలి గాని పరీక్షల కోణమే ప్రధానం కారాదు.

కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మఫలహేతుర్భూర్మాతే సఙ్గోఽస్త్వకర్మణి.



అక్క మహాదేవి అనుభవామృతం

తెలుగు సేత – డా ॥ శ్రీ కరిబసవరాజేంద్ర మహాస్వాములవారు (బళ్లారి)

119. నేను నా ఆకలి కోసము అరణ్యానికి పోతిని. అక్కడ ప్రతియొక్క చెట్టును ఆహారమును అడిగితిని. ఆ వృక్షములు తమ కర్తవ్యమని తమ పండ్లను ఇచ్చినవి. నేను యాచించి జనన మరణాలకు గురి అయితిని, అవి ఇచ్చి భక్తులైనవి. శివభక్తులైన తరువాత చేజాచి ఇంకొకరిని యాచించకూడదు. యాచించిన చేయి లింగ పూజకు యోగ్యము కాదు. దానికోసం ఎవ్వరినీ అడగకూడదు.

120. అంతిమ జీవనంలో చేసినటువంటి భక్తి, ధృడతనం లేనటువంటి సేవను శివుడు మెచ్చడు. జీవన ప్రారంభములో భక్తి చేయాలి. మనస్సును చంచలంగా చేసుకోకూడదు. చంచలతతో చేసిన భక్తిని మనస్సుకు యజమానియైన మహాదేవుడు తెలుసుకొనలేడా ? ముత్యాలహారము అక్కడక్కడ ముత్యాలు వుంటే హారమవుతుందా ! అలాగే ధృడతనము లేని భక్తికి భగవంతుడు మెచ్చడు.

121. చెట్టు పెరిగి పెద్దదయినది. దాని కొమ్మలు నరికినారు. అటువంటి చెట్టు వల్ల ఏమి ప్రయోజనము. మానవునికి చాలినంత ధనమున్నా ఆయనలో దయా గుణము లేకపోతే ఆ ధనము సార్ధకము కాదు. ధనముతోపాటు దయా గుణముండాలి. ఆవులు వున్నా పాలు ఇవ్వకపోతే ఏమి ప్రయోజనం. సుందర రూపము వున్నా సద్గుణాలు లేకపోతే ఆ సౌందర్యానికి విలువ వుంటుందా ! విశాలమైన ఇల్లు వున్నా తినే దానికి అన్నము లేకపోతే బాగుండునా ! అలాగే మానవుడై పుట్టిన తరువాత చెన్నమల్లికార్జునుని జ్ఞానము లేకపోతే మానవ జన్మానికి సాఫల్యముండదు.

122. శరీర సుఖాన్ని త్యాగం చేసి మనస్సును మహాదేవునిలో పెట్టాలి. అప్పుడు నిరతిశయ ఆనందములో ఓలలాడుదురు. భావయుక్తమైన జీవికి

సుఖము సాధ్యం. భావశూన్యునకి సుఖము శూన్యం. శ్రీ చెన్నమల్లికార్జునా! విను. నేను అనే అహంకారాన్ని తొలగించినపుడు నీ దర్శనభాగ్యం కలుగుతుంది. అటువంటి మార్గాన్ని చూపించు.

123. భయముతో మనసు కకబికము అయితే ప్రాణమే పోతుంది. శరీరేంద్రియములు దేవుని స్మరణలో వున్నపుడు సమరసమగును. నేను దేవుని కన్నా వేరొకటి ఎరుగను.

125. చెన్నమల్లికార్జునా ! ప్రకృతి నాపైన అగ్నిని కురిపిస్తే ఆకలి దప్పిక లేకుండా అయిపోయినదని భావిస్తాను. ఆకాశము నాపైన పడితే నాకు స్నానమైనదని భావిస్తా. పర్వతము నాపైన పడితే పుష్పవృష్టి అయినదని భావిస్తా, నా శిరస్సే తెగిపడితే నీ పాదమునకు నా ప్రాణమర్పితమని భావిస్తాను.

126. గుడ్లగూబకు పగలు కన్నులు కనిపించవు. దానికోసం సూర్యుని తిట్టుతుంది. కాకికి రాత్రి కన్నులు కనబడవు అది చంద్రుని ద్వేషిస్తుంది. గ్రుడ్డి వానికి ఏదీ కనబడదు. అద్దము సరిగా లేదని తిట్టుతాడు. ఇవన్నీ నిజమైన మాటలా ? నక్కకి ద్రాక్ష పండ్లు అందక ఈ ద్రాక్ష పండ్లు అన్నీ పుల్లవి అనట్లు, ఈ సంసారములో వుంటూ శివుని సాక్షాత్కారము పొందక దేవుడు లేడనే మాట నిజమైనదా ? నీరసమైన ఈ సంసారములో వుంటూ దుఃఖియైన మనుష్యునికి శివుడు లేడు. ముక్తియు లేదు. గంధపు చెట్టు ముక్కలుగా చేసి గంధమును అరగదీస్తే బాధపెట్టినారని దాని సువాసన విడువదు. బంగారాన్ని తెచ్చి బాగాకాచి సుత్తితో కొట్టి, అగ్నిలో పెట్టినా బాగా మెరుస్తుంది. గాని నల్లనౌనా ! చెరుకును తెచ్చి చిన్న ముక్కలుగా చేసి గానుగలో వేసి దాని రసాన్ని కాచి, పాకము చేసినా తన తియ్యదనాన్ని ఇస్తుంది కాని బాధపెట్టినారని తన తియ్యదనాన్ని విడవదు.. నా పూర్వ జన్మయొక్క హీనకర్మములయొక్క ప్రభావముతో నేను నిన్ను విడువను. నిన్నే నమ్మినాను. నీకు శరణు అయినాను. నన్ను చంపినా ప్రాణములు నీ పాదార్పణమైనవని అంటాను.

శ్రీ మద్భగవద్గీతా వైశిష్ట్యం

- ఆచార్య డా ॥ జక్కంపూడి మునిరత్నం

(గత సంచిక తరువాయి)

అర్జునుడికీ అర్జునుడిలాంటి మనకందరికీ మేలు కలిగించే ఉద్దేశ్యంతో చెప్పబడిన గొప్ప బోధే భగవద్గీత అని కృష్ణుడు స్పష్టం చేశాడు. అందువల్లనే మళ్ళీ మళ్ళీ చెబుతున్నానన్నాడు. మళ్ళీ విను అన్నాడు.

భూయ ఏవ మహాబాహో శృణుమే పరమం వచః ।
యత్తే2హం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా ॥ (10-1)

ప్రపంచంలో ఉన్న అన్ని జ్ఞానాల కంటే ఉత్తమమైన జ్ఞానాన్ని తాను అర్జునుడికి చెబుతున్నట్టు కృష్ణుడు తెలియజేశాడు. ఈ జ్ఞానమెంతో శ్రేష్ఠమైందన్నాడు. దైవ సంబంధమైందన్నాడు ' మునులు ఈ జ్ఞానాన్ని ఆశ్రయించడం వల్లనే గొప్ప సిద్ధిని పొందారన్నాడు.

పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్ ।
యద్జ్ఞాత్వామునయః సర్వే పరాంసిద్ధిమితో గతాః ॥ (14 - 1)

ఈ జ్ఞానాన్ని ఆశ్రయించినట్లైతే తన స్వభావాన్ని, స్వరూపాన్ని తనతో ఐక్యతను పొందవచ్చని తెలియజేశాడు. ఈవిధంగా పొందినవారు సృష్టికాలంలో పుట్టరన్నాడు. ప్రళయకాలంలో నశించరన్నాడు.

ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతాః ।
సర్గే2పి నోపజాయన్తే ప్రళయే న వ్యథన్తిచ ॥ (14 - 2)

రహస్యాల్లోకెల్లా అతి రహస్యమైన జ్ఞానాన్ని తాను బోధించినట్టు కృష్ణుడు అర్జునుడికి చెప్పాడు. దాని గురించి బాగా విచారించి ఇష్టమైన విధంగా చేసుకొమ్మని కూడా అర్జునుడికి స్వేచ్ఛ ప్రసాదించాడు.

ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా ।

విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథాకురు ॥ (18 - 63)

అన్నిటికంటే అత్యంత రహస్యతమమైన గొప్ప జ్ఞానాన్ని తాను అర్జునుడి మేలుకోసం మళ్ళీ చెబుతున్నానని శ్రీ కృష్ణుడు చెప్పాడు.

సర్వగుహ్యతమం భూయః శృణు మే పరమం వచః ।

ఇష్టోసి మే దృఢమితి తతో వక్ష్యామి తే హితమ్ ॥ (18 - 64)

గీతాపారాయణం చేసేవాడికి జ్ఞానయజ్ఞంవల్ల లభించే ఫలితం లభిస్తుందని కృష్ణుడు చెప్పాడు. గీతాపారాయణం చెయ్యడం కూడా తనను ఆరాధించినట్టే అవుతుందన్నాడు. దానిచేత తాను ప్రసన్నుడౌతానన్నాడు.

అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః ।

జ్ఞానయజ్ఞేన తేనాహ మిష్టస్స్యామితి మేమతిః ॥

కృష్ణుడి మాటల సారాంశాన్ని ఈవిధంగా చెప్పుకోవచ్చు. కృష్ణుడు బోధించిన జ్ఞానం అంటే గీతాజ్ఞానం చాలా ప్రాచీనమైంది. ఎంతో రహస్యమైంది, ఎంతో శ్రేష్ఠమైంది, నాశము లేనిది, నిస్సంశయం, సంపూర్ణం, భగవంతుణ్ణి తెలుసుకోవడానికి ఉపయోగపడేది, అనుభవజ్ఞానం, అశుభమోక్షకారిణి, శ్రేష్ఠవిద్య, చాలా పవిత్రమైంది, ప్రత్యక్షంగా తెలుసుకోదగింది, ధర్మయుక్తమైంది, అనుష్ఠాన సులభం, మేలు కలిగించేది, మళ్ళీ మళ్ళీ వినదగింది, ఉత్తమ జ్ఞానం, సిద్ధి దాయకం, మోక్ష దాయకం, గీతాపఠనం కృష్ణానుగ్రహ కారకం. గీతాపఠన ఫలితాన్ని మినహాయిస్తే గీతాజ్ఞానానికి కృష్ణుడు చెప్పిన లక్షణాలు కూడా పద్దెనిమిదే అవుతాయి. వీటిని గ్రహించి మననం చేసుకుంటూ విచారణ సాగిస్తే గీతపట్ల విశేషాసక్తి కలుగుతుంది. మక్కువ ఎక్కువ అవుతుంది. నిక్కవం వైపుకు నెట్టుకపోతుంది.

(ఆ). అర్జునుడు చెప్పినవి : భగవద్గీతలో ప్రథమ పాత్ర ప్రధానపాత్ర శ్రీకృష్ణుడిదైతే.ద్వితీయ పాత్ర అర్జునుడిది. ఇది ద్వితీయ పాత్రే అయినప్పటికీ భగవద్గీత అందుబాటులోకి రావడానికి కారణమైన అద్వితీయ పాత్రే అని

చెప్పవచ్చు. మొదట కృష్ణుడు పలుకలేదు. ఆయనను పలికేట్టు చేసినవాడు అర్జునుడే. అర్జునుడు తనకు ఆత్మజ్ఞానం లేదన్నాడు. అదే పెద్ద లోపమన్నాడు. తన మూఢ మనస్సుకు ధర్మాధర్మాలు తెలియడం లేదన్నాడు. తాను కృష్ణుడికి శిష్యుడౌతానన్నాడు. అతన్నే శరణు కోరుతున్నానన్నాడు. ఏది మేలు కలిగిస్తుందో తనకు తెలియజేయమన్నాడు.

కార్పణ్య దోషోపహత స్వభావః

పృచ్ఛామి త్వాం ధర్మ సమ్మూఢచేతాః ।

యచ్ఛ్రేయ స్స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే

శిష్యస్తేఽహం శాధిమాం త్వాం ప్రపన్నమ్ । (2-7)

ఆ తర్వాతే కృష్ణుడు విడమరచి చెప్పడం మొదలెట్టాడు. ఇక్కడ గమనించవలసిందేమిటంటే అర్జునుడు కోరినమేలు భగవద్గీత అంతటా పరివ్యాప్తమై ఉంది. అది అర్జునుడికి మాత్రమే గాక మనకందరికీ కూడా వర్తిస్తుంది. అర్జునుడి అభ్యర్థనకు స్పందనగా లభించిందే గీతాజ్ఞానం. అక్కడక్కడ ప్రశ్నలు వేస్తూ ఈ జ్ఞానం పరిపూర్ణంగా లభించేందుకు అర్జునుడు దోహదం చేశాడు. నా మీద నీకు కరుణ ఏర్పడింది. దానివల్ల శ్రేష్ఠమైన, రహస్యమైన అధ్యాత్మ విద్యను నాకు బోధించావు, ఆ విద్యచేత నా మోహమంతా నశించింది అని అర్జునుడు చెప్పాడు.

మదనుగ్రహాయ పరమం

గుహ్య మధ్యాత్మ సంజ్ఞితమ్ ।

యత్త్వయోక్తం వచస్తేన

మోహోఽయం విగతో మమ ॥ (11 - 1)

గీత మొత్తం 18 అధ్యాయాలు. అందు 10 అధ్యాయాలు మాత్రమే చెప్పడం పూర్తయ్యింది. ఇంకా 8 అధ్యాయాలు మిగిలి ఉన్నాయి. అయినప్పటికీ తనమోహం పోయిందని, అవివేకం నశించిందని అర్జునుడు అన్నాడు. భగవద్గీతాజ్ఞాన మహిమ ఎంత గొప్పదో దీన్ని బట్టి తెలుస్తూ ఉంది.



శ్రీ భక్త తుకారాం అభంగవాణి

- శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు

అభంగము : మాంస ఖాతా హౌస కరీ । బోడోని లైరీ దేవియేలా ॥1 ॥
కోణ త్యాచీ కరీల కీంవ ! జీవే జీవ నేణతీ ॥2॥ పుఢిలా సాఠీ పాజళీ సురీ । ఆపలీ చోరీ అంగులీ ॥3'॥తుకా హ్మణే పుఢేc కుటతీ హాడేc! ఆపుల్యా నాడే రడతీల ॥4॥

తా ॥ మూఢ మనుష్యులు పశువును హత్యచేసి దాని మాంసమును వండుకొని తిని, వారి కోరికను నెరవేర్చుకొనుచున్నారు. కాని జన్మ జన్మాంతరములో దుఃఖమునిచ్చు శత్రువు (పాపము)తో సంబంధము పెట్టుకొనుచున్నామని మాత్రము తెలియజాలకున్నారు. 1. తన జీవనము (ప్రాణము) లాంటిదే ఇతర పశ్వాదుల యొక్క ప్రాణముంటుందని తెలియక ప్రాణిహత్య (జీవహింస) చేయుచున్నారు. దానికి ప్రతిఫలముగా యమ లోకములో శిక్షింపబడుచున్నపుడు, వానిని విడిపించుటకు, వానిపై కరుణజూపు వారెవరు ? 2. ఎదుటనున్న పశువును చంపుట కొఱకు కత్తిని పదును బెట్టి, అతి తీక్ష్ణముగా నూరి ఉంచుతాడు. కాని, పశువు మెడకోయునపుడు నా వ్రేలు తెగిపోవునేమో యని, తన వ్రేలును మాత్రము జాగ్రత్తగా రక్షించుకుంటాడు. 3. శ్రీ తుకారాం మహారాజుగారంటున్నారు. ఇటువంటి దుష్టులకు ఇక్కడ పాపము చేయునపుడు ఆనందముగా దోచును. కాని ముందు యమదూతలు వానిని కొట్టి, చిత్ర హింసలు పెట్టి, కాళ్ళతో కసిదీర ద్రొక్కుచూ, వాని ఎముకలను చూర్ణము చేయుదురు. అప్పుడు వాని పూర్వకృత పాపకర్మ ఫలముననుభవిస్తూ దిక్కు లేనివాడై అతి దుఃఖముతో బోరున ఏడ్చును. 4.

సు.వ్యా : ప్రకృతాభంగము ద్వారా శ్రీ తుకారాం మహారాజుగారు ప్రాణిహింస చేయరాదని, సకల ప్రాణులపట్ల దయగలిగి యుండాలని, దయ గల హృదయమే భగవన్నిలయమని చెబుతూ మాంసభక్షణ నిషేధము చేస్తూ, మాంస భక్షణము చేయువానిని కఠినముగా మరియు సశాస్త్రీయముగా నిందించుచున్నాడు.

ప్రాణిహింసను నిందిస్తూ, మాంసభక్షణమును నిరాకరిస్తూ భారత, మన్వాది శాస్త్రములు లోకహితార్థము, అభయదానమే ఉత్తమ దానమని విస్తారముగా బోధించుచున్నవి.

శ్లో ॥ అహింసా పరమో ధర్మస్తథా2హింసా పరమం తపః ।
అహింసా పరమం సత్యం యతో ధర్మః ప్రవర్తతే ॥
(మ.భా.అను.ప. 115-23)

అర్థము : అహింసయే పరమ ధర్మము, అహింసయే పరమ తపస్సు, అహింసయే పరమ సత్యము. ఎందుకనగా దానిచేతనే ధర్మము ప్రవృత్తమగుచున్నది.

శ్లో ॥ అహింసా పరమోయజ్ఞః, తథా2 హింసా పరంఫలమ్ ।
అహింసా పరమం మిత్రం, అహింసా పరమం సుఖమ్ ॥
(మ.భా.అను.ప.116-29)

అర్థము : అహింసయే పరమ యజ్ఞము. అహింసయే పరమ ఫలము, అహింసయే పరమ మిత్రుడు. అహింసయే పరమ సుఖమైయున్నది.

సూ : అహింసా సత్యాస్తేయ బ్రహ్మచర్యాపరిగ్రహాః యమాః ।
(పాతంజల యోగ సూత్రము : 2 - 30)

అహింసా, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము మరియు అపరిగ్రహము ఈ ఐదింటికి " యమము" లందురు. తత్ర వ్యాసభాష్యమ్

తత్రాహింసా సర్వథా సర్వదా సర్వభూతానామనభిద్రోహః, ఉత్తరే చ యమ నియమాస్తన్మూలాస్తత్సిద్ధిపరతయైవ తత్ప్రతిపాదనాయ ప్రపపాద్యన్తే, తదవదాతరూపకరణాయైవోపాదీయన్తే ।

అర్థము : మనోవాక్కాయ కర్మలలో నొకదాని మూలమున గాని, యొకవేళ నేని, యొక ప్రాణికేని ద్రోహము చేయకుండుట యహింస యనcబడును.

చిరస్మరణీయులు శ్రీ చిన్మయానంద స్వాములవారు

-ఎ.తారాలక్ష్మి, ఎం.ఎ., ఎం.ఇడి., ఎమ్.ఫిల్.(శ్రీకాళహస్తి)

జన్మించిన ప్రతి ప్రాణి మరణించక తప్పదు. దుర్లభమైన నరజన్మ విలువ తెలిసికొని విశ్వ శ్రేయస్సుకొరకు తమ జీవితాలను పణంగా పెట్టి జన్మను చరితార్థం చేసుకున్న అతికొద్ది మంది మాత్రమే చిరస్మరణీయు లౌతారు. తమ పుట్టుకతో యావత్ భారతావనినే కాక ప్రపంచాన్నే జాగృతి పరచిన మహనీయులెందరికో భరతభూమి ఆలవాలమయ్యింది. అట్టి మహనీయుల కోవకు చెందిన వారే సద్గురు శ్రీ చిన్మయానంద స్వాముల వారు. వీరి పూర్వాశ్రమ నామధేయము బాలకృష్ణమీనన్. కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులంలో కొచ్చిన్ మహరాజ వారి మేనల్లుడయిన శ్రీకురు పొత్తుకట్ట మీనన్ మరియు పారుకుట్టి అమ్మ దంపతులకు 18 మే 1916లో మూడవ సంతానంగా బాలకృష్ణమీనన్ జన్మించారు. బాల్యంలోనే వీరి తల్లి మరణించింది. త్రిచూర్‌లో పాఠశాలవిద్య పూర్తి చేశారు. ఎర్నాకులం మహరాజ కళాశాలలో ఎమ్.ఎ. పట్టాను పొంది లక్నో విశ్వవిద్యాలయంలో జర్నలిజం చదువు చుండగనే సాహిత్యము మరియు న్యాయశాస్త్రాలను అధ్యయనం చేశారు. విద్యార్థిదశలోనే వీరు ఆధ్యాత్మిక రంగంలో పురోగమించారు.

అరుణాచలంలో శ్రీరమణులను వీరు 1936లో తొలిసారిగా దర్శించారు. దర్శనమాత్రంగానే వారి హృదయంలో ఒక అనూహ్యమైన స్పందన కలిగి వర్ణనాతీతమైన ఆనందం కల్గింది. ఈ సంఘటన వారి జీవితంపై చెరగని ముద్ర వేసింది. స్వాతంత్రోద్యమం ఎంతో చురుకుగా జరుగుతున్న రోజులవి. 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో వీరు క్రియాశీలపాత్ర వహించారు. తత్‌ఫలితంగా కొంతకాలం జైలు శిక్షకు గురయ్యారు. ఆ సమయంలో జైలులోని అపరిశుభ్ర పరిస్థితుల వలన వీరు తీవ్రంగా జబ్బుపడ్డారు. జైలు అధికారులు వీరిని రాత్రికి రాత్రే ఊరి పొలిమేర్లలో పడవేసి వెళ్ళారు. అదే దారిలో వెళుతున్న ఓ హైందవ క్రిష్టియన్ మహిళ వీరి దురవస్థను గమనించి తన గృహానికి కొనిపోయి వైద్య సేవలందించి వారికి స్వస్థత చేకూర్చారు.

అప్పటి రాజ్యసభ సభ్యులు మరియు ‘ నేషనల్ హెరాల్డ్ ’ పత్రికా సంపాదకులయిన శ్రీరామారావుగారు బాలకృష్ణమీనన్‌కు తమ పత్రికా కార్యాలయంలో ఉద్యోగం ఇచ్చారు. చరిత్ర సంస్కృతి మరియు రాజనీతికి సంబంధించిన అనేక అంశాలపై వీరు ఆసక్తికరమైన వ్యాసాలెన్నింటినో వెలువరించారు. జర్నలిస్టుగా పనిచేయుచున్న సమయంలో వీరు సాధు సత్పురుషులపై ఓ వ్యాసం వ్రాయదలచి హృషీకేశ్‌లోని శివానంద స్వాములవారు స్థాపించిన దివ్యజీవన సంఘానికి చేరారు.

బాలకృష్ణ మీనన్ చిన్మయానందస్వామిగా పరివర్తన చెందేందుకు రంగం సిద్ధమైంది. 25 ఫిబ్రవరి 1949న మహాశివరాత్రి పర్వదినాన శ్రీవారి సన్న్యాసస్వీకరణ జరిగింది. సనాతనధర్మాన్ని, బ్రహ్మవిద్యను సర్వులకు బోధించగలరనే ఉద్దేశ్యంతో శ్రీ శివానందులవారు వీరికి చిన్మయానందస్వామి అని నామకరణం చేశారు. చిన్మయానందులవారు స్వామి శివానందుల ప్రేరణపై ఉత్తరకాశీలో గురుకులవాసంలో పూజ్యశ్రీ తపోవన స్వాముల వద్ద మిక్కిలి పట్టుదలతో గీత ఉపనిషత్తులు మొదలైన ఉద్గ్రంథాలను ఆకళింపు జేసుకున్నారు. సామాన్య ప్రజలకు ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని పంచి ఆత్మోన్నతిని ప్రసాదించాలన్న సంకల్పంతో సంపూర్ణ భారతదేశయాత్ర చేయ సంకల్పించారు. 1951 డిశంబరు నెలలో పూణెలోని గణేషుని ఆలయంలో వీరి ఉపన్యాసం జరిగింది. సభవేలాది శ్రోతలతో

క్రిక్కిరిసి పోయింది. వీరి పవిత్ర ఆధ్యాత్మికసేవ బహుముఖంగా విస్తరించింది. వీరు ఆగష్టు 1953న చిన్మయమిషన్ అను సంస్థను స్థాపించారు. వీరి క్రియాశీలక మార్గదర్శకత్వంలో సంస్థ అనుష్ఠానవేదాంత ప్రచారాన్ని ఓ ఉద్యమంగా చేపట్టి ఆధ్యాత్మికజ్ఞాన పునరుజ్జీవనానికి నాంది పల్కింది. ఆధ్యాత్మిక విద్య, సేవాకార్యక్రమాలు విస్తృత స్థాయిలో బహు ముఖంగా విస్తరించాయి. బొంబాయి పట్టణాన్ని ముఖ్య కేంద్రంగా చేసుకుని విశ్వవ్యాప్తంగా దాదాపు 300 శాఖలుగా చిన్మయామిషన్ విస్తరించి ఉంది.

అద్వైతజ్ఞానాన్ని, అనుష్ఠాన వేదాంతాన్ని ఎల్లెడలా వ్యాప్తి చేయుటకు, అధ్యాత్మజ్ఞానం ద్వారా జీవించే కళను పెంపొందింపజేయుటకు, జ్ఞాన యోగ మార్గాన్ని ప్రచారంచేయుటకు, మానవతా విలువలను పెంపొందించుటకు వీరు అవిశ్రాంతంగా కృషిచేశారు. నిస్వార్థసేవ, స్వాధ్యాయం మరియు ధ్యానాభ్యాసానికి పెద్దపీట వేశారు. పరహితాన్ని కాంక్షించి, విశ్వశ్రేయస్సుకై యత్నించి, సత్యదీక్షలో అపార పరిశ్రమతో మహత్తర కార్యనిర్వహణను చేపట్టిన శ్రీ చిన్మయానందస్వాములవారు నిశ్చయముగా కారణజన్ములు మరియు చిరస్మరణీయులు.

(పూజ్యశ్రీ చిన్మయానంద స్వాములవారి శతజయన్తి సందర్భంగా)

వేదాన్తభేరికి ఈక్రింది వారు శాశ్వత చందా పంపినారు

01.	కె.ప్రసాద్ (చీపురపల్లి, విజయనగరం జిల్లా)	రూ.1500/-
02.	జి.చంద్రయ్య (హైద్రాబాద్)	రూ.1200/-
03.	ఎస్.రత్నాకరమ్మ (రామకృష్ణాపురం, హైద్రాబాద్)	రూ.1,116/-
04.	దుక్కిపాటి రాధిక (ప్రసాదంపాడు, విజయవాడ)	రూ.1200/-
05.	కస్తూరి ఆనందరావు (హైద్రాబాద్) మరల	రూ. 500/-

వేదముల ప్రాధాన్యత

- జి.ఎన్. కల్యాణ సుందరం (బెంగుళూరు)

మన భారతీయ సంస్కృతి అతి పురాతనమైనది. ప్రాచీన కాలము నుండి మన దేశము సత్య ధర్మముల పాటించి, సద్భావముల నలవర్చుకొని, సన్మార్గముల పెంచుకొని, సత్కీర్తినిబడసి సగౌరవముగ జీవితమును సాగించి ప్రజాభిమానము నందుకొన్నది. అప్పటి మన పూర్వీకులు మానసికంగా, శారీరకంగా, హృదయ పూర్వకంగా యజ్ఞయాగాదులకెక్కువ ప్రాధాన్యత నిచ్చుచుండెడివారు. వారాచరించు కర్మాచారంబులన్నియూ చిత్తశుద్ధితో, శ్రద్ధాభక్తులతో కూడియుండెడివి. ' చిత్తస్యశుద్ధయే కర్మ. ఆనాటి విప్రోత్తములు వేదపారంగతులై, యజ్ఞయాగాదులందునూ, పూజా పునస్కారాదులందునూ ప్రావీణ్యత నొందియుండిరి. పండితాః సమదర్శినః!. వేదశాస్త్ర పురాణ ఇతిహాసములనభ్యసించి, వాటి ప్రాధాన్యతను గుర్తించి, వారిప్రతిభాశక్తిని జనసమూహమునకు వెల్లడించుచుండిరి. కాని ఈనాటి పరిస్థితి నవలోకించిన మానవుడు ఆధ్యాత్మిక రంగమునందు గాని, పారమార్థిక రంగమందు గాని, వేదశాస్త్ర పురాణాదులందుగాని, ఎలాంటి అభిరుచిని చూపకపోవడం శోచనీయముగ భావించడమైనది. దీనికనుగుణమైన నొక చక్కని వేమన పద్యము గమనించ తగినది.

బాల్యమందు స్వామిభక్తి లేకుండును
యౌవ్వనమున హరుని తలవకుందురు
వార్థకంబునందు వర్ధింపలేరింక
విశ్వదాభిరామ వినుర వేమ ॥

వేదము ప్రకృతి, పరమాత్మ జీవాత్మల గురించి అనేక

సత్యాంశములను తెలియబరచి యున్నది.

'అణోరణీయాన్ మహతో మహీయాన్' వేదములందు ముక్కోటి దేవతల మంత్రము లిమిడి యున్నవి. వేదమంత్రములు అతిశక్తివంతమైనవి. 'అనంతావై వేదాః, వేదమంత్రములు మానవుడి ఆధ్యాత్మిక శక్తిని బలపరచగలదు. వేదపారాయణమొనర్చ నెంచిన పాపపరిహార మొందుటయే కాక నిత్యసత్యమైన దివ్యత్వమును పొందగలిగెదము. వేదమంత్రోచ్చారణ మానవుని రోగనివారణకు తోడ్పడగలదు. వేదమంత్రములుచ్చరించునపుడు అపస్వరములకు చోటివ్వక, స్పష్టముగ, లయబద్ధముగ, క్రమశుద్ధిని పాటించుట గమనించతగినది. ఈ మంత్రములను వేదపండితుల ద్వారానభ్యసించి సక్రమరీతిగ మంత్రోచ్ఛారణ చేయవలెను. వేదపండితు లెల్లరూ సామూహికంగా శృతి తప్పక మంత్రోచ్ఛారణ చేయనెంచిన, వాటి మాధుర్యము చెవులకు విందు చేయక తప్పదు. ప్రాచీనకాలమునుండి వెలువడిన ఈ వేద సంపద ఈ ఆధునిక యుగమునందు కూడ అత్యుత్తమముగ వ్యాపించవలెనన్న మనోభావముతో, మన భారతీయ సంస్కృతి అనేక సాధనాక్రమములను చేబట్టి ప్రజాసమూహము నాకర్షింప జేస్తూంది.

మన దేశమందనేక ప్రాంతములలో వేదపాఠశాలల నేర్పరచి బాలురకు, యువకులకు, వృద్ధులకు వేదమంత్రములను శ్రద్ధాభక్తితో నేర్పించు నాసక్తిని కనబరచు ప్రయత్నములు కొనసాగుచున్నవి. వేదములందనేక శ్లోకములు మంత్రస్వరూపముతో కూడియున్నవి. వీటియందు కొన్ని యజ్ఞయాగాదులకు సంబంధించినవిగ, మరికొన్ని మానవుని కర్మాచారములను, ఆచారవ్యవహారములను తెలియ జేయునవిగా, ఇక కొన్ని దైవాంశ సంభూతమైన పారమార్థిక సందేశములను, ఆధ్యాత్మిక సాధనాక్రమములను విశిదపరచగలవు. ఇంతయే కాక శక్తి

యుతమైన శాంతిదాయకమైన మంత్రములుకూడ ప్రముఖస్థానమా క్రమించి యున్నవి. వేద మంత్రములందు అగ్ని స్వరూపుడైన రుద్రుని జప, తప, హోమ, అభిషేకముల మూలకంగా ఆరాధించు పద్ధతిని రుద్రార్చనగా పరిగణించబడినది. ఓంకార స్వరూపుడైన రుద్రుడు సర్వ దేవతా స్వరూపుడు. అందుచేత ఆ రుద్రునిపై నుచ్చరించు మహామంత్రములు క్రమశుద్ధితో, లయబద్ధకముగ, స్పష్టముగ, అర్థగర్భితముగ నుచ్చరించవలెను. ఇంతకు మించి శ్రీ సూక్తము. పురుష సూక్తము, దుర్గాసూక్తము, దేవీ సూక్తము మొదలగు వేద సూక్తాదులు పండితుల జ్ఞానాభివృద్ధిని పెంపొందింప జేయునవి. దీనికి తోడుగా సంధ్యావందనము. దేవతార్చన, అనేక సుప్రభాత సహస్ర నామాదులు, విశేష పూజా పునస్కారములందు వేద మంత్రముల యుపయోగా వశ్యకత తప్పనిసరిగా కన్పించుచుండును. ఇదిగాక మానవుడు స్వీకరించతగిన బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాది ఆశ్రమంబుల సాధనా క్రమములు వేదమంత్రముల ద్వారా గ్రహించ గలిగెదము.

మన సనాతన హిందూధర్మముద్ధరించ గోరిన, ప్రజల యోగ క్షేమాదులు చక్కబడవలెనన్న, లోక కళ్యాణ మాశించనెంచిన, ఈ ఆధునిక యుగమందు వేదాధ్యయన మొక అత్యవసర సాధనా క్రమముగా నూహించ తగినది.

సద్గురు సర్వ సేవాట్రస్టుకు ఈక్రింది వారు పైకం పంపినారు

01. గుమ్మా బాలయ్య (అన్న పుల్లయ్యపేర భిక్షకునిధి) రూ. 10,000/-
02. డి.వి.ఎస్.సుందరరావు (సౌదీ అరేబియా) రూ. 10,000/-
03. పేటగజేంద్ర (మామ లేట్ హరికృష్ణ పేరిటభిక్షకునిధి)రూ. 15,000/-
04. పుట్టా వెంకటరావు (విశాఖపట్నం) శివాలయానికి రూ. 19,830/-

జీవుడా! మేలుకో!!

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

దేహమే యొక దేవళంబన్నా
దానియందున, ఆత్మదేవుడు వెలయుచుండన్నా
దుర్గుణాలను ధూళినంతను
శ్రద్ధతోను ఊడ్చివైచి
సద్గుణాలను పూలచేతను
ఆత్మదేవుని పూజ సలుపుము
తత్త్వసారము తెలిసికోరన్నా
సద్గురునిచెంత, నిజము గనుగొని లాభమొందన్నా.

ఒకానొక దేవాలయమందుగాని, లేక పుణ్యక్షేత్రమందుగాని, లేక విగ్రహమందు గాని భగవానుడు గలడని విశ్వసించి ధూపదీపములతో, పుష్పములతో దేవుని సేవించుట సామాన్యపూజ. ఈ పూజావిధానము పెక్కుమంది ఎఱిగియే యున్నారు. ఈ ప్రపంచములో విశేషపూజ అనునది కూడ కలదు. ఆ పద్ధతి కూడ జనులు తెలుసుకొని ఆచరించుచుండవలెను. పరాపూజ యందు మనుజుడు గొప్పశాంతిని, సుఖమును అనుభవించగలడు. దేహమే దేవాలయము. జీవుడే అందలి దైవము జపము, తపము, ధ్యానము,ప్రేమ, కరుణ, అహింస, సమత్వము మున్నగు సద్గుణములను పుష్పములతో ఆత్మదేవుని ఆరాధించుటయే, ధ్యానించుటయే, అనుభూత మొనర్చుకొనుటయే విశేషపూజ, పరాపూజ.అహంకారము, దర్పము, హింస, అపకారము మొదలగు దుర్గుణములను ధూళిని శరీరదేవాలయమునుండి ఎప్పటికప్పుడు తొలగించుచు దైవచింతన, సద్గురు ధ్యానము, సచ్ఛాస్త్రపఠనము, నిత్యసంతుష్టి మున్నగు దైవీపుష్పములతో స్వాత్మ భగవానుని పూజింపవలెను. అట్లొనరించుట వలన చిత్త శుద్ధి, జ్ఞానసిద్ధి సంప్రాప్తించగలవు. ముక్తియు లభించును. ఓ జీవుడా ! మేల్కాంచు! ఈ శరీరమే ఒక శివాలయమని, దేవాలయమని దృఢముగ విశ్వసించు. చైతన్యమే, ఆత్మయే భగవానుడని చక్కగ గ్రహించు. సద్గురుని చేరి ఆత్మపూజావిధానమును తెలుసుకో . ఆత్మవిచారణ, ఆత్మధ్యానములను నిరంతరము గావించుచు చిదాత్మస్వరూపుని సాక్షాత్కరించుకో. స్థితప్రజ్ఞుడవై, లోకోపకార పరాయణుడవై, భగవత్కార్యనిరతుడవై పరమానందమనుభవించు. జన్మను సార్థకము గావించుకో.

ఉద్ధవుడు

– శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

భక్తిలో భగవత్సంబంధ భావాలలో సఖ్యం, వాత్సల్యం, మాధుర్యం మొదలగునవి ప్రధానమైనవి. వ్రజభూమిలో ఈమూడింటికి విశేషం వుంది. వీనిలో కూడ మాధుర్యభావం పరమభావం. భగవంతుని సఖ్య, వాత్సల్య భావాలతో పరిచయం లేనివారు ఈ మాధుర్య భావంలో ప్రవేశించలేరు. మధుర భావమంటే – ఆత్మ ఆత్మలో రమించడం. త్రిగుణాతీతమై, ప్రకృతికి అతీతమైన ఆత్మ స్వరూపమే రసం. దాని ఆస్వాదనమే మధుర తీయరసాస్వాదనము. దీన్నే ఉజ్జ్వల రమసమని అంటారు. ఈ ఉజ్జ్వల రసంలో ఐక్యతలో రెండు రకాల అవస్థలు గోచరిస్తూంటాయి.అందు ఒకటి సంయోగం. రెండువియోగం. భగవంతునిలో కలయిక మహాభాగ్యశాలురైన వారికి మాత్రమే లభిస్తుంది.

బృందావనం నుండి మధుర మూడు క్రోసుల దూరంలోనే వుంది. శ్రీకృష్ణుడు అప్పుడప్పుడు అక్కడకు రావాలంటే ఏమంత కష్టం కాదు. లేక గోపికాలయినా కొన్నాళ్లు మధురలో కృష్ణుని దగ్గఱ వుండడాని వెళ్లవచ్చు. అదేమంత కష్టం కాదు. అలా చేసి వుంటే వారి జీవనంలో మాధుర్య భావంలోని వియోగ అవస్థ నెరవేరదు. నిజానికి గోపికలు శ్రీకృష్ణునికి దూరంగా ఎంతమాత్రం లేరు. మరి ఈ వియోగలీల సాధకులకు ఆదర్శం కోసరం జరిగింది. ఇందులోని నీతిని గ్రహించడానికి లేదా దీన్ని విశ్వంలో ప్రకటించడానికి ఉద్ధవుని జీవితం నుండి గ్రహించగల్గుతాము. భవిష్యత్తులో ఇతడు కృష్ణ వియోగంలో సయితం ప్రాణాలతో వుండవలసి వస్తుంది. విశ్వంలో ఇతడు ప్రేమభక్తిని స్థాపించాల్సి వుంది. తద్రహస్యాన్ని అతడు వ్యక్తం చేయవలసి వుంది.

అది సూర్యోదయ సమయం. బృందావనంలో గోపికలు పాలు పితకడం పూర్తి చేశారు. పెరుగును చిలికే సవ్వడులు కూడ సన్నగిల్లాయి.

చెట్లపై పక్షులు కిలకిలారావాలు చేస్తున్నాయి. పక్షి పిల్లలు తమ తోటి వాటితో తమ తమ తల్లులతో ఆడుకొంటున్నాయి. అన్నీ వున్నాయి. కానీ శ్రీకృష్ణుడున్నప్పుడుండిన ప్రకాశం లేదు. ఉత్సాహం లేదు. స్ఫూర్తి లేదు.

గోపికలు యిళ్లనుండి బయటికొచ్చారు. నందుని యింటి ప్రాంగణంలో ఒక సుందర రథం నిలబడి వుంది. దాన్ని చూచారు. శ్రీకృష్ణుడు ఎక్కి వెళ్లిన ఈ రథంలో ఎవరు వచ్చారు ? అన్న కుతూహలం అందరి హృదయాలలో కలిగింది. కృష్ణ నామశ్రవణ మాత్రంలో స్మరణ మాత్రంతో అధికుల కళ్ల నుండి అశ్రువులు ప్రవహించాయి. నిద్రాణమై వున్న వారి మనస్సులు ప్పొంగాయి. ఇపుడెవరిని తీసుకవెడతారో ? ఇక తీసుకెళ్లడానికేముందిక్కడ ? శ్రీ కృష్ణుడు పోతూనే మన ఆత్మలూ వెళ్లాయి. ఇక ఈ రకం తాళాలు మాత్రం మిగిలాయి. వాటిని ఎవరేమి చేసుకొంటారు? మనం శ్రీకృష్ణుని వాళ్లం. వెళ్లుతూ మరలా నేను వస్తానని శ్రీకృష్ణుడు చెప్పనే చెప్పాడు. అతని వాక్యం అసత్యం కాదు. అతను తప్పక వస్తాడు. అంతవరకు మనం సజీవంగా వుండాల్సిందే. అతను మరల వచ్చేటప్పటికి మనం లేకుంటే అతను బాధపడ్తాడు. అందుకనైనా మనం బ్రతుకాలి. ఇది బృందావన గోపికల అభిప్రాయం.

సరిగా అప్పుడే యమునానదిలో స్నానం చేసి వస్తున్న ఉద్ధవుడు వారికి కనిపించాడు. అతణ్ణి చూచేసరికి గోపికలకు ఆశ్చర్యం కలిగింది. అదే శరీరం, అలాంటి (కృష్ణుని లాంటి) భుజాలే, కమలాల వంటి అట్టి కళ్లే, మెడలో అదే కమలహారం. పీతాంబరాన్ని ధరించియున్నాడు. ముఖంలో అట్టి ప్రసన్నతే. కానీ ఇతడు కృష్ణుడు కాడు. కృష్ణుని పోలిన ఇతడు ఎక్కడి నుండి వచ్చాడు ? అతని అనుచరుడే అయి వుంటాడు. మనకోసరం ఇతని ద్వారా ఏమైనా సందేశాన్ని పంపించాడా ? అతనికోసం (కృష్ణునికోసం) మనం విలవిలలాడుతున్నట్లు మనకోసం ఆయన కూడా విలవిలలాడుతుండవచ్చు. ఇతనితో సంభాషిస్తే కృష్ణుని విషయాలు కొన్నైనా తెలుస్తాయి. పదండి అందరం అతని దగ్గఱకు పోదాం అనివారను కుంటుండగానే ఉద్ధవుడే గోపికల దగ్గఱకు వచ్చాడు. **(సశేషం)**

వార్తలు

(01). మాతృశ్రీ దుగ్గిన అనసూయమగారు స్థాపించిన సద్గురు శ్రీ మలయాళస్వామి గీతాప్రచార సమితి స్థానిక శాఖ 28-11-2015 తేది శనివారం కృష్ణాజిల్లా, గన్నవరం మండలం, మర్లపాళెం గ్రామంలో శ్రీ అనసూయమ్మగారి ఆధ్వర్యంలో జరిపిన చాతుర్మాస్యవ్రత పూర్ణాహుతి, లక్ష కుంకుమార్చన సందర్భంగా పూజ్యశ్రీశ్రీశ్రీ విద్యా స్వరూపానందగిరి స్వాములవారు పాల్గొని ప్రవచన చేశారు.

(02). 2-12-2015 తేది బుధవారం తిరుమల ఆస్థానమండపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు మరియు ఆంధ్రప్రదేశ్ ఎండోమెంటు డిపార్టుమెంటు వారి హిందూధర్మ పరిరక్షణ ట్రస్టు కలసి ఏర్పాటు చేసిన ధార్మిక సదస్సులో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు - శ్రీ శుకబ్రహ్మాశ్రమ మఠ పీఠాధిపతులు పాల్గొన్నారు. ఈ సదస్సులో శ్రీ స్వాములవారితోపాటు కంచికామకోటి పీఠాధిపతులు, ఉడిపి పెషావర్ స్వామివారు, మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠాధిపతులు, కుర్తాళం మౌనస్వామిమఠం పీఠాధిపతులు, పుష్పగిరి మఠాధిపతులు, అహోబిలం మఠాధిపతులు, కాకినాడ శ్రీ పీఠం, పీఠాధిపతులు శ్రీరామకృష్ణ మఠం స్వామిజీ వగైరా వివిధ మఠాధిపతులు, పండితులు 60 మంది పాల్గొన్నారు. సనాతన ధర్మరక్షణకు అనేక తీర్మానాలు చేశారు.

(03). గుంటూరు సమీపం నంబూరులోని కాళీవనాశ్రమంలో శ్రీ కాళీవనాశ్రమ స్థాపకులు పూజ్యశ్రీ హనుమత్ కాళీవరప్రసాద బాబూజీ మహరాజ్‌వారి 27వ పుణ్యారాధన 28-11-2015 నుండి 6-1-2015 వరకు జరిగినది. పుణ్యారాధన ఈ ఉత్సవాలలో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు డిశంబరు 3వ తేది నుండి పాల్గొని ప్రవచన చేశారు. ఆశ్రమాధిపతులు పూజ్యశ్రీ శ్రీయోగిని చంద్రకాళీవరప్రసాదమాతాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఆనందప్రదంగా జరిగాయి.

(04). 9-12-2015 తేది బుధవారం శ్రీశుకబ్రహ్మాశ్రమంలో ఆశ్రమ పరిపాలనా సంఘ సమావేశం జరిగినది. అందు పలు తీర్మానాలతోబాటు ఇటీవల గురుసాయుజ్యం చెందిన ఆశ్రమ పరిపాలనాసంఘ సభ్యులు వేగుళ్ల జానకరామయ్య గారికి శ్రద్ధాంజలి ఘటించబడినది.

(05). కేరళ రాష్ట్రం త్రిచూరుజిల్లా సుప్రసిద్ధ క్షేత్రం గురువాయూరు సమీపం ఎన్నండ్యూరులోని శ్రీ వ్యాసాశ్రమ స్థాపకులు సద్గురు శ్రీ మలయాళస్వాములవారి జన్మస్థలంలో సద్గురు శ్రీ మలయాళస్వామి గీతాప్రచారసమితి కృష్ణాజిల్లా, ప.గో.జిల్లా శాఖలలోని కొందరు సభ్య మహిళామణులు, మాతృశ్రీ అనసూయమ్మ గారు కలసి డిశంబర్ 14, 15,16, తేదీలలో మూడు రోజులు అఖండ గీతాపారాయణ, సద్గురు స్వాములవారి పూజ, సద్గురు నామజపం చేశారు. పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు శ్రీ సద్గురు స్వాములవారి విశిష్టతను గురించి ప్రవచన చేశారు.

(06). శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో భక్త కన్నప్ప కంటి ఆసుపత్రిలో నవంబరు మాసంలో ఓ.పి.విభాగంలో **409 మందికి** కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేశారు. **30 మందికి** కంటి పొరలు ఆపరేషన్ చేసి కళ్లలో లెన్సు అమర్చినారు.

విశేషభక్తి

పుష్పములతో భగవంతుని పూజించుట, ధూప దీప నైవేద్యాదులతో సేవించుట, తీర్థయాత్రలు గావించుట మున్నగునవన్నియు సామాన్యభక్తియొక్క లక్షణములు. అది విశేషభక్తికి దారితీయును.

విశేషభక్తివిషయమై శ్రీకృష్ణపరమాత్మ మనోనిగ్రహమును గూర్చియు, చక్కని శీలమును గూర్చియు ప్రవచించెను. ఇరువదియారు సద్గుణములను బోధించి, వానిని గలిగియున్నవాడే తనకు మిక్కిలి ప్రియుడని బాహాటముగ నుడివెను. ఇట్టి సచ్ఛీలము సదాచారము లెన్నగ పొంది యుండుటయే విశేషభక్తి, లేక పరాభక్తి.

– స్వామి విద్యాప్రకాశానంద

వేదాంతభేరి

ఫిబ్రవరి 2016 | రూ. 10/-



తస్మాత్ జాగృత జాగృత



సాధకులారా! మిక్కిలి జాగ్రత్తపడుడు. మీరు చాలాకాలము దృఢవైరాగ్య మవలంభించి గాఢరూపముగా సాధన చేయుచు వచ్చినను సంపూర్ణముగా నవిద్య నశించువరకు ధ్యానాద్యనుష్ఠానములను విడువరాదు. ఏలన జలము లేక తీక్ష్ణమైన యెండచే సొర, గుమ్మడి తీగలు శుష్కించియుండినను, మరల వర్షము గురిసినపుడు ప్రబలముగా పెరుగునట్లున్ను, మంచి యౌషధపథ్యములచే రోగాణువులు సూక్ష్మములై యుండినపుడును, దారుణ రోగము నశించునట్లు తోచినను, మఱల నపథ్యము జేసిన కొన్ని రోజులకు రోగము అభివృద్ధి నొందునట్లున్ను, మీ సాధనబలముచే నవిద్య యణగియుండినను, మఱల నియమపాలనానుష్ఠానము లేకపోయిన నజ్ఞానము అభివృద్ధి నొందును. ఇందువల్లనే కొందరు సంయములయ్యు, నియమ పాలనము లేకపోవుటచే మఱల సంసారములో పడిపోవుచున్నారు. కావున సంపూర్ణముగా వృత్తులు నశించువరకున్ను, జీవన్ముక్తి గలుగువరకున్ను సాధననలను మానకుడు.

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

ॐ వేదాంతభేరి ॐ

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 49 ఫిబ్రవరి 2016 సంచిక : 02

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/– అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పకవ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ వేదాంతభేరి ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 49 ఫిబ్రవరి 2016 సంచిక : 02

విషయ సూచిక

01. ప్రార్థన – 05
02. మోక్షప్రాప్తికి ఉపదేశ చతుష్టయము
– శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు – 06
03. సద్గురూపదేశాలు –శ్రీ సద్గురు మలయాళస్వాములవారు –12
04. సాధన – శ్రీ రామకృష్ణ పరమహంస – 17
05. కథాత్మక గీతా సూక్తులు – ఆచార్య కె. సర్వోత్తమరావు – 19
06. జ్ఞానసుధ – శ్రీ శంకరానందగిరి స్వాములవారు – 22
07. శ్రీ భక్తతుకారాం అభంగవాణి–శ్రీబ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు– 24
08. హరిపాఠము – మిట్టపెల్లె శంకరయ్య – 27
09. అక్కమహాదేవి అనుభవామృతం–శ్రీడా॥కరిబసవరాజేన్ద్ర మహాస్వామి –28
10. శ్రీమద్భగవద్గీతా వైశిష్ట్యము – ఆచార్య జక్కంపూడి మునిరత్నం – 30
11. అంతరంగంలో నిక్షిప్తంగా వున్న వాసనల్ని నాశనం చేయండి –శ్రీచిదానంద సరస్వతి– 35
12. జీవితం – పరమార్థం – డా॥ సముద్రాల లక్ష్మయ్య – 37
13. భగవంతుడు చూచేది హృదయాన్ని – సి. వెంకటశేషయ్య – 41
14. వార్తలు – 42

ముఖచిత్రం : శ్రీరామకృష్ణ పరమహంస

19–02–2016 తేది శుక్రవారం
శ్రీరామకృష్ణ పరమహంస జయన్తి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

ఓం నమో భగవతే శ్రీరామకృష్ణాయ,
ఓం స్థాపకాయ చ ధర్మస్య సర్వధర్మ స్వరూపిణే ।
అవతారవరిష్ఠాయ శ్రీరామకృష్ణాయ తే నమః
ఓం హ్రీం ఋతం త్వమచలో గుణజిద్గుణేడ్యః ।
నక్తం దివం సకరుణం తవ పాదపద్మమ్ ।
మోహంకషం బహుకృతం న భజే యతో2హం
తస్మా త్త్వమేవ శరణం మమ దీనబన్ధో ॥
ఓం తేజస్తరన్తి తరసా త్వయి తృప్తతృష్ణాః
రాగేకృతే ఋతపథే త్వయి రామకృష్ణే ।
మర్త్యామృతం తవ పదం మరణోర్మినాశం
తస్మాత్త్వమేవ శరణం మమ దీనబన్ధో ॥
ఓం కృత్యం కరోతి కలుషం కుహకాన్తకారి
ష్ణాం తం శివం సువిమలం తవనామ నాథ ।
యస్మాదహం త్వ శరణో జగదేకగమ్య
తస్మాత్త్వమేవ శరణం మమ దీనబన్ధో ॥
ఓం భక్తి ర్భగశ్చ భజనం భవభేదకారి
గచ్ఛన్త్యలం సువిపులం గమనాయ తత్త్వమ్ ।
వక్త్రో ద్ధృతోపి హృదిమే న చ భాతి కించిత్
తస్మాత్త్వమేవ శరణం మమ దీనబన్ధో ॥
ఓం పవిత్రం చరితం యస్యాః పవిత్రం చరణం తథా ।
పవిత్రతా స్వరూపిణ్యై శారదాయై నమో నమః ॥
ఓం నమస్తే యతిరాజాయ వివేకానన్ద సూరయే ।
సచ్చిత్సుఖస్వరూపాయ స్వామినే తాపహారిణే ॥



మోక్షప్రాప్తికై ఉపదేశ చతుష్టయము

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

మోక్షప్రాప్తికై వేదశాస్త్రాదులందు మహర్షులు కావించిన సద్బోధనంతను నాలుగు చక్కని వాక్యములలో ఇమిడ్చి చెప్పవచ్చును. ఆ మహోన్నత ఆదేశములనే ఇంగ్లీషు భాషలో F4 అని అందురు. అవి యేవి యనిన –

Follow the master
Face the devil
Fight to the end
Finish the game

వీని యర్థము :–

సద్గురువును ఆశ్రయింపుము
మాయను ఎదుర్కొనుము
చివరివఱకు పోరాడుము
జగన్నాటకమును అంత మొనర్చుకొనుము.

తరింపనెంచు పరమార్థ సాధకునకు ఈ నాలుగు ఆదేశములు చాలును. వీనిని జ్ఞప్తియందుంచుకొని, తదనురీతిగ అనుష్ఠించినచో అతడు గట్టెక్కిపోగలడు. లేనిచో ఈ దుర్భర సంసార దావానలమున తగుల్కొని ఇంకెంతయో కాలము దుఃఖజాల మనుభవింపవలసియుండును.

1. సద్గురువును ఆశ్రయింపుము :

అనునది వీనిలో మొదటి ఆదేశము. కోట్లకొలది జన్మలు ఈ సంసారఘటీ యంత్రమున తిరుగాడి పుట్టుచు, చచ్చుచు ఏదియో సుకృత వశమున ఒకింత వివేకము జనింప మనుజుడు " ఇది యేమి

విచిత్రము ! ఈ శరీరమేమి? ఈ ప్రకారము కలకాలము జరుగ వలసినదేనా? ఈ దుస్సహ యాతనాపరంపరను నిలుపుదల చేయుట కేదైన ఉపాయము కలదా ? " అని ఆలోచింపదొడంగును. దీనినే 'శుభేచ్ఛ' యందురు. ఇది సప్తజ్ఞాన భూమికలలో మొదటిది. బహుజన్మ పుణ్య విశేషముచేతనే ఇట్టి వివేకము జనులయందుదయించును.

ఈ ప్రకారముగ వివేకోదయము కలిగినపుడు అతడు చేయవలసిన మొట్టమొదటి పని సద్గురువును వెతకుకొనుట. 'ప్రేక్ష్యే2హం శాస్త్రసజ్జనైః' అనునట్లు వైరాగ్యోదయ కాలమున మనుజుడు తనకు దారిచూపు వారెవరా యని పరితపించుచు, 'మహాత్ములను సందర్శించి నా యభీష్టమును వారికి తెలిపి అంధకారమున ఒకింత వెలుగును సంపాదించుకొందును ' అని నిశ్చయించి పరిశీలించు చుండును. జీవితములో ఇదియొక గొప్ప పరిణామము (Turning Point). ఇక్కడ నుండియే వాని జీవితము ఒక మలుపు తిరుగును. ఇంతవఱకును గడపిన కోటానుకోట్ల సంవత్సరముల అసురజీవితము ఒకరకము. ఇక ఇపుడు గడుపనున్న దివ్య జీవితము మఱియొకరకము. ఈ రెండింటికిని పొత్తు ఉండదు. ఏ ప్రాపంచిక సంపదలను నమ్ముకొని ఇంతవఱకు అతడు తన జీవితమును గడపెనో, ఏ విషయ భోగములే సర్వస్వమని భావించి, అవియే తన యేడుగడయని నమ్మియుండెనో, ఏ విషయానందమును జూచి ' ఇంతకుమించిన సౌఖ్యము మఱియొకటి ముల్లోకములందును లేద'ని భావించెనో, అట్టి ఇంద్రియసుఖములే వైరాగ్యోదయకాలమున వెలవెలబోవ, నీరసింప, వానిపై విరక్తి జనించును. విషయ సుఖములే అహర్నిశము అనుభవించుచుపోయిన ఇక పశువులకును తనకును భేదమేమి యను విపత్కరమపుడు వానియందు ఉదయించును.

అత్తఱి జీవితనౌకను అతడు నూతన మార్గమునకు మళ్ళించు కొనును. దక్షిణాయనమున నున్నవాడు ఉత్తరాయనమునకు మఱలును. అసురసంపదలో మునిగియున్నవాడు క్రమముగ దైవసంపదను

చేకూర్చుకొనదొడగును. అట్టి శుభలగ్నముననే మనుజుడు గుర్వన్వేషణ ప్రారంభించును. పుణ్యము ఫలించినపుడు మాత్రమే జీవునకు సద్గురువు లభించును. సద్గురువుగాని, సచ్ఛాస్త్రముగాని, సద్బోధగాని ఎవరికైన లభించినచో అది బహుజన్మ పుణ్య ఫలమని, భగవత్కృపా కటాక్షలబ్ధమని నిశ్చయించుకొనవలెను.

గురువు లభించిన మీదట వారు కావించు ఆదేశమును శిరసావహించి తదనురీతిగ అనుష్ఠించుటకై ముముక్షువు తీవ్రతరయత్నము కావింపవలెను. శ్రద్ధాభక్తులతో, పరిపూర్ణ విశ్వాసముతో గురువాక్యమును, శాస్త్ర వాక్యమును పరిపాలించవలెను. Follow the Master సద్గురువును ఆశ్రయించుము, అనుసరించుము – అను ప్రథమోపదేశము యొక్క అర్థమిదియే.

అధ్యాత్మవిద్య అనుభవైకవేద్యమగు శాస్త్రము (Practical Science) అయియున్నది. ఒక చిన్న ఉపదేశమును జిజ్ఞాసువు కొన్ని సంవత్సరముల పర్యంతము సాధన చేయవలసియుండును. మార్గమధ్యమున అనేక సంశయము లుదయించుటచేతను, అనేక వితర్కములు జనించుట చేతను ఈ విద్యను సాధింపదలచువాడు అనుభవజ్ఞుడైన వ్యక్తినే ఆశ్రయించుట సముచితము. మహర్షులందఱును అట్టి అనుభవజ్ఞులైన సద్గురువులే. కనుకనే వారు బోధించిన, రచించిన శాస్త్రములన్నియు సాధకునకు పరమ ప్రమాణములై యొప్పుచున్నవి. గురోర్గురువై, జగద్గురువైనట్టి శ్రీకృష్ణపరమాత్మ బోధించిన గీతాశాస్త్రము అట్లే వ్యాసమహర్షి, శంకరాచార్యులు మున్నగు మహనీయులు కావించిన సద్బోధలు ముముక్షువులకు అత్యంత శిరోధార్యములై, అనుసరణీయములై యున్నవి. ఈ ప్రకారము పూర్వకాలిక గురుసత్తముల పైనను, వారు బోధించిన సచ్ఛాస్త్రముల పైనను అకుంఠిత విశ్వాసముగలిగి సాధకుడు వానిని అనుసరించుచు జీవితమును ఆధ్యాత్మికముగ పరిణత మొనర్చుకొవలెను. గురుసేవ, గురువాక్యానుసరణము – ఈ రెండును

సాధకునకు అత్యావశ్యకములని ఎన్నటికిని మఱువరాదు.

తాను గొప్పవాడనియు, సమస్తము తనకు తెలియుననియు తలంచి శిష్యుడు ఏకాలమందును అహంకరించరాదు. ఒకరియొద్ద తనతల వంగినపుడే ప్రపంచమంతయు తన యొద్ద తలవంచును. ఈ సూత్రమును జ్ఞప్తి యందుంచుకొని ముముక్షువు భగవంతుని యెడల, సద్గురువుల యెడల, పెద్దల యెడల వినయవిధేయతలు గలిగి, వారి వాక్యములను అకుంఠిత శ్రద్ధతో పరిశీలించుచు, జీవితమునందు గొప్ప పరిణామమును సాధించవలెను. మోక్షప్రాప్తి కిదియే ఏకైక మార్గము. ఈప్రకారము సద్గురు సమాశ్రయము మానవుని బంధ విముక్తికి అత్యావశ్యకమై యున్నది.

ప్రపంచములో గురువులు దొఱకవచ్చును గాని సద్గురువులు దొఱకుట చాల దుర్లభము. శిష్యులను సద్వస్తువగు ఆత్మయొద్దకు చేర్చువాడే సద్గురువు. సచ్ఛీలమును వాక్కునందేగాక అనుష్ఠానమునందును దిగ్దర్శన మొనర్చువాడే సద్గురువు. శిష్యుల అజ్ఞానాంధకారమును రూపుమాపి జ్ఞానాలోకమును వారికి ప్రసాదించువాడే సద్గురువు. కావున అట్టి యోగ్యతలుగలవాడు సహజముగనే జనులలో చాల అరుదుగా నుందురు. భగవానుడు ఎన్నుకొనిన ఏ కొలదిమంది మహనీయులో అట్టి సద్గురు పీఠ మలంకరించి లోకములో విరాజిల్లుచుందురు.

అట్టి మహనీయుల జీవితము వాస్తవముగ ప్రజలకు వసంత సదృశముగనే యుండును. ఆధ్యాత్మిక విషయములందు పండిన యనుభవము గల మహనీయులగుటవలనను, పారమార్థిక సూత్రము లన్నియు వారికి కాచి వడబోసినవే అయియుండుటవలనను, భక్తులకు వారి సాన్నిధ్యమందు నిగూఢ దైవతత్త్వావగాహనము సులభతర మనిపించుచుండును. బ్రహ్మజ్ఞానము పుస్తకము నుండి గ్రహింపదగిన విద్య కాదు. హృదయము నుండి ప్రవహించవలసిన అనుభవమిది. బ్రహ్మానుభూతి నొందిన సద్గురుని హృదయ క్షేత్రము నుండి పొంగి పొరలి అధికారియగు సచ్ఛిష్యుని హృదయసీమయందు దొరలునట్టిదియే బ్రహ్మజ్ఞానము. కావున

నిర్మలచరిత్ర ద్వారా తమ తమ హృదయ స్థానములను పునీతమొనర్చుకొనిన భక్తకోటి యంతయు అట్టి మహాత్ములు వర్షించు బ్రహ్మజ్ఞానామృతమును గ్రహించి, అనుష్ఠించి, అనుభూత మొనర్చుకొని, జన్మసార్థక మొనర్చుకొందురు. మహాత్ముల దివ్యావతరణముచే గలుగు పరమలాభమిదియే.

మహనీయులగు సద్గురువులు తమ జీవితకాలమంతయును అనుష్ఠానమును గూర్చియే ఎక్కువగ నొక్కి చెప్పుచుందురు. వారు స్వతః అట్లాచరించుచుందురు. కనుకనే ఆ యనుష్ఠానముపై వారికంత నమ్మకము ఏర్పడును. 1. గురువు, 2.దైవము, 3.అనుష్ఠానము అను మూడింటిని ఏకాలమందును విస్మరించ రాదనియు, అట్లు విస్మరించనందువలననే తమ కెంతయో శాంతి జీవితమునందు లభించినదనియు వారు చెప్పుచుందురు. కావున వారి జీవితము నుండి మొట్టమొదట గ్రహింపదగిన మహాపాఠ మిదియే – ' అనుష్ఠానము నెన్నడును మఱువరాదు '. ప్రతిదినమున్ను ప్రతివారును నియమపూర్వకముగ భోజన మెట్లాచరించుచున్నారో, అట్లే దైవధ్యానమున్ను నియమపూర్వకముగ చేయవలయుననుట వారి బోధనలలో ప్రముఖమైనది. ఈ చిన్న నియమమే సక్రమముగ నాచరింపబడుచో అదియే సాధకుని మెల్లమెల్లగ మహోన్నత ఆధ్యాత్మిక శిఖరములకు గొనిపోగలదని వారి విశ్వాసము.

ప్రతి ప్రాణియందును గొప్ప గొప్ప శక్తులు విరాజిల్లు చున్నవి. అయ్యవి నిగూఢములుగ నుండుట వలన ఎవరికిని వానియొక్క పరిచయము కలుగుట లేదు. నిదురించుచున్న కుండలినీశక్తి యోగాభ్యాసముచే ఏ ప్రకారము పైకిలేచునో, ఆ ప్రకారవే మానవునియందంతర్లీనములై యున్న దివ్యపారమార్థిక శక్తులు అతని సత్ప్రయత్నముచే లెస్సగ ప్రస్ఫుటములు కాగలవు. బంగారము ఇతర లోహములతో గూడి యుండినపుడు దానికేమంత విలువయుండదు. కాని, బాగుగ ప్రస్ఫుటము గావింపబడి మేలిమిగా మారునపుడు దానికి గొప్ప విలువ యేర్పడుచుండును. అట్లే

అజ్ఞానపరివేష్టితుడై, అసురగుణాభిభూతుడై, అపవిత్ర హృదయుడై యుండునపుడు జీవునకు విలువ యుండదు. అతని నెవరును లెక్క చేయరు. అయినను అంతమాత్రముచేత నతడు నిర్లక్ష్యము చేయదగిన వాడు కాడు. ఏలయనిన, అతనియందు పవిత్రాత్మ యుండియే యున్నది. దానిని వ్యక్తమొనర్చవలెను. సత్సాంగత్యముచేతను, మహనీయుల సద్బోధల చేతను అట్టి ఆత్మస్థితి తప్పక చేకూరగలదు. అత్తరి యింతదనుక ఎంతయో నీచుడుగ పరిగణింపబడువాడు సంఘమున సర్వోత్తముడుగ గణుతికెక్కును. కావున పాపము చెడ్డది, కాని పాపి చెడ్డవాడు కాడు. పాపి ఏనాటికైనను పుణ్యాత్ముడు కాగలడు. ప్రయత్నాతిశయముచే మానవుడు మాధవుడు కాగలడు. పశువు పశుపతి కాగలడు. ఈ సత్యమునే సద్గురువులు తమ జీవితమందు పదే పదే ఉద్ఘాటించుచుందురు. కాబట్టి ప్రతి జీవియు తన నికృష్టస్థితిని జూచి నిరుత్సాహము జెందక, హృదయమును చక్కగ పరిశోధించుకొని, అసుర గుణములు, దుస్సంకల్పములు, దుర్వాసనలు తమయం దేవైన యుండిన వానిని సమూలముగా తొలగించి వేసి, దైవసముడే కాదు, దైవమే అయి శోభిల్లవలెను. ఈ ప్రకారముగ అల్పుడు మహాత్ముడు కాగల్గు సదవకాశమును శాస్త్రములు జీవుల కొసంగియున్నవి. కావున ప్రతిజీవియు తన హృదయమును చక్కగ వికసింపజేసికొని జీవిత పరమావధియగు స్వస్వరూప (ఆత్మ) సాక్షాత్కారమును బడసి ధన్యుడు కావలయును.

ఈ ప్రకారములైన సర్వజీవ సంతారణరూపములగు మహత్తర సద్బోధలను మహనీయులగు సద్గురువులు కావించుచు జనుల కుత్తేజమును గలిగించుచుందురు. వారి ద్వారా ఎందఱో సామాన్య జనులు ముముక్షువు లగుదురు. ఎందఱో ముముక్షువులు ముక్తులగుదురు. శుష్కవేదాంత తమో జాలమును ప్రజల హృదయ వీథుల నుండి దూరీకరించుటకు వారు కంకణము కట్టుకొందురు. అట్టి సద్గురువులను వెతకి వెతకి సంపాదించి చిత్తశుద్ధితో వారి సేవ చేసి వారు బోధించు మోక్షమార్గమును చక్కగ అనుసరించి బ్రహ్మ విద్యను బడసి జీవితమును కృతార్థ మొనర్చుకొనవలెను.

సద్గురూపదేశాలు

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

ప్రతిదినము ఏలాగున వ్యాపారమందు నిపుణత గలవాడు రాత్రి దుకాణమును మూయునప్పుడు ఆదాయ వ్యయములను చూచుచుండునో, అలాగున సాధకుడు ప్రతిదినమును రాత్రి పండుకొనుటకు ముందుగా తన యొక్క దినచర్యము వ్రాయుచు రావలయును. మరల సదా దైవభావములో నిలుచుకొని యే పనియైన చేయుచు దైవభావమును మరచిపోయెడు సమయమును గూడ ప్రతి దినమును కనిపెట్టి అదిన్ని డైరిలో వ్రాయవలయును. ఇట్లుండు వారు తప్పక త్వరలో దుఃఖములనన్నిటిని తొలగించుకొని మంచి బ్రహ్మనిష్ఠగలవారగుదురు. సాధలన్నిటిలోను ఇది శ్రేష్ఠమైనది. అయితే యీ దినచర్యలో ఆత్మవంచకమైన పని చేయరాదు. ఆదాయ వ్యయములను లెక్కచూడని వ్యాపారి యేలాగున దివాలైపోవునో అలాగున మనోవృత్తులను పరిశీలింపని సాధకుని కపాయము గల్గవచ్చును.

* * *

ధ్యానము నాలుగు విధములు (1) తనయందొక విధమగు తేజోరూపమును భావించుట, దీనిచే తనయందున్న పాపము రహితమగును. (2) తనయందున్న తేజోరూపము (ఆత్మ) సర్వభూతములయదున్నదని భావించుట, ఇందుచే రాగద్వేషరహితమగు సమత్వ మేర్పడును. (3). ఈ నడుపబడు ప్రకృతితో గూడ సర్వమును ఈశ్వర మహిమయనియే భావించుట. ఇది మిక్కిలి విశాల భావము. దీనిచే భేద రహిత స్థితి చేకూరును. (4), ఇది తురీయము, ధ్యేయము. దీనియందేకము గోచరించును. అంతయు, తానుగాక మరియొక వస్తువే తోచకుండుట. దీనికి తురీయాతీతమని గూడ పేరు గలదు. కట్టకడకు పై చెప్పి మువ్వురును ఈ నాల్గవస్థానమునకు క్రమక్రమముగా రావలసియుందురు. అపుడే

పరిపూర్ణావస్థను బొందగలరు.

*　　　*　　　*

ముముక్షువులారా ! మీరు ఎంత ధ్యానముగాని, జపము గాని, యోగసాధనలు గాని అభ్యసించుచుండినను వేదాంత విద్యాపఠనమును మాత్రము చేయుచుండవలయును. అది లేనిచో బుద్ధి వికసించదు. విశాల భావమున్ను గలుగదు. ఆత్మస్వరూప నిర్ణయమును సిద్ధించదు. ఋషుల మార్గమున్ను గోచరించదు. ఏలన ధ్యానములోగాని, జపములోగాని, ఆసన ప్రాణాయామాదుల యందుగాని, కీర్తనాదులు యందుగాని, బుద్ధికి పని యేమియు కలుగదు. ఆత్మ విచారణ శాస్త్ర చింతనయందు మాత్రమే బుద్ధికి పని తగులుచుండును. అపుడు బుద్ధి జాగ్రదవస్థలోనికి వచ్చును. పై చెప్పిన జపయోగాదులన్నియు అపుడు బుద్ధియొక్క ఏకాగ్రతకున్ను, నిర్మలత్వమునకున్ను, జాగ్రత్తకున్ను ఉపయోగపడును. అత్తరి నిద్రలో నుండు మహాపండితునివలె బుద్ధి జడావస్థను పొందియుండును. ఆత్మ విద్యావిచారణ జ్ఞానములచే నిద్ర నుండి మేల్కొనిన విద్వాంసునివలెను, సార్వభౌమునివలెను ఆత్మస్వరూపజ్ఞానము కలుగును. వర్తమానకాలమున్ను పరలోక జీవితమున్ను, భావిజన్మమున్నూ మన అరచేతిలో యుంటున్నవి. ఈ మూడింటిని మనము ఇపుడే పావన మొనర్చవలయును. లేక మానజన్మము గలుగనిస్థితి, మోక్షస్థితిని గూడ కలుగచేసికొనవచ్చును. ఇదే ముముక్షువుల యొక్కయు ముఖ్యకర్తవ్యమని మఱువకూడదు. దొరికిన మాత్రమే గురుకుల వాసము కావలయునని గ్రహించవలయును. శ్రేష్ఠులైన గురువులు దొరికిన మాత్రమే గురుకుల వాసము చేసిన చాలును. లేనిచో స్వప్రయత్నపరులై యుండుటయే బాగు. పరిశ్రమపరులు కానిచో ఎవరున్ను పవిత్రులు గాజాలరను తత్త్వమెల్లప్పుడున్ను మనస్సులో యుంచి జీవించవలయును. లోకములో పావనులైనవారి చరిత్రమే దీనికి సాధ్యము, సోమరితనమున కన్న మించిన పెనుభూతము జగతిలో మఱియొకటి లేదని మఱువకుడు. ఈ సోమరి పెనుభూతము యొక్క సోదరుడే అభిమానము. వీరుభయులు చేరినచో, దయ్యముపట్టిన వారికిన్ని, మతిచెడినవారికిన్ని ఎట్టి గతి కలుగునో వారియొక్క జన్మమున్ను ఆలాగుననే

యుండును.

*　　　*　　　*

ఋణస్థుడైనవాడు ఋణమును తీర్చవలయునని తలంపు గలిగియుండిన ఏలాగున క్రొత్త ఋణము చేయక పాతఋణమును కొంచము కొంచముగా తీర్చుకొనుచు వచ్చినచో – క్రమముగా ఋణవిమోచనము కల్గునో, ఆలాగున సాధకుడు తన హృదయములో గల పాతవృత్తుల నొక్కక్కటిని రహిత మొనర్చుకొని క్రొత్త తలంపులను రానియ్యక దైవభావములలో సదా నిలుచుకొని వచ్చేలాగున మంచి ప్రయత్నము చేసికొని వచ్చినచో కొలదికాలములో మోక్షమును గలుగజేసికొనవచ్చును.

*　　　*　　　*

జనులారా ! కర్షకుల వ్యవసాయసమయ మెటువంటిదో మీ యొక్క అభ్యాసకాలమున్ను అటువంటిదే లేక మీ యొక్క యౌవనారంభమున్నూ అట్టిదని గ్రహించుకొనవలయును. సంవత్సర జీవిత సుఖమంతయు కృషి చేసెడు కాలమున యెట్లుండునో, ఆలాగున మీ యొక్క జీవిత సౌఖ్యమంతయు, జీవన్ముక్తియు అట్టి కాలముననే యుండునని మఱువకుడు. విత్తనము వేయుట, నారునాటుట, మొదలగు పనులు చేయు సమయమున యేలాగున వ్యవసాయదారులు నిద్రయు, భోజనమును గూడ లక్ష్యము చేయక సేద్యపు పనిలోనే కాలము గడుపుచుందురో, అపుడొక నిమిషమైనను సమయమును యెట్లు వ్యర్థపుచ్చరో, ఇతర కార్యములన్నిటిని యెట్లు నిలిపివేయుదురో, ఆలాగున మీరును అభ్యాసకాలమున నిద్రాహారాదులను గూడ లక్ష్యపెట్టక, ధ్యానములోను, విద్యాభ్యాసము నందును, గురుసేవ యందును, వ్రతనిష్ఠలోను, పుణ్యకర్మానుష్ఠానములోను కాలము పూర్తిగ వినియోగపరచవలయును. వ్యవసాయ కాలమున వానకున్నూ, చలికిన్ని, యెండలకున్నూ భయపడి, భోజనమునకును, నిద్రకున్నూ, లోబడి అప్పటి కాలమున పరిశ్రమ చేయక గడిపినచో ఆ సంవత్సరము జీవితమంతయు యేలాగున దుఃఖముతోను, భోజనాదులు లేకయు గడుపవలసియుండునో,

ఆలాగున యౌవనారంభమునగాని, విద్యాభ్యాస సమయమునగాని, అనుష్ఠానకాలమునగాని, మీరు శీతోష్ణముల సహింపనిచో, నిద్రాహారాదులను జయింపనిచో, మీ జీవిత మంతయు దుఃఖ భూయిష్ఠము గాను, క్లేశపూరితము గాను గడుపవలసియుండును. జీవిత మంతయు మాత్రమే కాదు, పరలోకమున కూడ వ్యథలనను భవింపవలసియుండును. పరలోకము మాత్రముగాదు, భావిజన్మము సహా దుఃఖరూపముగానే యుండును తత్త్వము మఱువకుడు.

* * *

లోకములో కొన్ని మతములవారు 'అనన్యభక్తి యనగా తమ గురుధ్యానము, తమ మత గ్రంథమును తప్ప పరమతగ్రంథమును చదువుట గాని పరగురువాక్యములను వినుటగాని లేకుండుటేయని చెప్పుదురు. ఇది చాల సంకుచిత బుద్ధి. సర్వ చరాచర ప్రపంచమంతట తన స్వరూపమును చూచుటే అనన్యభక్తి. **అనేకత్వములో ఏకత్వమును సదాచూచుటే అనన్యభక్తి.** 'సూత్రే మణిగణా ఇవ ' అని భగవానుడు చెప్పియున్న సత్యమిదియే. లభించిన దానితో తృప్తి నొంద యితరచింతలు లేక సర్వమును పరమేశ్వరుని యందు లీనము చేయుటే అనన్యభక్తి. **చివరకు పరమాత్మయే తనయాత్మ గాను, తనకు మినహా మరియొకటి లేదు అను అపరోక్షాను భూతిని సంపూర్ణముగా కల్గియుండుటయే నిజమైన అనన్యభక్తి.**

అతిథి

అతిథియనగా పదిమైళ్ళ నుండి వచ్చిన వాడుగ నుండవలెను. ధనాదులు లేనివాడుగ నుండవలెను. పూర్వము రానివాడుగ నుండవలెను. బ్రహ్మనిష్ఠగలవాడుగ నుండవలెను. భుజించిన రోజుననే వెళ్ళువాడుగ నుండవలెను. ధర్మబోధకుడుగ నుండవలెను. అట్టి అ తిథికి భిక్ష యిచ్చిన వారిని పరమేశ్వరుడు అనుగ్రహించును. అతిథియనగా ఆతిథియందు వచ్చి. అదే తిథి యందు వెళ్ళువాడుగాను, ఏ తిథియందు రానివాడుగా నుండవలయును. అట్టి వారికి భిక్ష నివ్వనియెడల వారిదివరలో చేసిన పుణ్యము అతిథి వెంటనే వెళ్ళి పోవును. అట్టి అతిథులకు జాగ్రత్తగా దైవభావముతో

వడ్డించవలయును. లౌకిక భావములు కలిగి మాట్లాడుచు భుజించినచో రాక్షసాహారమై ఆయాభావములుగా వారి మనస్సు మారిపోవును. కనుక ఈ ధర్మము సర్వులు నెరుంగవలెను.

* * *

అన్నమయ కోశములో నివసించువారు మృగప్రాయులు. వారు శరీరమును మాత్రమే చూచుకొందురు. ప్రాణమయకోశములో ఉండువారు సగము మృగత్వము, సగము మానవత్వము కలిగి ఉందురు. మనోమయకోశమును చెందియుండువారు పూర్ణమానవత్వమును పొందుదురు.

సామాన్యముగా గృహస్థాశ్రమములో ధర్మబద్ధముగా గడుపుచు మనస్సును నిగ్రహింప యత్నించుదురు గాని నిగ్రహింపలేరు. విజ్ఞానమయ కోశమును చేరుసరికి సగము మానవత్వము, సగము దేవత్వము సంప్రాప్త మగును. మనసు కొంత వశమై బుద్ధిరాజ్యము జరుగుచుండును. గృహస్థాశ్రమములో ఉన్నకొంత శ్రద్ధమాత్రమే దాని యందుండి మిగతా శ్రద్ధ అధ్యాత్మ విషయములందు గడుపును, సగము ధనము కుటుంబమునకు, సగము దైవకార్యములకు ఖర్చు పెట్టును. ఆనందమయకోశము పూర్ణదేవత్వము, వాడు ఎల్లప్పుడు దైవకార్యములే చేయును. వానికి దుఃఖములు పోవును. అతడు ఆత్మరాజ్యములోనికి వెళ్ళును. వ్యష్టికి సాక్షిగా ఉండును. దైవగుణములన్ని అవలంబించుచు సత్త్వగుణ ప్రధానుడై, సత్సంకల్పములు మాత్రమే కలిగియుండును. ఆనందమయకోశము కూడా కోశమే కాని అది శుద్ధకోశము, పూర్ణముగా ఆత్మసాక్షికాదు. అదికూడా దాటినప్పుడు పూర్ణ ఆత్మస్థితి కలుగును. అప్పుడు సమష్టికి సాక్షిగా నుండును, సత్సంకల్పము కూడా తొలగును, పరమశాంతి. త్రిగుణములు పోవును. ఇది జీవం పోయి శివం అయిన స్థానం కలుగును, కాని యీస్థితిలో అన్ని క్షేత్రములలో ఉన్న క్షేత్రజ్ఞుడు అని భావము ఉన్నది. సమష్టి అనునది ఒకటి. అందుకు సాక్షి ఒకటి. రెండూ ఒకటే అను అవస్థలోనుండు వారే పరబ్రహ్మస్థాన మందుండువారు.

సాధన

– శ్రీ రామకృష్ణ పరమహంస

లోతులేని చెరువు నుంచి పరిశుభ్రమైన నీటిని తీసుకొని త్రాగాలంటే నీళ్లను కదలకుండా, జాగ్రత్తగా మెల్లగా పై భాగం నుంచి తీసుకోవాలి. కదిపితే అడుగున గల బురద పైకొచ్చి నీళ్లనంతా మలినపరుస్తుంది. నువ్వు పరిశుద్ధుడవు కాదలిస్తే నీ శక్తి సామర్థ్యాలను నిరుపయోగమైన చర్చలలో, వాగ్వాదాలలో వ్యర్థం చేయకుండా ధృఢవిశ్వాసంతో క్రమంగా సాధన సాగించు.లేని పక్షంలో (అలా సాధన చేయకపోతే) నీ అల్పబుద్ధి కలవర పెడుతుంది.

కార్యసిద్ధికి అనువైన మార్గాన్ని అవలంబించు “ పాలలో వెన్న వుంది” అని గొంతు బొంగురుపోయేటట్లు ఎంత అరచినా వెన్న లభించదు.

నీకు వెన్న కావలసి వస్తే పాలను తోడుపెట్టి పెరుగు చెయ్యాలి. పెరుగును చిలకాలి. అప్పుడు వెన్న లభిస్తుంది. అలాగే దేవుడు నీకు ప్రత్యక్షం కావాలనుకుంటే శ్రద్ధా భక్తులతో సాధన చేయాలి. అంతేగాని ఊరకే “ దేవుడా! దేవుడా ! ” అంటూ అరిస్తే ఏం ప్రయోజనం ?

నగరులోకి పోయి రాజదర్శనం చెయ్యగోరే వ్యక్తి అక్కడికి వెళ్లి ద్వారాలన్నిటిని దాటాలి. అలాగాక బైటి కోటగుమ్మం దాటగానే, “రాజుగారెక్కడ?” అని అడిగితే, రాజు కనబడదు. సప్తద్వారాలను దాటితేగాని రాజును దర్శించలేడు.

సాక్షాత్కారం కావాలంటే సాధన చేసి తీరాలి. ఒకరోజు నేను భావ సమాధి స్థితిలో వుండగా హలధరపుష్కరంలో ఒక పల్లెటూరి వ్యక్తి నీటి మీద నాచును తొలగించి నీటిని పుడిసిబట్టి మళ్లా మళ్లా పరీక్షించటం నా కళ్లబడింది. నాచుని తొలగించనిదే భగవంతుడిలో నిర్మల భక్తీ ఆయన సాక్షాత్కారమూ కలుగవని తెలుపటానికో అన్నట్లుగా జగజ్జనని ఆ దృశ్యాన్ని చూపించింది. ధ్యానం, నామస్మరణం, సంకీర్తనం, ప్రార్థన, దానధర్మయజ్ఞ యాగాచరణం మొదలైన సత్కార్యాలు భగవత్ప్రాప్తిని కలిగిస్తాయి.

చేపలను పట్టుకోవాలనే వాడు ఒక గుంటలో మంచి చేపలు దొరుతాయో లేదో తెలుసుకోటానికై దాన్లో యిదివరకు చేపలను పట్టిన వారి వద్దకు వెళ్లి ఆతురతతో యిలా అడుగుతాడు. “ ఫలానా గుంటలో పెద్ద పెద్ద చేపలు దొరకటం నిజమేనా ? వాటిని పట్టటానికి ఎలాటి ఎరవెయ్యాలి ? ” కావలసిన సమాచారం వారి వల్ల తెలుసుకొని పరికరాలతో గుంటవద్ద కెళ్లి, గాలం వేసి, ఓపిక పట్టి నేర్పుతో చేపలను ఆకర్షిస్తాడు. చివరకు చక్కని పెద్ద చేపను పట్టుకోగలుగుతాడు. అలాగే మహాత్ముల ఋషుల వాక్కుల్లో పూర్ణవిశ్వాముంచి, భక్తి అనే ఎరతో మనోనిశ్చయమనే గాలపు కోలతో భగవంతుణ్ణి పట్టుకొని హృదయంలో నిలుపుకోవాలి. అందుకై అఖండమైన ఓర్పుతో కాలపరిపాకానికై వేచి వుండాలి. అందుకై అఖండమైన ఓర్పుతో కాలపరిపాకానికై వేచి వుండాలి. అలా చేస్తే ఆ దివ్యమీనం లభిస్తుంది.

ఆత్మసాక్షాత్కారం కావాలంటే సాధనలను ఆచరించి తీరాలి. కాని పరిపూర్ణ శ్రద్ధవుంటే స్వల్ప సాధన ఐనా చాలు.

పరమ పావనమైన భగవన్నామ ప్రభావంలో సంపూర్ణ విశ్వాసం వుంటే – నిరంతర నామస్మరణలో మనస్సు రమిస్తే – అలాటి వ్యక్తికి మరే యితర సాధన గాని, వివేచనగాని అనావశ్యం. అప్పుడు సంశయాలన్నీ సమసిపోతాయి. మనస్సు నిర్మలమవుతుంది. పావననామ ప్రభావంలో భగవంతుడే స్వయంగా అతడికి సాక్షాత్కరిస్తాడు.

సాధన సిద్దులనీ, కృపాసిద్దులనీ సిద్ధులు (లేక ముక్తులు) రెండు కోవలకు చెందుతాడు. మంచి పంట దక్కటానికి కొందరు తమ పొలాలకు కాలువలు, తీసో, నీటిని తోడో చాల శ్రమపడవలసి వస్తుంది. కాని నీటికోసం యిలాంటి శ్రమను ఎంతమాత్రమూ పడనక్కర్లేని అదృష్టవంతులు కొందరుంటారు. ఎలాగంటే, వానలు పడి వారి పొలాన్నంతా నీటితో నింపుతాయి. మాయాబంధం నుంచి విముక్తి పొందటానికై దాదాపు అందరూ దీక్షతో సాధన చేయవలసే వున్నారు. కాని కృపాసిద్ధులకు యి శ్రమంతా అనావశ్యం. భగవత్కృపతోనే వారు ముక్తులవుతారు. కాని వీరి సంఖ్య అత్యల్పం !

(శ్రీరామకృష్ణ మఠం వారి సౌజన్యంతో)

కథాత్మక గీతా సూక్తులు

– ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

యోగః కర్మసు కౌశలమ్

ఈ గీతావాక్యం సాంఖ్యయోగమనే రెండవ అధ్యాయం యాభైయవ శ్లోకం చివరిభాగం. కర్మాచరణంలోని నైపుణ్యమే యోగమని సారాంశం.

లోకంలో అందరు తమకు తగ్గట్టు కర్మలు చేస్తారు. ప్రత్యేకించి జీవనోపాధి కర్మ. కాని కొందరు ఆ కర్మలో కుశలురుగా కనిపిస్తారు. మరికొందరు సోమరులుగా కనిపిస్తారు. ఇంకా కొందరు వృత్తిని ద్వేషించే వారిలా బయటపడతారు. వ్రాయ వ్రాయ వ్రాతకాడు. పాడ పాడ పాటకాడన్నట్టు ఏకాగ్రత వల్ల కొందరే రాణిస్తారు. అలా రాణించడం వెనుక కొంత జన్మాంతర సంస్కారం కూడా కారణమవుతుంది. ఈ నేపథ్యంతో ఒక కథను అనుసంధానించుకోవడం సబబు.

అనగా అనగా ఒక ఊరు. ఆ ఊరు చుట్టూ కొండలే ! మరి కొండల రాళ్ళేమో గట్టివి. అంచేత అక్కడ క్వారి పరిశ్రమ మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. ఈ వృత్తిలో శారీరక కష్టము లేకపోలేదు. మానవుల మనస్తత్వాన్ని అధ్యయనం చేసే వ్యక్తి ఒకసారి రాళ్ళు కొట్టే స్థలానికి వచ్చాడు. ఒకచోట ఆగాడు.

అతని ముందు ఒక నడిమి వయసువాడు. అతని చుట్టు మరీ పెద్దవి మరీ చిన్నవిగాని రాళ్ళు. ఆ రాళ్ళను సుత్తితో సైజు ఒకరకంగా వుండేలా కొడుతున్నాడు. ఒక పక్క కుప్పగా పోసిన సైజు రాళ్ళున్నాయి. ఇవన్నీ చూచిన ఆ మానసిక శాస్త్రజ్ఞుడు రాళ్ళు కొట్టేవాని ముందు నిలబడి

‘ అయ్యా ! ఏం చేస్తున్నావ్ ? ఎన్నాళ్ళ నుండి రాళ్ళు కొడుతున్నావ్. నీకెంత కూలి గిట్టుబాటవుతుంది’ అని అడిగాడు. రాళ్ళు కొట్టేవాడు సుత్తి పక్కకు పెట్టి భుజాన వేలాడే గుడ్డతో చెమట తుడిచేసుకొని ‘ అయ్యా ! పదేళ్ళ నుండి రాళ్ళు కొడుతున్నా. ఈ పనిలోనే మా అయ్య బతికాడు. ఇక్కడ పాతికేళ్ళ నుండి వున్నా నాకు మూడొందలు గిట్టుబాటు. అయినా? ఏం బ్రతుకండి. తెల్లారగట్టే లేవాలి. ఎండల్లో కొట్టలేం కదా ! దుమ్ముధూళితో జబ్బులు. ఇంట్లో వొంట్లో బాగాలేకపోతే అంతే ! అయినా సారూ ! మాదీ బతుకేనా ! ఓ రోజయినా మంచిబట్టలు వేసుకొన్నామా ! హాయిగా తిరిగామా! అని నిట్టూర్చాడు.

మానసిక తత్త్వవేత్త ఓ వంద అడుగులు రాళ్ల మీద నడిచాడు. అక్కడా ఒకడు రాళ్ళు కొడుతున్నాడు. అతగాడి దగ్గరికి ముందువాణ్ణి అడిగినట్టే ప్రశ్నలు వేశాడు. ఆ రెండవవాడు ఎగాదిగా చూశాడు.

‘అయ్యా ! మీరెవరు ? మీకేం కావాలి ? కాశిరాళ్ళు కావాలా ? కడప బండల లాంటివి కావాలి ? లేదా ‘కలవకు’ తగిన సైజు కావాలా ? కాంక్రీటు సైజు కావాలా ? చెప్పండి. అన్నీ ఏర్పాటు చేస్తా. నా ద్వారా బేరం చేస్తే లాభసాటి ’ అన్నాడు. మానసిక శాస్త్రవేత్త ఏదో చెప్పబోయే సరికి దూరంలో స్కూటర్ వచ్చే సవ్వడి వినిపించింది. రాళ్ళు కొట్టేవాడు ఆదరాబాదరాగా

‘ అయ్యా ! మీరటు వెళ్ళండి. మా మేస్త్రీ వస్తున్నాడు. నిన్న పనే పూర్తికాలేదు. ఈ రోజూ ఇంతేనా అని కసరుతాడు. అదీగాక అమ్మాయికి జబ్బని అడ్వాన్స్ అడిగా ! ఈ యాళ ఇస్తానన్నాడు. మీతో కబుర్లాడుతుంటే అంతే గతి. వెళ్ళండయ్యా ! వెళ్ళండి ’ అన్నాడు. శాస్త్రజ్ఞుడు కదిలాడు.

కొంతదూరం నడిచాడు. దూరంలో పాడుబడిన గుడి కనిపిస్తున్నది. అయినా అక్కడ రాళ్ళు కొట్టడం వినిపిస్తూనే వుంది. కర్కశంగా కాదు కాకుల అరుపుల్లాకాదు, శ్రావ్యంగా, లయబద్ధంగా, శాస్త్రజ్ఞుడు ఇంకా కొంతదూరం నడిచాడు. అక్కడ ఒకతను ఒక పెద్ద రాయిమీద చిన్న ఉలితో ఏదో చెక్కుతున్నాడు. శాస్త్రజ్ఞుడు అక్కడ నిలబడ్డాడు. ఆ శిల్పి ఆగంతకుని చూడలేదు. తన పనిలో తాను నిమగ్నుడై వున్నాడు. శాస్త్రజ్ఞుడు ఇక లాభం లేదనుకొని

అయ్యా ! ఏం చేస్తున్నావ్ ! నేను వచ్చి చాలసేపయింది. ఎవరు వస్తున్నారు. ఎవరు పోతున్నారో పట్టించుకోవా ? అని అడిగాడు. శిల్పి కళ్ళద్దాలు సవరించుకొని

‘ అయ్యా ! మీరెవరు ? ఇక్కడెందుకు వచ్చారు ? ఇక్కడ గుడి కదుతున్నారు. అందంగా హుందాగా కట్టాలని వారి ఆశ. నా నైపుణ్యమంతా శిలలో కనబడేలా చెక్కుతున్నా. నా నిష్ఠ మీ పలకరింపుతో చెదరిపోయింది’ అన్నాడు.

ఆగంతకునికి అర్థమయింది, ముగ్గురూ రాళ్ళు కొట్టేవారయినా మొదటివాడు తన వృత్తిని ద్వేషిస్తూ బతుకుతున్నాడని, రెండవ వాడు నటిస్తున్నాడని, మూడవవాడు దైవభక్తితో అలాగే వృత్తి గౌరవంతో తన పనిని కానిస్తున్నాడని.

భారతదేశంలో అజంతా ఎల్లోరాలు, శ్రీరంగం గోపురం, తాజ్‌మహల్ లాంటివి నైపుణ్యం, వృత్తిగౌరవం కలవారు కట్టినవి కనుకనే చారిత్రక సాక్ష్యాలుగా నిలిచివున్నాయి. ఏ విద్యకయినా కౌశలం అవసరమే. మట్టిముద్ద కుమ్మరివాని పనితనం వల్ల రకరకాల రూపాలతో దర్శనమిస్తున్నాయి. బంగారం కంసాలివాని పనితనం వల్ల అందమయిన ఆభరణాలుగా తీర్చబడి ఆకర్షిస్తున్నాయి. దారాలపోగులు నేతగాని కౌశలం వల్ల కళ్ళు జిగేలుమనేలా రూపాంతరం పొందుతున్నాయి. నాగరికత అభివృద్ధికి ‘కౌశలమే ’ ప్రధానకారణం. గృహనిర్మాణం, ఆనకట్టల నిర్మాణం, ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షణకోసం, మానవుడు చేసిన ప్రయత్నాలు అన్నీ కౌశలానికి తార్కాణాలే !

అక్షరాలు చక్కగా వ్రాయడంలో విద్యార్థి నేర్పరితనం ప్రదర్శించాలి. అక్షరాలు బాగా వ్రాసేవారికి సహజంగానే ఎక్కువ మార్కులు వస్తాయి. భవిష్యత్తులో చిత్రలేఖనాదులలో, ఇక కళలలో ప్రత్యేకించి సంగీత, నృత్యాదులలో ‘కౌశలం’ ఇతరుల్ని ఆకట్టుకొంటుంది. ఎబ్బెట్టు లేని అలంకరణ, బాగా అమర్చిన గృహోపకరణాలు, శుభ్రతకు ప్రాధాన్యమిచ్చిన వస్తువులు, ఆలాగే మాటలలో చాతుర్యం ఇవన్నీ ‘కౌశల’ వృక్షానికి కొమ్మలలాంటివి. కౌశలానికి జాతి మత కుల లింగ వయోభేదం లేదు.

బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే
తస్మా ద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్

జ్ఞాన సుధ

మూలం
శ్రీ సర్వభూషణ శివయోగి వారు
(నవంబరు సంచిక తరువాయి)

అనువాదం :
శ్రీ శంకరానందగిరి స్వాములవారు,
ఉమామహేశ్వర పీఠాధిపతులు

అవ : ఉపాధిమూలమున ఆత్మ వివిధ ప్రకారములై యగపడినను అతడు నిర్వికారుడు అద్వయుడు అని నిరూపించుచున్నారు.

వివిధ కరణ దోషో ? ల్లీఢనాత్ ప్రత్యగాత్మా
వివిధ ఇవ నటత్య ప్యద్వయో నిర్వికారః,
కలుష గమన భంగావర్త తోయేషు బింబన్
భజతి కుముదబంధుః కింను తత్తద్వ్యవస్థాః 23

కుముదబంధుః = చంద్రుడు, కలుషగమనభంగావర్తతోయేషు = మలిన చలనములగు అలలు సుడులు గల జలములందు, బింబన్ = ప్రతిబింబించు చున్నను, తత్తత్ = ఆయా (వానివాని), వ్యవస్థాః = అవస్థలను, సితులను, భజతి కింను = పొందునాయేమి ? (అనగా పొందదు, అటువలె), ప్రత్యగాత్మా = ప్రత్యగాత్మ, వివిధ కరణదోష ఉల్లీఢనాత్ = నానావిధములైన ఇంద్రియ దోషముల సంబంధము వలన, వివిధః ఇవ = నానావిధములు ఐన వాడువలె, నటత్యపి = నటించుచున్నను, అద్వయః ఒక్కడు, అభిన్నుడు, నిర్వికారః = వికారరహితుడనై యున్నాడు.

చలనమలినాది ధర్మములచే నానావిధములుగా ఉండెడి జలములయందు చంద్రుడు ప్రతిబింబించియు ఆయా జలముల గుణదోషాదులచేత ఎట్లు లిపుడు కాడో అట్లే ప్రత్యగాత్మయు వాగాది నేత్రాది ఇంద్రియ వ్యాపారములచే (తాదాత్మ్యముచేత) కర్తగా, భోక్తగా, ద్రష్టగా ఇత్యాది విశేషణములు గల వాడువలె తోచినను ఆయా ఇంద్రియముల

గుణదోషాదుల చేత లిప్తుడు కాడు. ఇతడసంగుడు, అద్వితీయుడు, నిర్వికారుడు. " అసంగోయమాత్మా" " అసంగో నహి సజ్జతే " " ధ్యాయతీవ లేలాయతీవ " అని శ్రుతిస్మృతుల నిర్ణయము.

అవ : ఆత్మ సర్వేంద్రియ వ్యాపారములకు సాక్షిగా ఉన్నదని నిరూపించు చున్నారు.

కరణేంద్రియయో ర్నిజకృత్యభృతోః
పురుషః ఖలు సాక్షిక ఏవ తనౌ,
జనయో ర్బహి రంతర సంసరతో
స్సదనే ? సుఖ దేహళి దీప ఇవ. 24.

సదనే = ఇంటియందు, బహిః అంతర = లోపలను వెలుపలను, సంసరతోః = సంచరించుచున్నటువంటి, జవయోః = జనులకు, సుఖ= సహజమైన, దేహళిదీపఃఇవ = కడపపై ఉన్న దీపము వలెనే, తనౌ = శరీరమునందు, నిజ కృత్యభృతోః = తమ కార్యములను వహించిన, కరణ ఇంద్రియయోః = అంతర్బహిరింద్రియములకు, పురుషః = ప్రత్యగాత్మ, సాక్షికః ఏవఖలం = సాక్షియేయై ఉన్నాడు గదా.

ప్రత్యగాత్మ ఇంద్రియములతో గలసి యుండుటవలననే వ్యవహారము నడచుచున్నది గదా ? ప్రత్యగాత్మ లేనియెడల వ్యవహారము జరుగదు. అట్టియెడ ఆత్మ వికారి, దోషి యని ఎందులకు చెప్పరాదు ? అనిన అట్లు చెప్పుట తగదు. ఏలన, కడపప్రానిపై నుంచిన దీపము ఇంటి లోపల వెలుపల సంచరించుచున్న జనులకు వెలుగు నిచ్చును వారి గమనాగమనాది వ్యాపారములతో సంబంధపడక ఎట్లు నిర్లిప్తమై యున్నదో అట్లే ప్రత్యగాత్మ లోపలను వెలుపలను నడిచెడి (అంతర్బహిరింద్రియ) వ్యాపారములకు సాక్షియై యున్నాడే కాని వానితో విశిష్టుడు కాలేదు (చేరియుండలేదు) కాబట్టి ప్రత్యగాత్మ నిరభిమాన స్వప్రకాశ స్వరూపుడును. నిర్వికారాసంగ సాక్షిస్వరూపుడునై యున్నాడని తెలియవలెను.



శ్రీ భక్త తుకారాం అభంగవాణి

- శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు

(జనవరి 2016 తరువాయి)

సత్యాస్తేయ బ్రహ్మ చర్యాపరిగ్రహములను యమములును, వక్ష్యమాయ శౌచ, సంతోష, తప, స్వాధ్యా యేశ్వర ప్రణిధానములను నియమములన్నియు అహింసా సిద్ధి కొఱకును, సిద్ధించిన యహింసను విశదముగ నొనర్చి పుష్టి నొందించుటకును నిరూపింపబడెను.

శ్లో ॥ ప్రభవార్థాయ భూతానాం ధర్మ ప్రవచన కృతమ్ ।
యః స్యాత్ప్రభవ సంయుక్తః సధర్మ ఇతి నిశ్చయః ॥
(మ.భా.శాం.ప. 109 –10)

అర్థము : ప్రాణుల యొక్క అభ్యుదయము మరియు నిశ్రేయస్సు కొఱకే ధర్మ ప్రవచనము చేయబడినది. అందువలననేది అభ్యుదయ నిఃశ్రేయస సిద్ధి కొఱకగునో నదియే ధర్మమగునని శాస్త్రవేత్తల నిశ్చయము.

శ్లో ॥ ధారణా ధర్మ మిత్యాహుర్ధర్మేణ విధృతాః ప్రజా ।
యః స్యాద్ధారణ సంయుక్తః స ధర్మ ఇతి నిశ్చయః ॥
(మ.భా.శాం.ప. 109 – 11)

అర్థము : ఏది సర్వమును ధారణ జేయునో నది ధర్మమనబడును. అనగా సకల జీవులను అధోగతి నుండి తప్పించి, రక్షించునది ధర్మము. ధర్మమే సంపూర్ణ ప్రజలను ధారణ జేసికొని ఉంది. అందువలన దేనిచే సకల ప్రజల యొక్క ధారణ, పోషణ సిద్ధించుచున్నదో, అదియే ధర్మమని ధర్మవేత్తల నిశ్చయము.

శ్లో ॥ అహింసార్థాయ భూతానాం ధర్మ ప్రవచనం కృతమ్ ।
యఃస్యాదహింసా సంప్రృక్తః సధర్మ ఇతి నిశ్చయః ॥

అర్థము : ప్రాణులకు ఏ విధమైన హింస కలుగకుండుట కొఱకే ధర్మోపదేశము చేయబడినది. కావుననేది యహింసా యుక్తముండునో,

నదియే ధర్మమని ధర్మవేత్తల నిశ్చయము.

శ్లో ॥ యథా నాపదే 2 న్యాని పదాని పదగామనామ్ । ః
సర్వాణ్యే వాపిధీయన్తే పదజాతాని కౌ ఞ్జరే ।
ఏమ లోకేష్వహింసా తు నిర్దిష్టా ధర్మతః పురా ॥

అర్థము : ఏ విధముగా ఏనుగు యొక్క పద చిహ్నము నందు, అన్ని పదగాములైన ప్రాణుల యొక్క పద చిహ్నములు సమాహితమై యుండునో, అట్లే పూర్వకాలమందు జగత్తుతో అహింసా నిర్దేశము ధర్మతః చేయబడినది. అనగా అహింసా ధర్మము నందు సమస్త ధర్మార్థములు సమావిష్టమై యున్నవి.

శ్లో ॥ అహింసయేంద్రియా సంగైర్వైదికై శ్చైవ కర్మభిః ।
తపసంశ్చరణై శ్చోగ్రైః సాధయంతీహ తత్పరమ్ ॥
(మ.స్మ. 6 – 75)

అర్థము : నిషిద్ధ హింసను వదలుట చేతను, శబ్దాది విషయముల నుండి ఇంద్రియములను నిగ్రహించుటచేతను, వేదోక్త నిత్యాది కర్మలనుష్ఠించుట చేతను, ఉగ్ర తపస్సుల నాచరించుట చేతను నీ లోకంబున బ్రహ్మ పదవిని పొందుదురు. కావున కావున అహింసా బ్రహ్మ ప్రాప్తికి సోపానమని తెలియు చున్నది.

" అహింసా పరమో ధర్మః " అని చెప్పబడినందున అహింసా ధర్మమును మన హితమును (కల్యాణమును) గోరి ఆచరించుచుండ వలయును. రక్షించుచుండ వలయును. కాని హననము చేయగూడదు.

శ్లో ॥ ధర్మ ఏవ హతో హన్తి, ధర్మో రక్షతి రక్షితః ।
తస్మా ద్ధర్మో న హన్తవ్యో మానో ధర్మో హతో వధీత్ ॥
(మ. స్మృ. 8– 15) (మ.భా.వ.ప. 313–128)

అర్థము : అతిక్రమించబడిన (హననము చేయబడిన) ధర్మమే వ్యక్తిని నాశనము చేయును. రక్షింప (పాలింప) బడిన ధర్మమే వ్యక్తిని రక్షించును. అందువలన " నష్టము చేయబడిన ధర్మము మమ్ములను నష్టము చేయకుండుగాక ! " అను నీ భావన చేత ధర్మమును హననము (త్యాగము) చేయగూడదు.

శ్లో ॥ న హింస్యాత్ సర్వభూతాని మైత్రాయణ గతశ్చరేత్ ।
నేదం జీవిత మాసాద్య వైరం కుర్వీత కేనచిత్ ॥
(మ.భా.శా.ప. 278 –5), (మ.భా.వన.ప. 213– 34)

అర్థము : ఏ ప్రాణిని గూడ హింసించగూడదు. సకల జీవులయందు మైత్రీ భావముతో చరించవలయును. ఈ దుర్లభమైన మానవ జన్మను పొంది ఏ ప్రాణితో గూడ వైరము పెట్టుకొనగూడదు.

శ్లో ॥ యోః హింసకాని భూతాన్ని హినస్త్యాత్మ సుఖేచ్ఛయా ।
సజీవంశ్చ మృతశ్చైవ న కచిత్సుఖమేధతే ॥ (మ.స్మ. 5–45)

అర్థము : ఎవడొరులను ఉపద్రవ పెట్టని ప్రాణులను తన సుఖము కొఱకు హింసించునో అతడు జీవించియు మరియు మరణించియు ఎచ్చటను సుఖ పూర్వక ఉన్నతిని పొందదు.

శ్లో ॥ నహింస్యా త్సర్వ భూతాని నానృతం వా వదేత్ క్వచిత్ ।
నా హితం నా ప్రియం వాచ్యం నస్తేనః స్యాత్కదాచన ॥
(పద్మపురాణము స్వర్గఖండము – 55–1)

అర్థము : ఏ ప్రాణిని గూడ హింసించగూడదు. ఎప్పుడును అబద్ధమాడరాదు. ఎవరికిన అహితమును, అప్రియమునునగు వచనములు ముఖము నుండి వెలువడరాదు. ఎప్పుడును దొంగతనము చేయరాదు.

శ్లో ॥ త్రికారణం తు నిర్దిష్టం శ్రూయతే బ్రహ్మ వాదిభిః ।
మనో వాచి తథానస్వాదే దోషా హ్యేషు ప్రతిష్ఠితాః ॥
(మ.భా.అను.ప. 114 – 9)

అర్థము : బ్రహ్మవాది మహాత్ములు హింసారూప దోషము సంభవించుటకు ప్రధానముగా మూడు కారణములను చెప్పుచున్నాను. 1.మనస్సు (మాంసమును తినాలని ఇచ్ఛ) 2. వాణి (మాంసమును తినుమని ఉపదేశించుట) మరియు 3. ఆస్వాదము (ప్రత్యక్షముగా మాంసభక్షణము చేసి ఆస్వాదించుట) ఈ మూడు హింసారూప దోషమునకు హేతువులుగ యున్నవి.

హరిపాఠము

అభంగము – 1 – మిట్టపెల్లె శంకరయ్య (ఇచోడ)

పల్లవి పాటలో పల్లవి నామము – పలికించును ఇలలో దైవము
వ్యాసుడు చూపిన మార్గము – హరినామము అతి మధురము
చరణము : దేవుని ద్వారము భవ్యము – నిలబడి యుండు క్షణకాలము
ముక్తులు నాలుగు సిద్ధము – వెంటనే వారికి సాధ్యము
చరణము : హరియని నోటితో పలుకుము –హరియని నోటితో పలుకుము
అగణిత పుణ్యము లభ్యము – లెక్కించడమెవరికి సాధ్యము
చరణము : సంసారములోనె సాగుము – హరిప్రాప్తికై త్వరపడుము
వేద శాస్త్రముల ఘోషను వినుము – నిలబడి చేతులెత్తినవి కనుము
చరణము : ఇది జ్ఞానదేవుని వచనము – వ్యాసుడు తెలిపిన మర్మము
ద్వారకాధీశు నివాసము – పాండవుల ఇంటికి ప్రవాసము

ఈక్రిందివారు వేదాంతభేరికి పోషక చందా పంపినారు

01. రాజశేఖర్ (జడ్చర్ల, మహబూబ్‌నగర్ జిల్లా 0 – రూ. 1200/-
02. పర్వతనేని మురళీకృష్ణ (టి.నర్సాపూర్, ప.గో.జిల్లా) రూ.1200/-
03. సిహెచ్.వేణుగోపాల్ రావు (పెదకడిమి) రూ.1200/-
04. ఎం.రామచంద్రన్ (తిరునార్మలైవము,చెన్నై) రూ. 1500/-

ఆశ్రమంలోని సద్గురు సర్వసేవా ట్రస్టుకు ఈక్రింది వారు పైకం పంపినారు

01. దుర్గి రామమూర్తి శెట్టిగారు (పుత్తూరు) – రూ.15000/-
(భార్య సరస్వతి పేర భిక్షకు నిధి)
02. తాటి వెంకటనారాయణరెడ్డి, భార్య విజయమ్మ గార్లు
(తెలుగు ఉగాది నాడు భిక్షకు నిధి) నాయుడుపేట రూ.20,000/-
03. డి.వి.ఎస్.వి. సుందరరావు (సౌదీ అరేబియా) రూ. 10,000/-
04. సూర్యదేవర నేహ మతియు శ్రీనాథ్ గార్లు (హైద్రాబాద్)
(ప్రతి డిశంబర్ నెల 19 తేది భిక్షకు) రూ. 20,000/-
05. బొమ్మిరెడ్డి శాంతమ్మ గారు (రామన్నపాళెం) రూ. 10005/-
వడ్డీతో శివాలయ పూజకు నిధి



అక్క మహాదేవి అనుభవామృతం

తెలుగు సేత – డా ॥ శ్రీ కరిబసవరాజేంద్ర మహాస్వామి

128 జాలరివాడు జలాశయానికి పోయి జాలాన్ని విసిరి కొన్ని చేపలను పట్టి సంతోషించును. కాని తన ఇంట్లో కొడుకు మరణించితే చాలా ఏడ్చును. ప్రాణులను చంపేటప్పుడు ఆనందాన్ని చెంది తనవారు చనిపోతే ఏడ్చే దెందుకు ? తనను మరియు ఇతరులను భిన్నముగా చూడకూడదు. “ సర్వమ్ చిత్ జ్యోతిరేవ ఇతి య పశ్యతి సయఃపశ్యతి ” అందరిలోను జ్యోతి స్వరూపాన్ని చూసేవాడు సమభావమును పొందును. చెన్నమల్లికార్జునుని భక్తుడైన తరువాత జీవహింస చేయకూడదు. జీవహింస చేసేవాడు హీనజాతివానితో సమానమని ఆగమ వచనము వున్నది. నడత లేనివాడు కేవలం మాటలతో ప్రయోజన ముండదు. కర్తవ్యాన్ని పూరించని శూరుడు చిత్రములో వ్రాసిన శృంగార బొమ్మవలె, ఆకులు లేని చెట్టు, నీళ్ళు లేని నది, గుణము లేని వారి సాంగత్యం, దయలేని ధర్మమము, భయ భక్తి లేని పూజ, నయ వినయము లేని మాటలు వలె –చెన్నమల్లికార్జునునిపై భక్తి లేనిచోట ఈ మానవ జన్మానికి ఏ ప్రయోజనము లేదు.

131. లౌకికములో సామాన్యముగా ధన ఆశతో వారసులౌతారు. వారు ముఖ్యమైన గమ్యాన్ని సాధించరు. మనసారా వచ్చి హితైషియై, కష్ట నష్టాలను తొలగించి సన్మార్గాన్ని చూపించేవాడు నిజమైన వారసుడు.అలాంటి వారసుడే సద్గురువు. వాళ్లతో వారికి తగినట్లు, వీరితో వీరికి తగినట్లు మాట్లాడే కపట పేమిని శివుడు మెచ్చు కొనడు

132. చెన్నమల్లికార్జునా ! నిన్ను వెదికే కష్టములే నాకు మోక్షము. నిన్ను

తెలియని మోక్షము లభించినా అది నాకు నరకము. నీ జ్ఞానము లేని మోక్షములో సుఖము లేదు. నీ అనుగ్రహము కోసము అనుభవించే దుఃఖమే పరమ సుఖము. దేవా ! నీవు నీ భవబంధనములో కట్టి బంధించి పడేసినా అది మాకు మోక్షమే.

134. కొండపై ఇల్లు కట్టి, అడవి క్రూర మృగములకు భయపడితే ఎలా? సముద్రపు ఒడ్డున ఇల్లు కట్టుకొన్న తర్వాత సముద్ర అలలకు భయపడకూడదు. అవి సహజమైనవి. ఆ అలల దెబ్బలను ఎదురించే శక్తిని పొందాలి. సంతలో ఇల్లు కట్టుకొని శబ్దములకు భయపడితే ఎలా ? సంతలో శబ్ధము సహజము. అలాగే ఈ లోకములో పుట్టిన తర్వాత స్తుతులకు పొంగక, నిందలకు కృంగకుండా సమచిత్త స్థితిని అలవరచుకోవాలి. అప్పుడు జీవనం సార్థకమౌతుంది.

136. ఎవరైనా శూరత్వము లేక జంబముగా మాట్లాడితే నా ఆకారము స్త్రీ అయి వున్నా భావములో నేను పురుషుడనే. పేడియై బ్రతుకుట కన్నా పురుషుని లాగా సుగంధ తిలకాన్ని దిద్దుకొని, ఆయుధాన్ని పట్టుకొని ముందుకాలు పెట్టి వెనుకడుగు వేయను. చెన్నమల్లికార్జునా ! అన. మహిళలంతా ఈ భావాన్ని అనుసరించాలి. అబల అనే నొసటి వ్రాతను మార్చుకోవాలి. (కడుగుకోవాలి) ధైర్యముతో దైవీభావముతో స్త్రీ లందరు ముందడుగు వేయాలని అక్కమహాదేవి సందేశమిది.

138. మాణిక్యము వెలుతురు ఇచ్చేటప్పుడు దీపముతో అవసరం లేదు. పరుసవేది చేతికి లభ్యమైతే బంగారానికి కొదువుండదు. కామధేనువు ఇంట్లో వున్నపుడు ఆవుల ఆవశ్యకత వుండదు. నా స్వామి చెన్న మల్లికార్జునుడు ఇష్టార్థాన్ని ఇచ్చే ఇష్టలింగ రూపంగా వున్నపుడు వేరే వస్తువు ఆశ నాకు వుండదు.

శ్రీమద్భగవద్గీతా వైశిష్ట్యము

- ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(జనవరి తరువాయి)

ఒకడికి రోగం వచ్చింది. వైద్యుడి దగ్గరకు వెళ్ళాడు. అతడు మందిచ్చాడు. ఈ మందును 18 రోజులలు తిన్నాలన్నాడు. రోగి ఔషధాన్ని సేవించడం మొదలెట్టాడు. 10 రోజులకే అతని జబ్బు నయమైంది. జబ్బు ఎంత త్వరగా నయం ఔతుందో, ఎంత బాగా నయం ఔతుందో దాన్నిబట్టే ఆ మందు ఎంత విలువైనదో, ఎంతగొప్పదో తెలుస్తుంది. ఆ వైద్యుని చేతివాసి, చికిత్సా విధానం, రోగాన్ని నిర్ణయించి దానికి తగిన మందును ఇచ్చే నేర్పు ప్రస్ఫుటమౌతాయి. ఇక్కడ రోగగ్రస్తులు మనమందరము. పుట్టడమే రోగం. దానికి ఇవ్వబడిన మందే భగవద్గీత. మందిచ్చిన వైద్యుడే శ్రీకృష్ణ పరమాత్మ.

ఒక వ్యక్తి అన్నం తింటున్నాడనుకుందాం. తినడం పూర్తికాక ముందే త్రేన్పు వచ్చింది. అంటే ఆ పదార్థం బాగా అరిగిందని, వంట బట్టిందని అభిప్రాయం, దీన్నిబట్టి ఆ పదార్థం ఎంత బాగా ఉడికిందో, ఎంతసారమైందో, ఎంత శక్తి నిచ్చేదో బోధపడుతుంది. అర్జునుడికి కృష్ణుడు చెప్పిన విషయాలు ఈ విధంగానే జీర్ణమయ్యాయి. అతనిలో కొత్త ఉత్సాహం ఉరకలు వేసింది.

అర్జునుడు తనకు మోహం నశించిందని 11వ అధ్యాయంలోనే గాక 18వ అధ్యాయంలో కూడా తెలియజేశాడు. ఒకే విషయాన్ని రెండుసార్లు చెప్పడం ద్వారా ధృఢంగా చెప్పినట్లైంది.

నాకు మోహం నశించింది. జ్ఞానం కలిగింది. దానికి కారణం ఈ అనుగ్రహమే. నా సందేహాలన్నీ తొలగిపోయాయి. నువ్వు చెప్పినట్టే చేస్తాను అని అర్జునుడు కృష్ణుడికి చెప్పాడు.

నష్టో మోహః స్మృతిర్లబ్ధా
త్వ త్ప్రసాదాన్మయా2చ్యుత ।
స్థితో2స్మిగత సందేహః
కరిష్యే వచనం తవ ॥ (గత 18 – 73)

వెంటనే రోగాన్ని బాగు చేసే ఔషధం లాగా భగవద్గీత మనకు లభించింది. దీనివల్ల అర్జునుడు పొందిన లాభం కూడా స్పష్టంగా మనకు అర్థమైంది.

ఒక మందును తయారు చేసే విధానం ఎంత ముఖ్యమో దాన్ని ఉపయోగించే విధానం కూడా అంతే ముఖ్యం. మందును సక్రమంగా ఉపయోగించుకుంటేనే రోగం నయమౌతుంది. దాన్ని సక్రమంగా ఉపయోగించుకోకనే రోగం నయం కాలేదనుకోవడం కంటే వెర్రితనం ఎక్కడైనా ఉంటుందా ? గీతాజ్ఞాన విషయం కూడా అంతే. అర్జునుడి మోహాన్ని నశింపజేసిన గీతాజ్ఞానం మనమోహాన్ని మాత్రం ఎందుకు నశింపజేయదు. దోషం గీతాజ్ఞానంలో లేదు. దాన్ని మనం ఉపయోగించుకునే విధానంలోనే ఉంది. దీన్ని గుర్తించి తగిన విధంగా మసలు కోవాలని అర్జునుడు చెప్పిన దాన్ని బట్టి మనం అర్థం చేసుకోవలసి ఉంటుంది.

అర్జునుడు చెప్పిన దాన్ని బట్టి కూడా గీతాజ్ఞానమెంతో శ్రేష్ఠమైందని సద్యః సత్ఫలితదాయకమని, మోహాన్ని తొలగించేదని, జ్ఞానాన్ని కలిగించేదని, సంశయాలన్నిటినీ సర్వంకషంగా ఛేదించ గలిగేదని

తెల్లమౌతుంది.

(ఇ). సంజయుడు చెప్పినవి : భగవద్గీత వల్ల లాభం పొందిన వారిలో అర్జునుడి తర్వాత పేర్కొదగినవాడు సంజయుడు. ఈయన కూడా భగవద్గీత ఎంత గొప్పదో తెలియజేశాడు. తాను వ్యాసుని యొక్క అనుగ్రహం చేత కృష్ణార్జునుల సంవాదాన్ని అంటే భగవద్గీతను విన్నానని సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్పాడు. ఈ గీతాశాస్త్రం ఎంతో శ్రేష్ఠమైందన్నాడు. రహస్యమైందన్నాడు, యోగశాస్త్రమన్నాడు, యోగీశ్వరుడైన కృష్ణుడే దీన్ని అర్జునుడికి బోధించాడన్నాడు.

వ్యాస ప్రసాదాచ్ఛ్రుతవాన్
ఏత ద్గుహ్యతమం పరమ్ ।
యోగం యోగేశ్వరాత్కృష్ణాత్
సాక్షాత్కథయత స్స్వయమ్ ॥ (18 – 75)

(ఈ). అధ్యాయాంత గద్య అభివ్యక్తం చేసేవి : భగవద్గీత ప్రతి అధ్యాయం చివర గద్య చోటు చేసుకొంది. ప్రతి అధ్యాయంలోనూ యోగం పేరు మారుతుందే కాని గద్యలోని తక్కిన విషయాలన్నీ అలాగే ఉంటాయి. ఈ అధ్యాయాంత గద్య కూడా భగవద్గీత శ్రేష్ఠతను ఆవిష్కరించేందుకు ప్రయత్నించింది. గీతను ఉపనిషత్తుగా, బ్రహ్మవిద్యగా, యోగశాస్త్రంగా, ఆ గద్య కొనియాడింది. ఈ విధంగా భగవద్గీత గొప్పతనాన్ని తెలియజేసే ప్రమాణాలనేకం భగవద్గీతలోనే లభిస్తున్నాయి.

2.గీతామాహాత్మ్యం వంటి పౌరాణికాంశాలు :

గీతామాహాత్మ్యం అంతా ఇంతా అని చెప్పడానికి వీలులేదు. గీత గొప్పతనాన్ని గురించి మొదట విష్ణు దేవుడు లక్ష్మీదేవికి తెలియజేశాడు. ఆ విషయాన్నే పరమశివుడు పార్వతికి తెలియజేశాడు. ఈ వృత్తాంతమంతా పద్మ పురాణంలో చోటు చేసుకుంది. ఏ అధ్యాయాన్ని పారాయణ చేస్తే

ఎటువంటి ఫలితం వస్తుందో తెలియజేసే 18 కథలు పద్మ పురాణాలలో కనిపిస్తాయి.

వరాహ పురాణంలో గీతామాహాత్మ్యం విశదంగా తెలియజేయబడి ఉంది. విష్ణువు భూదేవికి గీత గొప్పదనాన్ని ఇక్కడ సుదీర్ఘంగా తెలియజేశాడు. గీతామాహాత్మ్యంలో 23 శ్లోకాలున్నాయి. ప్రారబ్ధమను భవించే వారికి అచంచల భక్తి ఏవిధంగా కుదురుతుందని భూదేవి విష్ణువును ప్రశ్నించింది. ప్రారబ్ధం అనుభవిస్తున్నప్పటికీ గీతనభ్యసించేవారు మోక్షాన్ని పొందుతారు, ఈ లోకంలోనూ సుఖంగా జీవిస్తారు, కర్మలు వారిని అంటవు అని విష్ణువు ప్రత్యుత్తరమిచ్చాడు.

గీతను ధ్యానించే వారిని తామరాకు మీద నీటిబొట్టు అంటని విధంగా కర్మలు అంటవని విష్ణువు చెప్పాడు. ఎక్కడ భగవద్గీత చదువుతూ ఉంటారో, ఎక్కడ బోధిస్తూ ఉంటారో, గీతా విచారణ ఎక్కడ చేస్తుంటారో అక్కడంతా తాను తప్పక ఉంటానని చెప్పాడు. తాను గీతనాశ్రయించే ఉన్నానన్నాడు. గీత తనకు ఉత్తమ మందిరమన్నాడు. గీతాజ్ఞానాన్ని ఆధారం చేసుకొని తాను మూడు లోకాలు పరిపాలిస్తున్నానన్నాడు. గీత తనకు శ్రేష్ఠమైన విద్య అన్నాడు. ఇది బ్రహ్మ స్వరూపమన్నాడు. మూడు వేదాల సారమన్నాడు.

సర్వ శాస్త్రసారభూతమైన పరిపూర్ణ జ్ఞానాన్ని అందించే మహాగ్రంథంగా స్కాంద పురాణం గీతను అభివర్ణించింది. గీత ప్రాశస్త్యాన్ని గురించి పురాణాలే గాక భారతేతిహాసం కూడా తెలియజేసింది. గీతాధ్యయనం చేసేవాడికి, ప్రాణాయామం చేసేవాడికి పూర్వ జన్మంలో చేసిన పాపాలు కూడా నశిస్తాయి.

గీతాధ్యయన శీలస్య ప్రాణాయామ పరస్యచ ।
నైవసన్తిహి పాపాని పూర్వజన్మ కృతానిచ ॥

ప్రతిరోజు నీటితో స్నానం చేస్తే మాత్రమే శరీరానికి పట్టిన మురికి పోతుంది. అయితే ఎప్పుడో ఒకసారి అరుదుగా గీత అనే గంగలో స్నానం చేసినప్పటికీ సంసారమనే మురికిపోతుంది.

మలనిర్మోచనం పుంసాం జలస్నానం దినే దినే ।
సకృద్గీతామ్భసి స్నానం సంసారమల నాశనమ్ ॥

'గ' కారంతో ప్రారంభమయ్యే గీత, గంగ, గాయత్రి, గోవిందుడు అనే నాలుగు పేర్లను ఎవరు హృదయంలో నిలుపుకుంటారో వాళ్ళకు మళ్ళీ జన్మ ఉండదు.

గీతా గంగాచ గాయత్రీ గోవిన్దేతి హృదిస్థితే ।
చతుర్గకార సంయుక్తే పునర్జన్మ విద్యతే ॥

ఉపనిషత్తులే ఆవులు, అర్జునుడే దూడ. శ్రీ కృష్ణుడే పాలుపిండే గోపాలుడు. మనమందరమే ఆ పాలను సేవించేవారు.

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాల నన్దనః ।
పార్థోవత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥

గీతను చక్కగా గానం చెయ్యాలి. ఇతర శాస్త్రాల వల్ల కలిగే ప్రయోజనమేమిటి అని భారతం నిలదీసింది.

గీతా సుగీతా కర్తవ్యా
కిమన్యైః శాస్త్ర విస్తరైః

ప్రారబ్ధం అనుభవిస్తున్నప్పటికీ గీతాభ్యాసం చేసేవారు ఐహికాముష్మిక సత్ఫలితాలు పొందుతారు. గీతాపారాయణ, విచారణ చేసే చోట విష్ణుమూర్తే స్వయంగా ఉంటాడు. ఒక దేశానికి రాజ్యాంగ శాసనంలాగే విష్ణువుకు భగవద్గీత ఉపయోగపడుతుంది. అంటే దీని గొప్పదనం మాటలకందేదేనా ? ఆలోచించండి. (**సశేషం**).



అంతరంగంలో నిక్షిప్తంగా వున్న వాసనల్ని నాశనం చేయండి

– శ్రీశ్రీశ్రీ చిదానంద సరస్వతి స్వాములవారు

(దివ్యజీవన సంఘం, ఋషీకేశ్)

(పూజ్యశ్రీశ్రీశ్రీ చిదానంద సరస్వతి స్వాములవారు శ్రీశ్రీశ్రీశివానంద స్వామివారి ముఖ్యశిష్యులు, దివ్యజీవన సంఘాధ్యక్షులు. ఈ మధ్యనే శ్రీవారు బ్రహ్మీభూతులయ్యారు)

నిత్య దైవాత్మ స్వరూపులారా ! దైవాశీస్సులనందుకొన్న ప్రియ పుత్రులారా ! దైవానుకంప కృపాకటాక్షలు మనపై యెప్పుడూ ప్రకాశిస్తూనే ఉన్నాయి. మనం ఆయనకు తగిన పుత్రులం కావాలని కృషి చేయాలి.

సారహీనమూ, అనిత్యమైన యీ ప్రపంచపు సంసారపుటెడారిలో, దారితెన్నులు లేకుండా పరిభ్రమించకుండా వుండాలంటే మన ఉపాధికి మూలమూ, మనకై మనం ఎంచుకున్న సత్యసుందర శివమైన మార్గంలో విజయవంతంగా ప్రయాణించడానికి ఉపయోగించే కొన్ని మౌలిక సిద్ధాంతాల్ని మీ ముందుంచుతున్నాను. ఈ ఎడారిలో అసలే నీరుగాని, కావల్సిన వినోదం గాని లేకపోలేదు. అలాగే మనసు నాకట్టుకునే ఆకర్షణలూ కోకొల్లలు. నిజానికి చైతన్యవంతమైన మనమనుకున్న సమస్యే యిది.

సత్యానికి ఈ ప్రపంచం చేదుమయమై వుంటే మన మనస్సులు అటు ఆకర్షించబడవు. దాని వలలో చిక్కుకుని, అందులో బంధింపబడవు. ఈ చేదును మరచి, పొందిన ఆనందపు తీయని రసానుభూతి పదే పదే మన మనస్సులో మెదలడంవల్ల మాటిమాటికీ దీని వలలో చిక్కుకుంటున్నాము. దీన్నే మాయ అంటారు.

బాధామయమైన చేదు అనుభవాల్ని, శీఘ్రగతిలో మరచి పోతుంటాము. అలాగే మనల్ని కించపరచే విషయాల్నీ మరచిపోతాము. మెలకువా నిద్రావస్థల్లో కూడా మనం అనుభవించి ఆనందించిన చిన్న చిన్న విషయాన్ని కూడా పదే పదే నెమరువేసుకుని దాన్నే మనసులో

ఆలోచిస్తూ ,గుర్తుచేసుకుంటూ, కలలో కూడా అనుభవిస్తూ దీని మాయలో చిక్కుకుంటున్నాము. ఇవి మనల్ని వదలిపెట్టి ఏనాటికీ వెళ్ళవు.

ఈ వాసనల్ని సమూలంగా నాశనం చేయలేము సరికదా, బయటికి కూడా నెట్టివేయలేము. ఇవి ఎంతగాఢంగా మనలో పాతుకుపోయి వున్నాయంటే వాటి అంతు తెలియనంతగా అగాధపు లోతుల్లో పాతుకుపోయివుండి, మనసూ, బుద్ధికీ కూడా అందనంతగా వున్నాయి. ఇది నిస్సహాయస్థితి ! ఈనాడు మనల్ని వేధించే యీ విషయవాసనలు, పూర్వం మనం అనుభవించిన ఆనందమయ అనుభవాలు వేళ్ళుతన్నుకుని యీనాడు మనల్ని ఆకర్షణలకూ, దారి తప్పించడానికీ కారణాలవుతున్నాయి. ఈవిషయ వాసనలు, దారితప్పించి, రాజమార్గానికి బదులు సందుగొందులలోకి మళ్ళించి, ముక్తికి దూరుల్ని చేస్తున్నవి.

దీని నివారణ కొకేవొక మార్గముంది. విషయవాసనల్నీ కుసంస్కారాల్నీ సమూలంగా నాశనంచేయాలి. వీటిని బహిర్గతం చేయడం చాల కష్టం. పాశ్చాత్య మనోతత్త్వశాస్త్రజ్ఞులు అంతఃకరణలో అట్టడుగున వున్న విషయాల్ని బయటికి తేవడానికి కృషి చేస్తున్నారు. మనోతత్త్వశాస్త్రం ప్రకారంగా మానసిక చికిత్సా సిద్ధాంతాలతోను, వెనక్కు వెళ్ళేట్లు మనలను ఆజ్ఞాపించి, వ్యక్తియొక్క పసితనం, యౌవనం, చివరకు తల్లి గర్భంలోని ఉనికికి కూడా వెళ్ళేట్లుగా చేస్తున్నారు. కొన్ని మానసిక చికిత్సా సంస్థలవారు మానవుడి పూర్వ జన్మ వృత్తాంతాన్ని గూడ చెప్పించగలమని ప్రకటిస్తూ వున్నారు. ఇది నమ్మదగినదిగా లేదు. కొందరు దూరదృష్టితో యితరుల పూర్వజన్మ గురించి చెప్పగల్గుచున్నారు. కాని తమ పూర్వజన్మ వృత్తాంతాన్ని గురించి మాత్రం ఎరుగరు. ముక్తి మార్గంలో ఉన్నతులైవుండనంతవరకూ పూర్వ జన్మము మూసిన పుస్తకమే ! యోగారూఢులై సిద్ధులైన వారికి తప్పనిసరిగా తమ గతజన్మల గురించిన జ్ఞానముంటుందని పెద్దలంటారు.

ముక్తులకిది జటిలసమస్య . విముక్తి పొందినవారికి భూతభవిష్య ద్వర్తమానాలు లేవు. వారు నిత్యులు. వారికి వర్తమానంలోనే భూతభవిష్యత్తుల కలయిక. దీనివల్ల గతాన్ని క్రొత్తగా తెలుసుకోవడమనేది

వుండదు. ప్రతిదీ యిప్పుడే, యిక్కడే వారికి అవగతం అవుతుంది. ఇట్టిస్థితిలో గతాన్ని గురించి ఆలోచించవల్సిన పనేలేదు. జన్మ పరంపరలన్నీ మిథ్య, మాయ వాటికేనాడూ ఉనికి లేదు.

పాశ్చాత్యదేశాల్లో కొన్ని మానసికశాస్త్ర ధార్మికసంస్థలు నెలకొల్పబడి, మనసును పూర్వకాలంలోకి మరల్చి, మనసులో అట్టడుగున పడివున్న దుష్టసంకల్పాన్నీ, రోగాల్నీ, సంక్షోభాల్నీ, యితర సంకల్పాల్నీ, వాసనల్నీ తెలుసుకొని వాటిని నిగ్రహించడం, నాశనంచేసి మిమ్మల్ని సంరక్షిస్తామని ప్రకటిస్తూ వున్నాయి.

వారు కొంతవరకీ విషయవాసనల్ని గూర్చిన వివరాలు తెలుసుకొని బాధల్ని తగ్గించగలరు. గాని పూర్తిగా వాసనారహితుల్ని చేయలేరు. ఈ వాసనలన్నీ మన కారణశరీరంనుంచే వచ్చాయి. కేవలం దైవానుగ్రహం వల్లనే కారణశరీరంలో మార్పురావాలి తప్ప, వేరే విధంగా సాధ్యం కాదు. పాశ్చాత్యమానసతత్త్వ శాస్త్రజ్ఞులు చెప్పినట్లు మనస్సును పూర్వానికి మళ్ళించి, విశ్లేషణ చేసినప్పటికీ దీనివల్ల తాత్కాలికమైన మార్పు రావచ్చును గాని, పూర్తిగా వాసనారహితులు మాత్రం కాలేరు.

దీనికి రెండే రెండు మార్గాలున్నాయి. ఒకటి నిత్యసత్యమైన శక్తిగల ఆ దైవాన్ని గురించి అనుక్షణం చింతించడం. దాని వల్ల చాలావుపయోగమే కాదు, యీ విధంగా చాలా బలమైనశక్తి కల్గింది కూడా ! ఆదిమధ్యాంతాలు లేని దైవంలో లీనమై, సర్వభూత ఆత్మతత్వం అంటే సర్వభూతాంతర్గతుడైన దైవాన్ని చూడడానికి ప్రయత్నించడం అలవరచుకోవాలి. దీనితో తాదాత్మ్యం చెందడం వల్ల నీ నిజమైన ఆత్మకు పుట్టుకా చావూ లేదు. చావూ పుట్టుకా లేనిదానికి పూర్వజన్మ, పూర్వసంస్కారాలూ ఎక్కడ నుంచి వస్తాయి ? మీ నిత్య నిజస్వరూపాన్ని తల్చుకుని దానితో తాదాత్మ్యం చెందితే అక్కడ ఉపాధిగాని, సంస్కారాలు గాని, వాసనలు గాని యింకేవీ వుండవు. ఇది ఉత్తమోత్తమమైన మార్గం. మీరు నిజస్వరూపంతో ఒకటైపోయే ప్రయత్నంలో వున్నందువల్ల మీకు పూర్వసంస్కారాల విషయం తెలుసుకుని వాటిని నాశనం చేసే అవసరమే వుండదు. ఎందుకంటే మీరు వెదుక్కుంటున్న మార్గంలో ఈ విషయాలకు అర్థం లేదు. అసలు వునికే లేదు.

నామజపం, ధ్యానంవల్ల వచ్చే శక్తితో ఈ కుసంస్కారాల్ని మట్టుపెట్టడం యింకో మార్గం. అసలు జపం యొక్క ముఖ్యోద్దేశమే యిది. జపధ్యానాదుల వల్ల అసంభవ విషయాల్ని కూడా సాధింపవచ్చు. అందువల్ల యీ రెండు సాంకేతికాలవల్ల మనం ముఖ్యంగా జపాన్ని ఆచరించడం వల్ల హృదయంలోనికి, గాఢంగా, ఎక్కువలోతుగా లెక్కపెట్టలేనంత అగాధంలోకి వెళ్ళిపోతే, అక్కడ దివ్యమైన వాతావరణ పరిసరాలూ పవిత్రస్థితీ యీ నామంవల్ల లభిస్తాయి.

“ నా యిష్టదైవ సమ్ముఖాన వున్నాను. సర్వవ్యాపి సమీపమే నా వునికి. గురు సాన్నిధ్యము నాకుంది” అనే నిరంతరచింతనవల్ల యీ సంస్కారాలూ వాసనలూ వృత్తులూ నిన్నేమీ చేయలేవు. దివ్యత్వం నీలోనే వున్నప్పుడు చెడుభావాలూ, కార్యాలూ, వూహలు రావు, రాలేవు.

కోటిసూర్య సమ ప్రభాకరుడైన నీ యిష్టదైవం, నీ సర్వస్వం అయిన గురుదేవుడు నీ హృదయాంతరంగుడై వుండగా ఆముష్మికపథాన్నుంచి నువ్వు వైదొలగడం గాని, దిగజారడం గాని, జరగకపోగా అవి రక్షిస్తాయి.

సత్యదృఢ సంకల్పాలతో, నిజమైన సాధకునిగా, మీరు కోరుకున్న దివ్యజీవనానికి వ్యతిరేకంగా అడ్డంకులు రాకుండా యీ మార్గంలో ప్రయాణం చేయాలి. మీరు సంరక్షింపబడడమే కాదు,, మనోధైర్యం, శక్తి కూడా సంపాదిస్తారు. రకరకాల అనుభవాలూ, ఆకర్షణలూ, పరిస్థితుల వల్ల మీరు ఆకర్షించబడకుండా మీలో అంతర్గతమైవున్న అఖండ సచ్చిదానందాన్ని అనుభవం చేసుకుంటూవుండడం చాలా ముఖ్యమే గాదు, తప్పనిసరి. ఇది మీ జీవిత నౌకకు లంగరు, స్థిరభూమి,

శ్రీ శివానందగురుదేవుల పరిపూర్ణ ఆశీస్సులు మిమ్మల్ని సదా దివ్య జీవనోన్ముఖులుగా, తేజోరూపులుగా ఉన్నత జీవన మార్గగాములుగా పయనింపజేసి మీ లక్ష్యసిద్ధియైన మోక్షప్రాప్తి కలుగజేయుగాక ! నా మనఃపూర్వక ప్రార్థన యిది. దైవం మిమ్ము రక్షించుగాక ! మీకు మోక్షప్రాప్తి విజయసిద్ధీ కల్గుగాక !

(శ్రీ చిదానంద స్వాములవారి శతజయన్తి సందర్భంగా)

జీవితం – పరమార్థం

– డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

సృష్టిలో జీవకోట్లు పలురకాలుగా ఉన్నాయి. " జీవు లెనుబదినాల్గు లక్షల చావు పుట్టుకలిక్కడ " అన్న తత్త్వగేయం ప్రకారం ప్రాచీనులు 84 లక్షల జీవరాసులను పరిగణించారు.

ఈ జీవులలో మానవుడు పరిణామవాదాన్ని అనుసరించి చివరివాడు. మనుజునివలె ఊహాపోహలు గల జీవి మరొకటి లేదు. అతడు తన బుద్ధిశక్తితో ఏనుగువంటి బలమైన జంతువులనూ, సింహం వంటి పరాక్రమవంతమైన ప్రాణులనూ లోబరచుకొంటున్నాడు.

జన్మలలో మానవజన్మము శ్రేష్ఠమైనది. " జన్తూనాం నరజన్మ దుర్లభం ' అని శంకరుల మాట. ' ఈ జన్మమిక దుర్లభమురా ' అని సాధువులు పాడుతుండగా వింటుంటాము.

మానుష్యం జన్మ వాంఛన్తి భువిదేవాశ్శతక్రతుః ।

చిద్విద్యాయాం పరో2పాస్తో యతో నాన్యో2ధికారభాక్ "

ఇంద్రాది దేవతలు గూడా మానవజన్మను అభిలషిస్తారు. ఎందుకంటే బ్రహ్మ విద్యాభ్యాసం ద్వారా బ్రహ్మప్రాప్తి పొందడానికి మానవులకు వలె దేవతల కధికారం లేదు. వారివి భోగజన్మలే కాని యోగజన్మలు కావు.

అట్టి మానవజన్మలో సాధించదగిన పరిమార్థం ఏది ? అనేది ముఖ్యమైన ప్రశ్న. నాల్గు పురుషార్థాలు ప్రసిద్ధాలు. అవి – ధర్మం, అర్థం, కామం మోక్షం అనేవి. ఈ నాలుగూ సాధించవలసినవే. కాని నాల్గవదైన మోక్షమనేది పరమ పురుషార్థంగా ప్రసిద్ధి చెందింది.

ధర్మకార్యాలు చేయవలసినవే. వాటి వల్ల పుణ్యం లభిస్తుంది.

పుణ్యం వల్ల స్వర్గ ప్రాప్తి కల్గుతుంది. కాని ఆ పుణ్యం కాస్తా వ్యయమైపోగానే తిరిగి భూమిలో జన్మించక తప్పదు.

" క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి "అని గీతావచనం. అందుచేత పుణ్యకార్యరూపాలలో ఉన్న ధర్మం శాశ్వత ప్రయోజనం కాదు.

ఇక అర్థమనే పురుషార్థం గురించి ఆలోచిద్దాం. 'ధనమూల మిదం జగత్ ' అన్నట్లు జగత్తులో ఏమి సాధించాలన్నా ధనం అవసరం. దానితో ఎన్నో మంచి పనులు చేయవచ్చు. సుఖంగా జీవించవచ్చు. కాని అర్థం వల్ల అనర్థం కూడా కలిగే ప్రమాదమున్నది.

అర్థమనర్థం భావయ నిత్యం నాస్తి తతస్సుఖలేశ స్సత్యమ్ '

అన్నమాట ప్రసిద్ధమే. అర్థమే అనర్థమని భావించాలి. నిజంగా దానివల్ల సుఖం లేదు. పుత్రులు, బంధువులవల్ల కూడా ధనం కారణంగా బాధలు తప్పవు. ధనాన్ని ఆర్జించడంలోనూ, వ్యయించడంలోనూ కలిగేది కష్టమే. ధనాశకు లొంగి లంచాలద్వారా కోట్లు గడించి చివరికి జైలు పాలయ్యే వారిని గూడా చూస్తున్నాం కదా ! అందుచేత అర్థం పురుషార్థం కావచ్చు గాని, పరమ పురుషార్థం కాదు.

ఇక కామ పురుషార్థం మాటకు వస్తే కామోపభోగం ఒక వయస్సుకు మాత్రమే పరిమితం. బాల్యంలో, వార్ధక్యంలో అది సుఖకారికాదు.

' వయసి గతే కః కామ వికారః శుష్కే నీరే కః కాసారః ? '

అని శంకరులన్నారు. నీరు ఎండిపోతే ఇక మడుగెక్కడ ? వయస్సు చెల్లిపోతే కామవికారమెక్కడ ? పైగా కామానికి వశపడి మరణాన్నికొని తెచ్చుకొన్న రావణాదుల కథలు మనకు సుపరిచితాలే. అంచేత కామం ముఖ్య పురుషార్థం కాదు.

ఇక ' మోక్షం ' మిగిలింది. మోక్షమంటే ' విడుదల ' భవబంధం నుండి పూర్తిగా విడుదల పొందడమే ముక్తి. దీన్ని సాధించడానికి అవసరమైన ఉపాయాలను గీతాది శాస్త్రాలు వివరంగా బోధిస్తున్నాయి. ఈ చరమ పురుషార్థమే, పరమ పురుషార్థం. (**సశేషం**)

భగవంతుడు చూచేది హృదయాన్ని

– చదలవాడ వెంకటశేషయ్య, (గూడూరు)

ఒకసారి ఒక హరిజనుడు తన వూరిలో నూతనంగా నిర్మింపబడిన గుడిలో దైవదర్శనం చేసుకోవాలని తలచి ఆ దేవాలయ పూజారిని సమీపించి దైవదర్శనం చేయించమని ప్రాధేయపడ్డాడు.

పూజారి అంగీకరించక " నీవు జన్మతః అంటరాని వాడివి. నీకు దర్శనం చేసుకునే అర్హత లేదు. నేను చెప్పిన నియమాలు పాటించి తపస్సు చేసి పరిశుద్ధుడవై తిరిగి వస్తే నీ కోరిక విషయం పరిశీలిస్తాం " అన్నాడు పూజారి. అస్పృశ్యుడు చేసేది లేక దిగులుతో ఇంటి ముఖం పట్టినాడు. పూజారి పేర్కొన్న నియమాలు శ్రద్ధగా పాటిస్తూ సాధనకు ఉపక్రమించినాడు. ఇలా మూడు సంవత్సరాలు తీవ్ర సాధన చేసినాడు. ఇలా హరిజనుడు ఒకనాడు ఉదాసీనంగా దేవాలయం ప్రక్కగా వెడుతూ పూజారి కంటపడ్డాడు. పూజారి అతనిని చూచి ' ఏమోయ్ । దేవాలయం వైపే చూడకుండా వెళ్తున్నావ్ ? నేను చెప్పిన నియమాలు పాటించి పరిశుద్ధుడవైనావా ? దైవ దర్శనానికి అర్హతను సంపాదించుకొన్నావా ? అని అడిగినాడు.

పేద భక్తుడు ఇలా బదులు చెప్పినాడు. మహాశయా మీ సూచనలను, నియమాలను శ్రద్ధాభక్తులతో పాటించినాను. కరుణా సింధువైన భగవంతుడు నాకు వారి దివ్య దర్శనాన్ని మా ఇంటివద్దనే ప్రసాదించి ఆశీర్వదించినాడు. మీ దేవాలయ ప్రవేశానికి ప్రాకులాడవలదని హెచ్చరిక చేస్తూ, ఆ దేవాలయం నిర్మించినది మొదలు తాను ఎన్నడూ అందులో కాలు పెట్టలేదని పేర్కొని అదృశ్యమైనాడు. పేద భక్తుని వాక్కులకు పూజారి అవాక్కయినాడు. అహంభావం అణగారిపోయింది.

భగవంతునికి కావలసింది హృదయ నైర్మల్యం. కులం కన్న గుణం ముఖ్యం. భగవత్ సామ్రాజ్యంలో ఏ వ్యక్తీ అధికుడు కాడు. అల్పుడూ కాడు. అందరూ సమానులే ! ప్రతిజీవి పరాత్పరుని దేవాలయమని గ్రహించాలి.

వార్తలు

(01). 2-12-2015 తేది తిరుమలలోని ఆస్థాన మండపంలో జరిగిన సనాతన ధర్మప్రచార సదస్సులో చేసిన తీర్మానాలకు సంబంధించి కొన్ని, ముఖ్య తీర్మానాలు అమలును హిందూ ధర్మపరిరక్షణ ట్రస్టు ప్రారంభించినట్లు సదరు ట్రస్టు ఛైర్మన్ పి.వి.ఆర్.కె. ప్రసాద్ గారు ఐ.ఎ.ఎస్ (రిటైర్డు) తెలియపఱచారు.

(ఎ). 10-12-2015 తేది శ్రీశుకబ్రహ్మాశ్రమములో విశేష గోపూజ జరిగినది. ఆశ్రమ వాసులు, ప్రముఖులు ఈ గోపూజాలో పాల్గొనినారు.

(02). 13-12-2015 తేది శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో సామాజిక సమరసతా సమ్మేళనం సమరసతసేవా ఫౌండేషన్ వారిచే నిర్వహింపబడినది. శ్రీకాళహస్తి పరిసర గ్రామాల నుండి అనేకమంది ఇందు పాల్గొనినారు. శ్రీ శుకబ్రహ్మాశ్రమంవారు అందరికి భోజన ఏర్పాట్లు చేసినారు. శ్రీ శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు ఆశీః ప్రసంగం చేశారు.

(03). మాతృశ్రీ అనసూయమ్మ గారి ఆధ్వర్యంలో శ్రీ సద్గురు మలయాళస్వామి గీతా ప్రచార సమితిచే నిర్వహింపబడిన గీతాజయన్తి కార్యక్రమాలలో 21-12-2015 తేది పెద్దకడిమి గ్రామంలో ప.గో.జిల్లా, 22-12-2015 తేది టి.నర్సాపూర్‌లో, 23-12-2015 తేది తాడేపల్లిగూడెం సమీపం కృష్ణాయపాలెంలో పూజ్యశ్రీ విద్యా స్వరూపానందస్వాములవారు పాల్గొని భగవద్గీత విశిష్టతను గురించి ప్రసంగించారు. ప్రతి శాఖలోను జరిగిన ఈ గీతాజయన్తి కార్యక్రమంలో ఆయా గ్రామస్థులు, మహిళలు, పురుషులు చాలా విశేషంగా పాల్గొనినారు.

(04). తెలంగాణా రాష్ట్రం కరీంనగర్ పట్టణంలో 2016 సం॥ జనవరి 17,18,19 తేదీలలో ఋషీకేశ్ పూజ్యశ్రీ శివానందస్వాములవారిచే స్థాపించబడిన అంతర్జాతీయ దివ్య జీవన సంఘ అఖిలాంధ్ర ప్రదేశ్ సభ మఱియు పూజ్యశ్రీ చిదానంద స్వాములవారి శతజయంత్యుత్సవములు చాలా ఘనంగా జరిగాయి.

(05). ఫిబ్రవరి 22,23,24 తేదీలలో హైద్రాబాద్, మల్కా జిగిరిలోని శ్రీమాణయ్య గారి సత్సంగం వారు నిర్వహించు సనాతన బ్రహ్మజ్ఞాన సభలలో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొని ప్రవచనలు చేస్తారు.

(6). 8-01-2016 తేది మాసశివరాత్రి సందర్భంగా ప్రదోషకాలంలో రుద్రాభిషేకము బిల్వార్చన జరిగినది. 19-1-16 తేది కృత్తిక సందర్భంగా ప్రదోషకాలంలో శ్రీ సుబ్రమణ్యస్వామికి పూజ జరిగినది.

(07). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో డిశంబర్ నెలలో **ఓ.పి.విభాగంలో 373** గురికి వివిధ కంటి పరీక్షలు జరిపి తగు చికిత్సలు చేశారు. **37 మందికి పొరలు** తీసి కండ్లలో లెన్సు అమర్చినారు. **5 మందికి లేజర్ ట్రీట్‌మెంట్** చేశారు.

నాల్గు సూత్రములు



జీవితమును ధర్మపథమున (ధర్మమార్గమున) నడుపుటకై నాలుగు సూత్రములను మనుజుడు బాగుగా తెలిసికొని యుండవలయును.

అవి యేవి అనగా

1. ఏమాత్రము కంగారు పడకుండ శాంతముగా నిర్మలముగ ఆలోచించుట.
2. తనతోటి మానవులను హృదయపూర్వకముగ ప్రేమించుట.
3. పవిత్రమగు ఉద్దేశ్యములు గలిగి ఆ ప్రకారముగ ఆచరించుట.
4. దైవమందు పరిపూర్ణమగు విశ్వాసము కలిగి యుండుట.

Four Things a man must Learn to do :

1. To think without confusion clearly.
2. To Love his Fellowmen Sincerely.
3. To act with honest motives purely.
4. To Trust in God and heaven Securely.

– శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు

Regd.No. TRP / 123 / 2015-17 February 2016 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-01-2016, Permitted to post : 29th, 30th every month.

త్రినేత్ర వైద్యాలయము

భక్తకన్నప్ప కంటి ఆసుపత్రి.

శ్రీశుకబ్రహ్మాశ్రమము, స్వామి ప్రకాశానందనగర్, శ్రీకాళహస్తి, ఆం.ప్ర.

ఇందు నిరుపేదలకు ఉచితంగా కంటి చికిత్సలు చేయబడును. కంటిపొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడును. ఆపరేషన్ చేసిన వారికి ఉచితంగా భోజనాలు పెట్టబడును. ఉచితంగా మందులు మరియు 40 వ రోజు కళ్లద్దాలు ఇవ్వబడును. దీనికి విరాళమిచ్చువారికి 80 జి సెక్షన్ క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు కలదు.

ఈ ఆసుపత్రి పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిచే స్థాపించబడినది.

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం

వేదాంతభేరి

మార్చి 2016 రూ. 10/-

గీత మహిమ

"సంశయములు నన్నావరించినప్పుడు, నిరాశానిరుత్సాహములు జనించినపుడు నేను భగవద్గీతను తెఱచి చూచుదును. అందు ఏదో యొక శ్లోకము నన్నూరడించును. తత్ఫలితముగ మహావిపత్కర పరిస్థితియందు గూడ నా ముఖముపై చిరునవ్వు తాండవించు చుండును. నా జీవితములో అనేక ఘోర సంకటములను నేను అనుభవించవలసి వచ్చినను అవి యెవ్వియు నా మనంబున లవలేశమైనను అశాంతిని కలుజేయజాలక పోవుట గీతాప్రబోధము యొక్క సత్ఫలతమే యగును.

– మహాత్మాగాంధి

వేదాంతభేరి

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 49 మార్చి 2016 సంచిక : 03

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

వేదాంతభేరి

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 49 మార్చి 2016 సంచిక : 03

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. ప్రకృతిని (మాయను) ఎదుర్కొనుము
- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. లెండు ! మేల్కొనుడు -శ్రీ సద్గురు మలయాళస్వాములవారు -10
04. ధ్యానజపతపాలనుసదాఆచరిస్తుండాలి-శ్రీ రామకృష్ణ పరమహంస -12
05. శాస్తారం ప్రణమామ్యహమ్ - - 15
06. ఉత్సాహావేశము -నీలోని దైవం-శ్రీ చిదానంద సరస్వతిస్వాములవారు- 16
07. జీవితం -పరమార్థం - డా ॥ సముద్రాల లక్ష్మణయ్య - 19
08. జ్ఞానసుధ - శ్రీశంకరానందగిరి స్వాములవారు - 22
09. కథాత్మక గీతా సూక్తులు - ఆచార్య కె.సర్వోత్తమరావు - 24
10. శ్రీభక్త తుకారాం అభంగవాణి - శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు - 28
11. గజేంద్ర మోక్షము - రహస్యార్థము - ఎస్.వి.భారతీలక్ష్మి - 31
12. అక్కమహాదేవి అనుభవామృతం-శ్రీడా॥కరిబసవరాజేంద్ర మహాస్వామి -35
13. ఆధ్యాత్మిక స్పర్శకు తహ తహ - స్వామి చిన్మయానంద - 37
13. శ్రీమద్భగవద్గీతా వైశిష్ట్యము - ఆచార్య జక్కంపూడి మునిరత్నం - 38
14. ఓర్పుతో సమస్యలు పరిష్కారం కాగలవు - కె.ఈశ్వర్ - 41
15. వార్తలు - 42

మార్చి 7వ తేది మహాశివరాత్రి

ముఖచిత్రం : శబరిమలై అయ్యప్పస్వామి

ఇందులోని వ్యాసాల భావాలకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

01. ఓం నమస్తే రుద్ర ! మన్యవ ఉతో త ఇషవే నమః ।
నమస్తే అస్తు ధన్వనే, బాహుభ్యాముత తే నమః ॥
02. యా త ఇషుర్ శివతమా శివం బభూవ తే ధనుః ।
శివా శరవ్యా యా తవ, తయానో రుద్ర ! మృడయ ॥
03. యా తే రుద్ర ! శివా తనూర్ అఘోరా2పాపకాశినీ ।
తయా నస్తనువా శన్తమయా గిరిశన్తాభిచాక శీహి ॥
04. ఓం నమో భవాయ చ రుద్రాయ చ । నమశ్శర్వాయ చ
పశు పతయే చ । నమో నీలగ్రీవాయ చ శితికణాయ చ ॥
కపర్దినే చ వ్యుప్తకేశాయ చ । నమస్సహస్రాక్షాయ చ శతధన్వనే చ ।
నమో గిరిశాయ చ శిపివిష్టాయ చ ।

తాత్పర్యాలు : (1). ఓ రుద్రా ! నీ కోపానికి నమస్కారము. నీ బాణానికి నమస్కారము. నీ ధనుస్సుకు నమస్కారము. నీ రెండు బాహువులకు నమస్కారము.

(2). ఓ రుద్రా ! మిక్కిలి శాన్తమైన నీ బాణముతో శాన్తమైన ధనస్సుతో, శాన్తమైన అమ్ములపొదితోను మమ్ముల సుఖింపజేయుము.

(3). రుద్రదేవా ! మంగళకరమైనది, హింసించనిది, హింసాత్మకమైన జీవుని దోషాన్ని వ్యక్తం చేయునదియు అయినది నీ రూపము. వేదార్థంతో సుఖాన్ని కలిగించే రుద్రా ! అతిశయంగా సుఖాన్నిచ్చే నీ రూపం చేత మమ్ము మిక్కిలి ప్రకాశింపుము.

(4). సర్వముతానైన వాని కొఱకు (భవాయ), సంసార దోషాలను దుఃఖింపజేయువానికి (రుద్రాయ) నమస్కారములు.

పాపాలను హింసించే వానికి (శర్వాయ), పశువుల వంటి జీవులకు పాలకుడైన వానికి (పశువతయే) నమస్కారము.

నల్లని కంఠం గలవాని కొఱకు, తెల్లని వర్ణమును (రంగు) తక్కువ చేయబడిన వాని కొఱకును నమస్కారము.

జటాజూటం కలవాని కొఱకు, అల్లబడిన కేశములు కలవానికొఱకును నమస్కారము.

సహస్రాక్షునికి, సహస్ర దృష్టి గలవానికి (వేలచూపులు గలవానికి), నూరు ధనుస్సులు గలవానికిని నమస్కారము.

కైలాసగిరి యందుండు వానికి, విష్ణురూపుడైన వానికి నమస్కారము.



ప్రకృతిని (మాయను) ఎదుర్కొనుము

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

మోక్షప్రాప్తికై రెండవ ఉపదేశము – 'ప్రకృతిని (మాయను అవిద్యను) ఎదుర్కొనుము ' అనునది. దొంగ ఇంటిలో ప్రవేశించినను కనిపెట్టలేని వారు కొందఱు, కనిపెట్టినను వానిని ఎదుర్కొనలేనివారు కొందఱు. ఎదుర్కొని చివఱకు వానితో ఘర్షణపడి తరిమివేయువారు కొందఱు – ఈ ప్రకారముగ జనులలో మూడు తరగతులవారుందురు. మూడవ తరగతి వారు జీవన్ముక్తులు, చిత్తమందిరమున ప్రవేశించిన అహంకారాది శత్రువులతో యుద్ధము చేసి వారలను పరిమార్చి తన్మందిరమున పరమాత్మను ప్రతిష్ఠింపజేసి ఈ జీవితమున పరమానంద మనుభవించువారే అట్టి మహనీయులు. మఱికొందఱికి సరియైన ఆయుధములు లేకయు, ఉన్నను ఎదుర్కొను శక్తిలేకయు శత్రువుపై విజయమును పొందజాలక యుందురు. ఇట్టివారు పెద్దల సహవాసముచే చక్కని పారమార్థిక ఆయుధములను సమకూర్చుకొని ఏనాటికైనను శత్రువును తరిమివేయగలరు. వీరు మధ్యములు. ఇక అధములు శత్రువులు ప్రక్కనే యున్నను వానిజాడ కనిపెట్టలేక తమోగుణాభిభూతులై, అజాగరూకులై, అజ్ఞానాంధత్వముచే స్తబ్ధులై పడియుండి శత్రువు యొక్క దుఃఖరూప ఆఘాతములకు లోనగుచు జననమరణ ప్రవాహమున పూర్తిగ తగుల్కొని యున్నవారలు. ఇక వీరి తారణము ఎప్పటికో ఆ పరాత్పరునకే ఎఱుక !

జీవుని హృదయగేహములో అజ్ఞానమను దొంగ ఎప్పుడు ప్రవేశించెనో ఎవరికినీ తెలియదు. ఆ 'ఎప్పుడు ' అను ప్రశ్నకు శాస్త్రములలో

సమాధానము లేదు. సమాధానము కొఱకు యత్నించుటయు కేవలము అప్రస్తుతమే యగును.

జీవుడు చేయవలసినపని ఆ చోరుని కనుగొని త్వరలో సాగనంపుటయే. అంతియే కాని తర్కవితర్కములచే కాలయాపన చేయుటకాదు. శత్రువు బహుకాలము నుండి హృదయ క్షేత్రమును ఆక్రమించుకొని యుండుటచే బలమును కూడగట్టుకొని యున్నాడు. చక్కగ కాలు నిలద్రొక్కుకొని యుండుట వలన ఒకరాగాన అతడు కదలుట లేదు. తనకేవియో హక్కుభుక్తములు ఏర్పడినట్లు అతడు భావించు కొనుచున్నాడు. ఇట్టి పరిస్థితియందు ఇక జీవుడేమి చేయవలెను ; శత్రువు యొక్క బలముచూచి, శక్తిని జూచి అపార సామర్థ్యమును జూచి బిత్తరపడి ఊరకయుండవలసినదేనా ? కాదు. అట్లెన్నటికిని చేయరాదు.

జీవునియందు అనంతశక్తి కలదు. దానిని విజృంభింప చేయవలెను. జీవుడు గొఱ్ఱెవంటివాడు కాడు. అతడు నిద్రించు సింహము. సింహము యొక్క సింహత్వమునకు ఏ కాలమునను లోటు ఉండదు. సింహము మేలుకొనిన చాలును. అట్లే అనాదికాలము నుండి అజ్ఞాననిద్రలో పడి ఉండి తనయొక్క దైవత్వమును మఱచి, కర్మబంధమును తగుల్కొని పుట్టుచు చచ్చుచు నానాయాతన లనుభవించుచున్న ఈ జీవుడు ఇపుడు నిద్రలేచి అజ్ఞానమను శత్రువును ఎదుర్కొని తన దివ్యాత్మస్వరూపమును వ్యక్తము చేసికొనవలెను. పిరికి పందయై అజ్ఞానస్థితిని, బంధదశను ఇంకను దీర్ఘముగ కొనసాగించుట ధర్మము కాదు. ఇప్పటికే బహుకాలము దాటి పోయినది. ఇక నిద్రించుట కిది తరుణము కాదు. లేచి కర్తవ్యమునకు గడంగవలెను. మాయను ఎదుర్కొనవలెను.

సామాన్యముగా లోకములో కోతిగాని, కుక్కగాని పిరికివారలను చూచినచో తరుముకొనును, ధైర్యముగ నిలబడిన వారిని చూచి పారిపోవును.

అట్లే జీవునియందుగల విరుద్ధ శక్తులు దుర్బలురను నానాబాధలు పెట్టును, ధైర్యవంతులకు తలయొగ్గి యుండును. మహనీయుల యొక్క జీవితచరిత్రలను పరికించినచో, వారు శత్రువు యొక్క దాడులకు ఏమాత్రము జంకక తమశక్తి యుక్తులచే వారిని జయించి వేసిన సంఘటనలు అనేకము కానిపించుచున్నవి. ఈనాటి శత్రువే జయించబడినచో రేపు మిత్రుని పగిది వ్యవహరింపగలడు. అట్లే ఇంద్రియములను శత్రువులు జయింపబడినచో అవి మనకు అనుకూలముగ ప్రవర్తించును. కాబట్టి ధైర్యమును కూడగట్టుకొని, పిరికితనమునకు ఏమాత్రము తా వొసంగక, మాయారూప శత్రువుతో సంగ్రామమునకు దిగవలెను. మన జన్మహక్కైన ఆత్మవస్తు సంపాదనమునకై ఎన్ని త్యాగములకైనను సంసిద్ధులై యుండవలెను. సాహసవంతుని జయము వరించియే తీరును.

In the world's broad field of battle,
In the bivouac of life,
Be not like dumb driven cattle
Be a hero in the strife.

అని ' లాంగ్ ఫెలో ' అను కవిసత్తముడు నుడివినట్లు ఈ విశాల జీవిత సంగ్రామ క్షేత్రమందు నోరులేని మూగపశువులవలె వ్యవహరించక ప్రచండయోధుని భంగి అపార ధైర్యసాహసములతో వర్తింపవలెను. శత్రువులకు ఏకాలమందును వెన్ను చూపరాదు.

లోతుగ విచారించి చూచినచో ఈ మాయకుగాని, అజ్ఞానమునకు గాని, అవిద్యకుగాని వాస్తవమగు అస్తిత్వము లేదు. అది నీడవంటిది. మాయను జూచి భయపడుట తన ఛాయనుజూచి భయపడుట వంటిదే

యగును. నీడను తృణీకరించి, నిజవస్తువగు ఆత్మప్రకాశము వైపునకే దృష్టిని మరలించి, దానినే ఆశ్రయించినచో జన్మ కడతేరిపోవును. దైవబలమును చేకూర్చుకొనిన వారి నుండి మాయ తప్పక పలాయనము చిత్తగించి వేయును. భగవంతుని ఆశ్రయించిన వారిని మాయ ఇక ఏమియు చేయజాలదు.

మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే.

అని భగవానుడు సెలవిచ్చియే యున్నాడు. తన్నాశ్రయించినవారు భయంకరమైన మాయను అవలీలగ దాటివేయగలరని గీతాచార్యుల హితవచనము. తన ఆత్మ స్వరూపమే యగు భగవంతుని ఆలంబనమును పొందినవారు మాయ యొక్క భీషణత్వమును జూచి జంకవలసిన పని లేదు. మాయ ఎంత శక్తివంతమైనప్పటికిని అనాది కాలము నుండియు వున్నప్పటికిని చీకటివంటిదే యగును. ప్రకాశము యొక్క ధాటికి అది తట్టుకొనలేదు. కావున జీవుడు ఆత్మజ్ఞానమను జ్యోతిని వెలిగించి ప్రకృతిని, మాయాతిమిరమును ఎదుర్కొని దానిని అంతమొనర్చి భవబంధ రహితుడై ఈ జీవితము నందే మోక్ష సామ్రాజ్యాధిపత్యమును బడయవలయును.

18వ ఆరాధన

గురుదేవులు పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి 18వ ఆరాధనోత్సవాలు 21-04-2016 తేది నుండి 25-11-2016 తేది వఱకు ఐదు రోజులు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరుగును. ఏప్రియల్ 21వ తేది గురువారం చతుర్దశి శ్రీ స్వాములవారి ఆరాధనోత్సవము, 25వ తేది సోమవారం బహుళ తదియ శ్రీ స్వాములవారి జన్మదినోత్సవము. ఇట్లు (పంచాహ్నికంగా) ఆరాధనోత్సవాలు జరుపబడును.

ఇట్లు

ఆరాధనోత్సవ సమితి

లెండు ! మేల్కొనుడు

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

మహర్షుల వంశములో బుట్టిన సోదరీ సోదరులారా ! జగద్గురు శ్రీ శంకరభగవత్పాదులు, శ్రీరామానుజాచార్యులు, శ్రీ మధ్వాచార్యులు, శ్రీశ్రీ కృష్ణచైతన్య స్వాములు, శ్రీ దయానందసరస్వతి, శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ వివేకానంద స్వాములవారు దివ్య జీవితములను స్మరించి ఉత్తిష్ఠత ! లెండు ! జాగృత ! సుషుప్తి నుండి మేల్కొనుడు ! ప్రాప్యవరాన్నిబోధత ! ప్రకృతికి పరమైన పరమాత్మ స్థితిని బొందిన వారిని విధి ప్రకారము ఆశ్రయించి జన్మము యొక్క ఆవశ్యకతను త్వరలో తెలిసికొనుడు. ఏలన కాలచక్రము త్రిమూర్తులను గూడ అలక్ష్యము చేసి ఒక్క నిమిషమైనను నిలువక తనయొక్క ప్రయాణమును సాగనిచ్చుచున్నది. దైవాత్మ స్వరూపులారా! కరుణాళువులారా ! ఋషుల సంతానములారా ! ఉదయమైన వెంటనే మధ్యాహ్నము వచ్చుచున్నది. తర్వాత వెంటనే అస్తమయమును బొందుచున్నది. మరల రాత్రియు పిమ్మట పగలు, వారము, పక్షము, మాసము, ఋతువు, ఆయనము, సంవత్సరము అదిగో అతివేగముగా దాటిపోవుచున్నవి. ఇట్టి తరుణములో ఊరకుండుట పాడియగునా ? కావున మాయామోహసుషుప్తినుండి జాగ్రత నొంది ఆత్మావలోకనమును చేయుటలో ఉన్ముఖులై ధైర్యసాహసములతో నిలుచుకొనుడు.

భయపడకుడు, భయమే మాయ. అది అజ్ఞానజనితము. మీరు జ్ఞానమూర్తులు, మాయను మటుమాయము చేయుటయే మీపని యని కృతసంకల్పులై లెండు. శోకసాగరమును దాటి నిత్యసుఖమును బొందుడు. అమృతమై శివమైన పదవి నధిష్ఠించి సుఖింపుడు. ఇట్టి అమృతకలశము

మీ అందరి హృదయములో ప్రతిష్ఠితమై యున్నది. మనుష్యమాత్రులందరికిని అట్టి సుఖ మనుభవించుటలో మార్గము తెరచిపెట్టుడు. అప్పుడే మీ యొక్క ప్రతిబంధపు కోటధ్వంసమై మార్గము తెరవబడును. శ్రీ బాలగంగాధరతిలకు గారు స్వరాజ్యము తన జన్మ హక్కని ఉద్ఘోషించునట్లు, స్వారాజ్యము మనుష్యులందరి జన్మహక్కని సూర్యుడు ప్రకాశించుచుండునప్పుడు రాజవీధిలో ఏనుగుపై భేరీ ప్రోగించి ఉచ్చస్వరముతో ఉద్ఘోషించి చెప్పుడు. అంతేగాక, అట్టి స్థితి పొందుటకు అభిలాషగలవారికి సాధ్యమైన సహాయము గూడ చేయుడు. అప్పుడే సర్వేశ్వరుడు మీపై కరుణ గలవాడగును. ఈశ్వరుడిచ్చిన ధనమును, తనువును, మనమును నిశ్శేషముగ ఈశ్వరార్పిత విషయువై వినియోగపరచువాడే పరమభక్తుడును, పరమ జ్ఞానియును అగును. నిష్కామ కర్మయోగముచే కాయేంద్రియముల శుద్ధియు, దివ్యనామ కీర్తన భజన పారాయణాదులచే వాక్శుద్ధియు, స్మరణ ధారణ, ధ్యాన, సమాధులచే మనశ్శుద్ధియు గలగవలసి యుండును. అప్పుడు మాత్రమే నిరావరణ మేఘముగల ఆకాశమండలములో సూర్యుడు ప్రకాశించునట్లు మీ హృదయాకాశములో జ్ఞాన భాస్కరుడు ఉదయించును. పై జెప్పిన వానిలో ఒక్కొక్కటి మాత్రమే చేయువానికి ఒక్కొక్కటి మాత్రము శుద్ధపడును. మూడును చేయువారికి త్రికరణ శుద్ధి గలిగి గుణత్రయాతీత ప్రబోధజ్ఞానము గల్గును. ఇవి మూడును చేసికొని మూడింటికి విలక్షణుడై యేమియును చేయనివాడని జ్ఞానము గలుగునప్పుడు మీరు ధన్యాత్ములగుదురు. సంసార మహాభ్రమణ చక్రము నుండి విముక్తి నొందుదురు. సర్వ పాపములు అప్పుడు ఛేదింపబడును. కర్మ కట్టె లన్నియు దహించిపోవును. అద్వయమై, శివమై, అమృతమై అఖండమైన జ్ఞానమై మీరు మిగిలి యుందురు.

ధ్యాన జపతపాలను సదా ఆచరిస్తూండాలి

– శ్రీ రామకృష్ణ పరమహంస

పనులన్నిటిని కట్టిపెట్టి సాయంకాలం నువ్వు భగవంతుణ్ణి ధ్యానించాలి. సంధ్యాసమయంలో సహజంగా భగవద్భావన మనస్సును ఆవరిస్తుంది. " కాసేపటి క్రితం సమస్తం దృగ్గోచరమై వుంది. కాని ఆహా ! ఇంతలోనే సర్వం చీకటితో ఆవరింపబడిందే ! ఇలా చేసేవారెవరు ? " ఇలాటి భావాలు మనస్సులో పొడసూపుతాయి. సాయంకాలంలో మహమ్మదీయు లెలా అన్ని పనులను విడిచిపెట్టి నమాజుకు కూర్చుంటారో మీరు చూడలేదా ?

పొట్లం చినిగిపోగా కారిపోయి నాలుగు వైపులా చెల్లాచెదరైన ఆవాలను పోగు చేయ్యటం చాలా కష్టం. విషయాల వెంటబడి నాలుగు దిక్కులకేసి పరుగులు పెట్టే మనస్సును అంతర్ముఖం చేసి, ఏకాగ్రం చెయ్యటం ఎంతో కష్టం.

ఏ మారుమూలో, నిర్జరారణ్యంలోనో, నిశ్శబ్దమైన నీ హృదయ దేవాలయంలోనో భగవంతుణ్ణి ధ్యానించు.

సాధకుడు ప్రారంభదశలో ఎప్పుడూ ఏకాంత స్థలానికి వెళ్లి మనస్సును ఏకాగ్రం చెయ్యటానికి ప్రయత్నించాలి. లేకుంటే నానావిషయాలూ మనస్సును ఆకర్షించి కలవర పెడతాయి. పాలకు నీటి చేరిక కలిగిస్తే రెండూ ఐక్యమౌతాయి. కాని పాలను చిలికి వెన్నగా మారిస్తే అలా పరిణామం పొందిన పాలు (అంటే వెన్న) యిక నీటితో కలసిపోవటానికిమారుగా నీటిపైన తేలియాడుతుంది. అలాగే నిరంతర సాధనతో చిత్తైకాగ్రతను పొందిన వ్యక్తి ఎక్కడున్నా అతడి మనస్సు పరిస్థితులకు లొంగక సదా బ్రహ్మభావంలో నిలుకడ కలిగివుంటుంది.

తన శరీరాన్ని చూపిస్తూ గురుదేవుడు శిష్యులకు యిలా బోధించేవాడు, " ధ్యానం ఆరంభించడానికి ముందు దీన్ని గురించి కొంతసేపు భావించు. నేనిలా చెప్పటానికి కారణం ఏమిటో తెలుసా ? మీకు దీని (నా) లోని నమ్మికతో మీ భావాలు దీని (నా) వైపుకు తిప్పబడిన పక్షంలో వెంటనే భగవంతుడి వైపుకు మరలుతాయి. ఇది ఆవులమంద కనిపించగానే ఎవరికైనా ఆవులకాపరి తలపుకు రావటం వంటిది. లేదా కుమారుణ్ణి చూడగానే తండ్రీ, వకీలును చూడగానే న్యాయస్థానమూ జ్ఞాపకం రావటం వంటిది. వెయ్యి విషయాల్లో చెల్లాచెదరైవుండే మనస్సు దీన్ని (నన్ను) గురించి భావించేటప్పుడు ఏకాగ్రతమౌతుంది.. అలా ఏకాగ్రమవగానే భగవంతుడి మీదికి మరలుతుంది. అప్పుడు సరైన ధ్యానం సాధ్యమౌతుంది.

మనస్సును ఏకాగ్రపరచటానికి దాన్ని దీపం మీద నిలపటం అతిసులువైన మార్గం. దానికి మధ్య నుండే నీలిభాగం కారణ శరీరానికి సరి వస్తుంది. దాని మీద మనస్సును నిలపటానికి ప్రయత్నించటం చేత శీఘ్రంగా అలవడుతుంది. దీపంలో నీలాంశం చూట్టూ వుండే తేజోవంతమైన భాగం సూక్ష్మశరీరాన్ని పోలుతుంది. దాన్ని ఆవరించుకొని వుండే భాగమే స్థూల శరీరం.

గురుదేవుడు తన సాధన దశను గురించి ముచ్చటిస్తూ శిష్యులకు యిలా తెలిపేవాడు, " నాయనా ! ఆ రోజుల్లో భగవంతుణ్ణి ధ్యానించటానికి ముందు నేను వివిధ మాలిన్యాలను (చెడుతలపులు, కోరికలు మొదలైనవి) అన్నిటిని మనస్సు నుంచి శుభ్రంగా కడిగి వేస్తున్నట్లూ, ఆ తర్వాత దైవాన్ని అందులో ప్రతిష్ఠించుకొన్నట్లూ భావించేవాణ్ణి. మీరూ అలాగే చెయ్యండి.

ఆరంభదశలో సాధకుడు ధ్యాన సమయంలో యోగనిద్ర అనే ఒక రకమైన నిద్రను పొందుతాడు. అప్పుడాతడికి ఏవో కొన్ని దివ్య దృశ్యాలు తప్పక గోచరిస్తాయి.

సాత్త్విక స్వభావుడైన వ్యక్తి ఎలా ధ్యానిస్తాడో తెలుసా ? అర్ధరాత్రి

పడకమీది దోమతెరలో అతడు యితరులకు కానరాకుండేట్లు ధ్యానం సాగిస్తాడు.

మనోకల్లోలం పూర్తిగా శాంతిచేటప్పుడు శ్వాసలు కట్టుబడటంచేత కుంభకం సిద్ధిస్తుంది. భక్తియోగ మూలాన కూడ కుంభక స్థితి లభిస్తుంది. గాఢమైన భగవద్భక్తివల్ల సైతం శ్వాసలు కట్టుబడుతాయి.

గాఢమైన ధ్యానం ధ్యేయవస్తుతత్వాన్ని గోచరింపచేసి ధ్యాత యొక్క అంతరంగంలో నెలకొల్పుతుంది.

' ధ్యాన సిద్ధుడికి మోక్షం కరతలామలక ' మనే సామెతవుంది. ధ్యానంలో ఎప్పుడు సిద్ధి కలుగుతుందో తెలుసా ? ధ్యానానికి కూర్చోగానే దివ్యభావాలతో ఆవరించబడి బ్రహ్మానుసంధానం చెయ్యగలిగినప్పుడు.

ధ్యానంలో తీక్ష్ణమైన ఏకాగ్రత కలిగినప్పుడు అన్యమేదీ కనిపించదు, వినిపించదు. బాహ్య స్పర్శలుగాని, విషయానుభవాలు గాని లేకుంటాయి. శరీరంమీద పాము పాకుతున్నా అప్పుడు తెలియదు. ధ్యాతకు గాని, పాముకు గాని ఆ విషయమైన ఎరుకే లేకుంటుంది.

ప్రగాఢ ధ్యానంలో ఇంద్రియ వ్యాపారాలన్నీ కట్టుపడతాయి. బాహ్య ప్రపంచ ద్వారాలు బంధించ బడ్డాయో అన్నట్లు మనస్సు అంతర్ముఖమై వృత్తిరహితమై వుంటుంది. శబ్ద స్పర్శరూప రసగంధాలైదూ బైటే వుండి గోచరించవు. ధ్యానంలో మొట్టమొదట విషయాలు మనస్సుకు గోచరిస్తాయి. కాని ధ్యానం గాఢమైనప్పుడు విషయానుభవాలు కలుగనే కలుగవు. అవి బహిష్కరింపబడతాయి.

భగవత్సాక్షాత్కారానికై నువ్వు ఏ మార్గాన్ని అవలంబించినా మనస్సు సంపూర్ణంగా అణగిపోతేనే గాని, వృత్తి శూన్యమైతేనే గాని యోగం సిద్ధించదు. ఇదే రహస్యం. యోగి ఎప్పుడూ మనస్సుకు అధీనుడు గాక మనస్సును సదా తన అధీనంలో వుంచుకొని వుంటాడు.

(శ్రీరామకృష్ణ మఠం వారి సౌజన్యంతో)

శాస్తారం ప్రణమామ్యహమ్

01. లోకవీరం మహాపూజ్యం సర్వరక్షాకరం విభుమ్ ।
పార్వతీ హృదయానందం శాస్తారం ప్రణమామ్యహమ్ ॥
02. విప్రపూజ్యం విశ్వవంద్యం విష్ణుశంభోః ప్రియం సుతమ్ ।
క్షిప్రప్రసాద నిరతం శాస్తారం ప్రణమామ్యహమ్ ॥
03. మత్తమాతంగ గమనం కారుణ్యామృత పూరితమ్ ।
సర్వ విఘ్నహరం దేవం శాస్తారం ప్రణమామ్యహమ్ ॥
04. అస్మత్కులేశ్వరం దేవం అస్మత్ శత్రు వినాశనమ్ ।
అస్మదిష్ట ప్రదాతారం శాస్తారం ప్రణమామ్యహమ్ ॥
05. పాండ్యేశవంశ తిలకం కేరళే కేళి విగ్రహమ్ ।
ఆర్తత్రాణపరం దేవం శాస్తారం ప్రణమామ్యహమ్ ॥
06. యస్య ధన్వంతరీ మాతా పితారుద్రోభిషిక్తమః ।
తం శాస్తారమహం వందే మహావైద్యం దయానిధియ్ ॥
07. చాపబాణం వామహస్తే రౌప్యవేత్రం చ దక్షిణే ।
విలసత్కుండలధరం దేవం వందేహం విష్ణునందనమ్ ।
08. వ్యాఘ్రూరూఢం రక్తనేత్రం స్వర్ణమాలా విభూషితమ్ ।
వీరపట్టధరం ఘోరం వందేహం శంభునందనమ్ ॥
09. కింకిణోడ్యాణ భూతేశం పూర్ణచంద్రనిభాననమ్ ।
కిరాతరూప శాస్తారం వందేహం పాండ్య నందనమ్ ॥
10. భూత భేతాళసంసేవ్యం కాంచనాద్రి నివాసినమ్ ।
మణికంఠమితి ఖ్యాతం వందేహం శక్తినందనమ్ ॥
11. శ్రీహరి పుత్రం దేవేశం శ్రీహరి శంకరాత్మజమ్ ।
శబరిగిరీశ్వరం దేవం నమామి భూతనాయకమ్ ॥
12. జగత్ప్రియం జగన్నాథం జగదానందదాయకమ్ ।
జగదీశం కృపాపూర్ణం నమామి మోహినీసుతమ్ ॥
13. జనార్దనసుతం దేవం వానవేశం మనోహరమ్ ।
వనవాస ప్రియం దేవం నమామి జగదీశ్వరమ్ ॥
14. ఫాలనేత్రసుతం దేవం కలిదోష నివారణమ్ ।
బాలరూపం లోకనాథం నమామి శబరీశ్వరమ్ ॥

....

22-03-2016 తేది అయ్యప్పస్వామి జయన్తి



ఉత్సాహావేశము - నీలోని దైవం

- శ్రీశ్రీశ్రీ చిదానంద సరస్వతి స్వాములవారు
(దివ్యజీవన సంఘం, ఋషీకేశ్)

అమృత పుత్రులారా ! అవకాశాన్ని చేజార్చుకోవద్దు. ప్రతిదినం మనకొక అవకాశం. దినంలోని ప్రతిక్షణం మనకింకొక అవకాశం. లక్ష్యాన్నుంచి ఎన్నడూ దూరం కావద్దు. ముందుకు నడవండి !

సముద్రాన్ని చేరేవరకూ నది ప్రవహిస్తూనే వుంటుంది. ఒక్కొక్క రాయిని పేర్చి, కోటగోడలు నిర్మిస్తారు. సుత్తి దెబ్బలతో రాతిని శిల్పి మలచి విగ్రహంగా చేస్తాడు. ప్రజలు ఆశ్చర్య ఆనందాలతో కళ్ళారా చూసే శిల్పాన్ని శిల్పి ఒకే రోజులో ఒకేనాడు చెక్కలేడు. వర్షపు చినుకులు ఒక్కొక్కటిగా పడి, ధారలై, ఏరులై, నదులై పారుతుంది. వర్షం చినుకులుగానే పడుతుంది. హిమాలయ చిత్రాన్ని చిత్రకారుడు ఒక్కనాడే కుంచెతో చిత్రించలేదు. కొద్ది కొద్దిగా రోజు రోజూ కుంచెతో రంగుల్ని పూసి చిత్రించాడు.

రత్నాకరుడనే దోపిడీ దొంగ తన రామనామ పునశ్చరణ ఒక్కనాడే పూర్తి చేయలేదు. అతడు అహర్నిశలూ 'మరా - మరా - మరా ' అని సంస్మరించాడు. ప్రతినామం ఒకదాని తరువాత యింకొకటిగానే వుచ్చరించాడు. ఈ విధంగా అనునిత్యం సంస్మరించి, సంస్మరించి, చివరకు వాల్మీకి మహాముని అయ్యాడు. త్రికాలజ్ఞాని అయ్యాడు. అంటే భూత భవిష్యద్వర్తమానకాలజ్ఞానాన్ని ఎరిగినవాడై, శ్రీ రామావతారంయొక్క ప్రాముఖ్యతనూ, అవశ్యకతనూ తెలుసుకొని, శ్రీరాముడవతరించక పూర్వమే రామాయణకథ రచించాడు.

పూర్వం వారు చేసిన కార్యాల్ని యిప్పుడు మీరు కూడా చేయవచ్చును. ఇది మీకు అసంభవం మాత్రం కాదు. ఈ మహాత్ములందరూ, మానవుని ఆంతరంగిక శక్తిని ప్రకటించడానికే ఈ కార్యాలన్నీ చేసి మనకు చూపారు. మనకి విలువల్ని యెత్తి చూపారు. మనం కూడా నిరంతర

కృషితో యివన్నీ సాధించవచ్చు. చక్కని మార్గంలో పయనించడమంటే యిదే! అయితే మనసును స్వాధీనంలో పెట్టుకోవడమంటే, కృషి చేయడమే ఆపని.

అయితే యిక్కడ ఒకచిక్కు వుంది. మనసును స్వాధీనంలో వుంచుకోవాలి, విజయం సిద్ధించాలంటే, కృషి ఫలించాలంటే, ఈ విషయంలో గాఢ నమ్మకం వుండాలి. కావల్సింది ఒకే ఒక సద్గుణం. ఒకే ఒక ముఖ్య లక్షణం. అంతులేని ఉత్సాహం,ఉత్తేజం మాత్రమే. యీ అంతులేని వుత్సాహం, ఉత్తేజాలే మీకు ధైర్యలక్ష్మిగా వర్ధిల్లు ప్రోద్బలాన్ని విజయాన్నీ చేకూర్చుతాయి. ఇదంతా భగవతి విద్యామాయ – అంటే శుభప్రదమైన మాయాలక్షణం – సహాయకారియైన మాయ – అదే ఉత్సాహం. మరోపేరున వివేకం, విచారం. అనగా మంచీ చెడూ విచక్షణాజ్ఞానం అన్నమాట.

విచార వివేకాలవల్ల ప్రపంచముయొక్క శూన్యతా, అనిత్యతా, మాయా నీనుండి అవి యెంతదూరంగా వుండాలో గ్రహించగలవు. ఈ ప్రపంచంలో శాశ్వతమూ నిత్యమూ అమూల్యమైన ఏ విషయాలు లేవు. అన్నీ అనిత్యమే నని మనం గ్రహించాలి. మనల్ని మన మనసును అవగాహన చేసుకుని ఇచ్చట యెందుకు జన్మించాము అని ప్రశ్నించుకొని మనం మరచిన, లేదా పోగొట్టుకున్న దివ్యత్వాన్ని తిరిగి సంపాదించుకోవాలని ప్రయత్నం చేయాలి. నీవు విశ్వాసం కోల్పోయినా, లేదా అసలు విశ్వాసం లేకపోయినా, ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకోవాలి. నీవద్దే నీలోనే నీకు సహాయం చేయడానికి సంసిద్ధుడై యెల్లవేళలా ఎల్లకాలాల్లో నీకు ఆధారంగా మార్గగామియైయున్న దైవాన్ని మాత్రం మరువకు.

ఆయన నీ హస్తాన్నే చేపట్టితే, నీవు ముక్తి పొందేట్లుగా ఆయనే చూచుకుంటాడు. సర్వులూ మనల్ని వదలివేయవచ్చు. మనల్ని మనమే పరిత్యాగం చేయవచ్చు. కాని ఆ దైవం మాత్రం మనల్ని వదలడని నేను నొక్కి నొక్కి చెప్పుచున్నాను. ఇది సత్యం, పరమ సత్యం, సదా నిత్యసత్యం !

ప్రతీ అడుగూ, ప్రతీ వూపిరీ, ప్రతీ క్షణం, అనుదినం ఈ ఉత్సాహపు ఉత్తేజంతో జీవించండి. మరపువల్ల మూర్ఖంగా జీవించకండి. జాగరూకతతో మీరు అనుక్షణం దీన్ని సంరక్షించుకోండి. మరపూ, అజ్ఞానం అనే యీ రెండు శత్రువుల చేజిక్కకుండా మిమ్మల్ని మీరు ఎల్లప్పుడూ కాపాడుకోండి.

ఇలాగాని మీరు చేయకపోతే మీ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరైపోతుంది.

పూర్వం గంగానదిపై ప్రయాణం చేయడానికి యిప్పటిలా మోటారు బోటులు వుండేవికావు. అందుచేత పడవ నడిపేవారు చేతుల్లో తెడ్లు పట్టుకుని పడవ నడపడానికి సంసిద్ధంగా వుండేవారు. మేము వాళ్లనిచూస్తూ వుండేవాళ్లం. తెడ్లు వేయడం ఆపగానే పడవ నదీ ప్రవాహం వైపు వెళ్ళిపోయేది. ఆవలిఒడ్డుకు చేరడానికి తెడ్లు పుచ్చుకుని పడవను నడపవలసిందే.

మనం నిరంతరం కృషి చేయడం వల్ల విజయసిద్ధి కావడం తథ్యం! అనే సత్యం వెల్లడి అవుతుంది. బద్ధకం, నిర్లక్ష్యం వల్ల పట్టువీడిపోవడమే కాదు, సర్వనాశనం కూడా అవుతుంది. విషయం యిక మీది కాదు. అవగాహన చేసుకుని విషయాన్ని క్షుణ్ణంగా ఆలోచించి, విచార వివేకాలతో ప్రవర్తించండి. మనసులో నిర్లక్ష్యం మరపూ వుంటే అవి మిమ్మల్ని ఉత్సాహ అభినివేశ శూన్యులుగా చేస్తుంది. అగ్ని జ్వాలగా ప్రజ్వరిల్లడానికి వాయువు సహాయం అవసరం. ఇదేవిధంగా ఉత్తేజం, మీకు శక్తీ, ధైర్యం యిచ్చి మీ కృషికి మూలాధారంగా వుంచుతుంది. ఈ శక్తే మీకు మిత్రుడు.

భగవంతుడు మిమ్మల్ని నిష్కారణంగా భారతదేశ ఆధ్యాత్మిక కేంద్రమైన ఋషీకేశంలో నివసింపచేస్తుండడం లేదని మరువకండి. ఈ అర్హత మీకు వున్నప్పుడు యింకా ఉన్నతమైన అర్హతకు మీరు అర్హులనే గదా అర్థం. అది మీకు తప్పక ప్రాప్తిస్తుంది. ప్రార్థించండి, అర్థించండి. అది తప్పక మీకు ప్రాప్తిస్తుంది.

మీరు పాత్రులూ, అర్హులూ కాబట్టే యిచ్చటకు తీసుకురాబడ్డారు. మీ అర్హతా పాత్రతా నిరూపించుకొని యింకా లాభం పొందండి. కాని యింకా యింకా కోర్కెల్ని పెంచుకొని జీవించవద్దు. ఇది చాలా కీలకమైన విషయం. అవిరళకృషీ,ఉత్తేజం, ప్రోత్సాహాలతో ప్రయత్నించండి. పరమేశ్వరుడు మీకు త్వరితగతిని ముక్తిసామ్రాజ్యం యిచ్చి, మహనీయులుగా, యోగులుగా కావాలని ఆశీర్వదించుగాక !

(పూజ్యశ్రీ చిదానందస్వాములవారి శతజయన్తి సందర్భంగా)

జీవితం - పరమార్థం

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

మానవ జీవితానికి ముఖ్య ప్రయోజనం మోక్షమే. పురుషార్థం అంటే " మగవారికి సంబంధించిన అర్థం " అని భావించరాదు. పురుషుడు అంటే జీవుడు అని అర్థం. పురి = శరీరమున, శేతే = శయనించువాడు దేహాన్ని ఆశ్రయించి ఉండేవాడు జీవుడు అని తెలుసుకోవాలి. ఇక్కడ స్త్రీ పురుష భేదం లేదు.

పురుషార్థత్రయావిష్టాః పురుషాః పశవోధ్రువమ్ ।
మోక్షార్థీ పురుషః శ్రేష్ఠః ఇతి వేదాంత డిండిమః ॥

ధర్మం, అర్థం, కామం - అనే మూడు పురుషార్థాలలోనే ఆసక్తి గల జీవులు నిజంగా పశుప్రాయులు, మోక్షాన్ని అభిలషించే జీవుడు శ్రేష్ఠుడని వేదాంతభేరి ఘోషిస్తున్నది.

హిరణ్యకశిపుడు ప్రహ్లాదునికి విద్య బోధించుడని నియమించిన గురువులు బాలునికి త్రివర్గాలనే, అనగా ధర్మార్థ కామాలనే బోధించారు. కాని ఆ బాలుడు " చదువులలో మర్మ మెల్ల చదివితి " అని చరమ పురుషార్థాన్ని గూడా అధ్యయనం చేశానని చెప్పాడు.

అత్రాహారార్థం కర్మ కుర్యాదనింద్యం
కుర్యాదాహారం ప్రాణసంరక్షణార్థమ్ ।
ప్రాణాః సంధార్యా స్తత్త్వ జిజ్ఞాసనార్థం
తత్త్వం జిజ్ఞాస్యం యేన భూయో న జన్మ ॥ అని యోగవాసిష్ఠం.

ఆహారం కొరకు లోకనిందకు గురికాని పనులు చేయాలి. జీవించుటకు అవసరమైనంత వరకే ఆహారం గ్రహించాలి. తత్త్వం తెలుసుకోవడానికే జీవించాలి. మోక్ష ప్రాప్తినుద్దేశించియే తత్త్వం గ్రహించాలి అని భావం.

కఠోపనిషత్తులో నచికేతుడు యముని ప్రలోభాలకు లొంగలేదు. నాకు ఆత్మతత్త్వజ్ఞానమే కావాలన్నాడు. ప్రేయస్సు పట్ల విముఖుడై శ్రేయస్సునే కోరుకున్నాడు. మదాలస తన పిల్లలను ఊయెలలో పెట్టి ఊపే దశనుండే ఆత్మజ్ఞానం వైపు నడిపించింది. ఆమె పాడిన పాట ఇది...

శుద్ధో 2 సి బుద్ధో2సి నిరంజనో2 సి
సంసారమాయా పరివర్జితో 2 సి,
సంసారస్వప్నాం త్యజ మోహనిద్రాం
మదాలసా వాక్యమువాచ పుత్రమ్ ॥

" నాయనా ! నీవు శుద్ధుడవు, బుద్ధుడవు, మాలిన్యం లేనివాడవు, సంసారమాయ నిన్ను అంటదు. సంసారమనే కలలుగనే మోహమనే నిద్రను పరిత్యజించు " అని శైశవ దశలోనే ఆమె తన పిల్లలకు తత్త్వబోధ కావించినది. తన కడుపున పుట్టిన పిల్లలు, మరల మరొక వనితాగర్భంలో పడకూడదు ' అని ఆమె నిర్ణయం. మొదటి ముగ్గురు పుత్రులను ఆమె అలా దిద్ది తీర్చింది. నాల్గవవాడైన అలర్కుణ్ణి అలా తీర్చటానికి తండ్రి అడ్డు పడ్డాడు. చివరికి పెద్ద కొడుకు సుబాహువుయొక్క ప్రయత్నంతో వాడు కూడా మోక్షమార్గగామి కాగలిగాడు.

ఇలా ఎన్నో కథలు, గాథలు పరమ పురుషార్థ ప్రాముఖ్యాన్ని గూర్చి చెప్పేవి మన ధార్మిక సాహిత్యంలో ఉన్నాయి.

ఆ కాలంలోని వారే కాక ఈ కాలానికి చెందిన మహా పురుషులు గూడా మోక్ష ప్రాధానాన్ని నొక్కి వక్కాణించారు. భోగాలపట్ల విముఖులై యోగమార్గంలో చరించారు.

శ్రీ రమణ మహర్షి, శ్రీ అరవింద యోగి, శ్రీ నారాయణ గురువు,

శ్రీ మలయాళస్వామి మున్నగు నేటి మహనీయులే ఇందుకు నిదర్శనం. వీరు తమ ముక్తిని మాత్రమే చూచుకుని తృప్తి పడక ఇతరుల విముక్తికి గూడా పాటుపడ్డారు.

అంతేకాదు సమాజంలో తరతరాల నుండి పాతుకుపోయి వుండిన మూఢవిశ్వాసాలను గూడ పటాపంచలు చేశారు. స్వరాజ్యంపై ఎలా అందరికీ హక్కున్నదో, అలాగే స్వారాజ్యం పైన గూడా ఆత్మ సామ్రాజ్యంపై హక్కున్నది అని ఎలుగెత్తి చాటారు. బ్రహ్మజ్ఞానాన్ని ఒక లింగానికో, ఒక కులానికో, ఒక వర్గానికో, ఒక వర్ణానికో వీరు పరిమితం చేయలేదు. సంకుచిత భావాలను విడనాడమని బోధించారు.

జీవితంలోని పరమార్థం ఇట్టిదని వారు చవిచూచి అందరికీ దాన్ని చవిచూచే మార్గాన్ని నిర్దేశించారు. వారిని సదా స్మరించుదాం !

జపం

గడపపైన వుంచిన దీపం గదిలోపల, గది బయట వెలుతురును ప్రసరింపజేస్తుంది. అట్లే భగవన్నామ జపం మన బాహ్యా భ్యంతరాలను ప్రకాశవంతం చేస్తుంది. **– కబీరుదాసు**

....

జీర్ణక్రియకు తోడ్పడే పైత్యరసస్రావంలో అస్తవ్యస్తత ఏర్పడినపుడు చక్కెర రుచించదు. కానీ ప్రతిరోజు అక్కరతో చక్కెరను తింటూంటే క్రమంగా చక్కెర రుచిస్తుంది. అట్లే అజ్ఞానంలో వున్నవారికి భగవన్నామం (జపం) రుచించదు. కానీ క్రమంగా ఆధ్యాత్మిక సాధనలను అనుష్ఠిస్తూ వస్తే అజ్ఞానం అదృశ్యమై భగవన్నామం (జపం) పట్ల రుచి ఏర్పడుతుంది.

– వేదవ్యాసులు

....

ప్రపంచంలో వున్న భగవచ్ఛక్తిని మానవుడు తన శరీరంలోనికి, తన మనస్సులోనికి ఆకర్షించుకోడానికి చేసే సాధనే మంత్రజప ప్రక్రియ.

జ్ఞాన సుధ

మూలం
శ్రీ సర్వభూషణ శివయోగి వారు

అనువాదం :
శ్రీ శంకరానందగిరి స్వాములవారు,
ఉమామహేశ్వర పీఠాధిపతులు

(గతసంచిక తరువాయి)

అవ : అహంకార చిదాభావముల అధ్యాసమే బంధము. తన్నివృత్తియే ముక్తియని తెలుపుచున్నారు.

క్లేశాః పంచ షడూర్మయో నవ గుణాః షడ్భ్రాంతయోష్టామదాః
కోశాః షడ్వ్యసనాని సప్త రిపవ ష్షట్త్రీణి కర్మాణి చ,
ఇత్యేషా మభిమానలేప శబలాహంకార చిచ్ఛాయయో
రధ్యాసః ఖలు బంధనం తదుభయో ర్ముక్తి ర్విముక్తిర్ నృణామ్ 25

పంచక్లేశాః = అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము అనెడి ఐదు క్లేశములు; చ = మఱియు, షడూర్మయః = జర , మరణము, ఆకలి, దప్పి, శోకము, మోహము అనెడి ఆఱు ఊర్ములు; నవ గుణాః = ధర్మ, అధర్మ, యత్న, ద్వేష, భావనా, రాగ, సుఖ, దుఃఖ,ఇచ్ఛలనెడి తొమ్మిది గుణములు; షడ్ భ్రాంతయః = జాతి, వర్ణ, ఆశ్రమ, కుల, గోత్ర, రూపము లనెడి ఆఱు భ్రమలు; అష్ట మదాః = కుల, రూప, యౌవన, ధన, స్త్రీ, పుత్ర, విద్యా, రాజ్య మదము లనెడి ఎనమిది మదములు; షట్ కోశాః= చర్మము, రక్తము, మాంసము, మజ్జ, స్నాయువులు (నరములు), అస్థులు అనెడి ఆఱు కోశములు; సప్త వ్యసనాని = తను, మనో, ధన, విశ్వ, ఉత్సాహ, సేవక, రాజ్య సంబంధము లైన ఏడు వ్యసనములు; షడ్ రిపవః = కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరములనెడి యాఱు శత్రువులు; త్రీణి కర్మాణి = సంచితము, ఆగామి, ప్రారబ్దము అనెడి మూడు కర్మలు, ఇతి = ఈ ప్రకారమైన, ఏషాం = వీని, అభిమాన లేప శబల = (నేను నాది యను) అభిమానము లిప్తత అనువానిచే నానావిధములుగా నుండెడి,

అహంకార చిచ్ఛాయయోః= అహంకారము, చిత్ ప్రతిబింబము అను నీ రెంటి యొక్క అధ్యాసః = తాదాత్మ్య భ్రమమే, బంధనంఖలు = బంధము (ముడి) గదా ! (కావున), తత్ ఉభయోః = ఈ యహంకార చిత్ప్రతిబింబముల యొక్క ముక్తిః = విడుపే, విడుదలయే, నృణాం = నరులకు, విముక్తిః = మోక్షము.

పంచక్లేశములు మొదలైనవి గల ఈ యనాత్మసంఘాతమును నేను నాది యని భ్రమించుటయే బంధము. ఇది నేను కాదని, ఇవి నావి కావని, కేవల మహంకారకల్పితములని, తద్భిన్నముగా నుండు సాక్షిరూపాత్మయే నేనని తెలియుట మోక్షమగును. అహంకార తద్ధర్మముల నుండి చిదంశము విడివడుటయే మోక్షము. పంచక్లేశములు, షడూర్మ్ములు, నవగుణములు అహంకార కల్పితములు. అట్టి యహంకారమునందు సాక్షి చేతనముయొక్క ప్రతిబింబ ముండును. ఆ ప్రతిబింబమును చిదాభాసుడనియు, జీవుడనియు చెప్పుదురు. ఈ జీవుడు అవివేకముచే దేహాది అనాత్మధర్మములను తనయందు ఆరోపించుకొనును. అందుచేత బంధము గలవాడని చెప్పబడును. జీవునకు గల బంధ మిదియే. తప్తాయఃపిండన్యాయమున (కాలిన ఇనుప గుండు విధమున) నుండు అన్యోన్యాధ్యాసరూపమైన ఈ బంధమునే హృదయ గ్రంథియనియు చెప్పుదురు. గ్రంథి యనగా ముడి. ఈ ముడి యొక్క విడుపే ముక్తియని శాస్త్రములు చెప్పుచున్నవి. ఎప్పుడు ఈ జీవుడు వివేకము గలవాడై అహంకార తద్ధర్మముల సంబంధ మొందక తత్సాక్షియగు ప్రత్యగాత్మ స్వరూపుడను నేనని తెలిసికొనునో అపుడు ముక్తుడగును. జ్ఞానాజ్ఞాన మూలమున బంధమోక్షాది వ్యవహారము చిదాభాసునియందే వర్తించుచున్నది. నిత్యముక్త కూటస్థాసంగ సాక్షియైన ప్రత్యగాత్మయందు గాదు. అనగా సప్తా (ర్వా) వస్థలు జీవునికే కాని సాక్షికి లేవు. సాక్షి నిత్యముక్తమని భావము.

కథాత్మక గీతా సూక్తులు

–ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

(గత సంచిక తరువాయి)

2.6. అశాంతస్య కుతస్సుఖమ్

ఈ గీతావాక్యం సాంఖ్యయోగనామకమనే రెండవ అధ్యాయంలో 66వ శ్లోకంలో ఉత్తరార్ధభాగం. మనశ్శాంతి లేని వానికి సుఖమెక్కడ ? అని సారాంశం.

భారతీయులు శాంతికాముకులు, వ్యక్తిగత శాంతికి, కౌటుంబిక మయిన శాంతికి, సాంఘిక శాంతికి ఎన్నో నీతులు చెప్పారు. అశాంతిని తొలగించుకోవడానికి ఎన్నో మార్గాలున్నాయి. ద్వేషం వల్ల కలిగే అశాంతికి తనకంటే తక్కువ వారితో పోల్చుకోమనడం ఒక ఉపాయం. భక్తి, పుణ్యకథాశ్రవణం, పెద్దరికం శాంతికి స్వాగతం పలుకుతాయి. ఈ నేపథ్యాలతో కూడిన కథలను అనుసంధానించుకోవడం సబబు.

అకారణమయిన ఈర్ష్య కొందరికి సహజం. ఒక గ్రామంలో ఒక బీదవాడు కష్టజీవి. హాయిగా ఆనందంగా కాలం గడుపుతున్నాడు. ఒక ధనవంతుడు తనకు అన్నీ వున్నా శాంతి లేకపోవడం గుర్తించాడు. అంతవరకు ఫరవాలేదు గాని పేదవానిని చూచి ఈర్ష్యపడసాగాడు. లోకంలో నిదర పట్టనివారు పరుపులేక మంచం లేక కటికనేలమీద కాలు చాచి హాయిగా నిద్రించడం చూచి అసూయపడుతుంటారు. ఆలాగే ఆ ధనికుడు అసూయ పడ్డాడు. అనుకోకుండా ఆ ఊరికి ఒక సన్న్యాసి వచ్చాడు. ధనికుడు సన్న్యాసి దగ్గరికి వెళ్ళి తన బాధ వెళ్ళగక్కాడు. సన్న్యాసి ఆలోచించి ‘ నీ అశాంతికి ధనమే కారణమన్నాడు. మరి పేదవాడు హాయిగా ఉన్నాడు కదా, అంటే ఒక ఉపాయం చెప్పాడు సన్న్యాసి.

ధనవంతుడు ఒక గుడ్డలో 99 రూపాయలు కట్టి గుడిసెలో పడవేశాడు. పేదవాడు తాను సంపాదించిన డబ్బుతో సరకులు కొని ఇల్లు చేరి వంట చేసుకొని హాయిగా తిని పడుకొనేవాడు. కాని పేదవాడు ఇంట్లో ప్రవేశించగానే ఒక చిరుమూట కనబడింది. పేదవాడు పరుగులెత్తి ఆ మూట విప్పాడు. ఆ మూటలో 99 రూపాలున్నాయి. మాటి మాటికి లెక్కపెట్టాడు.

ఒక్క రూపాయి వుంటే 100 అయ్యేదికద అని ఆలోచించాడు. అప్పటికే సరుకులకు తన సంపాదన అంతా ఖర్చయిపోయింది. మరుసటి రోజు సంపాదనలో ఒక రూపాయి మిగలపెట్టాలనుకొన్నాడు. కాని సరకుల ధర పెరగడంతో కుదరలేదు. రెండవ రోజు కూలి దొరకలేదు.

మూడవరోజు సుస్తీ చేస్తే మందులకు సరిపోయింది. ఒక్క రూపాయి కూడా చేర్చలేకపోయాను కదా అని బెంగపెట్టుకొని నిదరోవడం మానేశాడు. మొగంలో కళ తప్పింది. పోనీ ఈ డబ్బు వడ్డీకి ఇస్తే అమ్మ బాబోయ్ అసలుకే మోసం వస్తే. చీకాకు మొదలయింది. ధనవంతుడు పేదవానిని చూస్తునే వున్నాడు. పేదవానిలో అశాంతికి డబ్బే కారణమని తెలిసింది. అప్పటి నుండి 'ధనాశ' క్రమంగా వదలిపెట్టాడు.

అశాంతికి మరో కారణం ఆధిపత్యపు పోరు. బౌద్ధంలో దీనికి సంబంధించి ఒక కథ వుంది. దేవదత్తుని కథ. దేవదత్తుడు శాక్యముని (బుద్ధుని) శిష్యుడు. అతనిని అందరు గౌరవిస్తున్నారు. సన్యాసి పాటించే బాహ్య నియమాలలో అతని కతనే సాటి. ఆ కారణంవల్ల అందరూ అతనిని ఆదరించేవారు.

ఒకరోజు దేవదత్తుడు శాక్యముని దగ్గరికి వెళ్ళి ' మన భిక్షుసంఘం పెరిగి పోతూ వుంది. అనేక కేంద్రాలు ఏర్పడ్డాయి. ఈ నిర్వహణభారమంతా మీకెందుకు ? నాకు అప్పగించండ'ని చెప్పాడు. శాక్యముని సాంతం

శాంతంగా విని –

'దేవదత్తా ! ఏమిటది ?నేను ఈ సంఘస్థాపకుణ్ణి కాదు. ఏనాడూ నేను ఈ సంఘానికి అధిపతిగా భావించలేదు. ఎవరయినా కనబడితే ' ఏహి భిక్షో వరబ్రహ్మచర్యమ్ ' అంటాను. నా వారసులంటూ ఎవరూ లేరు.' అన్నాడు. దేవదత్తుడు ఖంగు తిన్నాడు. అయినా భిక్షుసంఘంలో మార్పులు రావాలని వాదించాడు. శాక్యముని మౌనంగా ఉండిపోయాడు. దేవదత్తుడు భిక్షుసంఘంలో కలతలు రేపి కొన్ని వందలమందితో వేరే సంఘం పెట్టాడు. ఈ విషయం శౌరిపుత్ర, మౌద్గల్యాయనులకు తెలిసింది. వారు బాధపడ్డారు. కొత్త సంఘానికి వచ్చి ' ఇదేమిటని ' గద్దించారు. చివరకు దేవదత్తుని దుష్ట సంకల్పం తెలుసుకొని వారందరు మరల బుద్ధుని పంచజేరారు. అయినా దేవదత్తుని పగ చల్లారలేదు.

ఒకసారి బుద్ధుడు కొండెక్కుతుంటే అతని మీద రాయి దొరలించాడు. భిక్షాటనకు వెళుతుంటే 'నాలాగిరి' అనే ఏనుగును ఉసికొల్పాడు. అయినా ఆ ఏనుగు ఏమీ చేయలేకపోయింది. చివరకు కిరాయి గూండాలతో బుద్ధుని హతమార్చే ప్రయత్నం చేశాడు.అయినా వారు బుద్ధుని దర్శించి శరణాగతులయ్యారు. ఇన్ని పాపకార్యాలు చేయడం వల్ల దేవదత్తుడు చివరకు నరకంపాలయ్యాడు.

భారతంలో కూడా దుర్యోధనుడు ఆబాల్యం అంశాతుడుగానే కనిపిస్తాడు. పాండవుల బలిమికి, కలిమికి అసహనం. కురుక్షేత్రం సంగ్రామంలో అందరు మరణించినా 'పాండవ విజయం ' మింగుడు పడలేదు. ఆ సమయంలో అశ్వత్థామ ' అపాండవం కరిష్యామి ' అంటే సంతోషించడమే గాకుండా ఉసిగొల్పాడు. అశ్వత్థామ ఉపపాండవుల్ని చంపినా చివరకు అతడు కూడా అవమానం పాలయ్యాడు. చిరంజీవిగా అశాంతితో గడపవలసినవాడయ్యాడు.

పరమశాంతులు కూడా అశాంతులు కావడానికి అనేక

కారణాలున్నాయి. మచ్చుకు స్త్రీలలోని మాత్సర్యం ఒకటి. కద్రువ 'వినత 'ను అణచాలనుకొంది. మాయోపాయంతో విజయం సాధించింది. బలవంతుడయిన గరుత్మంతునితో వెట్టిచాకిరి చేయించింది. హిరణ్య కశిపుడు తానే భగవంతుడనని భావించి విష్ణుద్వేషంతో కుతకుతలాడి అశాంతి అనుభవిస్తూ కుమారుని నానాహింసల పాల్జేశాడు. కైక మంథర మాటలతో ' అశాంతి'ని కోరి తెచ్చుకొంది.

శూర్పణఖ సీతాసౌందర్యాన్ని, శ్రీరాముని గాంభీర్యాన్ని బేరీజు చేసుకొని తగని విధంగా ప్రవర్తించి 'కురూపి' అయింది. కంసుడు తాను అత్యంతం ప్రేమించే చెల్లెల్ని, బావను చెఱశాలలో పెట్టి, తండ్రిని కారాగారంలో బంధించి చివరకు అశాంతితో పుట్టిన బిడ్డనల్లా చంపించి వికృతానందం అనుభవించాడు. చివరకు అతని అశాంతి అతని పాలిట శత్రువయింది.

యయాతి ముసలివాడయ్యాడు. అతనికి కోరికలున్నాయి. యౌవనం కావాలనుకొన్నాడు. ఒక కుమారుడు తన యౌవనం ఇచ్చాడు. అయినా ఆ యౌవనంలోనూ శాంతి కలుగలేదు. ఆ కోరికలవల్ల ఇంద్రియానుభవం ఉండవచ్చు గాని శాంతి ఎండమావులాంటిదే. భౌతిక అవసరాలకోసం పరితపించే వారికి శాంతి ఆమడదూరమే. శాంతించిన మనస్సు పరమాత్మను దర్శించడానికి అవకాశ మిస్తుందనడంలో సందేహం లేదు.

నేటి సామాజిక జీవితంలో 'అశాంతి ' ఎక్కువ. 'శాంతము లేక సౌఖ్యము లేదు ' అని త్యాగయ్య ఉద్బోధ. అన్ని కోర్కెలు త్యజించినవారు, విషయముల పట్ల ఆసక్తి లేని వారు, అహంకార మమకారాలు వదలివేసిన వారు శాంతితో మనగలుగుతారు. కోరికలు తీర్చుకొన్నంత మాత్రాన శాంతి కలుగదు.

నాస్తి బుద్ధి రయుక్తస్య నచాయుక్తస్య భావనా
నచా భావయతః శాన్తి రశాన్తస్య కుతః సుఖమ్ ॥



శ్రీ భక్త తుకారాం అభంగవాణి

- శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు

(గత సంచిక తరువాయి)

శ్లో ॥ య ఇచ్ఛేత్ పురుషో 2 త్యంత మాత్మానం నిరుపద్రవమ్ ।
స వర్జయేత మాంసాని ప్రాణినామిహ సర్వశః
(మ.భా.అను.ప. 115 -48)

అర్థము : ఏ మనుష్యుడు అత్యంత నిరుపద్రవరూప పరమశాంతిని పొందగోరునో, నతడు జగత్తులో ప్రాణులయొక్క మాంసమును ఏ నిమిత్తముచే గాని, ఎప్పుడు గాని స్వీకరించగూడదు. మాంసభక్షణమును పరిత్యజించవలయును.

శ్లో ॥ అనిష్టం సర్వభూతానాం మరణం నామ భారత ।
మృత్యుకాలే హి భూతానాం సద్యో జాయతి వేపథుః ॥
(మ.భా. అను ప. 116 - 17)

అర్థము : హే భరతనందన ! ఏ ప్రాణికిని మరణము యిష్టముండదు. ఎందుకనగా ? సకల జీవులకు మృత్యుకాలములో శరీరము మృత్యు భయముచే వణుకును.

శ్లో ॥ నాకృత్వా ప్రాణినాం హింసాం మాంస ముద్పృద్యతే క్వచిత్ ।
నచ ప్రాణివధః స్వర్గ్యస్తస్మాన్మాంసం వివర్జయేత్ (మ.స్మృ. 5-42)

అర్థము : ప్రాణులను హింసించకుండా ఎక్కడనూ మాంసము త్పన్నమగుటకు వీలులేదు. జీవహింస స్వర్గసాధనము గాదు. ప్రతిబంధక మగును. కావున మాంసభక్షణమునశేషముగా సర్వదా పరిత్యజించ వలయును.

శ్లో ॥ నహి మాంసం తృణాత్కాష్టా దుపలాద్వాపి జాయతే ।
హత్వా జన్తుం తతో మాంసం తస్మాద్దోషస్తు భక్షణే ॥
(మ. భా. అను. ప. 115 -24)

అర్థము : మాంసము తృణము (గడ్డి) నుండిగాని, కాష్టము (కట్టెల)

నుండి గాని, మరియు శిలల (రాళ్ళ) నుండి గాని, ఉత్పన్నము గాదు. అది జీవులను హత్య జేయుట తోడనే ప్రాప్తమగు చున్నది. కావున మాంస భక్షణము జేయుట మహాదోషము. దాని నుండి నివృత్తమగుటయే మహా పుణ్యమని చెప్పబడినది.

శ్లో ॥ సముత్పత్తించ మాంసస్య వధబంధౌ చ దేహినామ్ ।
ప్రసమీక్ష్య నివర్తేత సర్వమాంసస్య భక్షణాత్ ॥ (మ.స్మృ 5-49)

అర్థము : శుక్రశోణితముల కలయికచే మాంసముత్పన్న మగుటంజేసి యది యత్యంత నిందనీయమని (హేయమని) యు, మాంసమునకు మూలమగు ప్రాణి వధ, బంధనములు క్రూర (అవమాన) కర్మలని యెఱింగి శాస్త్ర విహితవైన మాంస భక్షణము సహితము త్యజించవలయును. కావున శాస్త్ర విహితముగాని (నిషిద్ధ) మాంసభక్షణము నుండి నివృత్తము గావలయునని వేరుగ జెప్పవలయునా ? (కై ముతిక న్యాయము).

శ్లో ॥ అనుమంతా విశసితా నిహంతా క్రయ విక్రయీ ।
సంస్కర్తా చోపహర్తా చ ఖాదకశ్చేతి ఘాతుకాః ॥ (మ. స్మృ. 5-51)

అర్థము : జీవహింసను సమ్మతించు (సమర్థించు) వాడు, జీవముల యంగములను ఛేదించువాడు, జీవులను జంపువాడు, ప్రాణుల మాంసమును కొనువాడు, దానిని విక్రయించువాడు, వంట చేయువాడు, వడ్డించువాడు మరియు భక్షించువాడు వీరలందఱకు ఘాతుకులనం బడుదురు.

ఖాదకా సర్వ ఏవ తే (మ. భా. అను. ప 115 - 45) పైన జెప్పబడిన వారందఱు మాంసభక్షకులుగానే పరిగణింపబడతారు. అనగా మాంసమును తినువానితో సమానముగా పాపమునకు పాత్రులై, నరకమును పొందెదరు.

శ్లో ॥ పుత్రమాంసోపమం జానన్ ఖాదతే యో2విచక్షణః ।
మాంసం మోహసమాయుక్తః పురుషః సో2ధమః స్మృతః ॥

(మ.భా.అను.ప. 114- 11)

అర్థము : పుత్రమాంసమునందును, ఇతర పశుపక్ష్యాదుల మాంసము నందును మాంసత్వసామ్యమున్నదని అనగా భేదము లేదని తెలిసిగూడ యే మూర్ఖుడు జిహ్వాచాపల్యముచేగాని, శరీర పుష్ట్యర్థము గాని మోహవశు డై మాంసమును భక్షించునో, వాడు నరాధముడని చెప్పబడినది.

శ్లో ॥ అఖాదన్ననుమోదంశ్చ భావదోషేణ మానవః ।
యో2నుమోదతి హన్యంతం సో2 పి దోషేణ లిప్యతే ॥
(మ. భా.అను.ప. 115 - 38)

అర్థము : ఎవడు స్వయముగా మాంసమును తినక (భక్షించక), తినువానికి మాత్రము అనుమోదనము (సమర్థనము) జేయునో, ఆ మనుష్యుడు భావదోషముచే మాంసభక్షణమను పాపమునకు అధికారియగును. అదేవిధముగా నెవరు చంపు వానికి యనుమోదనము జేయునో నతడు గూడ హింసాదోషముచే లిప్తుడగును (అంటబడును)

శ్లో ॥ స్వమాంసం పరమాంసేన యో వర్ధయితుమిచ్ఛతి ।
అనభ్యర్చ్య పితౄన్ దేవాన్ తతో 2 న్యో నాస్త్యపుణ్యకృత్ ॥
(మ. స్మృ5 -52)

అర్థము : ఎవడు యజ్ఞములచే దేవతలను, శ్రాద్ధములచేఁ బితరులను తృప్తిపఱచక, యితర మాంసములచే స్వమాంసమును వృద్ధి నొందింపజూచునో, వానికంటె నీచుడు (పుణ్యహీనుడు) వేఱొకడు లేడు.

శ్లో ॥ యోహి ఖాదతి మాంసాని ప్రాణినాం జీవితైషిణామ్ ।
హతానాం వా మృతానాం వా యథా హంతా తథైవ స ః ॥
(మ. భా.అను.ప. 115- 37)

అర్థము : ఎవడు జీవింపనిచ్ఛగించు ప్రాణులను చంపునో, లేక స్వయముగా మృతినొందిన వాటి మాంసమును తినునో, వాడు చంపకున్నా చంపిన వాడుగా (హంతకుడుగా) నే పరిగణింపబడును.

గజేంద్ర మోక్షము - రహస్యార్థము

- ఎన్.వి. భారతీలక్ష్మి (భీమవరం)

శ్రీ మద్భాగవతము భక్తి రస ప్రధానమైన గ్రంథమైనప్పటికి అందు జ్ఞాన వైరాగ్యములు కూడ అంతర్లీనముగా మిళితమై యున్నాయి. ధ్రువ చరిత్ర, ప్రహ్లాద చరిత్ర, పురంజనోపాఖ్యానము, గజేంద్ర మోక్షము మొదలైన ఉపాఖ్యానములు భక్తి జ్ఞాన వైరాగ్యముల సమ్మేళనం. గజేంద్ర మోక్షములో పరీక్షన్నరేంద్రుని సందేహములు శుకమహర్షి సమాధానములలోని రహస్యార్థము జిజ్ఞాసువులకు పరమార్థము నెరింగించును.

అశ్వత్థామ దురహంకారముతో ఉత్తర గర్భమునందున్న జీవుని నశింపజేయుటకు బ్రహ్మాస్త్రమును ప్రయోగించాడు. శ్రీ కృష్ణపరమాత్మ ప్రాణాంతకమగు ఆ బ్రహ్మాస్త్రమును ఉపశమింప జేసి ఆ జీవుని రక్షించాడు. తన్ను రక్షించిన ఆ పరమ పురుషుడెవరు ? ఎక్కడ ఉన్నాడు ? అని ఆ జీవుడు అన్వేషింప సాగెను. 'కృ' అనగా సత్. 'ష్' అనగా చిత్ 'ణ' అనగా ఆనందం. కృష్ణ అనగా సచ్చిదానంద స్వరూపుడగు పరమాత్మ. అట్టి పరమాత్మ నన్వేషించి, పరీక్షించి తెలిసి కొన్నందున ఆ జీవుడు పరీక్షిత్తని పిలువబడెను.

పరీక్షిత్తు అభిమన్యుని కుమారుడు. అతడు అహంకారముతో చచ్చిన పామును శమీక మహర్షి మెడలో వేసెను. తన తండ్రికి జరిగిన అవమానమునకు కోపించి మహర్షి కుమారుడగు శృంగి ఏడు రోజులలో తక్షకుడను సర్పముచే మరణింతువుగాక అని శపించెను. పరీక్షిత్తు తన అపరాధమునకు పశ్చాత్తాప పడి శరీరమస్థిరమని భావించి సర్వ సంగ వివర్జితుడై, మోక్షైకదీక్షాపరుడై, శుకమహర్షియొద్ద శ్రీ మద్భాగవతము శ్రవణం చేసి తరించాడు. అట్టి భాగవతములో గజేంద్ర మోక్షమనే సన్నివేశం భక్తులకు ఆనందదాయకం. అందలి రహస్యార్థము ముముక్షువులకు మోక్షప్రదం.

త్రిగుణాత్మిక ప్రకృతియనే త్రికూటాచల ప్రాంతమున

సంసారారణ్యం వ్యాపించి యున్నది. అందలి అశ్వత్థమను సంసార వృక్షమునకు అజ్ఞానమే బీజము. నేనను అహంకారము ఆ బీజమునకు అంకురము, రాగము లేత చిగుళ్ళు స్థూల ఉపాధి మాను. దశేంద్రియములు కొమ్మలు. శబ్దాది విషయములు పుష్పములు. అనేక జన్మలలోని కర్మవాసనల చేత గలిగిన ప్రారబ్ధానుభవ సుఖదుఃఖములు ఫలములు. ఆ ఫలములను భుజించుచు జీవ విహంగములు ఆ సంసార వృక్షముపై విహరించుచున్నవి. దట్టమైన ఆ సంసారారణ్యంలో కామ, క్రోధములనే భయంకరమైన క్రూర మృగములు సాధకుని చిత్తమనే హరిణమును వేధించుచున్నవి.

మూలాధారాది చక్రములనే పర్వత గుహలనుండి జీవుడనే గజేంద్రుడు అష్టవిధ ప్రకృతి సమూహములనే చెలికాండ్రతో కలసి విషయ సుఖములనే చెట్ల చిగుళ్ళను భక్షించుచు సంసారారణ్యంలో విహరించు చున్నాడు. అవిద్యయనే ప్రియురాలికి సంతృప్తి కలిగించు విషయములను నెరవేర్చుచు, స్వస్థానమగు ఆత్మ స్వరూపమును మఱచి, పరిభ్రమణశీలుడై విచ్చలవిడిగా సంచరించుచున్నాడు. అనగా నివృత్తి మార్గమును విడచి ప్రవృత్తి మార్గంలో తిరుగుచున్నాడు. అవిద్యావృతుడైన ఆ గజేంద్రుని తాకిడికి సంసారారణ్యంలోని రాగద్వేషములనే జంతువులన్నీ చెల్లా చెదురై పోవుచున్నవి.

బడలిక చెందిన జీవ గజేంద్రుడు విషయ సుఖములనే చెలికాండ్రతో కలసి జలమునకై అన్వేషించుచు ఎండ మావులను చూచి జలమని భ్రాంతి చెంది నిరాశతో వెను తిరుగుచుండెను. అనగా, విషయ ప్రపంచమనే అరణ్యంలో పరమాత్మ భావమునుండి వేరై దారితప్పి తిరుగుచుండెను. సమిష్టినుండి వేరై అనగా ఈశ్వరభావమునుండి వేరై వ్యష్టి భావమును అనగా, జీవభావమును పొందుటే ఆత్మ నుండి యెడబాటు నొంది సంసారారణ్యంలో దారి తప్పి పోవుట. సమిష్టి యనగా మాయా ప్రతిబింబితుడగు ఈశ్వరుడు. వ్యష్టి యనగా అవిద్యా ప్రతిబింబితుడగు

జీవుడు. సమిష్టి పరిపూర్ణము, వ్యష్టి పరిమితము. దాహార్తితో నున్న ఆ జీవుడను గజేంద్రుడు అహంకారమనే లతలతో ఆవరించియున్న, భ్రాంతి జనక పుష్పములతో గూడిన, అరణ్యంలో బుద్ధియనే జలముతో నిండిన మనస్సను సరోవరమును కనుగొన్నాడు. అనాద్యవిద్యావాసనలచే వ్యాపింపబడిన, హృదయ పద్మములచే వికసింపబడిన, తృష్ణయను తుమ్మెదలతో గూడిన, కామాది జలచరములతో నిండిన, సందేహములనే తరంగములు, కోరికలనే సుడి గుండములు, దర్పమనే అగాధము, ఆశయనే తీరము గల ఆ మనస్సను సరోవరమును జూచి ఆనందాంతరంగుడై జీవుడను గజేంద్రుడు తన సహచరులతో కలసి ఆ మనస్సరోవరములోనికి దుమికి కడుపార నీటిని త్రాగుచు జన్మ పరంపరలనే మునకలు వేయసాగెను. జలపానముతో తృప్తి చెందక తొండములతో నీటిని పీల్చుచూ, సహచరులపై విరజిమ్ముతూ, ఇష్టానుసారముగా జలకేళి సాగించుచుండెను. గజేంద్రుని తాకిడికి జలచరములన్నియు క్షోభించుచున్న సమయమున కామమనే భీకరమకరము హూంకరిస్తూ రాహువు సూర్య గ్రహమును పట్టిన విధముగా జీవగజేంద్రుని కాలు పట్టి తన స్వస్థానమగు సంకల్పములనే జలములోనికి ఈడ్చుకొని పోసాగెను.

నీరు అనగా బుద్ధి చిత్స్వరూపి. బుద్ధియే సంకల్ప రూపముగా మారి మనోరూపమైనది. సంకల్పము మనస్సు అభిన్నములు. సంకల్పము వలన కామము పుట్టుచున్నది. కామము జీవుని సంసార బంధములోనికి ఈడ్చుకొని పోవును. ఆ బంధమునుండి విడివడుటకు సద్వస్తువుయొక్క విచారణ అవసరము. విచారణ చేత కామము నశిస్తుంది.

గజమునకు తీరము స్వస్థానము. మకరికి సరస్సు స్వస్థానము. తీరమనగా సంసారసాగరమున కావలి యొడ్డు ఆత్మ స్వరూపము. సరస్సనగా అవిద్యాది పంచక్లేశములు, కామాది అరిషడ్వర్గములనే జలచరములతోను, భ్రాంతియను సుడిగుండలతోను నిండిన సంసార సాగరము. జీవుడను గజేంద్రుడు తన స్వస్థానమగు ఆత్మస్వరూపమనే

తీరమునకు చేరవలెనని కామమను మకరితో తీవ్రముగా పోరుచున్నాడు. కామమను మకరి జీవుడను గజేంద్రుని సంసారసాగరం లోనికి లాగుచున్నాడు. ఈవిధంగా వారిరువురికి భీకరమైన పోరు సాగుచున్నది.

సంకల్పరూపమగు మనస్సును నిగ్రహించిన యెడల కామము నిగ్రహింపబడును. ముముక్షత్వమనే సంకల్ప బలముతో కామమును మకరి నుండి విడివడుటకు జీవ గజేంద్రుడు పోరాటం సాగిస్తున్నాడు. కామమనే మకరి తన స్వస్థానమగు సంకల్పములనే జలములోనికి జీవగజేంద్రుని ఈడ్చుచున్నది. జీవగజేంద్రుడు స్వరూపజ్ఞానమను తొండముతో కామమను మకరిని బంధించి ప్రాణాయామముచే ఆకర్షించి ఘీంకరించుచు, విజ్ఞానమనే దంతములచే రాగద్వేషములనే మకరియొక్క డెక్కలను పెరకి వేయసాగెను. కామమను మకరియొక్క బలవృద్ధికి సంకల్పములను జలములే కారణము. జీవుడను గజేంద్రుని విషయ సుఖములనే జలములలో ముంచుటకు పట్టుదలతో విజృంభించుచున్నది. సత్సంకల్పములను నశింపజేయుచు, భక్తి జ్ఞానములనే దంతములను విరుగగొట్టి, సద్వృత్తులనే ఎములను పిండి జేసి, మనో సరస్సునందు ముంచి సర్వాంగములను వికలాంగములుగా జేసి జీవగజేంద్రుని బాధింపసాగెను. ఈ విధంగా వీరిరువురు దీర్ఘ కాలము పోరు సాగించిరి. చివరికి క్రమ క్రమముగా జీవగజేంద్రుని శక్తి సన్నగిల్లి శల్యావశిష్ఠుడై పూర్వ పుణ్యఫలముచే తనలో తాను, 'తరంగరహిత స్వస్వరూపానంద జలధి యందుండక అనగా, బ్రహ్మాకారవృత్తులతో కూడిన సమాధి యందుండక మనస్సను జలాశయమునకేల వచ్చితినో కదా ! మృగతృష్ణను జలమని భ్రాంతి చెందిన హరిణము వలె దుస్సంకల్పములకు వశపడి, కామపిశాచికి చిక్కి ప్రాణాపాయమునకు సిద్ధపడితిని కదా ! " అని పశ్చాత్తాపముతో చింతింపసాగెను. మకరి నెదిరించుశక్తి చాలక వేరే దిక్కుగానక వ్యాపక చైతన్య స్వరూపుడగు శ్రీ మన్నారాయణుని నీవే దిక్కని శరణువేడసాగెను. (**సశేషం**)



అక్క మహాదేవి అనుభవామృతం

తెలుగు సేత - డా ॥ శ్రీ కరిబసవరాజేన్ద్ర మహాస్వామి

139. కన్నుతో చూస్తామని చీకటిలో పోతే ఏదీ కనబడదు, అక్కడ కూడా వెలుతురు సహాయము కావాలి. కొండ శిఖరాన్ని ఎక్కాలంటే ఏకంగా కొండనే ఎక్కాలి గాని క్రిందికి పైకి మాటి మాటికి ఎక్కుతూ దిగితే కాదు కదా. దేవుడా నీవు కరుణించిన ప్రసాదాన్ని వదిలేసి వేరే వస్తువులను ఆశిస్తే వస్తుందా. తన పాలిటికి లభించినది పంచామృతమనుకోవాలి. చెన్నమల్లికార్జునుని తెలుసుకోవాలని శ్రేష్ఠమైన శరణు మార్గాన్ని అనుసరించక చెడు మార్గములో నడిచితే దేవున్ని కనుగొనడం సాధ్యమా! శ్రేష్ఠమైన పరశివుణ్ణి తెలుసుకోవాలంటే శ్రేష్ఠమైన సాధన కావాలి.

142. లోకపు జనులు సత్యాసత్యములను ఒకటి చేసి మాట్లాడుదురు. కాని శివశరణులు అబద్ధ మాడరు. అందులో గురులింగజంగముల సాన్నిధ్యములో అబద్ధమాడితే వారికి ద్రోహము చేసినట్లే. అటువంటి వారు ఏది తిన్నా, త్రాగినా అది మాంస భక్షణం సురాపాన సమానం. శివభక్తులు అబద్ధమాడకూడదు. పైపొట్టు మాత్రం విత్తి పంటను తెచ్చుకోగలరా ? అలాగే అబద్ధమాడి శివకృపను పొందడానికి సాధ్యమౌతుందా ?

144. ఆకలి అయితే భిక్ష చేసి కడుపునింపుకొంటాను. దప్పిక అయితే చెరువు, బావి, నదులలో నీరు త్రాగి దప్పికను పోగొట్టుకుంటాను. పడుకోవడానికి పాడైన దేవాలయాలున్నాయి. చెన్న మల్లికార్జునుడు ఆత్మకు తోడుగా వున్నపుడు నేను ఎందుకు భయపడాలి.

145. మధ్యాహ్నముతరువాత అంటే వయసుఅయిన (మల్లిన) తరువాత జీవనము సుఖంగా వుండదు. సూర్యాస్తమయమయిన తరువాత అందరూ విషయాలను ఆశించే వారే. జితేంద్రియులు దొరికేది కష్టం. విధి విలాసాన్ని ఎవరూ అధిగమించలేరు. ఆకలి దప్పిక, వ్యసనములకు భయపడి నిన్నుశరణు పొందినాను. సార్థకమైన జీవనము గడిపేటట్లు ఆశీర్వదించుము.

146. బట్ట బయలు పరమశివుడు. పరాశక్తి పరమశివుని యొక్క అర్ధాంగి. ఆ తల్లికి పృథ్వి అప్‌తేజో వాయురాకాశమని అయిదుగురు బిడ్డలు. ఈ దేహము పంచభూతములతో నిర్మితమైనది. ఆత్మయే ప్రాణరూపము. సత్ చిత్ ఆనంద నిత్య పరిపూర్ణమనే లక్షణములే పరమశివుని పంచముఖములు. బ్రహ్మ ఉత్పత్తికి, విష్ణువు స్థితికి కారణమైనారు. పంచాభూతాత్మక సంమిశ్రమమైన ఈ దేహము స్థిరమైనది కాదు. కైలాసము సుఖకరమైనా కైలాసానికి పోను. ఈ మానవ జన్మమే శివసాక్షాత్కార సాధనానికి కారణమని తెలిసింది. గురువనుగ్రహముతో ఈ భూమిపై మరలా జన్మించను. దీనికి చెన్న మల్లికార్జునుడే సాక్షి.

శ్రీ పల్లెంపాటి వెంకటేశ్వర్లు

నిత్య శ్రామికుడు, ధర్మశీలి, ఆధ్యాత్మిక సంస్కారవంతుడు అయిన శ్రీ పల్లెంపాటి వెంకటేశ్వర్లు గారు 11 -01-2016 తేది పరమపదించారు. వీరు శ్రీ శుకబ్రహ్మాశ్రమ పరిపాలనా సంఘ ఛైర్మన్‌గా గురుదేవులు పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిచే నియమింపబడి ఆశ్రమ సేవ చేశారు. పూజ్యశ్రీ స్వాములవారి గీతా ప్రవచనాలను వీడియో తీయించారు. వీరికి 19-01-2016వ తేది పరిపాలనా సంఘ సమావేశంలో శ్రద్ధాంజాలి ఘటించడమైనది.

ఆధ్యాత్మ స్పర్శకు తహతహ

– మూలం శ్రీ స్వామి చిన్మయానంద

అనువాదం : గండవరపు పుల్లమాంబ

మానవుడు కేవలం తిండీ, బట్టా, గూడు, భద్రత – వీటితో మాత్రమే తృప్తిని పొందలేడు. ఇవన్నీ లభించగానే ఇంకా ఇంకా ఏవైనా అందరానివి అందుకోవాలనీ అద్భుతమైన వాటిని చేజిక్కించుకోవాలనీ అన్వేషణతో తహతహలాడుతాడు. ఆ తెలియని విషయాలు తెలుసుకోవాలనీ, అందుకోలేనివి అందుకోవాలనీ కలిగే తృష్ణ, తపన అతనిని నిలువనీయవు. మనం అందరం ఈ అనుభూతిని సామాన్యంగా ఎప్పుడో ఒకప్పుడు ఎదుర్కొంటూనే ఉంటాం.

చిన్నప్పుడు నీవు ఎంతో ఇష్టంగా గోలీలాట ఆడుకుంటావు. ఇప్పుడూ అదే ఆట ఆడగలవా ? ఎందుకని ఆడలేవు ? ఆ ఆటలో నీకు కలిగిన వినోదం, సరదా తీరిపోయిందా ? ఎంత మాత్రమూ కాదు. వయసు పెరుగుతున్న కొద్దీ అంతకంటె ఎక్కువ ఆనందాన్ని సరదాను ఇచ్చేవి నిన్ను ఆకర్షిస్తాయి. ఇంకా చురుకుగా ఉత్సాహంగా, ఉద్వేగకరంగా ఉండే పనుల కోసం, ఆటల కోసం ఆరాటపడుతావు.

అదే విధంగా జీవితంలో సంపాదించటం, ఖర్చు చేయటం, దాచుకోవటం, ఆశపడటం, నవ్వుకోవటం, దుఃఖపడటం ఇలాంటివన్నీ పెరుగుతున్న కొద్దీ, మనస్సూ శరీరమూ వికసించే కొద్దీ, పరిణామాలకు లోనయ్యే కొద్దీ వెనకబడతాయి, తగ్గిపోతాయి. ఆధ్యాత్మికమైన ఒక తరంగ స్పర్శానుభూతి కోసం ఆరాటం మొదలవుతుంది. విషయ పరిజ్ఞానం, కాలంతో జరిగే మార్పులూ, వాదాలూ ప్రతివాదాలూ అర్థరహితంగానూ, రసహీనంగానూ కనిపిస్తాయి. ఇంతకంటే చైతన్యవంతమైనదేదో దానిని స్వానుభవంతో తెలుసుకోవాలన్న ఉత్కంఠ, వేదన ప్రారంభం అవుతుంది.

(అరణ్య స్పందన నుండి)

శ్రీమద్భగవద్గీతా వైశిష్ట్యము

– ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

3.ప్రాచీనుల అభిప్రాయాలు

శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు భగవద్గీతను కొనియాడడమే గాక తమ తమ ఆలోచనా ధోరణుల ననుసరించి వేరు వేరుగా భాష్యాలు వెలయించారు. భజగోవిందంలో కూడా భగవద్గీతకు సంబంధించిన రెండు ప్రస్తావనలు కనిపిస్తాయి. గీతను, విష్ణు సహస్రనామాన్ని గానం చేయాలని సుమతాచార్యులు పేర్కొన్నారు. విష్ణుదేవుని రూపాన్ని ఎల్లప్పుడూ ధ్యానించాలన్నాడు. సజ్జన సాంగత్యంలో మెలగాలన్నాడు. దైన్యంతో బాధపడే వారికి ఆర్థిక సహాయం చేయాలన్నాడు.

గేయం గీతా నామ సహస్రం
ధ్యేయం శ్రీపతి రూమ మజస్రమ్ ।
నేయం సజ్జన సఙ్గతి మనిశం
దేయం దీనజనాయ చ విత్తమ్ ॥

ఈ ప్రపంచంలోని ముగ్గురి జోలికి యముడు కూడా రాలేదని ధృఢభక్తాచార్యులు తెలియజేశారు. ఆ ముగ్గురు (1) భగవద్గీతను కొంచెమైన పఠించేవాడు, (2) గంగాతీర్థాన్ని కొంచెమైన సేవించేవాడు. (3) హరిపూజ చేసేవాడు.

వీరి గురించి యముడు కనీసం చర్చ కూడా చేయడని అభిప్రాయం.

భగవద్గీతాకించి దధీతా

గంగాజల లవకణికాపీతా ।

సకృదపి యేన మురారి సమర్చా

క్రియతే తస్య యమోపి న చర్చామ్ ॥

4. ఆధునికుల అభిప్రాయాలు :

ఆధునికులు కూడా ఎందరో గీతను ఆదరించారు. అభిమానించారు, ఆరాధించారు. దాని తత్త్వాన్ని తెలుసుకున్నారు. ఆచరణలో పెట్టారు. అధిక లాభం పొందారు. గీతకు సంబంధించిన తమ అభిప్రాయాలను చక్కగా వెలిబుచ్చారు. వాటిని గమనించడం సముచితం.

శ్రీ వివేకానంద స్వామి : భగవద్గీతలో శ్రీ కృష్ణుడు అర్జునుడికి చెప్పినవి మాటలు కావు. జ్ఞానకళికలు. జీవితాదర్శమంతటినీ ఒక్క క్షణంలో చెప్పి వేశాడు. ఉపనిషత్తులనే తోట నుంచి ఆధ్యాత్మిక కుసుమాలను యేర్చి కూర్చిన పుష్పహారమే భగవద్గీత.

గాంధీ మహాత్ముడు : దుఃఖమయమైన వాతావరణములో ఉన్నప్పటికీ ఆ దుఃఖాలు నన్నంటలేదు. దానికి కారణం భగవద్గీతే.

తిలక్ : ప్రపంచ సాహిత్యంలో గీతకు సాటిరాగల గ్రంథం మరేదీలేదు. అది మహా ప్రకాశవంతమైన అమూల్యరత్నం. మనను పరమానంద పదవికి తీసుకువెళ్ళే అపూర్వ సాధనమది.

శ్రీ మహర్షి మలయాళ స్వాములవారు : సంసార సముద్రాన్ని సులభంగా దాటేందుకు భగవద్గీతను శ్రద్ధతో చదవాలి. దానిలో చెప్పినట్టు నడుచుకోవాలి.

అరవిందయోగి : మానవుడు తన మేధనంతటిని వెచ్చించినప్పటికీ గీతా జ్ఞానానికి సంబంధించిన ఒక అంశాన్ని మాత్రమే తెలిసికొని తెలుపగలుగుతాడు.

శ్రీ శివానంద సరస్వతీ స్వాములవారు : విశ్వ వాఙ్మయంలో గీతవంటి మహోన్నత గ్రంథరాజం లేనే లేదు. అది జ్ఞానభండారం. తరగని నిధి. ఆనందసాగరము.

వినోబాభావే : నా శరీర వృద్ధికి తల్లిపాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. నా బుద్ధి వికాసానికి భగవద్గీత అంతకంటే ఎక్కువగా ఉపయోగపడింది.

ఈ అధ్యయనాన్ని బట్టి భగవద్గీత ఎంత విశిష్టమైందో విదితమౌతుంది. భగవద్గీతను శ్రద్ధగా వినడం, లేదా శ్రద్ధగా చదవడం చెయ్యాలి. వీలైతే ప్రతిరోజూ పారాయణం చెయ్యాలి. పారాయణం చేసేటప్పుడు కూడా గీతాశ్లోకాల అర్థాన్ని భావిస్తూ పారాయణం చెయ్యాలి. అంతటితోనే ఆగిపోకుండా భగవద్గీతలో చెప్పబడిన అంశాలను పదే పదే స్మరించాలి. తదేకంగా ధ్యానించాలి. విశ్లేషణాత్మకంగా విచారణ చెయ్యాలి. బాగా వంటబట్టించుకోవాలి. గీత ప్రతివారి త్రికరణాల్లోనూ ప్రతిబింబించేలా ప్రవర్తించాలి. అప్పుడు మాత్రమే గీత మన గీతను మార్చగలదు. రోతను పోకార్చగలదు.

వేదాన్తభేరికి ఈ క్రిందివారు పోషక చందా పంపినారు

01.	టి.రామస్వామి (సిరిసిల్ల)	–	రూ. 1200/–
02.	ఎం.చక్రధరరెడ్డి (కాజీపేట, వరంగల్లు)	–	రూ. 1200/–
03.	గోరంట్ల వెంకటేశ్వర్లు (కందుకూరు)	–	రూ. 1200/–
04.	ఎన్.సత్తిరెడ్డి (నాచారం,హైద్రాబాద్)	–	రూ. 1200/–
05.	త్రిమూర్తి (మీర్‌పేట, రంగారెడ్డిజిల్లా)	–	రూ. 1200/–
06.	ఆర్.ఆర్.ఎమ్.వి.ప్రసాద్ (దంతాలపల్లి) (వరంగల్ జిల్లా)	–	రూ. 1200/–
07.	ఎం.రాఘవులు (శ్రీకాళహస్తి)	–	రూ. 1200/–

ఓర్పుతో సమస్యలు పరిష్కారం కాగలవు

– కె. ఈశ్వర్

నేర్పుతో కూడిన ఓర్పు అవసరం. సహనం సవాలక్ష సమస్యలకు పరిష్కారం. ఓర్పుతో సమాజాన్ని సరిచేయవచ్చు. బుద్ధభగవానుడు సహనంతో ఎందరి మనస్సునో మార్చగలిగాడు. మంచి దారిలోకి తేగలిగాడు. ఒకనాడు బుద్ధుడు పాదయాత్ర చేస్తూ పోతున్నాడు. ఒక వ్యక్తి దారిలో కలిశాడు బుద్ధుని చూచి దొంగసాధువులు, లోకానికి భారం తిండి కొరకు వేషాలు అని నోటికి వచ్చినట్లు వాగుచున్నాడు. బుద్ధుడు శాంతంగావింటూ నాయనా నోరు ఎండిపోతున్నది కాబోలు కాస్త మంచి నీరు తాగి తిరిగి తిట్ల పురాణం ప్రారంభించమని తన కమండలములోని నీరు అందించాడు. అదుగో అటు చూడు, ఒక చిన్న గ్రామం వస్తుంది. ఆ వూరిలో మాత్రం నన్ను తిట్టవద్దు, ఊరుదాటిన పిదప తిరిగి తిట్లు ప్రారంభించమన్నాడు. ఎందుకు అంటే ఆ వూరిలో నా భక్తులు వున్నారు. నన్ను నీవు తిట్టినచో వారు సహించలేరు. నీకు దేహశుద్ధి చేస్తారు– అన్నాడు బుద్ధుడు.

ఆ మాటలు విన్న వ్యక్తి – స్వామి వారి ప్రేమతత్వాన్ని, క్షమాగుణాన్ని, అపకారికి ఉపకారము చేయు సహృదయాన్ని గమనించని నేను ఎంత మూర్ఖుడిని అని చింతించుచు, స్వామి వారి పాదాలపై బడి క్షమించమని ప్రార్థించి స్వామివారి శిష్యుడుగా చేరిపోయాడు. చూచితిరా! బుద్ధుడు నేర్పుతో కూడిన ఓర్పుతో ఎదుట వాని మనస్సుకు పట్టిన మాలిన్యాన్ని సహనం అనే సబ్బుతో శుద్ధిచేసి మంచి వ్యక్తిగా ఎలా మార్చినాడో గమనించండి. మనము కూడా సహనముతో సహజీవనం చేసి సద్బుద్ధిని పొందుదుము గాక!

వార్తలు

(01). 2-2-2016 తేది నుండి వారం రోజులు 8-2-2016 తేది వరకు ముంబాయి వర్లీలోనిశ్రీ విద్యాప్రకాశానంద గీతాసమాజం వారి ఆధ్వర్యంలో మార్కండేయ మందిర ప్రాంగణంలో పూజ్యశ్రీ విద్యా స్వరూపానందగిరి స్వాములవారు గీతాజ్ఞానయజ్ఞ ప్రవచన చేశారు.

(02). 22-2-2016 తేది నుండి 24-2-2016 వరకు మూడు రోజులు సికింద్రాబాద్, సౌత్ లాలాగూడలోని జగన్మాత, ఆంజనేయ, సాయిబాబా మందిర ప్రాంగణంలో శ్రీ మంగోలు మాణయ్య గారి సత్సంగ సమితి వారిచే నిర్వహింపబడిన శ్రీ సనాతన బ్రహ్మజ్ఞాన మహాసభలలో పూజ్యశ్రీ విద్యా స్వరూపానందగిరిస్వాములవారు అధ్యక్షత వహించి ప్రవచనలు చేశారు. ఆ సభలలో పూజ్యశ్రీ యోగిని చంద్రకాళీ ప్రసాదమాతాజీ గారు (నంబూరు), పూజ్యశ్రీ పరిశుద్ధానందగిరి స్వాములవారు (పరాశరాశ్రమం), పూజ్యశ్రీ నిత్యశుద్ధానందగిరిస్వాములవారు, పూజ్యశ్రీ పరమాత్మానందగిరి స్వాములవారు, (మలయాళస్వామిలక్ష్మీనారాయణాశ్రమము), శ్రీ కశిరెడ్డి వెంకటరెడ్డి గారు (హైద్రాబాద్) శ్రీమతి బొప్పన అరుణాదేవి గారు (హైద్రాబాద్) వగైరా మహాత్ములు ఉపన్యసించారు.

(03). 25-2-2016 తేది కృష్ణాజిల్లా పెదపులిపాకలో పూజ్యశ్రీ వాసుదేవానంద స్వాములవారిచే నిర్మింపబడిన శ్రీరాజరాజేశ్వరి దేవాలయ ప్రతిష్ఠా కార్యక్రమంలో పూజ్య శ్రీస్వాములవారు పాల్గొన్నారు.

(04). 4-2-2016 తేది, 18-2-2016 తేది ఏకాదశులందు శ్రీశుకబ్రహ్మాశ్రమంలో భగవద్గీత అఖండ పారాయణ జరిగినది. 7-2-2016 తేది మాసశివరాత్రి నాడు ప్రదోషకాలంలో ఆశ్రమ నర్మదేశ్వర మహాదేవునకు రుద్రాభిషేకం బిల్వార్చన జరిగినది. 16-2-2016 తేది కృత్తిక సందర్భంగా ఆశ్రమంలో ప్రదోషకాలంలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం, అర్చన జరిగినది.

(05). ఆశ్రమ కంటిఆసుపత్రి (త్రినేత్ర వైద్యాలయం)లో జనవరినెలలో **ఓ.పి.విభాగంలో 411 గురికి** చికిత్సలు జరిగినవి **48 మందికి పొరలు** ఆపరేషన్ చేసి కళ్లలో లెన్సు అమర్చబడినవి. **3 గురికి** యాగ్ లేజర్ చికిత్స చేయబడినది.

ముహూర్తం లేని మృత్యువు

ఆకులు రాలుటకు – ఒక ఋతువు ఉంటుంది.

పూవులు వాడిపోవుటకు – ఒక సమయముంటుంది.

సూర్యుడు అస్తమించుటకు – ఒక సమయముంది.

సూర్యుడు ఉదయించుటకు – ఒక సమయముంటుంది.

నక్షత్రాలు మరుగుపడుటకు – ఒక సమయముంటుంది.

కానీ ఓ మృత్యువా! నీ రాక సమయమేదో తెలియకున్నది. కావున మృత్యువు రాకముందే మృత్యుంజయమగు అమరత్వమును పొందుటకు ప్రయత్నించువారు ధన్యులు.

– శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు

Regd.No. TRP / 123 / 2015-17 April 2016 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-03-2016, Permitted to post : 29th, 30th every month.

త్రినేత్ర వైద్యాలయము

భక్తకన్నప్ప కంటి ఆసుపత్రి.

శ్రీశుకబ్రహ్మాశ్రమము, స్వామి ప్రకాశానందనగర్, శ్రీకాళహస్తి, ఆం.ప్ర.

ఇందు నిరుపేదలకు ఉచితంగా కంటి చికిత్సలు చేయబడును. కంటిపొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడును. ఆపరేషన్ చేసిన వారికి ఉచితంగా భోజనాలు పెట్టబడును. ఉచితంగా మందులు మరియు 40 వ రోజు కళ్లద్దాలు ఇవ్వబడును. దీనికి విరాళమిచ్చువారికి 80 జి సెక్షన్ క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు కలదు. ఈ ఆసుపత్రి పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిచే స్థాపించబడినది.

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం

వేదాంతభేరి

ఏప్రిల్ 2016 రూ. 10/-

నిజమైన సాధకుడు

"నేను పాపిని, బలహీనుడను" అనేటటువంటి పదములను నీవు ఏమాత్రము ఉపయోగించకూడదు. "నేను ఇంతపని చేయగలనా? ఈ పని చేయగలనా? నాకు ఆ శక్తి వున్నదా?" అని సందహించరాదు. నీలో ఆత్మ విశ్వాసం దృఢంగా ఉంటే ఏమైనా చేయగలవు. నీవు ఆత్మ బలహీనుడవు కారాదు. ఆత్మబలుడవు కావాలి. "నాకు లేదు, లేదు" అనుకొంటే సైకలాజికల్‌గా లేకుండానే పోతుంది. 'నేను చేయగలను, నేను పొందగలను' అనే ధైర్యసాహసముతో సాధనలో ప్రవేశించాలి. అల్పసుఖముల కోసం ఆరాటపడుతున్నావు. నిత్యసత్యమైన ఆత్మతత్త్వమునకై ప్రయత్నం చేయడంలేదు. ఆ అల్పసుఖం ఎంతకాలం వుండును. అది కేవలము అతికించుకొన్న ముక్కువంటిదే! ఎప్పుడు రాలిపోతుందో! ఎప్పుడు కూలిపోతుందో! ఎప్పుడు కాలిపోతుందో! నిత్యసత్యమైన ఆత్మతత్త్వం కొఱకు ప్రయత్నం చేసినవాడే నిజమైన సాధకుడు. ధన్యుడు.

– శ్రీ సత్యసాయిబాబా

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 49 ఏప్రిల్ 2016 సంచిక : 04

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ఓం వేదాంతభేరి ఓం

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 49 ఏప్రిల్ 2016 సంచిక : 04

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. మోక్షానికి ఉపదేశ చతుష్టయం
 - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. సంయమ వ్రతము -శ్రీ సద్గురు మలయాళస్వాములవారు -10
04. సద్గురు దేవులకు 18వ ఆరాధన పుష్పాంజలి -
 - శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు -12
05. మీాకు జే జేలివే - కవిరత్న శ్రీ సున్నంవీరరాజు - 13
06. శ్రీస్వాములవారి గీతాయజ్ఞాలు - డా ॥ సముద్రాల లక్ష్మణయ్య - 14
07. నన్ను మరో లోకానికి తీసుకుపోయారు- శ్రీ వెంటకలక్ష్మీప్రసాద్ - 16
08 ఋషి పుంగవులు-పూజ్యశ్రీ స్వామి విమలానంద సరస్వతి- 19
09. స్కూల్‌ప్లే గ్రౌండు మొత్తము జనాలతో కిటకిట లాడుతుండేది
 - పూజ్యశ్రీ మేధానందపురి స్వాములవారు - 21
10. స్వామీజీ సాన్నిధ్యంలో నేను - శ్రీఎన్.ఎల్ చెన్నకేశవరావు - 22
11. జ్ఞానసుధ - శ్రీసర్వభూషణ శివయోగి - 24
12. ఆచార్యదేవో భవ - ఆచార్య కె.సర్వోత్తమరావు - 26
13. సద్గురు దేవా ! వందనములు - కె.ఈశ్వర్ - 32
14. గజేంద్ర మోక్షము - రహస్యార్థము - ఎస్.వి.భారతీలక్ష్మీ - 34
15. శ్రీ భక్తతుకారాం అభంగవాణి - శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు - 38
16. అక్కమహాదేవి అనుభవామృతం-శ్రీడా॥కరిబసవరాజేన్ద్ర మహాస్వామి -40
17. వార్తలు - 42

15-04-2016 తేది శ్రీరామనవమి

ముఖచిత్రం : పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు

ఇందులోని వ్యాసాల భావాలకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

ఓం సౌవర్ణమండపే దివ్యే పుష్పకేన విరాజితే ।
మూలే కల్పతరోః స్వర్ణ పీఠే చామృష్ట సంయుతే ॥
మృదుశ్లక్ష్ణతలే తత్ర జానక్యాసహ సంస్థితం ।
రామం నీలోత్పలశ్యామం ద్విభుజం పీతవాససమ్ ॥
స్మితవక్త్రం సుఖాసీనం పద్మపత్రనిభేక్షణం ।
కిరీట హారకేయూర కుండలైః కటకాదిభిః ॥
విభ్రాజమానం విజ్ఞానముద్రం వీరాసనేస్థితం ।
వసిష్ఠవామదేవాద్యైః సేవితం లక్ష్మణాదిభిః ।
అభిషిక్తమయోధ్యాయాం ధ్యాయే రామంరఘూత్తమమ్ ॥
ఓం విజ్ఞానహేతుం విమలాయతాక్షం ప్రజ్ఞానరూపం స్వసుఖైకహేతుం
శ్రీరామచంద్రం హరి మాదిదేవం పరాత్పరం రామమహం భజామి ।
తత్త్వస్వరూపం పురుషం పురాణం స్వతేజసా పూరితవిశ్వమేకం
రాజాధిరాజం రవిమండలస్థం విశ్వేశ్వరం రామమహం భజామి ॥
మంగళం కోసలేన్ద్రాయ మహనీయ గుణాత్మనే ।
చక్రవర్తితనూజాయ సార్వభౌమాయ మంగళమ్ ॥
ఆసాద్యనగరీం దివ్యాం అభిషిక్తాయ సీతయా ।
రాజాధిరాజరాజాయ రామచంద్రాయ మంగళమ్ ॥

తా ॥ పుష్పక విమానంతో కూడిన దివ్యమైన బంగారు మండపమందు కల్పవృక్షం మొదట్లో బంగారుపీఠంపైన జానకీదేవితోకూడా సుఖంగా కూర్చొనియున్న నల్లకలువరంగుకలవాడును, రెండు భుజాలుగలవాడును, నవ్వుమోముగల వాడును, పద్మపత్రముల వంటి కండ్లు కలవాడును, పసుపురంగుగల వస్త్రములు ధరించినవాడును, కిరీటము, హారము, భుజకీర్తులు, కుండలములు, కడియములతో శోభిల్లువాడును, విజ్ఞానముద్రతో వీరాసనంలో వుంటున్న వాడును, వసిష్ఠ వామదేవాది మునులచే మఱియు లక్ష్మణుడు మొదలుగువారిచే సేవింపబడుచున్నవాడును, అయోధ్యయందు పట్టాభిషిక్తుడును, రఘుకుల శ్రేష్ఠుడును నగు శ్రీరాముని ధ్యానించెదను.

నిర్మలమైన విశాల నేత్రాలు గలవాడును, విజ్ఞానకారకుడును, ప్రజ్ఞాన రూపుడును, ఆదిదేవుడును, పరాత్పరుడగు శ్రీరామచంద్రుని నేను భజిస్తున్నాను. తత్త్వస్వరూపుడును, పురాణ పురుషుడును, తన ప్రకాశంతో విశ్వాన్ని నింపిన వాడును, సూర్యమండలంలో వున్న వాడును, రాజాధిరాజగు రామచంద్రుని నేను భజిస్తున్నాను. **(15 -04-2016 శ్రీరామనవమి)**



మోక్షానికి ఉపదేశ చతుష్టయం

చివరి వఱకు పోరాడుము

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఒక మోక్షప్రాప్తికి గావింపబడిన మూడవ ఉపదేశము – చివరి వఱకు పోరాడుము అనునది. సామాన్యముగ పర్వతారోహకులు శిఖరమును చేరనంతవఱకు తమ లక్ష్యము నెరవేరినదని తలంపరు. సంగ్రామమున పాల్గొను సైనికులు శత్రువు జయింపబడనంత వఱకు తమ ధ్యేయము సఫలమైనదని భావింపరు. అట్లే అధ్యాత్మ మార్గమున యత్నశీలుడగు సాధకుడు బహుజన్మలనుండియు వేధించుచున్న మాయను, అజ్ఞానమును, ప్రతీపశక్తులను పూర్తిగ తుడిచిపెట్టనంత వఱకు తన కర్తవ్యము పరిసమాప్తమైనదని తలంచరాదు. మాయ నివురుగప్పిన నిప్పు వలె నుండును. మనుజుడు దానిని జయించినట్లు భావించి సంబరపడుచుండును. కాని ఇంతలో ఏదియో యొక అవకాశము చూచుకొని అది తలవని తలంపుగా వచ్చి అమాంతముగ మీద పడుచుండును.

The mind has the knack of making the aspirant feel that he is its master, while in fact it makes a hopeless fool of him.

అని ఒక మహాత్ముడు నుడివినట్లు మనస్సు జిత్తుల మారిది. తన్ను జయించివేసినట్లు తన యజమానికి అది విశ్వాసమును కలుగజేయును, కాని తృటిలో వానిని పరాభవించి తనదే పైచేయిగ గావించుకొనును, కావున సాధకులు బహుజాగరూకులై ఇంద్రియములను, మనస్సును వెయ్యికళ్ళతో కనిపెట్టి చూచుచుండవలెను. బహుజన్మార్జిత మలిన వాసనా ప్రభావముచే ఇంద్రియాదులు తమకు ప్రియములైన దృశ్యవిషయములపైకే

ఉరుకుచుండును. అత్తఱి విజ్ఞుడగు వాడు వివేకమను ఆయుధమును ఆశ్రయించి వానికి ఈ క్రింది విధముగ బోధించవలెను.

‘ ఓ మనస్సా ! ఓ యింద్రియములారా ! ఎన్ని జన్మల నుండి ఈ ప్రకారము విషయముల వైపునకు మీరు పరుగెత్తుచున్నారు ? మీకేమైనా తృప్తి కలిగినదా ? ఇంకను కోటానుకోట్ల జన్మలు ఈ ప్రకారముగ అనుభవించినను తృప్తి కలుగునను నమ్మకమేమైనా మీకున్నదా? విషయముల వలన మీరు పొందు ఆనందము ఏపాటిది? ఎంత సేపుండును? అది శాశ్వతమా, లేక నశ్వరమా ? అవిచ్ఛిన్నమా, లేక దుఃఖమిశ్రితమా ? అతుకులబొంత వంటి ఈ అల్పసుఖముకొఱకై బహు మూల్యమైన ఈ మానవజన్మను వృథా చేయుట మీకు పాడియా ? దివ్యమైన ఇట్టి అవకాశములు మఱల దొఱకునా ? అనంత బ్రహ్మానంద పారావారమునకు వారసులైయున్న మీరు ఈ ప్రకారముగ కక్కుర్తిపడి అల్ప వస్తువులకొఱకు జీవితమును ధారపోయుట న్యాయము కాదు. లెండు! పరాత్పరుని పాదయుగములను సేవించుటకై తత్క్షణమే కృతనిశ్చయములు కండు ! ’

ఈ ప్రకారముగ మనస్సునకు, ఇంద్రియములకు చక్కని హితబోధ చేసి వానియొక్క దర్పమును సాధకుడు అడంచవలెను. అయితే బహుకాలమునుండి ప్రాపంచిక వాసనలు రూఢిపడి యుండుటవలన అవి వెంటనే చెప్పిన మాట వినకపోవచ్చును. అయినను ప్రయత్నమును వీడరాదు. ఏనాటికైనను తత్త్వజ్ఞాన సహాయముచే వాసనాక్షయము పరిపూర్తిగ సంభవించి మనోనాశము లెస్సగ సిద్ధించినపుడే ఆత్మ సాక్షాత్కారము కలుగగలదు. వాసనలు పైపైన నశించినట్లు కనిపించినను లోన వేరు పాతుకొని యుండును. తీగె ఎండిపోయినను దుంప నశింపనట్లు సాధకుడు తాను చేయు సత్ప్రయత్నములవలన వాసనలయొక్క ప్రకోపము ఒకింత ఉపశమించినను దానిని నమ్మరాదు.

‘రసవర్జం’ అని గీతాచార్యులు ఈ స్థితినే గీత రెండవ అధ్యాయమున చక్కగ వర్ణించి చెప్పిరి. వివేక వైరాగ్యాదులచే వాసనలు, దుర్గుణములు, దురభ్యాసములు, విషయ ప్రవృత్తులు సమూలముగ తొలగిపోనంతవరకు మనుజుడు సాధన చేయుచునే యుండవలెను. మధ్యలో నిలుపరాదు. Fight to the end చివరి వరకు పోరాడుము అను సూక్తి యొక్క భావమిదియే.

స్థిత్వా2స్యామన్తకాలే2పి బ్రహ్మ నిర్వాణమృచ్ఛతి

అని శ్రీకృష్ణపరమాత్మ గీత రెండవ అధ్యాయమున బ్రాహ్మీస్థితిని గూర్చి వర్ణించు సందర్భమున సాధకులకు చక్కని హెచ్చరిక చేసి యున్నారు. ‘ ఓ సాధకురాలారా ! పరమార్థ సాధనను అంత్య కాలమువఱకు, దేహవియోగ సమయమువఱకు నిలుపరాదు. మాయ టక్కులమారిది. మహాశక్తివంతమైనది. ఎప్పుడెప్పుడు సాధకుని పడగొట్టుదునాయని అది పొంచియుండును. కాబట్టి సాధకులారా ! ఏమరుపాటు లేక శత్రువుతో చివఱివరకు పోరాడి జయించుడు.

జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్

భయంకరమైన ఈ కామక్రోధాదిరూప శత్రువును విచారణా బలముచే జయించివేయుడు. అభ్యాసముచే దానిని పారద్రోలుడు. ఇక్కార్యమున ప్రమత్తతగాని, పరాకుగాని, అలసత్వముగాని పనికిరాదు. అంత్యకాలమువరకు కూడ సాధన విషయమై బహుజాగ్రత్తగ నుండుడు ’ అని భగవానుని హితోపదేశము.

పరుగిడు పందెములో ఏ కొద్దిమందో పాల్గొందురు. పాల్గొనిన కొద్దిమందిలో మధ్యలోనే కొందఱు నిలిచిపోవుదురు. చివరి వఱకు పోరాడి పందెము గెలుచుకొనువారు ఏ ఒకరిద్దరో ఉందురు. వారే ధీమంతులు, విజయలక్ష్మిని వరించువారు వారే. అట్లే అధ్యాత్మ క్షేత్రమునకు అకుంఠితమగు దీక్ష, అప్రతిహిత అధ్యయవసాయము, తీవ్రమగు పట్టుదల,

ఆత్మ విశ్వాసము కలవారు మాత్రమే మాయతో చివరి వఱకు పోరాడి విజయశ్రీని చేపట్టుదురు. అనేకమంది మోక్షప్రాప్తికై యత్నములు చేయు చుండినను, కడవరకు పోరాటమును సాగించుచు నిలిచిన ఏ ఒకానొక ధీరుడో విజయవంతుడు కాగలుగుచున్నాడు. 'కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్షత్' విషయ విరక్తి కలిగి అంతర్ముఖుడైన ఒకానొక ధీరుడు మాత్రమే ప్రత్యగాత్మను చూడగలుగుచున్నాడని ఉపనిషత్తులున్ను ఘోషించుచున్నవి.

కాబట్టి ముముక్షువు లక్ష్యప్రాప్తివఱకు తన పోరాటమును సాగించు చునే యుండవలెను. ఒక జన్మకాలము పట్టినను, రెండు జన్మల కాలము పట్టినను, అనేక జన్మలు పట్టినను మోక్షము పొందువఱకు ప్రయత్నమును విరమించరాదు. లోకమున అధములు దైవకార్యమును ప్రారంభించనే ప్రారంభించరు. మధ్యములు ప్రారంభించి విఘ్నములు వచ్చినపుడు వదలి వేయుదురు. ఉత్తములు విఘ్నములు తటస్థించినను తాము ప్రారంభించిన సత్కార్యమును – దైవకార్యమును విడువనే విడువరు. పరమార్థ సాధకులు ఉత్తములవలె వ్యవహరించి గొప్ప పట్టుదలతో లక్ష్యమగు భగవత్సాక్షాత్కారమును ఎట్టైనను సాధించియే తీరవలెనుగాని, పిరికిపందలై మధ్యలోనే విరమించి పెద్దల దృష్టిలో హాస్యాస్పదులు కారాదు.

వాసనలు, అగ్ని, ఋణము, రోగము, శత్రువు, విషము – అనునవి ఏ కొంచెము మిగిలియున్నను బాధించుచునే యుండును. వానిని సమూలముగ తొలగించవలెనని నీతిశాస్త్రము బోధించుచున్నది. కావున అనాది మాయారూప శత్రువును, అజ్ఞానవైరిని హృదయ గేహమునుండి తరిమి వైచుటలో ఏమాత్రము వెనుకాడక, అతడు పూర్తిగ వైదొలగనిదే శాంతిని ఏకాలమందును నోచుకొనలేమని దృఢముగ నమ్మి అక్కార్యమును సాధించుటకు ఈ జన్మయే చక్కటి అవకాశమని విశ్వసించి, దైవముపై పరిపూర్ణ విశ్వాసముంచి, మాయతో ప్రకృతితో కడవఱకు పోరాటము సాగించి, విజయశ్రీని చేపట్టి ఆత్మసాక్షాత్కారముచే పరమానందమును అనుభవించ వలెను.

సంయమ వ్రతము

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

1. బ్రహ్మనిష్ఠుల వ్రతములు అన్నిటిలోను ముఖ్యమైనవి.

2. మాట్లాడవలసిన అత్యవసరము వచ్చిన పదివాక్కులచే చెప్పవలసిన అర్థము ఒక్క వచనములో నిమిడించి చెప్పేలాగున అభ్యసించుట, అదియును అభ్యాసులు తమ శరీరము ఎంత పొడుగుండునో దానికన్న దూరమున శబ్దము వినపడ కూడదని భయముతో ఉచ్చరించి శీలించవలెను.

3. ఉదయము ఒక్క జామును, సాయంత్రము ఒక్క జామును, కనీసము స్వరూపానుసంధానమగు నిష్ఠలో నుండవలెను. తక్కిన సమయములో బ్రహ్మవిచారపరమగు అనుష్ఠానములో కాలము గడిపి అతిస్వల్పకాలము మాత్రమే భోజనాది కార్యములకు వినియోగ పరచవలయును. భోజనము మొదలైనది ఔషధము సేవించు రీతిగా వాడవలయును.

4. దూషణ భూషణాది ద్వంద్వములకు అందని పదవి నొందుటయే మనయొక్క స్థితి యని మరువకూడదు.

5. బ్రహ్మసాక్షాత్కార అపరోక్షజ్ఞానము గలుగువరకు రేయి, పగలు, శుచి, అశుచి, శుద్ధాశుద్ధస్థలాదులను పరిగణింపక సమయము వచ్చిన ప్పుడంతయు సమాధినిష్ఠను అభ్యసించుచుండవలెను.

6. ఒక్క నిమిషము వ్యర్థమైపోవునప్పుడు ఎంతో కష్టపడి సంపాదించిన అమూల్య ధనము చేతినుండి జారిపోయిన ప్రాపంచిక మనుష్యుడు ఎట్లు భయపడునో కనీసమంతయైనను భీతి గల్గియుండ వలయును.

7. ఇహపరములకు సాధనమైన బ్రహ్మచర్య వ్రతమందు సర్వదా

జాగరూకతను వహించవలెను. దీనియందు అజాగ్రతగలవాని జీవితము తైలము నశించిన దీపము ఆరునట్లు అస్తమించును.

8. మూడు నిమిషములలో భ్రమచే దుఃఖమును సుఖమని తలంచి విషయమునకు లోబడినచో మూడు జన్మములలో గల సుకృత విశేష యశస్సును నశింపజేసినవారగుదురు. అనగా జన్మాంతర సుఖముచే గదా ఇప్పుడు ఇట్టి ఉన్నత పదవి లభించినది. ఈ పరిశుద్ధత యుండిన గదా భవిష్యత్ మంగళము లభించును.

9. కల్పితములైన కులగోత్రాది దృశ్యములలో మనస్సు ప్రవేశింపకుండ అతిజాగ్రత్తతో చూచుచు సర్వత్ర అకల్పితమైన దృక్కులో అనగా ఆత్మలో లేక దైవములో విహరించెడు శక్తి ప్రయత్నపూర్వకముగా సంపాదించవలయును.

10. దృశ్యమును దేహములోను, దేహమును ఇంద్రియములలోను, ఇంద్రియములను మనస్సులోను, మనస్సును బుద్ధిలోను, బుద్ధిని అవ్యక్తములోను, అవ్యక్తమును మహత్తత్త్వములోను, మహత్తత్త్వమును ఆత్మలోను, ఆత్మను పరమాత్మలోను ఐక్యపరచి శీలించెడు అభ్యాసము సర్వదా చేయుచుండవలెను. ఇది అనులోమప్రకారము. ఇక ప్రతిలోమప్రకారము మరియొకటి గలదు. అది పరమాత్మను ఆత్మలోను, ఆత్మను మహత్తత్త్వములోను, మహత్తత్త్వమును అవ్యక్తములోను, అవ్యక్తమును, బుద్ధిలోను, బుద్ధిని మనస్సులోను, మనస్సును ఇంద్రియములలోను, ఇంద్రియములను దేహములోను, దేహమును దృశ్యములోను ఐక్యపరచి శీలింపవచ్చును. మహత్తత్త్వమనియు, అవ్యక్తమనియు పర్యాయ నామములుగా వాడుదురు. మొదటిది యోగమార్గము, లేక అనన్యమైన భక్తియోగమని గ్రహించవలెను. రెండవది జ్ఞానమార్గము. యోగ మార్గమునకన్న ఇది చాల ప్రయాసకరమైనది. సాధారణమైన వారికి ముందు చెప్పబడిన యోగమార్గమే అనుష్ఠించుటకు సులభమైనది. అయితే దీనియందు సదా త్రిపుటిరాహిత్య ముండదు. జ్ఞానమార్గము త్రిపుటిరహిత మార్గము.

సద్గురు దేవులకు
18వ ఆరాధన పుష్పాంజలి

– శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

పూజ్యపాద పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీవిద్యాప్రకాశానంద స్వామిజీ !

మీ 108 గీతాజ్ఞానయజ్ఞాలలో చమత్కార చతురచారు వచో విన్యాసంతో గూడిన ప్రవచనల ద్వారా మీరు సమాజాన్ని ఒక విప్లవాత్మక మలుపు తిప్పినారు. మీ ప్రవచనాలు కథలు, ఆంగ్ల కొటేషన్లు, హాస్యజోక్స్‌లతో శ్రోతలను కడుపుబ్బ నవ్వించేవి, మంత్రముగ్ధులను చేసేవి, మీ గీతామకరందం ఎన్నో లక్షల మందికి కరదీపిక అయ్యింది. ఆధ్యాత్మిక పథంలో సుఖమయ జీవనవిధాన దిక్సూచి అయ్యింది. వేలమందికి జీవిత లక్ష్య నిర్దేశం చేసింది.

మీ గీతోపన్యాసాలు ఏలాంటి అట్టహాసం, ఆర్భాటం లేకుండా వందల కొలది పట్టణాలలో వేలకొలది ప్రజలలో నైతిక, ఆధ్యాత్మిక జాగృతిని కలిగించాయి. నిజ జీవితంలోని మీ హాస్యప్రియత్వం, మీ నియమబద్ధ జీవితం, సంయమనం, సదాచారం, సమయపాలన, మితభాషణ సాధకులకు ఆదర్శప్రాయమైంది.

మీ వేదాన్తభేరి వేలకొలది పాఠకులకు ఎనలేని జ్ఞానాన్ని పంచిపెట్టింది. మీ సేవానిరతి భక్త కన్నప్ప ఉచిత కంటిఆస్పత్రి స్థాపన ద్వారా వేలమంది జనులకు భౌతిక చూపునిచ్చింది. మీ త్యాగనిరతి శ్రీకాళహస్తిలో మీ పేరున స్థాపించబడిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్త్రీల జూనియర్ కళాశాలలు వేలమంది నిరుపేద గ్రామీణులకు విద్యా ప్రదానం చేసి వారిని విద్యావంతులుగా, విజ్ఞానవంతులుగా చేసినవి. ఇట్టి ఆదర్శ త్యాగమూర్తీ ! జ్ఞానమూర్తీ ! గురుమూర్తీ! ఈ మీ 18వ ఆరాధనోత్సవంలో ఇదే మా హృత్పూర్వక సాష్టాంగ ప్రణామ పుష్పాంజలి ! స్వీకరించుము, మమ్ముల ఆశీర్వదించుము.

ఓం సచ్చిదానంద రూపం తం
సర్వశాస్త్ర ప్రబోధకమ్
శాన్తి దాన్తి ప్రదాతారం
సద్గురుం ప్రణమామ్యహమ్ ॥ – ఓమ్ –



మీకు జే జేలివే

- కవిరత్న శ్రీ సున్నంవీరరాజు కవి

1. భగవద్గీత నఖండపండితు లిటన్ వ్యాఖ్యానముం జేసి చ
క్కగ బోధించిరి కాని, నీవలె ననేకంబైన నూత్నాంశముల్
తగురీతిన్ వివరించి మోక్షమును జెందంగల్గు మార్గంబు సూ
క్ష్మగతిన్ జూపగ గల్గినారె? మహితాత్మా ! మీకు జే జే లివే.

2. క్రమమారన్ నుతి కెక్కునంచు మలయాళస్వామికిన్పుత్రదా
నము గావింప నినున్ భవత్పిత, మహానందంబునన్ స్వామి యా
జ్ఞ మెయిన్ ఘోరతపం బొనర్చితివి దీక్ష న్నీవు పండ్రెండు వ
ర్షము లత్యంత భయానకంబగు గుహన్, శ్లాఘింప నా స్వామియే.

3. రమణీయ మగు ' శుకబ్రహ్మాశ్రమము " కాళ
హస్తిలో నెలకొల్పి యలరినావు,
తరియింప జేయ " గీతామకరందంబు "
విరచించి ప్రజల కర్పించినావు,
" వేదాంతభేరిని " వెలయించి విజ్ఞాన
ధనమును వెదజల్లి తనరినావు
స్వీయ రాష్ట్రమున " గీతా యజ్ఞము " లొనర్చి
స్థిరతరకీర్తి నార్జించినావు
పదియు నెనిమిది దినము లీ పగిది పరమ
పావనంబగు గీతా ప్రభావ మీవు
చాటి యజ్ఞానమును బాపజాలినావు
నీ ఋణము దీర్ప శక్య మౌనే ? మహాత్మ !

4. ఎన్నో వేదము, లెన్నో శాస్త్రములు, నింకెన్నో పురాణంబు, లె
న్నెన్నో గ్రంథములన్ బఠించి భువి నెంతే జ్ఞానమార్జించి శ్రీ
మన్నారాయణ దివ్యలీల లెరిగింపన్ మీర, లాలింపగాన్
బిన్నల్ పెద్దలు వేనవేలు సతమున్ విచ్చేయరే సద్గురూ !

21-04-2016వ తేది శ్రీస్వాముల వారి 18వ ఆరాధన

వేదాన్తభేరి ... మురళీధర కృష్ణుడు

శ్రీస్వాములవారి గీతాయజ్ఞాలు

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

విద్యయా తపసా చైవ పూతాత్మా యతిపుంగవః, స్వామీవిద్యాప్రకాశాఖ్యో గురు ర్విజయతేతరామ్ ॥ వికిరన్తం సదా గీతామకరందం మహీతలే, యతిశ్రేష్ఠం భజే విద్యాప్రకాశానంద సద్గురుమ్.

ఆ మహనీయుడు విద్యాతపస్సులచే పూతాత్ముడైన యతిశ్రేష్ఠుడు. శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామిగా లోకంలో ప్రసిద్ధుడు. నేల నాలుగు చెరగులా గీతామకరందమును పంచిపెట్టిన గీతాచార్యుడు. ఎనుబది నాలుగు సంవత్సరాల నిండుజీవనం కొనసాగించి కృతకృత్యుడై 10.04.1998వ తేదీన భౌతికకాయం పరిత్యజించిన కారణజన్ముడు.

శుష్క వేదాంత తమోభాస్కరులు, చరాచర సుఖాభిలాషి, ఆంధ్ర ఆధ్యాత్మిక పితామహులూ అయిన మహర్షి సద్గురు శ్రీ మలయాళస్వాములవారు వ్యాసుని పేరుతో ఏర్పేడు వద్ద నందిపర్వతం చెంత 1926లో ఆశ్రమం స్థాపించారు. వారి ప్రియశిష్యులైన శ్రీ విద్యాప్రకాశానందులు గురుదేవుల అనుమతితో 1950లో శ్రీకాళహస్తికి చెందిన సువర్ణముఖీతీరంలో శుకబ్రహ్మపేర ఆశ్రమం నెలకొల్పారు. ఈ రెండాశ్రమాల పేర్లను బట్టి ఆ గురుశిష్యుల సంబంధం ఎలాంటిదో గ్రహించవచ్చు.

అంతేకాదు. శ్రీ మలయాళసద్గురు దేవులు తిరుమలలో పండ్రెండు సంవత్సరాలు తపోదీక్ష కొనసాగించి ఆత్మసాక్షాత్కారం పొందారు. శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు వ్యాసాశ్రమంలోనే పండ్రెండు సంవత్సరాలు తపోనిష్ఠులై వుండి భగవదనుగ్రహం పొంది పరమార్థాన్ని చేజిక్కించుకున్నారు. ఇరువురూ అనేక గ్రంథాలు రచించారు. ఇద్దరికీ భగవద్గీత అత్యంత ప్రీతిపాత్రమైన గ్రంథరాజం. ఇద్దరూ గీతకు వ్యాఖ్య వ్రాశారు. శిష్యుడు వ్రాసిన 'గీతామకరందం' సాటిలేని మేటి రచనగా

రాణించింది. ఆంధ్రావనిలో అద్వితీయమైన ఆధ్యాత్మిక గ్రంథంగా అది ప్రశస్తి పొందింది.

వాగ్వైభవం యతేర్యస్య, సర్వలోక ముదావహమ్.
జాడ్యాపహం చ చైతన్య, దాయకం తమహం భజే

శ్రీ విద్యాప్రకాశానందస్వామివారి ఉపన్యాస కౌశలం అసాధారణమైనది. అది గురుకృప వల్లా, భగవదనుగ్రహం వల్లా, స్వయం కృషి వల్లా సమగ్ర సుందరమై విరాజిల్లింది. **వారి గీతాయజ్ఞాలు తిరునాళ్ళవలె ప్రజలను వేల సంఖ్యలో ఆకర్షించేవి.** హైదరాబాద్ వంటి పెద్ద పట్టణాలలో ముప్పది నలుబది వేలకు మించి జనులు రోజూ వారి ప్రవచనాలకు హాజరుకాగా, తిరుపతి వంటి మధ్యతరగతి నగరాలలో కూడా పదివేలకు మించి శ్రోతలు వచ్చేవారు.

ఎక్కడ శ్రీస్వాములవారి ప్రసంగాలు కొనసాగేవో, అక్కడ ప్రజలందరూ వారి వాగ్వైభవాన్ని గూర్చే ముచ్చటించుకొనేవారు. ఈ సభలో శుకబ్రహ్మాశ్రమం ప్రచురించిన గ్రంథాలు కూడా వేల సంఖ్యలో విక్రయమయ్యేవి.

1957లో గుంటూరుజిల్లాలోని నరసరావుపేటలో ప్రారంభమైన శ్రీవారి గీతాయజ్ఞాలు ఇంచుమించు నలభై సంవత్సరాలు అప్రతిహతంగా నిర్వహింపబడ్డాయి. వారి ప్రవచనాలు జనానీకాన్ని అంతగా ఎందుకు ఆకర్షించాయి ?

ఇందుకు ఎన్నో కారణాలున్నాయి. వారు ప్రతి విషయాన్నీ చక్కని ఉపమానాలతో విశదీకరించేవారు. ఇంపైన కథలతో వివరించేవారు. పరమత దూషణ చేసేవారు కారు. అన్ని మతాలకూ, అన్ని యోగాలకూ అద్భుతంగా సమన్వయం ప్రతిపాదించేవారు. అందుకే మతభేదం లేకుండా అన్ని మతాలకు చెందినవారూ వారి జ్ఞాన యజ్ఞాలలో పాల్గొనేవారు. సంస్కృత శ్లోకాలతోపాటు వారు చెప్పే ఆంగ్లసూక్తులు ఆధునిక విద్యావంతులను ఆకర్షించేవి.

ఇలా భిన్నరుచులైన ప్రజలను ఆకర్షించి గీతాతత్త్వ ప్రబోధం చేయడంలో తమకు తామే సాటిగా శ్రీ విద్యాప్రకాశానందస్వామీజీ రాణించారు.

నన్ను మరో లోకానికి తీసుకపోయారు

– శ్రీ శేగు వెంకట లక్ష్మీప్రసాద్, గూడూరు

ఓం గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః ॥

గురుదేవులు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి పాదపద్మములకు మనసులో నమస్కారాలు.

ఎప్పుడూ ఏదో ఆలోచన, ఆందోళన, ఆవేశ భయాలతో జీవితం గడుపుతున్న నాకు ఒకరోజు ఉదయం ఆరుగంటలకు టి.వి.లో స్వామివారి దివ్యప్రసంగం వినటం కుదిరింది. అది నిజంగా నా పూర్వజన్మ సుకృతం. అలా విన్న నేను, ఆ తర్వాత క్రమం తప్పకుండా ఆయన ఉపన్యాసాలను వినటం అలావటుగా చేసుకొన్నాను. ఆ దివ్యామృతం నన్ను చైతన్యుణ్ణి చేసింది. నాలో కొత్త జీవం పోసింది. కొత్త ఆలోచనలు పూసి, గుబాళింప సాగాయి.

స్వామివారి ప్రసంగాల్లోని సరసోక్తులు, సూక్తులు, హితోక్తులు, వ్యంగ్యోక్తులు, పరమార్థకథలు సామాన్య మానవుడి నయిన నన్ను మరో లోకానికి తీసుకపోయాయి. ఆధ్యాత్మికాభిరుచిని కలిగేటట్లు చేశాయి.

రోజు రోజుకి స్వామివారిని దర్శించుకోవాలన్న కోరిక ఎక్కువ కాసాగింది. గూడూరు సమీపంలో చిల్లకూరు గ్రామంలో వున్న పూర్వాశ్రమంలో స్వామివారి అడ్రస్ కనుక్కొని కొంతమంది బంధువులతో కాళహస్తికి బయలుదేరివెళ్ళాను. దానికి ప్రేరణ స్వామివారి వాక్యమే – 'మంచి కార్యాలను వాయిదా వేయకండి – రేపు అనే దానికి రూపులేదు ' అని ఆ ప్రవచనం చెప్తుంది.

శ్రీకాళహస్తిలో మొదట జ్ఞానప్రసూనాంబ, పరమేశ్వరులను దర్శించి వెంటనే ఆటోలో శ్రీ శుకబ్రహ్మాశ్రమానికి పోయాము. అడుగడుగునా

ఆధ్యాత్మిక వాతావరణమే అక్కడ ! మరెక్కడా దొరకని ప్రశాంతత ! మనసు కెంతో వూరట !! తాపత్రయాలతో అలసి సొలసిన జీవుల కక్కడ దొరికేది తల్లిప్రేమలాంటి ప్రేమ !! ఆ దివ్యానుభూతులను అనుభవిస్తూ, మేనేజ్‌మెంట్ వారిని స్వామిదర్శనంకొరకు అడిగాము !

అప్పటికి సమయం సాయంత్రం 7 గంటలు. ‘ యిప్పుడు వీలుకాదు, రేపు వచ్చిచూడండి ’ అని వారుబదులిచ్చారు. మేము ‘ చాలాదూరం నుండి వచ్చాము ’ అని చెప్పాము. మేనేజ్‌మెంట్ వారు స్వామికి ఈ విషయం తెలుపగా ఆయన కరుణతో దర్శనం కలిగించారు.

స్వామివారిని దర్శించటానికి వెళ్లేముందు మేనేజ్‌మెంట్ వారు మతో యిలా అన్నారు. స్వామి వారికి ఆరోగ్యం బాగలేదు – ఎక్కువసేపు మాట్లాడకండి – అని. మేము అందుకు సంతోషంగా అంగీకరించి, దర్శనానికై గదిలోనికి వెళ్లాము. స్వామి వారిని చూడగానే ఒళ్లు పులకరించింది. మనసు తేలికై దూదిపింజలా ఎగర సాగింది. స్వామివారు మమ్మల్ని అప్యాయంగా పలకరించి, ఎక్కడి నుండి వచ్చారు ? అని అడిగారు. మేం గూడూరు నుంచి వచ్చాము అని చెప్పాం. ఆశ్రమం గురించి మీకు ఎలా తెలిసింది ? అని అడిగారాయన. ఆయన లోని నిరాడంబరత్వం నిర్మలత్వం, దివ్యత్వం మొదలయిన వాటితోనే నేను ఉక్కిరిబిక్కిరి అవుతుండగా, ఎంతో సాధారణ వ్యక్తిలాగా ఆయన మమ్మల్ని అడిగిన ప్రశ్న ఆలోచనల్లో ముంచెత్తింది. ముంజేతి కంకణానికి అద్దమెందుకు? ఆయన గురించి తెలియని వారెవ్వరు ? అనుకుంటూ, ‘ నేను టీ.వీలో మీ ఉపన్యాసాలను విని ప్రభావితుణ్ణి అయ్యాను. మిమ్మల్ని చూడాలని కోరిక కలిగి యిలా వచ్చాను – అన్నాను.

‘ చాల మంచిది. మంచిమార్గంలో నడవండి, మంచిపనులను చేయండి, మంచి పనుల వల్ల సుఖం – చెడ్డపనుల వల్ల దుఃఖం వస్తాయి ’ అని మాకు బోధ చేశారు మాకు ఆ సమయంలో ఆ దివ్యాత్మ స్వరూపులు.

‘ స్వామీ ! సంసార జీవితంలో వుండే మేము మంత్రోపదేశం

తీసుకోవచ్చా ? ’ అని నేను స్వామి వారిని ప్రశ్నించాను.

మంచిది ! ఫరవాలేదు. మంత్రోపదేశం, ధ్యానం ఆహారనియమాలు ఎవరయినా పాటించవచ్చును. అవి మనిషికి ఎంతో మేలు చేస్తాయి – అని సమాధాన మిచ్చారు స్వామివారు.

ఇంతలో మేనేజిమెంటువారి సూచన గుర్తుకు రాగా, మేము స్వామివారి వద్ద సెలవు తీసుకొన్నాము. ఆ కొద్దిసేపటిలో మాకు లభించిన జ్ఞానామృతాన్ని మేధోభాండంలో భద్రపరచుకొని బయటకు వచ్చాము. ఎందుకో స్వామివారిని మళ్లీ దర్శించాలని కోరిక కలిగింది. ఆరోజు రాత్రి కాళహస్తిలో వుండి మరల ఉదయం వెళ్లి స్వామివారిని దర్శించుకొని, మధ్యాహ్నం రెండుగంటలవరకు ఆశ్రమంలోనే గడిపాం.

తిరిగి గూడూరు వచ్చినా నన్ను స్వామివారి రూపం, బోధనలు వదలలేదు. మనసు ఆయన యందే లగ్నమయింది. తరువాత స్వామివారి పుస్తకాలన్నీ కొన్నాను. స్వయంగా చందాకట్టి ఇరవైఅయిదు మందికి వేదాంతభేరి (మాసపత్రిక) చేరేలాగ చేశాను. స్వామివారి ప్రసంగాలున్న క్యాసెట్స్, మానసబోధ – తత్త్వసారం, గీతామకరందం నావద్ద భద్రపరచుకొన్నాను. అవి నా కత్యంత ప్రీతిపాత్రమైన నిధులు. గీతాసారం – శాంతికి మార్గం క్యాలండర్స్ కొని మిత్రులకిచ్చాను. పరమార్థ కథలు చదివి, అందులోని సారాన్ని గ్రహిస్తున్నా. నా చేతనయినంతలో మంచి కార్యాలను చేయటానికి ప్రయత్నిస్తున్నాను. సహృదయులైన మిత్రులతో కూర్చొని స్వామివారిని గురించి ముచ్చటించుకుంటూ వుంటే నాకు పరమాన్నం తింటున్నట్లుగా వుంటుంది. స్వామివారి ఫోటోను యింట్లో పూజామందిరంలో వుంచి, కుటుంబ సభ్యులందరం పూజిస్తున్నాం. భవబంధాలనుండి విముక్తి చూపే దివ్యస్వరూపులు నా హృదయంలోనే కాదు – కోట్లాది భక్తుల హృదయాల్లో నెలవుండే దేవుడు ఆయన.

జై గురుదేవ్.



ఋషిపుంగవులు
శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు

- పూజ్యశ్రీ స్వామి విమలానంద సరస్వతి,
అధ్యక్షులు, దివ్యజీవన సంఘము (ఋషీకేశ్)

పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి శతజయంత్యుత్సవ వేడుకలు తేది :28.04.2013 ది నుండి తేది : 02.05.2013ది వరకు జరుపబడుచున్నట్లు సమాచారము తెలిసి మిగుల సంతోషించడమైనది. ఈ శుభ సందర్భమున శ్రీ శుకబ్రహ్మాశ్రమమువారు శ్రీమద్భగవద్గీతపై జాతీయ సదస్సును నిర్వహింప సంకల్పించినట్లుగను మరియు శతజయంత్యుత్సవ సంచికను విడుదల చేయుటకు నిర్ణయించినట్లుగను తెలియవచ్చినది. ఈ బృహత్ కార్యములను నిర్వహించుట ద్వారా - ఆధ్యాత్మిక జ్ఞానమును వ్యాప్తిచేయుటలోనూ, శ్రీమద్భగవద్గీతా సారమును విస్తృతంగా ప్రచారము చేయుటలోనూ ఎనలేని కృషిసల్పిన పూజ్యశ్రీ విద్యాప్రకాశానందస్వామీజీవారికి హృదయ పూర్వక కృతజ్ఞతాభి వందనములను సమర్పించుటయే అగును.

అశేష ప్రజానీకమునకు సర్వోత్కృష్టమైన గీతాజ్ఞానమును అందజేయుటకు తమ జీవితమును అంకితమొనర్చిన **ఋషిపుంగవులు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు.** పరమ పావనమగు గీతోపన్యాసములతో సకలజనావళి హృదయములను జాగృతి పరచుటకై అన్ని ప్రాంతములలో 108 జ్ఞానయజ్ఞములను నిర్వహించిన మహనీయులు. ఇట్టి మహానుభావుల అవిశ్రాంత కృషి ఫలితముగ మహోన్నతమైన గీతావాణి దేశ, విదేశములందు బహుళవ్యాప్తి నొందుచున్నది. శ్రీ స్వామివారు పూర్వాశ్రమమందు గాంధీగారి వాలంటీరుగా వుండి శ్రీ మహాత్మాగాంధీగారిచే ప్రభావితులై వారి వద్ద

వర్తించుటచే, కేవలము శ్రీకృష్ణ భగవానుని దివ్యసందేశములను వ్యాప్తి చేయుటయే కాక జనులలో మాతృదేశాభి మానమును పెంపొందించుటలో కూడా వీరు విశేషమైన కృషి సల్పిరి.

పూజ్యశ్రీ స్వాములవారు అనేకమైన విశిష్ట వేదాంత గ్రంథములను రచించిరి. భగవద్గీతయొక్క దివ్య సందేశమును బోధించుట ద్వారా మానవుల ఆధ్యాత్మికజ్ఞానమును పెంపొందించుటయే ధ్యేయముగా జీవితమును కొనసాగించిరి. ప్రతి సామాన్యవ్యక్తీ గీతయొక్క మహత్తర జ్ఞానమును అవగాహన చేసికొనవలెనని ప్రగాఢముగా అభిలషించిరి. శ్రీకృష్ణపరమాత్మ శ్రీ మద్భగవద్గీతయందు పేర్కొనిన అత్యంత దురవగాహ్యమైన అంశములను అతిసరళముగ, సులభమైన, వ్యావహారిక శైలిలో తేట తెలుగు మాటలలో సమగ్ర వ్యాఖ్యానమును 'గీతామకరందము ' అను పేరు ఒక విశిష్ట గ్రంథమును రచించిరి. ఇది ఆంధ్రుల ఆరాధ్యగ్రంథమై అనేక ఇతర భాషలలోనికి కూడా అనువదింపబడినది.

ఇంతటి బృహత్తర కార్యక్రమములను చేపట్టుచున్న శతదినోత్సవ నిర్వాహక బృందమునకు పరమ పూజ్యశ్రీ స్వాములవారికి మా ఘనమైన నివాళులను సమర్పించుచున్నాము. చారిత్రాత్మకమైన ఇంతటి గొప్ప సమావేశమందు పాల్గొనబోవు సాధుమహాత్ముల పాదపద్మములకు మా శిరఃప్రణామము లర్పించుచున్నాము.

శతజయంత్యుత్సవ వేడుకలు అత్యంత ఘనముగ విజయవంతము కావలెనని కోరుచూ, హృదయపూర్వక శుభాకాంక్షలు అందజేయుచున్నాము. మరియు శ్రీ శుకబ్రహ్మాశ్రమమును ఆశీర్వదించవలసినదిగా ఆ సచ్చిదానంద పరబ్రహ్మమును, శ్రీ సద్గురు శివానందస్వామి మహారాజ్ వారిని, శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిని సవినయముగ ప్రార్థించుచున్నాము. తద్వారా ఆశ్రమము అద్భుతమైన తమ సేవలను నిరంతరము కొనసాగిస్తూ, గీతామకరందమును మరింతగా వ్యాప్తి చేయగలదని భగవంతుని ప్రార్థించుచున్నాము.(**శతజయన్తి సంచిక నుండి)**

శ్రీ స్వాములవారి ఉపన్యాసములలో స్కూల్‌ప్లే గ్రౌండు మొత్తము జనాలతో కిటకిటలాడుతూ వుండేది

- పూజ్యశ్రీ మేధానందపురి స్వాములవారు
కోశాధ్యక్షులు, శ్రీకైలాసాశ్రమం, ఋషికేశ్

తెలుగుదేశములో విద్యాప్రకాశానందగిరి స్వాములవారు వ్రాసిన గీతామకరందము ప్రతి ఇంటిలోను కనిపిస్తుంది. సంన్యాసులకు వేదాంత ప్రచారము చేయుటయే ముఖ్యకర్తవ్యము. వేదాంతమునకు ప్రమాణమైన ప్రస్థానత్రయములోని భగవద్గీతమీద విద్యాప్రకాశానందగిరి స్వాములవారు ఆంధ్రదేశమంతటా విరివిగా ప్రచారము చేసిరి. దాదాపు 1968లో స్వామివారు “18” రోజులు రాజమండ్రిలో గోదావరి గట్టున ఉన్న స్కూలులో గీతా సందేశమును ఇచ్చిరి. దాదాపు ఉదయం “2గంటలు”, సాయంత్రము “ 2 గంటలు ” ఒక అధ్యాయము మీద ఉపన్యసించెడివారు. ఆ స్కూలులో ఉన్న “ప్లేగ్రౌండు” మొత్తము జనాలతో కిటకిటలాడుతూ ఉండేది. వారిలో “ నేను” ఒకడిని. ఉదయం సాయంత్రము సైకిలుమీద వెళ్ళి వారి వాక్‌జ్ఞానామృతమును తనివితీరా ఆస్వాదించెడివాడిని. ఆ సమయములో ఒక రోజున వారు శ్రీవ్యాసాశ్రమగుహాశ్రమంలో తపస్సు చేసిన విషయము చెప్పినారు. ఒక రోజు రాత్రి ధ్యానం చేయుచుండగా పెద్ద ఎలుగుబంటి ఆవరణలో ప్రవేశించి స్వామి వారి వైపు తదేకంగా చూసి వారిని ఏమీచేయకుండా మెల్లగా బయటికి వెళ్లిపోయింది. గీతలో చెప్పినట్టుగా “యోగక్షేమం వహామ్యహమ్” అన్నదే వారి జీవితంలో ఋజువు అయినది. స్వామి వారు – గీతలో చెప్పిన జ్ఞానమును అనుభవించిరి. దానితో తృప్తిపడక దానియందున్న సందేశమును ఉపన్యాసముల ద్వారా అందరికీ పంచిపెట్టిరి. అంతేగాక గీతామకరంద పుస్తకమును వ్రాసి ఉపన్యాసము వినలేని వారి యొక్క జ్ఞాన చక్షువులను భూత భవిష్యత్ వర్తమాన కాలములలో తెరిపించిరి. నదులు వానికై ప్రవహించవు. చెట్లు వాటికొఱకు ఫలించవు. అటులనే వీరిలాంటి మహాపురుషుల తమ జీవితమును ఇతరులను ముక్తిమార్గములో నడిపించుటకే వినియోగింతురు. వారి శతజయంతి ఉత్సవమునకు ఉత్సాహముతో సేవ చేయువారందరికి స్వామివారి అనుగ్రహము తప్పకుండా ఉండి తీరుతుంది. ఎందుకంటే “బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి ”అన్న వేదవాక్యము ద్వారా వారు అంతటా అందరిలో ఉన్నారు.

స్వామీజీ సాన్నిధ్యంలో నేను

- శ్రీ ఎస్.ఎల్.చెన్నకేశవరావు,అడ్వకేట్, హైద్రాబాద్

మొదట స్వామీజీని హైద్రాబాదు బేలాకాలనీలో ‘వనవాసి రామాలయం’లో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమములో దర్శించాను. ఆయన విశ్వకళ్యాణం నిమిత్తం అవతరించిన ప్రేమమూర్తిగా కనిపించారు. వారిని మా ఇంటికి ఆహ్వానించి సేవించాలని ఆనాడే నాకు సంకల్పం కల్గినది.

తరువాత శ్రీస్వామీజీని కలసి 24.1.1990 నా జన్మదిన సందర్భముగా మా ఇంటికి అరుదెంచి నన్ను ఆశీర్వదించవలసినదిగా కోరాను. కానీ శ్రీస్వామీజీ 25వ తారీఖున షోలాపూరు కార్యక్రమం వున్నట్లు, 24వ తారీఖునే విమానంలో షోలాపూరు వెళ్ళు కార్యక్రమం నిర్ధారించబడినట్లు చెప్పారు.

నేను వారిని 24వ తారీఖు హైద్రాబాదు వచ్చి నన్ను, నా జన్మదినమున జరుగు గాయత్రీయజ్ఞ సందర్భముగా, ఆశీర్వదించి, 25వ తారీఖు ఉదయముననే విమానంలో షోలాపూరు వెళ్ళవచ్చునని చెప్పాను.

నా కోరిక మన్నించి 24.1.1990 తారీఖున హైద్రాబాదు, తన శిష్యుడైన శ్రీ విజయానందతో వచ్చి నా గృహం పావనం చేశారు. గాయత్రీయజ్ఞమునకు హాజరై, నా స్నేహితులందరికీ వారి దివ్యసందేశాన్ని ఇచ్చారు. ఆ సందర్భములో శ్రీ స్వామీజీని జస్టిస్ పున్నయ్య గారి చేతులమీదుగా సత్కరించు భాగ్యము కల్గింది.

శ్రీస్వామీజీ నామీదనున్న అవ్యాజమైన ప్రేమతో గీతోపదేశం చిత్రపటము, వారు వ్రాసిన ‘గీతామకరందము’ అను గ్రంథమును నాకు కానుకగా ఇచ్చారు. శ్రీ స్వామీజీని ఒకరోజు నా గృహములో సేవించే భాగ్యం కల్గింది. ఇది నా జీవింతో మరువలేని, మరపురాని సంఘటన.

భయము వీడుము ! అనునది శ్రీ స్వామీజీ తన భక్తులకిచ్చు

శంఖారావము. దీని అర్థం యేమి ? ఒకతేలుగాని, పాముగాని మనలను ఏమీ చేయకుండా వాటి దోవన అవి పోతున్నా కూడా, మనము వాటిని చంపుతాము. ఎందువల్ల ? అవి మనలను భవిష్యత్తులో కుట్టుతాయేమోనని భయంవల్ల.

అలాగే ఈనాటి సమాజంలో, హింసకు, దుర్మార్గానికి కారణం ఒకళ్ళంటే ఒకళ్ళకు భయం. ఒక దేశమంటే, వేరొక దేశానికి భయం.

మన దేశం అణుశక్తిని కేవలం శాంతి, వైజ్ఞానిక కార్యక్రమాలకు మాత్రమే ఉపయోగిస్తుందని ప్రధాని చెప్తున్నా, మన పొరుగుదేశాలకు భయం. దానివల్ల ఆసియాఖండంలో ఉద్రిక్తత. వీటన్నిటికి కారణం భయమే కదా !

అలాగే లంచగొండితనానికి కూడా భయమే కారణం. రేపు ఏమవుతుందో, మన పిల్లలు ఎలా జీవిస్తారో ! అందుకని ఇప్పుడే అక్రమ మార్గంలోనైనా సరే సంపాదన చేసి కూడబెట్టుకుందామను ఆలోచన భయం వల్లనే.

సర్వకాలములలో, సర్వజనులకు, సర్వావస్థల యందు గుర్తుంచుకుని, ఆచరించవలసిన సందేశము శ్రీస్వామీజీ ఇచ్చిన సందేశం. శ్రీ స్వామీజీకి సర్వజీవకోటి యందు ఎంత ప్రేమో, అనిర్వచనీయం.

శ్రీ స్వామీజీని నేను ఒకరోజు, నాకు మోక్షమును ప్రసాదించు ఉపదేశం చేయమని కోరాను – ఆలాగే ప్రేమతో చేశారు. కొన్ని రోజుల తర్వాత శ్రీ స్వామీజీతో, " స్వామీజీ, నాకు ధ్యానంలో మనస్సు నిలవడం లేదు. ఏదైనా ఉపాయం చెప్పండి " అని కోరాను. అందుకు ఆయన " అర్జునుని అంతటివాడికి కూడా ఇలాగే జరిగింది. నీకు జరగడంలో ఆశ్చర్యమేముంది. దానికి సాధన ఒక్కటే మార్గమని శ్రీకృష్ణ పరమాత్మ చెప్పారు" అని సెలవిచ్చారు. అట్టి స్వామీజీ భౌతికంగా మనమధ్య లేకపోయినా, ఆయన మనకిచ్చిన జ్ఞాన ప్రసాదాన్ని మనము ఎల్లప్పుడు అనుభవిస్తూనే వుంటాము. అలాంటి మహానుభావుడిని మరణం శాసించలేదు. శ్రీ స్వామీజీ అమరజీవి. **(స్వర్ణోత్సవ సంచిక నుండి)**

జ్ఞాన సుధ

మూలం

శ్రీ సర్వభూషణ శివయోగి వారు

అనువాదం :

శ్రీ శంకరానందగిరి స్వాములవారు, ఉమామహేశ్వర పీఠాధిపతులు

అవ : మానవులు తమ స్వరూపమగు ప్రత్యగాత్మను మఱచి లేని జీవత్వమును కల్పించుకొని దుఃఖితులై యున్నారనుటకు దశముని దృష్టాంతమును తెలుపుచున్నారు.

జీవత్వం స్వకమౌఢ్యా ల్లోకః కలయన్ క్లిశ్యతి భృతభవశోకః,
అత్ర వృథాకృత శుక్శ్లథకాయః కృశధీర్దశమః పురుషో ధ్యేయః.

లోకః = జనము, జనుల సమూహము, స్వకమౌఢ్యాత్ = తమ (స్వరూప)అజ్ఞానము చేత, జీవత్వం = (లేని) జీవభావమును, కలయన్ = (తనయందు) కల్పించుకొని, భృతభవశోకః = వహించిన సంసారదుఃఖము గలదియై, క్లిశ్యతి = బాధపడుచున్నది. అత్ర – ఈ విషయమునందు, వృథా = వ్యర్థముగా, కృత= కల్పించుకొనిన, శుక్ = శోకము చేత, శ్లథకాయః= శిథిలమైన (కూలబడిన) శరీరము గలవాడును, కృశధీః = మతి చెడినవాడును ఐన, దశమః పురుషః = పదియవ వాడైన పురుషుడు, ధ్యేయః = అనుసంధింప దగియున్నాడు.

దశముడు తనచే ఎంచబడు తొమ్మిదిమంది యందే ఆయత్తమైన చిత్తము గలవాడై పదియవవాడగు తనను మఱచి దుఃఖితుడైనట్లు, జీవుడు దృశ్యమగు దేహేంద్రియాదులతో తాదాత్మ్య మొంది, వానికంటె భిన్నమగు తన యధార్థ స్వరూపమును మఱచి తనయందు లేని అహంకార ధర్మములు గలవాడై జీవత్వమును బొంది నిరర్థకముగా జనన మరణాది దుఃఖ మొందుచున్నాడు. కావున ఈ దుఃఖము కల్పితమే కాని సత్యముగాదు. గురుసన్నిధిని మహావాక్య విచారపూర్వకముగా బ్రహ్మాభిన్నసాక్షి (ప్రత్యగాత్మ) నేనే యని తెలిసి కొనినచో అఖండ సుఖరూపుడగును.

అవ : అనేక జీవులకు ఒక ఈశ్వరునితో ఏకత్వము ఎట్లు ఘటించును? అను శంకను పురస్కరించుకొని జీవేశ్వరభావము బ్రహ్మవివర్తమయి యున్నందువలన ఏకత్వము సహజముగనే సిద్ధమగునని దృష్టాంత పూర్వకముగా తెలుపుచున్నారు.

వ్యష్టి సమష్టి విభూత్యో రైక్యం విక్షిప్త జీవశతశివయో ః
గుణశత తదుదర పటయోః కార్పాస వివర్తవత్ పరం విద్యాత్.

గుణశత తత్ ఉదర పటయోః = తంతు (దారముల) సముదాయమునకు అది (అవి) ఉదరమునందు **(తనతోన)** గల వస్త్రమునకు, కార్పాస వివర్తవత్ = కార్పాసరూపమైన (దూది) వివర్తములెనే, వ్యష్టి సమష్టి విభూత్యోః = (పరమాత్మయొక్క) వ్యష్టి సమష్టి విభూతులుగా నుండెడి, విక్షిప్త జీవశత శివయోః = నానావిధముగా చెదరిపోయిన జీవసముదాయమునకు ఈశ్వరునకు, ఐక్యం = ఏకత్వమును, పరం= నిర్దోషమునుగా, విద్యాత్ = ఎఱగవలెను.

పరమాత్మ యొక్క వ్యష్టిరూపమైన విభూతి జీవుడు. సమష్టిరూపమైన విభూతి ఈశ్వరుడు. వీరిద్దఱు పరమాత్మ యొక్క వివర్తముగా ఉన్నారు. కావున స్వరూపతః పరమాత్మగానే ఉన్నారని భావము. దారము వ్యష్టి. వస్త్రము సమష్టి. ఇవి రెండును దూదియొక్క వివర్తముగా ఉన్నవి. కావున స్వరూపతః ఇవి దూదియే ఐయున్నవి. ఇది ఉదాహరణము.ఇట్లు జీవేశ్వరులకు ఐక్యము ప్రామాణికమును నిర్దోషమునై యున్నదని యెఱుగవలెను. వ్యష్టి యగు అనేక తంతువు (దారము)లకును సమష్టియగు పటము (వస్త్రము) నకును వైలక్షణ్యమున్నట్లు అగపడినను మూలమగు దూదిస్వరూపమునందు ఈ రెండు అభిన్నమై ఒకటిగానే యున్నవి. ఇటువలె జీవులు కించిజ్జ్ఞత్వ దుఃఖత్వాదులచే కూడియున్నారు. ఈశ్వరుడు సర్వజ్ఞత్వ సర్వశక్తిమత్వాదులచే కూడియున్నాడు. ఇట్లు వీరికి హస్తిమశకాంతర భేద ముండినను అధిష్ఠానమగు పరబ్రహ్మ స్వరూపమున ఏకమై యున్నారు. కావున జీవేశ్వరైక్యము అప్రామాణ్య శంకదోషరహితమైనది. ఉపాధి మూలమున జీవేశ్వరులకు భేదముండినట్లు భానమైనను స్వరూపతః అభేదము చిరసిద్ధమని సిద్ధాంతము.

ఆచార్యదేవో భవ

–ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

విద్యాగురువులు

శ్రీమద్భాగవతంలో హిరణ్యకశివుడు శుక్రాచార్యుల కుమారులను ఆహ్వానించి తన కుమారుడయిన ప్రహ్లాదుని అప్పగించే సందర్భంలో విద్యా ప్రాధాన్యం గురించి స్పష్టంగా చెప్పాడు.

' చదువనివాఁ డజ్ఞుండగుఁ

జదివిన సదసద్వివేక చతురత గలుగున్ ' – అని. అటువంటి విద్యలు ప్రధానంగా లౌకిక విద్యలు, అలౌకిక విద్యలు. మానవజీవితం సాఫీగా సాగడానికి లౌకిక విద్యలవసరమే. అలాంటి విద్యలు నేర్వడానికి శిష్యులు గురుకులంలో చేరడమో లేదా తగిన గురువును అన్వేషిస్తూ వెళ్ళడమో పురాణాలలో కనిపించే అంశాలు. ఆలాంటి శిష్యులలో హనుమంతుడు, కర్ణుడు, బలరామకృష్ణులు ప్రధానమయినవారు.

శ్రీమద్రామాయణంలో ప్రముఖపాత్ర 'హనుమంతుడు ' అంజనాదేవి పుత్రుడు. జన్మించిన తోడనే ఆకాశంలోని ఎర్రటి సూర్యబింబాన్ని ఫలంగా భావించి మ్రింగడానికి సిద్ధమయినవాడు. అంతేగాదు. తరువాత ఆ కర్మసాక్షిని, కమలబాంధవుని గురువుగా ఎంపిక చేసుకొని అతనికడ విద్యలు నేర్చిన ఘనుడు. ఈ వృత్తాంతాన్ని కవులు, వాగ్గేయకారులు రసరమ్యంగా వర్ణించినవారే. వారిలో తాళ్ళపాక కవులు ఆంజనేయుని విద్యాభ్యాసాన్ని

చదివె సూర్యుని వెంట సారె మొగము ద్రిప్పుచు
యెదుట నీతని మహిమేమని చెప్పేమయ్యా
వుదయాచలము మీది నొక్క జంగ చాఁచుకొని

వుదటున నపరాత్రి నొక్క జంగ చాచుకొని అని
తుద సూర్యమండలము తోడ మోము దిప్పుకొంటా
పెదవులెత్తి చదివె అని

మొగి సూర్యునిచే శాస్త్రములు చదివినవాడని వర్ణించారు.

ఒక నాణానికి ఇరువైపుల బొమ్మబొరుసు లున్నట్లే పరశురామునిలో శిష్యత్వముంది. ఆలాగే గురుత్వముంది. పరశురాముడు భృగు ఆనతిమేరకు పరమశివుని గురువుగా భావించాడు. ఆ స్వామి కృపతో 'రౌద్రాస్త్రం ' గడించాడు. ఆ పరమశివుడే ఇంద్రాదులకు సాయం చేయమని ఆదేశిస్తే తనకంత శక్తి లేదంటే పరుమేశ్వరానుగ్రహంతో ' పరశు ' పొందాడు.

పరశురాముడు ఎందరికో గురువు. ద్రోణుడు ధనార్ధం పరశురాముని దగ్గరికి వచ్చాడు. కాని అప్పటికే పరశురాముడు సర్వస్వం దానం చేయడం వల్ల ఏమీ ఇవ్వలేక తన దగ్గరున్న శస్త్రాలను ద్రోణునికిచ్చాడు. అపుడు ద్రోణుడు పరశురాముని దగ్గర అస్త్రప్రయోగరహస్యాలు తెలుసుకొన్నాడు.

విద్యా గురువులలో ప్రథమతః గుర్తుకు వచ్చేవాడు **ద్రోణుడు.** ఇతడు భరద్వాజుని కుమారుడు. ఇతనికి తండ్రే మొదటి గురువు. తండ్రిదగ్గరే వేదాధ్యయ నాది విద్యలను నేర్చినవాడు. ఆలాగే ధనుర్వేదం కూడా నేర్చుకొని అగ్నివేశుడనే మునిగురువు వల్ల ఆగ్నేయాది దివ్య బాణాలు పొందాడు. విద్యానంతరం కృపుని చెల్లెలు కృషిని పెళ్ళాడినాడు. ద్రోణునికి 'అశ్వత్థామ' అనే కుమారుడున్నాడు. ధనవంతుల పుత్రులు పాలుతాగడం చూచి అశ్వత్థామ ఏడ్చాడు. తండ్రిగా తన అసమర్థతను తలచుకొని ద్రోణుడు చిననాటి స్నేహితుడయిన 'ద్రుపదుని' దగ్గరికి వెళ్ళాడు. కాని అతడు అవమానించాడు. చివరకు విచారంతో భార్యబిడ్డలతో హస్తినవైపు కదిలాడు.

హస్తినకు చేరువలో బంతి బావిలో పడగా తీసుకొనే ఉపాయం తెలియక తెల్లమొగం వేస్తున్న వారిని చూచి ద్రోణుడు బాణాలు ప్రయోగించి బంతి తీసి యివ్వడంతో కౌరవ పాండవులు సంతోషించారు. ఈ వార్త

తెలిసిన భీష్ముడు ద్రోణుని శస్త్ర విద్యాబోధకునిగా నియమించాడు. తాను బ్రాహ్మణుడయినా ద్రోణుడు వృత్తి కోసం శస్త్రాస్త్ర బోధకుడు కావలసి వచ్చింది. అప్పట్లో ద్రోణునికి పలురకాలయిన సమస్యలు. మొదటిది జీవనోపాధి సమస్య. రెండవది తన్ను అవమానించిన ద్రుపదునిపై పగతీర్చుకోవాలనే సమస్య. మూడవది తన ధనుర్విద్య అంతా తరువాతి వారికి అందించాలనే తపన. ఈ మూడు సమస్యలకు ' హస్తిన' అనుకూలంగా అనిపించింది. అందుకే అక్కడే స్థిరపడ్డాడు.

విద్యాబోధనలో ద్రోణుడు ఆచితూచి అడుగులు వేసే వ్యక్తి. కౌరవ పాండవులలో ఎవరికి ధనుర్విద్యాభిలాష ఎక్కువ అని తెలుసుకోవడం మొదటిది. అతని పరీక్షలో అర్జునుడే ముందున్నాడు. అందుకే అతనికి అనేక విద్యలు నేర్పాడు. ఆలాగే ఆపదవేళ తన్ను రక్షించేవారెవరని తెలియడాని కోసం నదిలో మొసలి పట్టిందని కేకవేసి అర్జునప్రయుక్త బాణంతో విముక్తుడయ్యాడు. ఆలాగే లక్ష్యశుద్ధి విషయంలో అందరిని పరీక్షించి అర్జునుడే తగినవాడని నిర్ణయించు కొన్నాడు. ఆపై తన పంతం నెగ్గించుకోవడానికి ద్రుపదుని పట్టి తేవడానికి అర్జునుడే సమర్థుడని భావించాడు. అర్జునుడు ద్రుపదుని బంధించి గురుదక్షిణ తీర్చాడు.

ద్రోణాచార్యులు వృత్తాంతంలో అనేక విద్యారహస్యాలున్నాయి. ఇతరులు మెచ్చుకోవాలంటే తాను సమర్థుడనని ముందు నిరూపించు కోవడం. బావిలో పడ్డ బంతిని బాణాలతో తీసి ఇవ్వడంతో ద్రోణాచార్యుల బాణప్రయోగకౌశలం విదితం కాగలిగింది. అర్జునుని విలువిద్యా విశారదునిగా చేస్తాననే వాగ్దానంలో ఎదురయిన చిక్కును పరిష్కరించడంలో ' సత్యవాక్కు ' స్పష్టమయింది. కుమారాస్త్రవిద్యా ప్రదర్శనలో కర్ణునికి అవకాశం ఇవ్వడంలో హస్తినలో ఆపై నిలదొక్కుకోవడానికి వీలయింది. అంతేగాక శిష్యుడు ఏనాడు తనకు ప్రతిస్పర్థి కాకుండా వుండడానికోసం తనతో ప్రత్యక్ష యుద్ధం చేయననే ప్రతిన అర్జునుని చేత చేయించడం

దూరదృష్టికి సంకేతం. విద్యావిధానంలోను, విద్యా బోధకులలోను యుగాలకనుగుణంగా మార్పులు వచ్చాయనడానికి ద్రోణుని చరిత్ర ప్రబలసాక్ష్యం.

భాగవతంలో దశమస్కంధంలో కనిపించే గురువు సాందీపని. ఇతడు బ్రాహ్మణుడు. ఇతని దగ్గర బలరామకృష్ణులు, కుచేలుడు విద్యలు నేర్చారు. బలరామకృష్ణులకు ఉపనయన సంస్కారాలు చేసినవాడు గర్గుడు. ఈ సన్నివేశాన్ని పోతన అతిరమ్యంగా వర్ణించాడు. మానవులెవరయినా సరే గురుముఖతః విద్యాగ్రహణం చేయడం సబబని సూచించేవిధంగా తాము సర్వజ్ఞులయినా జగద్గురువులయినా 'గుర్వాంగీకరణం' చేశారట. అంతేకాదు ' భావవర్తనములతో ' భక్తి సేసినారలట. గురువయిన సాందీపని వారికి

వేదశ్రేణియు సంగకంబులు ధనుర్వేదంబుఁ దంత్రంబు మ
న్వాది వ్యాహృత ధర్మశాస్త్రములు సుద్యన్న్యాయముం దర్క వి
ద్యాదక్షత్వము రాజనీతియును షుద్ధప్రకృతియున్

బోధించాడట. 64 విద్యలను 64 దినాలలో నేర్పిన ఘనత సాందీపనిది. ఈ అంశాన్ని పోతన

అఱువది నాలుగు విద్యలు
నఱువది నాలుగు దినంబు లంతన వారల్
నఱవాదులయినకతమున
నెఱి నొక్కక్క నాటి వినికి నేర్చి రిలేశా !

గురువులకు నెల్ల గురులై
గురులఘు భావములు లేక కొమరారు జగ
ద్గురులు త్రిలోకహితార్థము
గురుశిష్యన్యాయలీలఁ గొల్చిరి వేడ్కన్

విరాటరాజు తనయ **'ఉత్తర '**. అందగత్తె. నాట్యభంగిమకు తగిన ఆకారం ఆమెది. తల్లిదండ్రులకేమో ఆమెకు నాట్యం నేర్పాలని ఆరాటం. కాని తగిన గురువు తారసపడలేదు. సరిగ్గా అదే సమయానికి పాండవులు మారుపేర్లతో విరాటుని ఆశ్రయించినారు. అర్జునుడు తన్ను బృహన్నలగా పరిచయం చేసుకొన్నాడు. శాపం వల్ల తనకు నపుంసకత్వం వచ్చిందన్నాడు " వేరే ఏవీ నేర్చుకోవడం వీల్లేక చినతనంలోనే దండలాసకం, కుండలి, ప్రెక్కణం ప్రేరణం నేర్చుకొన్నా. అంతేకాదు. నాకు వాద్యాల వాయింపు వచ్చు. మంచి శ్రుతులతో కూడిన గీతాలు, గతులు తెలుసు. రసభావాశ్రయాలయిన అభినయాలు నాకు తెలుసు. అంతేకాదు. నేర్పరితనం ఏమాత్రం లేని వాళ్ళ చేతనయినా సాధన చేయిస్తాను. వారిని తీర్చిదిద్దుతాను. నాట్యం నేర్పుతూ అంతఃపురాలలోనే ఉంటాను. నాట్యస్థాన అలంకరణ, వస్త్రాద్యలంకారాలు నాకు తెలుసు ' అన్నాడు. అంతా విన్న విరటుడు అతడు 'పేడి' అని విశ్వసించి ఆపై ఉత్తరకు కబురంపాడు. ఉత్తర రానే వచ్చింది. తిక్కన ఆమె రాకను 'అలరువిలుతు పువ్వుటమ్ము'తో పోల్చాడు. నడకలో అందం. నడుములో సొగసు, వీక్షణలో కాంతులు, వింతలు కనబడేలా వచ్చింది. దీని బట్టే ఉత్తర నాట్యం, నేర్పదగిందని విశదమయింది. అయినా విరాటుడు ' ఇమ్మగువ నీకు నాట గఱపందగు పాత్రంబగునే ' అని ప్రశ్నించి ఆపై బృహన్నలతో ' నీవు చతురమతివి. ఈమెకు ఆటలంటే ఇష్టం. విచ్చలవిడితనం. శిక్షణ అవసరం ' అని అప్పగించాడు. అంతేకాదు.

ఎల్ల చుట్టములును దల్లియుఁ దోడును
జెలియుఁ బరిజనంబుఁ జెలువ, నీకు
గురువ ! – అని గురుత్వభావనతో మసలు కొమ్మన్నాడు.

మాన్యశ్రీ మాకిరెడ్డి అంజిరెడ్డి గారు (నంబూరు, కాకాని మండలం, గుంటూరు జిల్లా) గోసేవ నిమిత్తము ఒక లక్షా ఇరవై ఐదువేలా నూటపదహారు రూపాయలు సద్గురు సర్వసేవా ట్రస్టుకు సమర్పించినారు.

Statement of Ownership and other Particulars of Vedantha Bheri (FORM IV See Rule 8)

01. Place of Publication	:	Srikalahasti
02. Periodicity of its Publications:		Monthly
03. Printer's Name	:	B.Viswa Natha Raju
Whether Citizen of India ?	:	Yes
Address	:	C.N.PRINTERS, Prakasam Road, TIRRUPATI
04. Publisher's Name	:	Vidyaswarupanandagiri Swamy
Whether Citizen of India ?	:	Yes
Address	:	Sri Sukabrahma Asramam Swami Vidyaprakasananda Nagar, Sri Sukabrahma Ashram (P.O.) SRIKALAHASTI - 517640
05. Editors Name	:	Vidyaswarupanandagiri Swamy
Whether Citizen of India ?	:	Yes
Address	:	Sri Sukabrahma Asramam Swami Vidyaprakasananda Nagar, Sri Sukabrahma Ashram (P.O.) SRIKALAHASTI - 517640
06. Name and Address of Indiduals Who own the News Paper Partners of Share holders holding more than one percent of the total Capital	:	Vidyaswarupanandagiri Swamy Sri Sukabrahma Ashram Spiritual Institution Srikalahasti - 517640 Chittoor District A.P.

I Vidyaswarupanandagiri Swamy hereby declare that the particulars give above are true to the best of my knowledge and belief.

Date : 20th March 2016 **(Sd/-) Vidya Swarupanandagiri Swamy**

Signature of the Publisher

సద్గురు దేవా! వందనములు!!

– కె. ఈశ్వర్

గురువులు అంతటా వుంటారు. సద్గురువులు అరుదుగా వుంటారు. అట్టి సద్గురువులలో మద్గురు దేవులు పూజ్యపాదులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములు ఒకరు. **భగవద్గీతా ప్రచారమునకై భగవంతుడు** పంపించిన మహర్షియే మీరు స్వామీ !

భగవద్గీతను తాకకూడదు. చదవకూడదు. కొందరికే పరిమితము అను సంకుచిత భావాలతో నాలుగు గోడల మధ్య బంధించిన ఆ రోజులలో జాతి, మత, కుల భేదములు లేకుండా భగవద్గీతలోని మాధుర్యాన్ని అందించి అందరూ చదవండి. చదివించండి. సారాన్ని గ్రహించండి. అమలు పరచండి. ఆనందం పొందండి అని చాటిచెప్పిన ఘనత మీదే స్వామీ ! నాస్తికులు సహితము శ్రీ స్వామివారి గీతాప్రవచనములకు ఆకర్షితులైన వారు ఎందరో ఉన్నారు. **వంకర గీతను చక్కదిద్దేది భగవద్గీత అని నిరూపించారు** శ్రీస్వాములవారు.

ఏప్రిల్ నెల ప్రత్యేకత :-

శ్రీ స్వామివారు అవతరించిన నెల ఏప్రిల్. అవతారా సమాప్తి నెల ఏప్రిల్ . **ఏప్రిల్ 13వ తేది అవతరించారు. ఏప్రిల్ 10వ తేది అవతారాన్ని చాలించారు.** తెలుగు తిథులను బట్టి జన్మదిన తేదీలు మారుచుండును. భక్తులారా ! రండి శ్రీ స్వామివారి జన్మదిన ఆరాధన, ఆశ్రమ వార్షికోత్సవ కార్యక్రమములలో పాల్గొని మహాత్ముల దివ్య సందేశములను వినండి. విని ఆనందించండి. చిన్న వయస్సులోనే నన్ను చేరదీసి, ఆశీర్వదించి వారి సేవకు అవకాశం కల్పించిన సద్గురు దేవులకు సహస్రకోటి వందనాలు.

18వ ఆరాధనోత్సవాలు

గురుదేవులు పరమపూజ్యులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి 18వ ఆరాధనోత్సవము, 103వ జన్మదినోత్సవము శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో (శ్రీకాళహస్తి) 21-04-2016 నుండి 25-04-2016 తేది వరకు ఐదు రోజులు జరుగును. అందీ క్రింది మహాత్ములు పాల్గొని తమ ప్రవచన లిచ్చెదరు.

01. పూజ్య శ్రీ దండి నిర్మలానందగిరి స్వాములవారు
(అష్టలక్ష్మీ పీఠాధిపతులు - తెనాలి)

02. పూజ్యశ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు
(జగద్గురు మఠాధిపతులు, హైద్రాబాద్)

03. పూజ్యశ్రీ స్వస్వరూపానందగిరిస్వాములవారు
(వశిష్ఠాశ్రమాధిపతులు, శ్రీనివాసమంగాపురం)

04. పూజ్య శ్రీ డా॥ కరిబసవరాజేన్ద్ర మహాస్వాములవారు
(గవి మఠ ఉత్తరాధిపతి, బళ్లారి)

05. పూజ్యశ్రీ పరమాత్మానందగిరి స్వాములవారు
(శ్రీ లక్ష్మీనారాయణాశ్రమాధిపతులు, గంగాపురం)

06. పూజ్యశ్రీ విష్ణుసేవానందగిరిస్వాములవారు
(మలయాళస్వామి సన్న్యాసమఠాధిపతులు, కరీంనగర్)

07. పూజ్యశ్రీ యోగిని చంద్రకాళీప్రసాద మాతాజీ వారు
(కాళీవనాశ్రమాధిపతులు, నంబూరు)

08. పూజ్యశ్రీ మాతా జ్యోతిర్మయానంద భారతి స్వామిని వారు
(శ్రీ షణ్ముఖానందాశ్రమాధిపతులు, పాలకొల్లు)

09. పూజ్యశ్రీ శంకరానందగిరిస్వాములవారు
(శ్రీ దత్తాత్రేయాశ్రమాధిపతులు, మహేశ్వరం క్రాన్)

10. పూజ్యశ్రీ సత్యాత్మానంద సరస్వతిస్వాములవారు
(చిన్మయమిషన్, ఒంగోలు)

11. పూజ్యశ్రీ విరజానందతీర్థస్వాములవారు
(శ్రీ శివరామకృష్ణ తపోవనం, బి.వెన్నెల)

12. పూజ్యశ్రీ కైలాసానందగిరి స్వాములవారు
(శాంత్యాశ్రమాధిపతులు, కైలాసకోన, పుత్తూరు)

13. బ్రహ్మశ్రీ మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు
(శ్రీ మలయాళ సద్గురు సేవా సమాజాధ్యక్షులు, తిరుపతి)

14. బ్రహ్మశ్రీ శ్రీ తుకారాం గారు (గుంటూరు)

గజేంద్ర మోక్షము - రహస్యార్థము

(గత సంచిక తరువాయి)- ఎస్.వి. భారతీలక్ష్మి (భీమవరం)

"సమస్త భువనములు యొనని వలన సృష్టి స్థితిలయ కారకములగు చున్నవో అట్టి సర్వేశ్వరుని శరణు వేడుచున్నాను. సర్వ పదార్థములయందు 'సూత్రేమణిగణా ఇవ' అనునట్లు అంతర్యామిగా యెవడు వ్యాపించి యున్నాడో, ఆ వ్యాపక చైతన్యమును, శరణు వేడుచున్నాను." అని జీవగజేంద్రుడు సర్వసాక్షి, శుద్ధ సత్త్వ స్వరూపుడు, సర్వవ్యాపకుడు, సృష్టికి అధిష్ఠానమునగు పరమేశ్వరుని ధ్యానింప సాగెను.

లోకంబులు లోకేశులు
లోకస్థులు దెగినదుది నలోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వం
డే కాకృతి వెలుగు నతని నే సేవింతున్.

లోకములనగా గోళకములు. అనగా, ఇంద్రియ స్థానములు, లోకేశులనగా ఇంద్రియములు. లోకస్థులనగా ఇంద్రియాధి దేవతలు, తెగిన తుది అనగా నశించిన పిమ్మట విలోమమగును. అనగా ఆరోహణము. వాగింద్రియమును మనస్సు నందును, మనస్సును బుద్ధియందును, బుద్ధిని మహత్తత్త్వము నందును (మహాబిందువునందు) మహత్తత్త్వమును అవ్యక్తము నందును అనగా, గాడాంధకారము నందును లయం చెయ్యగా దట్టమైన ఆ చీకటి కవతల ఏకాకారముగా నుండు పరమాత్మను గొలిచెదనని జీవగజేంద్రుడు ప్రార్థించాడు.

అనేక ఉపాధులలో అంతర్యామిగా నటునివలె చరించుచును. వాఙ్మనస్సుల కగోచరమైన పరమాత్మకు నమస్కారము. ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక దుఃఖములు లేని శాంతమూర్తియగు పరమాత్మకు నమస్కారము. మోక్షప్రదాత, నిర్విశేషుడు, అనగా నేతి నేతి వాక్యములచే తెలియబడువాడు, మంగళ స్వరూపుడు, సర్వభూతముల హృదయ గుహల యందు నిగూఢముగా నుండువాడు, సర్వజ్ఞుడు, ఇంద్రియాతీతుడు, ఇంద్రియ ద్రష్ట, ఇంద్రియములను వాటి వాటి క్రియల యందు

ప్రేరేపించువాడు, ఇంద్రియార్థములను తెలియజేయు తెలివియే రూపముగా గలవాడు, అనగా, ఎఱుక స్వరూపుడునగు పరమాత్మకు నమస్కారము అని ప్రార్థించాడు.

అన్ని రూపములు తన రూపములుగా గలవాడు, ఆది మధ్యాంతములు లేనివాడు, భక్తులను రక్షించువాడునగు పరమాత్మ నా మొఱనాలకింపడా ! అకర్త, అభోక్త, అజుడు, శాశ్వతుడునగు పరమాత్మ నన్ను కాపాడడా ! అనుచు జీవగజేంద్రుడు బలములేక, ధైర్యము నశించి ప్రాణావశిష్ట దశకు జేరి, శరీరము సడలిపోగా తనను రక్షించువాడు పరమాత్మయేనని భావించి సర్వము బ్రహ్మమేనను వృత్తిచే చిత్తము నరికట్టి అంతరిక్షము వైపు దృష్టి నిలిపి కామమను మకరినుండి రక్షించి నీయందైక్యము చేసికొనుమా ! యనుచు ఆర్తితో సర్వవ్యాపక చైతన్య స్వరూపుడగు శ్రీమన్నారాయణుని ధ్యానింప సాగెను.

ధ్యానించు వాని భావమును, శరణుజొచ్చిన వాని చిత్తమును, అయస్కాంతము ఇనుమునాకర్షించిన విధముగా ఆకర్షించి తెలిసికొను శక్తి గల పరమాత్మ శరణాగతుడగు గజేంద్రుని మొఱనాలకించెను.

అవినాశియైన వైకుంఠములో (ప్రకాశములో) ఆర్త త్రాణ పరాయణుడు, ఆపన్న శరణ్యుడు నగు శ్రీమన్నారాయణుడు శుద్ధ జ్ఞానానందామృత సరోవరమను భవనమున పరిశుద్ధ సాత్విక ప్రకృతియను లక్ష్మీదేవితో క్రీడించుచు జీవగజేంద్రుని దీనాలాపముల నాలకించి నంతనే శరణాగతుని రక్షించుటకై ప్రకృతి రూపిణియగు లక్ష్మీదేవితోనైన చెప్పక, శంఖచక్రములనే సాంఖ్యయోగ సాధనములను గ్రహింపక, శమదమాదులనే పరివారమును పిలువక, తపస్సనే గరుత్మంతుని సిద్ధం చెయ్యక, ప్రకృతి యొక్క (లక్ష్మీదేవి యొక్క) పమిట కొంగునైన వీడక విహంగ మార్గమున హుటాహుటిని బయలుదేరెను.

పరమాత్ముని నీడవలె నుండు ప్రకృతియను లక్ష్మీదేవి సహస్రార మనే ముఖపద్మము నందలి బ్రహ్మానందమనే మకరందమును గ్రోలు జీవన్ముక్తులనే తుమ్మెదలచే శోభాయుతమైయున్న స్వరూపానంద మను చేలాంచలముచే ఆకర్షింపబడి విష్ణువు వెంట పోవుచుండెను. శ్రీహరి ఎటు వెళ్ళుచున్నాడో తెలియక పరమాత్మచే ఆకర్షింపబడిన పరా ప్రకృతి మేఘము ననుసరించి పోవు విద్యుల్లతవలె పోవుచున్నది.

అవిద్యయను దుశ్శాసనునిచే బాధింపబడు విద్యయను ద్రౌపది యొక్క దీనాలాపములను వినెనో, వేదములపౌరుషేయములు కావని వాదించు వేదబాహ్యులు ప్రబలిరో, అసురసంపత్తి దైవసంపత్తిని ఆవరించెనో, పరోక్షాపరోక్ష జ్ఞానమే లేదని భక్తులకు దుర్బోధ చేయువారెక్కువైరోయని వితర్కించు కొనుచు లక్ష్మీదేవి శ్రీహరి వెంట బయలుదేరెను. సూర్య చంద్రులనే శ్రవణభూషణములు, జీవేశ్వరులనే కుచయుగ్మము, అభిమానమనే పమిట కొంగు, మణిపూర చక్రమనే వడ్డాణము, నేతి నేతి వాక్యములచే శేషించిన సన్నని నడుము గల ప్రకృతి రూపిణియగు లక్ష్మీదేవి కారణమేమిటని పరమాత్మ నడుగుటకై ప్రయత్నించి కూడ చంచల స్వభావము గలది, జడప్రకృతియగుటచే అడుగ లేక పోవుచున్నది.

పురుషుని వెంట ప్రకృతి వలె శ్రీమన్నారాయణుని లక్ష్మీదేవి వెంబడించెను. ఆమె వెనుక శుద్ధసాత్విక పరాకాశమునందుండు కాంతలును, జ్ఞాన పక్షీంద్రుడును, ప్రణవమను ధనుస్సు, శుద్ధాత్మయను బాణము, దైవీ సంపత్తియను సద్గుణ సమూహము బయలుదేరెను.

అసుర సంపత్తిని నశింపజేయువాడు, ప్రకృతితో అవినాభావ సంబంధము గలవాడు, భక్తాధీనుడు, వ్యాపక స్వభావుడునగు శ్రీమన్నారాయణుడు ఆకాశ మార్గగామియగుట జూచి దైవీసంపత్తియను, ఆధ్యాత్మిక వేత్తలు (దేవతలు) ' అడిగో పరమాత్మ ' వెంట ప్రకృతి, ఓం కార ధ్వని చేయుచున్న చక్రము, నివృత్తి మార్గము నందున్న పక్షీంద్రుడు'అనుచు ' ఓం నమో నారాయణాయ ' అనుచు మోక్ష దీక్షాపరులై మొక్కిరి.

జీవ గజేంద్రుని రక్షించు పరవశత్వముతో నున్న శ్రీహరి దేవతల ప్రణామముల నందుకొనకుండగనే మనోవేగముతో రాగద్వేషాది ద్వంద్వ యుక్తమైన సరస్సును జూచి కామమను మకరిని ద్రుంచుటకై ప్రజ్వలితాగ్ని నుండి విస్ఫులింగములు వెడలునట్లున్న బ్రహ్మ తేజస్సనే కళలతో గూడిన, బ్రహ్మాండమంతట బాహ్యాభ్యంతరములందు వ్యాపించిన ప్రజ్ఞానమను

చక్రమును ప్రయోగించెను.

ప్రజ్వలితాగ్ని ఇంధనములను భస్మము చేయు విధమున, జ్ఞానాగ్ని అజ్ఞానకార్యములగు కర్మలను నశింపజేయునట్లు బ్రహ్మ జ్ఞానమను సుదర్శన చక్రము సంకల్ప జలముల నడుమ ప్రవేశించినది. రజోగుణమనే రక్తవర్ణము గలిగినట్టి, మోక్షప్రతి బంధకమై జీవగజేంద్రుని బాధించుచున్న కామమను మకరిని జ్ఞానమను చక్రముతో త్రుంచి వేసెను. బ్రహ్మజ్ఞానము గలిగినంతనే ఆవరణ భంగమై కామము అంతమైన విధమున జ్ఞాన చక్రము తాకినంతనే మకరి నశించెను.

కామమనగా అజ్ఞానము. కాంతిపుంజము చీకటిని నాశనము చేసినట్లు విద్య (జ్ఞానము) కామమును (అజ్ఞానమును) నశింపజేయును. జీవగజేంద్రుడు కామమనే మకరియొక్క పట్టునుండి విడివడి, రాహు గ్రహ విముక్త సూర్యుని వలె సంసార బంధవిముక్తుడై పరాకాశ సహజానంద ధారలచే నిమజ్జనుడై స్వస్వరూపానందానుభూతి గలిగి శ్రీహరి యందైక్య మయ్యెను.

అనుబంధము

గజేంద్రుడు పూర్వజన్మలో ఇంద్రద్యుమ్న మహారాజను వైష్ణవ భక్తుడు. ఒకానొకప్పుడతడు పర్వత శిఖరమునకు పోయి తపస్సు చేయుచుండగా అగస్త్య మహర్షి అక్కడకు వచ్చెను. తపోదీక్షలో నున్న ఇంద్ర ద్యుమ్నుడు మహర్షిని నిర్లక్ష్యము చేసెను. మహర్షి కోపించి కరివై జన్మింతువుగాక ' యని శపించెను. ఆ ఇంద్రద్యుమ్న మహారాజే గజేంద్రునిగా జన్మించి, కామమను మకరిచే పట్టుబడి, అనేక సంవత్సరములు దాని పట్టు నుండి విడిపించుకొనుటకై పోరాడిన పిదప అనగా, జన్మ పరంపరలు గడచిన పిదప శ్రీమన్నారాయణుని శరణు వేడి రక్షింపబడెను.

మకరి హా హా హూహూ అను గంధర్వుడు, ఋషి శాపమున మకరియై జన్మించి శ్రీహరి చక్రముచే శాప విమోచనము కాగా, నిజరూపమున తన లోకమున కేగెను.

(ఈ వ్యాసము శ్రీ చదువుల వీర్రాజుశర్మ గారు ' అనుభవ వేదాంత ప్రదర్శకులు ' ' శృంగవరపు కోట) 1954లో రచించిన ' గజేంద్ర మోక్షము – రహస్యార్థము ' అను గ్రంథము నుండి సంగ్రహింపబడినది – రచయిత)



శ్రీ భక్త తుకారాం అభంగవాణి

– శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు

శ్లో ॥ యేన యేన శరీరేణ యద్యత్కర్మ కరోతి యః ।
తేన తేన శరీరేణ తత్తత్ఫలము పాశ్నుతే ॥
(మ.బా.అను.ప. 116 – 27)

అర్థము : ఎవడు ఏయే శరీరము చే నేయే కర్మ చేయునో అతడు ఆయా శరీరముతో నాయా కర్మ ఫలమనుభవించును.

" మాంస " మను శబ్దార్థమును శ్రీ వేదవ్యాసభగవానులు ఈక్రింది విధముగా తెలియజేయుచున్నారు.

శ్లో ॥ మాంస భక్షయతే యస్మాద్భక్షయిష్యే తమస్యహమ్ ।
ఏతన్మాంసస్య మాంసత్వమను బుద్ధ్యస్వ భారత !!
(మ.భా.అను.ప. 116 – 25)

అర్థము : హే భరతనందన ! (ప్రాణివధచేయబడునో, నా ప్రాణి యిట్లనుచున్నది) మాం = నన్ను, సః = వాడు (ఇప్పుడు), యస్మాద్= ఎందువల్లనైతే, భక్షయతే = (స్వతృప్తి కోసము) తినుచున్నాడో, (అందువల్ల భవిష్యత్తులో ఎప్పుడైనా), అహమపి = నేను గూడ, తమ్ = వానిని, భక్షయిష్యే = భక్షించగలను. ఇదియే మాంసము యొక్క మాంసత్వము ఇదే "మాంస" శబ్దమునకర్థమని తెలియును.

శ్లో ॥ మాంస భక్షయితా2ముత్ర యస్యమాంస మిహాద్మ్యహమ్ ।
ఏతన్మాంసస్య మాంసత్వం ప్రవదంతి మనీషిణః (మ.స్మ 5–55)

అర్థము : ఈ లోకమున నెద్దాని మాంసమును నేను భక్షించుచున్నానో, యది పరలోకమున నా మాంసమును దినును –అని మాంసశబ్దమునకు వ్యుత్పత్తి పండితులు చెప్పుదురు. ఈ " మాంస" శబ్ద నిర్వచనము విధి వర్జిత మాంసభక్షణ పాప ఫలమును చెప్పుట కొఱకని తెలియవలెను. (శ్రీ కుల్లూబట్టః)

శ్లో ॥ లోభాద్వా బుద్ధిమోహాద్వా బలవీర్యార్థమేవచ ।
సంసర్గాదథ పాపానామధర్మ రుచితా నృణామ్ ॥

అర్థము : లోభము చేతగాని, బుద్ధిమోహము చేతగాని, బలవీర్యప్రాప్తి కొఱకు గాని లేక పాపాత్ముల సహవాసము చేతగాని మనుష్యులకు హింసాద్యదర్మము నందు రుచిగలును.

శ్లో ॥ జాతాశ్చాప్యవశాస్తత్ర ఛిద్యమానాః పునః పునః ।
పాచ్యమానాశ్చ దృశ్యంతే వివశా మాంసగృద్ధినః ॥
(మ.భా.అను.ప. 116-20)

అర్థము : మాంసలోలుప్త చిత్త జీవులు నీచయోనులలో జన్మించినప్పటికి పరవశులైయుందురు. మళ్ళీ మళ్ళీ శస్త్రములచే ఖండింపబడుచు మరియు వండింపబడుచు, నానా దుఃఖములకు గురియగుదురు. ఆ జీవుల యొక్క వైవశ్యము ప్రత్యక్షముగా జూడబడుచున్నది.

శ్లో ॥ కుంభీపాకే చ పచ్యన్తే తాం తాం యోనిముపాగతాః ।
ఆక్రమ్య మార్యమాణాశ్చ భ్రామ్యన్తే వై పునః పునః ॥
(మ.భా.అను.ప. 116- 21)

అర్థము : వారు తమ పాపకర్మకు ఫలముగా కుంభీపాక నరకములో (శనగలు పెంచు మీద వేయించబడునట్లు) వేయించబడుచున్నారు. మరియు భిన్న భిన్న యోనులలో జన్మిస్తూ, ఎన్నోమార్లు మెడగోయబడి చంపబడు చున్నారు. ఈ ప్రకారము పునః పునః సంసార చక్రములో తిరుగాడవలసి వచ్చుచున్నది.

శ్లో ॥ జీవాః పురాకృతతేనైవ, తిర్యగ్యోని సరీసృపాః ।
నానా యోనిషు జాయన్తే స్వకర్మ బీపనిరివేష్టితాః
(మ.భా.అను.ప. అధ్యా. 145, పృష్ఠము 5955).

అర్థము : జీవులు వారి పూర్వీకృత కర్మ ఫలముగా పశు, పక్షి, క్రిమి మరియు కీటాది జన్మల నొందుచున్నారు. కావున స్వస్వకర్మలచే బద్ధులై, ప్రాణులు భిన్న భిన్న యోనులలో జన్మించుచున్నారు.



అక్క మహాదేవి అనుభవామృతం

తెలుగు సేత - డా ॥ శ్రీ కరిబసవరాజేంద్ర మహాస్వామి

147. జీవుడు శివుడైన తరువాత జీవునకు శివునకు తారతమ్యముండదు, అప్పుడు బ్రహ్మలిఖితము నిలిచిపోతుంది. జీవాత్ముని బాధ ఆగిపోతుంది. తానే తానైన తరువాత భాష ఆగిపోతుంది. చెన్నమల్లికార్జునిపై నాకున్న తపన మాయమైపోతుంది. ఈ విషయ ప్రపంచ ప్రజలకు తెలిసిపోతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే చెన్నమల్లికార్జునునితో ఒకటైన తరువాత ఏదీ వుండదు.

148. చంద్రకాంతశిలదగ్గరకు పోయినటువంటి ఏనుగు తన శరీరాన్ని రుద్దుతుంది. ఏనుగుకు శీతమంటే ఇష్టము కావున, ఒక్కొక్కసారి తన నీడను చంద్రకాంతశిల అని భ్రమించి నేలను రుద్ది రుద్ది చస్తుంది. దానికి భ్రమయే కారణం. చెన్నమల్లికార్జున ! నువ్వు గురుకరుణతో ఇష్టలింగరూపంగా నా చేతిలో వున్నావు. నేను వేరని భ్రాంతివద్దు, నేనే నీవు అని నీయొక్క నిజస్వరూప జ్ఞానము ఎల్లప్పుడూ నిశ్చయంగా వుండాలి.

149. సర్పము నాగస్వరానికి పడగవిప్పి ఆడినా, తనలోపలి విషాన్ని విడవదు. పాడిననేమి, ఆడిననేమి, శాస్త్ర పురాణాలు వినిన నేమి? "అంతఃకరణ శుద్ధికాక లోపల వున్న అవగుణములను విడవక ఏమి చేసినా ప్రయోజనము లేదు. నిజమును తెలిసి బయట విషయాదులను మరచిపోయిన వారిని నాకు చూపించి బ్రతికించు.

151. ముక్కు, నాలుక, కన్ను, చర్మము, చెవులు ఇవి పంచ జానేంద్రియ ములు. గంధ, రస, రూప, స్పర్శ, శబ్దములు జానేంద్రియములకు పంచ విషయములు. ఏ ఒక్క ప్రియకరమైన విషయానికి లోనైనా బంధకారణ మగును. తను, మన, ధన, రాజ్యము, విశ్వము, ఉత్సాహము, సేవకత్వము ఇవి ఏడు సప్త వ్యసనములు. అభక్ష్యభక్షణ, అపేయపాన, జూదము, వారాంగ గమనము, వాక్ పౌరుష్యము, మృగవేట, దొంగతనము ఇవి కూడా సప్తవ్యసనము లంటారు. వీటిలో ఒకటి అలవాటు పడినా మానవుడు వ్యసనములలో బంధితుడౌతాడు.

రత్నములతో తయారు చేసిన బేడీలైనా బంధిస్తాయి.

153. చెన్నమల్లికార్జునుని అనుగ్రహము పొందిన తరువాత ఈ దేహము బూడిదైననేమి ? సౌందర్యముగా వున్ననేమి ? అది చూడడానికే గాని దాని ప్రయోజనముండదు. అంతరంగము శుద్ధి అయిన తరువాత ఈ దేహము బహిరంగములో లోకవ్యవహారానికి దూరమౌతుంది.

154. అర్పణ సిద్ధాంతములో కాయార్పణ, కరణార్పణ, భావార్పణమని మూడు విధములుగా వుండును. కాయార్పణ మనగా కాయము యొక్క మూలమైన పంచేంద్రియములు శివునికి అర్పించినపుడు శరీరములో స్వతంత్ర అస్తిత్వము వుండదు. అలాగే మనోబుద్ధి చిత్త, అహంకార భావమనే కరణములను భగవదర్పణ చేసిన తరువాత నేను అనేది ఏదీమిగలదు. నా గమ్యము, నా మతి నీవైపోతావు. నా ప్రాణాన్నే నీకు అర్పించిన తరువాత నాకు వేరే అస్తిత్వము వుండదు. నాది అనేదంతా నీదైపోతుంది. ఈవిధంగా అన్నీ నీవై సర్వార్పణము చేసిన తరువాత ఏదీ వుండదు.

156. ఎన్ని విద్యలు నేర్చుకొన్నా చావు తప్పదు. భోజనము విడిచినను లేదు. వ్యసనములను విడచినా లేదు. ప్రాణవాయువును నిలిపినా లేదు. బ్రహ్మచారియైనా చావు తప్పదు. దీనికొక ఉదాహరణ - భూమియే కాపలా కాసేటప్పుడు దొంగలెక్కడకి పోతారు. భూమి నుంచి దొంగ ఎలా తప్పించుకొన లేడో అలాగే చావు నుండి ఎవరూ తప్పించుకొనలేరు. దీనికి భక్తి మార్గమొకటే ముక్తికి మార్గము.

159. లౌకికములో కొందరు అంతరంగములో ఒక భర్తను, బహిరంగములో వేరొక పురుషునితో వ్యవహారము చేసెదరు. అది సహజమైనది కాదు. రెండింటిని కలిపి జీవనం చేయడం కాదు. అలాగే లౌకిక పరమార్థములను రెండిటిని కలిపి జీవనం చేయడం కాదు. ఎందుకనగా లౌకికములో అభివృద్ధి చెందేవానికి ఆధ్యాత్మము అలవడదు. బిల్వవృక్షము కాయి, వెలక్కాయ రెండు ఒకటి కాదు, గుణములో, రూపములో వేరుగా వున్నాయి కదా ! వెలక్కాయను ఏనుగు మ్రింగినపుడు సంపూర్ణముగా జీర్ణమైపోవును. అలాగే ఆధ్యాత్మికములో "శివోహం" భావము వచ్చినపుడు జీవత్వము సంపూర్ణంగా మాయమై పోతుంది. వెలక్కాయలోని గుణము బిల్వఫలములో లేదు. అలాగే ప్రాపంచికుడు జడస్వరూపుడై యుండును. దానికోసరం ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాలి.

వార్తలు

(01). శ్రీశుకబ్రహ్మాశ్రమములో మహాశివరాత్రిని పురస్కరించుకొని 1-03-2016 తేది నుండి 7-03-2016 తేది వరకు భగవన్నామ సప్తాహం జరిగినది. విజయవాడ రాధమాదవ గోవింద సమాజం వారిచే శ్రీమతి మంచాల సుమిత్రగారి ఆధ్వర్యంలో వారిచే శివపంచాక్షరి అఖండనామ సంకీర్తన వారంరోజులు జరిగినది.

(02). 7-03-2016 తేది మహాశివరాత్రి సందర్భంగా ఆశ్రమంలోని శివలింగానికి (స్పటికలింగానికి) ఏకాదశరుద్రాభిషేకము, బిల్వార్చన జరిగినది. ఆశ్రమంలోని అందరు అభిషేకం, అర్చన చేశారు.

(03). రంగారెడ్డి. జిల్లా, దోమ మండలం దాదాపూర్, కొత్తపల్లిలో 27-03-2016 మఱియు 28-03-2016 తేది రెండు రోజులు గీతాజ్ఞానయజ్ఞం జరిగినది. దాదాపూర్ సర్పంచి రాము ఆహ్వానంపై పూజ్యశ్రీ స్వాములవారు, మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు రెండు రోజులు ప్రవచనలు చేశారు.

(04). కృష్ణాజిల్లా, ఆగిరిపల్లి మండలము ఈదరలో శ్రీ సీతావధూతమహాయోగిని గారి ఆరాధన శ్రీరాజరాజేశ్వరి దేవాలయం **31-03-2016, 1-04-2016** తేదీలలో జరిగినవి. అందు పూజ్యశ్రీ స్వాములవారు మఱియు మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్యగార్లు అనుగ్రహ భాషణ చేశారు.

(05). ఎ. 14-03-2016 తేది సోమవారం కృత్తిక సందర్భంగా ఆశ్రమంలో ప్రదోషకాలంలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి అర్చన జరిగినది.

(బి). 5-03-2016 తేది, 19-3-2016 తేదిలలో ఏకాదశులందు ఆశ్రమంలో అఖండ భగవద్గీతాపారాయణ జరిగినది.

(సి). 23-03-2016 తేది బుధవారం ఫాల్గుణ పౌర్ణమి నాడు ఆశ్రమంలో గురుపాదుకాపూజ జరిగినది.

(6). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో ఫిబ్రవరి నెలలో **ఓ.పి.లో 828 మందికి** కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేయబడినవి. **105 మందికి పొరలు** ఆపరేషన్ చేసి కళ్లలో లెన్సు అమర్చబడినవి.**అయిదు మందికి** యాగ్ లేజర్ చికిత్స చేయబడినది. **మూడు గ్రామాలలో** కంటి వైద్య శిబిరాలు నిర్వహింపబడినవి. అందు **116 మందికి** కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేయబడినవి.

ముహూర్తం లేని మృత్యువు

ఆకులు రాలుటకు - ఒక ఋతువు ఉంటుంది.

పూవులు వాడిపోవుటకు - ఒక సమయముంటుంది.

సూర్యుడు అస్తమించుటకు - ఒక సమయముంది.

సూర్యుడు ఉదయించుటకు - ఒక సమయముంటుంది.

నక్షత్రాలు మరుగుపడుటకు - ఒక సమయముంటుంది.

కానీ ఓ మృత్యువా! నీ రాక సమయమేదో తెలియకున్నది. కావున మృత్యువు రాకముందే మృత్యుంజయమగు అమరత్వమును పొందుటకు ప్రయత్నించువారు ధన్యులు.

- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు

Regd.No. TRP / 123 / 2015-17 April 2016 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-03-2016, Permitted to post : 29th, 30th every month.

త్రినేత్ర వైద్యాలయము భక్తకన్నప్ప కంటి ఆసుపత్రి.

శ్రీశుకబ్రహ్మాశ్రమము, స్వామి ప్రకాశానందనగర్, శ్రీకాళహస్తి, ఆం.ప్ర.

ఇందు నిరుపేదలకు ఉచితంగా కంటి చికిత్సలు చేయబడును. కంటిపొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడును. ఆపరేషన్ చేసిన వారికి ఉచితంగా భోజనాలు పెట్టబడును. ఉచితంగా మందులు మరియు 40 వ రోజు కళ్లద్దాలు ఇవ్వబడును. దీనికి విరాళమిచ్చువారికి 80 జి సెక్షన్ క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు కలదు.

ఈ ఆసుపత్రి పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిచే స్థాపించబడినది.

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం

వేదాంతభేరి

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 49 మే 2016 సంచిక : 05

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు
విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

వేదాంతభేరి

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 49 మే 2016 సంచిక : 05

విషయ సూచిక

01. ప్రార్థన - 05

02.మోక్షానికి ఉపదేశ చతుష్టయం
- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06

03. సాధన - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు -10

04. అహంకారమే మాయ - శ్రీ రామకృష్ణ పరమహంస - 13

05. భాగవత సుధ - శ్రీరామకృష్ణానందగిరి స్వాములవారు - 14

06. సమదృష్టి గలవాడే పండితుడు - శ్రీ సత్యసాయిబాబా - 20

07. ధర్మ శాస్త్రాలు - నేటి సమాజం - డా॥ సముద్రాల లక్ష్మణయ్య - 26

08. జ్ఞానసుధ - శ్రీ సర్వభూషణ శివయోగి - 32

09. ఆచార్యదేవోభవ - ఆచార్య కె. సర్వోత్తమరావు - 34

10. దివ్య సందేశం -శ్రీ శివానందసరస్వతి స్వాములవారు (ఋషీకేశ్) - 39

11. వార్తలు - 42

ముఖచిత్రం : సింహాచలము

(11-5-2016 శ్రీ శంకరాచార్య జయన్తి)
(20-5-2016 నారసింహ జయన్తి)

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

లక్ష్మీపతే కమలనాభ సురేశ విష్ణో
యజ్ఞేశ యజ్ఞ మధుసూదన విశ్వరూప
బ్రహ్మణ్య కేశవ జనార్దన వాసుదేవ
లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబమ్ ॥
ఏకేనచక్రమపరేణ కరేణ శంఖం
అన్యేన సింధుతనయా మవలంబ్యతిష్ఠన్
వామేతరేణ వరదాభయపద్మచిహ్నం
లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబమ్ ॥
అంధస్య మే హృతవివేకమహాధనస్య
చోరైర్మహాబలిభి రింద్రియనామధేయైః
మోహాంధకారకుహరే వినిపాతితస్య
లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబమ్ ॥
ప్రహ్లాదనారద పరాశరపుండరీక
వ్యాసాదిభాగవతపుంగవహృన్నివాస
భాక్తానురక్త పరిపాలన పారిజాత
లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబమ్ ।
లక్ష్మీనృసింహ చరణాబ్జమధువ్రతేన
స్తోత్రం కృతం శుభకరం భువి శంకరేణ
యేతత్పఠన్తి మనుజా హరిభక్తియుక్తాః
తే యాన్తి తత్పదసరోజమఖండరూపమ్ ॥

తా ॥ ఓ లక్ష్మీపతీ ! కమలనాభ ! సురేశ ! విష్ణో ! యజ్ఞేశ ! మధుసూదన ! జనార్దన ! వాసుదేవ ! లక్ష్మీనృసింహస్వామీ ! సంసారాన్ని దాటడానికి నాకు నీ చేతిని ఆలంబనగా ఇమ్ము.

మహాబలశాలురైన ఇంద్రియములనే దొంగలచే దొంగలించబడిన వివేకమనే ధనంగల మోహాంధకార కూపం (బావి) లో పడిపోయిన గ్రుడ్డివాడినగు నాకు దాని నుండి బయటపడుటకు ఒకచేతిలో చక్రాన్ని, మరో చేతిలో శంఖాన్ని, ఇంకో చేతిలో లక్ష్మీదేవిని మరో చేతిలో వరద అభయ చిహ్నమగు పద్మచిహ్నాన్ని ధరించి (పట్టుకొని) యుంటున్న వాడును, ప్రహ్లాద నారదాది భాగవతుల హృదయ నివాసియగు లక్ష్మీనృసింహా ! సంసారాన్ని దాటుటకు నాకు నీ చేతిని ఆలంబనగా ఇమ్ము . (శ్రీ శంకరాచార్య కృత కరావలంబన స్తోత్రం నుండి)



మోక్షానికి ఉపదేశ చతుష్టయం

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

జగన్నాటకమును అంతమొనర్చుకొనుము

ఇక మోక్షప్రాప్తికై నాలుగవఉపదేశము ‘జగన్నాటకమును శీఘ్రముగ పరిసమాప్తము గావించుకొనుము ’ అనునది. శిరస్సుపై కట్టెలమోపు పెట్టుకొని పోవుచుండు గ్రామస్థుడు దానిని ఎప్పుడు క్రిందకు దింపి భారమును తొలగించుకొందునా యని తహతహపడుచుండును. పగలంతయు పనిచేయు ఉద్యోగి ఎపుడు సాయంసమయమేతెంచునా యనియు, కార్యభారము ముగించుకొని ఇంటికి వెళ్ళి హాయిగ ఎపుడు కాలము గడుపుదునా యనియు పరితపించుచుండును. కాని చిత్రమేమనగా కోట్లకొలది జన్మలందు పుట్టుచున్నను, చచ్చుచున్నను, దేహభారమును మోయుచున్నను, తద్వారా దుఃఖభారమును వహించుచున్నను జీవుడు ఆ భారము ఎపుడు తొలగిపోవునాయని ఆలోచించుటలేదు. పైపెచ్చు అజ్ఞానముచే దేహముతో, ఇంద్రియములతో, మనస్సుతో చేయరాని పనులు చేయుచు జన్మబంధనమును ఇంకను దృఢతర మొనర్చుకొనుచున్నాడు. దుఃఖ భారమును ద్విగుణీకృత మొనర్చుకొనుచున్నాడు. ఈ జగన్నాటకమును అంతు లేకుండ కొనసాగించుచున్నాడు. ఇది అత్యంత శోచనీయము.

All the world is a stage,
And all the men and women merely players,
They have their exits and their entrances.

‘ ఈ ప్రపంచమంతయు ఒక మహానాటకరంగము. పురుషులు, స్త్రీలు అందఱును ఆ నాటకమందలి పాత్రధారులు. వారు రంగస్థలముపైకి

వచ్చుచుందురు, పోవుచుందురు ' అని షేక్స్పియర్ మహాకవి నుడివినట్లు ఈ విచిత్ర జగన్నాటక రంగములో జీవుడు వేయని వేషము లేదు, ధరించని పాత్ర లేదు. ఎనుబది నాలుగు లక్షల రూపములు ధరించి ఈ విశ్వరంగస్థలిపై అతడు అనాది కాలము నుండి అభినయ మొనర్చుచున్నాడు. కాని విసుగుపుట్టుటలేదు. ఈ వేషధారణకు స్వస్తిచెప్పి తనకు తానై మిగిలి పరిపూర్ణ సుఖమనుభవించు భాగ్యము నోచుకొనలేదు. ఇప్పటికే కాలము మీరిపోయినది. బంధ విముక్తిని గూర్చి తేల్చుకొనవలసిన అపూర్వ మానవజన్మ ఏతెంచినది. భగవంతుడు ఎంతయో విజ్ఞాన మొసంగినప్పటికిని మనుజుడు బంధనమును దృఢపఱచుకొని బుద్ధిపూర్వకముగా గోతిలోపడుటకే సిద్ధపడుచుండుట హాస్యాస్పదమైన విషయము. ఇక మీదటనైనను మానవుడు తన విజ్ఞతను ఉపయోగించి ఈ జన్మ పరంపరకు ఉద్వాసన చెప్పుట శ్రేయస్కరము. ఈ అనాది జగన్నాటకమును కింతటితో భరతవాక్యము పలికి, తాను ధరించు అగణిత వేషముల కొక నమస్కారము చెప్పి, జీవుడు తన సహజ నిర్వికల్ప స్వస్వరూపాత్మయందు స్థితిగల్గి పరిపూర్ణశాంతి ననుభవించుట యుక్తము.

శాంతి బాహ్యవస్తువులు నుండి లభించునదికాదు. అట్లు లభించునని తలంచుటయు కేవలము వెఱ్ఱి. శాంతి సుఖములు బయట నుండి కూరబడునవి కావు. అవి లోపల నుండియే ఊరునట్టివి. ఒకవేళ బయట నుండి ఒకింత శాంతిగాని, సుఖముగాని లభించినట్లు తోచినను అది ఎల్లకాలము నిలువదు. మఱుక్షణమే అదృశ్యమై భయంకర దుఃఖరూపముగ పరిణమింప జీవుడు దానిచే సతమతమైపోవును. కావున ఆత్మశాంతియే పరిపూర్ణ శాంతి. పదార్థ జనితశాంతి కేవలము భ్రాంతి మాత్రమే యగును.

రాత్రి గాఢనిద్రలో జీవుడు అవిచ్ఛిన్నముగ కొంతసేపు సుఖమనుభవించుచున్నాడు గదా ! ఆ సుఖ మెక్కడ నుండి వచ్చినది ? బయటనుండియా ? కాదు. దేహము, ఇంద్రియములు, మనస్సు అత్తఱి

లయించియుండుట వలన ఆ సుఖము బాహ్యపదార్థ జనితము కాదనుట స్పష్టము. అది అంతరము నుండియే ఆవిర్భవించినది. జడమైన సుషుప్తి యందే అంతటి ఆనందము, శాంతి మానవునకు లభించుచుండ ఇక చైతన్య వంతమగు సమాధి స్థితియందాతనికెట్టి మహోన్నత శాంతి లభించునో ఊహించుకొనవచ్చును. అదియే ఆత్మశాంతి. అది అపరిచ్ఛిన్నమైనది. అదియే మన జన్మహక్కు. అదియే మన స్వస్వరూపము. భక్తి, జ్ఞాన, వైరాగ్యముల ద్వారా అట్టి స్వస్వరూపశాంతి జీవునకు తప్పక లభించగలదు. ఏ నిర్వికల్ప ఆనందమును జీవుడు సుషుప్తియందు తెలియకుండ అనుభవించుచున్నాడో, దానిని జాగ్రత్తు నందు తెలిసి అనుభవించుటయే సమాధిస్థితి యగును. ఇంద్రియ మనస్సంయమాదుల చేతను, చక్కని విచారణచేతను, దృశ్యము నందు విరక్తి భావము జనింప, మనస్సు అంతర్ముఖము కాగా ఇట్టి సమాధి సుఖము, పూర్ణ విశ్రాంతి జాగ్రత్తునందే జీవునకు చక్కగ లభింపగలదు. కావున అద్దాని కొఱకే ముముక్షువు లెస్సగ పాటుపడి గమ్యస్థానమగు పరమాత్మను శీఘ్రముగ చేరుకొనవలెను.

సామాన్యముగ దూరప్రయాణము చేయునపుడు యాత్రికుడు కొద్ది సామానును మాత్రమే తన వెంట తీసికొని పోవుచుండును. ప్రయాణము సల్పువాడు తనవెంట భారమును ఎంత తగ్గించుకొనిన అంత హాయిగ ప్రయాణము సలుపగల్గు చుండును.

Less luggage, more comfort makes travel a pleasure.

అని రైల్వే అధికారులు ఈ సత్యమునే ప్రయాణీకులకు చక్కగ ఉద్బోధించుచున్నారు. అట్లే జీవుడు అనాది కాలము నుండి చేయుచున్న ఈ జనన మరణ రూప దీర్ఘ సంసారయాత్ర యందు మనస్సు, దేహము, భోగ్యపదార్థములు ఇత్యాది రూప దృశ్యవస్తువులను గూర్చిన

సంకల్పములను ఎంత తగ్గించుకొనిన అంత శాంతిని, సుఖమును బడయగల్గుచుండును. అపుడే మోక్షరూప గమ్యస్థానమును జీవుడను పాంథుడు ఆనందముగ చేరుకొనగల్గును. సంకల్ప భారము తగ్గుటయే, లేక తొలగుటయే శాంతికి ఏకైక మార్గము. పూర్ణశాంతికి వేఱొక ఉపాయమెద్దియు లేదు. అనాత్మ రూపములైన దేహాది దృశ్యపదార్థముల యెడల విరక్తిగలిగి, ఆత్మయందు ఆసక్తిని పెంపొందించుకొని అట్టి ఆత్మయందు మనస్సును స్థాపిత మొనర్చుటయే పూర్ణశాంతికి ఉపాయము.

కాబట్టి ఉదయము నిద్రలేచినది మొదలు రాత్రి పరుండువరకును లోకవ్యవహారము లనేకము లున్నప్పటికిని అవకాశమును కలుగజేసికొని ఆత్మను గూర్చియే చింతించుచు, ధ్యానించుచు, తదేకనిష్ఠుడై మెలగుచు తద్ద్వారా అవిచ్ఛిన్న సుఖమును, పరిపూర్ణ శాంతిని జీవుడు పడయవలెను. ఈ మానవ జీవితమునే చరమజన్మగనొనర్చుకొని, జగన్నాటక వేషముల కింతటితో తిలాంజలి యొసంగి అనాదికాల సంసార దుఃఖజాలమును విచ్ఛిన్న మొనర్చివైచి ఆత్మస్థితుడై బ్రహ్మానందమనుభవించవలయును. అదియే కైవల్యస్థితి, అదియే పరమపురుషార్థమగు మోక్షము.

సద్గురు సర్వసేవా ట్రస్టుకు ఈ క్రింది వారు పైకం పంపినారు

(1) వేజెళ్ల కామేశ్వరి జ్ఞాపకార్థం డా॥ వి,ఝాన్సీరాణి (తిరుపతి)
(వృద్ధుల సేవకు నిధి రూ. 40,000/-

(2). బాలు నరసింహులు నాయుడు రూ. 10,000/-
(కట్టావారిపల్లె, కడప జిల్లా) అన్నదాన నిధి

(3). డి.ఎస్.వి.సుందరరావు (సౌదీ అరేబియా) రూ. 10,000/-

(4). పి.కిశోర్ కుమార్ (అన్నదానమునకు) రూ. 10,000/-

(5). ఆర్.కె. శివరాత్రి (బరోడా) గోశాలకు రూ. 10,000/-

సాధన

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

పూర్ణమగు ఇంద్రియనిగ్రహము, మనోజయము, ఆత్మసంయమము గలుగనంతవఱకు తన ప్రయత్నమును విడనాడక యేకాంతమున సాధనల చేయుచుండవలయును.

మనస్సు చేయు చేష్టల నేకాంతముగ కూర్చుండి జాగ్రతతో నిరీక్షించుచుండిన మనోజయము త్వరలో సిద్ధించును.

* * *

నిర్మలమగు ప్రదేశమున ఎక్కువ ఎత్తుగను, నిండా తక్కువగను లేని, సుఖమును గలుగజేసెడి యే ఆసనమందుగాని ఆసీనుడై ప్రణవమును ధ్యానించుచూ ప్రణవార్థమగు పరబ్రహ్మమునందు నిలుకడ గలిగేలాగున అభ్యసింపవలయును.

* * *

ఈ బాహ్యాకాశమునుండి క్రమముగ శ్వాసద్వారా ప్రాణమును ఆత్మస్థానమునజేర్చి లయ మొనర్పవలయును. ఈ శ్వాస ఎచట లయమొందునో అచ్చోటనే ఈశ్వర ధ్యానము చేయవలయును. నాదము, శ్వాస ఎచట లయమగునో అదియే పరబ్రహ్మస్థానమని చెప్పబడినది.

* * *

ఇడా – పింగళ – సుషుమ్నలను మూడు ముఖ్యమైన నాడులు శరీరమునందు గలవు. అందులో సుషుమ్న ప్రధానమైనది. అది బ్రహ్మ రంధ్రము వఱకు వ్యాపించియుండును. ఈ సుషుమ్నామార్గమున మనస్సును సంయమనము చేసిన, అచ్చట ప్రణవనాదము వినవచ్చుచుండును. ఆ నాదబ్రహ్మమునందు మనస్సును లీనముచేసినచో బాహ్యప్రపంచ వినోదమున భ్రమ (ఆసక్తి) నివృత్తియగును. తదుపరి అభ్యాసయోగముచే క్రమముగ నాదబిందుకళాతీతమగు ప్రత్యగాత్మయందు చిత్తమేకమగును. ఇదియే చిత్తఏకాగ్రత.

*   *   *

ప్రథమమున సగుణధ్యానము తరువాత నిర్గుణధ్యానము నవలంబించుట మంచిది. పూజామందిరమున మహాత్ముల పటములను గానీ, విగ్రహములను గానీ ఉంచవలయును. మూర్తియందు మనస్సు లీనము కానంతవఱకు అది గోచరించుచునే యుండును. ఆ పిదప ఉండినను గోచరింపదు. అట్లే దేహమందిరమునగాని, ఆకాశమున సోమమండలమున గాని, సూర్యమండలమందుగాని మనస్సును నిలిపి నిశ్చలబుద్ధితో ధ్యానము చేయవచ్చును. లేక శివరూపమును ధ్యానించవచ్చును. లేక విశ్వాకారుడగు నారాయణమూర్తిని సహస్రశీర్షా పురుషః అను ప్రకారము ధ్యానింపవచ్చును. ఈ ధ్యానమే బాహ్యమున బ్రహ్మాండమున లక్షించి చేసిన కొన్ని సిద్ధులను బడయవచ్చును. తన హృదయమధ్యమున అష్టకళలతో నిండిన ఈశ్వరుని ధ్యానించవచ్చును. భ్రూమధ్యమున లక్ష్యముంచి ధ్యానించవచ్చును. వీనియన్నింటి కంటే స్వస్వరూప ధ్యానము మిన్న.

*   *   *

మనోనిగ్రహము నొనర్పదలంచువారుగాని, ధ్యానమును శీలించువారుగాని ప్రారంభదశయందు నేత్రముల మూసికొనుటయే మంచిది. అయితే నేత్రములు తెఱచుకొని చేయు ధ్యానమే గొప్పది. కానీ అది అందఱికిని మొదట సాధ్యము కాదు. అట్లు కనులు తెఱచి కొనునపుడు దృశ్యస్ఫురణ గలుగనిచోమాత్రమే అది సఫలమగును. లేనిచో మూసిచేయుటయే శ్రేష్ఠము.

అభ్యాసము లేనివారికి నేత్రములు మూసికొనుట యను అమావాస్యదృష్టి ధ్యానకాలమున బాగుగ యుపకరించును. కొంత అభ్యాసముగలవారికి అర్ధచూపుగల్గి భ్రూమధ్యమున దృష్టిని నిలుపుట యను పాడ్యమిదృష్టి మంచిది. ఆరూఢులు, ధ్యానమందు పరిపక్వస్థితి నొందినవారు సామాన్యముగ నేత్రములు తెఱచుకొనియే ధ్యానము చేయుదురు. ఇది పూర్ణిమదృష్టి.

*   *   *

అందరును ఒకే లక్ష్యమందు మనస్సును నిలిపి ధ్యానము చేసిన,

ఒకే శబ్దంతో మంత్రోచ్చారణ చేసిన ఆ శుద్ధాణువులన్నియు ఏకాకారమై ఒక విధమైన మహత్తరశక్తి నుద్భవింపజేయును. కావున ఒక సమాజములో నున్నవారు ప్రార్థనాదికాలములందు ఒకచోట సమావేశమై ఆయా కార్యముల నెరవేర్చినచో యితరులవలన ఏ యాటంకములున్ను గలుగవు. భూతప్రేత పిశాచాదులున్ను బాధింపవు.

ఒక్కొక్కమంత్రము నుచ్చరించునపుడు ఒక అపూర్వమైన తేజస్సు తనలో ప్రవేశించి తనను పరిశుద్ధ మొనర్చుచున్నట్లు, దేహమంతయు చైతన్యమయమైనట్లును భావన చేయవలయును. అట్లే మంత్రార్థమునుగూడ భావింపవలయును.

వేదాన్తభేరికి ఈక్రింది వారు పోషక చందా పంపినారు

01. కె. శ్రీహరి (కూకటిపల్లి, హైద్రాబాద్) - రూ.1500/-
02. పాదాల శంకరయ్య (రుద్రంగి, వేములవాడ) - రూ. 700/-
03. తాటిపాముల గంగాధర్ భూమయ్య (ముంబాయి) రూ. 700/-
04. ఎన్.నాగేశ్వరరావు (సైనిక్‌పురి,సికింద్రాబాద్) - రూ. 1200/-
05. సత్యనారాయణ - కంచెర్ల (ముంబాయి) - రూ. 1200/-
06. శ్రీకోదండరామాలయ సత్సంగము (పెనకనమెట్ల) -రూ.1200/-
07. నూలు శ్రీరామమూర్తి (గాంధీనగర్, పొందూరు) - రూ.1200/-
08. వి.గోవర్ధనగిరి (కేసముద్రం) - రూ. 1200/-
09. కె.భాగ్యవతి (ఎ.పి.హెచ్.బి.కాలనీ, నిర్మల్) - రూ. 1200/-

ముఖ్యగమనిక : 5వ తరగతి పూర్తిచేసిన నిరుపేదబాలురు పదిమందిని ఆశ్రమంలో వుంచి ఉచిత భోజనవసతినిస్తూ చదివించెదము. శ్రద్ధగా చదివితే కాలేజి చదువు వరకు చదివింపబడుదురు. చదువుతోబాటు ఆశ్రమంలో మంచి సంస్కారము అలవాటు చేయబడును. రాదలంచువారు **ఈ క్రింది అడ్రసుకు అప్లికేషన్ పెట్టుడు.** కార్యదర్శి

సద్గురు సర్వ సేవాట్రస్టు, శ్రీ శుకబ్రహ్మాశ్రమం పోస్టు,
శ్రీకాళహస్తి - 517640

అహంకారమే మాయ

– శ్రీ రామకృష్ణ పరమహంస

అహంకారమే మాయ. ఈ అహంకారమే సమస్తాన్నీ తెరలా మూసి ఉంచుతుంది. ఈ ‘ నేను ’ నశించినప్పుడు అన్ని అనర్థాలు తొలగిపోతాయి. భగవత్కృపతో ఒక వ్యక్తికి తాను కర్తను కాననే ఎరుక కలిగిన మరుక్షణంలోనే అతడు జీవన్ముక్తుడవుతాడు. దేహంలో వసిస్తున్నప్పటికీ అతడు ముక్తి నొందినవాడే.

జీవుడు ఎవరో కాదు, సచ్చిదానంద స్వరూపుడే ! కానీ ఈ మాయ, లేక అహంకారం విభిన్న ఉపాధులను కల్పించడంతో అతడు తన స్వస్వరూపాన్ని మరచిపోతాడు.

ప్రతి ఉపాధి జీవుని స్వభావాన్ని మార్చివేస్తుంది. అతడు చక్కని నల్ల అంచు ధోవతిని ధరిస్తే వెంటనే అతడు నిధుబాబు ప్రేమగీతాలు కూనిరాగం తీస్తూ ఉండడం నువ్వు గమనించవచ్చు. తరువాత పేక ఆడుతూండడం, వ్యాహ్యాళికి వెళ్ళినప్పుడు చేతిలో ఊతకర్ర కూడా చూడవచ్చు. ఒక జబ్బు మనిషి కూడా ఎత్తు మడమల బూట్లు ధరిస్తే, అతగాడు ఆంగ్లేయునిలా ఒక మెట్టు నుండి మరొక మెట్టుపైకి దూకుతూ, ఈలవేసుకుంటూ మేడమెట్లు ఎక్కుతాడు.

ధనం కూడా ఒక గొప్ప ఉపాధియే ! ధనం మనిషిలో కొట్టొచ్చిన మార్పును తెస్తుంది. అతడు మునుపటి వ్యక్తిగా ఉండడం జరుగదు. ఒక బ్రాహ్మణుడు తరచూ ఇక్కడకు వస్తూ ఉండేవాడు. బయటికి వినమ్రంగా అగుపించేవాడు. ఒకనాడు నేను హృదయ్‌తో కలిసి కొన్నగర్‌కు వెళ్ళడం తటస్థించింది. పడవ దిగడంతోనే గంగ ఒడ్డున కూర్చొని ఉన్న ఆ బ్రాహ్మణుని చూశాం. అతడు స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ ఆహ్లాదంలో ఉన్నాడనుకొన్నాం. మమ్మల్ని చూస్తూ ‘ ఏమోయ్ పూజారీ ! కుశలమా ?’ అని అడిగాడు. అతడి కంఠస్వరంలోని మార్పును గుర్తించి నేను హృదయ్‌తో ‘ అరే హృదూ ! ఇతడికి ఏదో సిరి అబ్బినట్లుగా ఉంది. అందుచేతనే అలా పలుకుతున్నాడు ’ అని అన్నాను.

ఒక కప్ప వద్ద ఒక రూపాయి ఉండేది, ఆ రూపాయిని అది తన కలుగులో పదిలపరచింది. ఒక రోజు ఏనుగొకటి ఆ కలుగు మీదుగా వెళ్ళసాగింది. తత్‌క్షణమే కోపోద్రేకంతో కప్ప కలుగు నుండి బయటికి వచ్చి, ఏనుగునే తన్నడానికా అన్నట్లు కాలు పైకెత్తి, ‘ నా తల మీదుగా పోవడానికి నీ కెంత ధైర్యం !’ అంది. ధనం కొనితెచ్చే అహంకారం అలాంటిది !. **(శ్రీరామకృష్ణ ప్రభ నుండి)**

భాగవత సుధ

– శ్రీ రామకృష్ణానందగిరి స్వాములవారు,
(గండిక్షేత్రము)

భగవంతుని అక్షరమూర్తి భాగవతము. భాగవతము గ్రంథము కాదు పావనగంగా ఘట్టము, పరమహంస చూడామణి. శుకబ్రహ్మ బోధించిన సమాధి బోధ భాగవతము. విశాల బుద్ధి వేదవ్యాసుడు “స్వాంతస్సుఖాయ ” చిట్టచివరిగా రచించిన మధుర రచన శ్రీమద్భాగవతము. వేదవ్యాసుని యీ భాగవత ప్రభావము తులసీదాసు గారి రామచరిత మానసంపై విస్తారంగా పడిందని పండితులు, ప్రాజ్ఞులు అంటారు.

భారత, రామాయణ, భాగవతాలు మనకు జాతీయ గ్రంథాలు. భారతము సామాజిక గ్రంథము, సమాజము యొక్క పూర్ణత్వ సిద్ధిని గూర్చి భారతం బోధిస్తుంది. రామాయణము కౌటుంబిక శాస్త్రము. కుటుంబము పూర్ణతను పొందే మార్గాలను రామాయణం చెప్తుంది. భాగవతము వైయక్తిక పూర్ణతను బోధించే గ్రంథము. సమాజము కాని, కుటుంబం కాని సమిష్టి ప్రారబ్ధంపై ఆధారపడి వుంటుంది. కాబట్టి పూర్ణత్వం సిద్ధించడం నిష్కర్షగ చెప్పే వీల్లేదు. పూర్ణత్వ సిద్ధికి వ్యక్తి స్వతంత్రుడు.

‘ ఉద్ధరేదాత్మ నాత్మానం ” “నిన్ను నీవు ఉద్ధారకం చేసుకో ”

అని భగవద్గీత (6 అ 5 శ్లో) ఉద్భోధించింది. వ్యక్తి పూర్ణత “ శ్రీ కైవల్య పదంబు చేరుట ”. భాగవతం దాన్ని ఉపదేశించింది.

శ్రీ వేదవ్యాసుల వారు శ్రీ మద్భాగవత రచనను ప్రారంభిస్తూ నిర్విఘ్న పరిసమాప్తి కొరకు శిష్టాచార పద్ధతిని అనుసరించి మంగళా

చరణం ఆచరించాడు.

" శ్రేయాంసి బహు విఘ్నాని " అన్నట్లు మంచి పనులకు యెన్నో విఘ్నాలు రావడం సహజం. " నిర్విఘ్న పరిసమాప్తి కామో మంగళ మాచరేత్ " అనే న్యాయాన్ని బట్టి ఆదిలోనే మంగళ శ్లోకాన్ని వ్యాసులవారు ప్రారంభిస్తున్నారు.

దేవతలు విఘ్న సంతోషులట.మంచి కార్యాలకు విఘ్నం కల్గిస్తూంటారు. మానవుడు తనకంటే వున్నత స్థానానికి పోరాదని వారి కుట్ర. అందువలన వారి బాధలను తప్పించుకొనే కోసం భగవంతుని ప్రార్థించాలి. భగవంతుడు మన వాడైతే దేవతలు 'జోహారులు ' చెల్లిస్తారు. కాబట్టే ప్రతి కార్యారంభంలో మంగళాచరణం చేయాలనే శిష్టాచారం వుంది. మంగళ స్వరూపుడు భగవంతుడే కాబట్టి ఆయనను స్మరించుట, ధ్యానించుట మంగళాచరణం అనబడ్తుంది.

భాగవతంలో ముఖ్యంగా మూడుచోట్ల మంగళాచరణం చెప్పబడింది. గ్రంథ ప్రారంభంలో వ్యాసదేవు డాచరించినది మొదటిది. ద్వితీయ స్కంధములో శుకబ్రహ్మ చేసిన మంగళాచరణం వుంది. గ్రంథ పరిసమాప్తిలో సూత మహర్షి ద్వారానూ మంగళాచరణం జరుపబడింది.

గ్రంథాన్ని ప్రారంభిస్తూ భగవాన్ వేదవ్యాసుడు మంగళాచరణ మాచరిస్తూన్నాడు.

" జన్మాద్యస్యయతోఽన్వయాది తరతశ్చార్థేష్వభిజ్ఞః స్వరాట్
తేనే బ్రహ్మహృదాయ ఆదికవయే ముహ్యంతి యత్సూరయః
తేజోవారి మృదాం యథా వినిమయో యత్రత్రి సర్గోమృషా
ధామ్నా స్వేనసదానిరస్త కుహకం సత్యం పరంధీమహి. "

సీ. " విశ్వ జన్మస్థితి విలయంబు లెవనివలన నేర్పడు నను వర్తనమున
వ్యావర్తనముఁ గార్యములం దభిజ్ఞుండై తాన రాజగుచు జిత్తమునజేసి
వేదంబు లజునకు విదితముల్ గావించె నెవ్వండు, బుధులు మోహింతురెవ్వ
నికి నెండ మావుల నీళ్లఁ గాచాదుల నన్యోన్యబుద్ధి దా నడరునట్లు
ఆ. త్రిగుణసృష్టి యెందు దీపించి సత్యము భంగి దోచు స్వప్రభానిరస్త
కుహకుండెవ్వ డతనింగోరి చింతించెద – ననము సత్యం, బరుని ననుదినంబు.

భాగవతంలో యిది ప్రథమ శ్లోకం. ఈ శ్లోకమునకు పోతన గారి పద్యానువాదం కూడా చేర్చబడింది. ఈ ప్రథమ శ్లోకము " జన్మాద్యస్య యతః " అనే బ్రహ్మ సూత్రాలలోని ద్వితీయ సూత్రంతో ప్రారంభమైంది. బ్రహ్మసూత్రకర్తయైన వేదవ్యాసుడే భాగవతానికి కూడా కర్త. బ్రహ్మ సూత్రాలను వ్రాసి తానే స్వయంగా భాగవతమనే పేర భక్తి ప్రధానమైన భాష్యం వ్రాశాడని పెద్ద లంటారు. ఈ శ్లోకంలో ' తేనే బ్రహ్మ హృదాయ ఆదికవయే " అనే వాక్యము " శాస్త్రయోనిత్వాత్ " అనే మూడవ సూత్రానికి వివరణంగా వుంది.

ఈ శ్లోకము గాయత్రీ మంత్రానికి వివరణం కూడా. " ఓం తత్సవితురేణ్యం – భర్గో దేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్ " – ఇది గాయత్రీ మంత్రం.

గాయత్రీ మంత్రంలోని 'తత్ ' అనే పదము యీ శ్లోకంలో " సత్యం" అనే పదము ద్వారా చెప్పబడింది. "సవితుః" అనే పదానికి బదులుగా "తః" అని చెప్పబడింది. "వరేణ్యం " అనే పదానికి "పరం' అభిజ్ఞః" – అని ప్రయోగింపబడింది. " భర్గః" అనే మాటకు "స్వరాట్ " అని " ధామ్నా స్వేన సదా నిరస్త కుహకం " అని ప్రయోగం జరిగింది. "దేవస్య" అనే మాటకు "జన్మాది అస్య " అని వివరింపబడింది.. " ధీమహి " కి " దీమహి" అని వచ్చింది. " ధియః" అనే పదానికి "హృదా " అని ప్రయోగం జరిగింది. "యః"కు "యః" వచ్చింది. "నః"కు" అది కవయే " అనే ప్రయోగం

కల్గింది. " ప్రచోదయాత్ " అనుటకు " తేనే " అనే క్రియా పదం వచ్చింది.

తత్ - సత్యం, సవితుః - యతః (అన్వయాది తరతః చ అర్థేషు) వరేణ్యం- పరం అభిజ్ఞ భర్గః స్వరాట్ - ధామ్నా స్వేన సదానిరస్త కుహకం., దేవస్య జన్మాది అస్య, ధీ మహి - ధీమహి, ధియః = హృదా, యః =యః నః ఆదికవయే ప్రచోదయాత్ = తేనే.

ఈ ప్రథమ శ్లోకంలో గాయత్రీ మంత్రము శబ్దతః అర్థశః సంపుటీకరింపబడింది.

ఈ కార్య కారణాత్మక జగత్తు యొక్క సృష్టి స్థితిలయాలు ఆ పరమ సత్య పరమాత్మతోనే ఏర్పడ్డాయి. మట్టి సత్తాతో కుండకు సత్తా వున్నట్లు, బంగారు ఉనికితోనే ఆభరణానికి ఉనికి సిద్ధించినట్లు ఆయన సత్తాతోనే జగత్తు సత్తావంతమై వుంది. ఈ కార్య రూపజగత్తులో, కుండలో మట్టి వలె ఆయన వ్యాపించి వున్నాడు. ఈ జగత్తు లేకపోయిన ఆయన సత్తాకు భంగం లేదు. ఆయన అసత్పదార్థాలకు భిన్నంగా వున్నాడు. అనగా శూన్యం కాదని అర్థం. కల్పిత కార్యరూప జగత్తు యొక్క అభావత్వ దోషానికి అతీతంగా వున్నాడు. ఆయన అభిజ్ఞుడు. ఇంద్రియాల ద్వారా చిత్త వృత్తుల ద్వారా యే యే విషయ జ్ఞానాలు కలుగుతున్నాయో, వాటియన్నిటిలో వ్యాపకుడై వానినన్నిటిని యెరిగే సర్వజ్ఞుడై వున్నాడు. స్వయం ప్రకాశ జ్ఞాన స్వరూపుడు. " అభిజ్ఞః " అని చెప్పుటతో జగత్కారణమైన పరమాత్మ జడం కాదు చైతన్యమని చెప్పినట్టయింది. ఈ మాట ద్వారా జగత్కారణము ప్రకృతియని పరమాణువు లని చెప్పే పరిణామవాద, ఆరంభవాదాలు తిరస్కరింపబడ్డాయి. స్వరాట్టు తాను రాజు, స్వయంప్రకాశకుడు, స్వతంత్రుడు .జీవుడు పరతంత్రుడు కాబట్టి స్వరాట్ కాలేడు. పరతంత్రుడు గాబట్టి సృష్టి కారణము జీవుడు కాదు. బ్రహ్మ దేవుడు కూడా స్వరాట్ కాలేడు. సృష్టికి ముఖ్య కర్త కాలేడు. ఎందుకనిన - బ్రహ్మదేవునికి సృష్టి జ్ఞానమును ప్రసాదించింది ఆ పరమాత్మే. ఏ వేదాల

యొక్క అర్థాన్ని తెలుసుకొనుటకు మహాపండితులు కూడా అసమర్థులై వున్నారో, ఆ వేద జ్ఞానాన్ని బ్రహ్మదేవునికి తానే అంతర్యామి స్వరూపంగా వుండి సృష్టి ప్రారంభంలో ప్రసాదించినాడు.

బ్రహ్మము యొక్క సత్యత్వాన్ని చెప్పి, ఇక జగన్మిథ్యాత్వాన్ని నిరూపిస్తున్నాడు.

" తేజో వారి మృదాం - యథా వినిమయో యత్రత్రి సర్గో మృషా" త్రిసర్గమంటే సృష్టి. ఈ ప్రపంచము సత్త్వరజస్తమో గుణములచే కల్గింది. కాబట్టి సృష్టిని త్రిసర్గమంటారు. తమో గుణంతో భౌతిక భోగ సాధనాలైన యింద్రియాలు కలిగాయి. సత్త్వ గుణంతో యింద్రియాధిష్ఠాన దేవతలు కలిగారు. తమోగుణము భోగ్యము, రజోగుణము భోగము, సత్త్వ గుణము భోక్త. ఈ త్రిపుటిలో కలిగిన సృష్టి త్రివర్గము. ఇది స్వయంగా అసత్యమే అయినా, పరమాత్ముని సత్తాతో సత్తావతంగా తోచింది. ఎండమావులలో నీళ్లు కనబడ్డాయి. నీళ్లు నిజంగా లేవు, కాని ఎండమావుల తేజస్సు సత్తాతో నీళ్లకు సత్తా కల్గింది. ఉండే ఎండమావుల ఉనికిని ఆధారం చేసుకొని లేని నీళ్లు వున్నట్లు కనపడ్తూ వున్నాయి. ఉండేది ఎండమావులైతే (సూర్య కిరణ తేజస్సు) నీళ్లున్నాయని అనుకొంటున్నాము. ఎండమావుల ఉనికి నీళ్ల యందు ఆరోపింపబడింది. అట్లే నీళ్లు వుండే చోటును స్ఫటికపు నేలగా, గాజు భూమిగా భావించి భ్రమిస్తూంటాము. మయ సభలో దుర్యోధనునికి కల్గిన భ్రమ యిదే. అక్కడ గాజు నేల లేదు. వుండేది స్వచ్ఛ జలం. దీని ఉనికి దానియందు ఆరోపింపబడింది. అట్లే గాజునేలను నీళ్ళు అనుకోవడమూ జరుగుతూంది. ఒకదాన్ని మరొకదానిగా భావించడమే "వినిమయ" మంటారు.

అట్లే పరమాత్మలో సృష్టి కల్పింబడింది. పరమాత్మ యొక్క ఉనికితోనే సృష్టికి ఉనికి కల్గింది. పరమాత్మనే మనం అజ్ఞానంతో

ప్రపంచంగా, సృష్టిగా చూస్తున్నాం. మట్టిని చూస్తున్నాం. కుండ అంటున్నాం. కుండ బరువుగా వుంది అంటాం. బరువు కుండది కాదు, మట్టిది. జగత్తు వుంది అంటున్నాం. వుండేది పరమాత్మ. జగత్తుకు సొంతంగా సత్తా లేదు, పరమాత్మ సత్తాతో జగత్తుకు సత్తా కలిగింది.

ఈ భ్రాంతి ఎప్పుడు నశిస్తుంది? " ధామ్నా స్వేన సదానిరస్త కుహకం " పరమాత్మని జ్ఞాన ప్రకాశం లభిస్తే యీ భ్రాంతి నశిస్తుంది. కళ్లు తెరిస్తే కలపోయింది, వెలుతురు వస్తే చీకటిపోయింది.

ప్రపంచాన్ని 'అశ్వత్థ " అని భగవద్గీత (15 అ–1 శ్లో) చెప్పింది. అశ్వత్థం అంటే రేపటి వరకు ఉండేది కాదని అర్థం. రేపటివరకు అంటే తెల్లవార్తే అని. తెల్లవార్తే అంటే జ్ఞానం కల్గితే అని అర్థం. అజ్ఞానదశలో ప్రపంచమని అనుకొన్నదే జ్ఞానం కల్గితే పరమాత్మ. అజ్ఞానదశలో నీళ్లు – జ్ఞాన దశలో ఎండమావులు.

ఆ జ్ఞానప్రాప్తికి సగుణ పక్షంలో అయితే పరమాత్మని అనుగ్రహానికి ప్రాధాన్యత వుంటుంది. నిర్గుణ పక్షంలో అయితే సాధకుని ప్రయత్నానికి ప్రాధాన్యత వుంటుంది. కావుననే కఠోపనిషత్తులో "యమేవైషవృణుతే తేన లభ్యః " (1–3–22) అని చెప్పబడిన మంత్రం రెండు విధాలైన అర్థాలనూ సూచిస్తుంది.

" సత్యం పరం ధీమహి " – ఆ పరమ సత్యాన్ని మేము ధ్యానిస్తున్నాము. " సత్యం" అని మాత్రం అంటే, వ్యావహారిక సత్యానికి సాపేక్షిక సత్యానికి కూడా అర్థం రావచ్చు. కావున ఆ విధంగా అతివ్యాప్తి కల్గకుండా " పరం – సత్యం " – పరమ సత్యము అని చెప్పబడింది. ఆ పరమ సత్యమైన పరమాత్మను మేము ధ్యానిస్తున్నాము.



సమదృష్టి గలవాడే పండితుడు

– శ్రీ సత్యసాయిబాబా

ప్రేమస్వరూపులారా ! గడచినదేదో గడచిపోయింది. రాబోవునది మనది కాదు. కనుక వర్తమానమే చాల ప్రధానమైనది. నిన్న చెప్పాను. ఎవడు తన హృదయంలో ప్రేమజంటను పండించుకొనునో అట్టివాడే నిజమైన క్రిష్టియన్, వాడే నిజమైన సిక్కు, వాడే నిజమైన ముస్లిం, వాడే నిజమైన హిందువు. " వాడే మానవుండు వసుధయందు." ప్రేమ లేక మానవుడు లేడు, ప్రేమ లేక జీవితము లేదు. ప్రేమయే హిరణ్యగర్భుడు. ప్రేమయే హిరణ్యస్వరూపము. ఇది ప్రతి మానవునికి కుడివైపు (రైట్ సైడ్)న ఉంటుంది. భౌతికమైన గుండె ఎడమవైపు (లెఫ్ట్ సైడ్)న ఉంటుంది. ఈ లెఫ్ట్‌సైడ్‌న ఉన్న గుండెను ఎప్పటికైనా వదలిపెట్టక తప్పదు. రైట్ సైడ్‌న ఉన్న హిరణ్య స్వరూపమే ఎప్పటికీ 'రైటు'. అనగా, ఇదే శాశ్వతమైనది. ఇదే అమృతత్వము, ఇదే అమరత్వము, ఇదే ప్రేమతత్త్వము.

హిరణ్యగర్భుడు ప్రతి మానవుని హృదయమందున్నాడు. కేవలం మానవుని యందే కాదు. పశుపక్షి మృగాలందు కూడా ఉన్నాడు. కనుకనే వేదము " ఈశావాస్య మిదం జగత్", " ఈశ్వరస్సర్వ భూతానాం " అన్నది. ఈ హిరణ్యగర్భుని నుండి వచ్చునదే ప్రేమ. ప్రేమ హిరణ్యగర్భుని ప్రతిబింబమే. ప్రేమ హిరణ్యగర్భుని ప్రతిరూపమే. ఇదే మానవుని స్వస్వరూపము. ఇట్టి స్వస్వరూపాన్ని గుర్తించుకోలేక మానవుడు అనిత్యమైన లోకసంబంధమైన వాంఛలకు తన జీవితాన్ని అంకితం గావించు కుంటున్నాడు. స్వార్థపరమైన ప్రేమ వదలిపోతుంది, మరచి పోతుంది గాని భగవత్ప్రేమ వదలేది కాదు, విడిచేది కాదు, మరచేది కాదు,

మారిపోయేది కాదు, పారిపోయేది కాదు జారిపోయేది కాదు. అట్టి దివ్యమైన ప్రేమతత్త్వం మానవునికి అత్యవసరం.

భగవత్ప్రేమను మించినది లేదు:-

ఒక చిన్న ఉదాహరణ : హనుమంతుడు రామాజ్ఞను శిరసా వహించి, లంకలో ప్రవేశించి, సీతయొక్క క్షేమవార్తను తెచ్చి రామునికి అందించాడు. రాముడు వానర సైన్యంతో కూడి లంకలో ప్రవేశించి, రావణుని వధించాడు. అప్పుడు హనుమంతుడు సీతవద్దకు వెళ్ళి, “అమ్మా! రామునికి విజయం చేకూరింది. రావణ సంహారం జరిగింది. నీకు బంధ విమోచన జరిగింది ” అని చెప్పాడు. సీతాదేవి ఆనందంతో ఉప్పొంగిపోయి హనుమంతుణ్ణి అనేక విధాలుగా వర్ణించింది. “ రఘుపతి కార్యం బీడేర్చిన కపిరాజ శిఖామణి నీవయ్యా ! రామముద్రిక గొని సముద్రము దాటిన భద్రపరాక్రముడవీవయ్యా ! ” అని హనుమంతునికి ఎన్నో టైటిల్స్ (బిరుదులు) ఇచ్చింది. “ హనుమంతా ! నీ వంటి గుణవంతుడు, బలవంతుడు ఈ జగత్తులో కానరాడు ” అని ఎంతో గొప్పగా వర్ణించింది. కానీ ఈ వర్ణనలు విని హనుమంతుడు కృంగిపోయాడు, తలవంచుకున్నాడు. ఈ సత్యాన్ని గుర్తించిన సీత ‘ అయ్యో ! ఈ వర్ణనలు హనుమంతునికి ఏమాత్రము ఆనందము నందించలేదే ! ఇతనికి ఆనందము కల్గించే విషయ మేమిటి ? ” అని బాగా లోతుగా యోచన చేసి “ హనుమంతా ! సర్వకాల సర్వావస్థలయందు నీవు రామప్రేమను పొందుదువు గాక ! ” అన్నది. ఈ మాటలు వినేటప్పటికి హనుమంతుడు ఆనందంతో ఎగిరి గంతేసాడు. “ తల్లీ ! రామప్రేమను మించినది ఈ జగత్తులో లేదు కదా ! అది లేకుండా ఈ జగత్తునంతా నా హస్తమునందుంచినా నాకు ఆనందం కలుగదు. రాముని ప్రేమకిరణములు నాపై ప్రసరించితే నా జన్మ ధన్యమైపోతుంది” అన్నాడు.

చూశారా ! బలవంతుడు, గుణవంతుడు, పరమ భక్తుడైన హనుమంతుడు రామప్రేమను తప్ప మరి దేనినీ ఆశించలేదు. ప్రేమయే ఈ లోకము. ప్రేమయే సర్వస్వము. కానీ మానవుడు ప్రేమమయమైన ఈ జగత్తునందు ఉద్భవించి, ప్రేమను కోల్పోయి, ద్వేషము, అసూయ, క్రోధము మున్నగు దుర్భావములను హృదయంలో నింపుకుంటున్నాడు.

సమదృష్టి గలవాడే పండితుడు :-

ఒక పర్యాయం బుద్ధునివద్దకు ఒక పండితుడు వచ్చి “ బుద్ధా ! నీవు నన్ను జయించావంటే నేను నా మూడు వేలమంది శిష్యులు నీకు పాదాక్రాంతులమై నీ సేవ చేస్తాము, బౌద్ధమతమును స్వీకరిస్తాము. ఒకవేళ నీవు ఓడిపోయినట్లయితే నీవు నాకు పాదాక్రాంతుడవు కావాలి ” అన్నాడు. అప్పుడు బుద్ధుడు చిరునవ్వు నవ్వుతూ – “ పండితాః సమ దర్శినః ” – “ సమత్వాన్ని పూనినవాడే పండితుడు. పండితునకు సుఖదుఃఖములనేవి తెలియవు, ఎక్కువ తక్కువలనేవి ఉండవు. కానీ నీయందు అహంకారమున్నది, క్రోధమున్నది. అలాంటప్పుడు నీవు పండితుడ వెట్లవుతావు ? ఆత్మజ్ఞానం గ్రంథ పరిచయంతో వచ్చేది కాదు. లౌకికమైన పాండిత్యంతో వచ్చేది కాదు. గురువులు అందించేది కాదు. ఈ లోకంలో కట్టలు కట్టలు పుస్తకాలు చదివేవారున్నారు. కానీ వాటిలోని పవిత్రమైన విషయాలను ఆచరణలో పెట్టేవారు ఒక్కరైనా ఉన్నారా ? జీవితమంతా చదువుతూనే కూచుంటే ఇంక ఆచరణలో పెట్టే దెప్పుడు ? ఆచరణలో లేని పాండిత్యము పాండిత్యమే కాదు ”.

కవిం పురాణ మనుశాసితారం
అణోరణీయాంస మనుస్మరేద్యః
సర్వస్య ధాతార మచిన్త్యరూపం
ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్

కవి అనగా ఎవరు ? ఏవో కొన్ని పదములను కూర్చి

పద్యములల్లేవాడు కాదు కవి. భూత భవిష్యత్ వర్తమానములను చక్కగా గుర్తించినవాడే కవి. అతడు భగవంతుడొక్కడే. 'పురాణమ్ ' అనగా ఏమిటి? ఈ దేహమనే పురంలో నఖశిఖ పర్యంతము సంచరించే దివ్యత్వమునే 'పురాణమ్ ' అన్నారు. ఇంక అనుశాసితు డనగా ఎవరు ? లోకంలో పరుల సొత్తు అపహరించినవారిని, పరులకు అపకారం చేసినవారిని చెఱసాలలో పెట్టి బీగం వేస్తారు. కానీ మనస్సును ఎవరైనా చెఱసాలలో పెట్టగలరా ? మనస్సు తన ఇంటికి పోవచ్చు, తనవారిని చూడవచ్చు, ఇంకెక్కడికైనా సంచరించవచ్చు. ఈ జగత్తులో దేహాన్ని శాసించే జడ్జీలు కావలసినంతమంది ఉన్నారుగాని, మనస్సును శాసించే జడ్జి ఒక భగవంతుడు తప్ప మరొకడు లేడు. అతడే అనుశాసితుడు.

బుద్ధుడు ఈవిధంగా సమాధానం చెప్పి ఆ పండితుని నోరు మూయించాడు. " నాయనా ! ఇకపైన నీవు ఆడంబరములకు పూనుకోవద్దు, అహంకారమునకు అవకాశ మివ్వవద్దు. అహంకారము అధఃపతనం గావిస్తుంది నీవు సంపాదించవలసింది లౌకికమైన, భౌతికమైన, ప్రాకృతమైన పాండిత్యము కాదు, భగవంతునికి అర్పితమయ్యే దివ్యమైన, నవ్యమైన, భవ్యమైన జ్ఞానమును సంపాదించుకో, నేను సత్యాన్ని గుర్తించాలని నిద్రాహారములను త్యజించి, ఆకలి దప్పులను మరచి ఎంతో కాలం సాధన చేశాను. నీవు చదివిన గ్రంథ్రములకంటే ఎక్కువ గ్రంథములనే చదివాను. ఎంతోమంది పండితులను దర్శించాను. అనేకమంది గురువులను సేవించాను. కానీ నాకు తృప్తి కలుగలేదు. చివరికి, పంచేంద్రియములను సద్వినియోగ పరచకుండా ఎన్ని సాధనలు చేసినా ప్రయోజనం లేదని గుర్తించాను. కనుక ముందు వాటిని పవిత్రం గావించుకో. అప్పుడే నీవు నిజమైన పండితుడవుతావు. భగవంతుడు ప్రసాదించిన పంచేంద్రియాలను సద్వినియోగపరచినప్పుడే ఆనందం ప్రాప్తిస్తుంది. నేను నా పంచేంద్రి

యాలను సన్మార్గంలో ప్రవేశపెట్టాను, సద్వినియోగ పర్చాను. తద్వారా అవి నా స్వాధీనమైపోయాయి. అందుచేతనే నేనిప్పుడు ఆనంద స్వరూపునిగా ఉన్నాను " అన్నాడు. ఆనందములో లీనం కావడమే నిర్వాణము.

నీటియందె పుట్టి, నీటియందె పెరిగి
నీటియందడంగు నీటి బుడగ
నరుడు బుద్బుదంబు, నారాయణుడు నీరు
ఉన్న మాట తెలుపుచున్న మాట.

ఈ 'బుడగలన్నీ 'నీటి' యందె పుడుతున్నాయి. 'నీటి ' యందె నిలుస్తున్నాయి. 'నీటి' యందె సంచరిస్తున్నాయి. 'నీటి'యందె అణిగిపోతున్నాయి. ఇదియే మానవ జీవితము. మనం ఆనందము నుండియే పుట్టాము, ఆనందమునందే సంచరిస్తున్నాము , ఆనందమునందే లీనం కావాలి. ఇంతకంటే మరొక మార్గం లేదు.

ఇంద్రియ నిగ్రహమే నిజమైన సాధన :

స్వస్వరూప సందర్శన భాగ్యమే ఆనందము. ఆత్మయే మన స్వస్వరూపము. మన పంచేంద్రియాలను అదుపులో పెట్టుకున్నప్పుడే ఆనందం మనలో ఆవిర్భవిస్తుంది. సాధన అనగా రాం, రాం... అని జపం చేయడం కాదు, కృష్ణ .... కృష్ణ.... అని భజన చేయడం కాదు. మొట్టమొదట ఇంద్రియాలను అరికట్టుకోవాలి. వాటిని సక్రమమైన మార్గంలో ప్రవేశపెట్టాలి. అదియే నిజమైన సాధన. అప్పుడే ఆత్మజ్ఞానము ప్రాప్తిస్తుంది. పతంజలి "యోగః చిత్తవృత్తి నిరోధః " అన్నాడు. దీనిని మించినది లేదు. ఎన్ని జపములు, తపములు, ఎనిన పవిత్ర కర్మలు చేసినా ఇంద్రియాలను నిగ్రహించుకోలేకపోతే అవన్నీ నిరుపయోగములే. అయితే " సామాన్య మానవులమైన మాకు ఇంద్రియాలను నిగ్రహించుకోవడం ఎలా సాధ్యం ? " అని మీరనుకోవచ్చు. నిగ్రహ

మంటే పూర్తి అరికట్టడం కాదు. మీరు చేయవలసిన కర్మలన్నీ చేసుకోండి. ఎవరు ఏ వృత్తిలో ఉన్నారో ఆ వృత్తిని చక్కగా అనుసరించండి. దానిని వదలమని నేను చెప్పటం లేదు. కానీ " సర్వ కర్మ భగవత్ప్రీత్యర్థం ", అనే భావాన్ని స్థిరంగా పెట్టుకోండి అదే ఇంద్రియ నిగ్రహమవుతుంది.

విశ్వాసం దృఢంగా ఉన్నప్పుడే అర్పితం సులభం :

ప్రేమ స్వరూపులారా ! అర్పితమనేది చాల కష్టమని భావిస్తున్నారు మీరు. కానీ నా దృష్టిలో భగవదర్పితముకంటే సులభమైనది మరొకటి లేదు. పుష్పముయొక్క రేకులను నలపడం చాల సులభం. కానీ అంతకంటే సులభమైనది భగవంతునికి అర్పితం చేయడం. ఇంత సులభమైన దానిని వదలిపెట్టి ఎందుకు కష్టాలకు గురి అవుతున్నారు ? మీకు భగవంతునిపై విశ్వాసం దృఢంగా లేకపోవడం చేతనే ఇది కష్టంగా తోస్తున్నది. భగవంతుడున్నాడు. "ఉన్నాడయా దేవుడున్నాడయా ". దేవుడు లేని స్థానం లేదు. దేవుడుకాని జీవుడే లేడు, దేవుడు లేని పదార్థమే లేదు. ఈ సత్యాన్ని మీరు హృదయపూర్వకంగా విశ్వసించినప్పుడు అర్పితము చాల సులభమవుతుంది. అట్టి విశ్వాసం మీలో లేకపోవడం చేతనే ఇది మీకు కష్టంగా కనిపిస్తున్నది. ప్రేమస్వరూపులారా ! ప్రేమయే భగవంతుడని విశ్వసించండి. భగవద్విశ్వాసంతో ఎంతటి కఠినమైన కార్యమునైనా సులభంగా సాధించవచ్చు.

గృహవైద్యం

తెల్లగలిజేరు ఆకురసాన్ని ముక్కులో పిండితే తుమ్ములు, పార్శ్వపు నొప్పి పోతాయి.

గలిజేరు ఆకురసం, నువ్వులనూనె సమభాగాలుగా కలిపి ఉడికించి తైలంగా కాచి వుంచుకొని కీళ్ళ వ్యాధులకు పైపూత పూసుకొంటూంటే కీళ్ళ జబ్బులు పోతవి.

ధర్మశాస్త్రాలు - నేటి సమాజం

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

ప్రాచీనకాలంలో గురుకులాల్లో విద్యాభ్యాసం జరిగేది. అందులో చేరిన విద్యార్థులు పండ్రెండు సంవత్సరాలు విద్యాధ్యయనం చేసేవారు. పాఠ్యాంశాలు పదునాల్గు విభాగాలుగా ఉండేవి.

అంగాని వేదాశ్చత్వారః మీమాంసా న్యాయవిస్తరః ।

పురాణం ధర్మశాస్త్రం చ విద్యాహ్యేతాశ్చతుర్దశ ॥

శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం - అనే ఆరు వేదాంగాలు, ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదం - అనే నాలుగు వేదాలు, మీమాంస, న్యాయశాస్త్రం, అష్టాదశపురాణాలు, ధర్మశాస్త్రం - అనేవే పదునాల్గు విద్యలు.

పైన పేర్కొన్న వాటిలో చివరిదైన ధర్మశాస్త్రం ప్రవృత్తి - నివృత్తి రూపాలైన ధర్మాల స్వరూపాన్ని వివరిస్తుంది.

మానవుడు నాల్గు పురుషార్థాలను సాధించాలి. అది ధర్మం, అర్థం, కామం, మోక్షం అని వ్యవహరింపబడుతున్నాయి. మొదటి పురుషార్థమైన ధర్మం అర్థకామాదులకంటే శ్రేష్ఠమైనది. ధర్మంతో కూడిన అర్థకామాలే విలువైనవి. ధర్మానికి అవిరుద్ధమైన కామం తన స్వరూపమే అని గీతాచార్యుడు చెప్పాడు.

' ధర్మావిరుద్ధో భూతేషు కామో2స్మి భరతర్షభ ' !

ధర్మానికి ప్రభువు అచ్యుతుడే. ధర్మస్థాపనకై తాను యుగ యుగాలలోనూ అవతరిస్తానని కూడా శ్రీకృష్ణ భగవానుడు పలికాడు.

వేదమంతా ధర్మమూలమే. ‘ వేదో2ఖిలో ధర్మమూలం’ అనుట ప్రసిద్ధం. అందుచేత విద్యాభ్యాసకాలంలోనే బ్రహ్మచారులు ధర్మశాస్త్రాలను అధ్యయనం చేయడం సముచితం.

‘ ధర్మం ’ అంటే ఏమిటి ? ధర్మ శబ్ద నిర్వచనం ఇలా ఉన్నది.

ధారణాద్ధర్మ ఇత్యాహుర్ధర్మో ధారయతే ప్రజాః ।
యస్స్యాద్ధారణ సంయుక్త స్సవై ధర్మ ఇతి స్మృతః ॥

ధారణవల్ల ‘ ధర్మ ’ మనబడింది. ధర్మమే ప్రజలను విచ్ఛిన్నం కానీకుండా ధరిస్తున్నది. ధారణతో కూడినదే ధర్మం. ‘ధార్యతే అనేనేతి ధర్మః ’ అన్న నిర్వచనం కూడా ఈ అర్థాన్నే వ్యక్తం చేస్తున్నది.

ఇట్టి ధర్మముయొక్క స్వరూపాన్ని నిరూపించునవే ధర్మశాస్త్రాలు.

ధర్మం ప్రవృత్తిధర్మమనీ, నివృత్తి ధర్మమనీ రెండు విధాలు. సంసారం నుండి నివృత్తి పొంది కేవలం శ్రేయోమార్గాన్ని అనుసరించి ముక్తి కోరేవారు పాటించేది నివృత్తి ధర్మం. ఈ ధర్మంలో సాధారణంగా మార్పు ఉండదు. కాలానుగుణంగా ఏదైనా పరివర్తనం అవసరమైనా అది చాలా స్వల్పంగానే ఉంటుంది.

ప్రవృత్తి ధర్మం అట్టిది కాదు. అది కాలానుగుణంగా, దేశాను గుణంగా, పాత్రానుగుణంగా, సందర్భానుగుణంగా మార్పులకు లోనవుతూ వుంటుంది. అందుకే ఆయా కాలాలలో పాటించదగిన ధర్మాలలో కలిగే మార్పును బట్టి శాస్త్రాలు గూడా పలురకాలుగా ఏర్పడ్డాయి.

కృతేతు మానవా ధర్మాస్త్రేతాయాం గౌతమాః స్మృతాః ।
ద్వాపరే శంఖలిఖితాః కలౌ పారాశరాః స్మృతాః ॥

ఈ శ్లోకం కాలానుగుణంగా పాటించదగిన ధర్మాశాస్త్రాల భేదాన్ని తెలియజేస్తున్నది. కృతయుగంలో మనువు చెప్పిన ధర్మాలు, త్రేతాయుగంలో గౌతముడు పేర్కొన్న ధర్మాలు, ద్వాపరంలో శంఖలిఖిత ప్రోక్త ధర్మాలు,

కలియుగంలో పరాశరుడు ప్రవచించిన ధర్మాలూ పాటించదగియున్నవని తాత్పర్యం.

ధర్మశాస్త్రాలలో మనువు చెప్పిన ధర్మశాస్త్రం అగ్రగణ్యమైనది. పూర్వం భూపరిపాలకులందరూ మనుధర్మాన్నే పాటించారు.

యఃకశ్చిత్కస్య చిద్ధర్మః మనునా ప్రతిపాదితః ।
ససర్వో2భిహితో వేదే సర్వజ్ఞానమయో హి సః ॥

మనువు చెప్పిన ఒక వ్యక్తికి సంబంధించిన ధర్మమేదైనా అది వేదంలో గూడా అట్లే చెప్పబడి వున్నది. ఆ వేదం కానీ, మనువు చెప్పిన ధర్మం కానీ సకల జ్ఞానాలకూ ఆకరమైనది గదా ! (మనువు సర్వజ్ఞాన స్వరూపుడు).

మనుస్మృతి విరుద్ధాయా సా స్మృతిర్న ప్రశస్యతే ।
వేదార్థోపనిబద్ధత్వాత్ ప్రాధాన్యం హి మనోః స్మృతేః ॥

మనుస్మృతికి విరుద్ధమైన స్మృతి విలువలేనిది, దాని నెవరూ కీర్తించరు. మనువు వేదార్థాలనే పేర్కొన్నారు. కాన మనుస్మృతి ప్రాముఖ్యాన్ని సంతరించుకొన్నది.

ఈ స్మృతి ఎంత ప్రశస్తమైనా దాని పాటింపు కృతయుగానికే పరిమితమయింది. ఇతర యుగాలలో ఆచార వ్యవహార రూప ధర్మాలు కాలానుగుణంగా మార్పు చెందాయి. దానిని బట్టి ధర్మస్వరూపాన్ని గూడా మార్చి చెప్పవలసి వచ్చింది. అందువల్లనే గౌతముడు మున్నగు మహర్షులు మనుస్మృతికి భిన్నములైన ధర్మశాస్త్రాలు రచించారు.

ఇలా భిన్న భిన్న ధర్మశాస్త్రాలు రచించిన మునులు ఇరవై మంది ఉన్నారు. వారి పేర్లు

మన్వత్రి హారీత యాజ్ఞవల్క్యోశనో2ంగిరాః
యమాపస్తంబసంవర్తాః కాత్యాయన బృహస్పతీ ॥
పరాశరవ్యాసశంఖలిఖితా దక్షగౌతమా ।

శాతాతపో వసిష్ఠశ్చ ధర్మశాస్త్ర ప్రయోజకాః ॥

మనువు, అత్రి, విష్ణువు, హారీతుడు, యాజ్ఞవల్క్యుడు, ఉశనుడు, అంగిరసుడు, యముడు, ఆపస్తంబుడు, సంవర్తుడు, కాత్యాయనుడు, బృహస్పతి, పరాశరుడు, వ్యాసుడు, శంఖుడు, లిఖితుడు, దక్షుడు, గౌతముడు, శాతాతపుడు, వసిష్ఠుడు అనువారు ధర్మశాస్త్రకర్తలు. వీరు రచించిన వాటిలో పెక్కు ధర్మశాస్త్రాలు ఇప్పుడు గూడా లభిస్తున్నాయి.

'ధర్మశాస్త్రంతు వై స్మృతిః' అని ప్రమాణాన్ని బట్టి ధర్మశాస్త్రాన్ని 'స్మృతి' అని కూడా వ్యవహరిస్తారు. ఈ స్మృతులకు వ్యాఖ్యానాలు రచించిన కుల్లూకభట్టుడు, విజ్ఞానేశ్వరుడు (మితాక్షరవ్యాఖ్యాకర్త) మున్నగువారు ఆయా శాస్త్రాలకు సంస్కృతంలో విపులమైన వ్యాఖ్యానాలు రచించారు. ఆధునికయుగంలో హిందీ, ఆంగ్లం మున్నగు భాషలలో గూడా పై స్మృతిగ్రంథాలు అనువదింపబడ్డాయి.

అతి ప్రాచీన కాలం నుండీ సనాతన ధర్మంలో వర్ణాశ్రమ వ్యవస్థ కీలకమైన పాత్ర వహించింది. అందువల్ల వర్ణాశ్రమాలను, వాటి వ్యవస్థనూ ధర్మశాస్త్రాలు ప్రముఖంగా ప్రతిపాదించాయి. నాలుగు వర్ణాలు ఏఏ ఆచారాన్ని పాటించాలో అవి స్పష్టంగా పేర్కొన్నాయి. తమ వర్ణానికి విరుద్ధంగా వ్యవహరించినవారికి కఠిన శిక్షలు విధించాయి.

వర్ణమనేది పుట్టుకతోనే సహజంగా సిద్ధిస్తుందని ధర్మశాస్త్రాల సిద్ధాంతం. కాబట్టి వర్ణాలలో హెచ్చుతగ్గులు సహజాలు, వాటిని మార్చటానికి వీలులేదని ఆ శాస్త్రకర్తల నిర్ణయం.

అయితే కులాన్ని బట్టి కాక గుణాన్ని బట్టి వర్ణాన్ని నిర్ణయించాలి అనే వాదం కూడా ఒకటి ఉన్నది. అయినా ధర్మశాస్త్రాల దృష్టిలో ఈ వాదానికి ఏమాత్రం ప్రాధాన్యం లేదు. అవి జన్మ సిద్ధమైన వర్ణాన్నే సమర్థించాయి.

వర్ణాలలోని వైషమ్యాన్ని దృష్టిలో పెట్టుకొని విధించిన ధర్మాలను

ప్రక్కన పెడితే, ధర్మ శాస్త్రాలు చెప్పిన అనేక ధర్మాలు సర్వకాల సర్వావస్థలలో పాటించదగిన ఉత్తమ ధర్మాలని చెప్పడానికి ఏమాత్రం సంశయించవలసిన పనిలేదు. ఒకటి రెండు ఉదాహరణలను తీసుకుందాం.

వేదం ' మాతృదేవోభవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ " ఇత్యాదిగా కొన్ని పాటించదగిన ధర్మాలను విధించింది. ఇలా ప్రభువులాగా శాసించి చెప్పే అధికారం వేదానికి ఉన్నది.

ఈ వేదశాసనాన్ని దృష్టిలో పెట్టుకొని మనువు ఉపాధ్యాయుడు, ఆచార్యుడు, తండ్రి, తల్లి – వీరిలోని తరతమభావాలను ఈ క్రింది విధంగా నిరూపించాడు.

ఉపాధ్యాయాన్ దశాచార్యః ఆచార్యాణాం శతం పితా ।
సహస్రం తు పితౄన్ మాతా గౌరవేణాతిరిచ్యతే ॥

ఆచార్యుడు పదిమంది ఉపాధ్యాయులను, తండ్రి వందమంది ఆచార్యులను, తల్లి వెయ్యిమంది తండ్రులను – గౌరవంలో అతిశయించి యున్నారని భావం. మాతృస్థానానికి ఎంత విలువ మనుస్మృతిలో ఇవ్వబడిందో గమనించండి. మాతృస్థానం ఏ నాటికీ తన విలువను కోల్పోదు. కాన ఈ ధర్మం సార్వకాలికమైనదే కాని తాత్కాలికం కాదు. ఇక స్త్రీలను గురించి సామాన్యంగా మనువే మన్నాడో చూడండి !

యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః ।
యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రాఫలాః క్రియాః ॥

ఎక్కడ స్త్రీలు పూజింపబడుదురో, అక్కడ దేవతలు ఆనందిస్తారు. ఎక్కడ స్త్రీలకు ఆదరం లేదో, అక్కడ చేసే పనులన్నీ నిష్ఫలాలవుతాయి అని తాత్పర్యం. స్త్రీలకు సనాతన ధర్మంలో ఎంతటి విశిష్ఠ స్థానం కలదో దీనివల్ల స్పష్టమవుతున్నది.

మనుస్మృతిలోని 'న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అన్నమాట ఆధునిక

కాలంలో తీవ్ర విమర్శలకు గురి అయింది. పూర్తి శ్లోకమిది –

పితారక్షతి కౌమారే భర్తారక్షతి యౌవనే ।

పుత్రాశ్చ స్థవిరే భావే న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి ॥

" కౌమారంలో స్త్రీని తండ్రి రక్షిస్తాడు. యౌవనంలో భర్త రక్షిస్తాడు. వార్ధకంలో పుత్రులు రక్షిస్తారు. స్త్రీకి స్వాతంత్ర్యార్హత లేదు " అని భావం.

స్త్రీలకు స్వాతంత్ర్యం లేదని చెప్పి మనువు స్త్రీలను చిన్నచూపు చూచాడని ఆధునిక విమర్శకుల అభిప్రాయం. కాని పరిశీలించి చూస్తే స్త్రీకి రక్షణ అత్యంతం ముఖ్యం. కాబట్టి ఆమెను రక్షణ లేకుండా స్వతంత్రంగా వదలివేయరాదన్న భావం మనువు మాటలో వ్యక్తమవుతున్నది. ఇక్కడ స్త్రీ రక్షణే ప్రాధాన్యం వహిస్తుంది. ' న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి ' అనడానికి బదులు ' న త్యజే త్తా మరక్షితామ్ " అని చెప్పి వుంటే ఈ విమర్శ వచ్చేది కాదు. కాని మనువు స్త్రీ రక్షణకు దృష్టిలో పెట్టుకొనే అలా అన్నాడు. రక్షణలేని స్త్రీల దురవస్థలు ఎలా వున్నవో నేటి సమాజంలో మనం చూస్తూనే వున్నాము కదా ! (సశేషం)

త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుకు ఈక్రింది వారు పైకం పంపినారు

1. అన్నె నవమణిట్రస్టు (గుజ్జంగూడ) – రూ. 30,000/–
   (12-2-16,23-2-16, 29-3-16న)
2. డి.కె.నాగరాజు (హనుమంతనగర్, బెంగుళూరు)రూ. 10,000/–
3. జ్యోత్స్న పటేల్ (దొడ్డకలశపుర, బెంగుళూరు) రూ.11,000/–
4. సౌమ్య (మార్తహల్లి, బెంగుళూరు) – రూ.10,116/–
5. బాలు నరసింహులునాయుడు (కట్టావారిపల్లె) – రూ.10,000/–
6. ఎ.పి.రావు (జయనగర్, బెంగుళూరు) – రూ.10,000/–
7. ఎన్.నాగేశ్వరరావు (సైనిక్‌పురి, సికింద్రాబాద్) – రూ. 10,000/–

జ్ఞాన సుధ

మూలం

శ్రీ సర్పభూషణ శివయోగి వారు

అనువాదం :

పూజ్యశ్రీ శంకరానందగిరి స్వాములవారు,

ఉమామహేశ్వర పీఠాధిపతులు

అవ : పరవస్తు వొక్కటే ఉపాధి భేదమువలన జీవాది చతుర్విధ భేదములతో ఒప్పుచున్నదని చెప్పుచున్నారు –

అవిద్యోపాధితో జీవో మాయోపాధే స్సదాశివః,

జ్ఞానోపాధేస్తు కూటస్థః తన్నాశే బ్రహ్మ పూర్వవత్,

బ్రహ్మ = బ్రహ్మ పదార్థము, అవిద్యోపాధితః = ఆవరణ విక్షేపాత్మక అవిద్యోపాధిచే, జీవః =జీవుడు (అయెను), మాయోపాధేః = శుద్ధసత్త్వగుణ మాయోపాధిచేత, సదాశివః = ఈశ్వరుడు (ఆయెను), జ్ఞానోపాధేః = విద్యోపాధిచే, కూటస్థః = కూటస్థుడు (ఆయెను), తన్నాశే = ఆ ఉపాధుల నివృత్తియందు, పూర్వవత్ = ముందువలె (బ్రహ్మమే),, స్యాత్ = ఉండును.

ఉపాధులు అసత్యములు. అందుచే ఉపాధుల మూలమున వ్యక్తమగు జీవేశ్వర భావములు మాయికములు. ఉపాధి రహితమగు మూలవస్తువు అనగా పరబ్రహ్మము ఒక్కటే తత్త్వము, సత్యము.

ఇది జీవేశ్వరవిచారణగల తృతీయాధ్యాయము.

మహావాక్యవిచారాత్మక చతుర్థాధ్యాయము

అవ : జీవేశ్వరులకు లక్ష్యార్థముచే ఏకత్వ మున్నది. కాని వాచ్యార్థముచే లేదని తెలుపుచున్నారు –

విజాతీయదోషా సుధా22జ్యైకతా

పురా భిన్నదోషా జలాబ్ధ్యేకతా,

తయో ర్భాతి పారే నభో2భ్రైకతా

హ్యసౌ నేతి వాచ్యాత్మనో ర్మే మతా.

పురా = పూర్వము, సుధా ఆజ్యఏకతా = నీళ్ళు వేయి వీనియొక్క ఏకత్వము, విజాతీయదోషము గలది, జల అబ్ధి ఏకతా = నీళ్ళు సముద్రము, వీని ఏకత్వము, భిన్నదోషా = సజాతీయ దోషము గలది, (కావున) తయోః = ఇట్టి ఏకత్వముల రెంటికి, పారే = ఆవల, అవతల (విలక్షణముగా) , నభః అభ్ర ఏకతా = ఆకాశమునకు ఆకాశమునకు గల ఏకత్వము, నిర్దోషా = ఏవిధమైన దోషము గూడ లేనిదై, భాతి = ప్రకాశించుచున్నది. అసౌ = ఇయ్యది, ఇట్టి ఏకత్వము, వాచాత్మనోః = జీవేశ్వర వాచ్య స్వరూపములకు, న ఇతి= లేదని, మే = నాకు మతా = సంమతము, హి = నిశ్చయము.

జలమునకు సముద్రజలము సజాతీయము. జలమునకు నేయి విజాతీయము.

కావున వీనికి ఐక్యము సంభవింపదు. ఆకాశమునకు ఆకాశమో కేవలము అభిన్నముగా ఉన్నది. ఏవిధమైన భేదముగూడ లేనిదై పైన దెలిపిన వానికంటె విలక్షణముగా ప్రకాశించుచున్నది. కావున ఆకాశమునకు ఆకాశమునకు ఐక్యము చక్కగా ఘటిల్లుచున్నది. ఇట్టి ఐక్యము జీవేశ్వరుల వాచ్యాంశములకు సంభవింపనేరదు. ఇది నా మతము. నిశ్చితము.

అవ : భాగత్యాగ లక్షణద్వారా మహావాక్యార్థానుభూతిని పొందిన వానికే ముక్తి చెప్పుచున్నారు.

వాచ్యార్థం వ్యవపనీయ తత్త్వముభయో రంత స్తయో ర్లక్షితే
చైతన్యద్వితయే విసృజ్యచ పున ర్భేదాపరోక్షద్వయమ్,
ఐక్యం తచ్ఛివజీవయో రనుమన న్భాగాహ్వయా ల్లక్షణా
దాత్మా సన్నసి బోధితో విహరతే యోగీ గళద్బంధనః.

తయోః = వెనుక తెలిపియున్నట్టి ఆ, ఉభయోః = శివ జీవు లిరువురయందలి, వాచ్యార్థం = (పరస్పర విరుద్ధమైన) వాచ్యమగు అర్థమును, మాయోపాధిని అవిద్యోపాధిని, వ్యపనీయ = మిథ్యాత్వ దృష్టితో నిషేధించి పునః= మఱియు, భేదాపరోక్షద్వయంచ = తత్పదార్థమందలి భేదము త్వం పదార్థము గల అపరోక్షము అనెడి రెండిటినిగూడ, విసృజ్య = విడిచి, భాగాహ్వయాత్ లక్షణాత్ = భాగత్యాగ లక్షణవలన, చైతన్యద్వితయే = కూటస్థ చైతన్యము బ్రహ్మచైతన్యము అనునవి రెందు, అంతః = లోపల, లక్షితే = లక్షింప (శోధింప) బడినవి కాగా, సన్ = ఏకమేవాద్వితీయ' మ్మనబడిన సద్రూపమగు, ఆత్మా = పరమాత్మయే, అపి = నీవైయున్నావు, (ఇతి = అని), బోధితః = బోధింపబడినవాడై, తత్‌శివజీయోః = ఆ శివజీవుల యొక్క తత్త్వం = యథార్థస్వరూపమగు, ఐక్యం = ఐక్యమును, ఏకముగా ఉండునట్టి స్థితిని అనుమనన్ = మనము చేయుచు, యోగీ = జ్ఞానియగువాడు, గళత్‌బంధనః = బంధము జాఱిపోయినవాడై, విహరతే = విహరించును.

తత్త్వమసి మహావాక్యమందు తత్, త్వం, అసి యను మూడు పదములు గలవు. వానికి క్రమముగా ఆ శివుడు, నీవు, ఐయున్నావు అని అర్థము. అట్లయిన "తదేవ త్వం" ఆ బ్రహ్మమే నీవని చెప్పిన జీవులు సర్వజ్ఞులు కావలసియుండును. మఱియు సృష్టికర్త లేడు అని అనవలసి వచ్చును. శివుడు కించిత్‌జ్ఞుడు గావలసి వచ్చును. ఈ ప్రకారముగా దోషములు సంభవించును. కావున తత్త్వమసి మహావాక్యముచేత ఐక్యము ఘటిల్లదుగదా? యని శంకించిన ఇందులకు సమాధానము. తత్, త్వం – పదముల వాచ్యార్థములను విడిచి లక్ష్యార్థము లగు బ్రహ్మ ప్రత్యగాత్మల యందుండు భేదాపరోక్షములను త్యజించి భాగత్యాగలక్షణముచే లక్షింప ఆ సద్రూపబ్రహ్మమే నీవయియున్నావని బోధింప శివజీవులకు ఐక్యము సంభవించును. అట్టి అనుభవము గల జ్ఞాని బంధవిముక్తుడై ఆనందముగా విహరించును.

ఆచార్య దేవో భవ

–ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

కస్సుమన్న గురుశిష్యులు :

పరశురాముడు జమదగ్ని కుమారుడు, ఆశ్రమవాసి, బాల్యంలోనే క్షత్రియుల ' అహంకారవర్తనం' చూసినవాడు. వారి దౌర్జన్యాలను అణచాలనే పట్టుదల కలవాడయినాడు, 21 మార్లు క్షత్రియులపై దాడి చేసి వధిస్తానని ప్రతిన చేశాడు. అలాగే చేసి కురుక్షేత్రంలో ఐదు మడుగులు త్రవ్వించి రాజుల రక్తంతో నింపి పితృతర్పణ చేశాడు. ఈ నేపథ్యం కారణంగా బ్రాహ్మణులకు తప్ప మరొకరికి విద్య నేర్పకూడదని నిర్ణయించుకొన్నాడు. మహేంద్రనగరంమీద వాసంచేస్తున్న వేళ కర్ణుడు తాను బ్రాహ్మణుడనని బ్రహ్మాస్త్రమునుపదేశించమని ప్రార్థించాడు. కర్ణునివాలకం నచ్చడం, అతని విద్యాతృష్ణను మెచ్చడం లాంటివి కలిసివచ్చాయి. ఆ కారణాలతో పరశు రాముడు కర్ణునికి అస్త్రవిద్యా రహస్యం చెప్పాడు.

ఒకనాడు కర్ణుని తొడపై తలవుంచి పరశురాముడు నిదరపోతున్నాడు. ఆ సమయంలో ఒక 'కీటకం' కర్ణుని తొడక్రింద చేరి తొడను తొలచడం మొదలెట్టింది. గాయం తగిలింది. రక్త ప్రవాహమయింది. కాలు కదిపితే గురువుకు నిద్రాభంగమని కర్ణుడు తలచాడు, బాధకు ఓర్చుకొంటూ అట్టే ఉన్నాడు. రక్తప్రవాహం తడపడంతో పరశురాముడు లేచాడు, గాయం చూచాడు, కర్ణుని తదేకంగా పరిశీలించాడు. మనసులో ఏదో ఒక సంశయం. కర్ణుడు బ్రాహ్మణుడు కాడనిపించింది. ఈ సహనం బ్రాహ్మణులకుండదని తెలిసినవాడు కనుక తన దగ్గర నేర్చుకొన్న అస్త్రవిభవం అవసరమయినవేళ వికలమవుతాయని శపించాడు. ఈ వృత్తాంతాన్ని 'ఏకపక్షంగా' అన్వయించుకొని విమర్శించడం తగదు.

గురుశిష్య సంబంధాలు సున్నితమయినవి. తొలిదశలో ఈ సంబంధం 'కుటుంబ వాతావరణం' లాగే సాగేది. కాని కాలక్రమంలో నేర్పేవారిలోనూ, నేర్చేవారిలోను పరివర్తన వచ్చింది. వీటికి సంబంధించిన కథలు పురాణాలలో అక్కడక్కడ కనబడతాయి.

తెలుగు ప్రబంధాలలో 'మనుచరిత్ర' ఒకటి. ఈ ప్రబంధంలో 'ఇందీవరాక్షుని' వృత్తాంతముంది. అతడు గంధర్వరాజు. ఒకసారి 'బ్రహ్మమిత్రుడనే' ఆయుర్వేదాచార్యుల ఆశ్రమానికి వెళ్ళాడు. ఆతని బోధనకు పరవశించాడు. తానూ ఆయుర్వేదం క్షుణ్ణంగా నేర్చుకోవాలను కొన్నాడు. తనకు ఆ విద్య నేర్పుమని ప్రార్థించాడు. కాని గురువు తిరస్కరించాడు. కారణం అతడు ప్రభువు. నటవిటగాయక గణికామణి కుటిల వచశ్శీధురసపాన ప్రియుడని గురువు ససేమిరా కాదన్నాడు. కాని ఇందీవ రాక్షునికి పట్టుదల పెరిగింది. 'శాంబరి' అనే మాయావిద్యతో అదృశ్యరూపుడై ఆయుర్వేదం నేర్చాడు. అంతవరకు బాగుంది కాని తరువాతి వ్యవహారం మాత్రం బాగాలేదు.

విద్యానంతరం గురువు దగ్గరికి వెళ్ళి

తండ్రీ ! నాకు ననుగ్రహింపగదె వైద్యంబంచుఁ బ్రార్థించినన్
గండ్రల్గా నటులాడి ధికృతుల బోకాల్మంటి వోహో మదిన్
దీంద్రల్ గల్గిన వారికే కరణినేనిన్ విద్య రాకుండునే
గుండ్రా దాచిన పెండ్లి యేమిటికి చిక్కున్ గష్టముష్టింపచా !

అని స్వప్రతాపప్రకటనంతో బ్రహ్మమిత్రుడు ఖంగుతిన్నాడు. 'కటకటా కుటిలాత్మ ! గుటగుటలు గురువుతోనా ' అని పండ్లు పటపట కొరుకుతూ అసురుడవు కమ్మని శపించాడు.

సూర్యవంశజులయిన రాజులలో రఘుమహారాజుకు ఒక ప్రత్యేకత ఉంది. అతడు 'నందినీ' వరపుత్రుడు, దిలీపసుతుడు, విశ్వజిద్యాగం చేసి సమస్తమూ దానం చేసి మట్టిపాత్రలతో కాలం గడుపుతున్న రాజు. అతని దగ్గరికి వరతంతు శిష్యుడయిన కౌత్సుడు గురుదక్షిణార్థం వచ్చాడు.

'వరతంతు' మహర్షి సర్వవిద్యా పారంగతుడు. అతని గురుకులమంతా శోభాయమానం. విద్యాప్రదానం తప్ప ఆ గురువుకు మరో ధ్యాసలేదు. అతనికడ కౌత్సుడు విద్య నేర్చినాడు. విద్యాభ్యాసం పూర్తయింది. శిష్యుడు 'గురుదక్షిణ' ప్రస్తావన చేశాడు. అపుడు గురువు చిరకాలము చేసిన సేవారూపమయిన గురుభక్తియే తనకు గురుదక్షిణ అన్నాడు. కాని కౌత్సుడు పదే పదే ప్రార్థించి బలవంత పెట్టడంతో గురువు కసురుకొన్నాడు. అంతేకాదు ' నా దగ్గర ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం, శిక్ష, వ్యాకరణం ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం, మీమాంస, న్యాయం,పురాణం, ధర్మశాస్త్రమనే 14 విద్యలు నేర్చావు. విద్య కొక కోటి చొప్పున పదునాలుగు కోట్ల బంగారు నాణెములు సమర్పించవలసిందిగా ఆదేశించాడు. ఈ కారణంగా కౌత్సుడు రఘువు దగ్గరికి రావడం జరిగింది. రఘుమహారాజు యొక్క స్థితిని తెలుసుకొన్న కౌత్సుడు వెనుదిరిగిపోతుంటే రఘువు ఆగమన్నాడు.

' నాకు అపకీర్తి అంటగట్టకు ' అని ఆశ్వాసించి అగ్నిగృహంలో ఉండమన్నాడు. కుబేరునిపై దండయాత్రకు సన్నద్ధం చేయుమని సైన్యాధిపతిని ఆదేశించాడు. కుబేరుడు భయపడి తన కోశాగారంలో సువర్ణాన్ని కౌత్సునికి ఇచ్చాడు. పదునాలుగుకోట్ల కంటే అధికమయిన ధనం కౌత్సునికి ఇవ్వగలిగాడు. రఘువంశజుల 'దానవీరానికి' ఈ వృత్తాంతం ఒక సాక్ష్యం. గురుదక్షిణకు ఇష్టపడక సేవలకే పరమతృప్తుడయిన గురుకులానికి ప్రతీక వరతంతు. గురువు సంతృప్తి పడేలా సేవ చేసే శిష్యవర్గానికి కౌత్సుడు మేలుబంతి.

మతాచార్యులలో రామానుజార్యులొకరు. ఆతని తొలిగురువు యాదవప్రకాశులు. వారు విద్యావంతులయినా సద్గుణాలు సున్న. అంతేగాక వారిది కువ్యాఖ్యాన సంప్రదాయం. ఈ విధానం రామానుజులకు నచ్చలేదు. ఒకసారి గురువుగారు 'కప్యాసం పుండరీకమేవ మక్షిణీ ' అనే ఉపనిషద్వాక్యానికి నారాయణుని కన్నులు కోతి పిఱ్ఱను పోలినవి. తామర

రేకులలాగా ఎఱ్ఱనివి అని అర్థం చెప్పారు. ఈ వ్యాఖ్యానానికి రామానుజులు నొచ్చుకొన్నారు. ఈ అర్థం సరికాదేమో అన్నారు. గురువు నీ అభిప్రాయ మేమిటో చెప్పుమన్నారు. శ్రీమన్నారాయణుని నేత్రములు సూర్యకిరణాలచే వికసించిన తెల్లదామరల వలె మనోహరములు అని విశదీకరించారు. ఈ అర్థం బాగున్నా గురువుగారి 'అహం' దెబ్బతిన్నది. చివరకు కాశీయాత్రలో శిష్యుని మట్టు పెట్టదలచారు. అయినా ఆ ప్రయత్నం విఫల మయింది. చివరకు తల్లి హితబోధతో యాదవ ప్రకాశులు రామానుజులకు శిష్యులయ్యారు.

రాజగురువులు :-

ప్రాచీనకాలంలో రాజ్యనిర్వహణలో మంత్రి, సామంత, దండనాయకాదులతో బాటు పురోహితాదులకు కొంత భాగముండేది. కాలక్రమంలో కొందరు రాజగురువులుగా, ఆస్థానగురువులుగా మారారు. చంద్రగుప్తుని సింహాసనంపై ఆసీనుడుగా చేసిన చాణక్యుడు ఆలాంటివాడే. ఆలాగే విజయ నగర సామ్రాజ్యసంస్థాపనలో హరిహర బుక్కరాయలకు విద్యారణ్యులే గురువులయ్యారు. ఇంచుమించు ఈ ఉద్దేశ్యంతోనే సాళ్వనరసింహరాయలు అన్నమాచార్యులను ఎంపిక చేసుకొన్నాడు. చిన్నన్న అన్నమాచార్య చరిత్రలో అన్నమయ్యను సర్వజనులు కొనియాడు తుంటే

సాళువ నరసింహ జనపాలుఁ డొకడు
పరివారవాద్య సంభ్రమము రెట్టింపఁ
గరమొప్పఁ జేకానికలు కొనివచ్చి
యా తాళ్ల పాకాన్నమయ్యకు సాగి
చేతులు మొగిచి మచ్చికఁ బూజ చేసి
శ్రీకృష్ణమన్ననఁ గ్రీడి భూచక్ర
మేక చక్రంబుగా నేలిన పగిది
నాలాగు మీ సహాయము నాకుఁ గలుగ

నేలుదు ధర యెల్ల నేక చక్రముగ
నన్ను మన్నించి విన్నప మాలకించి
క్రన్నన మాయూరి కడ కేగుదెంచి
మాకు బుద్ధులు సెప్పి మా చేయుపూజ
చేకొని మమ్ము రక్షింపరే – అన్నాడని వ్రాశాడు.

ఆలాగే కృష్ణదేవరాయలకు **తాతాచార్యులు, వ్యాసరాయలు** రాజగురువులని ప్రసిద్ధి. రాయలజాతకంలో 'కుహూ' యోగం రాగా రాయలు సింహాసనం త్యజించారని ఆ దుర్ముహూర్తంలో వ్యాసరాయలు ఆ కొద్ది గంటలు విజయనగర సింహాసనం అధిష్ఠించినారని ప్రతీతి. వ్యాసరాయ విజయంలో ఈ వృత్తాంత మున్నది.

ఆలాగే సాళ్వనరసింహరాయనికి కూడా బ్రహ్మహత్యాపాపం చుట్టుముట్టగా మధ్వమతాచార్యులయిన **శ్రీపాదరాయలను** రాయలు అర్థించారట. పలమనేరుకు దగ్గరగల ముళబాగలులోని శ్రీపాదరాయలు తన శిష్యులయిన వ్యాసరాయలను తిరుమలకు పంపి 12 సంవత్సరాల కైంకర్యం చేయించారని కూడా ప్రతీతి. శ్రీపాదరాయష్టకంలో

శ్రీమద్వీర నృసింహరాయనృపతే ర్భూదేవ హత్యావ్యథాం
దూరీకృత్య తదిర్పితోజ్జ్వల మహాసింహాసనే సంస్థితః
శ్రీమత్పూర్వ కవాట నామకపురే సర్వేష్టసిద్ధిప్రదః
శ్రీశ్రీపాదయతీంద్ర శేఖరమణి ర్భూయాద్భహు శ్రేయసే ' – అని ఉంది.

ఆలాగే తంజావూరు పాలకులయిన వారికి కూడా రాజగురువు లుండేవారు. విజయరాఘవనాయకుని గురువు **శతక్రతు శ్రీనివాస తాతాచార్యులు,** వారి ఆశీస్సులతో, అంగీకారంతో విజయరాఘవ నాయకుడు మదనమంజరిని వివాహమాడినాడు.

రాచరికపు వ్యవస్థలో మతాధికారుల ప్రమేయం కేవలం భారతదేశంలోనే కాదు చాల దేశాలలోను కనిపించే సామాన్యాంశం.

దివ్య సందేశం

– శ్రీ శివానంద సరస్వతి స్వాములవారు (ఋషీకేశ్)
దివ్య జీవన సంఘ సంస్థాపకులు

సర్వవ్యాపి సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు, సృష్టికి సాక్షిభూతుడు, తద్వారా ఆనంద క్రీడాతత్పరుడూ అయిన సర్వేశ్వరునకు – నాభక్తి పూర్వక నమోవాకాలు. సర్వేశ్వరుని మధురప్రేమకు పాత్రులైన పుత్రీపుత్ర రత్నములారా !

అధ్యాత్మతత్త్వ జిజ్ఞాసువులైన మీకు ఉపయోగపడే ఈ లఘుసందేశం ద్వారా ఈ శుభసమయములో మీతో ఆత్మసంబంధం కల్గించుకొంటున్న నాకు చాలా సంతోషంగా వున్నది.

పిపీలికాది మనుష్యపర్యంతమైన ప్రతిజీవి పుట్టింది మొదలు సుఖం కొరకే పెనగులాడుతున్నది. మానవుడు ధీశాలి, వివేచనాసమర్థుడు కావడం వల్ల సృష్టిలో ప్రథమగణ్యుడవుతున్నాడు. అతడు తన సామర్థ్యాన్ని తన అభ్యుదయానికి వినియోగించుకోవడం లేదు. తన స్వరూపం పరబ్రహ్మకంటె భిన్నం కాదని తెలియకపోవడం వల్ల అతడు అగాధమైన లోతులలోనికి తన్ను తాను ఈడ్చుకొని పోతున్నాడు. అతడు ధర్మాన్నీ, మహాత్ముల బోధలనూ లక్ష్యపెట్టడం లేదు. ప్రాకృతగుణాలైన సత్త్వరజస్తమస్సులనే పాశబంధాలను విచ్ఛేద మొనర్చుకోవటానికి ప్రయత్నించడం లేదు. చిత్తచాంచల్యం, విషయభోగం – ఇవి తెచ్చి పెట్టే అధోగతినీ, అనర్థాన్నీ పరిగణించకుండా వాటికి లొంగి ప్రమాదభరిత జీవితం గడపుతున్నాడు. తినడం, తిరగడం, పడుకోవడమే అతనికి మతం, ఇతరులు బాధపడుతుంటే అతడు పట్టించుకోడు. తన శక్తికొలది ఇతరులకు సాయపడటంగాని, వారికష్టాలు చూచి కించిత్ అయినా జాలిపడడం గాని లేదు. ఆకస్మాత్తుగా జీవితంలో సంభవించే ఆపదలూ, అపజయాలూ, పతనాలూ, పరాభవాలూ ముమ్మరమై పరమేశ్వరునివైపు అతణ్ణి మళ్లించే వరకూ, అతడు తన స్వార్థాన్నే పోషించుకొంటూ, విషయభోగాలనే అంటిపెట్టుకొని వుంటాడు. భగవంతుడు ప్రసాదించిన బుద్ధితో అతడెంత మాత్రమూ తనకు తాను ఈ విషయాలు యోచన చేయడు:– "లోకంలో బహిర్ముఖచిత్తుడెవడైనా శాంతిసుఖాలు అనుభవిస్తున్నాడా ? సృష్టియొక్క, ముఖ్యంగా మానవజన్మయొక్క లక్ష్యమేమి? ప్రయోజనమేమి ? సుఖదుఃఖాలకూ, జననమరణాలకూ, రోగ దారిద్ర్యాలకూ, దుర్దశలకూ మూలకారణం ఏమి ? వీటి సంపర్కం తొలగించు కొని బయటపడే మార్గం కలదా ? నిత్యసత్య చేతన స్వరూపుడైన భగవంతుడనేవాడు ఉన్నాడా ? శాస్త్రం చెప్పే పునర్జన్మ సిద్ధాంతం నిజమా? నిజమైతే జన్మరాహిత్యాన్ని ఎలా సాధించాలి ? నేను ఎక్కడ నుండి వచ్చాను? ఎక్కడికి పోతాను ? ఈ జన్మలోనే నాకు భగవత్సాక్షాత్కారం కలుగుతుందా? " ఏ క్షణంలో ఇలాంటి సమస్యల పరిష్కారానికై తీవ్రజిజ్ఞాస ఉదయిస్తుందో, ఆ క్షణమే నిజమైన ఆత్మవిచారణ ప్రారంభ మవుతుంది. అంతరంగ పరిణామపూర్వకమైన పురోగతికి ఇదే తొలిమెట్టు.

మనస్సులో మార్పు రాకుంటే జ్ఞానప్రాప్తి మృగ్యం. దుఃఖాలు అనుభవించకుంటే మనస్సు మారేది కల్ల. దుఃఖం లేనిదే ఆనందప్రాప్తి హుళక్కి. ఏ విపత్తు సంభవించినా, అది లక్ష్యసాధనకు సహకరిస్తుంది.

కర్మ – భక్తి – ధ్యాన – జ్ఞానాల ద్వారా భగవత్సాక్షాత్కార మనే లక్ష్యం సాధించండి ! ఈ మార్గాలలో ఒకటిగానీ, కొన్నింటిని గానీ, అన్నింటిని గానీ అభ్యసించి చిత్తశుద్ధి పొంది తుదకు ఆత్మసాయుజ్యం పొందండి !

పురోగమనం సాధించాలంటే ఇతరయోగాలవలె కర్మయోగం కూడా అవసరమే. కర్మ ఎలాంటిదైనా, అది ధర్మబద్ధంగా, కర్తృత్వభోక్తృత్వ

రహితంగా, నిరహంకారంగా, ఆత్మసమర్పణ పూర్వకంగా, సాక్షిభావంతో నిర్వహింపబడితే బంధంగా పరిణమించదు. పరమలక్ష్యప్రాప్తి సాధనకు తక్కిన యోగాలలాగా కర్మయోగం కూడా పావనత్వాన్ని చేకూరుస్తుంది.

అంతేకాక భక్తునిపై భగవదనుగ్రహం వర్షింపజేసే నిజమైన అఖండాత్మార్పణం నుండే సద్భక్తి ప్రారంభ మవుతుంది.

ఆలాగే ప్రాపంచిక విషయవాంఛానిర్మూలనం ద్వారా కలిగే అత్యంతిక మనోలయం మీదనే ధ్యానయోగం ఆధారపడివున్నది.

చివరగా పైమూడు యోగాలకూ పరాకాష్ఠ అయిన జ్ఞానయోగం నిఖిల చేతనాచేతన సృష్టిలోని సర్వజీవరాసులలో నిగూఢంగా వున్న అద్వితీయాత్మను సాక్షాత్కరించుకోవడానికి, పైకి కనిపించే అనేకత్వంలో ఏకత్వాన్ని దర్శించడానికి మానవుణ్ణి ప్రేరేపిస్తుంది.

ఈ నాలుగు మార్గాలూ అవినాభావరూపమైన అన్యోన్యాంతర సంబంధం కలిగి వున్నాయి. ఇందులో ఏదీ తక్కిన మూడింటిని వదలి వుండలేదు. అవి ఒకదాని నొకటి పెనవేసికొన్న సంబంధంతో వున్నాయి. ఈ నాల్గింటినీ కలిపిన యోగసమ్మేళనాన్ని శ్రద్ధతో సాధిస్తే పురోగమనం త్వరితంగా ప్రాప్తమవుతుంది.

ఆదర్శ గురువును ఆశ్రయించండి ! ఆయన బోధలను అనుష్ఠించండి ! స్వార్థరహిత సేవలు చేయండి ! గీతాదిశాస్త్రాలను పఠించండి! సమస్త భూతాలలో ఒకే ఆత్మనూ, ఒకే ఆత్మలో సమస్తభూతాలనూ సందర్శించండి ! ధర్మానుసారంగా ప్రవర్తించండి ! జీవితానికి ఆధారం ధర్మమే. జాతి – మత – వర్ణ – లింగ దేశాది భేదాలనే దుర్గకవాటాన్ని భేదించండి ! అంతటా దివ్యత్వాన్ని చూడండి ! దైవంపై నమ్మకముంచండి ! సర్వేశ్వరుని శరణు పొందండి ! మాయా ప్రపంచాన్ని అతిక్రమించండి ! ఇప్పుడే, ఇక్కడే, ఈ జన్మలోనే బ్రహ్మైక్యం సాధించండి.

వార్తలు

(01). పరమ పూజ్యశ్రీ గురుదేవుల (శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి) 18వ పుణ్యారాధనోత్సవాలు ఏప్రిల్ 21 తేది నుండి ఐదురోజులు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో చాలా విశేషంగా జరిగినవి.

(02). 18-03-2016 తేది శుక్రవారం మాఘశుద్ధ తదియనాడు ఉదయం వృషభలగ్నంలో చిత్తూరుజిల్లా పుత్తూరు మునిసిపాలిటీ – రాచపాళెం గ్రామంలో రామాలయ (నూతన నిర్మాణం) మహాకుంభాభిషేకం పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారిచే చేయబడినది. ఆపై గీతామందిరంలో శ్రీస్వాములవారిచే అనుగ్రహ భాషణం చేయబడినది. పూజ్యశ్రీ శివానందగిరిస్వాములవారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగినది.

(03). సవరణ : ఏప్రిల్ వేదాంతభేరిలోని వార్తలలో ప్రకటించినట్లు దాదాపూర్ కొత్తపల్లి కార్యక్రమంలో మఱియు ఈదర (కృష్ణాజిల్లా) కార్యక్రమంలో అవాంతరములచే మాన్య శ్రీ డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు పాల్గొనలేకపోయారు.

(04). 8-4-2016 తేది ఉగాదినాడు నూతన సంవత్సరాది సందర్భంగా శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో బ్రహ్మశ్రీ మారుతీశర్మగారి ఆధ్వర్యంలో చతుర్వేద పారాయణ జరిగినది. పూజ్యశ్రీ స్వాములవారిచే వేదపండితులకు సన్మానం చేయబడినది. అట్లే ఆ రోజు శ్రీ ధూర్జటి వ్రాసిన శ్రీకాళహస్తి మాహాత్మ్యం తమిళ అనువాద గ్రంథం (శ్రీశుకబ్రహ్మాశ్రమ ప్రచురణ) శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం కార్యనిర్వాహాధికారిణి శ్రీ భ్రమరాంబ గారిచే శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో ఆవిష్కరింపబడినది. దేవస్థాన ట్రస్టుబోర్డు అధ్యక్షులు శ్రీ పి.గురవయ్యానాయుడు గారు, శ్రీకాళహస్తి మునిసిపల్ కమిషనర్ శ్రీరామశర్మ గారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

(05). 10-04-2016 తేది ఆదివారం నాడు సద్గురు సర్వ సేవా ట్రస్టుబోర్డు సమావేశం శ్రీశుకబ్రహ్మాశ్రమంలో జరిగినది. అట్లే అదేరోజు శ్రీ శుకబ్రహ్మాశ్రమ పరిపాలనా సంఘ సమావేశం కూడా జరిగినది.

(06). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో మార్చి నెలలో **ఓ.పి.విభాగంలో 1036 మందికి** కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేశారు. **129 మందికి కంటి పొరలు** తీసి ఆ కళ్లలో లెన్సు అమర్చినారు. ఎనిమిది మందికి యాగ్ లేజర్ చికిత్స చేశారు. మార్చి నెలలో రెండు గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహింపబడినవి. అందు 144 గురికి కంటి పరీక్షలు చేసి ఆపరేషన్‌కు తేదీలు నిర్ణయించారు. .... మందికి యాగ్ లేజర్ చికిత్స చేశారు.



ధ్యానకాలమున మనస్సు ఏకాగ్రముగ నుండనిచో ఆత్మానందమనుభూతము కానేరదు. మనస్సు ఏకాగ్రముగ నుండవలెననిన ఇంద్రియములు బహిర్వ్యాపారమును మాని, శబ్దస్పర్శాది విషయములపై వరుగిడక అంతర్ముఖములు కావలెను. అవి అంతర్ముఖములు కావలెననిన, విషయాదులందు దుఃఖదోషాను దర్శనమును గావింపవలెను.

వైరాగ్యభావనచే ఇంద్రియములు, మనస్సు బాహ్య వ్యాపారములనుండి మఱలి అంతర్ముఖములై - ఆత్మముఖులై ఆత్మాధ్యానమున కెంతయో సహాయకారులు కాగల్గును.

- స్వామి విద్యాప్రకాశానందస్వాములవారు

వేదాంతభేరి

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 49 జూన్ 2016 సంచిక : 06

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు
విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. బంధవిముక్తి - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. ఉపదేశామృతము - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు -10
04. శ్రీరామకృష్ణ బోధామృతం - శ్రీ రామకృష్ణ పరమహంస - 11
05.మనం చేసి తీరాలి - శ్రీ చిన్మయానంద స్వాములవారు - 13
06. ధర్మ శాస్త్రాలు - నేటి సమాజం - డా|| సముద్రాల లక్ష్మణయ్య - 17
07. శ్రీ శుకమహర్షి బోధ - ఎస్.వి.భారతీలక్ష్మి - 21
08. ఆచార్యదేవోభవ - ఆచార్య కె. సర్వోత్తమరావు - 27
09. జ్ఞానసుధ - శ్రీ సర్వభూషణ శివయోగి - 30
10. అక్క మహాదేవి అనుభవామృతం - డా|| శ్రీకరిబసవరాజేన్ద్ర - 32
11. శ్రీ భక్త తుకారాం అభంగవాణి - శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వామి - 34
12. రామ నామ మహిమ - స్వామి చిన్మయానంద - 37
13. యోగా ద్వారా మానసిక ఒత్తిడి నివారణ - సి.మార్కొండయ్య - 40
14. వార్తలు - 42

21-06-2016వ తేది ప్రపంచయోగ దినోత్సవము

ముఖచిత్రం :
పూజ్యశ్రీ చిన్మయానంద స్వాములవారు

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

హృదయ కమల మధ్యే నిర్విశేషం నిరీహం
హరిహర విధివేద్యం యోగిభిర్ధ్యానగమ్యమ్ ।
జననమరణ భీతి భ్రంశి సచ్చిత్స్వరూపం
సకల భువనబీజం బ్రహ్మచైతన్యమీడే ॥

తా ॥ నిర్విశేషుడు (ఏలాంటి విశేషం లేనివాడు), ఏ కోరికలు లేనివాడు, బ్రహ్మవిష్ణు మహేశ్వరుల (త్రిమూర్తుల) చేత తెలియబడువాడు, యోగులచే ధ్యానం ద్వారా చేరబడు వాడు, జనన మరణభయాన్ని పోగొట్టువాడు, సమస్త లోకాలకు బీజభూతుడు సత్, చిత్‌లే స్వరూపంగా గలవాడునగు బ్రహ్మ చైతన్యాన్ని స్తుతించెదను. (మహానిర్వాణ తంత్రం).

హరి హరి హరి యని హరిని భజింపుము ।
హరి హరి హరి యని హరిని పొగడుము ।
హరియని పాడుచు ముక్తకంఠమున
తరియించుము సంసారసాగరము ॥
హరి వసియించును భూజలములలో
హరి వసియించును అనిలానలముల
శ్రీహరి నిలయము సూర్యచంద్రులు
హరి హరి హరియని హరిని భజించుము ॥
అనంత విశ్వము గానుపించును
నిండిన శ్రీహరి నిజరూపముగా
హరి హరి హరియని హరిని భజింపుము
హరి హరి హరి యని హరిని పాడుము.

సంకీర్తన

ఓ కేశవా ! బృందావనాంతర
లతానికుంజ వినోద విహారా ! కేశవా !
హేమాధవా ! ఓ మధుర మనోహర !
మురళీవాలా ! మానసచోరా ॥
నిత్యయవ్వనా హేవ్రజబాలా
కాళీదమనా ! ఆర్తిహరా
కమల లోచనా ! కామితవదనా !
రాధారమణీ హృదయ మనోహర !
బోలో హరినాం హేమన గావో శ్రీహరినామ్
బోలో హరినాం హేమన గావో శ్రీహరినామ్
గంభీరస్వరమే బోలో ప్రభుహరినామ్ ॥



బంధవిముక్తి

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

పూర్వమొకానొక గజమును భయంకరమైన మొసలి బారి నుండి తప్పించి విష్ణు భగవానుడు కాపాడెనని భాగవతమునందు పేర్కొనబడిన విషయము సామాన్యముగ ప్రతివారున్ను తెలిసికొనియే యున్నారు. “ రావే ఈశ్వర ! కావవే వరద ! ” అను ఆ గజేంద్రుని యొక్క హార్దికమైన ప్రార్థనయే దానిని ఘోరమగు ఆ విపత్తు నుండి రక్షించెను. దానియొక్క సత్ప్రయత్నమే అద్దానిని కాపాడెను.

అట్లే జీవుడనుగజము జనన మరణ రూపమైన బురదలో చిక్కుకొని అనాదికాలమునుండి బహుయాతనల నొందుచున్నది. సంసారమను ఊబిలో దిగబడి అందుండి బయటకు రాజాలక గిలగిల తన్నుకొనుచున్నది. చావుపుట్టుకల మధ్య ఊగిసలాడుచున్నది. ఇట్టి గజములు ప్రపంచమున ఒకటికాదు, రెండుకాదు, కోటానుకోట్లు కలవు. అట్టి అగణిత గజేంద్రులను గూర్చిపలికిన ఈ క్రింది వాక్యములు అత్యంత ప్రాముఖ్యత గలిగియున్నవి.

అహంకార మహాలానం
తృష్ణారజ్జుం మనోమదమ్
జన్మజంబాల నిర్మగ్నం
జీవదన్తినముద్ధరేత్

“ అహంకారమను కట్టుకంబమునకు కట్టబడినదియు, తృష్ణయను త్రాటిచే బంధింపబడియున్నదియు, మనస్సను మదధారలు కలదియు, జననమరణములను బురదలో కూరుకొని యున్నదియునగు జీవుడను ఏనుగును బంధనమునండి విడుదల చేసి సముద్ధరింపవలయును.”

శ్రీ వసిష్ఠ మహర్షి శ్రీరామచంద్రున కీ హితవాక్యముల నుప దేశించెను. ‘ నేను దేహమును’ అని తలంచుటయే జీవునకు ఒక గొప్ప

బంధనము. కనుకనే అట్టి దేహాభిమానమును, అహంభావమును ఒక కట్టుకంబముగా వసిష్ఠమహర్షి వర్ణించెను. జీవుడు వాస్తవముగ ఆత్మయేకాని దేహముకాదు, దేహసాక్షియేకాని దేహముకాదు. ఈ తత్త్వమును తెలిసికొనని కారణముచేతనే అనాది కాలమునుండి అతడు జడమైన దేహముతో తాదాత్మ్యము నొందుచు అద్దాని లక్షణములను తనపై ఆరోపించుకొనుచు, పరమదుఃఖమును బొందుచున్నాడు. జననమరణములకు లోనగుచున్నాడు. కాబట్టి తాను ఆత్మయేకాని దేహమెన్నటికిని కాదను జ్ఞానమును సద్గురువుల ద్వారా, సచ్ఛాస్త్రములద్వారా తెలిసికొని జీవుడు అజ్ఞానమను కట్టుకంబము నుండి విడుదల పొందవలయును. ఇదియే గజేంద్రమోక్షముయొక్క అంతరార్థము.

ఇట్టి విముక్తి జీవునకు తనయొక్క సత్ప్రయత్నముల వలననే లభించును. ధైర్యముతో మాయను ఎదొర్కొని, వివేకముచే భోగజాలమును దులిపివైచి, పట్టుదలతో ఇంద్రియములను స్వాధీన పఱచుకొని, అనాది కాలమునుండి తన్నుపడగొట్టుచుండిన వాసనా సమూహమును ఎదిర్చి నిలబడి ఎట్టకేలకు ఆ శత్రువు లందఱిని జయించివేయవలెను. పట్టుపురుగు తనచుట్టు తానే దారము అల్లుకొని బంధనములో చిక్కుకొనునట్లు జీవుడు తన అజాగ్రత వలననే సంసారబంధనమును కొనితెచ్చుకొనినాడు. ఇప్పుడు కండ్లు తెఱచుకొని, తన తప్పిదమును తాను గుర్తెఱింగి వివేకముతో గూడినవాడై తన బంధవిముక్తిని తానే కలుగ జేసుకొనవలయును.

బురదలో కాపురముండుటకు ఏ గజమున్ను ఇచ్ఛగింపదు. కట్టుకంబమున బంధింపబడుటకు ఏ కరీంద్రము వాంఛింపదు. అంకుశము తన నెత్తిపైనుండుటకు ఏ దంతియు కోరుకొనదు. అట్లే వివేకవంతుడగు ఏ మానవుడున్ను జన్మజరాపంకమున నిమగ్నమగుటకు గాని, సుఖదుఃఖములచే ఈడ్వబడుటకుగాని, ప్రకృతికి పరాధీనుడై బ్రతుకుటకుగాని అంగీకరింపడు. ద్వంద్వాతీతమగు తన నిరంజన ఆత్మ స్వరూపమున స్థితిగలిగి నిరతిశయానందమును బడయుటకే వాంఛించును. గజేంద్రుడు తన ప్రయత్నాతిశయము చేతను, భక్తి పారవశ్యముచేతను, మోక్షమును బడసిన

చందమున ప్రతిమానవుడున్ను తన విముక్తి కొఱకై ఈ జన్మయందే గొప్ప అధ్యవసాయమును అవలంబించవలయును. ప్రయత్నశీలురచే సాధింపరానిది ఈ ప్రపంచమున ఎద్దియును ఉండనేరదు. మోక్షము కేవలము గజేంద్రునివరకే పరిమితమై యుండలేదు. సమస్త మానవులును, వెయ్యేల సమస్తభూతకోట్లును అట్టి మోక్షపదమును బడయుటకు పరిపూర్ణమగు అర్హత కలిగియున్నారు. కాబట్టి త్వరపడి సర్వానుకూలము లచే శోభించు ఈ మానవజన్మయందే అట్టి విడుదలను, సాధించివేయుట ఉత్తమము. అట్లు సాధించువారే ధన్యులు, కృతార్థులు.

రాత్రివూట ఎలుకబోను సమీపమునకు ఎలుకవచ్చి అందుంచబడిన భోజ్యపదార్థముయొక్క ఘుమఘుమ వాసనను దూరమునుండియే ఆఘ్రాణించును. ఆ రుచికరపదార్థమును దూరము నుండియే వీక్షించి, దాని యాకర్షణకులోనై, ఆనందడోలికలలో నూగిస లాడుచు పరుగు పరుగున లోన ప్రవేశించును. అట్లు ప్రవేశించి ' ఆహా ! ఈ రోజు ఎంత సుదినము ! ఎటువంటి రుచికర భోజ్యపదార్థము నాకు లభించినది ! ' అని మురిసిపోయి మెల్లగా దాని చెంతకరిగి నోటితో ఆ పదార్థమును కొఱకును. తత్క్షణమే బోనుతలుపు పడిపోవును. ఆ చప్పుడుకు ఎలుక దద్దరిల్లి పోవును. వెంటనే ఆ తినుబండారమును వదలిపెట్టి బోనులో ఇటునటు తిరుగాడును. కాని బయటకు పోవుటకు మార్గము కనబడదు. పారిపోవుటకు దారి ఎచటను దానికి కానరాకుండును. ' నేను బంధనమున తగుల్కొంటిని ' అని పూర్ణముగ నిశ్చయించుకొనిన ఆ ఎలుక బంధవిముక్తికై ప్రయత్నించునేకాని సమీపమున ఉన్నప్పటికిని ఆ భోజ్యపదార్థమును కాంక్షింప కుండును. ఇదియే గొప్ప చమత్కారము.

ఏ పదార్థముకొఱకై కొద్దిక్షణముల క్రిందటనే లెస్సగ పరితపించెనో, దేనిని తన జీవితముయొక్క సర్వస్వముగ భావించెనో, అట్టి రుచికర వస్తువు చెంతనే యున్నప్పటికిని ఆ మూషికము అద్దానిని అపేక్షింపక " ఎట్లు తప్పించు కొందునా " అని మాత్రమే విచారించుచుండును. దీనికి కారణము తాను బంధనమున ఉన్నట్లు తెలిసికొనుటయే.

అట్లే జనులలో పెక్కురు మోక్షము కొఱకై ప్రయత్నము సలుప కుండుటకు కారణమువారు బంధనమున ఉన్నారని తెలిసికొనక యుండుటయే యగును. ‘ మాకు బంధనమేమియును లేదు. మేము సర్వస్వతంత్రులము ’ అని జనులు భావించుచున్నారు. వాస్తవముగ దేహమును ధరించుటయే బంధనము. చావు పుట్టుకలందు తగుల్కొనుటయే బంధనము. దేశ, కాల, క్రియలకు లోబడి యుండుటయే బంధనము. నాలుగుమూరల పొడవుగల ఒక పాంచభౌతిక జడపదార్థము (శరీరము) నందు చిక్కుకొని పోవుట బంధనము కాక మఱియేమి ! కొద్ది సంవత్సరముల పరిమితిగల కాలము (ఆయుస్సు) నకు లోబడియుండుట బంధనముకాక మఱియేమి ? అట్లే తానుచేసిన కర్మకు వశుడై సుఖదుఃఖముల మధ్య ఊగిసలాడుచుండుట బంధనముకాక మఱియేమి ?

వీని నుండి తప్పించుకొనుటకై ప్రయత్నించువాడే మానవుడు. ‘మా’ అనగా అజ్ఞానము. ‘న’ అనగా లేకుండ. ‘వ’ అనగా వర్తించువాడే మానవుడు. బంధవిముక్తికై అనవరత సాధన గావించువాడే మానవుడు. అనిత్యమై, దుఃఖ ప్రదమైనట్టి ఈ లోకమున జన్మించిన ప్రతిప్రాణి నిత్యమై, సుఖప్రదమైనట్టి వస్తువేదియో చక్కగ విచారించి అద్దానిని బడయుటకై నిర్విరామముగ ప్రయత్నించవలెను.

“ అనిత్యమసుఖం లోకమిమం ప్రాప్య భజస్వమామ్ ” అని గీతాచార్యుడు పేర్కొనిన చందమున ఈ ప్రపంచమున జన్మించిన ప్రతి మానవుడు శాశ్వత పరమాత్మ కొఱకై అన్వేషించుట ధర్మము. ఏలయనగా వివేకవంతు డెవడున్ను అనిత్య వస్తువును, దుఃఖకర వస్తువును కాంక్షించడుగదా ! ఈ ప్రపంచమున శాశ్వత వస్తువు ఒక్క పరమాత్మయే. సమస్త ప్రాణి కోట్లయొక్క హృదయాంతరాళమున వెలుగొందు సచ్చిదానంద పరబ్రహ్మమే శాశ్వతవస్తువు. అద్దాని కొఱకై అన్వేషించి, నశ్వరదేహము తాను కాదని నమ్మి, అట్టి శాశ్వత పరమాత్మయే తానని గ్రహించి అహర్నిశములు ఆ స్వరూపమున నెలకొని యుండుటయే బంధవిముక్తి. అదియే శాశ్వతకైవల్యము.

ఉపదేశామృతము

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

మోక్షమునకు మూడు మార్గములు గలవు. వానిలో మొదటిది సాధనానుష్ఠానములతోగూడి ఏకాంతస్థలమున సద్గురుసన్నిధిలో విద్య నభ్యసించియుండుట.

రెండవది – జీవయాత్రకు ధనము లేనిచో సాధ్యమైనంతవరకు పాపము లేని ఒక పనిని జీవనోపాయమునకు చేసుకొని ఉత్తములయిన భార్యాభర్తలు కూడికొని లేక ప్రత్యేకముగాగాని శాస్త్ర విచారములతోడ నిత్యానుష్ఠానముల నభ్యసించియుండుట. ఈ మార్గమే ప్రస్తుత కాలోచితమైనది. ఈ మార్గములలో పోయెడివారికి పతనము కలుగదు. ఒకవేళ దినములు కొంచెమధికమైనను విరోధము లేదు.

మూడవది – సర్వసంగపరిత్యాగియై వివిక్త స్థలములో (తన ప్రయత్నమునకు విరుద్ధంగాని చోట) విరక్తుడై తీవ్రతరమగు ధ్యాననిష్ఠను అనుష్ఠించుట. క్షుద్బాధ జనించినప్పుడు ఎవరైనా అన్నాది వస్తువులేవయినా దెచ్చియిచ్చిన భుజించుట, ఆకలి బాధ సహింపలేని కాలములో చేతిలోగాని, మట్టి పాత్రలోగాని భిక్షాన్నము దీసుకొని భుజించుట. మట్టిపాత్రలు తప్ప ఇతర పాత్రలుండగూడదు. ఇది ముక్తికి సులభ మార్గమయినను శాశ్వతముగ నిలుచుట దుస్తరము. నెరవేర్చెనేని మహాధన్యుడే. సంశయము లేదు.

మనస్సనెడి యంత్రము అతివేగంగా ఊర్ధ్వాధముగా దిరుగు చుండును. దీనియొక్క కృత్యమత్యద్భుతము. ఇది దేహేంద్రియాది జాతి వర్ణముల యొక్క స్మరణ కలిగెనేని అతల వితలపాతాల లోకమున కావల తీసుకొనిపోయి మనుజుని పిశాచిగా నొనర్చును. దేహేంద్రియాది జాతివర్ణాదులకు విలక్షణుడనియు, శుద్ధస్వయం జ్ఞానమే తనయొక్క స్వరూపమనియు స్మరణ చేసినంతమాత్రమే తన్ను భూర్భువాది సత్య లోకముల కావలకందజేసి అమృతత్త్వముగా మార్చి శివత్వము నందజేయును. ఇట్లు మనస్సును స్వాధీనపరచుటయే యోగమని గ్రహించవలయును.

I
All the world is a stage
II
And all the men and women merely players
III
They have their exits and their entrances
IV

శ్రీరామకృష్ణ బోధామృతం

— శ్రీ రామకృష్ణ పరమహంస

భక్తుడు : భగవంతుని కృప ఒకరిపై ఎక్కువగానూ, మరొకరిపై తక్కువగానూ ఎందుకు ఉంటుంది ?

శ్రీరామకృష్ణులు : భగవంతుడు విభురూపంలో అందరిలోనూ నెలకొని ఉన్నాడు. నాలో ఎలా ఉన్నాడో చీమలో కూడా అలాగే ఉన్నాడు.కానీ శక్తి అభివ్యక్తీకరణలో వ్యత్యాసం ఉంది.

వెలుగును ఇస్తున్నాయన్న కారణంగా చంద్రుడు, మిణుగురు పురుగు రెండూ ఒక్కటైపోతాయా ఏమిటి ? ఒంటరిగా నిలబడి నూరుమందిని ఓడించేవాడూ ఉన్నాడు, కేవలం ఒక వ్యక్తిని చూసినంత మాత్రాన్నే భయపడి పారిపోయేవాడూ ఉన్నాడు.

పాండిత్యంలోగానీ, సంగీతంలోగానీ, లెక్చర్లోగానీ, లేక మరిదేన్లోగానీ ఎవరినైనా పలువురు గౌరవిస్తూ ఉంటే అతడిలో భగవంతుని విశేష శక్తి ఉందని నిశ్చయంగా తెలుసుకో అని గీత తెలుపుతోంది.

భగవంతుణ్ణి ప్రేమించడం నేర్చుకో, ఆయన ప్రేమలో లోతుగా మునిగిపో, మీరెందుకు భగవదైశ్వర్యాలను అంత ఎక్కువగా వర్ణిస్తున్నారు? ‘ ఓ భగవంతుడా ! నువ్వు ఆకాశాన్ని సృష్టించావు, మహాసముద్రాలను రూపొందించావు, చంద్రలోకం, సూర్యలోకం, నక్షత్రలోకం అన్నిటినీ సృజించావు ’ – ఇలా చెబుతూ ఉండడంలో మనకు ప్రయోజనం ఏమిటి ?

అందరూ ధనవంతుని తోటను చూసి ఆశ్చర్యపోతారు ‘ ఆహా ఎటువంటి చెట్లు ! ఎటువంటి పువ్వులు ! కొలనులు ! అతిథుల గదులు! గోడలకు అందమైన చిత్తరువులు !’ అనుకొంటూ అబ్బురపడతారు. తోట యజమాని కోసం ఎంతమంది వెదకుతారు ? ఎవరో ఒకరిద్దరు మాత్రమే. మనోవ్యాకులతతో భగవంతుణ్ణి వెదకితే ఆయన దర్శనం కలుగుతుంది, నేను మీతో మాట్లాడుతూ ఉన్నట్లే ఆయనతో మాట్లాడవచ్చు, ముచ్చటించవచ్చు. నిజంగా చెబుతున్నాను, ఆయన్ని దర్శించవచ్చు ! ఇవన్నీ ఎవరికి చెప్పగలను ? ఎవరు నమ్ముతారు ?

శాస్త్రాల ద్వారా భగవంతుని గాంచగలమా ? మహా అయితే, వాటిని చదవడం వల్ల భగవంతుడి అస్తి, అంటే ఉన్నాడనే ఎరుక కలుగవచ్చు, అంతే ! కానీ లోతుగా మునుగనిదే ఆయన దర్శనం ఇవ్వడు. మునిగిన పిదప ఆయనే స్వయంగా తన స్వరూపాన్ని విశదపరచినప్పుడే సంశయాలన్నీ తీరుతాయి. నువ్వు వేయి పుస్తకాలు చదువవచ్చు గాక, వేలాది శ్లోకాలు వల్లింపవచ్చుగాక – కానీ మనోవ్యాకులతతో ఆయనలో మునిగిపోనట్లయితే ఆయన్ను అందుకోలేవు. శుష్క పాండిత్యంతో లోకులను మైమరపించవచ్చును కానీ భగవంతుని మైమరపించలేవు.

శాస్త్రాలు, గ్రంథాలు – వీటితో ఏం సాధించవచ్చు ? భగవంతుని కృప లేకుండా ఏదీ సాధ్యం కాదు. వ్యాకులతతో ఆయన కోసం ప్రార్థించండి. కృప కలిగితే ఆయన దర్శనం లభిస్తుంది. **(శ్రీరామకృష్ణ ప్రభ సౌజన్యంతో)**

వేదాన్తభేరికి ఈక్రింది వారు పోషక చందా పంపినారు

01.	కె.గోపాలకృష్ణరావు (కొత్తనాగులూరు)	–	రూ. 1200/-
02.	డా॥ సి.ఎన్.గుప్త (బెంగుళూరు)	–	రూ. 1200/-
03.	కె.వెంకటాచారి (రిటైర్డ్ టీచర్, నిర్మల్)	–	రూ. 1200/-
04.	ఓ.సి.వీరభాస్కర్ (ప్రొద్దుటూరు)	–	రూ. 1349/-
05.	డా॥ ఎం.ఆర్. శ్రీనివాసులు (బనగానిపల్లి)	–	రూ. 1200/-
06.	జి.హుసేనయ్య (నడింపల్లె)	–	రూ. 1200/-



మనం చేసి తీరాలి

ఆంగ్లమూలం - శ్రీ చిన్మయానంద స్వాములవారు

అనువాదం - కల్లూరి సత్యరామప్రసాద్

(We Must., నుండి)

మంచి ప్రణాళికలను రూపొందించుకోకుండాను, మహత్తర వ్యూహాలను రచించుకోకుండాను, ఉదాత్తమైన భవిష్యద్దృశ్యాలను నిజం చేసుకోకుండాను జీవితాన్ని వ్యర్థం చేసుకుంటే అది నిజంగా విషాదకరమైనది, శూన్యమైనది, దుర్భరమైనదీను. ఆలోచనల, చర్యల సర్వోన్నత శిఖరాల దిశగా మన అనన్య సామాన్యమైన భవిష్యద్దర్శనం మన కళ్లలోకి, చేతులలోనికి, హృదయాలలోనికి చొచ్చుకొనిపోయినప్పుడే మన అంతరాత్మ లోలోపలికి ఉత్సాహం ఆవాహన చేయబడుతుంది.

మన జీవనం పూర్తిగా అంకితమైన, ఉల్లాసభరితమైన పనిగాను, నిఃస్వార్థమైన, నిరపేక్షాపూరితమైన సేవగాను ఎదిగి తీరాలి. ఏ జాతియైనా ఈ రెండు అంశాలను ఉపేక్షిస్తే, ఆ జాతి పేదరికం, అసమ్మతి, పాపం, వ్యాధి, భయం, ఆందోళన, యుద్ధం, భద్రతారాహిత్యం – వీటిని తప్పించుకోలేదు. సోమరులతోను, స్వార్థపరులతోను పీడింపబడుతున్న సమాజం స్వచ్ఛందంగా కోరి ఆహ్వానించుకున్న బాధలు ఇవన్నీ !

నిస్వార్థమైన సేవా దృక్పథంతో ఉల్లాసంగా పనిచేయటమనేదే సర్వోత్కృష్టమైన మతమూ, ఉత్తమ ఆధ్యాత్మిక జీవనమూ కూడా.

ఉల్లాసంగా ఉండటానికి – మనం ఎంచుకున్న దురదృష్టవంతుల సేవ ద్వారా మాధవ సేవ చేస్తున్నామనే నిరంతర స్పృహలో నుండి గడించిన అక్షయమైన ఆనంద కేంద్రం ఒకటి మనలో ఉండాలి. స్వచ్ఛమైన, నిస్వార్థమైన ప్రేమతో చేసిన ప్రతి పనికీ ప్రతిఫలంగా లభించే సంతృప్తి ఉంటుంది. నిజంగా మనం భగవంతుడిని ప్రేమించి, అతడి పేరు మీదుగా కర్మాచరణ చేస్తే మనలో ఎక్కడా స్వార్థం గానీ, అహంకారం గానీ ఉండవు. అహంకారాన్ని వదలిపెట్టటాన్ని అభ్యసించటం అంటే మనలోని

ఆధ్యాత్మిక సామ్రాజ్యానుభూతులకు దగ్గరవటం. అంకితభావం అనేది వ్యక్తికి తనను తానే జీవితంలో సముద్ధరించుకునేందుకు సాధనం.

ప్రాణికోటుల ప్రపంచం అంతకంతకూ పరిణామం చెందుతూ, ఇంకా గొప్పదైన చేతనాస్థితి వైపుకు, ఇంకా విశాలమైన ప్రేమరంగం వైపు, ఇంకా పెద్దదైన ఆనంద శిఖరం వైపు సాగిపోతోంది. ప్రేమపూర్వక సేవా భావనకు, దాతృత్వ నిస్వార్థ విలువలకు బద్ధులైన నిజాయితీపరులు చాలా అపురూపంగా ఉంటారు. వాళ్లకే ఈ పరిణామాత్మకమైన ప్రపంచ పురోగమనంలో పాల్గొని తమ వంతు పనిచేసే సువర్ణావకాశం ఉంటుంది.

ఒక్కొక్కసారి మన కృషి పకడ్బందీగా ప్రణాళిక చేసుకోకుండాను, జాగ్రత్తగా నిర్వహించుకోలేకపోయినదిగాను ఉన్నా సరే, నిస్వార్థ సేవారంగంలో ప్రేమపూర్వకంగా మనం పడే శ్రమ మనకు విజయాన్ని తెచ్చి పెట్టి తీరుతుంది. ముఖ్యమైన విషయం ఏమిటంటే – లక్ష్యంపైన దృఢ నిశ్చయమూ, నవ్వుతూనే సవాళ్లను ఎదుర్కోగల సంయమనమూ, ఉల్లాసకర వ్యక్తిత్వజనితమైన అక్షయ నిశ్చలత్వమూ.

విజయపుటంచుల దాకా వెళ్లిన కొందరు తొందరపడి ఆ సమయంలో తమ పనిని మానివేస్తారు. “ విజయమో – వీర స్వర్గమో ” అన్న దృక్పథం వాళ్లలో మరికొంచెం ఉండి ఉంటే వాళ్లకు సాఫల్యతా శిఖరాలను అందుకోవటాన్ని తిలకించే అదృష్టం కలిగేది. కొందరు అలసటతోను, బడలికతోను, నిస్పృహతోను ఆత్మహత్యా సదృశమైన విధంగా విరమించుకోవటాన్ని ఎంచుకుంటారు. నిజానికి ఆ అవలక్షణాలు స్వార్థం, ఆడంబరం, ఆందోళన, వాంఛ అనే వాటితో నల్లబడి పోయిన హృదయంలోనే పొంచి ఉంటాయి. భగవద్ధ్యానమనే వెలుగులో సేవ చేయనీయకుండా సేవకుడిని భయపెట్టగలిగే దెయ్యాలు ఉండటానికి అవకాశమే లేదు. మనమందరమూ కూడా నిస్పృహ చెందినప్పుడు, అలసట చెందినప్పుడు మనలో మనం ఈ విధంగా అనుకుందాం. “ విజయం సమీపించింది – దానిని నేనే సమీపించి, నా కృషికి ఫలితంగా దానిని పూర్తిగా నేనే స్వీకరిస్తాను”.

అయితే నిజమైన ఉత్సాహంతో మనం పనిచేయాలి. మేస్త్రీ

చావగొడతాడేమోననే భయంతో మాత్రమే గాడిదచాకిరీ చేసే వెట్టివాడివలె ఒక పద్ధతీ, చిత్తశుద్ధీ లేకుండా పనిచేసే వాడిని చూడటం కూడా బాధాకరమే. నిజంగా ఉత్సాహం ఉన్న సేవకుడు తనంతట తానే ప్రణాళిక వేసుకోవటం లోను, దానిని నెరవేర్చటంలోను ఒక పద్ధతిలోకి ఇమిడిపోతాడు. ఇతరులను మెరుగుపరచటానికి కొంచెంసేపు ఆగటానికి బదులు మన దరహసిత వదనాలతోను, చెమటోడ్చే శరీరంతోను ప్రభావితులను చేద్దాం. **ఇలా మనం చేసి తీరాలి.**

తగినంత సమయం దొరకటం లేదని మనం అసంతృప్తిని వెల్లడించవద్దు. ఇలా వెల్లడి చేయటం రూపేణా మనం కాలాన్ని వృథా చేస్తున్నంతసేపూ మనకు పని చేయటానికి, గెలవటానికి, సాధించటానికి సమయం లభించదు. ఊరకనే శరీరావయవాలను కదిలించటం వలననూ, ఎడతెరిపి లేని మానసిక ఆందోళనల వలననూ మనలోని శక్తి వృథా కానీయకుండా జాగ్రత్త పడదాం. ముఖ్యంగా మన మానసిక శక్తులను పదిలపరచుకోవాలి – **ఇలా మనం చేసి తీరాలి.** దానికి నైతికోద్దేశ్యం, సత్ప్రవర్తనతో కూడిన ఉదాత్తాశయం ఒక్కటే సమర్థవంతమైన మార్గం. మన ఆలోచనలు సకారాత్మకంగా ఉండాలి. ప్రేమ, మార్దవం, దయ, కనికరం వంటి సంపూర్ణ సృజనాత్మక భావాలతో మన హృదయాలు నిండాలి.

సద్గుణసంపన్నుడే సమర్థుడైన మానవసేవకుడు కాగలడు. భగవంతుడు తన ఆశీర్వాదగీతాన్ని ప్రజలకు వినిపించే సంగీతపుమెట్టు అతడొక్కడు మాత్రమే ! " పవిత్రంగా ఉండటం " అనేది మన మహత్తరమైన బాధ్యత – ఎక్కువమందికి ప్రయోజనాన్ని చేకూరుస్తూ మనంచేసేది ఫలవంతం కావటానికి ఇదే దోహదం చేస్తుంది.

ఒక ప్రఖ్యాత వేదాంతి చెప్పినట్లు " సద్గుణం మానవులను భూమిపైన కీర్తివంతులుగాను, సమాధులలో తేజోవంతులుగాను, స్వర్గాలలో అమరులుగాను చేస్తుంది ". నిరంతర దోపిడీ, అంతులేని విచ్చలవిడితనం చెలరేగుతున్న ఈ సాంకేతిక యుగంలో కూడా ఈ వాక్యం ఎంత మాత్రం తక్కువకాని నిజం.

ఏదైనా ఒక జట్టు నిజాయితీతో తనపని తాను చేసుకుపోతున్నప్పుడు సహజంగానే బుసలుకొట్టేటటువంటి, ఒక్కొక్కసారి కాటు వేసేటటువంటి మానవ సర్పాలు ఎదురవుతూ ఉంటాయి. సేవకుడు సద్గుణ సామ్రాజ్యంలో విస్తరిస్తూ దానిని లోలోపలకూడా పొందుతూ – తన ఉల్లాసానికి, నిస్వార్థతకు, అంకితభావానికీ గట్టిగా అంటిపెట్టుకుని ఉంటే ఈ విషయం అతడిపైన ఏ విధమైన ప్రభావాన్నీ చూపించలేదు. పైగా అది ఆ సర్పాలనే చంపవచ్చును కూడా. ఇది ఎప్పటికీ అబద్ధం కాని చిత్రమైన సూత్రం. మనం సహనాన్ని కోల్పోకుండా, మౌనంగా, మార్దవం కలిగిన కన్నులతో వాళ్లను నిజమైన కనికరంతో దీవించి వాళ్లకు ఇంకా ఎక్కువ అంకితభావంతోనూ, ప్రేమ పూర్వకంగాను సహాయం చేద్దాం. కాలక్రమేణా వాళ్లపైన విజయం మనదే.

మన జీవితం, దానిలోని విజయాలు ఇతరుల నాలుకలపై ఆడటం అనేది జరగని పని. ఈ నియమాన్ని ఎల్లవేళలా జ్ఞాపకం పెట్టుకోవాలి. గొప్ప మానవ సేవకులందరూ తమ చుట్టూ ఉన్న సమాజంచేత అవమానపరచబడి చిత్రహింసలననుభవించిన వాళ్లే. ఇంతైనా ప్రపంచం అట్టి పనులను, వాటిని చేసినవాళ్లనూకూడా ఎందుకు గుర్తు పెట్టుకుంటోందంటే ఆ తరానికి ఆ మహానుభావులు చేసిన సేవల యశస్సు కారణంగానే ! ఈనాడు సగర్వంగా మనవని చెప్పుకుంటున్న దంతా అట్టి మహానుభావులు సమాజాన్నీ, దానిలోని జనాన్నీ నాగరికంగాను సంస్కృతియుతంగాను మలచిన సేవచలవే. దీవించే విధంగా క్షమించటం, దేవుడిలాగ పనిచేసుకుపోవటం **ఇలా మనం చేసి తీరాలి.**

మనం రేపును రూపొందించే శిల్పులుగాను, రాబోయే తరాలకు నిర్మాతలుగాను ఉందాం. **ఇలా మనం చేసి తీరాలి.**

ఈ విధంగా కర్మలను ఆచరిస్తున్నప్పుడు మనం భగవంతుడితో ఐక్యతను చెందుతాం. ఇంతకంటే అన్వేషికి కావలసిన ఆధ్యాత్మిక జీవనం ఏముంటుంది? దీన్ని గుర్తెరగటం, దైవిక పద్ధతిలో ఆచరించటం – **ఈ రెంటినీ మనం సాధించి తీరాలి. (అరణ్యస్పందన సౌజన్యంతో)**

ధర్మశాస్త్రాలు - నేటి సమాజం

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

ఇక వర్ణవ్యవస్థా విషయం పరిశీలించుదాం. పంచమ వేదమైన మహాభారతం ధర్మశాస్త్రంగా గూడా ప్రసిద్ధి వహించింది. ‘ ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని’ భారతాన్ని గురించి చెప్పారని ఆంధ్ర మహాభారతంలో చెప్పడమయింది.

అట్టి మహాభారతం వర్ణ వ్యవస్థ పుట్టుకను వివరిస్తూ -

ఏకవర్ణమిదం పూర్వం విశ్వమాసీద్యుధిష్ఠిర ।

కర్మ క్రియావిశేషేణ చాతుర్వర్ణ్యం ప్రతిష్ఠితమ్ ॥

అని చెప్పింది. పూర్వం ఈ విశ్వం ఒకే వర్ణం కల్గివుండేది. కాలక్రమంలో కర్మక్రియా విశేషాన్ని బట్టి ఆ ఒక్క వర్ణమే నాలుగు వర్ణాలుగా విభజన పొందింది ” అని భావం. భగవద్గీతలో కూడా గుణకర్మ విభాగాన్ని బట్టి చతుర్వర్ణాల సృష్టి జరిగిందని చెప్పడమయింది. కాని ధర్మశాస్త్రకర్తలు పుట్టుకతోనే వర్ణం ఏర్పడుతుందనీ, ఆ వర్ణ ధర్మాలను అతిక్రమించి ప్రవర్తించరాదనీ శాసిస్తూ ధర్మాలను పేర్కొన్నారు. ఆత్మోన్నతి పొందడానికి అవసరమైన చర్యలు చేపట్టడానికీ, విద్యా తపస్సులు అనుష్ఠించి శ్రేయస్సు పొందడానికీ కొన్ని వర్ణాలకు అధికారం లేదని వ్రాశారు. స్త్రీలకు కూడా వేదాధ్యయనావకాశం లేదన్నారు. తక్కువ వర్ణాలకు చెందినవారనబడేవారికి అల్పాపరాధాలకు గూడా అనల్పశిక్షలు విధిస్తూ శాసనాలు నిబంధించారు. ఈ నిబంధనలు ప్రజలలో ద్విజేతరులకు ఆత్మోన్నతి పొందడానికవసరమైన అవకాశాలను నిరోధించాయి. సమభావం లేని విషమత్వం సమాజంలో పాతుకుపోయింది. ఆనాటి రాజులు నిర్దాక్షిణ్యంగా ఈ శాసనాలను అమలు

పరచారు. కాని నేటి సమాజంలో ఆనాటి ధర్మశాస్త్రాలలోని అనేక శాసనాలు చెల్లని కాసులయ్యాయి. నాటి ధర్మశాస్త్రాలలోని కొన్ని అంశాలను అతి తీవ్రంగా నిరసించవలసిన స్థితి ఏర్పడింది.

ఈ విషమత్వాన్ని కొన్ని వందల సంవత్సరాల క్రితమే ఎదుర్కొన్న వాడు శ్రీ బసవేశ్వరుడు. ఆయనకంటే ముందు బుద్ధదేవుడు గూడా దీనిని సమ్మతించలేదు.

ఇక ఆధునికులలో ఈ విషయంలో తిరుగుబాటు చేసిన వారిలో శ్రీ దయానందసరస్వతి, శ్రీ నారాయణ గురువు, శ్రీ మలయాళస్వామి, అంబేద్కర్ మున్నగువారు ముఖ్యులు.

సమాజంలో ఉన్న ఈ వ్యత్యాసాలను ఒకసారి కొంతమంది జిజ్ఞాసువులు శ్రీనారాయణ గురుని చెంతకు పోయి వివరించారు. వాటి పరిష్కారమెలా సాధ్యమని ప్రశ్నించారు. అప్పుడు ఆ గురువు “ ఈ విషయం నేను గూడా ఆలోచిస్తున్నాను. చాలాకాలం నుండీ దీన్ని గురించిన చింతన నాలో ఉన్నది. ఈ లోకంలో ధర్మమే అనుసరింప దగినది. ఉపదేశింపదగినది. లోక ప్రవర్తకమైనది ధర్మమే. చరాచర ప్రాణికోట్లతో గూడిన ఈ జగత్తులోని చరప్రాణులలో మానవుడు శ్రేష్ఠుడు. వానికి విశేష జ్ఞానమున్నది ” అని చెప్పి జాతిమత దేవతలను గూర్చి ఇలా సిద్ధాంతీకరించారు.

జాతిరేకా మనుష్యాణాం మతమేక మనిందితమ్ ।

దేవ్యోప్యేకః సమాసేన జాతిరాదౌ నిరూప్యతే ॥

మానవుల జాతి ఒక్కటై. నిందకు గురికాని మతమూ ఒక్కటే. దేవుడు గూడా ఒక్కడే. మొదట జాతిని వివరిస్తాను.

‘ మనుష్యాణాం మనుష్యత్వం జాతిర్గోత్వం గవాం యథా ।

“ గోవులలో గోత్వంవలె మనుష్యులలో మనుష్యత్వం అనే జాతి

ఒక్కటై ఉన్నది " ఇలా చెప్పి మరికొన్ని ప్రమాణాలు ఇందుకు నిరూపించి ఇలా అన్నారు.

తస్మాత్సర్వమనుష్యాణాం జాతిరేకా నిరూపితా ।
వేషభాషా దేశ భేదై ర్వికల్పం నానుగచ్ఛతి ॥

అందువల్ల మనుష్యులందరి జాతి ఒక్కటే.' వేషం, భాష, దేశం – వీటి భేదం చేత జాతి భిన్నం కాదు. ఇకమత విషయానికివస్తే

నిరుక్తజాతే రేకత్వాతో మతస్యైకత్వమాస్థితమ్ ।
మతే నానాత్వచింతా తు కేవలం భ్రాంతిజృంభితా ॥

మానవజాతి ఒకటే. కాబట్టి మతంలో గూడ ఏకత్వమే కలదు. మతాలు అనేకాలు అనే భావన భ్రాంతి వల్ల కల్గినదే. ఇక దేవుని విషయంలో

విచిత్ర స్యాస్య జగతః కర్తా వివిధశక్తిమాన్ ।
సర్వేశ్వరః ససర్వజ్ఞ ఏకో దేవ ఇతీరితః ॥

విచిత్రమైన ఈ జగత్తుకు కర్త వివిధ శక్తులుగల సర్వేశ్వరుడే. ఆయన సర్వజ్ఞుడు, ఆ దేవుడొక్కడే అని చెప్పబడినాడు. "

పై శ్లోకాలు ' నారాయణ స్మృతిః ' అన్న గ్రంథంలో ఉన్నవి. ధర్మతత్త్వాన్ని గురించి వివరంగా శ్రీ నారాయణ గురువు అందులో వివరించి వున్నారు. 295 శ్లోకాలు, 10 సర్గలు గల గ్రంథమిది.

ఒక సమయములో ధర్మమని అంగీకరింపబడినది. మరొక సమయములో అర్థరహితమైన ఆచారంగా తోచవచ్చు. ఉదాహరణకు సముద్ర ప్రయాణం పూర్వం అధర్మమని నిషేధింపబడింది. ఇప్పుడు అది జనులకంగీకరింప దగినదేనా ? అస్పృశ్యత ఒకనాడు పాటింపదగిన ఆచారమై యుండినది. ఇప్పుడది శిక్షార్హమైన నేరం కదా ! మన దేశంలోనే ఒక్కొక్కప్పుడు మద్యపానాన్ని నిషేధించడం, ఆ తరువాత ఆ నిషేధాన్ని

తొలగించడం జరుగుతున్న విషయం మనకు తెలిసినదే.

ఇట్టి స్థితిలో ధర్మాధర్మాల స్వరూపాన్ని ఎలా నిర్వచించగలము ? ఈ క్రింది శ్లోకాన్ని పరిశీలించండి !

శ్రుతిశ్చ భిన్నా స్మృతయశ్చ భిన్నా
నైకో ఋషిర్యస్య వచః ప్రమాణమ్ ।
ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం
మహాజనో యేన గతస్స పంథాః ॥

దీని భావమిది – వేదం తీరు వేరు, స్మృతుల తీరువేరు. పోనీ, ఋషి వచనాలను ప్రమాణంగా స్వీకరించుదాం అనుకుంటే ఋషి ఒక్కడు కాదు. అనేకులు ఋషులు అనేక విధాల ధర్మాలను చెప్పియున్నారు. ఒక దానితో ఒకటి పొంతన లేని మాటలవి. అందువల్ల ధర్మతత్త్వం గుహలో జొరబడి నిగూఢంగా ఉన్నది. ధర్మశాస్త్రాలను చూచి ధర్మాన్ని నిర్ణయించలేము. ఇట్టి స్థితిలో – ధర్మాచరణకు మార్గమేది ?

ఇందుకు ఉపాయమిది – మీ కాలంలో ఎవరు మహాత్ములుగా, పవిత్ర హృదయులుగా, స్వార్థం లేని వారుగా ప్రసిద్ధులైయున్నారో, వారు నడిచిన బాటలో నడవడమే మీ కర్తవ్యం – అని పై శ్లోకం ఉపదేశిస్తున్నది. ఇది యుక్తి యుక్తంగా తోస్తున్నది. ధర్మశాస్త్రాలను బట్టి ధర్మస్వరూపాన్ని గ్రహించలేని పరిస్థితిలో మహాపురుషుల ఆచరణను ప్రమాణంగా గ్రహించవచ్చు. **(సశేషం)**

నామ సప్తాహము

జూన్ 9వ తేది (09-06-2016) గురువారం నుండి 15-06-2016 వరకు వారం రోజులు శ్రీ అవధూతేంద్ర భక్తమండలి జె.పంగులూరు శాఖ వారిచే శ్రీరాం గారి ఆధ్వర్యంలో శ్రీ శుకబ్రహ్మాశ్రమం, శ్రీకాళహస్తిలో అఖండ నామసప్తాహం జరుపబడును. అందరూ ఆహ్వానితులే.

శ్రీ శుక మహర్షి బోధ

- ఎన్.వి. భారతీలక్ష్మి, (భీమవరం)

పరమాత్మచే సృష్టింపబడిన 84 లక్షల జీవరాసులలో మానవజన్మ అత్యంత ఉత్కృష్టమైనది. మానవులు తమ జన్మ యొక్క ఔన్నత్యమును తెలిసికొనలేక తామెందుకు జన్మించితిమో, ఏమి చేయవలయునో, ఏమి చేయుచున్నామో, అను విచారణ లేక విషయ సుఖముల యందు చిక్కుకొని సచ్చిదానంద స్వరూపుడును, జగన్నాటక సూత్రధారియునైన పరమేశ్వరునొక్క మారైనను స్మరియింపక, మోక్షమార్గమునకు దూరమై జనన మరణ చక్రమున బడి తిరుగుచున్నారు. అట్టి మానవుల నుద్ధరించుటకై మహాత్ములు అనేకములైన ఉదాహరణల ద్వారా శాశ్వత వ్యాపక చైతన్యమును గురించి బోధించిరి. అట్టి మహాత్ములలో శుకమహర్షి అగ్రగణ్యులు. వారి అద్వైత తత్త్వబోధ ముముక్షువులకు మార్గదర్శకము కాగలదు.

శుకమహర్షి సూత్రకారుడగు వేదవ్యాసుని కుమారుడు. శాస్త్రము మోక్షగామికి శుకమార్గమనియు, వామదేవ మార్గమనియు రెండు మార్గములు నిర్దేశించినది. శుకమార్గమును విహంగ మార్గమనియు, వామదేవ మార్గమును పిపీలికా మార్గమనియు అందురు. విహంగమనగా పక్షి. ఒక చెట్టుపై నుండి మరొక చెట్టుపైకి సులువుగా యెగిరి పోగలదు. అలాగే ఉత్తమాధికారియగు సాధకుడు ఐహిక విషయములను త్యజించి రాగద్వేషరహితుడై మనోవృత్తులను మరల్చి సద్గురువు ద్వారా మహావాక్యబోధ వలన, తత్త్వ విచారణ వలన బ్రహ్మాకారవృత్తి గలిగి పురుషుడసంగ చిద్రూపుడనియు, స్వస్వరూపుడనియు, తెలిసికొని అపరోక్ష జ్ఞానమును పొంది ఆ జన్మ యందే తరించగలడు. పిపీలికమనగా

చీమ. అది ఒక చెట్టు పై నుండి క్రిందికి దిగి నేలపై ప్రాకుతూ మరొక చెట్టుపైకి యెక్కుతుంది. అలాగే, మంద మధ్యమాధికారులు భక్తి ఉపాసనాదులనే మజిలీలను దాటుకొని చివరి జన్మలో జ్ఞానం సంపాదించి ముక్తినొందెదరు. దీనిని క్రమముక్తి అందురు. వామదేవుడు అనేక ప్రతి బంధకములను తొలగించుకొని చివరి జన్మలో మాతృగర్భంలోనే స్వస్వరూపానుభూతి పొంది ముక్తుడయాడు. కనుక వామదేవ మార్గమునకు పిపీలికా మార్గమని పేరు. పుట్టుకతోనే విరాగియైనందున శుకమహర్షి జీవన్ముక్తుడయాడు. కనుక శుకమార్గమును విహంగ మార్గమందురు.

సచ్చిదానంద పరబ్రహ్మము, మాయా కల్పితమైన నామ రూపాత్మక జగత్తు క్షీరనీరములవలె ఏకాకారమై ఉన్నది. జగద్బ్రహ్మలే ఆత్మానాత్మలు. హంసనీరమును విడచి క్షీరమును గ్రహించునట్లే ముముక్షువు అనాత్మను (జగద్భావమును) విడచి ఆత్మస్వరూపమగు పరబ్రహ్మము తానని గ్రహించును. క్షీరంనీరు విభాగకుడు పక్షిరాజగు హంస. ఆత్మానాత్మల విభాగకుడగు పరమహంస శుకమహర్షి, ' నాన్యత్పశ్యతి, నాన్యచ్ఛృణోతి, నాన్యద్విజానాతి స భూమా '. ఇతరమును చూడక, వినక, యెఱుగక నుండు స్థితిని (భూమా) అన్నిటికన్నా ఉత్కృష్టమైన అద్వితీయమైన తత్త్వమనియు, పరిపూర్ణమైన చైతన్యమనియు బ్రహ్మానందమనియు అందురు. అట్టి సంకల్పరహిత నిశ్చల సమాధియందు స్థితుడై సహజ జ్ఞానానంద సుధారాణియనే బ్రహ్మానంద సాగరంలో మునకలు వేయుచు రమించుచుండు జీవన్ముక్తుడు శుకమహర్షి. అట్టి శుకమహర్షి బోధచే పరీక్షితుయొక్క సందేహములన్నీ పటాపంచలై జీవన్ముక్తుడయాడు. శరీర పతనానంతరం విదేహ ముక్తిని పొంది తరించాడు.

అస్తి, భాతి, ప్రియం అనగా సత్, చిత్, ఆనందం బ్రహ్మము

యొక్క లక్షణములు. ఆ సచ్చిదానంద పరబ్రహ్మమే ఆత్మస్వరూపం. పంచదారకున్న తెల్లదనము, మృదుత్వము, మాధుర్యము విడదీయుటకు వీలులేని యేక పదార్థముగా నున్నట్లే సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపము ఏకము, అవ్యక్తము, అవిభాజ్యము, చైతన్య స్వరూపము. ' ఏకమేవా ద్వితీయం బ్రహ్మ '. సజాతీయ, విజాతీయ స్వగత భేద రహితమైన పరిపూర్ణ వస్తువే పరబ్రహ్మము. (సజాతీయ విజాతీయ స్వగత భేదము లనగా, తోటలోని ఒక వృక్షమునకు మిగిలిన వృక్షములు సజాతీయములు. పరమాత్మ విషయంలో మఱొక ఆత్మ లేనందున సజాతీయ భేదం లేదు. సజాతీయం కానిది విజాతీయం. మానవులు, జంతువులు, వృక్షములు మొదలైన వేఱు వేఱు జాతులకు చెందిన వాటిని విజాతీయము లందురు. అఖండ చైతన్య స్వరూపుడగు పరమాత్మకు విజాతీయ భేదం లేదు. ఒకే వృక్షమునకు కొమ్మలు, రెమ్మలు, ఆకులు మొదలైన అనేక భాగములుండును. దానికి స్వగత భేదమని పేరు. అనంత వ్యాపక చైతన్య స్వరూపుడగు పరమాత్మకు స్వగత భేదం కూడ లేదు.)

అట్టి పరబ్రహ్మము నందు మూలప్రకృతి – యెండమావుల యందు జలము, శుక్తియందు రజతము, స్థాణువునందు పురుషుడు రజ్జువునందు సర్పము అవినాభావముగా తోచునట్లు నామ రూపాత్మకమైన జగత్తుగా ఆవిర్భవించినది. ఆ మూల ప్రకృతియే మాయ, అవిద్యయని చెప్పబడుచున్నది.

స్వప్నము, గంధర్వనగరము మొదలగు వానివలె మాయా కార్యమగు ప్రపంచము అసదాత్మకమని శ్రుతి చెప్పుచున్నది. జాగ్రత్స్వప్న ప్రపంచములు అసత్యములే. సుషుప్తియందు జాగ్రత్స్వప్నములు లేవు. కాబట్టి మూడవస్థలలోను ప్రపంచము సత్యము కాదు. వర్తమానము నందు ఘటముగా తోచినప్పటికి ఆద్యంతముల యందు మట్టియే శేషించును. " ఆదావంతే చ యన్నాస్తి వర్తమానేపి తత్తథా " ఆద్యంతము

లందు లేనిది వర్తమానము నందు కూడ లేనిదేయగును. అవిద్యాప్రభావ జనిత విషయములు యింద్రియ గోచరమగు సమయమున మాత్రము ఉన్నట్లు తోచుచున్నది. అదియే మాయాలక్షణము. అద్వైత సిద్ధాంతము నందు మాయ అనగా లేనిది అని తెలిసికొనవలెను.

బాల్య యౌవనాది అవస్థలు ఆయా అవస్థలలో నున్న జీవునకే సత్యము కాని అవస్థా విశేషములకు సత్యము కాదు. యౌవనము నందు బాల్యము, వృద్ధావస్థయందు యౌవన భావము వర్తించుట లేదు. మరణించిన పితరుడు తిరిగి వచ్చుట లేదు. గతించిన దినము మరల వచ్చుట లేదు. బాల్య, యౌవన, వార్ధక్యములు కాలాన్ననుసరించి గతించు చున్నవి. కాబట్టి వార్ధక్యము తరువాత మరణమునకు సిద్ధముగా నుండవలెను.

" మాయా మాత్రమిదం ద్వైతం అద్వైతం పరమార్థతా". ద్వైతముగా తోచుచున్న దృశ్య ప్రపంచము మాయా మాత్రమే. కాని సత్యము కాదు. అద్వైతమే పరమార్థమని శ్రుతులు ప్రతిపాదించుచున్నవి. " మాయా కార్యాదికం నాస్తి, మాయానాస్తి జగన్నహి, నేహనానాస్తి కించన, న నిరోధో న చోత్పత్తిః, నచబద్ధో న చ సాధకః, న ముముక్షుః న వైముక్తః ఇత్యేషా పరమార్థతా ". మాయా కార్యాదులు లేవు మాయ లేదు, జగత్తు లేదు, నానాత్వము లేదు, నిరోధము లేదు, ఉత్పత్తి లేదు, బద్ధము లేదు, సాధనము లేదు, ముముక్షువు లేదు– అని శ్రుతులు అద్వైతమునే నిశ్చయించు చున్నవి.

శూన్యమగు ఆకాశము నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలం, జలం నుండి పృథ్వి ఉత్పన్నమైనది. శూన్యమగు ఆకాశమొక ప్రదేశము వలెను. మిణుగురు పురుగు అగ్నివలెను. భ్రాన్తి వలన కనబడినప్పటికి ఆకాశము ప్రదేశము కాదు. మిణుగురు పురుగు

అగ్ని కాదు. అచింత్యమగు విచిత్ర సృష్టి చేయుట మాయా స్వభావము.

అవ్యక్తమైన ఆ పరబ్రహ్మము త్రిగుణాత్మకయగు ప్రకృతితో కలసి నామ రూపాదులుగా వ్యక్తమై షడ్వికార యుక్తమగు సంసార వృక్షమైనది. (షడ్వికారములనగా - ఉత్పత్తి , అస్తి, వృద్ధి, విపరిణమతి, క్షీణతి, నశ్యతి) వృక్షమనే కార్యమునకు బీజము కారణమై పృథ్వి అధిష్ఠానమైనట్లే అనాత్మయనే ప్రపంచ కార్యమునకు సంసార వృక్షమునకు అవ్యక్తము కారణమై, బ్రహ్మము అధిష్ఠానమైనది. వృక్ష బీజములతో పృథ్వికి సంబంధము లేనట్లే మాయా కార్యమగు నామ రూపాత్మకమైన ప్రపంచముతో బ్రహ్మమునకు సంబంధము లేదు. కాబట్టి దేహేంద్రియాది అవ్యక్త పర్యంతము అనాత్మయని చెప్పబడుచున్నది. బీజమునందు వ్యాపకత్వము మిళితమై యున్నట్లే ఆత్మయందు అనాత్మ మిళితమై యున్నది. బీజమునకు మట్టి అధిష్ఠానమైనట్లే అనాత్మకు పురుషుడు అధిష్ఠానము. పురుషుడనగా సర్వత్రా వ్యాపించిన ఈశ్వర చైతన్యం. ప్రకృతి, అవ్యక్తము, మాయ, అవిద్య మొదలైనవి అనాత్మకు పర్యాయపదములు.

పాంచభౌతిక శరీరము సంసార వృక్షమునకు బీజము. హర్షా మర్షాది (సుఖదుఃఖాది) అవస్థలకు కోశము. ఆశకు వశమైన చిత్తము శరీరమనే వృక్షమునకు మూలము. సమస్త జీవులు పిండోత్పత్తి సమయము నందే వాసనారూపమగు మోహమును పొందుచున్నవి. పూర్వవాసనలు పరజన్మయందు క్రియారూపమై సర్వ దుఃఖములను కారణమగుచున్నవి. వాసన యనగా ధృడేచ్ఛ, పూర్వ కర్మఫల భోగప్రేరకము. అనగా, పూర్వానుభవ దుఃఖములను గురించి, రాబోవు కష్టములను గురించి ఆలోచింపక ధృఢ వాంఛాబద్ధుడై విషయముల వెంట పడుటను వాసన యందురు. వర్తమాన కర్మలయందు రాగద్వేషములనే వాసనా బీజములు అంతఃకరణ ఫలకమునందు వెదజల్లబడి రాబోవు జన్మలకు దేహారంభాం కురములుగా మార్పు చెంది, ప్రారబ్ధ కర్మయనే జలముచే తడుపబడి,

సుఖ దుఃఖములనే ఫలముల నిచ్చుచుండును. కర్మ వలన జన్మ, అనుభవ జన్య క్రియల యందు ప్రియా ప్రియములు (ఇష్టాయిష్టములు), వాని నిమిత్తములగు ధర్మాధర్మములు (పుణ్య పాపములు), వాని ఫలితముగా పరజన్మ ప్రాప్తి గలుగుచున్నది. ఈ విధముగ రాగవంతునకు జన్మ పరంపర తప్పదు. వృక్షమునకు ప్రాప్తించిన బీజములు మరల మొలకెత్తుటకు కారణమైనట్లే పూర్వవాసనలు పరజన్మయందు క్రియారూపమై సమస్త దుఃఖములకు కారణమగు చున్నవి. కనుక జీవులకు వాసనాజనిత భ్రాంతిరూపమైన సంసారసాగరం దాటుట కష్టతరమగు చున్నది. వాసనా ప్రవాహము శుభాశుభకర్మలనే కాలువల గుండా ప్రవహించు చుండును. స్వప్రయత్నముచే చిత్తమును అశుభముల నుండి శుభముల వైపునకు త్రిప్పుటకు అభ్యాసము చేయవలెను. అట్టి అభ్యాసము వలన సద్వాసనలు గలిగి ఉత్తర జన్మయందు బ్రహ్మ భావనకు ఉపయోగపడును. **(సశేషము)**

సద్గురు సర్వ సేవాట్రస్టుకు ఈక్రిందివారు పైకం పంపినారు

01. తీగల నిర్మలాదేవి (శ్రీకాళహస్తి)- రూ. 22,000/-
(భర్త తీగల కోటేశ్వరరావు పేర భిక్షకు నిధి)

02. డి.వి.ఎస్.వి. సుందరరావు (సౌదీఅరేబియా) - రూ.10,000/-

03. దువ్వూరు అనసూయమ్మ (వెదుళ్ల చెరువు) - రూ.10,000/-

04. వేగిరాజు సత్యనారాయణరాజు - రూ.50,000/-
(వివేకానందనగర్, హైద్రాబాద్), వడ్డీతో స్వామి ఆరాధన రోజు అన్నదానం జరుపుటకు నిధి

05.కె.కె.ఎస్. రాజు &కోమలి గార్లు(కాళీవనాశ్రమం)-రూ.20,000/-
(ప్రతి అక్టోబర్ 31వ తేది కొండా శేషమరాజు పేర వడ్డీతో అన్నదానం జరుపుటకు నిధి).

ఆచార్య దేవో భవ

–ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

కవితా గురువులు – ఆధ్యాత్మిక గురువులు

తెలుగుకవులు తమ కావ్యాలలో ‘ అవతారికాభాగంలో ’ ఇష్టదేవతాస్తవంతో బాటు, సుకవిస్తుతి, కుకవినిందలతోబాటు తమ గురించి కూడా చెప్పుకొంటారు. ఆ అవతారికాభాగంలో కొందరు తమ కవితా గురువుల్ని ఆలాగే ఆధ్యాత్మిక గురువుల్ని స్మరించినవారున్నారు. కవితకు సంబంధించినంతవరకు చాలవరకు తండ్రులే కవితాగురువులు.

నన్నిచోడుడు కవితాగురువును, ఆధ్యాత్మికగురువును అభేదరూపంలో తన కుమారసంభవంలో వినుతించాడు.

గురువునకిష్టదైవమునకుం బతికిన్ గృతి ఁజెప్పి పుణ్యమున్
వరమును దేజమున్ బడయవచ్చు జగంబుల నిశ్చయంబు మ
ద్గురువును నిష్టదైవమును గూర్చు నిజేశుఁడు దాన నాకుఁగా
కొరులకు నిట్లు సేకురునె యొక్కట లాభము లెన్నియన్నియున్

మరి పాల్కురికి సోమనకవి కేమో కరస్థలి విశ్వనాథయ్య, కట్టకూరి పోతి దేవరలు కవితా గురువులయితే, దీక్షాగురువు గురులింగము.

ఎఱ్ఱన శంకరస్వామి సంయమీశ్వర పాదుకధ్యానపరుడు. నంది మల్లన ఘంట సింగయ్యలకు ‘ అఘోరశివగురులు’. దూబగుంట నారాణ కవికేమో నాగనార్యుడనే మహేశ్వరుడు. అల్లసాని పెద్దనకు ఆధ్యాత్మిక గురువు శఠకోపయతి. తెనాలి రామకృష్ణకవికేమో భట్టరు చిక్కాచార్యులు. రామలింగ కవికేమో పాలగుమ్మి ఏలేశ్వరుడు. సంకుసాల నృసింహకవికి భట్టపరాశరులు. యజ్ఞనారాయణ దీక్షితులకు తంజావూరు నేలిన రఘునాథనాయకుడే కవితాగురువు.

దాక్షిణాత్యయుగంలో ప్రసిద్ధి పడసిన కవయిత్రులు కృష్ణమాంబ, రామభద్రాంబలు. వీరిద్దరు చెంగల్వకాళకవి శిష్యులు. వీరిరువురి గొప్పతనాన్ని ప్రభువయిన విజయరాఘవనాయకుడు ప్రశంసించడం విశేషం. గురువు శిష్యురాండ్రను ఎంతగా తర్ఫీదు చేశాడో అనడానికి రాజగోపాలవిలాస పద్యాలే సాక్ష్యాలు.

అయ్యదినములు రామభద్రామ్మవారు
నేఁడు కృష్ణాజి కవితల నేర్పుమెఱసి
వినికి సేయుట లెల్ల మీ ఘనత కాదె
కవివినుతచర్య చెంగల్వ కాళనార్య ! ఆలాగే
ఇరువదాఱును ఛందంబు లెఱిఁగి యిట్లు
కవితఁ జెప్పిన వారలీ భువినిఁ గలరె లాంటివి గుర్తించదగ్గవి.

ఆలాగే వెంగమాంబ తనకు గురువయిన రూపావతారం సుబ్రహ్మణ్య శాస్త్రిని రాజయోగామృతసారంలో

ఇది సోమనాథ విశ్వేశ్వరస్వామి
పద పద్మ భక్త సుబ్రహ్మణ్య యోగి
చరణాంబుజాత షట్చరణాయమాన
పరిపూర్ణ నిత్య సద్భావనిమగ్న
మానసాంబుజ వేంగమాంబికా రచిత – అని, భాగవతంలో
పరిపూర్ణ నిర్గుణ బ్రహ్మమై నిలిచి
ధరణిపై బండితోత్తముడన వెలసి
వరకృపతోడ మద్వరదుడై నన్ను
పాలింపుచున్న సుబ్రహ్మణ్య గురుని
శ్రీ లలితాంఘ్రి రాజీవ యుగ్మమును
హృదయపద్మంబున దిరవుగానెంచి – అని కొనియాడింది.

ఆధునికయుగంలో ఎందరో లబ్ధ ప్రతిష్ఠులు కూడా చెల్లపిళ్లవారిని

తమ గురువులుగా చెప్పుకొని కృతజ్ఞత పాటించిన వారే.

సంగీతగురువులు

కవితాప్రపంచంలో కంటె సంగీతసామ్రాజ్యంలో ' గురుపరంపరా ప్రభావం ' ఈనాటికి నిలిచివుంది. వాగ్గేయకారులలో చాలమందికి ఆధ్యాత్మిక గురువు, సంగీత గురువులుండడం విశేషం.

కృష్ణకర్ణామృతంలోని ' చింతామణిర్జయతి సోమగిరి ర్గురుర్మే శిక్షా గురుశ్చ భగవాన్ శిఖిపించమౌళిః 'అనే శ్లోకం లీలాశుకుడు 'సోమగిరి' గురువును స్మరించాడని కొందరంటారు. ఆ సోమగిరి చింతామణి మంత్రాన్ని లీలాశుకునికి బోధించాడని కూడా ఒక ఊహ.

తాళ్లపాక పెదతిరుమలయ్య, చిన తిరుమలయ్యలకు తాళ్లపాక అన్నమాచార్యులే ఆధ్యాత్మిక గురువులు, సంగీతసాహిత్య గురువులు. తెలుగు నాటి సుప్రసిద్ధమయిన 'తరంగాల' రచయిత నారాయణ తీర్థులు. వీరి గురువులు శివరామానందతీర్థులని, రామానందతీర్థులని అంటారు. త్యాగయ్యకు శొంఠి వెంకటరమణయ్య సంగీతగురువయితే రామకృష్ణానంద స్వామి ఆధ్యాత్మిక గురువు, అంతేకాదు నారదగురువర్యుడు కూడా. అందుకే త్యాగయ్య ' రాజిల్లు వీణ కల్గు గురురాయ, శ్రీనారదనాద సరసీరుహభృంగ, వరనారదనారాయణ ' అనే కృతులలో స్మరించాడు. చివరిదశలో 'బ్రహ్మ నందేంద్రస్వామి ' సన్యాస దీక్ష ఇచ్చిన గురువు. ముత్తుస్వామి దీక్షితర్‌కు ఆధ్యాత్మిక గురువు చిదంబర నాథయోగి. ప్రతిభా వ్యుత్పత్తుల తోబాటు ఉపాసకులు కూడా కావడం విశేషం.

ఆధునికులలో ప్రసిద్ధులయిన మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారు పారుపల్లి రామకృష్ణయ్య పంతుల శిష్యులు. పారుపల్లి వారి గురువులో సుసర్ల దక్షిణామూర్తి. వారి గురువులు శరభశాస్త్రులు. పట్నం సుబ్రహ్మణ్యయ్య గారికి సంగీత గురువయిన ఆకుమడల వేంకట సుబ్బయ్యా గారు. వీరు త్యాగరాజు శిష్యులు. మంగళంపల్లి గురు పరంపరా సోపానం శ్లాఘ్య చరితం.

జ్ఞాన సుధ

మూలం

శ్రీ సర్వభూషణ శివయోగి వారు

అనువాదం :

పూజశ్రీ శంకరానందగిరి స్వాములవారు,

ఉమామహేశ్వర పీఠాధిపతులు

అవ : బంధమోక్షములు రెండు బుద్ధికే కాని ఆత్మకు లేవని దృష్టాంత పూర్వకముగా తెలుపుచున్నారు.

భ్రాంత్యభ్రాంత్యో రేవ పాంథస్య యద్వత్
చోరత్వారోపాపవాదౌ న శంకోః,
బుద్ధే ర్మోహామోహయో ర్బంధమోక్షౌ
స్యాతాం తద్వ న్నాత్మన స్సత్య మేతత్. 31

యద్వత్ = ఎట్లు, భ్రాంతి అభ్రాంత్యోః = భ్రమా భ్రమల వలని, చోరత్వారోపాపవాదౌ = " దొంగ" యనెడి అధ్యాసము, మ్రోడు అనెడి అపవాదము ఈ రెండు, పాంథస్య ఏవ = మార్గస్థునకే కాని, నశంకోః = స్థాణువునకు (మ్రోడుకు) నకు లేవో, తద్వత్ = అటువలె, మోహామో హయోః = జ్ఞానాజ్ఞానములవలని, బంధమోక్షౌ = బంధము మోక్షము అనెడి యీ రెండు, బుద్ధేః = బుద్ధికే, స్యాతాం = ఉండును గాని, న ఆత్మనః = ప్రత్యగాత్మకు లేవు. ఏతత్ = ఇది, సత్యం = యథార్థము.

బంధమోక్షములను ఆత్మకు చెప్పిన ఆత్మ సవికారమగును. బుద్ధికి చెప్పెదమన్న అది జడము. కాబట్టి స్థాణువునందు భ్రమచే కనిపించు చోరభావముగాని, తదభావముగాని పథికుని దృష్టియందే ఉన్నవని చెప్పవలసి యున్నది గాని, స్థాణువునకు చెప్పరాదు. అటువలె ఆత్మయందు బంధ మున్నదని, లేదని యీ రెండుభావములు ఆభాసయుక్తమగు బుద్ధికి చెప్పవలసినదే కాని, ఆత్మకు చెప్పరాదు. నేను బద్ధుడ ననెడి భావము, నేను ముక్తుడననెడి భావము బుద్ధియందే కలవు గాని, ఆత్మయందు లేవని సిద్ధాంతము. ఇది మహావాక్య విచారణ గల చతుర్థాధ్యాయము

(సమాప్తము)

మోక్షసాధన విచారాత్మక - పంచమాధ్యాయము

అవ : అజ్ఞానము వలన కలిగిన బంధము జ్ఞానమువలననే నివర్తింపవలె

గాని అన్యమైన కర్మోపాసనలచే నివర్తింపనేరదని దృష్టాంతపూర్వకముగా చెప్పుచున్నారు.

యథా నైతి నాశం వటీసర్పభీతిః
పరీక్షాం వినా మంత్రతంత్రై ర్జిఘాంసోః
తథా నైతి నాశం మృషా జీవభావః
ప్రబోధం వినా కర్మధర్మై ర్ముముక్షోః.

వటీ= త్రాటియందు అధ్యస్థమైన, సర్పభీతిః = సర్పము యొక్క భయము, జిఘాంసోః ఆ సర్పమును జంపు నిచ్ఛ గలవానికి, పరీక్షాం వినా= విచారణను విడిచి, మంత్రతంత్రైః = (అన్యమైన) మంత్ర తంత్రములచే, యథా = ఎట్లు, నాశం = నాశమును, న ఏతి= పొందదో, తథా = ఆ ప్రకారమే, ముముక్షోః = మోక్షాపేక్ష గలవానికి, మృషాజీవ భావః = మిథ్యగా కల్పితమైన జీవత్వము, ప్రబోధం వినా = జ్ఞానమును విడిచి, కర్మధర్మైః = (అన్యములైన) కర్మలచేత , ధర్మములచేత, నాశం = నాశమును, న ఏతి = పొందదు.

రజ్జువుయొక్క అజ్ఞానముచే కలిగిన సర్పభీతి రజ్జు జ్ఞానము వలననే నివృత్తి యగును గాని అన్యోపాయములచే నివృత్తి కాదు. హృదయ గ్రంథి రూపమైన బంధము (జీవత్వము) మహావాక్య విచార సంజనిత అహం బ్రహ్మాస్మీత్యాకార జ్ఞానముచే వినా అన్యమైన వానిచేత నివృత్తి కాదు. వేదచోదితములగు అన్యకర్మోపాసనములు మోక్షప్రదములగు ననెడి మాట పూర్వపక్షము. జ్ఞానము మోక్షప్రద మగుననుమాట ఉత్తరపక్షము. కావున మహావాక్యార్థ శ్రవణజన్య జ్ఞానమునుండియే జీవాత్మ పరమాత్మల భేదము బాధింపబడి అఖండైకరసమగు పరిపూర్ణ బ్రహ్మము నేనను జ్ఞాన ముదయించును. కర్మాదులచేత కాదు. “ న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః, ” “ జ్ఞానాదేవ తు కైవల్యమ్” ఇత్యాది శ్రుతులనుబట్టి మోక్షమునకు జ్ఞానమే సాక్షాత్ సాధన మనియు కర్మోపాసనాదులు పరంపరాసాధనములు మాత్రమే యగుననియు నిర్ధారిత మాయెను.

అనుకూల ప్రతికూల పరిస్థితులు వచ్చినపుడు పొంగక, క్రుంగక సమభావంతో వుండడమే - యోగము



అక్క మహాదేవి అనుభవామృతం

తెలుగు సేత - డా ॥ శ్రీ కరిబసవరాజేంద్ర మహాస్వామి

160. పంది, మరియు ఏనుగు ఒకే దారిలో వచ్చినవని భావించిన పారి వచ్చిన పందికి ఏనుగు దారి విడిచితే ఆ పంది సింహమగునా. పంది పందియే, ఏనుగు ఏనుగే. అలాగే లౌకికము లౌకికమే, పారమార్థికము పామార్థికమే.

161. అష్టవిధార్చనము చేసి నీ అనుగ్రహమును పొందాలనుకుంటే నీవు నిరాకారుడు కావున బహిరంగ వ్యవహారమునకు దూరంగా వుంటావు. పోనీ నిన్ను అంతరంగములో ధ్యానము చేసి నీ అనుగ్రహము పొందాలనుకున్నా నీవు మాటకు మనసుకు అతీతుడై యున్నావు. పోనీ జప, స్తోత్రములతో నీ అనుగ్రహము పొందుతామంటే నీవు నా దానికి అతీతుడవు. ఇంక భావముతో బుద్ధి, జ్ఞానముతో నీ అనుగ్రహము పొందాలనుకుంటే నీవు మతికి (బుద్ధికి) అతీతుడవు. నిన్ను నా హృదయకమల మధ్యలో నిలుపుకొందామంటే నీవు నా సర్వాంగములలో నిండియున్నావు. కాబట్టి నిన్ను ఇలా అనుగ్రహము పొందడానికి నా వలన కాదు స్వామి. నీవే నన్ను అనుగ్రహించాలి. అదే నాకు సులభమైన సుఖ కరమైన మార్గము. నేను ఇన్ని ప్రయత్నములు చేసినప్పటికిని నీ అనుగ్రహము తప్ప నాకు సుఖము లభించదు.

162. నేను గురుకృప అనే సుగంధయుక్తమైన తిలకమును దిద్దుకొని, కామక్రోధాది వైరులను గెలిచినాను. పూర్వకర్మను శివునికి శరణు పొంది నివారించుకొన్నాను. శివశరణమనే ఆయుధాన్ని పట్టుకొని కర్మపాశాన్ని, “జాతస్యమరణం ధృవం” అనే బ్రహ్మ పాశాన్ని, విష్ణువు యొక్క మాయా పాశాన్ని ఛేదించినాను. నా శూరత్వాన్ని గమనించిన నా హృదయేశ్వరుడు నా సాధనను మెచ్చుకొని తనలో ఐక్యము చెసుకొన్నాడు.

164. ఇష్టలింగానికి శరణు పొంది, పూజించి, అర్పణము చేసేది సులభము.జంగమదేవున్ని పూజించి, సకలము అర్పించేది సద్భక్తుని కర్తవ్యము. అయితే జంగముని శరణుపోయి వేడకూడదు. జంగముడు సంతృప్తుడైతే అతడే అన్నిటిని అనుగ్రహించును. చెన్నమల్లికార్జునా ! అతనిని ఆనందముతో స్తుతించవచ్చు. అతనితో కలసి ఆటలాడవచ్చు. మాటలాడినట్లు నడిచేవారు శివ శరణులే. వారి మాట నడత ఒకటై వుండును. వారు ప్రాణము పోయినా, మాటపైనే నిలబడుదురు.

165. ఇష్ట లింగముయొక్క ప్రాణము జంగమము. లింగము యొక్క ముఖమూ జంగమమే. హిమాలయము నుంచి ప్రవహించే గంగ కొండలను చీల్చి ప్రవహిస్తుంది. అగ్ని సంపర్కాన్ని పొందిన కట్టెలు కాలిపోవును. దీపము వెలిగిస్తే చీకటి తొలిగిపోవును. జ్ఞానియొక్క సత్సంగముతో అజ్ఞాని పరివర్తనము చెందును. చెన్నమల్లికార్జునా ! పరశివుడే జంగమ స్వరూపము. ఆ జంగముని సత్సహవాసముచే జనన మరణములు తొలగిపోవును. లింగమును పూజించేది జంగముడి అనుగ్రహము కోసమే. జంగముడి పూజతో భవబంధనములు తొలగును.

166. శంకరుని అనుగ్రహానికి 'కింకరుడై ' వుండాలి. ఆ విధమైన సుజ్ఞానం కలిగితే భక్తుడౌతాడు. గురువు ఇచ్చినటువంటి శివలింగమును పూజించిన తరువాత నిరాకారమైన శివుని తెలుసుకోగల శక్తి కలుగుతుంది.

167. సకల భ్రమలకు మూలమైనది అహంకారము. దీని నుంచి కుల, పట్టుదల, పేరు, జాతి, వర్ణ ఆశ్రమ, మత, శాస్త్ర, తర్క, రాజ్య, ధన, ధాన్య, పుత్ర, మిత్ర, ఐశ్వర్య, త్యాగ, భోగ, యోగ శరీర, కరణ, విషయ, వాయు, మనస్సు, భావజీవ, మోహ, నాహం, కోహం, సోహం, మాయ భ్రమ మొదలైన ముప్పది రెండు భ్రమలలోపడి సంసారములో బంధితుడైన వారు ఈ లోకములో కనబడుదురు. అయితే అంతా శివునిదని, శివశక్తి నుంచి అని, శివభక్తుడై, శివ ప్రసాదాన్ని తీసుకొంటూ, శివజంగముల కృప పొందుతూ, శివైక్యుడగుటయే మన కర్తవ్యమని భావింతురు. ఇటువంటి వారు సంసార సాగరము నుండి తరింతురు.



శ్రీ భక్త తుకారాం అభంగవాణి

– శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు

(మే సంచిక తరువాయి)

శ్లో ॥ స్వాహాస్వధామృత భుజో దూవాః సత్యార్జవప్రియాః
క్రవ్యాదాన్ రాక్షసాన్ విద్ధి జిహ్మానృతపరాయణాన్ ॥
(మ.భా.అను.ప. 115 – 25).

అర్థము : ఎవరు స్వాహా (దేవయజ్ఞము) మరియు స్వధా (పితృయజ్ఞము) లననుష్ఠించి, యజ్ఞావశిష్టామృత భోజనము జేయుదురో, అదేవిధముగా సత్యమును మరియు ఋజుత్వము (సరళతా)ను ప్రేమించుదురో వారు " దేవతలు " అని దెలియవలెను. కాని, ఎవరు కుటిలత్వము మరియు అసత్య భాషణమునందు ప్రవృత్తులై, ఎల్లపుడు మాంసభక్షణము చేయుదురో వారు " రాక్షసు" లని దెలియవలెను.

శ్లో ॥ యస్మాద్గ్రసతి చైవాయుర్హింసకానాం మహాద్యుతే ।
తస్మాద్వివర్జయేన్మాంసం య ఇచ్ఛేద్భూతిమాత్మనః ॥

అర్థము : మహాతేజస్వియగునో నరేశా ! జీవహింస జేయువాని యాయువును వాని పాపము గ్రసించి వేయును. అందువలన, ఎవడు తన కళ్యాణము (హితము)ను గోరునో, ఆ మనుష్యుడు మాంసభక్షణమును అశేషముగా పరిత్యజించవలయును.

ఇంతవరకు అహింసా, తద్వైశిష్ట్యము మరియు మాంసభక్షణ నిషేధము, " మాంస" శబ్దార్థము, మాంసభక్షణము ద్వారా కలుగు యనర్థముల c గూర్చియు మరియు మాంసభక్షణము చేయువారినింద – మున్నగు విషయములను శాస్త్రాధారముగా సవిస్తరముగా తెలుసుకున్నాము. ఇప్పుడు అహింసా ప్రాశస్త్యమును తథా మాంసభక్షణ త్యాగప్రాశస్త్యమును మరియు తత్ఫలమును గూర్చి తెలుసుకుందాము.

శ్లో ॥ యద్ధ్యాయతి యత్కురుతే ధృతిం బధ్నాతి యత్రచ ।
తదవాప్నోత్యయత్నేన యోహినస్తి న కించన ॥ (మ.స్మృ. 5-47)

అర్థము : ఎవడు ఈగలు, దోమలు మొదలగు నల్ప ప్రాణుల సహితము ఏ ప్రాణిని గూడ హింసింపడో, అతడు - యే " ధర్మాదికము నాకు గలుగుగాక " యని తలంచునో, శ్రేయస్సాధనమగు యే కార్యము జేయునో, పరమాత్మ చింతనాది యే ధ్యానము జేయగోరునో - వాటి ఫలముల నెల్ల నప్రయత్నముగానే పొందును.

శ్లో ॥ సర్వ యజ్ఞేషు వా దానం సర్వ తీర్థేషు వానన ప్లుతమ్ ।
సర్వదాన ఫలం వాపి నైతత్తుల్యమహింసయా ॥
(మ. భా.ఆది.ప. 116 - 30).

అర్థము : సమస్త యజ్ఞములలో జేయబడు దానమునకు, సంపూర్ణ తీర్థములలో పవిత్ర మనస్సుతో నాచరించు స్నానాదులకు మఱియు సర్వ ప్రకారముల దానములకు యేఫలము చెప్పబడినదో అదియంతయు కలసి గూడ అహింసా ధర్మముతో సమానము గాజాలదు.

శ్లో ॥ యో బంధన వధక్లేశాన్ ప్రాణినాం న చికీర్షతి ।
స సర్వస్య హితప్రేప్సుః సుఖమత్యంతమశ్నుతే ॥ (మ.స్మృ. 5-46)

అర్థము : ఎవడు జంతువులను కట్టుట, చంపుట, చిత్రహింసలు పెట్టుట - మున్నగునవి జేయనొల్లడో, యతడు సకల భూతములకు హితముం జేయగోరుచు నెల్లపుడు తఱుగని మోక్షరూపమగు నానందము నొందును.

శ్లో ॥ సర్వభూత దయానంతో విశ్వాస్యాః సర్వ జంతుషు ।
త్యక్త హింసా సమాచారాస్తే నరాః స్వర్గగామినః ॥
(మ. భా. అను.ప. 144 - 9)

అర్థము : ఎవరు సకల జీవకోట్లపై దయగలిగి యుందురో, సర్వ జీవులకు విశ్వాసపాత్రులై మరియు హింసామయ ఆచరణముల నుండి నివృత్తమైన వారైయుందురో, వారు స్వర్గమునకు వెళ్ళుదురు.



రామ నామ మహిమ

ఆంగ్లమూలం : స్వామి చిన్మయానంద
అనువాదం - బి. రాజేంద్ర సింగ్

ఒక మహాత్ముడు ఒక నగరం బయట నివసించేవాడు. అతనికి సేవ చేస్తూ ఒక శిష్యుడు ఉండేవాడు. ఓ రోజు ఆ శిష్యుడు తనకేదైనా మంత్రం ఉపదేశించమని గురువుగారిని వేడుకున్నాడు. అతని సేవతో సంతోషపడిన గురువుగారు శిష్యుడి చెవిలో ఓ మంత్రం చెప్పారు. ఆ మంత్రం రహస్యంగా ఉంచాలని కూడా చెప్పారు. ఆ శిష్యుడు దాన్ని రహస్యంగా జపించేవాడు.

ఓ రోజు ఆ శిష్యుడు స్నానానికి నదికి వెళ్లాడు. స్నానం తర్వాత గట్టున ఓ చెట్టు క్రింద కూర్చొని మంత్రాన్ని మనసులోనే జపించాడు. అదే సమయానికి స్నానానికి వచ్చిన చాలామంది అదే మంత్రాన్ని అందరికి వినపడేలా జపించటం విన్నాడు. అందరికీ తెలిసినదాన్ని రహస్యమని గురువుగారు తనతో ఎందుకు చెప్పారో తెలియలేదు. సమాధానం దొరకని ప్రశ్నతో మనసు మంత్రం మీద లగ్నం చేయలేక జపంమాని గురువుగారిదగ్గరకు వెళ్ళి తనసందేహాన్ని బయట పెట్టాడు.

గురువుగారు ఓ చిరునవ్వు నవ్వి తన పెట్టెలోంచి ఓ మెరిసే రాయిని తీసి అతనికిచ్చి, ' ఇది తీసుకొని నగరానికి వెళ్లి చాలామందికి దాన్ని చూపించి అది అమ్మితే ఎంతకు కొంటారో అడిగి దాన్ని ఎవరికీ ఇవ్వకుండా తిరిగి తీసుకురా " అని చెప్పారు. శిష్యుడు సరేనని బయలుదేరాడు.

మొదట ఓ కూరగాయలమ్మే మనిషి ఎదురయ్యాడు. అతనికి ఆ రాయి చూపించి, " ఇది తీసుకుని దీనికి బదులుగా ఏమి ఇవ్వగలవు?" అని అడిగాడు. అతను దాన్ని చూసి తన కూరగాయలు తూచటానికి పనికొస్తుందని దానికి బదులుగా అర కిలో వంకాయలు ఇస్తానన్నాడు. శిష్యుడు రాయిని వెనక్కి తీసుకుని ముందుకు వెళ్లాడు.

తరువాత అతనికి ఓ కట్టెలు కొట్టేవాడు ఎదురయ్యాడు.

ఆ రాయిని అతనికి చూపించి బదులుగా ఏమిస్తావని అడిగాడు. అతను దాన్ని పరిశీలనగా చూసి తన కొడుకు ఆడుకోవటానికి పనికొస్తుందని దానికి బదులుగా ఐదు కిలోల కట్టెలు ఇస్తానన్నాడు. శిష్యుడు రాయిని వెనక్కి తీసుకుని ముందుకు సాగాడు.

బజారు వీధిలో ఓ బియ్యం వ్యాపారస్తుని దగ్గరకు వెళ్లి ఆ రాయిని చూపించాడు శిష్యుడు. అతను దాన్ని ఓ నకిలీ వజ్రంగా భావించి తన భార్యకు నగ చేయించటానికి పనికి వస్తుందని దానికి బదులుగా ఓ బస్తా బియ్యం ఇస్తానన్నాడు. శిష్యుడు రాయిని వెనక్కి తీసుకుని మళ్ళీ బయలుదేరాడు.

శిష్యుడికి చాలా ఆశ్చర్యంగా ఉంది. ఒకే వస్తువుకి ఇంతమంది ఇన్ని రకాలుగా విలువ కట్టడం విచిత్రంగా ఉంది. మరి ఆ రాయి నిజమైన విలువ ఎంత అని ఆలోచిస్తూ ఓ నగల వర్తకుడి దుకాణానికి వెళ్ళి ఆ రాయిని చూపించాడు. దానికి అతను ఐదువేల రూపాయలు ఇస్తానన్నాడు. శిష్యుడు రాయిని వెనక్కి తీసుకుని ముందుకు సాగాడు.

ఇపుడు ఓ వజ్రాల వ్యాపారి దగ్గరకు వెళ్ళి ఆ రాయిని చూపించాడు. అతను దానిని జాగ్రత్తగా పరిశీలించి, అది ఆ ఊళ్లో ఎవరూ వెల కట్టలేనంత విలువైన వజ్రమని, మరో పెద్ద నగరానికి పోయి దాన్ని సరైన ధరకు అమ్ముకోమని సలహా ఇచ్చాడు. ఆశ్చర్యంతో నోటమాట రాలేదు శిష్యుడికి. తన రాయి తీసుకుని గురువుగారి దగ్గరకు వచ్చేశాడు. జరిగినదంతా ఆయనకు వివరించాడు.

అంతా విన్న గురువుగారు “ నీకు ఉపదేశించిన రామ నామం విషయం కూడా అంతే. అది అందరికీ అందుబాటులో ఉండొచ్చు. కాని దాని నిజమైన విలువ ఎవరికి తెలుసు ? అందరిచేత రాయిగా భావించబడిన అత్యంత విలువైన వజ్రాన్ని గుర్తించినవాడు వజ్రాల వ్యాపారి ఒక్కడే ” అన్నారు. అతను వజ్రాలవిలువను గుర్తించడంలో శిక్షణ పొందాడు. కాబట్టి దానివిలువ తెలుసుకోగలిగాడు. ఆ జ్ఞానం లేని మిగిలినవారికి అది రాయిమాత్రమే. అలాగే మనంకూడా మంచి దారిలో నడిపించే శిక్షణతో మన జీవితాలను చక్కగా మలచుకోగలం. అలా రామనామజపంతో తరిస్తామని తెలుసుకొన్న శిష్యుడు భక్తితో రామనామ జపం చేస్తూ జ్ఞానాన్ని పొందాడు.

యోగా ద్వారా మానసిక ఒత్తిడి నివారణ

- సి.మార్కొండయ్య (యోగా మాస్టర్)

ఈనాడు విజ్ఞానశాస్త్రం (టెక్నాలజీ) అభివృద్ధి చెంది మనకు ఎన్నో సౌకర్యాలు ఏర్పడ్డాయి. తక్కువ శ్రమతో తక్కువ పెట్టుబడితో తక్కువ సమయంలో ఎక్కువ ఫలితాన్ని పొందుతున్నాము. అనుభవించ డానికి అన్నీఉన్నా సంతోషంగా ఉండలేకపోతున్నాం. జీవితంలో ఎదగడం ఎంత అవసరమో, ప్రశాంతంగా జీవించగలగడం అంతే అవసరం. ఆర్థికంగా ఎదుగుతున్నాము కానీ మనశ్శాంతిని కోల్పోతున్నాం.

ధనధాన్యాదులు, భోగభాగ్యాలు ఇవేవీ మనశ్శాంతిని ఇవ్వజాలవు. నేడు సమాజంలో అత్యున్నత స్థానంలో ఉన్నవారే గాకుండా సామాన్య ప్రజలు, ఉద్యోగం చేసే మహిళలు, పిల్లలు, వృద్ధులు అందరూ మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.

ఈ ఒత్తిడికి కారణాలు అన్ని రంగాలలోను పెరుగుతున్న పోటీతత్వం, మారిన జీవన విధానం, విందులు వినోదాలు, దుబారా ఖర్చులు, లౌకిక సుఖజీవనానికి అలవాటు పడటం, హద్దులు మీరిన ఆశలు, ఉన్న సౌకర్యాలతో తృప్తి పడక కోరికలు పెంచుకోవడం, భార్యా భర్తల మధ్య ఇతర కుటుంబ సభ్యుల మధ్య సరియైన అవగాహన లోపం. పరిస్థితులకనుగుణంగా ఎలా మెలగాలి అని తెలియకపోవటం, ప్రతికూల భావాలు కలిగి ఉండడం, పెద్దలను ఎదిరించి మాట్లాడటం, అక్రమ మార్గంలో సంపాదన మరియు అశ్లీల సన్నివేశాలను చూపే దూరదర్శన ధారావాహికలు, సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్ వాడకాలలో దుర్వినియోగాలు ఇన్ని కారణములచేత మానవుడు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఎలా

ఉండగలడు ?

పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ పిల్లల్లో ఒత్తిడి పెరిగినందున అత్యధిక స్థాయిలో గాలి పీల్చుకోవడం జరుగుతుంది. దీనిని వైద్య పరిభాషలో యాంగ్జైటీ హైపర్ వెంటిలేషన్ అని వ్యవహరిస్తారు. వారి గుండెలు బరువెక్కినట్టుండడం, గుండె దడ, నిద్రలేమి, రెస్పిరేటరీ ఆల్కలోసిస్ అనే సమస్య ఉత్పన్నమగుట, కాళ్లు చేతులు కొంకర్లు తిరిగి 'టెటనీ' అనే వ్యాధి వచ్చే అవకాశమున్నది.

స్త్రీలలో బహిష్టుకు ముందు మూడు నాలుగు రోజులపాటు ఈ యాంగ్జైటీ హైపర్ వెంటిలేషన్ కొందరిలో కన్పిస్తుంది. అందువల్ల ఊపిరితిత్తుల వ్యాధికి అవకాశమున్నది.

ఒత్తిడి మూలంగా కలిగే నష్టాలు : మనస్సు ఒత్తిడికి లోనయినప్పుడు గుండె వేగం పెరుగుట, విసుగు, చికాకు, ఉద్రేకం, కోపం, ఆవేశం, తీవ్రమైన తలనొప్పి, భయం, ఆందోళన, అజీర్ణం, నిద్రలేమి, మతిమరుపు, బుద్ధిమాంద్యం, బద్ధకం, బలహీనంగా ఉండడం, చేతివేళ్లు తిమిర్లుగా ఉండడం, గుండె జబ్బులు, అలర్జీలు, లైంగిక బాధలు, ఎక్కువగా ఆలోచించుట, ఉన్మాదులగుట, హైపర్ టెన్షన్, నరాల బలహీనత, ఎంజైమ్స్ ఊరుటలో అసమతుల్యత, షుగరు, బి.పి. నాడీమండల వ్యవస్థ దెబ్బతినటం, సైకోసమాటిక్ డిసీజెస్, ఇలాంటి ఎన్నో రుగ్మతలకు దారితీస్తుంది. ఒత్తిడికి గురైనవారు ఆ బాధల నుండి ఉపశమనం పొందుటకు మద్యం, జూదం, ధూమపానం, మత్తు పదార్థాలులాంటి దురలవాట్లకు బానిసలగుచున్నారు.

యోగా ప్రాముఖ్యత : ఒత్తిడికి నివారణా మార్గాలు ం

శరీరానికి జబ్బు వస్తే వైద్యం ఉంది. మనస్సుకు, బుద్ధికి చిత్తమునకు అహంకారానికి, ఇంద్రియాలకు అనారోగ్యం వస్తే చేసే వైద్య విధానమే యోగ.

ప్రాపంచిక విషయాలను పట్టించుకుంటే బి.పి. వదిలేస్తే హ్యాపీ. అన్ని అనర్థాలకు మూలం మనస్సే అనగా విషయ చింతన కలిగిన మనస్సు. శ్రీ కృష్ణ భగవానుడు గీతలో

శ్లో ॥ ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూప జాయతే

--------------- బుద్ధి నాశాత్ ॥ ప్రణశ్యతి . అన్నారు.

" ఉద్ధరేదాత్మనాత్మానం " అన్నారు గీతాచార్యులు యమనియమాలు పాటించుట, సత్సంగం చేయుట, దైవ కార్యములందు పాల్గొనుట, దైవ చింతన కలిగియుండుట గీత 12వ అధ్యాయంలో చెప్పినట్లు అద్వేష్టృత్వాది భక్తి గుణములు కలిగియుండుట. స్వాధ్యాయము అంటే మహాత్ముల చరిత్రలు, వారి రచనలు, వేదములు, ఉపనిషత్తులు, భగవద్గీత, భారత, రామాయణాది సద్గ్రంథములు పఠించుట. ద్వంద్వముల పట్ల సమబుద్ధిని కలిగియుండుట, ప్రాణాయామం చేయుట, ధ్యానం చేయుట మొదలగునవి పాటిస్తూ పరిపూర్ణ విశ్వాసంతో యోగ సాధన చేసినట్లయితే శరీరంలోని మాలిన్యాలు తొలిగి అవయవాలు శక్తివంత మవడం వలన అంతరంగిక ప్రాణశక్తి పెరుగుతుంది. ఒత్తిడి పూర్తిగా నివారింపబడుతుంది. ఏకాగ్రత, ప్రశాంతత కలుగుతుంది.

యోగాతో మానసిక ఒత్తిడి నివారణ :

(1). శవాసనం : దీనినే అమృతాసనం అంటారు. వెల్లకిల పడుకోవాలి. పాదాలకు మధ్యదూరం 30 అంగుళాలు ఉండాలి. రెండు చేతులను ఇరువైపుల ఉంచుకోవాలి. అరచేతులు బోర్లించరాదు. చేతివేళ్లు వదులుగా ఉంచుకోవాలి. కళ్లు మూసుకొని యుండాలి. శ్వాసలు లెక్కపెట్టాలి. ప్రారంభంలో 27 శ్వాసలు ఆరోహణ అవరోహణ క్రమంలో లెక్కపెట్టాలి. అనగా 1 నుండి 27 వరకు మరల 27 నుండి 1 వరకు లెక్క పెట్టాలి.

క్రమంగా ఈశ్వాసలు 27 - 36-45-54- 63-72- 81-90-99 -108 వరకు ఆరోహణ అవరోహణ క్రమంలో లెక్కబెట్టాలి. మెల్లగా లేచి కూర్చుని శాంతిమంత్రంతో ముగించాలి. శవాసనంతో మానసిక ప్రశాంతత కల్గుతుంది. శాంతి, సహనం, ఓర్పు గుణాలు కలుగును. నిద్రలేమి, గుండె అదిరే రోగం మొదలగు సమస్యలు గూడ నివారింపబడుతవి. శరీర కణాలు శక్తివంతమగును.

(2). సుప్త కపాల భాతి : శవాసనంలో పడుకుని రెండు కాళ్లు దగ్గరగా (పిరుదుల వద్దకు మడుచుకుని కళ్లు మూసుకోవాలి. సుప్తకపాలభాతి క్రియను వారి వారి శక్తిననుసరించి చేస్తూ ఉండాలి.

(3). చంద్రనాడి విలోమ అనులోమ ప్రాణాయామము : శవాసనంలో పడుకొని, ఎడమచేతిని జ్ఞానముద్రలో ఉంచాలి. (ఎడమచేతి బొటనవేలు చూపుడు వేలు, మధ్యవేలు కొనలు తాకించి తక్కిన మూడు వేళ్లను చాచి ఉంచుట) కుడిచేతి బొటనవేలుతో కుడివైపు ముక్కు రంధ్రాన్ని మూసి ఉంచాలి. ఎడమ ముక్కుతో మాత్రమే నెమ్మదిగా పీల్చుకొని నెమ్మదిగా వదలాలి. ఇలా ఎడమ ముక్కుతోనే తీసుకుంటూ ఎడమ ముక్కుతో వదులుతూ ఉండాలి. 5 ని॥ నుండి 10 ని॥ వరకు చేయెచ్చు.

(4). ఓంకార ధ్యానము :

(ఎ). వాచికము : ఓం....... ఓం......ఓం.......ఓం...... ఓం.....ఓం.... ఇలా ఐదు నిమిషాలు ఓం కారమును పలుకుతూ ఉండాలి.

(బి). ఉపాంశు : మ్........ మ్....... మ్........ మ్..... మ్.......మ్.... ఇలా మకారంను ఐదు నిమిషాలు పలకాలి.

(సి). చిత్తము : (చిత్తజపము లేక మౌన జపము) " బి"లో చెప్పిన విధంగా 'మ ' కారంను పైకి శబ్దం వినిపించకుండా మనసులోనే పలుకుతూ ఉండాలి. ఇలా చేయడం వల్ల ఒత్తిడి తొలగి ఏకాగ్రత కలిగి మైగ్రేన్ లాంటి సమస్యలు తొలగును.

వార్తలు

(01). (ఎ). మే నెల 3వ తేది మంగళవారం ఏకాదశి సందర్భంగా శ్రీ శుకబ్రహ్మాశ్రమ అధిష్ఠాన మందిరంలో భగవద్గీత అఖండపారాయణ చేశారు. **(బి).** మే నెల 5వ తేది గురువారం మాసశివరాత్రి సందర్భంగా ప్రదోషకాలంలో ఆశ్రమ శివలింగానికి రుద్రాభిషేకం, బిల్వార్చన చేశారు. **(సి).** మే నెల 8వ తేది ఆదివారం నాడు కృత్తిక సందర్భంగా ఆశ్రమంలో ప్రదోషకాలంలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి అర్చన చేశారు. మే 17వ తేది ఏకాదశి సందర్భంగా ఆశ్రమంలో భగవద్గీత అఖండ పారాయణ నిర్వహించారు.

(02). మే నెల 16వ తేది (16-05-2016 తేది) సోమవారం ఉదయం 9-30 గంటలకు చిత్తూరుజిల్లా, నగరిమండలం, సత్రవాడగ్రామంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఫిజియోథెరపిస్టు శ్రీకృష్ణారెడ్డి గారి ఆహ్వానంపై (దేవాలయం ప్రతిష్ఠ చేసి 12 సంవత్సరాలైన సందర్భంగా) పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు కుంభాభిషేకం చేశారు.

(03). 22-05-2016 తేది ఆదివారం శ్రీ శుకబ్రహ్మాశ్రమములో త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు బోర్డు సమావేశం జరిగినది.

(04). 11-05-2016 తేది వైశాఖ శుద్ధ పంచమి బుధవారం నాడు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జగద్గురు శ్రీ శంకరాచార్యుల జయన్తి జరిగినది. ఆ సందర్భంగా ఉదయం శంకరాచార్యుల మూర్తికి అర్చన, స్తోత్ర పారాయణ ప్రసాదవినియోగం జరిగినది. సాయంకాలం శంకరాచార్యుల గురించిన ప్రవచనలు జరిగినవి. ఈ కార్యక్రమం శ్రీ విజయానందగారి ఆధ్వర్యంలో జరిగినది.

(05). 21-05-2016 తేది వైశాఖ పౌర్ణమి శనివారం నాడు ఉదయం గురుపాదుకా పూజ జరిగినది. సాయంకాలం బుద్ధ జయన్తి సందర్భంగా ఆశ్రమములో బుద్ధ భగవానునిపై ప్రవచనలు జరిగినవి. 31-05-2016 తేది మంగళవారం హనుమ జ్జయన్తి సందర్భంగా ఆశ్రమంలోని భక్తహనుమాన్‌కు షోడశోపచార పూజ జరిగినది.

(06). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో ఏప్రిల్ నెలలో **ఓ.పి.విభాగంలో 865 మందికి** కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేయబడినవి. **68 మందికి కంటి పొరలు** తీసి కళ్లలో లెన్సు అమర్చబడినవి. ముగ్గురికి యాగ్ లేజర్ చికిత్స చేయబడినది.

బంధవిముక్తి

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

పూర్వమొకానొక గజమును భయంకరమైన మొసలి బారి నుండి తప్పించి విష్ణు భగవానుడు కాపాడెనని భాగవతమునందు పేర్కొనబడిన విషయము సామాన్యముగ ప్రతివారున్ను తెలిసికొనియే యున్నారు. “ రావే ఈశ్వర ! కావవే వరద ! ” అను ఆ గజేంద్రుని యొక్క హార్దికమైన ప్రార్థనయే దానిని ఘోరమగు ఆ విపత్తు నుండి రక్షించెను. దానియొక్క సత్ప్రయత్నమే అద్దానిని కాపాడెను.

అట్లే జీవుడనుగజము జనన మరణ రూపమైన బురదలో చిక్కుకొని అనాదికాలమునుండి బహుయాతనల నొందుచున్నది. సంసారమను ఊబిలో దిగబడి అందుండి బయటకు రాజాలక గిలగిల తన్నుకొనుచున్నది. చావుపుట్టుకల మధ్య ఊగిసలాడుచున్నది. ఇట్టి గజములు ప్రపంచమున ఒకటికాదు, రెండుకాదు, కోటానుకోట్లు కలవు. అట్టి అగణిత గజేంద్రులను గూర్చిపలికిన ఈ క్రింది వాక్యములు అత్యంత ప్రాముఖ్యత గలిగియున్నవి.

అహంకార మహాలానం
తృష్ణారజ్జుం మనోమదమ్
జన్మజంబాల నిర్మగ్నం
జీవదన్తినముద్ధరేత్

“ అహంకారమను కట్టుకంబమునకు కట్టబడినదియు, తృష్ణయను త్రాటిచే బంధింపబడియున్నదియు, మనస్సను మదధారలు కలదియు, జననమరణములను బురదలో కూరుకొని యున్నదియునగు జీవుడను ఏనుగును బంధనమునండి విడుదల చేసి సముద్ధరింపవలయను.”

నీవు గాఢ ధ్యానములోనికి ప్రవేశిస్తే నీకు నీ దేహచైతన్యముగాని, పరిసరాలుగాని గుర్తుకురావు. నీవు మానసిక సమతుల్యతతో నుందువు. ఏ శబ్దములు నీకు వినపడవు. ఇంద్రియ భ్రాంతులు పైకి, క్రిందికి వెళ్ళడం ఆగిపోవును. అహంకార చైతన్యముకూడ క్రమంగా నశించు. చెప్పనలవికాని ఆనందాన్ని, వర్ణించనలవికాని సంతోషాన్ని నీవు అనుభవించుదువు. క్రమక్రమముగా హేతుకత, తలంపులు కూడ మృగ్యమగును.

గాఢ ధ్యానము ద్వారా నీవు మౌనం లోనికి వెళ్ళినపుడు బాహ్యప్రపంచము. నీ సమస్త కష్టాలు తొలగిపోవును. నీవు అనంతమైన శాంతిని అనుభవింతువు. ఈ మౌనంలోనే జ్యోతులలో దివ్యమైనట్టి జ్యోతి లభించును. ఈ మౌనంలో అక్షయమైన పరమానందముండును. ఈ మౌనంలో నిజమైన శక్తి. ఆనందము ఉండును.

- శ్రీ స్వామి శివానంద

వేదాంతభేరి

జులై 2016 రూ. 10/-

శ్రీమలయాళస్వాములవారు - శ్రీ చిన్మయానందస్వాములవారు

జపధ్యానాలకంటూ ఒక నిర్ణీత సమయాన్ని కేటాయించడం ఎంతో అవసరం. సరైన సమయం ఎప్పుడు ఆసన్నమవుతుందో చెప్పలేము. ఎవరూ ఎదురుచూడని వేళలో ఆ తరుణం [redacted] హఠాత్తుగా వస్తుంది. డబ్బు ద్వారాను, మానవప్రయత్నం వలననూ సాధింపలేని అనేకమైన వానిని కాలమహిమ సాధింపకల్గుతుంది. అందువలన సమస్యల ఒత్తిడి ఎంతగా ఉన్నప్పటికీ కొన్ని నియమాలను అంటిపెట్టుకొని ఉండడం ఎంతో అవసరం.

- శ్రీ శారదాదేవి

ॐ వేదాంతభేరి ॐ

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 49 జూలై 2016 సంచిక : 07

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ వేదాంతభేరి ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 49 జూలై 2016 సంచిక : 07

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. ప్రయత్న పూర్వకంగా మాయను జయించవలెను-
శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ -
శ్రీ సద్గురు మలయాళస్వాములవారు -10
04. శ్రీ మలయాళ స్వాములవారుపరమహంస సన్న్యాసుల గౌరవాన్ని
ఇనుమడింపజేశారు - ఆచార్య మండలేశ్వర్
శ్రీ విద్యానందగిరిస్వామీజీ - 14
05. చరాచర సుఖాభిలాషి - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 16
06. పెద్దలమాట చద్దిమూట - బిరుదువోలు రాజయ్య - 18
07. నా గురుదేవులు స్వామి తపోవనమ్ - స్వామి చిన్మయానంద - 20
08. ధర్మ శాస్త్రాలు - నేటి సమాజం - డా॥ సముద్రాల లక్ష్మణయ్య - 22
09. శ్రీ శుకమహర్షి బోధ - ఎస్.వి.భారతీలక్ష్మి - 26
10. గురుకటాక్షం - శ్రీమతి వి. లక్ష్మీనరసమ్మ - 29
11. శ్రీ భక్త తుకారాం అభంగవాణి - శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వామి - 31
12. అక్క మహాదేవి అనుభవామృతం - డా॥ శ్రీకరిబసవరాజేన్ద్ర స్వామి - 33
13. ఆచార్య దేవోభవ - ఆచార్య కె.సర్వోత్తమరావు - 35
14. శ్రీమదాంధ్ర మహాభాగవతము (వచనానువాదము)
ఆచార్య డా॥జె.మునిరత్నం - 38
15. వార్తలు - 42

ముఖచిత్రం :

శ్రీ సద్గురు మహర్షి మలయాళస్వాములవారితో
శ్రీ చిన్మయానంద స్వాములవారు

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన   శ్రీ గుర్వష్టకమ్

- శ్రీ విమలానన్దగిరి స్వాములవారు,
శ్రీ వ్యాసాశ్రమ ప్రథమ పీఠాధిపతులు

ఓమ్ నమస్తే భక్త సమ్పూజ్య ! సమ్యగ్జ్ఞానవతాం వర ।
భక్తేచ్ఛోపాత్తరూపాయ గురుదేవాయ తే నమః ।

ఓమ్ నమస్తే 2 సద్గురూపాయ నమస్సంసృతిహారిణే ।
నమోస్త్వద్వైతరూపాయ ఛిన్నబన్ధాయ తే నమః ।

ఓమ్ బ్రహ్మాత్మభావసమ్పూర్ణ ! బ్రహ్మజ్ఞాన ప్రబోధక ।
విజ్ఞాన హేతి విచ్ఛిన్న కర్మబన్ధాయ తే నమః ॥

ఓమ్ అనఘాయాప్తకామాయ పూర్ణబోధాయ తే నమః ।
అనన్యభక్త దైవాయ గురవే2నన్తశక్తయే ॥

ఓమ్ తీవ్ర వైరాగ్యయుక్తాయ వశిముద్రాఙ్కితాయ చ ।
నమస్తే2సద్గురూపాయ గురవే జ్ఞప్తిరూపిణే ॥

ఓమ్ అసఙ్గానన్దయోగీశ ! సద్గురో ! పూతభావన ।
నమస్తే త్యక్తసర్వాశ ! లోకసఙ్గ్రహజీవన ॥

ఓమ్ తీర్థభూతపదామ్భోజ ! సముత్తీర్ణభవార్ణవ ।
జితకామ ! సదాశాన్త ! నమస్తే త్యాగిసత్తమ ॥

ఓమ్ యతీశ్వరాయ మహతే మోహధ్వాన్తాపహారిణే ।
ఆత్మానన్దవిహారాయ ముక్తసఙ్గాయ తే నమః ॥

ఓమ్ గుర్వష్టకమిదం పూతం యః పఠేద్భక్తితత్పరః ।
గురుదైవత భావేన ముక్తో భవతి సాధకః ॥

ఇతి శ్రీ విమలానన్ద విరచితం గుర్వష్టకం సమ్పూర్ణమ్

15-7-2016 తేది ఏకాదశి
శ్రీ మలయాళస్వాములవారి ఆరాధన



ప్రయత్న పూర్వకంగా మాయను జయించవలెను

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

తాను జనన మరణ రూప బంధమున తగుల్కొని యున్నాడనియు, ఎన్నిజన్మలనుండియో పుట్టుట, చచ్చుట, గర్భనరకాదులను అనుభవించుట మొదలగువానిచే విసిగి వేసారి యున్నాడనియు, దేహరూప ఉపాధిని గ్రహించినందువలన కర్మవశాత్తు సంభవించు నానావిధ యాతనలను అనుభవించవలసి వచ్చుచున్నదనియు గ్రహించి, ఈ బంధనమునకు, ఈ బానిసత్వమునకు కారణము అజ్ఞానమే యనియు స్వస్వరూప విస్మృతియే యనియు తలంచి జ్ఞానప్రాప్తిచే అట్టి అజ్ఞానమును తెగద్రుంచివేసి, నిరంతర స్వస్వరూప ఆత్మస్థితిచే పరమానందమును జీవుడనుభవించవలెను. వెయ్యేల ! తాను బంధమున నున్నాడని గుర్తెఱింగి బంధవిముక్తికై తీవ్రతరయత్నమాచరించవలెను. ప్రాపంచిక భోగవిలాసములకు స్వస్తి చెప్పి మనస్సును అంతర్ముఖముగ త్రిప్పి ధ్యానాద్యనుష్ఠానములచే ఆత్మయందు నెలకొల్పి మహత్తర బ్రహ్మానందానుభూతిని బడయుచుండవలెను. ప్రయత్నపూర్వకముగ మాయను జయించవలెను. మాయ యొక్క స్వరూపమేదియో ఈ సందర్భమున ఒకింత విచారించెదము.

1. భగవంతుని మఱచుటయే మాయ. ఆత్మస్వరూపమును విస్మరించుటయే మాయ.
2. జడమగు దేహమును చైతన్యమని యెంచి అదియే తానని భావించుటయే మాయ.

3. కల్పితమగు జగత్తును సత్యమని తలంచుటయే మాయ.

4. సత్యమగు భగవంతుడు లేడని నిశ్చయించుటయే మాయ.

5. నిత్యశుద్ధ బుద్ధ ముక్తమగు తన ఆత్మను మఱచుటయే మాయ.

6. దుఃఖమిశ్రితమైన విషయ సుఖము గొప్పదని తలంచి దానివెంట పరుగిడుటయే మాయ.

7. ఉన్నది లేదనియు, లేనిది ఉన్నదనియు తలంచి లేనిదానికై ప్రాకులాడుటయే మాయ.

8. దారాపుత్రాదులు, బంధుజాలము ఎల్లప్పుడు తన వెంట వచ్చుదురని భావించుటయే మాయ.

9. ఇంద్రియములకు దాసానుదాసుడై అవి చెప్పినట్లు నడచుటయే మాయ.

10. బహుజన్మార్జిత దుష్టవాసనలకు లోబడి వాటి ప్రేరణలకు లొంగిపోవుటయే మాయ.

11. స్వల్ప సుఖముకొఱకై అనంత దుఃఖమును కొనితెచ్చుకొనుటయే మాయ.

12. తాను చేయునది తప్పని తెలిసియు, దానినే చేయుచుండుటయే మాయ.

13. ఉన్నది ఉన్నట్లు చూడక మరియొక విధముగ చూచుటయే మాయ.

14. ఎన్నియో కార్యములను చేయుచున్నను మొట్టమొదట తానెవరో తెలిసికొనుకపోవుటయే మాయ.

15. అనిత్యమైన దానిని నిత్యముగను, అపవిత్రమైన దానిని పవిత్రముగను, దుఃఖభూయిష్టమైన దానిని సుఖవంతముగను,

అనాత్మ వస్తువును ఆత్మగను, తనకంటె వేఱుగ నున్నదానిని తన రూపముగను భావించుటయే మాయ.

ఈ పదునైదు విధములగు మాయలన్నియు జేరి మహా మాయగా పరిణమించి అనాదికాలమునుండియు జీవుని వేధించుచున్నవి. కంటికి పొరయున్నచో ఎదుటనున్న వస్తువులెట్లు కనబడవో, కల్లుత్రాగినవాడు మైకముచే నెట్లు కప్పబడునో అట్లే మహామాయచే ఆవరింపబడిన వాడున్ను సత్యవస్తువును కనుగొనలేకయున్నాడు. మాయాజనిత భ్రాంతిచే ఆవృతుడై అతడు విశ్వమును మరియొక రీతి గాంచుచున్నాడు. తాను గాంచినదే సత్యమని వాదించుచున్నాడు. ఇదియంతయు మాయయొక్క ప్రభావమే అయియున్నది. మాయ తగులుకొని యున్నంతవఱకు జీవునకు శాంతిలేదు. సుఖము లేదు.

'మమ మాయా దురత్యయా ' ' నా మాయ భయంకరమైనది, దాటుటకు కష్టసాధ్యమైనది' అనియు. 'మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్ ' దానిచే కప్పబడిన వాడు మాయాతీతమైన అవ్యయమగు నా స్వరూపమును తెలియజాలడు ' అనియు ఈ మహామాయను గూర్చి శ్రీకృష్ణ పరమాత్మ గీతయందు పేర్కొనియున్నాడు. అయితే దానిని గుఱించి ఎవరును భయపడ నక్కఱలేదనియు ' మా మేవ యే ప్రపద్యన్తే మాయా మేతాం తరన్తి తే ' నన్ను (పరమాత్మను) ఆశ్రయించినవారు ఈ మాయను అవలీలగ దాటివేయగలరనియు భగవానుడు ధైర్యము చెప్పెను.

కావున మాయ అనగా నెట్టిదో, దానిని తొలగించుకొనుట ఎట్లో మానవుడు తప్పక తెలిసికొనవలసియున్నాడు. జనులలో మూడు తరగతులవారు కలరు. కొందరు మాయచే కప్పబడియున్నను ఆ విషయమును తెలియకయే యుందురు. ఇక్కారణమున వారు అద్దాని

నివారణమునకై ఒకింతైనను ప్రయత్నము చేయకుందురు. వీరు కనిష్ఠులు. మఱికొందరు తాము మాయచే, అజ్ఞానముచే కప్పబడియున్నట్లు తెలిసికొనియు దానిని తొలగించుకొనుటకై ఒకింత ప్రయత్నమాచరించి లక్ష్యమును జేరకయే తమ ప్రయత్నమును విరమించుదురు. వీరు మధ్యములు. ఇక మూడవతరగతి వారు తమ్ము కప్పియున్న మాయను విచ్ఛిన్న మొనర్చుటకై తీవ్రతర సాధనల నొనర్చుచు, విజ్ఞాన, వైరాగ్యాది అస్త్రశస్త్రములచే దానినెదుర్కొని దాని దర్పమును అడంచి మాయాభేదనమను తమ లక్ష్యమును ఈ జీవితమునందే సాధించివైచి ఆవరణరహితులై, ఆత్మప్రకాశమయులై, పరమానందయుతులై వెలుగొందుచుందురు. వీరు ఉత్తములు.

మాయయొక్క స్వరూపము చక్కగ నెఱింగి, దాని టక్కులను, యుక్తులను, నిశితబుద్ధితో బాగుగ గమనించి శత్రువుయొక్క బలము ఎచట కేంద్రీకృతమై యున్నదో వివేకముతో గ్రహించి కీలు తెలిసికొని వాత పెట్టినట్లు 'అసంగ శస్త్రేణ దృఢేన ఛిత్త్వా' అని భగవానుడు పేర్కొనినట్లు అసంగ రూప విజ్ఞానశాస్త్రముచే సమూలముగ మాయాభంగమొనర్చి ఉత్తమ మానవుల తరగతిలో చేరుటకే కృతనిశ్చయులు కావలయును. ప్రయత్నరహితులై యుండువారిని మాయ ఒక ఆట ఆడించును. వారి అంతు చూచును. వారిని ఎంత ఏడిపించవలెనో అంత ఏడిపించును. దాని దుష్ట ప్రభావముచే కన్నీళ్లు కాలువలై విలపించిన వారెందరో కలరు. జీవితము పరమ దుర్భరమైపోయి ఆత్మహత్యకు కూడ పాల్పడిన వారెందరో కలరు. కాబట్టి మాయయొక్క స్వరూపమెట్టిది ? దాని బెడదను తప్పించుకొను మార్గము లెయ్యవి ? దానిని సమూలముగ విధ్వంస మొనర్చుటకు ఉపాయమేమి ? అను విషయములను ప్రతిమానవుడును ఈ జీవితమునందు తప్పక తెలిసికొనవలసి యున్నాడు.

All the world is a stage
And all the men and women merely players
They have their exits and their entrances
I
II
III
IV

" సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ "

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

ప్రశ్న :- మీరు ఆనతిచ్చునట్లు ఈశ్వరునిచే నియతమగు కృత్యమును జీవుడు చేయవలసియుండునని చెప్పినది నిజమైనచో సర్వోప నిషత్తులసారము గీతగాను, గీతలోని 17 అధ్యాయములలో గల సారసంగ్రహమే 18 అధ్యాయముగాను, దానిలో పరమావధి చరమశ్లోక మనియు, మహనీయులచే నిర్ధారణ చేయబడిన ఈ క్రింది శ్లోకమునకు మీరు ఏమి అభిప్రాయము చెప్పగలరు ?

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥

సమస్త ధర్మములను విడిచి ముఖ్యుడనైన నన్ను రక్షకునిగా పొందుము. నేను నిన్ను సమస్తపాపములనుండి విడిపింపగలను. దుఃఖింపకుము.

శ్రీ మలయాళస్వాములవారి ఉత్తరము :- ఈ శ్లోకము గీతయొక్క అంత్యోపదేశము. అవతల గీతోపదేశము లేదు. ఇది సర్వకర్మ పరిత్యాగ పరమగు సన్న్యాసాశ్రమముయొక్క అంత్యముగా నున్నది. కనుకనే ఈ అధ్యాయమునకు మోక్షసన్న్యాసయోగమని శ్రీ భగవంతుడే దివ్యనామధేయ మిడెను. మోక్షసన్న్యాస మనగా మోక్షమును గూడ సన్న్యసించెడు యోగమని అర్థము. మోక్షావస్థ గూడ సన్న్యసించుట ముక్త్యవస్థ యందే గల్గును. అంతవరకు మోక్షాపేక్ష జీవకోట్లకు ఉండును. ఈ శ్లోకమునకు భాష్యకర్తలగు శ్రీశంకర శ్రీరామానుజ శ్రీమధ్వాచార్యులును, వారి అనుయాయులును వారివారి సంప్రదాయపరముగా అర్థమును

నిర్ధారణ చేయుటలో వారి బుద్ధి అంతయు ధారబోసియున్నారు. అయితే భాష్యత్రయమును పరిశీలించిన అందరి అభిప్రాయమును దైవనిష్ఠాపరులై నిరంతరముండువారికి ఇతరములైన నిత్యనైమిత్తికాది, శ్రాద్ధతర్పణ సంధ్యావందనాది కర్మలు అవసరము లేదని గోచరించుచున్నది. ఏలన? నిత్య నైమిత్తిక శ్రాద్ధ తర్పణాదికర్మలు అవిద్యతో చేరినవి. ఇది పరుల సహాయము చేతనే నిర్వహింపబడవలసి యుండును. కేవల విరక్తునికిని, బ్రహ్మానుసంధానపరునికిని పై జెప్పిన కర్మల నాచరింపవలసియుండిన చిత్తవిక్షేపము కలుగుటకు అవకాశము వచ్చును. అంతేగాక సర్వకర్మలు విధి ప్రకారమనుష్ఠించి కృతకృత్యత్వము నొందిన వారికే ముక్తి గల్గును. ఆలాగున ముక్తి గలవానికి మరల కర్మలు అవసరము లేదని ఉపనిషత్తుల యొక్క సిద్ధాంతము.

కావున అట్టి కర్మలు విడిచినందుచే శాస్త్ర విధిని అతిక్రమించుట యగునో యను భీతి అవసరము లేదని తెలుపుటకొరకు ఈ శ్లోకము ప్రవర్తించుచున్నది. మరియు కర్మలచే గలిగెడు ఫలము అతి స్వల్పము. జ్ఞానముచే గలిగెడు ఫలము అనంతము. కర్మలచే గలిగిన ఫలమునకు పరిమితి గలదు. జ్ఞానముచే గలిగెడు ఫలము పరిమితి లేనిది. అంతియే గాక సర్వనదీనదములు సముద్రములో లయము నొందును. సముద్రము నద్యాదులలో లీనము గానట్లు ఆత్మజ్ఞాన నిష్ఠలో సర్వకర్మలును విలీనమై పోవును. కనుకనే నాల్గవ అధ్యాయమున,

“ సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ”

అనగా సమస్త కర్మలును జ్ఞానమునందు సమాప్తి పొందుచున్నవి. మరియు

యథైధాంసి సమిద్ధోఽగ్ని ర్భస్మసాత్కురుతేఽర్జున ।
జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా ॥

అర్జునా ! చక్కగా ప్రజ్వలించునిప్పు కట్టెల నేలాగున భస్మము

చేయుచున్నదో, ఆలాగున అధ్యాత్మజ్ఞానమను అగ్ని సమస్త కర్మలను కాల్చి భస్మముగా చేయుచున్నది అని చెప్పబడెను.

కనుక భాష్యకర్తలు ఆత్మజ్ఞానమునకు అనగా “ భగవదనుసంధాన పరమగు నిష్ఠకు ప్రతిబంధకములగు కర్మలను విడిచిపెట్టి భగవదను సంధానపరుడవు గమ్ము. ” అనియే శ్రీరామానుజాచార్యులు అర్థమును వ్రాసిరి. ఇది యెటువంటి దనగా ! సూర్యోదయము అయిన తర్వాత దీపము నెట్లు అక్కర లేదని చెప్పుదురో, చీకటిచే మరల భయము కలుగదని తెలుపుదురో అట్లే యుండును. మరియు క్రింది యుద్యోగస్థుని అధీనములో పనిచేయు నౌకరి సర్వమునకు అధికారియగు పైవారి పనిలో నియుక్తులై యుండిన ఏలాగున పై యధికారి “ క్రింది యుద్యోగస్థుడు నిన్ను ఏమియు చేయడు. భయపడనక్కరలేదు. ఆ క్రింది యుద్యోగికి నేను తెలిపెదను ” అని చెప్పునో ఆ రీతిగా ఈ శ్లోకార్థమని గ్రహించవలెను. కనుకనే అష్టమాధ్యాయమున ఆఖరున ఈ క్రింది శ్లోకము శ్రీ భగవానుడు ఉపదేశించుటకు కారణమైనది --

వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ దానేషు యత్పుణ్య ఫలం ప్రదిష్టమ్ ।
అత్యేతి తత్సర్వమిదం విదిత్వా యోగీ పరం స్థానముపైతి చాద్యమ్ ॥

యోగులు వేదార్థములు తెలిసికొనుటయందేమి, క్రతువులు చేయుటయందేమి, తపస్సులు చేయుటయందేమి, దానముల యందేమి, చెప్పియుండు ఫలములను అతిస్వల్పముగా తలంచి అదికారణమై పరమోత్కృష్టమైన పరబ్రహ్మమును బొందుచున్నారు. అనగా ఆత్మధ్యాన పరాయణుడగు యోగి, నాశరహితమైన బ్రహ్మపదమును బొందుచున్నాడు. అట్టిదానికిని పై జెప్పిన వేద, యజ్ఞ, దాన, తపస్సులలో గల ఫలమునకును, సూర్యుని యొక్క ప్రకాశమునకును, మిణుగురు పురుగు తేజమునకును ఉన్నంత తారతమ్యముండును. బ్రహ్మనిష్ఠలో అట్టి ఫలము గలదు.

పరమకరుణాళువగు భగవంతుడు బీదభక్తులపై కరుణగల్గి యిట్లు

ఉపదేశించినాడు. ఏలనగా కొందరు భక్తులు దాన ధర్మ పరోపకార దైవారాధనాదులు సలుపుటకు మనకు డబ్బు లేదని చింతపడగలరని తలంచి ఇట్లానతిచ్చిరి. మహామేరువుకును, ఇసుక రేణువుకును ఎంత భేదము గలదో బ్రహ్మనిష్ఠకును, తక్కిన పుణ్యకర్మానుష్ఠానములకును అంత తారతమ్యము గలదు. ఏలన ? శ్రీకృష్ణభగవానునికి బీదభక్తుల స్థితిగతులు బాగుగ తెలియును. ధనవంతుల గర్వాహంకారములును బాగుగా జ్ఞాపకము చేసుకొనియున్నారు. దుర్యోధన శిశుపాలాదులే దీనికి తార్కాణము. చల్లలమ్ముచుండు బీదగొల్లవారులు, విదుర ఉద్ధవాదులును దీనికి సాక్ష్యములు. భగవంతుడు జీవితమంతయు ఇప్పుడు చెప్పినవారి మధ్యలోనే గడిపి ముగింపచేసెను. " సర్వధర్మాన్ పరిత్యజ్య " అను శ్లోకము యొక్క తాత్పర్యమున్ను ఇదియే. అయితే యీ శ్లోకమందు గూడ జీవునియొక్క కృత్యమును విడిచిపెట్టమని చెప్పలేదు. తనయొక్క కార్యము మరింత దృఢముగా చేయవలెనను అర్థమే గాని విడువవలెనను అర్థము గాదు. ఏలన ?

" సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ "

బ్రహ్మనిష్ఠకు ప్రతిబంధములగు ఇతర కర్మలనన్నిటిని పరిత్యజించి భగవంతుని ఒక్కనినే శరణు బొందుము. కనుకనే " మాం ఏకం " అని ప్రయోగించుటకు కారణమైనది. ఏక శబ్దముచే రెండవ చింతలేనివాడవై కేవలము ధ్యేయాకారపరుడవై యుండుము. అట్టైన మాత్రమే సమస్త పాపముల నుండియు రక్షించెదను. అట్లుగానిచో రక్షింపలే నననర్థము ఈ శ్లోకమున స్పష్టమగులాగున భగవాను లుపదేశించి యున్నారు. కనుక పురుషప్రయత్నము అత్యవసరముండవలయు ననియే భగవదాశయము గాని అవసరము లేదని కనుపించుట లేదు. ఈ విషయమై యెన్నియో ప్రమాణములు గలవు. గ్రంథవిస్తారమగునని తలంచి సంగ్రహముగా చెప్పడమైనది. ఇది భ్రమరకీటక న్యాయము ననుసరించి యుండును.

శ్రీ మలయాళ స్వాములవారు పరమహంస సన్న్యాసుల గౌరవాన్ని ఇనుమడింప జేశారు

– అనంత విభూషిత ఆచార్య మండలేశ్వర్
శ్రీశ్రీశ్రీ విద్యానందగిరి స్వామీజీమహారాజ్
శ్రీకైలాస పీఠాధీశ్వర్, ఋషీకేశ్.

కేరళ రాష్ట్రంలో ఒక దివ్యాత్మ అవతరించింది. ఆ దివ్యాత్మ సన్న్యాసం స్వీకరించి అసంగానందగిరి అని నామాంకితం అయింది. ఆ మహాత్ముడు విత్తేషణ, పుత్రేషణ, లోకేషణలపై విరక్తుడై ఆధ్యాత్మ సాధనయందు సురతుడై తిరుపతి తిరుమల క్షేత్ర ఒక అరణ్య ప్రదేశాన్ని తన సాధనక్షేత్రంగా ఎన్నుకొన్నాడు. వారికి మొదట తెలుగురాదు. వారు తమ మాతృభాషయైన మలయాళంలో మాట్లాడేవారు. కనుక అక్కడివారు ఆ పుణ్యపురుషుణ్ణి శ్రీమలయాళస్వామి అని పిలువడం మొదలు పెట్టినారు. అదేవారి సార్థక నామధేయమైంది. అఖండ తపశ్చర్య వలన వారికి బ్రహ్మాత్మైక్య సాక్షాత్కారమయింది. తన ఆధ్యాత్మిక అనుభూతులను ఆంధ్రులకు తెలియజేయాలన్న కాంక్ష వలన శ్రీస్వాములవారు తెలుగు నేర్చుకొన్నారు.

స్వామివారు ఆంధ్రుల పుణ్యోదయమా అన్నట్లు ఆంధ్రదేశమంతటా పర్యటించి సనాతన ధర్మ ప్రచారం చేశారు. సంస్కృతంలో దిగ్గజాలవంటి పండితులు వారిని శల్య పరీక్ష చేసి చూచారు. శ్రీస్వాములవారు దైవకృప పొందినవారు, ఆత్మానుభూతి కలిగినవారు. కనుక వచ్చినవారు వారి పాండితిని చూచి తెల్లబోయారు, అభినవవ్యాసులన్నారు.

శ్రేష్ఠ పర్వతాల్లో నివసిస్తూ నిరంతరం గీతాధ్యయనం చేస్తూ గంభీరబుద్ధి గలిగిన వాళ్ళను 'గిరి' నామధారియని మఠామ్నాయంలో శ్రీ శంకరులు స్వయంగా వ్రాశారు. శంకరుల ఉద్దేశాన్ని పూర్తి చేయడానికి శ్రీస్వాములవారు (శ్రీమలయాళస్వాములవారు) శ్రీవ్యాసాశ్రమాన్ని

ollow the master మురళీధర కృష్ణుడు

స్థాపించారు. ఈ ఆశ్రమంలో శిక్షణ పొందిన అనేకమంది శిష్యులు, యతులు కేవలం భారతదేశంలోనే గాక ప్రపంచమంతటా సనాతన వైదిక ధర్మ ప్రచారం చేస్తున్నారు. శ్రీ స్వాములవారు తమ తపశ్చర్య ద్వారా, పవిత్ర జీవనం ద్వారా, అనుష్ఠానం ద్వారా దశనామ పరమహంస సన్యాసుల గౌరవాన్ని ఇనుమడింప జేశారు. సామాన్యుల హృదయాలలో దశనామ పరమహంస సన్యాసుల పట్ల భక్తి శ్రద్ధలను జాగృతం చేశారు.

శ్రీ మలయాళస్వాములవారు వ్యాసాశ్రమాన్ని స్థాపించి శంకరుల పరంపరానుసారం సనాతన ధర్మానికి ఎంతో విలువైన సేవ జేశారు. స్థాపించిన నాటి నుండి తన చివరి ఘడియలవరకు స్వయంగా దాన్ని ఎంతో సమర్థంగా నడిపారు. తెలుగులో వారి రచనలు తెలుగు భాషకు ఒక అపూర్వ సాహిత్యాన్ని సంతరించి పెట్టాయి. (శ్రీ మలయాళస్వామి శతజయన్తి సంచిక నుండి)

"త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు " కు ఈక్రింది వారు పైకం పంపినారు

(1).	కె.సౌందర్యమ్మ (మైపాడు)	
	భర్త : కీ॥ శే॥ రామసుబ్బారెడ్డి జ్ఞాపకార్థము	రూ. 10,000/-
(2).	జె.సీతారాం (హైద్రాబాద్),	
	భార్య :సూర్యప్రభావతి పేరిట	రూ. 25,000/-
(3).	అన్నె నవమణి ట్రస్టు (గుజ్జంగూడ -రంగారెడ్డి జిల్లా	రూ. 20,000/-
(4).	రాచమడుగు లక్ష్మీనారాయణ (బెంగుళూరు)	రూ. 10,000/-

సద్గురు సర్వ సేవా ట్రస్టుకు అన్నదానానికి ఈక్రింది వారు పైకం ఇచ్చినారు

(1).	పాకనాటి ప్రమీలాదేవి గారు (హైద్రాబాద్)	రూ. 2,00,000/-
	వడ్డీతో ప్రతి సంవత్సరం అన్నదాన నిమిత్తం	
(2).	కె. మురళీ (గాయత్రినగర్, నిజామాబాద్)	రూ. 15001/-
(3).	జి.వి.ఎస్.భానుమూర్తి (తిరుమల) అన్నదానానికి	రూ. 20,000/-
(4).	జి.వి.ఎస్ భానుమూర్తి (తిరుమల)బి.బాలసరస్వతిపేరిట	రూ. 20,000/-
(5).	వినాయక నాగనాథ్ కోట (షోలాపూర్)	రూ. 20,000/-



చరాచర సుఖాభిలాషి

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

(శ్రీ సద్గురు మలయాళ స్వాములవారి ఆరాధన సందర్భంగా)

గుమ్మడితీగ పుట్టినచోట ఫలించదు. చాల దూరము పోయి అచట ఫలమును కలుగజేయును. అట్లే శ్రీ సద్గురు మలయాళ స్వాములవారు ఎక్కడో కేరళదేశమున జన్మించి ఆంధ్రదేశమున అడుగుపెట్టి అచట [illegible] తపమాచరించి ఆత్మానందమును బడసి, ఆ ఆనందామృతమును ఆంధ్రులందఱికిని పంచిపెట్టి తాము తరించి ఇతరులను తరింపజేసిరి.

ఎవడు బ్రాహ్మణుడు ?

సంస్కృతం [illegible]

అనువాదం బ్రహ్మచారి ఆనందమోహన్

శుష్క వేదాంతము పట్టపగ్గములు లేక విచ్చలవిడిగా జనులలో వ్యాపించియున్న తరుణమున, దురాచారములు, దుర్వాదములు, మూఢ నమ్మకములు, జాతి, కుల ద్వేషములు, సంకుచిత భావములు జనుల హృదయాలలో పాతుకపోయియున్న సమయమున శ్రీస్వాముల వారవతరించి వానినన్నిటిని ఖండించి జనులకు యథార్థ తత్త్వమును బోధించిరి. విశాల భావములను జనులలో వ్యాపింపజేసిరి. స్త్రీ శూద్ర అంత్యజాదులు కూడ బ్రహ్మజ్ఞానమును బడయుటకు అర్హులే యనియు, మానవులందరు ఒకే జాతి వారనియు, భేదము కల్పితమనియు ఎలుగెత్తి చాటిరి. ' అమృతస్య పుత్రాః " అని ఉపనిషత్తులు ఘోషించునట్లు ఓ జనులారా ! మీరందరు నాశరహిత పరబ్రహ్మ గోత్రోద్భవులు. మీలో అఖండ దైవశక్తి ఇమిడియున్నది. భక్తివైరాగ్య విచారణాది సాధనలచే దానిని లెస్సగ ప్రజ్వలింపజేసి, అనుభూత మొనర్చుకొని తరింపుడు ! అని శ్రీస్వాములవారు గంభీరముగ బోధించిరి.

తత్ఫలితముగ ఆంధ్రదేశమున గొప్ప సంచలనము కలిగెను. ఒక ఆధ్యాత్మిక విప్లవము చెలరేగెను. స్త్రీలు, ద్విజేతరులు ఉత్సాహముగ ముందుకు వచ్చి సంస్కృతమును, వేదవిద్యను అభ్యసించుటేగాక ఆచార్య పీఠములను గూడ అలంకరించిరి. సంఘములో ఇట్టి అపూర్వక్రాన్తిని కలిగించి, సమభావము నుద్దీపింపజేసి, అందఱి చేతను భగవద్గీతను పట్టించి, అందరిచేత బ్రహ్మవిద్యను అధ్యయనము చేయించి ఆంధ్రుల సర్వతోముఖాభివృద్ధికి శ్రీస్వాములవారు విశేషదోహదమును కలుగజేసిరి. వారి ప్రబోధములవలననే జనులు హింసాప్రవృత్తిని విడనాడి దయ, ప్రేమ, కరుణ మొదలగు ఉదాత్తగుణములను అలవఱచుకొనిరి.

శ్రీస్వాములవారు గొప్ప అనుష్ఠాన పరులు. చేసినదే చెప్పుట, చెప్పినదే చేయుట వారినైజము. శాస్త్రోక్తశమదమాదులు, సత్యశౌచాదులు, క్రమశిక్షణ సాధకుల కెంతయో అవసరమని శ్రీస్వాములవారు పదే పదే నొక్కి చెప్పుచుండెడివారు. క్రమశిక్షణకు వారికి పెట్టింది పేరు. భగవంతుడు సర్వవ్యాపి కావున భగవత్స్వరూపములగు చరాచరములన్నియు సుఖంగా ఉండవలయునని శ్రీవారి యభీష్టము. కనుకనే శ్రీ స్వాములవారు చరాచర సుఖాభిలాషి అని తమపేరుకు ముందుగా వ్రాయుచుండిరి. ఇట్టి శ్రీవారి దివ్యబోధలను సంస్మరించుకొని వారి ఆదేశములను శిరసావహించి దైనందిన జీవితమందు ఆ బోధలను కార్యాన్విత మొనర్చుకొని పరమానందము ననుభవింతురుగాక ! **(శతజయన్తి సంచిక నుండి)**

శివాలయ పూజానిధికి క్రింది వారు పైకం పంపినారు

(1).	క్యాతం స్వర్ణలత (సికింద్రాబాద్)	రూ. 25,000/-
(2).	బాలె నాగయ్య, భార్య రాజేశ్వరి గారలు (ముంబై)	రూ. 10,000/-
(3).	వి.చెన్నారెడ్డి (పెద్దజడియం)	రూ. 10,000(-
(4).	టి.బాలశంకర్‌రెడ్డి (హైద్రాబాద్)	రూ.10,116/-

" పెద్దలమాట చద్దిమూట "

- బిరుదువోలు రాజయ్య (శ్రీరాజశేఖరా నందగిరిస్వాములవారు (శ్రీ సద్గురు స్వాములవారి అంతరంగ సేవకుడు)

1932వ సం॥లో రెండవ సనాతన జ్ఞానమహాసభ నెల్లూరుజిల్లా, నాయుడుపేటకు తూర్పుగా నున్న అరవపాళెం అను గ్రామంలో జరిగినది. నెల్లూరుజిల్లా వేదాయపాళెంకు తూర్పునగల మా గ్రామం కనుపర్తిపాడు నుండి నేను మా మేనత్తతో కలసి ఆ సభకు పోయినాను. ఆనాటి సభ దేవేంద్ర సభకు సమానంగా వుందని చెప్పవచ్చు. సభాస్థలంలో సభకుగాను చక్కటి పందిళ్లు వేసినారు. పచ్చనితోరణాలు, చిక్కని రంగవల్లులు. ఆ పందిర స్తంభాలకు కట్టిన పచ్చటి అరటిమాకులు, వత్తుగ రంగు కాగితాలు గల సభా ప్రాంగణం మధ్యలో ఎఱ్ఱ తామరపూలతో నిండిన తామరకొలను గల సభాస్థలం వింతశోభతో శోభిల్లుతూ కన్నుల పండువగా వుండినది. సభానంతరం తుదిరోజు అపరాహ్ణం తామరకొలనులో శ్రీస్వాములవారి నుంచి తెప్పోత్సవం చేయాలని గ్రామ పెద్దలువ్విళ్లూరిరి. కాని శ్రీవారు ఆ ఆడంబరాల కిష్టపడలేదు. కార్యకర్తలు ఒక ఉపాయం చేసి గ్రామంలోని రాములవారికి ఈ తామరకొలనులో తెప్పోత్సవం నేడు జరుగునున్నదని, అందు తాము కూర్చొన్న చాలునని ప్రార్థించగా శ్రీస్వాములవారు ప్రధానంగా శ్రీరాములవారి తెప్పోత్సవమైతే అందు తాము కూర్చొందుమని అంగీకరించారు. కిక్కిరిసిన జన సమూహాలతో, మంగళవాయిద్యాలతో ఎత్తుగా శ్రీరాముల వారి పటంపైన, దానికి కొంత క్రిందగా శ్రీస్వాములవారిని కూర్చుండబెట్టి తెప్పోత్సవం చేసిరి. నిజంగా దాన్ని చూడడానికి రెండు కళ్లూ చాలవు. ఆ దృశ్యం కళ్లకుకట్టి ఇప్పటికీ నా మనస్సులో నాటుక పోయినది.

మూడు రోజుల సభ మూడవరోజు మధ్యాహ్నంతో ముగిసినది. మరు రోజు ఉదయమే మామేనత్తగారు మేమందరము వూరికి పోవడానికి

శ్రీ స్వామివారి అనుమతి కోసరం వారిని దర్శించి మా ప్రయాణ విషయం చెప్పాము. ఎప్పుడు నిర్లిప్తంగావుండి సరే అనే స్వాములవారు ఆ రోజు మాకు అనుమతి ఇవ్వలేదు. ' ఈ రోజు ఆగి వెళ్లండి " అని అన్నారు. అప్పుడు మా మేనత్తగారు వగైరా అమ్మగార్లు తప్పక నేడు ఇల్లు చేరాలి. కాబట్టి వూరికి పోతామని మరల మరల అడుగుటచే శ్రీ స్వాములవారు " మీ ఇష్టము " అని అన్నారు ముభావముగా.

నాడు గ్రామాలలో బస్సు రోడ్లు లేవు. బస్సు సౌకర్యం లేదు. కాబట్టి గుఱ్ఱపుబండిని మాట్లాడుకొని అందులో బయలుదేరితిమి. అందు శ్రీ వ్యాసాశ్రమంవారు సభకు తెచ్చిన శ్రీరామకృష్ణ పరమహంస పటాన్ని కూడా పెట్టినారు. గుంతలు, మిట్టలు గల బాటలో మా గుఱ్ఱపు బండి ఒడిదుడుకులతో ఉయ్యాలలూగుతూ, కుదుపులతో కొంతదూరం పోగానే బండి బోల్తాపడినది. మేమందరం క్రిందపడితిమి. బండిలోని పటం క్రిందపడి పగిలిపోయినది. దాని గాజు పెంకులు మాకందరికి గ్రుచ్చుకొని గాయాలయినవి.

గత్యంతరం లేక బండిని త్రిప్పించుకొని సభాస్థలం చేరితిమి. బండి పడిపోయి గాయాలతో మేము తిరిగివచ్చిన సమాచారం శ్రీస్వాములవారికి ఎట్లాగో తెలిసినది. అంత శ్రీవారు " మేము ఆగమని చెప్పినా వినకుండా వెళ్లినారు. కాబట్టి ప్రాయశ్చిత్తం చేసుకొంటేనే మా వద్దకు రావాలి. లేకుంటే వద్దని" చెప్పి పంపినారు. మేము గురువుల మాటను దాటినాము గాన ప్రాయశ్చిత్తం చేసుకుని ప్రాయశ్చిత్తరూపంలో ఆశ్రమంలో ఐదుగురు అమ్మగార్లకు, ఐదుగురు సాధువులకు భోజనం పెట్టమని ఒక్కొక్కరికి ఐదేసి రూపాయలు సమర్పించుకొని, ఆ తరువాత వూరికి ప్రయాణమై వూరి చేరితిమి. గాజు పెంకుల బాధ ఒక ప్రక్క వున్నా శ్రీస్వాములవారు ముందు చూపుతో ఆగిపొమ్మన్ననూ దానినికాదని మేము చేసిన తప్పుకు తగిన దండన లభించిందని ఆశ్చర్యపడితిమి.

(శ్రీ మలయాళ – శ్రీ సద్గురు చరణ సన్నిధి – నుండి)



నా గురుదేవులు స్వామి తపోవనమ్

ఆంగ్లమూలం : స్వామి చిన్మయానంద

అనువాదం - స్వామిని శారదాప్రియానంద

ప్రస్థానత్రయాన్ని (ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత మూడు కలిసినది ప్రస్థానత్రయం, ఇవి హిందూ సంస్కృతికి మూల గ్రంథాలు) అధ్యయనం చేయగోరి వచ్చిన శిష్యులకి బోధ చేసే అలవాటు స్వామి తపోవనమ్ వారికి ప్రారంభం నుండే ఉండేది. అయితే ఆయన విధించే కఠినమైన క్రమశిక్షణకి శిష్యులు తట్టుకోలేక చదువు పూర్తి చేసుకోకుండానే వెళ్లిపోయే వాళ్లు. స్వామీజీ శిష్యుల్లో నేను చివరితరం వాడిని. నా **అధ్యయన సాధన పదేళ్ల కాలంలోనే ముప్పై ముప్పై అయిదు మంది దాకా మంచి ఉత్తేజంతో వచ్చి రెండేళ్లకన్నా నిలవలేక వెళ్లిపోవటం నేనెరుగుదును. ఆ శీతల వాతావరణం, ఏ సౌకర్యాలూ లేని ప్రదేశం, పుష్టికరమైన ఆహారం దొరకకపోవటం, గంగా నదిలో వణుకుతూ స్నానం, కఠినమైన అధ్యయనం, పట్టు సడలని క్రమశిక్షణ** – ప్రతి ఒక్కటీ ఇబ్బంది పెట్టేదే ! సర్వాతీతమైన అనంతతత్త్వాన్ని దూరం నుండి కూడా చూడలేని మాకు ఇవన్నీ కలిసి అమితమైన బాధను కలిగించేవి.

వాళ్లే కనుక చదివి ఊరుకోకుండా, కొంచెం సమయాన్ని అయినా మననానికి, ధ్యానానికి వెచ్చించి ఉంటే తపోమయ జీవితాన్ని గడిపే ధైర్య రహస్యం తెలిసేది. ఉత్తరకాశీ ఇబ్బందులన్నింటినీ మరచిపోయేట్లు చేసే అంతులేని ఆనంద నిధి పొంది ఉండేవారు. వాళ్ల ఓటమికి వాళ్లే కారకులు.

ప్రతి సంవత్సరం వేసవి మొదట్లో స్వామీజీ ఋషీకేశానికి వచ్చేవారు. జూలై నాటికి గంగోత్రికి చేరి, నవంబర్ మొదటి వారానికి ఉత్తరకాశీకి తిరిగి వచ్చేవారు. మేం వెంట వెళ్లేవాళ్లం. ఉత్తరకాశీలోనూ, గంగోత్రిలోనూ మాకు పాఠాలు ఉండేవి. స్వామీజీ రోజూ ఉదయం గంటన్నరసేపు బోధ చేసేవారు. చలికాలంలో మట్టుకు మధ్యాహ్నం రెండు గంటల నుండి మూడున్నర వరకూ పాఠం చెప్పేవారు.

భగవద్గీత ప్రారంభించబోయే ముందు వారికి విపరీతమైన దగ్గుతెర

వచ్చింది. మాట్లాడాలని ప్రయత్నించినప్పుడల్లా దగ్గుతెర ఇంకా ఎక్కువయ్యేది. “ నీ అంత నీవే చదువుకో, అనుమానాలు ఉంటే నా దగ్గరికి రా, నీకేమీ కష్టమవుతుందని అనుకోను ” అన్నారు శ్రీ గురుదేవులొకరోజున. నాటితో పుస్తకం పట్టుకొని వారి పాదాల వద్ద కూర్చొని పఠించటం ఆగిపోయింది.

1955 ఆఖరులో స్వామీజీ జబ్బుపడ్డారు. ఆ సంవత్సరం గంగోత్రి నుండి ముందుగానే క్రిందికి వచ్చేశారు. ఎక్కువగా తల తిరుగుడు, మా దగ్గరికి చాలా మందులు చేరాయి. స్వామీజీ ప్రతి దానికి మూడు రోజులు అవకాశం ఇచ్చేవారు. “ వరుసలో ఉన్న ప్రతి దానికీ ఛాన్స్ ఇవ్వవద్దూ” అని నవ్వేవారు. ఆయన ఆరోగ్యం క్రమంగా క్షీణించింది. జీర్ణశక్తి బొత్తిగా పోయింది. 1955-56 సంవత్సరంలో యజ్ఞాల నడుమ నేను ఉత్తరకాశీకి మూడు నాలుగు సార్లు పరుగెత్తాను. వైద్యనిదానం కోసం ఢిల్లీ వరకూ రావలసిందని చేసిన విన్నపాలన్నింటికీ చికాకుతో తిరస్కరించారు. చూచిన ప్రతిసారి శరీరం మరింత శుష్కించి ఉండేది. నాతోబాటు వారి భక్తులని, ఇతరులను కూడా తీసుకు వెళ్లాను. ఎవరూ ఆయన్ని చికిత్స కోసం క్రిందికి వచ్చేట్లు ఒప్పించలేకపోయారు.

1956 డిసెంబర్ మొదట్లో ఉత్తరకాశీని దర్శించినప్పుడు నేను దుఃఖం ఆపుకులేక ఏడ్చేశాను.ఆయన నా కన్నీళ్లని చూచి మృదువుగా అన్నారు “ చిన్మయా ! వేదాంతం నేర్చుకోవటం తేలిక, బోధించటం ఇంకా తేలిక, జీవించటం మట్టుకు ఎంతో కష్టం, మనం పుట్టినప్పుడే మనతోబాటే చావు పుట్టింది. ఇన్నాళ్లు జీవించి అనుభవించటానికి ఆయన అవకాశం ఇచ్చాడు. ఇన్నేళ్ల నుండి వేచి ఉన్న ఆయన నన్ను కలుసుకోవటానికి వస్తున్నాడు. ఇప్పుడాయనని తప్పించుకోవటానికి పారిపొమ్మంటావా ? ఎంత క్షుద్రం ! ఇక్కడ నేను శాంతంగా జీవించాను. నా తల్లి గంగామాత యొక్క నిత్య సంగీతాన్ని వింటూ శాంతంగా మరణించలేనా ! విచారించక నీవు వెళ్లి పనిని కొనసాగించు.... లే !..” నేను నా యజ్ఞశాలకి వచ్చాను. పాలఘాట్‌లో యజ్ఞం జరుగుతుండగా కబురు వచ్చింది. ప్రకటమైన దివ్యజ్యోతి తిరిగి అనంత తత్త్వంలో కలిసిపోయింది. 1957 జనవరిలో పౌర్ణమినాడు ఆ మహనీయుడు తన భౌతికకాయాన్ని త్యజించారు.

“నారాయణాయేతి సమర్పయామి ” ఓం శాంతి శ్శాంతి శ్శాంతి :

(అరణ్యస్పందన నుండి)

ధర్మశాస్త్రాలు - నేటి సమాజం

– డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

మనుధర్మశాస్త్రంలో లోకోత్తరమైన ఎన్నో ధర్మాలు ఉన్నాయి. అట్లే లోకనింద్యమైన అధర్మాలు గూడా అందులో కొన్నిచోట్ల ధర్మాలనే పేరుతో ప్రస్తావించబడి వున్నాయి. ఇది ఎలా జరిగింది ? ఈ విషయమై శ్రీ మలయాళ సద్గురు స్వాములవారు ఏమన్నారో తిలకించండి !

“ బ్రహ్మవిషయమై చూచిన మనువు అతీంద్రియజ్ఞానం కలవాడనియు, అఖండ బ్రహ్మనిష్ఠుడనియు ఎట్టివారికైనా గోచరింపక పోదు. ఇందుచే మనువు మహర్షి సత్తముడనియు, పరమ పూజ్యుడనియు, బ్రహ్మనిష్ఠాగరిష్ఠుడనియు గ్రహించి నమస్కరించుట శ్రేయోదాయకము. జాతి విషయమై, సంఘ విషయమై మనుస్మృతి యందలి భాగము క్రూరపిశాచములు గూడ చెప్పనట్లును, పరమనీచులు గూడ తలంప నట్లును, పరమక్రూరులు గూడ చేయనట్లును వ్రాయబడి యున్నది. ఈ విషయము మనుమహర్షిచే వ్రాయబడినది కాదనియు, మధ్యకాలమున జాతివైషమ్యావేశోద్రేకపూరితహృదయు లెవరో క్రూరభావనతో చేసి యుండవచ్చుననియు పలువురు నుడివిరి. శ్రీ దయానందులు కల్పిత శ్లోకములు ఫలానివని చూపియున్నారు. మనువు అపారమహిమగల బ్రహ్మజ్ఞుడని మనము తలంపవలెను. క్షీరనీరన్యాయము ననుసరించి సముచితమై సర్వజనసమ్మతమై జనుల కాదరణీయమగు ముఖ్య విషయమును మాత్రము గ్రహించినచాలును”. (ఓంకారము 197 - 198 పుటలు)

దీనినిబట్టి ధర్మశాస్త్రాలలో భిన్న భిన్న కాలాలలో ప్రక్షిప్తాంశములు

చోటు చేసుకొన్నాయని ఊహించడానికి అవకాశమున్నది. వాటివల్ల ఆ శాస్త్రాల గౌరవం క్షీణించింది.

విద్యలోనూ, తపస్సులోనూ వర్ణవ్యత్యాసం లేకుండా అందరికీ ప్రవేశం కల్గించకపోవడం వల్ల దేశానికి వాటిల్లిన అనర్థాన్ని గురించి శ్రీ సద్గురు స్వాములవారు శ్రీ మలయాళయతీంద్రగీతలో విస్పష్టంగా విశదీకరించి యున్నారు. విద్యాతపస్సులు మనుజునికి ఆత్మోన్నతి కల్గిస్తాయి. వాటివల్ల పవిత్రత సిద్ధిస్తుంది. ధర్మశాస్త్రాలు కొందరికి అందులో ప్రవేశాన్ని నిషేధించాయి. ఈ సంగతి ప్రస్తావించి గురుదేవులిలా చెప్పారు.

తస్మాద్విద్యాతపోభ్యాం హి పుతాత్మేతి శ్రుతేర్వచః।
రుద్ధవిద్యాతపోధ్యానాత్ జనావృద్ధిం నలేభిరే ॥

విద్య చేతను, తపస్సు చేతను మనుజుడు పవిత్రుడవుతాడని వేదవచనం. విద్యాతపోధ్యానాలు అనుష్ఠించనీకుండా నిరోధింపబడినవారు వృద్ధి పొందలేక పోయారు.

ఏవం నిషిద్ధాః స్వమతే సుఖామప్రాప్యతే జనాః।
మతాంతరం సమాలంబ్య సంజాతా యవనాదయః ॥

ఈ రీతిగా తమ మతంలో నిరోధింపబడినవారు సుఖం పొందలేక ఇతర మతాలు స్వీకరించి యవనాదులుగా పోయారు.

సమస్తం భారతం దేశం మతద్వేషైరఖండయన్।
హైందవానాం మతం తస్మాద్బలహీన మజాయత ॥

అలా మతం మార్చుకొన్న వారు మతద్వేషాలతో సమస్త భారతావనిని ఖండించారు. అందుచేత హిందూమతం బలహీనమయింది.

నిరోధకా నరా అన్తే స్వాత్మశక్తి విహీనతామ్।
గతాస్సంపాలితాశ్చాన్యై ర్విదేశీయైః కుశాసకైః ॥

ఇతరుల ఆత్మోన్నతిని నిరోధించినవారు గూడా చివరకు ఆత్మశక్తి లేనివారై విదేశీయులైన దుష్టపాలకులచేత పాలింపబడ్డారు.

ఇలా భారతదేశానికి వాటిల్లిన దుఃస్థితికి ఒకవిధంగా చూస్తే ప్రక్షిప్త వాక్యాలతో నిండిన మన ప్రాచీన శాస్త్రాలే అని ఊహించవచ్చు. అందుచేత ఆ శాస్త్రాలలోని కాలుష్యాన్ని తొలగించక తప్పదు.

శ్రీ సద్గురు స్వాములవారు దేశవినాశానికి కారణాలు పేర్కొంటూ మళ్లీ ఇలా అన్నారు.

యోగ్యతాంహి సమాలక్ష్య యోగ్యాయస్థానమున్నతమ్।
యస్మిన్ దేశే న దీయేత సదేశో నంక్ష్యతి ధ్రువమ్ ॥

యోగ్యతను గమనించి యోగ్యునికి సమున్నత స్థానం కల్పించని దేశం తప్పక నశిస్తుంది.

అధఃకర్తుం పరాన్యస్తు సమీహేత దురాగ్రహాత్।
అధఃక్రియేత సోఽప్యన్యై రిద మీశ్వర శాసనమ్ ॥

ఇతరులను దురాగ్రహంతో అణగద్రొక్కడానికి ప్రయత్నించే వాడు గూడా తప్పక ఇతరులచే అణగద్రొక్కబడతాడు. ఇది ఈశ్వర శాసనం.

ఒక సనాతన ధర్మస్వరూపాన్ని వివరిస్తూ శ్రీ స్వాములవారు ప్రవచించిన విషయం గూడా గమనార్హం.

"ఇతరుల ఆత్మోన్నతికి అడ్డుపడకుడు. మీ ఆత్మోన్నతికి అడ్డు కలిగిన తొలగించుకొనుడు. సాధ్యమైనచో ఇతరులకు సాయపడుడు. ఇదే సనాతన ధర్మం." అని సనాతన వేదాంత సభలలో శ్రీవారు సనాతన ధర్మ స్వరూపాన్ని ఎలుగెత్తి చాటారు.

వజ్రసూచికోపనిషత్తులో ధర్మచర్య వల్ల తక్కువవర్ణం వారు ఎక్కువ వర్ణం వారుగా పరిణమిస్తారనీ, అధర్మ చర్య వల్ల ఎక్కువ వర్ణంవారు తక్కువ వర్ణం వారుగా మారిపోతారనీ చెప్పబడియున్నది.

దీనికి జన్మాంతరంలో అలా మారిపోతారని కొందరు భావిస్తారు. అది తగదు. ఈ జన్మలోనే సత్ప్రవర్తన వల్ల, దుష్ప్రవర్తన వల్ల మార్పు సంభవిస్తుందన్న సత్యం గ్రహించాలి.

భగవద్భక్తిపరుడు కలియుగంలో ఉన్నా కృతయుగానికి చెందుతాడనీ, భక్తిహీనుడు కృతయుగస్థుడైనా కలియుగంవాడుగానే పరిణమిస్తాడనీ పెద్దలు చెప్పారు.

కలౌ కృతయుగం తస్య కలిస్తస్య కృతే యుగే ।
యస్య చేతసి గోవిందో హృదయే యస్యనాచ్యుతః ॥

ఇది భక్తికి మాత్రమే సంబంధించిన సంగతికాదు. సత్ప్రవర్తన కల్గినవాడు ఏకాలం వాడైనా కృతయుగానికే చెందుతాడు. దుష్ప్రవృత్తి పరుడు ఏకాలంవాడైనా కలియుగానికే చెందినవాడవుతాడు. మన ప్రవృత్తిపైనే కాలం, యుగం ఆధారపడి వుంటాయన్న సత్యాన్ని విస్మరించరాదు.

“ రాజా కాలస్య కారణమ్ ” అని మహాభారతవచనం. కాలానికి కారణం రాజే. రాజంటే పరిపాలన విధానమే అని ఈ కాలంలో అర్థం చేసుకోవాలి. కాబట్టి ‘ కలి, కలి ’ అని జపించి కాలుష్యాన్ని పెంచుకోరాదు. ‘ కలి, పేరు చెప్పి దుష్టకార్యాలకు అలవాటు పడరాదు. “ మనోఽను సారేణ యుగ ప్రవృత్తిః ”– మన మనస్సు ననుసరించే యుగం ఉంటుంది అన్న దృఢ నిశ్చయంతో జీవించాలి.

నేటి సమాజంలో ఎంతో మార్పు కనిపిస్తున్నది. అంధవిశ్వాసాలు తగవు. భగవంతుడిచ్చిన యుక్తాయుక్త విచక్షణ శక్తిని ఉపయోగించుకొని మనము ధర్మాధర్మ వివేచన చేయాలి. ధర్మ పరులమై జీవించి ధన్యులం కావాలి. ప్రాచీన ధర్మశాస్త్రాలను గ్రుడ్డిగా అనుసరించరాదు.

శ్రీ శుక మహర్షి బోధ

(గత సంచిక తరువాయి)– ఎస్.వి. భారతీలక్ష్మి, (భీమవరం)

ప్రారబ్ధ కర్మానుభవమునకు దేహము కారణము. దేహమునకు కర్మకారణము. కర్మకు అహంత కారణము. అహంతకు అవిద్య కారణము. అవిద్యా ప్రతిబింబితుడగు జీవుడు కామమను పిశాచమునకు లొంగి అధఃపతనమై పోవుచున్నాడు. జీవుని ఆశ్రయించిన విషయ భోగ వాంఛయే కామపిశాచం. స్త్రీ సంపర్కము వలన భోగేచ్ఛ గలుగును. భోగేచ్ఛయే బంధము. దానిని త్యజించుటయే మోక్షము. భోగములు ఆకాశంలోని మెఱపులవలె చంచలములు. ఆయువు కాలిన పెనం మీద పడిన నీటి బిందువులవలె సద్యోనాశన (ఆ క్షణమే నశించు) స్వభావం గలది. ఐశ్వర్యం ఛాయవంటిది. యౌవనం తరంగం వలె అస్థిరం. స్త్రీ సుఖం స్వప్నంలోని ఆనందం వంటిది. ఈ విధంగా జీవితం క్షణభంగురమనియు, అశాశ్వతమనియు, తెలియుచున్నను మానవుడు సంసారము సత్యమను భ్రాంతిలో పడియున్నాడు.

వైరాగ్య బోధోపరతులు సాధకుని తత్త్వచింతనకు ఉపకరించును. అందు వైరాగ్యము బ్రహ్మవిచారణకు ప్రథమ సోపానము. వైరాగ్యము వంటి భాగ్యము లేదు. సంసారము వంటి శత్రువు లేదు. స్త్రీ విత్తాది విషయములను వమనాహారము వలె (కక్కిన కూడు వలె) త్యజించి దేహాభిమానము లేకుండుట వైరాగ్యము. బోధయనగా జ్ఞానోదయం. ఉపరతియనగా విరక్తి, ఉదాసీనత. వైరాగ్యమనే నూనెను బోధయనే ప్రమిదలో పోసి, భక్తియనే వత్తిని చేర్చి జ్ఞానమనే జ్యోతిని వెలిగించి ఆకాంతిలో స్వస్వరూపమును దర్శించవలెను. వైరాగ్యము యొక్క ఫలం

బోధ. బోధయొక్క పలం ఉపరతి. ఉపరతి యొక్క ఫలం శాంతి. శాంతియే స్వాత్మానందం. అట్టి ఆనందాంతరంగుడైన సాధకుడు తానే బ్రహ్మమునని భావించి, అహంకారమును విడచి, ఏకాగ్రచిత్తుడై దేహావసాన సమయమునకై నిరీక్షించు చుండును.

తత్త్వచింతన (బ్రహ్మవిచారణ) ఉత్తమం. శాస్త్రచింతన మధ్యమం. వశీకరణాది మంత్ర చింతనలు అథమం. తత్త్వచింతన అనగా 'తత్త్వమసి' మహావాక్య విచారణ అనగా ఆ పరబ్రహ్మము నీవను బోధ. ఆ బోధ వలన 'అహం బ్రహ్మాస్మి ' అనగా, నేను బ్రహ్మమును అను జ్ఞానము గలుగును. ప్రజ్వలితాగ్ని కట్టెలను భస్మం చేసినట్లు జ్ఞానాగ్ని సమస్త కర్మలను భస్మం చేయునని శ్రీకృష్ణ పరమాత్మ చెప్పాడు 'జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం 'అని .

సంకల్ప రూపమగు మనస్సు కంటె నిశ్చయాత్మకమగు బుద్ధిపరము. బుద్ధి కంటె ఆత్మ (క్షేత్రజ్ఞుడు) పరము. ఆత్మ కంటె మహత్తత్త్వము (హిరణ్యగర్భుడు) పరము. మహత్తత్త్వము కంటె అవ్యక్తము పరమైనది. అవ్యక్తమనగా, పరమాత్మకు జగత్తునకు మధ్యనున్న ప్రకృతి. లేదా మాయా శక్తి. పరమాత్మ వలెనే యిది కూడ నిరాకారం. పరమాత్మ యొక్క సంకేతంతో నామరూపాత్మకంగా పరిణమించి వ్యక్తమవుతుంది. పరమాత్మను ప్రపంచముగా చూపునది అవ్యక్తమైన మూల ప్రకృతియే. అవ్యక్తము కంటె పురుషుడు (పరమాత్మ) పరము. అవ్యక్తమును తెలిసికొనుటకు బ్రహ్మ విచారణ అవసరము. బ్రహ్మ విచారణ వలన జ్ఞానము గలుగును. జ్ఞానము వలన మోక్షము సిద్ధించును. ' జ్ఞానా దేవహి కైవల్యమ్ '. కూలివాడు నిర్దిష్ట సమయమువఱకు కూలిపని చేసి కూలిడబ్బులు తీసికొని వెళ్ళిపోవును. యజమాని యొక్క లాభనష్టముల గుఱించిన చింత వానికి ఉండదు. అట్లే కర్మయొక్క ఫలితాన్ని అభిలషించక,జనన మరణాదుల గుఱించి

ఆలోచింపక సర్వ వ్యాపారములను విడచి 'నేను బ్రహ్మమును' అని భావన చేయుచు, అహంకార మమకారములులేక యేకాగ్రచిత్తుడై ప్రారబ్ధ క్షయ సమయమునకై నిరీక్షించుట సాధకుని కర్తవ్యము.

కామము తత్త్వజ్ఞునికి నిత్యవైరి. విషయవాంఛల యందు రాగమును కల్పించి పశువును త్రాటిచే బంధించినట్లు జీవుని కామము బంధించుచున్నది. కామమును నిరోధించు సాధనలే వారిరువురకు జరుగు పోరాటము. ధూమముచే అగ్నివలెను, మావిచే పిండము వలెను, మలినముచే దర్పణము వలెను కామముచే ఆత్మజ్ఞానము ఆవరింపబడి యున్నది. అగ్నిని ప్రజ్వలింపజేసినచో ధూమము తొలగి పోవును. నైపుణ్యముతో మావిని తొలగించినచో పిండము బయట పడును. మలినము తొలగించినచో దర్పణము స్వచ్ఛమగును. కామ ప్రకోపమునకు సంకల్పములు కారణము. సంకల్పములకు విషయవాంఛలు కారణము. విషయవాంఛలకు మనస్సు కారణము. ఆత్మానాత్మ వివేకము వలన, ఆత్మ విచారణ వలన మనస్సును నిగ్రహించిన యెడల కామము నిగ్రహింపబడును. కామము నిగ్రహింపబడినచో విషయ వాంఛలు తొలగిపోవును. విషయ వాంఛలు తొలగినంతనే సంకల్ప రాహిత్యమై స్వస్వరూప జ్ఞానము గలిగి సాధకుడు ముక్తుడగును.

ప్రణవముకంటె వేఱుమంత్రము లేదు. ఆత్మకంటె వేఱు దైవము లేదు. ఆత్మానుసంధానము కంటె వేరు పూజ లేదు. కావున యింద్రియ ద్వారములను మూసి వాయువును అంతర్ముఖమొనర్చి సుషుమ్న ద్వారములను పరానాదమునందు సమ్మేళనము చేయుటను నాదానుసంధాన మందురు. ఇట్లు నాదమును సంధించి పరమాత్మతతో కలుపుటయే ప్రణవోపాన యని శ్రీ శుకమహర్షి బోధించెను. **(సశేషం)**

గమనిక : మా గ్రంథం రామాయణరత్నాకరము స్టాకు లేదు.

గురుకటాక్షం !

– శ్రీమతి వి. లక్ష్మీనరసమ్మ

గురుకటాక్షంతో పామరులు, కఠినాత్ములు కూడా పరమోన్నతులుగా మారగలరు. అందుకు వాల్మీకి, శబరి జీవితాలే నిదర్శనం. నారదమహర్షి అనుగ్రహం వల్ల రత్నాకరుడనే బోయవాడు వాల్మీకి మహర్షిగా మారాడు. మతంగముని అనుగ్రహంతో శబర బాలిక తాపసిగా మారింది.

రామాయణంలోని అరణ్యకాండలో శబరి గురించి వస్తుంది. అడవిలో **కోయలు, కొండలు, చెంచులు, కిరాతకులు, బోయలు, శబరులు** అనే తెగలవారు వేట, వ్యవసాయం చేసుకొని జీవించేవారు. అందులో **బోయలు, శబరులు, పక్షులను కొట్టి చంపి తినడం, పక్షుల్ని విక్రయించడం ముఖ్యవృత్తిగా చేసుకొని** జీవించేవారు. పద్నాలుగు సంవత్సరాల శబరి అనే బాలిక విల్లంబులతో పక్షులను కొట్టి పట్టుకుని, బుట్టలో వేసుకుని వెళుతూ ఉండేది.

ఆ అడవిలో నది ఒడ్డున వటవృక్షం దగ్గర మతంగ మహాముని ఆశ్రమం ఉంది. ముని నిత్యం నదీస్నానం చేసి, సూర్య భగవానుణ్ణి ఆరాధించేవాడు. ఆయన ఆశ్రమానికి వచ్చే దారిలో తరచూ వృక్షాల మీద ఉన్న పక్షుల్ని కొడుతూ మునికి కనిపించేది శబరి. ఆ బాలిక విడిచిన బాణం తగిలిన పక్షి గిలగిలా కొట్టుకొని కింద పడిపోతే, రెక్కలు రాని దాని పిల్లలు, ఇతర పక్షుల రోదన ముని మనస్సును కకావికలం చేసేది. ధ్యానం కుదిరేది కాదు. శబరిచేత ఈ హింసను మాన్పించడమెలాగా అని ముని ఆలోచిస్తుండగా ఒక రోజున దైవ సంకల్పంవల్ల ఒక దృశ్యం కనిపించింది.

ఓ పెద్ద చెట్టు కింద ఓ సింహం బాధతో మూలుగుతూ, నోరు తెరచుకొని పడుకొని ఉంది. ఒక నెమలి తన ముక్కుతో సింహం నోటితో గుచ్చుకొని ఉన్న ముళ్ళను తీస్తోంది. ఈ దృశ్యం చూసిన ముని ఆశ్చర్య చకితుడయ్యాడు. వెంటనే ఆయన మనస్సులో ఒక ఆలోచన కలిగింది. శబరికి ఈ దృశ్యం చూపించి ఆమెలోని హింసాప్రవృత్తిని తొలగించాలని

నిశ్చయించుకున్నాడు.

అప్పుడు మతంగముని బాణంతో పక్షిని కొడుతున్న శబరిని పిలిచి నెమలి, సింహానికి చేస్తున్న సహాయాన్ని చూపిస్తూ ఆమెకు ఇలా హితబోధ చేశాడు : " అమ్మా శబరీ ! సింహం క్రూరజంతువు అయినప్పటికీ, నెమలి తన బాధను నివారిస్తోందనే భావంతో దానివైపు కృతజ్ఞతాపూర్వకంగా చూస్తోంది. సింహం వల్ల తనకు ప్రాణాపాయం ఉన్నప్పటికీ నెమలి సింహం నోటిలో గుచ్చుకున్న ముళ్ళను ముక్కుతో తీసి, దాని బాధ నివారణ చేస్తోంది.

దీనివల్ల మనం తెలుసుకోవలసినది ఏమిటంటే బాధలో ఉన్నవారి **బాధను నివారణ చేయడం ధర్మం, బాధించడం అధర్మం,** నెమలి తన మృత్యుభయం లెక్కచేయకుండా ప్రాణం పోయినా ఫరవాలేదనుకొని సింహం బాధను నివారణ చేస్తున్నది. సింహం తనకు ఆహారమైన నెమలిని తన బాధను నివారణ చేస్తున్నదనే కృతజ్ఞతాపూర్వక వాత్సల్యంతో చూస్తోంది. ఎవరినీ ఏ విధంగానూ బాధించరాదు.

ఆహారం కోసం నోరులేని పక్షుల్ని కొట్టడం అమానుషం. మనకు చెట్లద్వారా లభించే ఫలాలు, భూమి ద్వారా లభించే దుంపలు, గోక్షీరాలు, నదీజలాలు ఆహారంగా చాలవా ? మృగాలు, పక్షులలో ఉండే కరుణ మనలో ఉండవద్దా ? ఆహారం కోసం జీవుల్ని బాధించడం ఘోరపాపం."

ముని వాక్కుల వల్ల శబరిలో వెంటనే మార్పు వచ్చింది. విల్లంబులు పారవేసి, మునికి పాదాభివందనం చేసింది. మీ సేవ చేస్తూ జీవించే భాగ్యాన్ని కల్పించమని వేడుకుంది. మతంగముని ఆమెలో కలిగిన మార్పు చూసి ఆమెకు రామమంత్రాన్ని ఉపదేశించాడు.

శబరికి గురుబోధ, గురుకటాక్షం, గురు శుశ్రూష, మంత్రదీక్ష లభించింది. అప్పటి నుండి ఆమె మతంగముని శిష్యురాలై తాపసిగా జీవనం గడుపసాగింది. కొంతకాలం గడిచాక మతంగముని శబరిని పిలిపి ' అమ్మా! నాకు అవసానదశ వచ్చింది. నేను ఈ కన్నులతో శ్రీరాముణ్ణి దర్శించలేకపోయాను. కానీ నీకు మాత్రం రాముని దర్శనభాగ్యం తప్పక కలుగుతుంది ' అని ఆశీర్వదించి దేహత్యాగం చేశాడు. గురువాక్యం నిజం కాకుండా ఉంటుందా ! అరణ్యవాస సమయంలో శ్రీరాముడు శబరి ఆశ్రమానికి వచ్చి ఆమెను తరింపజేశాడు. గురుకటాక్షం లభిస్తే మానవజన్మ ధన్యమైనట్లే కదా ! (**శ్రీరామకృష్ణ ప్రభ సౌజన్యంతో**)



శ్రీ భక్త తుకారాం అభంగవాణి

- శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు

శ్లో ॥ వర్షే వర్షే 2 శ్వమేధేన యో యజేత శతం సమాః ।
మాంసాని చ న ఖాదేద్యస్తయోః పుణ్యఫలం సమమ్ ॥
(మ.స్మృ. 5-53)

అర్థము :- ఎవడు నూఱేండ్లు ఏటేట అశ్వమేధముఁజేయునో, వానికిని మరియు మాంసభక్షణము చేయని వానికిని గలుగు పుణ్యఫలము సమానమని చెప్పబడును.

శ్లో ॥ ధన్యం యశస్య మాయుష్యం స్వర్గ్యం స్వస్త్యయనం మహత్ ।
మాంసస్యాభక్షణం ప్రాహుర్నియతాః పరమర్షయః ॥
(మ.భా.అను.ప. 115-35)

అర్థము :- ధనము, యశస్సు, ఆయుష్ష తథా స్వర్గప్రాప్తికి ప్రధానోపాయము మరియు పరమకళ్యాణము (మోక్షము) నకు సాధనము మాంసభక్షణ త్యాగమే యని నియత పరాయణులైన మహర్షులు చెప్పిరి.

శ్లో ॥ మధు మాంసం చ యే నిత్యం వర్జయంతీహ ధార్మికాః ।
జన్మ ప్రభృతి మద్యం చ సర్వే తే మునయః స్మృతాః ॥
(మ.భా. అను. ప. 115-70)

అర్థము :- ఏ ధర్మాత్ములైన పురుషులు జన్మ ప్రభృతి జీవిత పర్యంతము మద్యము (సురాపానము) మరియు మాంసభక్షణము సంపూర్ణముగా త్యాగము జేయుదురో -వారందఱు మునులని చెప్పబడుదురు.

శ్లో ॥ సర్వే వేదా న తత్కుర్యుః సర్వే యజ్ఞాశ్చ భారత ।
యో భక్షయిత్వా మాంసాని పశ్చాదపి నివర్తతే ॥
(మ.భా.అను.ప. 115-16)

అర్థము:- హే భారత ! ఎవరు మొదలు మాంసభక్షణము చేసియుండి మరియు తరువాత దానిని సర్వథా పరిత్యజించిరో - వారికి యే పుణ్యము ప్రాప్తించునో - దానిని సంపూర్ణ వేదములు మరియు యజ్ఞములు

గూడ ప్రాప్తింప జేయజాలవు.

శ్లో ॥ సర్వమాంసాని యో రాజన్ ! యావజ్జీవం న భక్షయేత్ ।
స్వర్గే స విపులం స్థానం ప్రాప్నుయాన్నాత్ర సంశయః ॥
(మ. భా. అను.ప. 116-23)

అర్థము :- హే రాజన్ ! ఎవరు జీవితమంతయు ఏ ప్రాణి మాంసమును గూడా భుజింపనొల్లరో, వారు స్వర్గములో శ్రేష్ఠమైన మరియు విశాలమైన స్థానము నలంకరింతురు. ఇందులో నిసుమంతయు సంశయము లేదు.

శ్లో ॥ అధృష్య సర్వభూతానామాయుష్మాన్ నీరుజః సదా ।
భవత్యభక్షయన్ మాంసం దయావాన్ ప్రాణినా మిహ ॥
(మ. భా.అను.ప. 115-40)

అర్థము : ఏ మనుష్యుడు మాంసభక్షణము చేయడో, ఈ జగత్తులోని సకల ప్రాణుల యెడల దయగలిగి యుండునో, అతనిని యే ప్రాణిగూడ తిరస్కరించదు. అతడు దీర్ఘాయుష్మంతుడై ఎల్లపుడు ఆరోగ్యవంతుడుగా నుండును.

శ్లో ॥ న భక్షయతి యోమాంసం విధిం హిత్వాపిశాచవత్ ।
సలోకే ప్రియతాం యాతి వ్యాధిభిశ్చ న పీడ్యతే ॥ (మ.స్మృ. 5-50)

అర్థము : ఏ విధముగా పిశాచము (దయ్యము) భక్షించునో, అట్లు తినక (వ్యతిరేక దృష్టాంతము), యెవడు యవైధ మాంస భక్షణమును మానునో, నతడు లోకమున నన్ని భూతములకుఁ బ్రియుడై (చెలికాడై), యెట్టి రోగములకుఁలోను గాక యుండును. కనుక నియమము లేక శాస్త్ర విహితముగాని, మాంసభక్షణము యనేక వ్యాధులకు హేతువుగా దెలియబడు చున్నందున మాంసభక్షణము సర్వథా త్యాజ్యము.

విహిత మాంసభక్షణాదపి నివర్తేత, కిముతావిహిత మాంసభక్షణాదిత్యవిధినా మాంసభక్షణ నిందానువాదః
(మ. స్మృ 5-49, మన్వర్థ ముక్తావళీ).

అర్థము : శాస్త్ర విహిత మాంసభక్షణసైతము త్యాజ్యము. అట్లుండ శాస్త్ర విహితము కాని మాంసభక్షణ నుండి నివృత్తముగావలయునని వేఱుగ చెప్పవలసినదేమున్నది ? సర్వథా మాంసభక్షణ నింద్యమని ఎఱిగి త్యాగము చేయవలెను.



అక్క మహాదేవి అనుభవామృతం

తెలుగు సేత – డా ॥ శ్రీ కరిబసవరాజేంద్ర మహాస్వామి

169. శీలము, శీలము అనెదరు. శీలము యొక్క మూలము తెలుసుకోవాలి. మనలోవున్న కామ, క్రోధ, లోభ, మోహ,మద, మత్సరం, ఆశ అనే ఈ ఏడు గుణములు వుండేవాడు సంసారి. లింగధారణ చేసిన వానికి ఈ గుణములు వుండకూడదు. చెరువు, బావి నుండి నీటిని తెచ్చి లింగమునకు అభిషేకము చేస్తే అది శివుని వస్తువు అయిన జలమును దొంగతనము చేసినట్లే. ఇటువంటి అభిషేకములతో దేవుడు అనుగ్రహించడు.

173. కామకేళికి ముఖ్యమైనది కన్ను. కామవాసనకు హృదయము సహకారము చేస్తుంది. దాని కోసం కామముతో కూడిన కన్నును పీకి వేయాలి. హృదయమునుండి వ్యామోహాన్ని పీకివేసినపుడే కాముని ముక్కు కోసినట్లగును. అంటే కామము నుంచి ముక్తులౌతాము. కామము అపజయానికి దారి. కామాన్ని నశింపచేసినపుడే పుట్టుచావులను జయించ వచ్చును. కామాన్ని విడవక లింగాన్ని అలంకారానికి కట్టుకొనిన ప్రయోజనము ఉండదు. సర్వాంగములు శివమయుమైనప్పుడే ముక్తిచేకూరుతుంది.

175.పువ్వు వాడిన తరువాత దానిలో సుగంధము వుండదు. దానిలో పరిమళము వెదకుట వ్యర్థము. చిన్న పిల్లల దోషములను లెక్కించకూడదు. స్నేహితుని నుండి ద్రోహము జరిగితే మరి అతనిలో సద్గుణములను చూడలేము. నది నిండి ప్రవహించేటప్పుడు పడవ నడిపే వాడి అవసరముంటుంది. నదిలో నీరు లేనపుడు అతని అవసరము వుండదు. అందుకోసం పిల్లవానిగా వున్నటువంటి నాలో తప్పులను చూడకుండా నన్ను అనుగ్రహించు.

176. వీరశైవము సంస్కార భేదముతో సామాన్య, విశేష, నిరాభారి అని మూడు విధములుగా వున్నది. గురుదీక్షను పొందినవాడు సామాన్య వీరశైవుడు. చిన్మయ అనుగ్రహము పొందినవాడు విశేష వీరశైవుడు. నిరాభారి దీక్ష పొందినవాడు నిరాభారి వీరశైవుడు. బసవాది శివశరణులు ఈ విధమైన దీక్షను పొంది ఆచరించినారని అక్క మహాదేవి తెలియజేసిరి. ఆ ముప్పది రెండు సన్మార్గములు ఈవిధముగా వున్నవి. 1. సదాచారము 2.సద్భక్తి, 3, సత్క్రియ, 4. సమ్యక్జ్ఞానం, 5.సద్వర్తన, 6.సగుణభక్తి, 7. నిర్గుణభక్తి, (నిరాకార శివుని యందు భక్తి), 8. మంచిగుణము, 9. సచ్చరిత్ర, 10.సద్భావము, 11.అక్రోధము 12.సత్యవచనము, 13. శమము (బాహేంద్రియ నిగ్రహం) 14.దమము (అంతరింద్రియ నిగ్రహము) 15. సుఖాన్ని అనువించువాడు నేను అనేది భవి, సుఖాన్ని అనుభవించే వాడు శివుడు అనేది భక్తి, 16. సత్పాత్రదానం, 17.గౌరవబుద్ధి,18.శివలింగములో తన్మయత్వం 19.జంగమానుభావము. 20. దశవిధపాదోదకము, 21. ఏకాదశ ప్రసాదము, 22.షోడశోప చారములతో లింగపూజ, 23. త్రివిధ, షడ్విధ, నవవిధ లింగార్చన – ఇష్టలింగ, ప్రాణలింగ, భావలింగ ఇవి మూడు, ఆచార, గురు, శివ, జంగమ, ప్రసాద, మహాలింగ, ఈ ఆరు కలిసి తొమ్మిది లింగములను పూజించడము. 24 త్రివిధ, షడ్విధ, నవవిధ లింగములకు మంత్ర జపము చేయుట. 25. త్రివిధ, షడ్విధ, నవవిధలింగార్పణము. 26. చిద్విభూతిని, ధూళిని, ధారణ చేసి శివభావమును పెంచుకోవడం, 28. సత్యమైన, శుద్ధమైన కర్తవ్యాన్ని నిర్వహించడం, 29. శివునిలో సద్భక్తి దీక్ష అడగడం, 30. శివలింగ జంగములకు సర్వమును సమర్పించి వారి అనుగ్రహము కోరడం, 31. సత్యమైన మాట, నడత, 32. శివునిలో నిర్వాణ పదములో వుండుట. ఈవిధమైన ముప్పదిరెండు రకములైన సన్మార్గములను సద్గురునుండి తెలుసుకొని బసవాది శివశరణుల మార్గములో నడవడం నిరాభారి వీరశైవమని పిలవబడును. ఈ సన్మార్గములో లేని వారు శివభక్తులు, మరియు శివ జంగములు అని అనిపించుకొనలేరు.

ఆచార్య దేవో భవ

–ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

గురుపరంపర

సనాతన హైందవధర్మ గురుపరంపరలో వ్యాస, పరాశర, వశిష్ఠ, బృహస్పతి, శుక్ర, విశ్వామిత్ర, అగస్త్య, సాందీపని మొదలయినవారు పౌరాణిక గురుపరంపరలో ఎన్నదగినవారు. ఆదిశంకర, శ్రీమద్రామానుజ, మధ్వాచార్య, బసవేశ్వర, వల్లభ, చైతన్యప్రభు మొదలయినవారు చారిత్రకగురుపరంపరలోనివారు.

శంకరాచార్యుల కాలం నాటికి 67 రకాల సంప్రదాయాలుండేవి. గాణాపత్యులు, శాక్తేయులు, సౌరులు, భైరవులు, కాపాలికులు, వారితోబాటు నాస్తికులయిన చార్వాకాదులు. ఈ విపత్కర పరిస్థితిలో 'అద్వైతానికి' శంకరులు జీవం పోశారు. 'సర్వం మిథ్యా' అని చాటారు. దేశమంతటా మూడు పర్యాయాలు పర్యటించి, పండితులతో వాదించి తనవాదానికి బలం చేకూర్చారు. అనేకానేక దేవతలను స్తుతిస్తూ స్తోత్రాలు రచించారు. హిందూ ధర్మసుస్థిరత్వం నిమిత్తం దక్షిణదేశంలో శృంగేరి పీఠాన్ని, ఉత్తరంలో బదరిలో జ్యోతిర్మఠాన్ని, పశ్చిమంలో ద్వారకాపీఠాన్ని పూరీలో గోవర్ధన మఠాన్ని, కాశీలో సుమేరు (పాదుక) పీఠాన్ని, కంచిలో కామకోటీ పీఠాన్ని స్థాపించారు. షణ్మతస్థాపనాచార్యులయ్యారు.

ఆచార్య కసిరెడ్డిగారి మాటలలో చెప్పాలంటే 'ఆదిశంకరుల అపూర్వ జ్ఞానసంపదలవల్ల, మహోద్యమ నిర్మాణం వల్ల, వ్యవస్థీకృత సన్న్యాస ప్రచారక వ్యవస్థ వల్ల హిందుత్వానికి ఒక ఊపు వచ్చింది. జాతిని ఏకతాపథంపై నడిపే దివ్య వ్యవస్థ ఏర్పడింది'.

శంకరుల తరువాత రామానుజులు విశిష్టాద్వైతం ద్వారా హిందూ జాగరణం చేశారు. కులానికి వర్ణానికి ప్రాధాన్యం ఇవ్వకుండా అన్ని వర్ణాల వారు భక్తి మార్గంలో మోక్షం అందుకోవచ్చని ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో 'హరిజనులను' 'తిరుక్కులత్తవర్' అని పేర్కొని వారికి ఆలయ ప్రవేశం కలిగించడ మొకటి. శిష్యమండలితో సువ్యవస్థిమయిన ప్రచారక

వ్యవస్థ కూడా ఏర్పాటు చేశారు. మధ్యకాలంలో మరుగుపడిన ఆలయ సంస్కృతిని పునరుద్ధరించారు. దేశభాషలలోని మతగ్రంథాలకు ఆదరణ పెరిగేలా చేయడం ఒక విశేషం. ఈ కారణం వల్ల సామాన్యులకు మనమతమనే అభిప్రాయం ప్రజలలో స్థిరపడింది.

రామానుజుల తరువాత మధ్వాచార్యులు హిందూజాగరణానికి ఎనలేని కృషి చేశారు. వీరి ద్వైతమతం నైతికమూల్యాలకు ప్రాధాన్యమిచ్చింది. సంస్కారంవల్లనే జీవుడు పుటం పెట్టిన బంగార మవుతాడని ప్రచారం చేసిన ఘనత వీరిదే. కన్నడ హరిదాసులు తమ 'దేవరనామగళు' ద్వారా సామాజిక నైతికతను పెంచినవారు.

మధ్వాచార్యుల తరువాత ప్రశస్తిగన్నది వల్లభాచార్యుల శుద్ధాద్వైతం. ఇది వైష్ణవ సిద్ధాంతంలోని ఒక భాగమే. ఉత్తర భారతదేశంలో రామభక్తిశాఖ, కృష్ణభక్తి శాఖ అని రెండూ ప్రచారంలో వున్నాయి. శుద్ధాద్వైతంలో 'కృష్ణతత్త్వం' ప్రధానమయింది. ఈ కారణం వల్ల 'భగవద్గీతకు' ఎనలేని ప్రచారమేర్పడింది. అంతేగాక 'భాగవతతత్త్వం' ప్రజలను ఆకర్షించింది.

త్రిమతాచార్యుల హిందూ జాగరణ ఒక పాయ అయితే వీరశైవ మత ప్రచారం మరొక పాయ. శైవత్వానికి వీరత్వాన్ని సమకూర్చి పెట్టింది బసవేశ్వర మతమే. కులభేదాన్ని, వర్ణభేదాన్ని, అస్పృశ్యతను, స్త్రీలపట్ల వివక్షతను ఆలయ ప్రవేశంలోని అడ్డంకులను, రాజుల భోగలాలసత్వాన్ని గుర్తించి హిందువుల్లో వీరత్వాన్ని ప్రజ్వలింప జేయడానికి బసవేశ్వరుడు సిద్ధమయ్యాడు. ఖడ్గధారిగా, తత్త్వవేత్తగా – బ్రాహ్మణుడయినా సంస్కారాలను ఆహ్వానిస్తూ కర్ణాటకంలో క్రాంతి తెచ్చినాడు. ఈ ఉద్యమం కారణంగా సాహిత్యంలోను అనేక రకాలయిన కొత్త ప్రక్రియలకు అవకాశం కలిగింది. సామాన్యులు కూడా తమ అనుభవాలను 'వచనాల' ద్వారా వెలువరించడానికి వీలయింది. బసవేశ్వరుడు స్థాపించిన 'అనుభవ మంటపం' వీరశైవుల అభిప్రాయ ప్రకటనలకు కేంద్రమయింది.

ఉత్తరభారతంలో హిందూధర్మరక్షణ నిమిత్తం, వికాసం నిమిత్తం, ధర్మ జాగరణనిమిత్తం ఆవిర్భవించిన మతం సిక్కుమతం. ఈ మత ప్రచారకుడు గురునానక్. సిక్కుల పవిత్రగ్రంథం 'గురుగ్రంథసాహెబ్' 'ఏకోదేవః' అనడం వీరి సిద్ధాంతం. పరాత్పరునికి జాతిమతకులభేదాలు లేవనడం వీరి విశాల భావానికి తార్కాణం. క్రతువు, కర్మ, జీవితంలో

పరిశుద్ధత చాల ముఖ్యమనడం వీరి ప్రచారాంశాలు. సిక్కుమతం వల్ల భారతదేశం సరిహద్దు ప్రాంతంలో సామాన్యులలో కూడా 'సహజోత్సాహం' నేటికీ సహజంగా కనిపిస్తుంది.

వర్తమాన గురుపరంపరలో మహర్షిదయానంద, శ్రీరామకృష్ణ, వివేకానంద, రామతీర్థ, అరవింద, శివానంద, శ్రీరమణ, మలయాళస్వామి, చిన్మయానంద, శీలాప్రభుపాదలు ప్రముఖులు.

ఆర్యసమాజస్థాపకులు దయానందులు. వర్ణాశ్రమ ధర్మాలకున్న శాస్త్రీయ నేపథ్యం చెప్పడం దయానందుల ప్రత్యేకత. శ్రీరామచంద్ర, శ్రీకృష్ణ పరమాత్మల ధర్మవీర తత్త్వాన్ని, యోగేశ్వర ఔన్నత్యాన్ని ప్రచారం చేసినవారు వీరే. ప్రత్యేకించి విజాతీయ విదేశీయ విధర్మీయ భావజాలం ఉచ్చుకు లోనుకాకుండా తన ధర్మమేమిటో తెలుసుకొనేలా చేసింది ఆర్యసమాజం. అంతే గాకుండా రాష్ట్రీయభావాన్ని, స్వాతంత్ర్యేచ్ఛనూ ప్రతి వ్యక్తిలో నాట జేసే ప్రయత్నంలో ఆర్యసమాజం గణనీయమయిన కృషి చేసింది.

వర్తమాన గురుపరంపరలో రామకృష్ణ వివేకానందులస్థానం పదిల మయింది. హైందవంలోని 'లోతును' అపూర్వ వేదాంతాన్ని పాశ్చాత్యులకు అవగతమయ్యేలా చేయడంలో వివేకానందుల పాత్ర అద్వితీయం. విశ్వమత మహాసభ (చికాగోవేదిక) వివేకానందులను విశిష్ట వ్యక్తిగా గుర్తించ గలిగింది. అన్నిటా కంటే మధ్య తరగతి ప్రజానీకంలో వేద, ఉపనిషత్, పురాణ, దర్శన, స్మృతి, ప్రబంధ, కావ్య పఠనంపై ఆసక్తిని పెంచింది. ఆలాగే మఠ, మందిర, ఆశ్రమ సంస్థల ద్వారా పొరుగువారికి సాయం చేసే మనోభావాన్ని పెంచింది.

వర్తమాన గురుపరంపరలో ఎన్నదగినవారు మలయాళ యతీంద్రులు. దేశం కాని దేశంలో భాషకాని భాషా ప్రాంతంలో సామాన్య మధ్యతరగతి వర్గంలో ఆధ్యాత్మికాసక్తిని పెంచినవారు. ఏర్పేడు కేంద్రంగా వ్యాసాశ్రమం స్థాపించి అమూల్యమయిన గ్రంథాలను ప్రచురించిన ఘనత వీరిదే. సంస్కృతాధ్యయనం పట్ల అగ్రవర్ణేతరులలో అభిరుచి పెంచినవారు కూడా వీరే. స్త్రీ విద్య పట్ల కృషి చేసినవారు కూడా వీరే. నిర్మలమయిన జీవితం గడుపుతూ తన మార్గంలో ఇతరులను నడిపిస్తూ, రాణించిన మహోన్నత వ్యక్తి. 'పురోభివృద్ధిని కోరువారు పూర్వ వృత్తాంతం మరువరాదు' అని తమ శిష్యులకు ఉపదేశించిన మనీషి.

శ్రీమదాంధ్ర మహాభాగవతము

– ఆచార్య డా॥ జక్కంపూడి మునిరత్నం

ఉ. శ్రీకర భక్తి జ్ఞానములు చెన్నుగ ధర్మము పెంపుగాంచగా
లోకులు శాంతి సౌఖ్యములలో సతతంబును తేలియాడగా
ప్రాకటమైన భాగవత పావనసత్కృతి నిచ్చినట్టి సు
శ్లోకుల పుణ్యమూర్తుల విశుద్ధ చరిత్రుల సంస్మరించెదన్

శ్రీ మద్భాగవతంలో ఇది ప్రథమ స్కంధమే కాదు ప్రధాన స్కంధం కూడా. ఎందుకంటే ఈ స్కంధంలోనే భాగవతం పుట్టుక ఉంది. దాని గొప్పతనం ఉంది. భాగవత ప్రయోజనం ఉంది. భాగవతమంతా వ్యాపించి ఉన్న విష్ణుతత్త్వానికి బీజం ఈ స్కంధంలోనే ఉంది. ఈ గ్రంథంలో అడుగడుగునా కనిపించే భక్తితత్త్వానికి, అధ్యాత్మ తత్త్వానికి అంకురార్పణ కూడా ప్రథమ స్కంధంలోనే జరిగిందని చెప్పాలి. రాబోయే స్కంధాల్లో చోటు చేసుకోనున్న ధర్మాధర్మ సంఘర్షణకు కూడా ప్రథమ స్కంధంలోనే బీజం గోచరిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే భాగవతమనే సుందర భవనానికి ప్రథమ స్కంధమే పునాది.

తెలుగు భాగవతంలో ప్రథమ స్కంధం ఇష్టదేవతా స్తుతితోనే ప్రారంభమౌతుంది. అయినప్పటికీ భాగవతాన్ని చదువబోయే ముందు దానిమీద స్థూలంగానైనా ఒక అవగాహన ఏర్పరచుకోవడం ఎంతైనా అవసరం కదా. అలాంటి అవగాహన వల్ల భాగవతం మీద ఆసక్తీ, భక్తీ, శ్రద్ధా పెరుగుతాయి. తద్వారా మెరుగైన ఫలితం సిద్ధిస్తుంది.

పరిచయం : భారతీయ సాహిత్యంలో మొదట పేర్కోదగ్గవి వేదాలు. ఆ తరువాత పేర్కోదగ్గవి పురాణాలు, మహాపురాణాలు 18. వాటిలో మకుటాయమానంగా నాయకమణిగా పరిగణింపదగ్గది భాగవతం.

భాగవతంలో మొదటి నుంచీ చివరిదాకా విష్ణుదేవుడి వృత్తాంతం ఉంది. తక్కినవారి వృత్తాంతాలు కూడా ఉన్నప్పటికీ, విష్ణు వృత్తాంతమే ఈ గ్రంథంలో ఆధిక్యత వహించి కనిపిస్తుంది. భక్తుల కథలు, సృష్టి

క్రమము, దాని విశేషాలు, వివిధ వంశాలకు చెందిన ఋషుల వృత్తాంతాలు, సూర్యచంద్ర వంశాలకు చెందిన రాజుల ప్రస్తావన భాగవతంలో చోటు చేసుకున్నాయి. విష్ణు దేవుని తక్కిన అవతారాలు, లీలలు తగినమేర చోటు చేసుకున్నప్పటికీ శ్రీ కృష్ణావతారం గురించి విస్తృతంగా వివరింపబడింది.

భాగవతాన్ని విష్ణువే మొదట బ్రహ్మమనసులో ప్రకాశింపజేశాడు. బ్రహ్మ దాన్ని నారదుడికి తెలియజేశాడు. నారదుడు వ్యాసుడి మనసులో ఉద్దీపింపజేశాడు. వ్యాసుడే భాగవతాన్ని మొదట సంస్కృతంలో రచించాడు. దాన్ని తన కుమారుడైన శుకమహర్షి చేత చదివించాడు. ఆ మహర్షి తాను చదివిన భాగవతాన్ని పరీక్షిత్తు మహారాజుకు వినిపించాడు. శుకమహర్షి చేసిన భాగవత ప్రసంగాన్ని విష్ణురాతుడు మాత్రమే గాక అక్కడ ఉన్న మునులందరూ విన్నారు. అలా విన్న వారిలో సూతుడుగా ప్రసిద్ధి వహించిన ఉగ్రశ్రవసుడు కూడా ఒకడు. అతడు నైమిశారణ్యంతో శౌనకాదులకు ఈ భాగవతాన్ని చెప్పాడు. అప్పటి నుంచీ ఇది లోకంలో వ్యాపించి మిక్కిలి ప్రసిద్ధి వహించింది.

భాగవతంలో 18 వేల శ్లోకాలున్నాయి. పన్నెండు స్కంధాలున్నాయి. ప్రతి స్కంధంలోనూ ఎన్నో విశేషాలున్నాయి.

వ్యాసమహర్షి సంస్కృతంలో రచించిన భాగవతాన్ని అనేక ప్రపంచ భాషల్లోకి అనువదించారు. భారతీయ భాషలన్నీ దానికి ఆహ్వానం పలికాయి. తెలుగులో బమ్మెర పోతనామాత్యుడు భాగవతాన్ని రచించాడు. ఆయన రచించిన భాగవతంలో కొన్ని భాగాలు లుప్తం కావడం వల్లనో, మరే కారణం చేతనో ఆంధ్ర భాగవతంలోని కొన్ని భాగాలను మరో ముగ్గురు కవులు రచించారు.

రామాయణాన్ని భాస్కరుడితోబాటు మరో ముగ్గురు కవులు రచించినప్పటికీ ఆ గ్రంథం భాస్కర రామాయణంగానే చెలామణి అవుతూ ఉంది. పోతన భాగవతం కూడా ఇలాంటిదే. తెలుగు భాగవతంలో అధికభాగం పోతన రచించడం వల్లనో భాగవతమంతటా ఆయన ప్రభావం కొట్టొచ్చినట్టు కనిపించడం వల్లనో భాగవతాన్ని రచించిన తక్కిన ముగ్గురు

కవుల ప్రభావం పోతన ప్రభావాన్ని అధిగమించలేకపోవడం వల్లనో ‘ శ్రీమదాంధ్ర భాగవతం ’పోతన భాగవతంగానే ప్రసిద్ధి వహించింది. ఇందులో 6,270 పద్యాలు, 2630 వచనాలు, 12 ఆశ్వాసాంత గద్యలు ఉన్నాయి. అన్నిటినీ కలుపుకుంటే తెలుగుభాగవతంలోని పద్య గద్యాల సంఖ్య 8,912.

వైశిష్ట్యం : భాగవతం బ్రహ్మతుల్యం. వేదాధికం. పురాణ శ్రేష్టం. కల్పవృక్షాధికం. కాశీతుల్యం. భక్తిజ్ఞాన వైరాగ్యనీతి ప్రబోధకం. ముక్తిసంధాయకం. పతిత జనోద్ధారకం. భాగవతం విష్ణుకథా విలసితం. అద్వైత ప్రతిపాదకం. మానవుడిగా పుట్టిన ప్రతివాడికీ తప్పక ఉండవలసిన కనీస సంస్కారాన్ని భాగవతం తెలియజేస్తుంది.

భాగవతాన్ని తెలుసుకోవడం, ఇతరులకు తెలియజెప్పడం బ్రహ్మకూ శివుడికీ కూడా సాధ్యం కాదు. తమ దగ్గర ఉన్న అమృతాన్ని పరీక్షిత్తుకిప్పించి తమకా భాగవతామృతాన్నిమ్మని దేవతలు కోరారు. భక్తిలేని దేవతలకంటే భక్తి కలిగిన పరీక్షిత్తే గొప్పవాడు. కాబట్టి భాగవత శ్రవణానికి సరైన అధికారి పరీక్షిత్తేనని శుకమహర్షి దేవతలను తిరస్కరించాడు. ఇది కథే అయినప్పటికీ అమృతం కన్నా భాగవతామృతమే శ్రేష్ఠము, శ్రేయోదాయకము అని స్పష్టమౌతుంది. ఎంతో పుణ్యం చేసుకుంటే మాత్రమే భాగవత శ్రవణాసక్తి జనిస్తుంది. పోతన తెలుగు భాగవతంలోని ప్రతి పద్యమూ సద్యోముక్తి సంధాయకం, ఆంధ్రజనాభి మాన పాత్రం.

ప్రయోజనం : భాగవతాన్ని చదివినా, విన్నా కలిగే ప్రయోజనం ఇంతా అంతా అని చెప్పడం కుదరదు. అది మాటలకందనిది. ఆలోచనకు కూడా అందేది కాదు. భాగవతాన్ని చదివినా, విన్నా బాగుపడవచ్చని విజ్ఞుల విశ్వాసం. భాగవతమంతా విష్ణుదేవుని విమలచరితమే. దీన్ని వినే వారి హృదయాల్లో విష్ణుదేవుడు నివసిస్తాడని, వారి అశుభాలు హరిస్తాడని, వాటి స్థానంలో శుభాలను కలిగిస్తాడని పెద్దల నమ్మకం.

భాగవతాన్ని విన్నా, చదివినా భవబంధాలను తొలగించే భక్తి కలుగుతుంది. మోక్షం కరతలామలకమౌతుంది. సకల సంక్షోభాలు

సమసిపోతాయి, సర్వాభీష్టాలూ సమకూరుతాయి. భాగవతంలోని కథలు, భగవల్లీలలు మానసిక సంక్షోభాన్ని మటుమాయం చేస్తాయి. ఏ కోరికా లేకుండా శ్రద్ధాసక్తులతో భాగవతాన్ని వినాలి, లేదా చదవాలి. అప్పుడే అంతరంగం పరిశుద్ధమై హరికి ఆవాసయోగ్యమౌతుంది. భాగవత శ్రవణం వల్ల విష్ణువును సేవించాలనే విశాలబుద్ధి వికసిస్తుంది.

భాగవతాన్ని ఎలా శ్రవణం చేయాలో, భాగవత శ్రవణమెంతటి ఫలప్రదమో గోకర్ణుడనే సత్పురుషుని గాథ తెలియజేస్తుంది. ఈ ఉదంతం తప్పక తెలుసుకొని తద్వారా సత్ఫలితాన్ని పొందడమెంతో అవసరం. ఈ ఉదంతాన్ని డా॥ జానమద్ది రామకృష్ణ గారు తన 'పురాణ పరిచయమ్' అనే గ్రంథంలో తెలియజేశారు.

దుంధుకారుడనే బ్రాహ్మణ బాలకుడు అన్ని విధాల దుర్వ్యసనాలకు బానిసైపోయాడు. బ్రాహ్మణోచిత ధర్మాన్ని కానీ, వంశాచారాన్ని కానీ పాటించలేదు. తల్లిదండ్రుల మరణానికి కారకుడయ్యాడు. పిశాచమయ్యాడు. అతని సోదరుడు గోకర్ణుడు తీర్థాటనం చేసి మృత సోదరముక్తి కోసం అనేక సత్కర్మలు చేశాడు. స్వగృహానికి తిరిగి వచ్చాడు. దుంధుకారుడు పిశాచిరూపంలో అతనికి కనిపించాడు. ఎన్ని సత్కర్మలు చేసినా దుంధుకారుడు సద్గతి పొందకపోవడానికి గోకర్ణుడు విచారించాడు. అతనికి ఉత్తమగతి ప్రాప్తించేందుకు భాగవత సప్తాహం చేయించాడు. వెదురు గడియలో ఉండి విన్న దుంధుకారుడికి పిశాచరూపం పోయింది. వైకుంఠం నుంచి పిలుపు వచ్చింది. దుంధుకారుడికి మాత్రమే వైకుంఠ ప్రాప్తి కలగడానికీ తక్కిన శ్రోతలెవ్వరికీ కలుగకపోవడానికి కారణమేమిటని విష్ణుదూతలను గోకర్ణుడు ప్రశ్నించాడు. దుంధుకారుడు శ్రవణంతోబాటు మననం కూడా చేశాడని, తక్కిన శ్రోతలందరూ శ్రవణమాత్ర సంతృప్తులే అయ్యారని విష్ణుదూతలు కారణం చెప్పారు. గోకర్ణుడు మరొకసారి భాగవత సప్తాహాన్ని ఏర్పాటు చేసి పలువురి మోక్షానికి కారకుడయ్యాడు. రెండవసారి విష్ణువే స్వయంగా వచ్చి శ్రోతలందరినీ తనతోబాటే వైకుంఠానికి తీసుకెళ్ళడం విశేషం. దీన్ని బట్టి భాగవత శ్రవణ మననాదులు ఎంత ప్రయోజనకరాలో వెల్లడౌతుంది.

వార్తలు

(01). జూన్ 1వ తేది బుధవారం, జూన్ 16వ తేది గురువారం నాడు, 30వ తేది గురువారం నాడు ఏకాదశి తిథులందు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో భగవద్గీత అఖండ పారాయణ చేశారు.

జూన్ 4వ తేది శనివారం కృత్తిక నాడు ఆశ్రమంలో ప్రదోష కాలంలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి షోడశోపచారపూజ చేసి ప్రసాద వియోగం చేయబడింది. జూన్ 3వ తేది శుక్రవారం మాసశివరాత్రి రాత్రి సందర్భంగా ప్రదోషకాలంలో ఆశ్రమ శివునికి రుద్రాభిషేకం బిల్వార్చన జరిగినది.

(02). జూన్ 4వ తేది శనివారం శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుబోర్డు సమావేశం జరిగినది. జూన్ 5వ తేది శ్రీ శుకబ్రహ్మాశ్రమ పరిపాలనసంఘ సమావేశం ఆశ్రమంలో జరిగినది. ఆ సమావేశంలో భక్త కన్నప్ప ఆస్పత్రి నూతనభవనం, ఆపరేషన్ మిషన్, స్లిట్‌ల్యాంప్ వగైరా పరికరాలన్నింటిని "త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు"కు అప్ప జెప్పుటకు ఏకగ్రీవంగా తీర్మానించబడినది.

(03). జూన్ 5వ తేది ఆదివారం నాడు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాసనాల పోటీలు జరుపబడినవి. అందు 8వ సంవత్సరం వయస్సునుండి 18 సంవత్సరం వయస్సు గల బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయం నుండి విశ్వవిద్యాలయ యోగ శిక్షకులు **(1).** శ్రీ ఆర్.లక్ష్మీనారాయణ గారు **(2).** ఇ.వి.నాగలక్ష్మి గారు, బెంగుళూరువివేకానంద యోగశిక్షణ సంస్థనుండి హరికృష్ణగారు వచ్చి వ్యవహరించారు. సర్వ ప్రథమ, ద్వితీయ, తృతీయగా వచ్చిన వారికి 21-06-2015వ తేది జరుగు ప్రపంచయోగ దినోత్సవంలో బహుమతులు శ్రీ శుకబ్రహ్మాశ్రమం వారిచే ఇవ్వబడినవి. పోటీలలో పాల్గొనిన వారందరికి మంచి పుస్తకాలివ్వబడినవి.

(04). జూన్ 9వ తేది గురువారం నుండి 16వ తేది వరకు అవధూత భక్త మండలి (బెంగుళూరు) వారిచే శ్రీరాం గారి ఆధ్వర్యమున శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో నామ సప్తాహం - అఖండనామ సంకీర్తన జరిగినది.

(05). ఆశ్రమ కంటిఆసుపత్రిలో మే నెలలో ఓ.పి.విభాగంలో **1344 గురికి** కంటి పరీక్షలు, చికిత్సలు జరిగినవి. **133 మందికి కళ్ళలో** పొరలు తీసి లెన్స్ అమర్చబడినవి. **9 మందికి** యాగ్ లేజర్ చికిత్స చేయబడింది.

(06). 12-08-2016 నుండి 26-08-2016 వరకు **విజయవాడలో జరిగే కృష్ణ పుష్కరాలలో శ్రీ శుకబ్రహ్మాశ్రమ పుస్తకశాల** ఏర్పాటు చేయబడింది.

Regd.No. TRP / 123 / 2015-17 July 2016 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-06-2016, Permitted to post : 29th, 30th every month.

త్రినేత్ర వైద్యాలయము

భక్తకన్నప్ప కంటి ఆసుపత్రి.

శ్రీశుకబ్రహ్మాశ్రమము, స్వామి ప్రకాశానందనగర్, శ్రీకాళహస్తి, ఆం.ప్ర.

ఇందు నిరుపేదలకు ఉచితంగా కంటి చికిత్సలు చేయబడును. కంటిపొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడును. ఆపరేషన్ చేసిన వారికి ఉచితంగా భోజనాలు పెట్టబడును. ఉచితంగా మందులు మరియు 40 వ రోజు కళ్లద్దాలు ఇవ్వబడును. దీనికి విరాళమిచ్చువారికి 80 జి సెక్షన్ క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు కలదు. ఈ ఆసుపత్రి పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిచే స్థాపించబడినది.

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం

సమస్త దుఃఖాలకు కారణం అజ్ఞానం. మనిషికి మనిషికి, దేశానికి దేశానికీ, భూమికి చంద్రునికీ, చంద్రునికి సూర్యునికీ మధ్య భేదాన్ని చూడడమే అజ్ఞానము. అనేకత్వాన్ని గూర్చిన భావనయే అజ్ఞానము. అణువణువునకు మధ్య భేదాన్ని చూడడం వలననే దుఃఖం సంప్రాప్తమవుతూంది. కాని భిన్నత్వము వాస్తవముగ కల్పితమనియు, అసత్యమనియు వేదాంతం పలుకుతూంది.

– శ్రీస్వామి వివేకానంద



స్నేహితులారా! ఎలాగైతే సూర్యుడూ సూర్యకాంతి వేరుకాదో అలాగే భగవంతుడు అతని అనుగ్రహం రెండూ వేరు కాదు. సూర్యుడే కాంతి. సూర్యుడిలో ఉండే కాంతే సూర్యుడు. కాంతి లేకుండా సూర్యుడెప్పుడూ ఉండదు. అదే ప్రకారంగా భగవంతుడి అనుగ్రహం కృప, అదే భగవంతుడు. కృప లేకుండా భగవంతుడు ఎప్పుడూ ఉండడు. నేను గనుక గదిలో కూర్చుని నాకు చీకటిగా ఉంది, సూర్యుడి కాంతి లేదు అని కంప్లయింట్ చేసినట్లయితే, నేను ఒక మూర్ఖుడినే. మీరు కిటికీలు మూసుకుని లోపల కూర్చున్నప్పుడు, చీకటిలో ఉన్నప్పుడు కూడా కిటికీకి సరిగ్గా బయట వైపు, వెలుగొందుతున్న సూర్యుడు మిమ్ములను అనుగ్రహించటానికి తన కాంతితో సిద్ధంగా ఉన్నాడు. సూర్యుడు చాలా పెద్ద మనిషి. మీరుతలుపులు మూసుకుంటే వాటిని నెట్టుకొని లోపలికి రాడు, మీరు తలుపులు తెరిచేంత వరకు వెలుపలే ఉంటాడు. అలాగే మన హృదయ కవాటాలు మనం మూసుకొని కూర్చుంటే భగవంతుడు బయట నుండి లోపలకి రాడు. అయన వెలుపలే వేచి ఉంచాడు. మన హృదయకవాటాలు తెవరటమంటే బయటకు వచ్చి భగవంతుడి కృప కోసం సేవచేయవలసిందే. హృదయకవాటం తెరుచుకోవాలంటే అదొక్కటే మార్గం.

– శ్రీచిన్మయానందస్వాములవారు

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 49 ఆగష్టు 2016 సంచిక : 08

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు
విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

వేదాంతభేరి

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 49 ఆగష్టు 2016 సంచిక : 08

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. కృష్ణా పుష్కరాలు - శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు - 06
03. బంధవిముక్తికై అనవతరము సాధన గావించువాడే మానవుడు
శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 09
04. పురుష ప్రయత్నము ఉండియే తీరవలెను -
శ్రీ సద్గురు మలయాళస్వాములవారు -13
05. ఏడు బిందెలు - శ్రీరామకృష్ణ పరమహంస - 15
06. జ్ఞానసుధ - శ్రీసర్వభూషణ శివయోగి - 21
07. భాగవత సుధ - శ్రీ రామకృష్ణానందగిరి స్వాములవారు - 24
08. ఆచార్య దేవోభవ - ఆచార్య కె.సర్వోత్తమరావు - 31
09. శ్రీ భక్త తుకారాం అభంగవాణి - శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వామి - 35
10. శ్రీమదాంధ్ర మహాభాగవతము - ఆచార్య డా॥జె.మునిరత్నం - 39
11. వార్తలు - 42

ముఖచిత్రం : కృష్ణానది పుష్కరాలు
విజయవాడ పుష్కర స్నానాలు

మనిషి జీవితానికి నదులకు విడదీయరాని సంబంధం
సృష్టి మొదలైనప్పటి నుండి వున్నది

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

ఓం వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్ ।
దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥
ఓం వందే నందవ్రజస్త్రీణాం పాదరేణుమభీక్ష్ణశః ।
యాసాం హరికథోద్గీతం పునాతి భువనత్రయమ్ ॥
ఓం నమః పంకజనాభాయ నమః పంకజమాలినే ।
నమః పంకజనేత్రాయ నమస్తే పంకజాంఘ్రయే ॥
ఓం నమో భగవతే తుభ్యం వాసుదేవాయ ధీమహి ।
ప్రద్యుమ్నాయానిరుద్ధాయ నమః సంకర్షణాయ చ ॥
ఓం కృష్ణాయ యాదవేంద్రాయ దేవకీనందనాయ చ ।
ప్రణతక్లేశనాశాయ గోవిందాయ నమో నమః ॥

* * * *

ఓం కృష్ణవేణి నమస్తుభ్యం సర్వపాప ప్రణాశినీ ।
త్రిలోకపావనజలే రంగత్తుంగ తరంగిణీ ॥
శుద్ధస్ఫటిక సంకాశం ద్విభుజాం పద్మధారిణీమ్ ।
శివమూర్తిధరాం దేవీం కృష్ణాం త్వాం ప్రణతో2స్మ్యహమ్॥
కమండలు ధరాం దేవీం జపమాలాధరాం శుభామ్ ।
బ్రహ్మీం సువర్ణవర్ణాభాం కృష్ణాం త్వాం ప్రణతో2స్మ్యహమ్ ॥
సర్వదేవమయీం సాక్షాత్బ్రహ్మ విష్ణుశివాత్మికామ్ ।
ఫలదాం సర్వతీర్థానాం కృష్ణాం త్వాం ప్రణతో2స్మ్యహమ్।
నమో దేవీ మహాగంగే మహాపుణ్యప్రదాయినీ ।
విష్ణుదేహాత్సముత్పన్నే మమపాపం వ్యపోహయ ॥

తా ॥ అన్ని పాపాలను నశింపజేయు దానివి, నీ జలాలతో ఉరకలు వేస్తూన్న కెరటాలు గలిగి ముల్లోకాలను పావనం జేస్తున్న కృష్ణవేణి ! నీకు నమస్కారము.

తెల్లని స్ఫటికంవలె ప్రకాశించే తల్లీ ! రెండు భుజాలతో రెండు పద్మాలను ధరించి శివుని రూపాన్ని ధరించిన కృష్ణమ్మ తల్లీ ! నీకు ప్రణమిల్లుతున్నాను.

కమండలం, శుభప్రదమైన జపమాలలను ధరించి, బంగారు రంగుగల్గి బ్రహ్మ జ్ఞానియైన ఓ కృష్ణమ్మ తల్లీ ! నీకు నమస్కారము.

సాక్షాత్ త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, శివుల ఏకరూపమై సర్వదేవతామూర్తి అయిన తల్లీ ! అన్ని తీర్థాల ఫలాన్నిచ్చే కృష్ణమ్మ తల్లీ ! నీకు ప్రణమిల్లుతున్నాను. మహావిష్ణు శరీరం నుండి పుట్టిన గొప్ప పుణ్యాన్నిచ్చే మహాగంగమ్మ తల్లీ ! నీకు నమస్కారము, నా పాపాన్ని పోగొట్టుము.

25-08-2016 గురువారం కృష్ణాష్టమి

సంపాదకీయం

కృష్ణా పుష్కరాలు

దేవతల గురువు బృహస్పతి ఒక్కొక్క రాశిలో ప్రవేశించి ఒక్క సంవత్సరం ఆ రాశిలో ప్రయాణం చేస్తాడు. అలా ఒక్కొక్క రాశిలో ప్రవేశించి అందులో వుంటాడు. ఆ సమయం దేశంలో ఒక్కొక్క నదికి పుష్కరకాలం. ఇలా బృహస్పతి 12 రాశులలో ప్రవేశించి వుండే సంవత్సరం దేశంలోని ఒక్కో జీవనదికి పుష్కరం వస్తుంది. ఏ రాశిలో బృహస్పతి – గురువు చేరి వుంటాడో భారతదేశంలోని ఆ ప్రాంతంలో వుండే జీవనదికి ఆ సంవత్సరం పుష్కరకాలం.

వరాహ మిహిరుడు తన బృహత్ సంహితలో ద్వాదశ (12) రాశులలో గురుసంచార పుష్కరాల రహస్యాలు చాలా వ్రాశాడు. ఈ బృహస్పతి రాశిలో ప్రవేశించే కాలంలో గురుబలం ఆకాశంలోని గ్రహ మండలాల నుండి ఆ ప్రాంతపు జీవనదిలోనికి ప్రసారమై పొంగి విజృంభిస్తుంది. గురువు రాశిలో ప్రవేశించిన మొదటి పన్నెండు రోజులు పుష్కర కాలం, అట్లే గురువు ఆ రాశిని వదిలి పోయే ఆఖరి 12 రోజులు అంత్య పుష్కర కాలం. ఈ మొదటి, అంత్య పుష్కర కాల దినాలు ఎంతో పవిత్ర దినాలుగా భావింపబడుతున్నవి.

ఈ పుష్కరకాలంలో ఆయా నదిలో స్నానాలు చాల పవిత్ర మైనవిగా తలంచబడుచున్నవి. ఆ సమయంలో మనం చేసే మన్త్ర జపం, దానం, సాధనలు గురుబలంతో మరింత శక్తి ప్రదానాలుగా వుంటాయని శాస్త్రవచనం.

బృహస్పతి మేషరాశిలో ప్రవేశిస్తే గంగానదికి పుష్కరం వచ్చినట్లు, బృహస్పతి కన్యారాశిలో ప్రవేశించే కాలం కృష్ణానదికి పుష్కరకాలము. మన తెలుగునాట, మన ముంగిట గల కృష్ణానదిలో ఈ సంవత్సరము ఆగష్టు 12వ తేదీ పుష్కరకాల ప్రారంభము. నాటి నుండి 12 రోజులు

కృష్ణానది స్నానం అతి పవిత్రము. బ్రహ్మాండ పురాణం, మార్కండేయ పురాణం, విష్ణు పురాణంలో కృష్ణా పుష్కరాల గాథ చెప్పబడి వుంది. ఈ పురాణాల ప్రకారం విష్ణు భగవానుని కుమార్తె పేరు కృష్ణ. ఆమె నదీరూపం ధరించి కృష్ణానదిగా ప్రవహిస్తూంది. పూర్వం సరస్వతీ దేవి శాపం వలన విష్ణుమూర్తి ' కృష్ణానది'గాను, మహాలక్ష్మీ 'వేణీ'నదిగాను ఏర్పడి రెండూ కలసి కృష్ణవేణిగా ఏర్పడినట్లు పురాణం చెబుతూంది.

ఈ కృష్ణానది మహారాష్ట్రలోని పరమడకనుమ సహ్యాద్రి పర్వతాలలో విష్ణు రూపమైన అశ్వత్థం నుండి ఆవిర్భవించి కర్ణాటకలో పారి ఆంధ్రప్రదేశ్ దివిసీమలో సముద్రంలో కలసిపోతుంది. కృష్ణానది జన్మస్థానం నుండి 30 మైళ్లు దిగువ మరో శిఖరంలో పుట్టిన వేణీ నది వచ్చి మాచాలి వద్ద ఈ కృష్ణానదిలో కలుస్తుంది. అచటి నుండి ఈ నది కృష్ణవేణి గా పేరు పొందింది. ఆ తరువాత మహాబలేశ్వరం వద్ద కుముద్వతి, విశాల, విజయ, వైష్ణవీ నదులు ఈ కృష్ణవేణిలోకలసి ప్రవహిస్తాయి. కర్ణాటకలో భీమారథి అమరజ,భోగవతి వగైరా నదులు కలుస్తవి. కర్ణాటకలో బాగల్ కోట తాలూకాలో బసవేశ్వరుడు ఐక్యమైన కూడల సంగమ క్షేత్రం వుంది. ఇచటి నుండి ఈ నది ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించగానే తుంగభద్రానది ఈ కృష్ణవేణీ నదిలో ప్రవేశించుతుంది. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైల పుణ్యదివ్య క్షేత్రం ఈ నదీతీరంలోనే వుంది. అట్లే బౌద్ధమత వైభవాన్ని చాటిన నాగార్జునుని నాటి విశ్వవిద్యాలయం ఈ నదీ తీరంలోనే వుంది. శాతవాహనుల తొలి రాజధాని ధాన్యకటకం ఈ నదీతీరంలోనే వుంది. సుప్రసిద్ధ దేవీ క్షేత్రం కనకదుర్గ దేవాలయం, పురాణ ప్రసిద్ధ అర్జునుడు తపస్సు చేసి శివుని నుండి పాశుపతాస్త్రం పొందిన ఇంద్రకీలాద్రి విజయవాడ ఈ నదీతీరంలోనే గలదు. ఇట్లే కృష్ణానది ఉద్గమస్థానం నుండి దాదాపు 1470 కిలోమీటర్లు పయనించి ఆంధ్రప్రదేశ్ దివిసీమలో హంసల దీవి వద్ద సముద్రంలో కలసిపోతూంది.

ఇట్టి కృష్ణానదికి ఈసంవత్సరం ఆగష్టు 12వ తేది నుండి

పుష్కరకాలం. ఈ పుష్కరకాలంలో ఈ కృష్ణానదీ స్నానం ముఖ్య కర్తవ్యం పరమపవిత్రప్రదం కూడ.

పుష్కరాలలో కృష్ణానది స్నాన సమయంలో నదిని దర్శించగానే ఈ క్రింది ప్రార్థన చెబుతూ నమస్కరించాలి.

కృష్ణవేణి నమస్తుభ్యం సర్వపాప ప్రణాశినీ ।
త్రిలోక పావనజలే రంగత్తుంగ తరంగిణీ ॥
శుద్ధ స్ఫటిక సంకాశం ద్విభుజాం పద్మధారిణీం ।
శివమూర్తి ధరాం దేవీం కృష్ణాం త్వాం ప్రణతో2స్మ్యహమ్ ॥
కమండలు ధరాం దేవీం జపమాలాధరాం శుభామ్ ।
బ్రహ్మీం సువర్ణవర్ణాభాం కృష్ణాం త్వాం ప్రణతో2స్మ్యహమ్ ॥
సర్వదేవమయీం సాక్షాద్బ్రహ్మవిష్ణు శివాత్మికామ్ ।
ఫలదాం సర్వతీర్థానాం కృష్ణాం త్వాం ప్రణతో2స్మ్యహమ్ ॥

ఆ తరువాత ఈ క్రింది శ్లోకాలు చెబుతూ నదిలో మూడు మునకలు వేయాలి.

శంఖచక్రధరాం దేవీం నీలోత్పల దళ ప్రభామ్ ।
జ్వరపాపహరాం దేవీం కృష్ణవేణీం స్మరామ్యహమ్ ॥
సహ్యా పాదోద్భవే దేవి శ్రీశైలోత్సంగగామినీ !
కృష్ణవేణీతి విఖ్యాతే మమపాపం వ్యపోహయ ॥

అని మొదటిమునక వేయాలి. ఆ పిదప

విష్ణు దేహాత్సముత్పన్నే సర్వపాపప్రణాశిని ।
కృష్ణవేణి నమస్తుభ్యం మమ పాపం వ్యపోహయ ॥

అని రెండవ మునక వేయాలి. తరువాత

నమోదేవీ మహాగంగే మహాపుణ్యైర్యుతే ।
స్నాతుమిచ్ఛామి దేవేశి ప్రసీద పరమేశ్వరీ ॥

అని మూడవ మునక వేయాలి. స్నానానంతరం అర్ఘ్యప్రదానం చేసి జప, ధ్యానాలు చేసుకోవాలి. పితృ తర్పణాలు చేయాలి. బీదలకు వస్త్రదానం, అన్నదానం వగైరా చేయాలి.



బంధవిముక్తికై అనవరతము సాధన గావించువాడే మానవుడు

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ప్రతి దినము రాత్రి నిదురించిన తరువాత ఒక విచిత్రమైన అనుభూతి జనులకు కలుగుచుండును. అదియే స్వప్నము. ఆ స్వప్న కాలమున ఏదేది కనుపించుచుండునో, అనుభూతమగుచుండునో అదియంతయు ఆ సమయమున సత్యముగ తోచుచుండును. మేలుకొనిన పిదప అంతయు అసత్యమని తేలిపోవును. ఒకానొకనికి స్వప్నమున గొప్ప నష్టము సంభవించినట్లు గాని, వ్యాధి తగుల్కొనినట్లుగాని, హింస జంతువులు తరుముకొనివచ్చుచున్నట్లుగాని అనుభవము కలిగినచో అతడెంతయో పరితాప పడుచుండును. అతని గుండె దడదడలాడు చుండును.అత్తఱి అతడు పొందు శరీర క్లేశము, మనః క్లేశము చెప్పతరము కాదు. ఆ దుఃఖ మంతయు తొలగుటెట్లు? ఏ ప్రక్రియచేత ఆ క్లేశమంతయు సమూలముగ అంతరించి పోగలదు ? మేలుకొనుటయే ఆ ప్రక్రియ. మేలుకొనిన వానికి స్వప్నమందలి బాధలన్నియు తుడిచిపెట్టుకొని పోగలవు. ఇతరమైన నివారణ చర్యలన్నియు తాత్కాలిక ఉపశమనమును కలుగజేయునేకాని శాశ్వత దుఃఖరాహిత్యమును కలుగజేయజాలవు.

అట్లే మహామాయచే గ్రసింపబడిన ప్రతిజీవియు వాసనావశమున ఆయా శరీర, ఇంద్రియ, మనోబుద్ధ్యాదిరూప ఉపాధి ద్వారా ఒకానొక దృశ్యప్రపంచమును వీక్షించుచున్నాడు. ఉపాధిని బట్టి, మనస్సును బట్టి, ఇంద్రియములను బట్టి, వాసనలను బట్టి ఆయా దృశ్య ప్రపంచము కూడ వేఱు వేఱుగ జూపట్టును. దేవతలకు ఒక విధముగను, మానవులకు ఒక విధముగను, జంతువులకు ఒక విధముగను, క్రిమికీటకాదులకు ఒక విధముగను, ఆ ప్రపంచము దృగ్గోచరమగు చుండును. అదియంతయు సత్యమని వారువారు భావింతురు. ఆ ప్రపంచమున తమకు సంభవించు సుఖదుఃఖానుభూతులన్నియు సత్యములని తలంచుచు, సుఖముచే పొంగిపోవుచు, దుఃఖముచే క్రుంగిపోవుచు చంచల, అశాంతికర జీవితమును గడుపుచున్నారు. ఈ అశాంతికి నివారణోపాయమేమి ? మేలు కొనుటయే. అనగా జ్ఞానమును బడయుటయే. సమ్యక్ – జ్ఞానమును బడయునంత వఱకు స్వప్నలోకము నందువలె ఏదియోయొక దుఃఖము జీవుని వెన్నంటుచునే యుండును. తన యథార్థ స్వరూపమును (ఆత్మను) తాను ఎంత శీఘ్రముగ తెలిసికొనిన, సంసార దుఃఖము అంత శీఘ్రముగ అంతరించిపోగలదు. శ్రీశంకరాచార్యులవారు ఈ విషయమును ఈ క్రింది శ్లోకము ద్వారా చక్కగ విశదీకరించి యున్నారు.

విశ్వం దర్పణ దృశ్యమాననగరీతుల్యం నిజాంతర్గతం
పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథా నిద్రయా
యత్సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మానమేవాద్వయం
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే

“ ఈ ప్రపంచము అద్దములో ప్రతిబించిన పట్టణము వలె కానుపించుచున్నది. వాస్తవముగ ఇది అసత్యమైనను సత్యముగ తోచుచున్నది. ఎట్లనిన నిద్రాసమయమున మనుజుడు తనయందే ఒకానొక లోకము కల్పింపబడియున్నను, దానిని తన కంటె బయటను, తనకంటె వేఱుగను చూచుచు అది సత్యమని భ్రమించుచున్నాడు. మేలుకొనిన పిదప

I
All the world is a stage
II
And all the men and women merely players
III
They have their exits and their entrances
IV

ఆ లోకము తనకంటె అన్యము కాదనియు తనయందే మాయచే కల్పింపబడినదనియు యెట్లు తెలిసికొనుచున్నాడో, అట్లే ఈ జగత్తునందు కానుపించు ప్రపంచమున్ను సత్యముగ తోచినను జ్ఞానప్రాప్తి సమయమున తనయందే కల్పితమైనట్లును, వాస్తవముగ తనకంటె అన్యము కానట్లును జీవుడు తెలిసికొనగల్గుచున్నాడు. అట్టి మహోన్నత జ్ఞానమును ప్రసాదించు గురుదేవుడగు శ్రీ దక్షిణామూర్తికి నమస్కారము ”అట్లే ‘ ఆత్మబోధ ’ యను గ్రంథమునందు శ్రీ శంకర భగవత్పాదుల వారు ఈ స్వప్న దృష్టాంతమును అత్యంత రోచకముగ ప్రతిపాదించినారు.

సంసారస్స్వప్నతుల్యో హి
రాగద్వేషాది సంకులః
స్వకాలే సత్యవద్భాతి
ప్రబోధే2సత్యవద్భవేత్.

“అనేక రాగద్వేషములతో గూడిన ఈ సంసారము (ప్రపంచము) స్వప్నమును బోలియున్నది. ఇది అజ్ఞాన కాలమున సత్యముగ తోచినను, జ్ఞానము కలిగినపుడు కేవలము కల్పితమే అని తేలిపోగలదు. ”

ఆధ్యాత్మికవిద్యాక్షేత్రమునందీ స్వప్నదృష్టాంతమునకు గొప్ప ప్రాముఖ్యత కలదు. కనుకనే ఆత్మానుభూతిని బడసిన మహనీయులు తరచు తమ రచనలందు, తమ ప్రబోధములందు ఈ దృష్టాంతమును మిక్కుటముగ ఉదహరించుచుందురు. యోగవాసిష్ఠమున వశిష్ఠమహర్షి శ్రీరామచంద్రున కుపదేశించునపుడు ఈ స్వప్న దృష్టాంతమును దాదాపు వందపర్యాయములు చెప్పియుండవచ్చును. దీనిలోనున్న విశేషమేమనగా ఇది ప్రతిజీవికి ప్రతిదినము యేదియో యొక సమయమున ప్రత్యక్షముగ అనుభవమునకు వచ్చుచునే యుండును. కళ్ళారచూచిన వస్తువులు,

ప్రత్యక్షముగ కానుపించిన లోకము ఒక్క క్షణములో తారుమారై, అదృశ్యమై తిరోహితమై పోవుచుండును. కనుకనే ఈ స్వప్నదృష్టాంతము అధ్యాత్మ ప్రబోధములందు మహాపటుతరమైనది, శక్తివంతమైనది. ప్రత్యక్షముగ వస్తువుకానుపించినప్పటికిని అది కల్పితమేయని ఋజువు చేయుటకు ఈ స్వప్న దృష్టాంతమునకు మించిన దృష్టాంతము వేఱొకటి లేదు. కాబట్టే గురువులు తమ శిష్యులకు పరమార్థవిద్యను బోధించునపుడు దీనినే ప్రధానముగ ఆశ్రయించుచున్నారు.

ఈ జగన్మాయయు స్వప్నమువలె జనులను వంచించి సంసార కుహరమున, జనన మరణ రూపమగు సుడిగుండమున వారిని పడద్రోసి యమయాతనలను పెట్టుచుండ విజ్ఞుడగువాడు గ్రుడ్లప్పగించి చూచుచు ఊరకయుండగలడా ? వెంటనే సద్గురువును సమీపించి ఈ మాయమేఘమునకు ప్రభంజనము వంటి బ్రహ్మజ్ఞానమును బడసి జీవితమును కృతార్థమొనర్చుకొనును. తానెవరో, తన నిజస్వరూప మేదియో, ఈ జగత్తు ఎట్లేర్పడినదో, ఈ జగద్భ్రాంతి ఎట్లు తొలగగలదో మొదలగు విషయములన్నిటిని చక్కగ తెలిసికొని గురూపదిష్ట మార్గము ననుసరించి, సాధించి తరించును. అట్లు చేయనిచో ఈ మహామాయ ఇంక ఎన్నియో జన్మలు జీవుని వెంటాడి వేధించగలదు. కాబట్టి విజ్ఞులెల్లరు శుభస్య శీఘ్రం, అనునట్లు పరమార్థక్షేత్రమున వెంటనే అడుగిలిడి, అకుంఠిత దీక్షతో, గొప్ప అధ్యవసాయముతో స్వస్వరూపవిచారణాది సాధన లవలంబించి, స్వప్నదృష్టాంతము మొదలైన వానిని గుఱించి చక్కగ పర్యాలోచించి మాయతో, ప్రకృతితో అవిద్యతో, అజ్ఞానముతో జరుగు ఈ భీషణ సంగ్రామమున విజయమును చేబట్టుదురుగాక !

పురుష ప్రయత్నము ఉండియే తీరవలెను

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

ప్రశ్న : అన్యచింతలను విడిచి భగవద్ధ్యానమందు ప్రపత్తి గల పరమభక్తుని సమస్త కార్యములు భగవంతుడే నిర్వహించుచున్నానని ఆజ్ఞ యిచ్చినదానికి మీరు ఏమి చెప్పగలరు ?

అనన్యా శ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥

ఏ జనులు ఇతర చింతలేనివారై నన్నే శరణుపొంది ధ్యానించెదరో, అట్టి యచంచల నిష్ఠగలవారల యోగక్షేమములను నేనే నిర్వహించెదను, అని భగవానుడు ఉపదేశించలేదా ? అట్లుండగా మరల స్వప్రయత్నమేల చేయవలయును ?

ఉత్త : విజ్ఞానాత్మస్వరూపా ! దీనియందు గూడ స్వప్రయత్న రహితమును బోధించుట లేదు. సామాన్యజనులకు సాధ్యము గాని అతీత ప్రయత్నమునే ఇది బోధించుచున్నది. " అనన్యాశ్చింతయంతః " అని ప్రయోగించుటచే ఇతర చింత లేమియు లేనివారై నిరంతరము దైవచింతనయందు మగ్నులైన మహాబ్రహ్మనిష్ఠుల విషయమై యీ శ్లోక ముపదేశించడమైనది. మరియు " నిత్యాభియుక్తానాం " అని యండుటచే ఒక్క రోజుగాని, కొన్ని రోజులుగాని మాత్రము భగవద్ధ్యాన పరాయణులగు వారిని గురించి చెప్పినది గాదు. ఎల్లప్పుడును నిరంతరము బ్రహ్మ చింతనయందు మునిగిన పుణ్య పురుషుల గురించి యుపదేశించినది. నిరంతరము బ్రహ్మాకారవృత్తిలో నుండుటకు ఎన్నో జన్మముల నుండి బ్రహ్మనిష్ఠ సలుపక వీలగునా ? ఇచ్చట ధ్యాతయు, ధ్యేయాకారము ఏకత్వమొందిన మహాబ్రహ్మనిష్ఠుల గురించి బోధించడమైనది. ఇదిన్నీ స్వప్రయత్నపరత్వమునే బోధించుచున్నది. దీనియందు

" యే జనాః " అని యుండుటచే మనుష్య మాత్రులలో ఎవరైనను పై జెప్పిన ప్రకారముండిన దైవకృపకు పాత్రులై ముక్తులు గాగలరని భావము.

ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః ।
అనేక జన్మ సంసిద్ధస్తతో యాతి పరాం గతిమ్ ॥

ధ్యానయోగమును చేయువాడు ప్రయత్నమువలన యత్నము చేయుచున్నవాడై పిమ్మట పరిశుద్ధాత్ముడై అనేక జన్మలపుణ్యసంస్కారము, గురుశుశ్రూష, దైవభక్తి వల్ల సిద్ధుడై ఆ పిదప సర్వోత్కృష్టగతిని పొందు చున్నాడు. దీనియందు " అనేక జన్మ సంసిద్ధః " అని ప్రయోగించుటచే అనేక జన్మముల నుండి తీవ్రతరముగా బ్రహ్మనిష్ఠా విషయమై ప్రయత్నించినందువల్ల సమస్త దోషములు నశించినవాడై హృదయ సంస్కారము గల్గి పరిపక్వమైన జ్ఞానము ఉదయమైన మాత్రమే సర్వోత్కృష్టమగు ముక్తి పదవిని బొందగల్గునని భగవంతుడు ఉపదేశించుచున్నాడు.

యతో యతో నిశ్చరతి మనశ్చంచల మస్థిరమ్ ।
తతస్తతో నియమ్యైతదాత్మన్యేవ వశం నయేత్ ॥

చంచలమై అస్థిరమైన మనస్సు ఏయే విషయముల యందు దిరుగుచున్నదో, ఆయా విషయములలో నుండి దానిని తప్పించి యాత్మ యందుండునట్లు తన స్వాధీనము చేసికొనవలయును. ఇట్లు యోగాభ్యాస బలమున యోగియొక్క మనస్సు ఆత్మయందే శాంతిని పొందుచున్నది. ఈ శ్లోకములో దైవభావము నుండి మనస్సు ఏయే విషయముల లోనికి బోవుచుండునో, ఆయా విషయముల నుండి ఆత్మధ్యానబలముచేత వశీకరించి దైవధ్యానములో నిలుపవలెనని చెప్పునప్పుడు గూడ ప్రయత్నముండవలయుననియే తేలుచున్నది. భగవానుడు ఇప్పుడు ఉపదేశించిన మనోనిగ్రహము సామాన్యజనులకు కూడ సులభ సాధ్యమైనది.

ఏడు బిందెలు

– శ్రీ రామకృష్ణ పరమహంస

ఒక గ్రామంలో ఒక మంగలి వుంటూండినాడు. అతడు రాజుకు మంగలి. ఆ మంగలి తన భార్యతోటి ఒక చిన్న పూరింటిలో వుంటూం డినాడు. అతడు ధనవంతుడూ గాదు. నిరుపేదానుగాదు. రాజు ప్రతినెల ఇచ్చే జీతంతో తన కుటుంబ పోషణ జరిగిపోతూండేది. కానీ మంగలి కింతటితో సంతోషం లేదు. అతను పెద్ద ధనవంతుడు కావాలనుకొనేవాడు.

అతడు తన భార్యతో “ ఎంత వీలైతే అంత ఖర్చు తగ్గించి మిగలబెట్టూవుండు. నీ మెడలో ఇంకా అనేక బంగారు నగలుండాలి. నీవు ధనవంతుని భార్యతో సమానంగా కనబడాలి అని నా కోర్కె. గావున డబ్బు నెల నెలా మిగలబెట్టు. మిగుల బెట్టింది ప్రోగైతే దానితో నీకు మంచి బంగారు చైన్ చేయిస్తాను ”అని అంటూండేవాడు. ఇందుచే మంగలి అతని భార్య కలసి యథాశక్తి డబ్బును జమచేయ నారంభించారు. కొంత ప్రోగవగానే కంసాలింటికి పోయి ఒక బంగారు హారం – చైన్ కొని తెచ్చారు.

దాన్ని వేసికొని మంగలి భార్య చాలా సంతోషించింది. మంగలి “ ఇప్పుడు నీవు పెద్దింటి కోడలుగా కనిపిస్తున్నావు ” అని భార్యతో అన్నాడు. కాని మంగలికి ఇప్పుడున్న సంతోషం లేదు. ఇంకా బంగారు చిక్కితే బాగుండునని అతనెపుడూ ఆలోచిస్తూండేవాడు. ఇట్లుంటే ఒకరోజతడు సంధ్యా సమయంలో తనింటికి దగ్గఅలో వుండే అడవిలో వాహ్యాళికెళ్లాడు. అచట ఒక చెట్టుక్రింద కూర్చొని ఎక్కడ్నుంచైనా సరే ఇంకా కొంత బంగారం

చిక్కితే బాగుండునని బంగారాన్ని గూర్చి ఆలోచిస్తూండినాడు.

ఇంతలో ఆ చెట్టు దగ్గఅనుండే ఒక పిలుపు వినబడింది – “ మంగలీ ! మంగలీ ! నీవు ధనవంతుడు కావాలనుకొంటున్నావా ! నీకు బంగారు కావాలా ? అని. అది విన్న మంగలి “ అవును ! అవును! నేను ధనవంతుడు కావాలనుకొంటున్నాను. నాకు మరింత బంగారు కావాలి ” అని అరచాడు. అందుకా అశరీరవాణి అన్నది “ నీకెంత బంగారు కావాలి? ఏడు బిందెల ధనం కావాలా ! ’

మంగలన్నాడు “ ఏడుబిందెలే ! అవునవును నీవు నిజమే చెప్పావు. నాకు ఏడుబిందెల బంగారు నాణాలు కావాలి ”

ఆ అశరీరవాణన్నది – ‘ సరే. నీవింటికెళ్లు అక్కడ ఏడుబిందెలు ధనంతో నిన్నెదురు చూస్తూంటాయి. ”

మంగలనుకొన్నాడు “ ఇది కలా ! నిజమా ! ఐనా ఇంటికెళ్లి చూస్తాం నా సొమ్మేంపోతుంది వెళ్లిచూస్తే ” అని పరుగు పరుగున ఇంటికెళ్లి బయటినుండే భార్యను పిలచాడు. పిలుపుతోటే భార్య నవ్వు ముఖంతో గడప దగ్గఱికొచ్చి నిలబడింది. ఇతను మాట్లాడకముందే “ రా! రా ! లోపలకొచ్చి చూడు అంటూ తనని లోపలికి పిలిచింది. మంగలి లోపలికెళ్లి చూస్తాడు గదా నేలపై ఏడు బిందెలున్నాయి. అతను భార్యతో అన్నాడు “ ఇందులో ఏముందో తెలుసా ! బంగారు ! బంగారు! చూపిస్తాను చూడు ”ఒక్కొక్కటి మూత తెరచాడు అన్నింటిలో బంగారుంది. ఆనందం పట్టలేక అతను మనమింక ధనవంతులం, ధనవంతులం అంటూ గంతులు వేయసాగాడు.

భార్య ఒక్కొక్క బిందె మూత తీసి చూడసాగింది. నిండుకు బంగారు నాణాలున్నవి. ఆరూ అట్లే వున్నవి. కానీ ఏడవది మూత తీసి

చూస్తే అది సగం ఖాళీ వుంది. " ఇది అర్ధమే బంగారుతో వుంది సగం ఖాళీ " అని అరచింది. అతనన్నాడు ' ఏంటీ ! సంగం బిందె ఖాళీయా! అదెట్లు ! కానీ ఏం చేస్తాం. మనం ఈ సగాన్ని ఇకపై భర్తీ చేద్దాం " అని. భార్య అంది " ఈ సగం దేంతో నింపుతావు ! ఇంత బంగారు మనకెట్లా వస్తుంది "అని. అతనన్నాడు " మనం ఇకపై ఇంటి ఖర్చు ఇంకా చాలా తగ్గించాలి. ఆ ఆదాను ఈ బిందెలో వేస్తూ రావాలి. నీ బంగారు నగలన్నీ గూడా ఇందులో వేయాలి " భార్య అన్నది " నేను ధనవంతుని భార్య వలె మెడనిండా, వంటినిండా, నగలతో వుండాలన్నావు. ఇపుడేమో వున్న నగలు తీసి బిందెలో వేయమంటున్నావు."

అందుకతనన్నాడు " నీవొక మూర్ఖురాలు. నిజమే ధనవంతులు తమ భార్యల వంటినిండా నగలు వేసి తిరగమంటారు అనేది నిజమే. కానీ వాళ్లంతా అందరికంటే ధనవంతులా ! ఏంటి ! పెద్ద ధనవంతులెప్పుడూ తమ నగలను ధనాన్ని ఇట్లా బిందెలకు నింపి పూడ్చి పెట్టారు తెలుసా ! ఇపుడు మనం పెద్ద ధనవంతులం కాబట్టి ఏడో బిందెగూడా ఖాళీగా వుండగూడదు". మంగలి భార్య మెడలోని నగలు కంసాలికిచ్చింది. కరగబెట్టి ఆ బంగారాన్ని తెచ్చి ఏడో బిందెలో వేసింది.

మంగలన్నాడు " రోజూ ఇంటి కికపైన ఇంత ఖర్చు చేయద్దు. మనం తిండికి ఖర్చు తగ్గిద్దాం. ఎక్కువ మిగిలించి బిందెలో వేద్దాం. అప్పుడు గాని బిందెనిండదు" అని. అట్లే ఇద్దరు కడుపు నిండుకు భోజనం చేయడం మానేశారు. అర్ధ కడుపుకే తిననారంభించారు. ఎక్కువ మిగలబెట్టి బిందెలో వేయసాగారు. కానీ బిందె నిండలేదు. దినాలు గడిచేకొద్దీ భార్యాభర్తలిద్దరూ తిండి తగ్గినందున బాగా సన్నబడ్డారు.

రాజు గమనించాడు – మంగలి రోజు రోజుకు సన్నబడతా వున్నాడు, అంతేగాక ఎపుడూ ఏదో ఆలోచిస్తూంటాడు అని. ఒక రోజు మంగలినే అడిగాడు " నీ వెందుకు రోజు రోజుకు తగ్గిపోతున్నావు ! ఎపుడూ ఏదో ఆలోచిస్తూ వుంటావు. ముందున్నట్లు నవ్వుముఖంతో వుండడం లేదు. కారణమేమి ! " అని. మంగలన్నాడు " అట్లేమీ లేదు మహారాజా! నా కేమీ జబ్బు లేదు, కొంచెం డబ్బును గురించి ఆలోచిస్తూంటానంతే" " ఏంటీ నీకింకా డబ్బు కావాలి ! " అని రాజడిగాడు. " అవును మహారాజా! నాకింకా డబ్బుకావాలి ! " అన్నాడు మంగలి. ఐతే ఈ నెల నుండి నీ జీతం రెండింతలు చేశానుపో ! అన్నాడు రాజుగారు.

అది విన్న మంగలి ఆనందంతో " మీకెట్లా కృతజ్ఞతలు చెప్పాలో తెలియదు. ఇపుడు నా కష్టాలన్నీ గట్టెక్కినట్లే " అంటూ రాజు కాళ్లపై బడ్డాడు. మంగలిప్పుడు మరింత డబ్బు మిగిలించ మొదలెట్టాడు. ఖర్చు మరీ తగ్గించాడు. మిగిలిన డబ్బుతో బంగారు కొనడం ఏడోబిందెలో వేయడం ఇదీ అతని దినచర్య. కానీ ఏడో బిందె ఇంకా నిండడం లేదు. కొంతకాలం గడిచింది. మంగలి ఉదాసీనత, పరధ్యానం ఇంకా పోలేదు గదా ! మరింత పెరిగింది. రాజు ఈ విషయం గమనించాడు.

ఒకరోజు రాజుగారు మంగలితో అన్నాడు – " నేను నీ జీతం రెండింతలు పెంచాను. కానీ నీవు ఇంకా చింతాగ్రస్తుడవుగానే వున్నావు. ఇదివరలో వలె నీలో నవ్వే కనిపించడం లేదు కారణమేమి ? " అని. కానీ మంగలి రాజుగారితో ఏమని చెప్తాడు ఏడు బిందెల సంగతి ? కాబట్టి తలవంచుకొని మౌనంగా నిలబడ్డాడు. అంత రాజుగారన్నారు " ఆఁ ! తెలిసింది బహుశా ఏడుబిందెల సంగతై వుంటుంది. నీకు ఏడుబిందెలు చిక్కాయిగదూ ! ' మంగలికి ఆశ్చర్యమేసింది. తనకు తన భార్యకు తప్ప ఇదెవరికీ తెలియదే. రాజుగారికెట్లు తెలిసింది !

అని తేరుకొని అన్నాడు “ ఇది తమ కెట్లు తెలిసింది ప్రభూ !” రాజు నవ్వుతూ అన్నాడు “ నాకు తెలుసు ఒకమారు నాకున్ను ఈ ఏడు బిందెలివ్వబడ్డాయి. ఒక చెట్టు నుండి ఈ ఏడు బిందెలిచ్చే శబ్దం విన్నాను” అయితే తామా ఏడు బిందెలు తీసికోలేదా ” అని అడిగాడు మంగలి.

రాజన్నాడు “ నేను బిందెలను తీసుకొన్నాను. కానీ అందులో ఏదో దోషముందనిపించింది నాకు. ఆ శబ్దం నాకు ఏడు బిందెలిచ్చే మాట చెప్పింది. కానీ నేను చూస్తే ఏడో బిందె సగం ఖాళీగా వుంది. అది వినిన మంగలన్నాడు – నిజం నిజం ఏడో బిందె సగం ఖాళీ రాజన్నాడు – ఆ “ పిదప నేను ఆ శబ్దం వచ్చిన చెట్టు దగ్గఱకు పోయాను. పోయి అన్నాను గదా – ఏడో బిందె ఖాళీగా వుందే అని, ఆ శబ్దం అన్నది గదా ఏడో బిందె ఎప్పుడూ ఖాళీగానే వుంటుంది ” అని. దానికి నేనన్నాను “ ఈ బంగారు ఖర్చు చేసే దానికా ! లేక బిందెలలోనే వుంచడానికా ?” అని. అందుల కటువైపు నుండి జవాబే రాలేదు. ఆపైన నేను రాజమహలు కొచ్చి ఆ బిందెల విషయమై ఆలోచించ సాగాను.

ఆ అశరీరవాణి “ ఏడో బిందె ఎప్పుడూ సగం ఖాళీగానే వుంటుందని” ఎందుకన్నదో నాకు బోధపడింది. దాని అర్థమేమంటే – దాన్ని నింపడాని కెంతైనా పరిశ్రమచై, కానీ అదెప్పుడూ నిండదు. దీని తాత్పర్యముప్రలోభం నన్ను ఊబిలో దింపడానికని. నాలో మరింత మరింత బంగారు పొందాలనే లాలసత ఎప్పటికప్పుడు పెరుగుతూ పోనీ అని. ఆ బిందె ఎపుడూ నిండదు, నాతృష్ణ ఎప్పుడూ నశించదు. కాగా మరింత పెరుగుతూ వుంటుంది. దీని కంతమేలేదు. అది వినిన మంగలి అన్నాడు – “ మహారాజా ! తామా వల నుండి ఎట్లు తప్పించుకొన్నారు ?

రాజన్నారు “ అది చాలా సరళము ” నేను మరల ఆ చెట్టుదగ్గఱకు పోయాను ఆ అశరీర వాణితో అన్నారు “ నీవీ ఏడు బిందెలను వాపసు తీసుకో నా కవి వద్దు ”, అందులకా అశరీర వాణన్నది “ మంచిది. నేనా బిందెలను వాపసు తీసుకొంటాను.” అని, నేను మహలుచేరి చూతునుగదా ఏడుబిందెలు లేవు. అంతా విన్న మంగలి అన్నాడు “ ఐతే ! ఆ ఏడోబిందె ఎప్పుడూ నిండదన్నమాట. తాము ఇదంతా నిజమని నమ్ముతారా దేవరా !” “ ఇందులో సందేహమే లేదు. ఆలశ్యంకాక ముందే, నీ సంపాదనంతా కాజేయకముందే ఈ బిందెలను చెట్టుకు త్రిప్పి ఇచ్చై. నీవు తిండితినక చాల దుర్బలుడవు, రోగి అయినావు. బంగారు పొందాలనే పెరుగుతూ పోయే ఈ తృష్ణ వలన నీకేలాంటి లాభము గలుగదు. అధిక ఆపద రాకముందే ఈ బిందెలను వాపసిచ్చై” అన్నాడు రాజు.

రాజు మాటలు విన్న మంగలి ఇంతవఱకు చేర్చిన కష్టఫలంగూడా పోతుందని భయపడ్డాడు. వెంటనే పరుగెత్తుతూ అడవిలోని ఆ చెట్టు వద్దకు పోయాడు. ఆ ఏడు బిందెలను వాపసు తీసుకోమన్నాడు. దానికిబదులు శబ్దం వచ్చింది – “ మంచిది. బిందెలను నేను తీసుకొంటాను” అని మంగలి ఇల్లుచేరి చూశాడు గదా ఏడుబిందెలూ లేవు. వాటితోటి పస్తులుండి సంపాదించి చేర్చి పెట్టిన తన కష్ట పలం కూడా పోయింది.

కావున తృష్ణ చాలా చెడ్డది. దానివలలో పడకుడు. పడ్డారా, మీ పరిశ్రమ అంతా వృథానే. అది పెరుగుతూ పెరుగుతూ మిమ్ములనే ఆహుతి చేస్తుంది. అదొక అంతులేని దాహం గాన ఈ ఈషణా త్రయాలను, తృష్ణను పరిత్యజించుడు. భగవంతుని స్మరించుడు.

జ్ఞాన సుధ

మూలం
శ్రీ సర్వభూషణ శివయోగి వారు

అనువాదం :
శ్రీ శంకరానందగిరి స్వాములవారు,
ఉమామహేశ్వర పీఠాధిపతులు

అవతారిక : అద్వైతజ్ఞానము వలననే తప్ప భేదజ్ఞానముచే గూడిన కర్మాదుల వలన మోక్షము రాజాలదని విశదపఱచుచున్నారు.

కేచిత్కర్మపరే చ భక్తి మపరే వైరాగ్య మన్యే తపః
కేచిత్తూపశమంచ యోగ మితరే ముక్తే ర్నిమిత్తం విదుః,
నో ద్వైతాత్మిక వాసనాశ్రయతయా తేషాం జనుర్దాపనే
హ్యద్వైతప్రతిభాం వినా ప్రతిభువశ్శ్రౌతైః ప్రతీమో వయమ్ 33

కేచిత్ = కొందఱు, కర్మ =నిత్య నైమిత్తికాదిరూపమైన కర్మను, పరే = మఱికొందఱు, భక్తించ = శ్రవణాది రూపమైన భక్తిని, అపరే = ఇంక కొందఱు, వైరాగ్యం = విరక్తిని, అన్యే= ఇతరులు, తపః = పంచాగ్న్యాది తపస్సును, కేచిత్ తు = మఱికొందఱైతే, ఉపశమం = ఉపశమమును, ఇంద్రియముల సంయమమును, లేదా నివృత్తిని, చ = మఱియు, ఇతరే = అన్యులు, యోగం = యమాద్యష్టాంగ యోగమును, ముక్తేః = మోక్షమునకు, నిమిత్తం = కారణముగా, విదుః =తెలిసికొనిరి. నో = అది కూడదు. హి = ఏ కారణమువల్లననగా, అద్వైత ప్రతిభాం వినా = అద్వైత (అభేద) జ్ఞానము తప్ప, తేషాం = అవి, ఆ కర్మోపాసనాదులు, ద్వైతాత్మిక వాసనాశ్రయతయా = ద్వైతవాసనకు (భేదజ్ఞానమునకు) ఆశ్రయముగా ఉన్నవగుటచేత, జనుర్దాపనే = జన్మను కలిగించుటయందే (నిమిత్తమైయున్నవని), అప్రతిభువః = (ముక్తికి) అసమర్థములైయున్నవని,వయం = మేము, శ్రౌతైః = శ్రుతి సంబంధములైన, (వాక్యైః = వాక్యములచే, వేదాంత వాక్యములచేత,) ప్రతీమః = తెలియుచున్నాము.

కొందఱు కర్మను, కొందఱు భక్తిని, కొందఱు వైరాగ్యమును, కొందఱు తపస్సును, కొందఱు ఉపశమమును, కొందఱు యోగమును మోక్షసాధనముగా చెప్పుదురు. అది సరికాదు. ఏలయన, వానియందు భేదజ్ఞానము, ద్వైతవాసనలు ఉండును. అందువలన అవి జన్మకు హేతువులే యగును. " ద్వితీయాద్వై భయం భవతి " భేదజ్ఞానము భవదుఃఖమునకు కారణము. అద్వైతజ్ఞానము మోక్షమునకు కాణము అని తెలియవలెను.

అవ : అట్లయిన కర్మాదులు నిష్ప్రయోజనములా ? యనిన, కాదనియు, అవి అధికారుల తారతమ్యమునుబట్టి చెప్పబడినవనియు చెప్పుచున్నారు.

న కిమప్యధమాధమః కదా2
ప్యధమః స్నిహ్యతి కర్మ మధ్యమః,
స్వకదైవతభక్తి ముత్తమో 2
య మముఖ్య శ్చిత ముత్తమోత్తమః. 3

అధమాధమః = అధమునికంటె అధముడు, (అతినీచుడు), కదా అపి = ఎన్నడును, కిం అపి = కర్మ భక్తి జ్ఞానములందు దేనిని గూడ, నస్నిహ్యతి = ప్రేమింపడు, అధమః = అధముడు, కదా అపి = ఎప్పుడో ఒకప్పుడు, స్నిహ్యతి = ప్రేమించును. మధ్యమః = మధ్యముడు, కర్మ = కర్మను,స్నిహ్యతి = ప్రేమించును. ఉత్తమః = ఉత్తముడు, స్వకదైవతభక్తి= తన యిష్ట దేవతాభక్తిని, స్నిహ్యతి = ప్రేమించును, అయం = ఇతడు, అముఖ్యః = ముఖ్యుడు (సర్వోత్తముడు) కాడు. ఉత్తమోత్తమః = ఉత్తమోత్తముడు, సర్వశ్రేష్ఠుడు, చితం = జ్ఞానమును, స్నిహ్యతి = ప్రేమించును.

అధమాధముడు ఎప్పటికిని ముక్తి పొందలేడు. అధముడు ఎప్పటికైన ముక్తిని పొందిన పొందవచ్చును. మధ్యముడు, ఉత్తముడు వీరు క్రమముగా జ్ఞానసాధనములయందు ప్రవేశ మేర్పడి ముక్తికి యోగ్యాధికారులగుదురు. అధమాధముడు కర్మ, భక్తి, జ్ఞానములందు ఏదొక్కటియు స్వీకరింపడు. అధముడు ఒకప్పుడు స్వీకరించును.

మధ్యముడు కర్మను తీసి కొనును. ఉత్తముడు తన యిష్టదేవతయందలి భక్తిని ప్రేమించును. ఉత్తమోత్తముడు జ్ఞానమును గ్రహించును. అందుచేత కర్మాదు లేవియు నిష్ప్రయోజనములు కావు. ఇవి ముక్తికి పరంపరా (క్రమేణా) సాధనములుగా ఉన్నవి. జ్ఞానమో సాక్షాత్ సాధనముగా ఉన్నదని అభిప్రాయము.

అవ : కర్మలయందే ఆసక్తులగు జనులు (కర్మఠులు) జనన మరణాది దుఃఖములను పొందుదురని తెలుపుచున్నారు.

యమశబరో మోహవనే
జీవమృగాన్ కర్మవాగురాలుఠితాన్,
భిత్వా భేదమనీషాన్
భవదుఃఖాగ్నౌ పచన్ భుంక్తే.

యమ శబరః = యముడనెడి కిరాతుడు, మోహవనే = అజ్ఞానమనెడి అరణ్యమునందు, కర్మవాగురాలుఠితాన్ = కర్మయను వలలో తగుల్కొని కొట్టుకొనుచున్న, భేదమనీషాన్ = భేద బుద్ధిగల జీవమృగాన్ = జీవులనెడి మృగములను, భిత్త్వా = భేదించి, ఛేదించి, భవదుఃఖాగ్నౌ = జనన మరణ రూపమైన దుఃఖాగ్నియందు, పచన్ = వేయించి, భుంక్తే = భుజించును.

యముడనెడి వేటకాడు అజ్ఞానమను ఈ ప్రపంచవనమునందు కర్మజాలమను వలను వేసియుండ, అందు పడి పొరలునట్టి భేదబుద్ధిగల జీవులనెడి మృగములను సంహరించి భవదుఃఖమను అగ్నియందు వేగించి తినుచుండును. అనగా కర్మయే పరమార్థమని భావించి కర్మఠులు తమ (నిజ) తత్త్వమును మఱచి దేహాత్మబుద్ధిచే వర్ణాశ్రమాది అభిమానములచే కర్మలయందు తత్పరులగుచు ఆత్మభేదబుద్ధివలన వారు పునఃపునః జననమరణరూప దుఃఖమునే అనుభవింతురు. “ మృత్యోస్సమృత్యు మాప్నోతి”. అవిద్యచే తమను మఱచి భేదబుద్ధి గలవారై సారె సారెకు జననాది దుఃఖములను పొందుచుందురని శ్రుతియు చెప్పుచున్నది.

భాగవత సుధ

– శ్రీ రామకృష్ణానందగిరి స్వాములవారు,
(గండిక్షేత్రము)

ఆత్మీయ భాగవతప్రియ బంధువులారా !

భాగవత శ్రవణాసక్తులైన మీ దివ్య చిత్తములకు నా సాదర నమస్కారములు.

మ. **‘ లలిత స్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు మం**
జులతా శోభితమున్, సువర్ణ సుమనస్సు జ్ఞేయమున్ సుందరో
జ్జ్వల వృత్తంబు మహాఫలంబు విమల, వ్యాసాలవాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్విన్ సద్ద్విజ శ్రేయమై ’

భాగవతము కల్పతరువు. కల్పవృక్షము. ఆవిధంగా రూపకాలంకారము ద్వారా పై పద్యము వర్ణించింది. కల్పవృక్షము పూర్ణ వస్తువు. అదే అపూర్ణమైతే ఇతరులను పూర్ణులనెట్లు చేస్తుంది.

భాగవతము పూర్ణశాస్త్రము. భాగవతము ‘పరమ హంస సంహిత’ అనడం అందుచేతనే. ‘కామింపకయును – సర్వము కామించియునైన – (ఆం.భా. 2-39) ‘అకామ స్సర్వకామో వా (సం.భా.2-3-10)

‘ కామింపకయును’ – అదీ పూర్ణ లక్షణమే. ఈ భాగవత ఉపదేశము భాగవత ఉపదేశమే సుమా !

హిరణ్యకశివుని సంహారానంతరం శ్రీ నరసింహ దేవుడు ప్రహ్లాదుని చూచి ‘ అబ్బాయీ ! నాయనా ! నా కొరకు చాలా బాధలను సహించావు. ఏదైనా వరం కోరుకో ఇస్తాను’ అని అడిగాడు. ప్రహ్లాదు డంటాడు. –

‘అహంత్వకామస్త్వద్భక్తః – త్వంతు స్వామ్యనపాశ్రయః

(7-10-6)

' స్వామి నీకు లేనిది ఒకటీ లేదు ! నాకు కావలసింది ఒకటీ లేదు ' – ప్రహ్లాదుని పై మాటలలోని అభిప్రాయం అక్షరార్థం కాకపోయినా అంతర్యం ఇదే. ఇద్దరూ పూర్ణులే. భగవంతుడూ పూర్ణుడే. భగవంతుని చెప్పే, భక్తులను గురించి చెప్పే భాగవతము పూర్ణమే.

భాగవత అభిప్రాయం భగవంతుడంటే శ్రీ కృష్ణుడే. ఇతరులను భగవంతుడని వ్యవహరించుట గౌణ పద్ధతిలో. ముఖ్యార్థంలో భగవంతుడంటే శ్రీకృష్ణుడే. గీతకు భగవద్గీత అని పేరు రావడం, శ్రీకృష్ణుడు భగవంతుడు కాబట్టే. అటు కాకపోతే 'కృష్ణగీత ' అని చెప్పవలసి వుంది.

వైష్ణవాచార్యులు అయిదు మంది శ్రీరామానుజ, మధ్వ, వల్లభ, నింబార్క, చైతన్య ప్రభువులు. వారిలో ముఖ్యంగా వల్లభాచార్యులు శ్రీకృష్ణుని ఒక అవతారంగా పరిగణించక 'అవతారి' అని అన్నారు. అన్ని అవతారాలు ఆయనవే. ఆయన నుండే అన్ని అవతారాలు సంభవించాయి. ఆ సంప్రదాయ స్తుతి.

" మత్స్యః కూర్మో వరాహశ్చ నారసింహశ్చ వామనః
రామో రామశ్చ రామశ్చ, బుద్ధః కల్కిరేవచ "

మత్స్యావతారము, కూర్మావతారము, వరాహావతారము, నరసింహా వతారము, వామనావతారము, పరశురామవతారము, రామావతారము, బలరామావతారము, బుద్ధావతారము, కల్కి అవతారము వీటినే దశావతారాలుగా లెక్కిస్తారు. వీనిలో శ్రీ కృష్ణుని ఒక అవతారంగా లెక్కింపలేదు.

శ్రీకృష్ణుడు పూర్ణ పురుషోత్తముడు, షోడశ కళాపూర్ణుడు, 'షోడశ స్త్రీ సహస్రేశాయ నమః " అని మనం పూజలో చెప్పుకునే మాటకు అర్థమూ ఇదే. పదారువేల గోపికలకు భర్త అనే మాటకు 'పదారు కళలతో పూర్ణుడు' అని. ఆదిదైవిక పరమైన అర్థంగా గ్రహించాలె. ఆధిభౌతికాన్ని ఆధిదైవికం చేసి, ఆధిదైవికాన్ని ఆధ్యాత్మికం చేయడం భారతీయ తత్త్వ శాస్త్రాల ప్రణాళిక.

పురాణ పద్ధతి ననుసరించి భాగవతము పూర్ణ పురుషోత్తముని గాథను, బోధను, లౌకిక భాషలో, కావ్య భాషలో, పరకీయ భాషలో, అనువాద భాషలో ముఖ్యంగా సమాధి భాషలో ప్రతిపాదన చేయడం జరిగింది. కావున భాగవతము పూర్ణ శాస్త్రము, కల్ప వృక్షము – అను ఉపమానము ఈ విధంగా కూడా సార్థకమే.

భగవంతుకి సంబంధించింది భాగవతం. భగవంతునికి సంబంధించిన వారు భాగవతులు. ఈ ఉభయవిధ సవిస్తర కథన శాస్త్రమే భాగవతము. భగవంతుని తత్త్వాన్ని నిర్గుణంగా, నిరాకారంగా, సాకారంగా, సర్వతోముఖంగా, సమగ్రంగా భాగవతంలో ప్రతిపాదన చేయడం జరిగింది.

గతంలో నిర్గుణ తత్త్వ ప్రతిపాదన చతుఃశ్లోకీ భాగవతము ద్వారా చెప్పబడింది. దశమ స్కంధంలో వచ్చే ' శ్రుతి గీతాలు ' ఆ కోవలోవే, సగుణ తత్త్వ విషయకంగా వృత్రాసుర చతుఃశ్లోకీ, గోపికా గీతాలు మొదలైనవి వున్నాయి.

గుణావతార, అంశావతార, దశావతార, ఆవేశావతారాలు చెప్పబడ్డాయి. భాగవతులైన సూత, శౌనక, వ్యాస, నారద, శుక, పరీక్షిత్, భీష్మ, కుంతి, ద్రౌపది, ఉత్తర, కపిల, ధ్రువ, పృథు, ఋషభ, భరత, అజామిళ, వృత్ర, చిత్రకేతు, ప్రహ్లాద, అజగర, గజేంద్ర, బలి, భగీరథ, అంబరీష, అక్రూర, గోపికాదుల చరిత్రలూ వర్ణింపబడ్డాయి.

ముందు ముందు భాగవతుల, భక్తుల కథలకు ప్రాధాన్యమిచ్చి ఆ వెనుక వెనుక భగవత్కథలను రామకృష్ణాదుల చరిత్రను చెప్పడం జరిగింది. ' రామ తే అధిక రామకర దాసా – ' ' రామా ! నీకంటే నీ

భక్తుడే గొప్ప ' అని తులసీదాసు సోపలంభంగా పలికాడు కదా !

' స్వామీ ! నీవు సముద్రము దాటవలసి వస్తే నీవు బాధపడి నీ భక్తులను బాధపెట్టి ఎలాగో దాటగలిగావు. కానీ నీ భక్తుడు ఆంజనేయుడు రామా ! అని నీ నామముచ్చరించి ఒక్క గంతులో అవలీలగా అనాయాసంగా అంత సముద్రాన్ని లంఘించి వేశాడు. చెప్పు మరి నీవు గొప్పా ? నీ భక్తుడు గొప్పా. ' రామతే అధిక రామకరదాసా !'

ఉదయనాచార్యుడు ప్రసిద్ధ తర్క పండితుడు. తర్క శాస్త్ర ప్రణేత. న్యాయశాస్త్రా చార్యుడు. భగవద్భక్తుడు. బౌద్ధుల నిరీశ్వరవాదాన్ని తన కర్కశ తర్కనైపుణ్యంతో ఖండతుండాలు చేసి భగవంతుని అస్తిత్వాన్ని ప్రతిష్ఠించిన మహానుభావుడు.

ఆయన ఒకప్పుడు జగన్నాథ క్షేత్రం వెళ్ళాడు. దర్శన సమయం అయిపోయిందేమో అర్చకులు మందిర ద్వారాలను బంధించి వెళ్ళిపోయారు. తలుపులు మూయబడి వున్నాయి. ఆ ప్రచండుడు తాళలేకపోయాడు.

' జగన్నాథా ! నేనే లేకపోతే ఈసరికి నిన్ను బౌద్ధులు సముద్రంలో కలిపివేసి వుండేవారు. మర్యాద లేకుండా తలుపులు వేసికొని లోపల బింకంగా కూర్చున్నావా ? బైటికి రా ? ' అని గద్దించాడు. ద్వారాలు ఫెడీమని తెరవబడ్డాయి. తులసీదాసు మాట నిజమే. రామతే అధిక రామకరదాసా !

ఎక్కడో ఒక విషయం చదివాను. తులసీ రామాయణంలోనేనేమో అనుకొంటాను.దగ్గర రెఫరెన్సు (సహాయక గ్రంథాలు) లేకపోయె. వ్యాస రచన కూడా ప్రవాసాలల్లోనే, ప్రయాణాలలోనే జరుపుకోవలసిన ప్రారబ్ధం ఇంకా తప్పక పోయె. భగవంతా ! దయపెట్టు.

సీతారామలక్ష్మణులు వనవాసంలో వున్నారు. ఒక వృక్ష తలంలో సుఖాసీనులై వున్నారు. భాతృప్రేమలో పరవశుడైన తమ్ముడు లక్ష్మణుడు సరదాగా అన్నతో అన్నాడు. ' అన్నా ! రఘూత్తమా ! కీర్తిమంతుడవంటే నీకు నీవే సాటి. నీ యశః పతాక గగన వీధులలో ఉన్నతోన్నతంగా ఉర్రూతలూగుతూంది కదయ్యా ! '

తమ్ముని మాట విన్నాడు. శ్రీరాముడు సస్మితుడై తమ్మునితో ఇలా అన్నాడు. ' తమ్ముడా ! నా మాటా విను. ఒక రాజ భవనంపై జెండా ఒకటి ఎగురుతూ ఉంది అనుకో, అది అంత ఎత్తులో సగర్వంగా ఎగురుతూ రెపరెపలాడ్తూ వుంది అంటే, క్రింది దానికి ఆధారమై పొడగాటి ఒక కర్ర వుండాలి కదా ! నాయనా నీవు కర్రవంటి వాడివి. నేను ఆ జెండా గుడ్డ వంటి వాడిని. నాకీ కీర్తి నీ మహిమతోనే నయ్యా ! ' రామతే అధిక రామకరదాసా ' ముచ్చటయి మురిపాలొలికే ముద్దయిన మాట. తులసీదాసు మాట.

" పరీక్షిత్ శుక సంవాదః శ్రుణు భాగవతం ' (భా.మా. 3–26) పరీక్షిత్తుడు భాగవతానికి పూర్ణ అధికారి. 'పంచ శుభం ' అన్నట్టు పరీక్షిన్మహారాజులో అయిదు విధాలైన శుద్ధులూ పరిపూర్ణంగా అమరి వున్నాయి. కాబట్టే ఆయన పూర్ణ అధికారి అయ్యాడని శ్రీరామచంద్ర డోంగ్రే మహారాజు తమ భాగవత రహస్యంలో సెలవిచ్చాడు.

శ్రీ రామచంద్ర డోంగ్రే మహారాజుగారి ' భాగవత రహస్యము' భక్తితత్త్వ ప్రధాన ప్రరోచక ప్రసంగ సంపన్నమైంది. శ్రీ అఖండానంద సరస్వతీ స్వామి వారి 'భాగవత దర్శనము ' భక్తి మిశ్రిత జ్ఞానతత్త్వ ప్రధాన లలిత గంభీర పుష్టమైన శాస్త్రము. శ్రీ మాధవ తీర్థ స్వాముల వారి ' అధ్యాత్మ భాగవతము ' వేదాంత ప్రక్రియా సంపన్నమై రోచకమైంది. ప్రభుదత్త బ్రహ్మచారి గారి భాగవతీ కథ ' నానాపురాణ కథేతిహాస కావ్య లౌకిక భాషా కళాకదంబ రసాయనము. ' ఎందరో మహానుభావులు'.

మాతృశుద్ధి, పితృశుద్ధి, ఆచార శుద్ధి, అర్థ శుద్ధి, ఆత్మశుద్ధి – ఈ

అయిదింటినే పంచశుద్ధులన్నారు. ఈ అయిదింటిలో ప్రధానమైంది. ‘ ఆత్మశుద్ధి ’ యని నా అభిప్రాయం.

పరీక్షిన్మహారాజు తప్పు చేశాడు. తప్పు తప్పే. తాను చేసిన తప్పును ఒప్పుకున్నాడు. తపించాడు. పరితపించాడు.

‘ సానుతాపో మహానాసీత్ – స్మరతా శుభమాత్మనః ’ అని భాగవతమే చెప్పింది. తప్పు చేసిన తరువాత మరణావధి మంచి నీళ్ళు ముట్టలేదు. తప్పు చేసి తప్పు కాదని సమర్థించుకొంటూ తప్పుకొనే ధూర్తుడు కాదాయన. పశ్చాత్తప్తుడైనాడు. ప్రాయోపవిష్టుడైనాడు. ప్రాయశ్చిత్తం చేసుకొన్నాడు. తన్ను తాను నిందించుకొన్నాడు. ఆయన పొందిన వ్యాకులాన్ని పోతనామాత్యుని పద్యాల ద్వారానే విందాం. విని పులకరిస్తాం. పుణ్య స్మరణతో పుణ్యము పొందుదాం.

‘ రాజననుచు బోయి రాజ్యగర్వంబున
వనము కొఱకు వారి వనము సొచ్చి
దందశూక శవముఁదండ్రిపై వైచినఁ
బోలియఁ దిట్టకేల పోవు సుతుఁడు.’ (ఆం.భా.1 – 458)

ఎంత సమాధానం, ఉత్తమ పురుషుని లక్షణమే అట్టిది. ప్రథమంలో సావధానం – ప్రథమం బుద్ధి లక్షణమ్. ఆరంభస్వాంత గమనం – ద్వితీయం బుద్ధి లక్షణమ్.

అసలుకు సాహసమైన పనులలో ప్రవేశించకుండా వుండుట బుద్ధిమంతునికి మొదటి లక్షణం. ప్రవేశించినాడా, జంకు జళుకూ లేకుండా ప్రాప్తాన్ని, ప్రారబ్ధాన్ని తృప్తిగా అనుభవించి పూర్తిచేయడం రెండవ లక్షణం. ఆ శ్లోకాన్నే నా భాషలో ప్రథమంలో సావధానం అయిపోయిందా! సమాధానం, అని అన్నాను.

‘ గోవులకును బ్రాహ్మణులకు
దేవతలకు నెల్లప్రొద్దు దెంపున బీడల్

గావించు పాప మానస
మే విధమున బుట్టకుండ నే వారింతున్’ (ఆం.భా. 1-459)

పరీక్షితుడు తన పాపాన్ని తన దోషాన్ని తన నోట పలికి, పలికి స్మరించుకొని స్మరించుకొని తన్ను తాను చీవాట్లు పెట్టుకొంటూ పరివేదనను అనుభవిస్తున్నాడు. **(సశేషం)**

I .సద్గురు సర్వసేవా ట్రస్టుకు ఈ క్రింది వారు పైకం పంపినారు

(1) సి.వాసుదేవరెడ్డి గారు. అన్నదాన నిధికి రూ.11,00,000/-
(నుంగంబాకం, చెన్నై)

(2). జె. జ్ఞానప్రసూన గారు (న్యూఢిల్లీ) రూ. 25,000/-
(తాత జె.సీతారామయ్య పేరిట పేద విద్యార్థుల చదువుకు)

(3). జె. జ్ఞానప్రసూనగారు (న్యూఢిల్లీ) రూ. 25,000/-
అవ్వ జె.లక్ష్మీదేవమ్మ పేరిట కంటి ఆపరేషన్లకు

(4). డి.వి.ఎస్.వి. సుందరరావుగారు (సౌదీఅరేబియా) రూ. 10,000/-

II. త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుకు ఈక్రిందివారు పైకం పంపినారు

(1). సుభద్రా ఛారిటబుల్ ట్రస్టు (హైద్రాబాద్)రూ. 2,88,000/-
ఉచిత లెన్సు నిమిత్తము

(2). పేట కాత్యాయనమ్మ (రాచకండ్రిగ) రూ. 1,00,000/-
మామ పేట శ్రీనివాసులురెడ్డి, అత్త కృష్ణవేణమ్మగార్ల పేరిట

(3).డి.వి.ఎస్.వి. సుందరరావు (సౌదీఅరేబియా) రూ. 10,000/-

III. ఈక్రిందివారు వేదాన్తభేరికి పోషక చందా పంపినారు

(1).. పి. పద్మావతిగారు (ఒంగోలు) – రూ. 1200/-

(2). జి.జగన్నాథం గారు (బెల్గాం) – రూ. 1500/-

(3). వెంకట సత్యనారాయణ వస్త్రాలయం (తాడేపల్లిగూడెం) రూ. 1200/-

(4). వి.వి.కృష్ణమూర్తి గారు (తిరుపతి) రూ. 1200/-

ఆచార్య దేవో భవ

(ధారావాహికం)

– ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

ఆధునిక యుగంలో గురువులు –

ఆధునికయుగంలో ఆచార్య ఉపాధ్యాయ గురుదేశిక శబ్దాలను అన్వయించుకొనే తీరు భిన్నంగా ఉంది. ప్రాచీనకాలంనాటి విద్యావిధానం గురుశిష్య సంబంధం లాంటిది. ఈ యుగంలోని వారికి అర్థం కావడం కూడా కష్టమే. నేటి సమాజానికి ఆ విధానం సరిపోదు. లౌకికవిద్యల అధ్యయనం పెరగడం, భౌతికజీవనం బాగుండాలని సమాజం కోరుకోవడం కారణాలు కావచ్చు. ఏది ఏమయినా జ్ఞానబోధ, ధర్మబోధ, సేవాధర్మాలను గురువులు శిష్యులకు తార్కికంగా బోధించవలసిన అవసరముంది. అంతేగాక విదేశాలకు చదువుల నిమిత్తమో, లేదా ఉద్యోగనిమిత్తమో వెళ్లే వారికి " భారతీయత " ఏమిటో తెలియజెప్పవలసిన అవసరముంది. అలాగే హైందవంలోని గొప్పతనాన్ని విద్యార్థులకు బోధించడంలో గురువులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసి వుంది.

గురువులు కూడా 'నైతికతకు' ప్రాధాన్యమిస్తూ శిష్యులకు ' సనాతన వాఙ్మయ పరిచయం ద్వారా ' ధార్మికులుగా, ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దవలసిన అవసరముంది. ప్రభుత్వం కూడా పాఠ్యాంశాలలో చాల మార్పులు చేయడం అవసరం. సాంకేతిక కళాశాలల్లో వ్యకిత్వ వికాస శిక్షణకు అన్ని రకాల ప్రయత్నాలు చేపట్టడం అవసరం. ఈ రోజుల్లో రకరకాల కుటుంబ వాతావరణ నేపథ్యంలో విద్యార్థులు పాఠశాలల్లో, కళాశాలల్లో చేరుతున్నారు. ఈనాడు రాచరిక వ్యవస్థ లేదు. అందువల్ల రాజ్యాంగపరమయిన అంశాలను గురువులు గుర్తుంచుకోవాలి. చదువులో వెనుకబడిన వారిపట్ల గురువులు మరికొంత శ్రద్ధ తీసుకోవలసిన అవసరముంది. అలాగే ఈనాటి విద్యార్థుల మనస్తత్వం, సామాజిక వాతావరణం గుర్తించి శిక్షలో, శిక్షణలో గురువు జాగ్రత్తపడకపోతే ఇబ్బందు లెదుర్కోక తప్పదు. భౌతిక విద్యలు, పారమార్థిక విద్యలు రెండూ భారతీయులు ఎప్పుడూ వదులు కోరాదు.

పాతకాలంలో 'బతకలేక బడిపంతులు ' అనేవారు. సమాజంలో గౌరవమున్నా ఆర్థికంగా ఉపాధ్యాయులు చాలా ఇబ్బందిపడేవారు. అయినా వారు వృత్తిధర్మాన్ని త్రికరణశుద్ధిగా నిర్వర్తించేవారు. కన్న కొడుకుల్ని, ఇతరుల్ని క్లాసుల్లో సమానంగా చూసేవారు. తమ కంటె ప్రజ్ఞాపాటవాలున్న శిష్యుల్ని మనసారా అభినందించి ఆ విద్యార్థుల ఉన్నతికి చేయూత ఇచ్చేవారు. కాలం మారింది. వృత్తిపై గౌరవం లేనివారు, ఆసక్తి లేనివారు ఈ రంగంలో ఎక్కువయ్యారు. మరికొందరు 'ట్యూషనుల' పేరుతో విద్యా రంగాన్ని వ్యాపారరంగం చేస్తున్నారు. కొన్ని సంస్థలు ఆకర్షక ప్రకటనలతో తల్లిదండ్రులను పక్కదారి పట్టిస్తున్నారు. ప్రభుత్వం 'విద్యారంగాన్ని ' చులకన చేస్తే చాలా ప్రమాదం.

" శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్ "

వైష్ణవంలో ఆచార్య నిష్ఠ :

శ్రీ వైష్ణవంలో 'ఆచార్య ' శబ్దానికి వ్యాప్తి అతివేలం. ఆళ్వార్, ఆచార్య, ఈ రెండు శబ్దాలు వైష్ణవానికి ఆయువుపట్టు. వేదాంతదేశికుల వారు న్యాసవింశతిలో

సిద్ధం సత్సంప్రదాయ స్థిరధియ మనఘం శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్
సత్త్వస్థం సత్యవాచం సమయనియతయా సాధువృత్త్యాసమేతమ్
దంభాసూయాదిముక్తం జితవిషయగణం దీర్ఘబంధుం దయాళుమ్
స్ఖాలిత్యే శాసితారం స్వపర హితపరం దేశికం భూష్ణురీప్సేత్

అని ఆచార్యలక్షణాలు విశదీకరించారు. శ్రీవచనభూషణం 'ఆచార్యునికి శిష్యుని విషయమున కృప ఉండవలె ' అని అనుశాసించింది.

శ్రీ వైష్ణవంలో విశిష్టాద్వైత సంప్రదాయంలో ఆశ్రయించిన శిష్యునికి పంచసంస్కారాలు చేసి, భగవత్ తత్త్వాన్ని బోధించి, తిరుమంత్రం, ఉపదేశించే పెద్దలే తొలి ఆచార్యులు. “ ఆచార్యోహి హరిస్సాక్షాత్. చరరూపీ న సంశయః ” అని వారి విశ్వాసం. ఆచార్య కటాక్షం లేనిదే మోక్షం లభించదని వారి నమ్మకం. ఒక దశలో భగవంతునికన్నా భగవంతుని చూపించి, ఆయన అనంత కళ్యాణగుణాలను అనుసంధించే ఆచార్యుడే సంసేవ్యమానుడని వైష్ణవుల సంభావన. భగవదవతారానికి అభేదరూపమే ఆచార్యుడు. పుట్టు గ్రుడ్డివానికి స్వరూపజ్ఞానం ఏలాగుండదో గురూపదేశం లేకుండా శిష్యులకు కల్పకోటిశతములయినా తత్త్వజ్ఞానం కలుగదు అని వారి నమ్మకం. మార్గం చూపేవాడు, స్థానం ఆచరించేవాడు, పరతత్త్వం బోధించేవాడు. అంటే చోదక, బోధక, మోక్షద లక్షణాలు కలవాడు ఆచార్యుడని సారాంశం.

శ్రీ వైష్ణవుల ఆచార్య పరంపర

‘ లక్ష్మీనాథ సమారంభాం నాథయామున మధ్యమామ్
అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరంపరామ్ ’

శ్రీ వైష్ణవంలో 35 మంది ఆచార్యులున్నారు. వారిని పూర్వాచార్యులంటారు. వీరందరు ఆళ్వారుల మార్గంలో నడిచినవారే. ‘ఆళ్వార్లు’ దైవాంశసంభూతులని శ్రీ వైష్ణవులు విశ్వసించినట్లే ఆచార్యులను కూడా దైవాంశ సంభూతులుగా భావిస్తారు. భగవద్రామానుజులు ఆదిశేషావతారులు. అనంతాళ్వార్, మణవాళమహామునులు శేషాంశ సంభూతులు. వడక్కు తిరువీదిప్పిళ్ళై గరుడాంశజులు.

ఆళ్వారులలాగే ఆచార్య పురుషులు కూడా సేవాకైంకర్యం చేసిన వారు. అనంతాళ్వార్, తిరుమలైనంబి మొదలయినవారు పుష్పకైంకర్యం చేసినవారు. తిరువాయ్‌మొళిపిళ్ళై ‘భగవద్రామానుజులకు ఆలయం నిర్మించడమే గాకుండా ‘రామానుజచతుర్వేద మంగళం ’ అని ఒక వాసస్థానం ఏర్పరచారు. అరుళాలప్పెరుమాళ్ ఎంబెరుమానార్

రామానుజుల వారితో వాదించి ఓడిపోయారు. ఆపై రామానుజుల శిష్యులయ్యారు. అయినా తనపేర మఠం మరొకటి ఉండరాదని తన మఠాన్ని వారు ధ్వంసం చేశారట. ఆలాగే ముదలి ఆండాన్ భగవద్రామానుజులు వారు జీవించిన కాలంలోనే వారి విగ్రహాల్ని తయారు చేసి శ్రీరంగంలో, శ్రీ పెరంబుదూర్‌లో ప్రతిష్ఠించారు. రామానుజులువారు ఆదేశించిట్లే ధనుర్దాసు ‘ ఖడ్గధారియై ’ శ్రీరంగనాథస్వామి ఉత్సవవిగ్రహానికి రక్షగా నిలబడేవారట. అలాగే తిరుమలలో పుష్పకైంకర్యం చేసేవారున్నారా అని భగవద్రామానుజులు ప్రశ్నించగానే తనకా అవకాశం ఇమ్మని కోరినవారు అనంతాళ్వార్. ‘నంజీయర్’ అనే ఆచార్యులు తన ఆస్తిని మూడు భాగాలు చేసి ఇద్దరి భార్యలకు పంచి ఒక భాగాన్ని ‘ ఆచార్యులకు’ కృష్ణార్పణం చేశారు. ఆలాగే శ్రీరంగ ఆలయ నిర్వహణ బాధ్యతను రామానుజులవారు కూరేశులకు అప్పగిస్తే స్వీకరించారు.

మధురకవి ఆళ్వార్ ఆచార్యనిష్ఠ అనుపమానం. నమ్మాళ్వార్ శిష్యులై ఆళ్వార్ తిరునగరిలోనే వుంటూ నమ్మాళ్వార్ పరమపదం చేరుకొన్నాక వారికి ఆలయం నిర్మించడం ఆచారనిష్ఠకు ఉదాహరణ.

శ్రీ వైష్ణవలో పరమాత్మయే గురువు. ఆ గురువుకడ చేరడానికి ఉపాయాంతరాలు సూచించే ఆచార్యుడు గురువే.

‘ అన్ని చేతలును బ్రహ్మార్పణ విధి ’ జయ
మన్నించు బుద్ధులను మరుగ జెప్పి
ఉన్నత పదమున కొనరంగ కరుణించు
పన్నగశయనుడె బ్రహ్మయోగి’

‘తానె తానె ఇందరి గురుడు
సాన బట్టిన భోగి జ్ఞానయోగి ’

– అని అన్నమయ్య స్పష్టం చేశాడు.



శ్రీ భక్త తుకారాం అభంగవాణి

- శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు

(జూలై తరువాయి)

ఇంకను మాంసభక్షణముచే నుత్పన్నమగునవి పెక్కు దోషములు గలవు. అందులో కొన్నింటిని సంక్షేపముగ నీ క్రింద కనదగును.

1. మాంస భక్షణము భగవత్ప్రాప్తికి గొప్ప ప్రతిబంధకముగ యున్నది.
2. మాంస భక్షణముచే నీశ్వరుడు అప్రసన్నుడగును.
3. మాంస భక్షణము పాపమునకు సాధనమైయున్నది.
4. మాంస భక్షణముచే పరలోకములో దుఃఖము సంప్రాప్తమగును.
5. మాంస భక్షణము మానుషాహారము కానందున ప్రకృతి విరుద్ధముగనున్నది.
6. మాంస భక్షణముచే మనుష్యుడు పశుత్వము నొందుచున్నాడు.
7. మాంస భక్షణము మనుష్యునికి అనధికార చేష్టయగును. ఒకానొక ప్రాణికి ప్రాణ సంయోగము చేసే సామర్థ్యము లేనపుడు, ప్రాణము తీసే అధికారము గూడ మనుష్యునకు లేదు.
8. మాంస భక్షణము ఘోర నిర్దయతయగును.
9. మాంస భక్షణముచే పశుపక్ష్యాదులకుగల వ్యాధులు మనుష్యులకు సంక్రమించి స్వాస్థ్యము చెడిపోవును.
10. మాంస భక్షణము శాస్త్ర నిందితము. (వేద విరుద్ధము).

కావున ఏ ప్రాణిని, ఎప్పుడును మరియు యే ప్రకారముగా గూడ హింసించక మాంస భక్షణము ఘోర నిర్దయకృత్యమని, శాస్త్ర నిందితమని, అవమాన కార్యమని మోక్ష ప్రతిబంధకమని బాగుగా పైనుదహరించిన ప్రకారముగా శాస్త్రాధారములచే విచారించి (దానిని) సర్వదా పరిత్యాగము జేయవలెను. సకల భూతములకు ప్రాణదానము మరియు అభయ దానమొనరించవలయును.

శ్లో ॥ ప్రాణదానాత్పరం దానం న భూతం న భవిష్యతి

నహ్యాత్మనః ప్రియతరం కించిదస్తీహ నిశ్చితమ్ ॥

(మ.భా.అను.ప. 116-16)

అర్థము : ప్రాణదానము కన్న మించిన శ్రేష్ఠమైన అన్యదానము లేదు. ఉండబోదు. తన ఆత్మకంటె యీ లోకములో ప్రియతర వస్తువు అన్యమైనది ఏమియును గూడ లేదు. ఇది నిశ్చితము.

శ్లో ॥ సర్వభూతేషు యో విద్వాన్ దదాత్యభయదక్షిణామ్ ।
దాతా భవతి లోకే స ప్రాణానాం నాత్ర సంశయః ॥

(మ.భా.అను.ప. 115-18)

అర్థము : ఏ విద్వాంసుడు సకలజీవులకు అభయదానమొసంగునో, నతడు యీ లోకములో నిఃసందేహముగా " ప్రాణదాత"యని పిలువబడును.

శ్లో ॥ శరణ్యః సర్వ భూతానాం విశ్వాస్యః సర్వ జన్తుషు
అనుద్వేగకరో లోకే నచాప్యుద్విజతే సదా ॥

(మ.భా.అను.ప. 115-28)

అర్థము : సర్వ ప్రాణులకు శరణము నిచ్చువాడు సర్వులకు విశ్వాస పాత్రుడగును. అతడు సంసారములో ఎవరిని ఉద్వేగ (క్షోభ)ములో పడదోయడు. తాను ఎప్పుడు ఎవరిచే ఉద్విగ్నుడు (పీడితుడు) కాడు.

శ్లో ॥ దానం భూతాభయస్యాహుః సర్వదానేభ్య ఉత్తమమ్ ।

(మ.భా.అను.ప. 262 - 33)

అర్థము : ప్రాణులకు అభయదానమిచ్చుట యేదిగలదో యది సమస్త దానముల కెల్ల ఉత్తమమైనదిగా చెప్పబడినది.

శ్లో ॥ యస్మాదుద్విజతే లోకః సర్పాద్వేశ్మగతాదివ ।
న స ధర్మమవాప్నోతి ఇహలోకే పరత్రచ ॥

(మ.భా.అను.ప. 262 - 31)

అర్థము : ఇంటిలో సర్పము ప్రవేశించిన, ఇంటి వారందఱు ఎట్లు భయభీతులగుదురో అట్లు ఏ పురుషుని వలన లోకులు భయభీతులగుదురో అతడు ఇహలోకమందుగాని, పరలోకమందుగాని ధర్మ ఫలము నొందదు. (సుఖము నొందదు).

శ్లో ॥ యస్మాదుద్విజతే విద్వన్ సర్వలోకో వృకాదివ ।
క్రోశతస్తీరమాసాద్య యథా సర్వే జలే చరాః ।
స భయం సర్వభూతేభ్యః సంప్రాప్నోతి మహామతే ॥

(మ.భా.అను.ప. 262 – 25)

అర్థము : హే మహామతే ! హే విద్వాన్ । ఏవిధముగా నదీతీరమున కోలాహలము జేయు మనుష్యులకు భయపడి జలచరములన్నియు లోనికెళ్ళి దాగుకొనునో, మరియు ఎట్లు తోడేలును చూసినతోడనే మేకలు, గొఱ్ఱెలు భయగ్రస్తమై దిక్కుదోచక గడగడ వణుకునో, అట్లే యే మనుష్యుని వలన లోకులు భీతిజెందెదరో – వానికి గూడ సంపూర్ణ ప్రాణులచే భయము సంప్రాప్తించును.

శ్లో ॥ న భూతో న భవిష్యో2స్తి న చ ధర్మో2స్తి కశ్చన ।
యో 2 భయః సర్వ భూతానాం స ప్రాప్నోత్యభయం పదమ్ ॥

(మ.భా.అను.ప. 262 – 17)

అర్థము : ఎవనికి భూత భవిష్యత్తులలో నే కార్యము (చేయదగినది) లేదో, ఎవనికి ఏ ధర్మము యవశిష్టము లేదో, మరియు సర్వభూతములకు అభయప్రదానము జేయునో, నతడు నిర్భయ(మోక్ష)పదవిని బొందును. 'నిర్వైరః సర్వ భూతేషు య స్సమామేతి పాండవ' (గీత 11–55) హే అర్జున ! ఎవడు సర్వ జీవకోటులందు వైర భావము లేనివాడై (చెలికాడై) యుండునో, నతడు నన్ను పొందును. (ఆత్మజ్ఞానియై ముక్తి నొందును).

శ్లో ॥ తపోభిర్యజ్ఞదానైశ్చ వాక్యైః ప్రజ్ఞాశ్రితైస్తథా ।
ప్రాప్నోత్యభయ దానస్య యద్యత్ఫలమిహాశ్నుతే ॥

(మ.భా.శాం.ప. 262–28)

అర్థము : తపో యజ్ఞ దానములచే మరియు జ్ఞానసంబంధ ఉపదేశములచే మనుష్యుడు ఈ లోకములో యే యే ఫలములను బొందుచున్నాడో, ఆ ఫలములన్నియు కేవలము యభయదానముచే ప్రాప్తించును.

శ్లో ॥ జీవితం హి పరిత్యజ్య బహవః సాధవో జనాః ।
స్వమాంసైః పరమాంసాని పరిపాల్య దివంగతాః ॥

(మ.భా.అను.ప. 114 – 18)

అర్థము : ఉశీనర, శిబి చక్రవర్తి మొదలగు యనేక శ్రేష్ఠపురుషులు యితర ప్రాణులను రక్షించుటకొఱకు తమ ప్రాణములను సహితము త్యజించి, స్వమాంసముచే నితరుల మాంసమును రక్షించి స్వర్గమునకు వెళ్ళిరి. ఈ విషయములో మహాభారతము వనపర్వము – తీర్థయాత్రా పర్వము 131 అధ్యాయము చూడండి.

అభయ దానోత్సాహియైన ధర్మస్వరూపుడైన శ్రీరామచంద్ర ప్రభువు యొక్క ప్రతిజ్ఞను గనండి.

శ్లో ॥ సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే ।
అభయం సర్వ భూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ ॥

(శ్రీ మద్వాల్మీకి రామాయణము 6–18–33)

అర్థము : ఎవరు ఒక్కసారి సర్వాత్మ భావముచే " నేను నీ వాడను " అని నన్ను పరిపూర్ణముగా శరణుజొచ్చి యాచించునో నతనిని సర్వ భూతముల నుండి నిర్భయునిగా జేయుదును. ఇది నాయొక్క ప్రతిజ్ఞ.

కావున " న హింస్యాత్సర్వభూతాని " మరియు " అహింసా పరమో ధర్మః " యను శాస్త్రమును తు.చ. తప్పకుండా నమలు పరుస్తూ, సకల భూతకోట్లకు అభయదానమొసంగి, యే ప్రాణి మాంసమును గూడ భక్షించక, సర్వదా పరిత్యజించి శ్రీ పాండురంగస్వామి కృపకు పాత్రులై, స్వస్వరూపమును యథార్థముగా నెఱింగి, పునరావృత్తి రహితమగు పరమ పదవిని (మోక్షమును) బొందవలయును.

---

1. జ్వరంతో వచ్చిన చలి గొంగళ్లు కప్పితే పోదు. జ్వరం తగ్గితేనే పోతుంది. అట్లే అజ్ఞానంతో కల్గిన అవస్థ (దుఃఖం) జ్ఞానం కలిగితే తొలుగుతుంది.
2. పారేనదికి వొళ్ళంతా కాళ్లు, మండే అగ్నికి వొళ్ళంతా నోళ్లు. వీచే గాలికి వొళ్ళంతా చేతులు అట్లే మునికి లోకమంతా సొంత ఇల్లే.
3. బైట వస్తువులు పెరగడం కాదు, లోపలి వాసనలు తరగాలి. అప్పుడే శాన్తి.
4. నిప్పును తాకి (సోకి) జొన్నగింజ తెల్లనౌతుంది. (పేలాలు) సాదు సాంగత్యంతో పాపికూడ పరిశుద్ధుడౌతాడు – శ్రీరామకృష్ణానందస్వామి (గండిక్షేత్రం)

శ్రీ మదాంధ్ర మహా భాగవతము

- ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(ధారావాహికం)

ఇష్టదేవతాస్తుతి : బమ్మెరపోతన భాగవతరచన ప్రారంభించే ముందు వివిధ దేవతలను వినుతించాడు. శ్రీ కైవల్యం కోసం నందకుమారుణ్ణి చింతన చేశాడు. నటరాజుకు నమస్కరించాడు. బ్రహ్మను సేవించాడు. వినయంగా వినాయకుణ్ణి వినుతించి మ్రొక్కాడు. నాలుగు పద్యాల్లో నలువనాతిని భావించి నమస్కరించాడు. మహత్వ పటుత్వ కవిత్వ సంపదనిమ్మని దుర్గాదేవికి దోయిలించాడు. మహాలక్ష్మి తనకు నిత్య కల్యాణ మనుగ్రహించాలని ఆకాంక్షించాడు. సూర్యభగవానుణ్ణి, కుమార స్వామిని భావించాడు.

పోతన ఏడుగురు దేవతలను స్మరించాడు. కృష్ణగాథా ప్రధానమైన భాగవతాన్ని తాను రచించబూనడం వల్ల మొదట కృష్ణుణ్ణి చింతన చేశాడు. ఆ చింతనలోనే విష్ణు తత్త్వాన్ని విశ్లేషించాడు.మొదట వినాయకుణ్ణి స్మరించే సాంప్రదాయాన్ని పక్కన బెట్టి త్రిమూర్తులను మొదట స్మరించాడు. ఆ తరువాతే వినాయకుణ్ణి వినుతించాడు. ప్రతి దేవతకు ఒక పద్యం చొప్పున కేటాయించిన పోతన సరస్వతి దేవికి మాత్రం నాలుగు పద్యాలు కేటాయించాడు. సరస్వతీదేవిపట్ల పోతనకుగల ఆర్ద్రభక్తిని ఇది ఆవిష్కరిస్తుంది. తన భాగవత రచనకు సరస్వతీ దేవి తోడ్పాటు కూడా చాలా అవసరమని ఆయన విశ్వసించినట్లు ఇక్కడ విదితమౌతుంది. పోతన ఉద్దేశపూర్వకంగా రాశాడో లేదో కాని భార్యాభర్తలు మసలుకోవలసిన తీరును భారతీ బ్రహ్మదేవుల పద్యాలు భాసింప జేస్తున్నాయి. బ్రహ్మదేవుడు సరస్వతీదేవి హృదయానికి సౌఖ్యాన్ని ప్రసాదిస్తాడు. భర్త భార్యపట్ల మసలుకోవలసిన తీరు కూడా ఇదే. సరస్వతీ దేవి కూడా బ్రహ్మదేవుని మనసును ఆకట్టుకునే విధంగా మాట్లాడుతుంది.

భార్యభర్తలపట్ల ప్రవర్తించవలసిన విధానాన్ని ఇది ప్రస్ఫుటం చేస్తుంది. భార్యాభర్తలు పరస్పరబద్ధానురాగులై జీవించాలని ఈ రెండు పద్యాలనుంచి గ్రహించాలి.

కవుల ప్రశంస : దేవతలను స్మరించిన బమ్మెర పోతన దేవతల తరువాత పేర్కొదగిన కవులను తలపోశాడు. ఆదికవి వాల్మీకికి అంజలి ఘటించాడు. వేదవ్యాసుడికి సాదరంగా నమస్కరించాడు. భాగవతామృత ప్రదాత బాదరాయణసూనుణ్ణి భక్తితో స్మరించాడు. బాణుడికి ప్రణామం చేశాడు. మయూర కవిని మనసారా అభినందించాడు. కాళిదాసుకు కైమోడ్పులర్పించాడు. భారవిని ప్రస్తుతించాడు. మాఘుణ్ణి మనస్సులో నిలిపాడు.

మొదట సంస్కృత కవులను సన్నుతించిన పోతన పిదప తెలుగు కవులను కూడా ప్రీతితో కొనియాడాడు. ఆదికవి నన్నయకు అభివందనం చేశాడు. తిక్కనకు మ్రొక్కాడు. వీరితోబాటు పేరు చెప్పకనే తక్కిన పూర్వకవులందరినీ తలపోశాడు. భావికవులకు శుభాకాంక్షలు తెలిపాడు. ఈ సందర్భంలోనే ఉభయభాషల్లోనూ గద్యపద్యాత్మకంగా కవిత్వం చెప్పే నైపుణ్యం తాను సంపాదించినట్లు పోతన తెలియజేశాడు.

దేవతలు గొప్ప ప్రభావం కలవారు. కావ్యరచనాదక్షులయిన కవులకు కూడా కొంత ప్రభావమైనా ఉంటుంది. కాబట్టి కవులు కూడా దేవతల సరసన నిలుపదగినవారు. ఈ ఆలోచనతోనే ఏమో మన ప్రాచీన కవులు ఇష్టదేవతాస్తుతి వెనువెంటనే సుకవిస్తుతికి పూనుకొనేవారు. ఈ సాంప్రదాయాన్నే పోతన కూడా అనుసరించాడు.

‘ జనని సంస్కృతంబు సకల భాషలకును అని మన ప్రాచీనులు భావించినట్టు శ్రీనాథుని చాటువును బట్టి తెలుస్తుంది. తెలుగువారు కూడా సంస్కృతాన్ని తెలుగులాగే అభిమానించి అధ్యయనం చేసేవారని అభివ్యక్తమౌతుంది. తెలుగుసాహిత్యం మీద పట్టుసాధించాలనుకునేవారు సంస్కృత సాహిత్యం మీద కూడా పట్టుసాధించే వారని బోధపడుతుంది.

సంస్కృత కవులు, వారి రచనలు ప్రాచీన తెలుగు కవుల కావ్యజ్ఞాన వికాసానికి బాగా తోడ్పడినట్టు తోస్తుంది. ఈ నేపథ్యంలోనే తన కవిత్వ సంపదను పెంపొందించుకొనేందుకు తోడ్పడిన సంస్కృత కవులను పూర్వులని పోతన భావించడం వల్ల కూడా ప్రప్రథమంగా సంస్కృత కవులను ప్రస్తుతించినట్టున్నాడు. మొదట వాల్మీకి వ్యాసాది కవులను స్మరించి తరువాత కాళిదాసాది పంచకావ్య కవులను తదితరులను ప్రస్తుతించడం ఒక కాలక్రమాన్ని పాటించినట్లైంది.

శుకమహర్షి కవికాదు. ఆయన ఏ కావ్యాన్నీ రచించలేదు. అయితే సర్వకావ్యాధికమైన శ్రీమద్భాగవతాన్ని వాగ్రూపంగా ఆవిష్కరించాడు. కవుల సరసన సముచితస్థానాన్ని దక్కించుకున్నాడు. పోతన దాన్ని గుర్తించాడు. అందువల్లనే వ్యాస మహర్షి ప్రక్కనే శుకమహర్షికి కూడా స్థానం కల్పించాడు. పోతన సంస్కృత భాగవతాన్ని ఆంధ్రీకరించేందుకు పూనుకొన్నాడు. భాగవతం సంస్కృతంలో రావడానికి వ్యాసమహర్షి కారకుడైనట్లే శుకమహర్షి కూడా కారకుడు. దీనివల్ల కూడా శుకమహర్షిని బమ్మెరపోతన సంస్కృత కవులతో కలిపి సంస్మరించి ఉంటాడు. పోతన భారత కవులైన నన్నయ, తిక్కనలను మాత్రమే స్మరించి తక్కిన పూర్వకవులందరినీ పేర్కొనకే స్మరించారు. తక్కిన పూర్వకవులపట్ల కూడా భక్తి ఉన్నప్పటికీ నన్నయ, తిక్కనల పట్ల మాటలకందని భక్తి ఆయన మనసులో గూడుకట్టుకొని ఉండేదని మనం ఊహించుకోవచ్చు.

సంస్కృతంలో తెలుగులో పద్యంలోనైనా గద్యంలోనైనా చక్కని కవిత్వం వెలయించే నైపుణ్యం తనకబ్బడం ఈ పూర్వకవుల పుణ్యమేనని పోతన ఇక్కడ ధ్వనింపజేశాడు. ఆ కృతజ్ఞతతోనే వారిని ముందుగా స్మరించినట్టు తెలుస్తుంది. కావ్యాదిలో ఇష్ట దేవతాస్తుతి తర్వాత సుకవిస్తుతి, కుకవినింద చేయడం కవులకు పరిపాటి. ఇక్కడ పోతన సుకవి స్తుతి చేశాడే గానీ కుకవినింద చేయలేదు. చెడును స్మరించడం కూడా చెడునే కలిగిస్తుందని జడిసి ఉండవచ్చు. ఏదిఏమైనా ఇది ఆయన విశాల హృదయాన్ని, ఉదాత్త మనస్తత్వాన్ని ఆవిష్కరిస్తుందనే చెప్పాలి.

వార్తలు

(01). కర్నూలుజిల్లా, ఆలూరు తాలూకా కొక్కిరచేడు గ్రామంలోని శ్రీశంకరానందగిరి గురుస్వామి సేవాశ్రమంలో ఆశ్రమాధిపతులు పూజ్యశ్రీ గురుచరణానందగిరిమాతాజీ అధ్యక్షతన విశ్వశాన్తి నిమిత్తం శివపంచాక్షరి మహామంత్రాన్ని ఒక సంవత్సరం అఖండ సంకీర్తన చేశారు. దాని పరిపూర్తి సందర్భంగా 1-7-2016 నుండి మూడురోజులు జరిగిన మాహాత్ముల ఉపన్యాసకార్యక్రమమునందు శ్రీ శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు 2, 3 తేదీలందు పాల్గొని ప్రవచన చేశారు. మాతాజీ గారు ఈ కార్యక్రమాన్ని చాల పెద్ద ఏర్పాట్లతో చేశారు. వేలాదిమంది శ్రోతలు సభలలో నిశ్శబ్దంగా శ్రవణం చేశారు. అన్నదానం చాల విరివిగా జరిగింది. ఇంత పెద్ద కార్యక్రమాన్ని చాలా సుదరంగా నిర్వహించిన మాతాజీ గారు, కార్యకర్తలు చాలా అభినందనీయులు.

(02). 10-07-2016 తేది శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో సద్గురు సర్వ సేవా ట్రస్టు బోర్డు సమావేశం జరిగినది.

(03). శ్రీ సద్గురు మహర్షి మలయాళస్వాములవారి 54వ ఆరాధనోత్సవాలు జూలై 14, 15 తేదీలలో కర్నాటక రాష్ట్రం బళ్లారి పట్టణంలో, గ్లాసు బజారులో గల పాపయ్యహాలులో మాతృశ్రీ అనసూయమ్మ గారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆ కార్యక్రమంలో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొని ప్రవచనలు చేశారు. ఇంకను అనేక మంది మహాత్ములు అందు పాల్గొనినారు.

(04). 12-08-2016 తేది నుండి 23-08-2016 తేది వరకు విజయవాడలో కృష్ణానదిలో జరుగు పుష్కరోత్సవాలలో శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొంటారు. ప్రవచనలు చేస్తారు. ఈ కార్యక్రమాలు మాతృశ్రీ అనసూయమ్మ గారి ఆధ్వర్యంలో సద్గురు శ్రీ మలయాళస్వామి గీతాప్రచారసమితి మఱియు పుష్కరోత్సవ కమిటీ వారిచే నిర్వహింపబడుతోంది. ఈ కార్యక్రమాలు కానూరులోని అన్నే రామతులసీ ట్రస్టు అన్నే వారి కళ్యాణ మండపంలో జరుగనున్నవి. ఇందులో పాల్గొను వారికందరికి ఉచిత భోజన వసతి కల్పింపబడినది. నదీ స్నానానికి బస్సుల ఏర్పాటు గలదు. అనేకమంది మహాత్ముల ప్రవచనాలు ఏర్పాటు చేయబడినవి.

(05). జూలై 1వ తేది శుక్రవారం నాడు మఱియు 28వ తేది గురువారం నాడు ప్రదోషకాలంలో కృత్తిక సందర్భంగా ఆశ్రమములో శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం, అర్చన చేయబడింది. జూలై 3వ తేది ఆదివారం నాడు మాసశివరాత్రి సందర్భంగా ప్రదోష కాలంలో ఆశ్రమంలో శివునికి అభిషేకం, బిల్వార్చన జరిగినది. జూలై 15వ తేది నాడు (శుక్రవారం) ఆశ్రమంలో శ్రీ సద్గురు మాలయాళస్వాములవారి ఆరాధన జరిగినది. శ్రీ సద్గురుమూర్తికి షోడశోపచార పూర్వక పూజ జరిగినది. అన్నదానం జరిగినది.

జూలై 19వ తేది మంగళవారం గురుపౌర్ణమి సందర్భంగా ఆశ్రమ అధిష్ఠాన మందిరంలో సద్గురు పాదుకలకు అభిషేకం, అర్చన జరిగినది. 30వ తేది శనివారం ఏకాదశి నాడు అఖండ గీతాపారాయణ జరిగినది.

(06). ఆశ్రమ కంటి ఆసుపత్రి - భక్త కన్నప్ప కంటి ఆసుపత్రిలో జూన్ నెలలో ఓ.పి. విభాగంలో 1281 మందికి కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేయబడినవి. 137 మందికి కంటి పొరలు తీసి లెన్సు అమర్చబడినవి. 21 మందికి యాగ్‌లేజర్ చికిత్స చేయబడినది.

మహాశక్తిజనకమైన యంత్రమువలె మిమ్ములను తయారుచేసుకొనుడు! విశ్వశ్రేయస్సుకొఱకే మొట్టమొదట యత్నింపుడు. పరులక్షేమాన్నే మొదట కాంక్షింపుడు. మీరు పవిత్రులై, బలవంతులై యున్నచో మీరొక్కరే ప్రపంచానికంతటికి సమానులు కాగలరు.

నా ధీరబాలకులారా! మీరందరును మహత్తర కార్యనిర్వహణమునకై జన్మించితిరను పరిపూర్ణ విశ్వాసాన్ని కల్గియుండుడు. కుక్కపిల్లల అరుపులకు ఏమాత్రం జంకకుడు. భయంకరమైన పిడుగులకు కూడా ఏమాత్రం చలింపకుడు! లెండు! కార్యనిమగ్నులు కండు!

– శ్రీ స్వామి వివేకానంద